# Sākṣi, Namastē Telaṅgāṇa Dinapatrikallōni Sāhitya Vyāsālu-Vimarśanātmaka Adhyayanaṁ (2016, 2017)

*A thesis submitted to the University of Hyderabad*
*in partial fulfillment of the requirement for the award of*

**DOCTOR OF PHILOSOPHY**
**IN**
**TELUGU**

**By**

**VEMULA HARSHITHA**
Reg. No. 16HTPH19

**Supervisor**
**PROF. DARLA VENKATESWARA RAO**

**Department of Telugu**
**School of Humanities**
**University of Hyderabad**
**Hyderabad-500046 (INDIA)**
**March 2024**

# సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – విమర్శనాత్మక అధ్యయనం (2016, 2017)

(పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం)


**పరిశోధకురాలు**

**వేముల హర్షిత**

**(16HTPH19)**

**పర్యవేక్షకులు**

**ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**

**తెలుగు శాఖ**

**మానవీయ శాస్త్రాల విభాగం**

**హైదరాబాదు విశ్వవిద్యాలయం**

**హైదరాబాదు, తెలంగాణ – 500 046**


**మార్చి 2024**

మా అమ్మా- నాన్నలకు

అంకితం...✍

**University of Hyderabad**
**Hyderabad-500046, India**

---

# DECLARATION

I, **Vemula Harshitha**, hereby declare that this thesis entitled "**Sākṣi, Namastē Telaṅgāṇa Dinapatrikallōni Sāhitya Vyāsālu - Vimarśanātmaka Adhyayanaṁ (2016, 2017)**" submitted by me under the guidance and supervision of Prof. Darla Venkateswara Rao, Department of Telugu, School of Humanities, University of Hyderabad, is a *bona fide* research work. I also declare that it has not been submitted previously in part or full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodganga/INFLIBNET.

Signature of the Scholar

**Name: Vemula Harshitha**
**Registration No: 16HTPH19**

Date: March, 2024
Place: University of Hyderabad

**University of Hyderabad**

## CERTIFICATE

This is to certify that the thesis entitled **"Sākṣi, Namastē Telaṅgāṇa Dinapatrikallōni Sāhitya Vyāsālu - Vimarśanātmaka Adhyayanaṁ (2016, 2017)"** submitted by **Ms. Vemula Harshitha** bearing registration number 16HTPH19 in partial fulfillment of the requirements for award of Doctor of Philosophy in the Department of Telugu, School of Humanities is a bonafide work carried out by her under my supervision and guidance. This thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this or any other University or Institution for award of any degree or diploma. The candidate has satisfied the UGC Regulations of publications and conference presentations before the submission of this thesis. Details are given below:

A. Publications in journals:

1. Harshitha, Vemula. (2024). "Namastē Telaṅgāṇa' Dinapatrika Kavitvavyāsālu (2016-17): Parāmarśa". Auchithyam, vol. 5, no. 02, pp. 24–34. (ISSN: 2583-4797: UGC-Care Listed).
2. Harshitha, Vemula. (2024). "Sākṣi, Namastē Telaṅgāṇa Dinapatrikallōni Kathānikā Vyāsālu: Sūtra Vimarśa". Auchithyam, vol. 5, no. 03, pp. 61–67. (ISSN: 2583-4797: UGC Listed).

B. Presentations in conferences/seminars:

1. Presented a paper on "Namastē Telaṅgāṇa Sāhitya Vyāsālu - Vimarśa Tīru Tennulu (September 2016)", in National Seminar on Documentation and Dissemination of Linguistic, Literary and Cultural Heritage – The role of Cinema, at SRR Govt. Arts & Science College, Karimnagar, Telangana, 17-18 February 2017.
2. Presented a paper on "Telugu Dinapatrikallō Sāhitya Puṭalu - Bhāṣā Sāhitya Sēva", in Antarjaateeya Matrubhaasha Dinotsavam- Telugu Bhasha Visishtatha, at Andhra University, Visakhapatnam, Andhra Pradesh, 21st February 2024.

Further, the student has passed the following courses towards fulfillment of the coursework requirements for Ph.D. degree in Telugu (PhD course work result notification is attached):

| Course Code | Course Title | Credits | Pass/Fail |
|---|---|---|---|
| HT 801 | Research Methodology | 4 | Passed |
| HT 802 | History of Telugu Research | 4 | Passed |
| HT 803 | Studies in Literature | 4 | Passed |
| HT 804 | Studies in Specialized Area | 4 | Passed |

Prof. Darla Venkateswara Rao
**Research Supervisor**

Prof. Darla Venkateswara Rao
**Head, Dept. of Telugu**

Prof. V. Krishna
**Dean, School of Humanities**

# కృతజ్ఞతలు

చిన్నప్పటి నుండి నన్ను ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటూ నాకు నచ్చిన ప్రతీది కాదనకుండా అందించి నా సుఖ సంతోషాలే వారి జీవితాశయాలుగా మలచుకొని నాకు ఉన్నత చదువులు నేర్పించి నిత్యం నా ఎదుగుదలనే కాంక్షిస్తూ కలలో కూడా కల్మషం లేని మమతా మూర్తులు మా అమ్మా నాన్న డా॥ వేముల శ్రీనివాస్, సాయి సుధలకు నా పాదాభివందనాలు.

ఎం.ఎ. చదువుతున్నప్పటి నుండి నేటి వరకు నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తూ, నా మొదటి పరిశోధనా వ్యాసరచనకు కారకులు, అగమ్య గోచరంగా నిలిచిన నేటి నా పరిశోధన నావను ఒక తాటిపై నడిపించిన దిశానిర్దేశకులు, నా పరిశోధనా పర్యవేక్షకులు, ఎందరికో మార్గదర్శకులు, సహృదయులు, తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు గారికి నా హృదయ పూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు.

నిండు మనసుతో ఎప్పుడు మా అభివృద్ధినే కాంక్షించే మృదు స్వభావి మా పూర్వ పర్యవేక్షకులు ఆచార్య గడ్డ అరుణ కుమారి గారికి మరియు నన్ను ఎంతగానో ప్రోత్సహించే గురువులు ఆచార్య పిల్లలమర్రి రాములు గారికి, ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి గారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, డా॥ భుజంగరెడ్డి గారికి, డా॥ విజయ కుమారి గారికి ప్రస్తుతం తెలుగు శాఖలో వున్నటువంటి ఆచార్య గోన నాయక్ గారికి, డా॥ బి. తిరుపతి గారికి,

నా పరిశోధన ముందుకెళ్ళడానికి సహకరించి JRF ఫెల్లోషిప్ ఇచ్చిన UGC వారికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ నాకు సహకరించిన తెలుగు శాఖ సిబ్బందికి, నా పరిశోధనకు కావలసిన పుస్తకాలను అందించిన ఇందిరాగాంధీ మెమోరియల్ లైబ్రరీ సిబ్బందికి హృదయ పూర్వక నమస్కారాలు,

ఎల్లప్పుడు మా అభివృద్దినే కోరే నాన్నమ్మ తాతయ్యలు  వేముల చంద్రయ్య సుశీలలకు,

నా ఉదర సఖి, నా ప్రాణ నేస్తం, లాలనలో మమతల తల్లి, పాలనలో మరో తండ్రి, నా జీవిత గమనం, గమ్యం, నా ధైర్యం, నా బలం, నా బలహీనత, నా మార్గదర్శి, అనురాగ దేవత మా ఇంటి మణి దీపం, మా కంటి కనుపాప మా అక్క వేముల శరణ్యకు, తన మది రాజు డా॥ గుంటుకుల రాజు గారికి నా ఆత్మీయ ధన్యవాదాలు,

ఎల్లప్పుడు మమ్మల్ని ప్రోత్సహించే మా బావ మారుతి రాజాకు,

నా కష్ట సుఖాలలో తోడు నిలిచి, నేను మానసికంగా కృంగిపోయిన ప్రతి నిమిషం నేనున్నానంటూ ధైర్యాన్నిస్తూ, ఎంతటి కష్టాన్నైనా మరిపించి, నను మురిపించి, నా వెన్నంటే ఉంటూ, నేనేదైన సాధించగలనని నమ్మే, కలలోనైనా ఊహించని నా ప్రియతమ నేస్తం, మనసెరిగిన స్నేహితులు చిన్న, సోనియా, పూజ, సింధులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు,

ఎల్లప్పుడు నా బాగు కోరుతూ, నన్ను ఎంతగానో అభిమానించే ఆత్మీయ నేస్తాలు అనిత, పూర్ణ, సౌమ్య, శిరీష, జ్యోతి, రేవతిలకు, మా ఆత్మీయ జూనియర్ మిత్రురాలు శ్రీలేఖకి ప్రేమ పూర్వక ధన్యవాదాలు.

నా ఉద్యోగ జీవితానికి తొలిమెట్టు మా జగద్గిరిగుట్ట కళాశాలకు, ఎల్లప్పుడు మమ్మల్ని ప్రోత్సహించే మా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఇషత్ గారికి, అధ్యాపకులు, విద్యార్థులందరికీ,

నా పరిశోధన సంబంధ వ్యాసాలను ముద్రించి, సరైన సమయంలో అందించి, నాకు ఎంతగానో సహకరించిన ఔచిత్యం అంతర్జాల మాస పత్రిక సంపాదక వర్గానికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

ఏ ఒక్కరి సహాయ సహకారం లేనిదే ఇంతటి మహత్కార్యం జరిగిందని నేననుకోను, కావున పేరు చెప్పని ఎందరో మరెందరో బంధుమిత్రులకు, నా శ్రేయోభిలాషులకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

**వేముల హర్షిత**

## సంకేత పదసూచిక

| | |
|---|---|
| అను. | అనుబంధం |
| ఉదా. | ఉదాహరణ |
| ప్రవే. | ప్రవేశిక |
| సంపా. | సంపాదకుడు |
| ప్ర. సంపా. | ప్రధాన సంపాదకుడు |
| వ్యాఖ్య. | వ్యాఖ్యాత |
| సంక. | సంకలనం |

# ప్రవేశిక

## 1) పరిశోధనాంశ పరిచయం (Introduction)

"రోజువారి సమాచారాన్ని అందించే ప్రచార సాధనం దినపత్రిక. దినపత్రిక అంటే నేటి పత్రిక అనే అర్థం రూఢి అయిపోయింది. 'దినపత్రిక' అంటే దైనందిన వార్తలను ఎప్పటికప్పుడు పాఠకుడికి అందించడమే ప్రధాన వ్యాపకంగా పెట్టుకున్న పత్రిక అంటే ప్రధానంగా అది వార్తాపత్రిక" (1991.పుట.03). అని శ్రీ నందూరి రామమోహనరావు నిర్వచించారు. 20వ శతాబ్దంలోనే ప్రప్రథమంగా దినపత్రికలు వెలిశాయి. రోజూవారి సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలనే అవసరం దినపత్రికల ఆవిర్భావానికి దారి తీసింది.

దినపత్రికల్లో జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ, రాజకీయ వార్తలతోపాటు సాహిత్య సంబంధ విషయాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. పత్రికల్లో సాహిత్య ప్రచురణ అనేది మొదటి నుండి మనకు కనిపిస్తుంది. పూర్తిగా సారస్వత విషయాలకే ప్రాధాన్యమిచ్చిన 'సుజనరంజని' మొదలుకొని నేటివరకు పత్రికల్లో సాహిత్యానికి చోటు లభిస్తూనే ఉంది. 19వ శతాబ్ది ఉత్తరార్థంలో కవులు, పండితులు స్వయంగా పత్రికలు నడిపారు. తమ వద్దనున్న తాళపత్ర ప్రతుల నుండి వెలికి తీసిన ప్రాచీన కావ్యాలను ప్రతి సంచికలో ధారావాహికగా ప్రచురించేవారు. ఈ విధంగా ప్రారంభమైన సాహిత్య ప్రచురణ నేటికి ఎంతగానో అభివృద్ధి చెందినదని చెప్పవచ్చు. ప్రస్తుతం దాదాపు అన్ని దినపత్రికలు సాహిత్యానికి ఒక ప్రత్యేక పుటను కేటాయించి వాటి ద్వారా సమకాలీన సాహిత్యాన్ని భిన్న ప్రక్రియల ద్వారా పాఠకులకు అందిస్తూ భాషా సాహిత్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నాయి.

ప్రస్తుతం వెలువడుతున్న దినపత్రికల్లో సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికలు ప్రముఖమైనవి. ఈ రెండు దినపత్రికల్లో ప్రతి సోమవారం సాహిత్య పుట వెలువడుతుంది. సాక్షి దినపత్రిక 'సాక్షి–సాహిత్యం' పేరుతో నమస్తే తెలంగాణ దినపత్రికలో 'చెలిమె' పేరుతో సాహిత్య పుటను ప్రచురిస్తున్నారు. వీటిలో కవిత్వం, భాషా సాహిత్య వ్యాసాలు, గ్రంథ సమీక్షలు, సాహిత్య సంబంధ కార్యక్రమాల నివేదికలు, నూతన పుస్తక పరిచయాలు మొదలైన అంశాలను ప్రచురిస్తున్నారు.

సాహిత్య పుటల్లో ప్రాచీన ఆధునిక సాహిత్యాంశాలతోపాటు సమకాలీన సాహిత్య సంబంధ విషయాలను, కవుల,రచయితల ఇంటర్వ్యూలను ప్రచురిస్తున్నారు. కవుల జయంతి, వర్ధంతి సందర్భంగా వారి రచనలకు సంబంధించిన వ్యాసాలను, ఏవైనా పురస్కారాలు పొందినటువంటి

ప్రత్యేక సందర్భాలలో కవులను స్మరిస్తూ వారి జీవిత సంబంధ విషయాలను, రచనల ప్రత్యేకతలను తెలుపుతూ ఇలా వివిధ వ్యాసాలు వెలువడుతున్నాయి. వాటినన్నింటిని విమర్శనాత్మక దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది.

'విమర్శ' అంటే రచనలను వివరించడమూ, సమర్థించడమూ, వ్యతిరేకించడం, విశ్లేషించడం, అంచనా కట్టడం వంటి పనుల్ని విమర్శగా భావిస్తున్నారు" (2009.పుట.16) అని ఎస్.ఎస్. నళిని పేర్కొన్నారు. విమర్శ అనగా సమీక్షణము, పరిశీలనము అని సూర్యరాయాంధ్ర నిఘంటువు అర్థాన్ని సూచిస్తుంది. ఈ సిద్ధాంత గ్రంథంలో సాహిత్య వ్యాసాలను పరిశీలించడం, విమర్శనాత్మక పద్ధతులతో విశ్లేషించడం అన్న అర్థంలో విమర్శనాత్మక అధ్యయనం అనే పదబంధం వాడబడింది.

ఈ వ్యాసాలను విమర్శనాత్మక దృష్టితో విశ్లేషించడం వలన దినపత్రికలు సాహిత్య పుటల్లో ఎలాంటి సాహిత్యాన్ని ప్రచురిస్తున్నాయో అవగతమవుతుంది. అలాగే సాహిత్య వ్యాస రచనలో ఎలాంటి విమర్శ పద్ధతులను అవలంభిస్తున్నారో తెలుస్తుంది. కనుక ఈ అంశం మీద పరిశోధన చేయవలసిందిగా నేను భావించాను. సాక్షి, నమస్తే తెలంగాణ అనే ఈ రెండు దినపత్రికల సాహిత్య వ్యాసాలను విమర్శనాత్మక దృష్టితో/పద్ధతితో అధ్యయనం చేయడానికి అనుగుణంగా మా పర్యవేక్షకుల సలహాలతో "సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – విమర్శనాత్మక అధ్యయనం" అనే అంశాన్ని నా పరిశోధనకు శీర్షికగా స్వీకరించాను.

## 2) పరిశోధన ఆవశ్యకత (Necessity of the Research)

దినపత్రిక కాలక్రమంగా అనేక మార్పులకు గురవుతూ నిత్యనూతనంగా విలసిల్లుతుంది. పత్రికా రచనా పద్ధతుల్లో, నిర్మాణంలో మార్పులతో ముందుకెళుతుంది. అందులో భాగంగా సాహిత్య సంబంధవిషయాల్లో కూడా మార్పు చోటు చేసుకుంటుంది. సమాజానికి సాహిత్యానికి అవినాభావ సంబంధం ఉంటుంది. మానవుని దైనందిన జీవితంలో భాగమయిన పత్రికలు, వాటిలో వచ్చే సాహిత్య అంశాల ప్రభావం కూడా సమాజం పై ఉంటుంది. కావున పత్రికల్లో వచ్చే సాహిత్య అధ్యయనం అనేది ఆవశ్యకమైనది.

నేను నా పరిశోధనకు 'సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – విమర్శనాత్మక అధ్యయనం' అన్న అంశం ఎంచుకోవడం జరిగింది. ఈ రెండు పత్రికల సాహిత్య పుటల్లో ప్రచురితమయిన సాహిత్య వ్యాసాల అధ్యయనం వలన ఆయా కాలాల్లోని సాహిత్యం, సంస్కృతి, భాష, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సమకాలీన సాహిత్య స్పృహ మొదలైన

అంశాలను తెలుసుకోవచ్చని గ్రహించాను. దినపత్రికలలో ప్రచురితమైన విభిన్న సాహిత్య వ్యాసాలపై పరిశోధన చేయడం ద్వారా పై అంశాలతోపాటు సమకాలీన సాహిత్య చర్చలు, సాహిత్యానికి ఉన్న ఆదరణ, సాహిత్య ప్రభావం వంటి అంశాలు కూడా అవగతం చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. కావున దినపత్రికల్లో వచ్చే సాహిత్య వ్యాసాలపై పరిశోధనలు చేయవలసిన అవసరం ఉందని భావించాను.

### 3) పరిశోధనా పరిధి (Scope of Research)

సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – విమర్శనాత్మక అధ్యయనం అన్న అంశం విస్తృతమైంది. కావున పరిశోధనా కాలపరిమితి దృష్ట్యా నా పరిశోధనకు 2016 జనవరి నుండి 2017 డిసెంబర్ వరకు రెండు సంవత్సరాల కాలపరిమితిని నిర్ణయించుకోవడం జరిగింది. ఈ రెండు సంవత్సరాల్లో సాక్షి సాహిత్యం, నమస్తే తెలంగాణ 'చెలిమె' పుటల్లో వచ్చిన సాహిత్య వ్యాసాలను విమర్శనాత్మక దృష్టితో విశ్లేషించడమే నా పరిశోధన పరిధి.

### 4) పూర్వ పరిశోధనలు (Review of Literature)

పత్రికలకు సంబంధించిన వివిధ అంశాలపై ఇప్పటి వరకు చాలా పరిశోధనలు జరిగాయి. వాటిలో భాషకు సంబంధించినవే ఎక్కువ. ఇంకా విమర్శనాత్మక దృష్టితో వచ్చిన పరిశోధనలు చాలా అరుదు. ప్రత్యేకంగా సాక్షి, నమస్తే తెలంగాణ పత్రికలపై పరిశోధన గురించి చెప్పాలంటే నాకు తెలిసినంత వరకు భాషా సాహిత్యాల దృష్ట్యా సాక్షి పత్రికపై ఇప్పటి వరకు పరిశోధన ఏది జరగలేదు. ఇక నమస్తే తెలంగాణ పత్రికపై ఒక పరిశోధన మాత్రమే కనబడుతుంది. కావున సాధారణంగా దినపత్రికలు, మిగతా పత్రికా సంబంధ పరిశోధనల్లో కొన్నింటిని ఇక్కడ పేర్కొంటున్నాను.

1) చంద్రశేఖర్, పి. 1980. **తెలుగు దినపత్రికల శీర్షికలు – భాషా పరిశీలన.** ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన ఎం.ఫిల్ పరిశోధన వ్యాసం హైదరాబాద్. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

2) చంద్రశేఖర్, పగడాల. 1988. **తెలుగు దినపత్రికల భాష ఆధునీకరణ (ఆంధ్ర పత్రిక ప్రత్యేక పరిశీలన)** ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

3) రాందాస్, కె. 1999. **తెలుగు దినపత్రికల్లో సాహిత్యం**. ఆచార్య రవ్వా శ్రీ హరి గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

4) చెన్నయ్య, జె. 2003. **తెలుగు దినపత్రికలు – భాషా సాహిత్య స్వరూపం. (1975–90) (ఈనాడు ప్రత్యేక పరిశీలన**). డా. ఎన్. గోపి గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్. ఉస్మానియా విశ్వవిద్యాలయం.

5) చిరంజీవి, జోగు. 2019. **నమస్తే తెలంగాణ దినపత్రిక సాహిత్య పుటలు: పరిశీలన (2014–2015).** డా॥ డి. విజయకుమారి గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

6) లావణ్య, కె. 2019. **ఆంధ్రజ్యోతి సాహిత్య పుటలు: విమర్శనాత్మక పరిశీలన (2015 – 2017)** డా॥ పమ్మి పవన్ కుమార్‌గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

**5) ఆకరాలు (Research Source)**

ఈ పరిశోధనకు సంబంధించిన ప్రధాన ఆకరాలు సాక్షి, నమస్తే తెలంగాణ రెండు దినపత్రికల సాహిత్య వ్యాసాలు. వీటి సేకరణలో ఎలాంటి ఇబ్బంది కలుగలేదు. సాహిత్య వ్యాసాలన్నింటిని సాక్షి, నమస్తే తెలంగాణ అంతర్జాల ఎడిషన్ (Internet Edition) నుండి సేకరించాను. ఈ పరిశోధనకు ఎంచుకున్న కాలం 2016 జనవరి నుండి 2017 డిసెంబర్ వరకు. ఈ రెండు సంవత్సరాల కాలం (2016, 2017) లో సాక్షి పత్రికలోని 'సాహిత్యం' పుటలో వచ్చిన 102 సాహిత్య వ్యాసాలను, నమస్తే తెలంగాణ పత్రికలోని 'చెలిమె' పుటలో వచ్చిన 102 సాహిత్య వ్యాసాలను నా పరిశోధనకు ముఖ్య ఆకరాలుగా స్వీకరించాను.

**6) పరిశోధన గ్రంథ రచన–ప్రధాన ఆధార గ్రంథాలు**

ఈ పరిశోధన గ్రంథాన్ని పూర్తి చేయడానికి చాలా గ్రంథాలు, వ్యాసాలు, నిఘంటువులు తోడ్పడ్డాయి. వాటన్నింటిని నా సిద్ధాంత గ్రంథం ఉపయుక్త గ్రంథసూచికలో చూడవచ్చు. పరిశోధన గ్రంథ రచనకు తోడ్పడ్డ సాహిత్య విమర్శ సంబంధిత ప్రధాన ఆధార గ్రంథాలను కొన్నింటిని ఇక్కడ పేర్కొంటున్నాను.

1) ఇనాక్, కొలకలూరి. (2017). **తెలుగు వ్యాస పరిణామం**. విజయవాడ. ప్రజాశక్తి బుక్ హౌస్.

2) చెన్నయ్య, జె. (2003). **తెలుగు దినపత్రికలు భాషా సాహిత్య స్వరూపం**. హైదరాబాద్. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్.

3) ఝాన్సీరాణి, ఎన్. (1992). **Biographical Criticism in Telugu.** ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన ఎం.ఫిల్. పరిశోధన వ్యాసం. హైదరాబాద్. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

4) ధర్మారావు, జి. (2015). **ఆధునిక తెలుగు కవిత్వ పరిణామం**. డా॥ పమ్మి పవన్ కుమార్ గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

5) పవన్ కుమార్, పమ్మి. (2016). **ప్రసార మాధ్యమాలు – భాషా నైపుణ్యం**. విజయవాడ. శ్రీరాఘవేంద్ర పబ్లికేషన్స్.

6) రామారావు, ఎస్వీ. (2007). **తెలుగులో సాహిత్య విమర్శ అవతరణ–వికాసములు**. హైదరాబాద్. పసిడి ప్రచురణలు.

7) లక్ష్మణ చక్రవర్తి, సి.హెచ్. (సంపా.) (2016). **తెలుగు సాహిత్య విమర్శ దర్శనం**. హైదరాబాద్. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

8) లక్ష్మణరెడ్డి, వి. (2002). **తెలుగు జర్నలిజం అవతరణ – వికాసం.** హైదరాబాద్. రచన జర్నలిజం కళాశాల.

9) వెంకట రామనరసింహం, కాకర్ల. (1985). **సాహిత్య దర్శనం**. విజయవాడ. గంగాధర పబ్లికేషన్స్.

10) సుబ్రహ్మణ్యం, జి.వి. (1996). **ఆంధ్ర సాహిత్య విమర్శ–ఆంగ్ల ప్రభావం**. హైదరాబాద్. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం షష్టిపూర్తి ప్రచురణలు.

### 7) పరిశోధన గ్రంథ రచనాపద్ధతి (Method of Research)॥॥

ఈ పరిశోధనా గ్రంథాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించి విమర్శనాత్మక పద్ధతిలో విశ్లేషించాను. అవి కింది విధంగా ఉన్నాయి.

1) మొదటి అధ్యాయం : **సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య అనుబంధాలు.**

2) రెండవ అధ్యాయం : **సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – కవిత్వ విమర్శ.**

3) మూడవ అధ్యాయం : **సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – కథానిక విమర్శ.**

4) నాల్గవ అధ్యాయం : **సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – నవలా విమర్శ.**

5) ఐదవ అధ్యాయం : **సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – భాషా సాంస్కృతిక అధ్యయనం.**

ఈ పరిశోధనలో ఉపయుక్త గ్రంథాలను కూర్చడంలో APA (American Psychological Association) వారి పద్ధతిని అనుసరించాను.

**మొదటి అధ్యాయం** – 'సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య అనుబంధాలు'లో భారతీయ ముద్రణా యంత్రాల ఆవిర్భావ పరిణామాలు, అలాగే తెలుగు ముద్రణా యంత్రాల ఆవిర్భావం, పరిణామ వికాసాలు స్థూలంగా పరిచయం చేయబడ్డాయి. భారతీయ పత్రిక ఆవిర్భావం, తొలి తెలుగు పత్రికల వివరాలు సంక్షిప్తంగా తెలుపబడ్డాయి. తెలుగు దినపత్రికల ఆవిర్భావం, వాటి నిర్మాణాన్ని తెలుపుతూ సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల ఆవిర్భావ వికాసాలను పరిచయం చేశాను. ఈ రెండు పత్రికల లక్ష్యాలు, అనుబంధాలను పరిచయం చేస్తూ వాటి నిర్మాణంలోని ప్రత్యేకతలను వివరించాను. అలాగే వాటికి లభించిన అవార్డుల వంటి పురస్కార సంబంధ వివరాలను తెలియజేశాను. పత్రికల్లో సాహిత్య ప్రచురణ ప్రారంభ కాలం నుండి కనిపిస్తుంది. కేవలం సారస్వత విషయాలకే పరిమితమైన సుజనరంజని మొదలుకొని నేటివరకు పత్రికల్లో సాహిత్య ప్రచురణ కొనసాగుతుందని తెలుపుతూ సాక్షి 'సాహిత్యం' పుట, నమస్తే తెలంగాణ 'చెలిమె' పుట ప్రాధాన్యతలను వివరించాను.

**రెండవ అధ్యాయం** – 'సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – కవిత్వ విమర్శ'లో ఈ రెండు సాహిత్య పుటల్లో వచ్చిన వివిధ రకాల కవిత్వ సంబంధ వ్యాసాలను అధ్యయనం చేసి విశ్లేషించాను. ఈ అధ్యాయంలో మొదట కవిత్వ ప్రక్రియను పరిచయం చేసి కవిత్వ సంబంధ ఆలంకారిక, ఆధునిక నిర్వచనాలు, లక్షణాలను వివరించాను. వివిధ రకాల కవిత్వ సంబంధ వ్యాసాలను పద కవిత్వ వ్యాసాలు, ప్రబంధ కవిత్వ వ్యాసాలు, గేయకవిత్వ వ్యాసాలు, స్త్రీవాద కవిత్వ వ్యాసాలు, హైకూ కవిత్వ వ్యాసాలు, గజల్ కవిత్వ వ్యాసాలు, కవిత్వ

సంబంధ విమర్శ వ్యాసాలు, కవిత్వ గ్రంథ సమీక్షలు, నివేదిక వ్యాసాలు, కవిత్వ వ్యాసాలు – కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ, కవిత్వ వ్యాసాలు–ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ, పాశ్చాత్య కవిత్వ వ్యాసాలుగా విభజించుకొని , కవిజీవిత విమర్శ, ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ, తులనాత్మక విమర్శ, నైతిక విమర్శ, చారిత్రక విమర్శ వంటి పద్ధతుల్లో విశ్లేషించి వివరించాను. గ్రంథ స్థలాభావం దృష్ట్యా ఒక్కొక్క ప్రక్రియకు రెండు లేదా మూడు వ్యాసాలను విశ్లేషించి మిగతా వ్యాసాల వివరాలను ఆ ఉపవిభాగం చివర పట్టిక రూపంలో తెలియజేశాను.

**మూడవ అధ్యాయం –** 'సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – కథానిక విమర్శ'లో మొదట కథానిక ప్రక్రియను పరిచయం చేసి కథానిక నిర్వచనాలు, లక్షణాలను వివరించాను. ఈ రెండు పత్రికల్లో వచ్చిన కథానిక సంబంధ వ్యాసాలను కథానిక ఉపోద్ఘాతాలు, కథానిక వ్యాసాలు – వస్తు వైవిధ్యం, కథాశిల్ప సంబంధ వ్యాసాలు, కథానిక సంబంధ వ్యాసాలు – వాద ప్రతివాదాలు, కథానిక సంబంధ నేపథ్య వ్యాసాలు, కథానిక సంబంధ స్మరణ వ్యాసాలు, కథానిక సంబంధ గ్రంథ సమీక్షలు, పాశ్చాత్య కథా సంబంధ వ్యాసాలుగా విభజన చేసి, కవిజీవిత విమర్శ, చారిత్రక విమర్శ, వాదప్రతివాద విమర్శ పద్ధతుల్లో విశ్లేషించాను. మిగిలిన వ్యాసాల వివరాలను వాటి ఉపవిభాగం చివరన పట్టికల రూపంలో తెలిపాను.

**నాల్గవ అధ్యాయం –** 'సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – నవలా విమర్శ'లో నవల ప్రక్రియను పరిచయం చేసి నవల నిర్వచనాలు, లక్షణాలు, నవలా విమర్శ గురించి తెలియజేశాను. ఈ రెండు దినపత్రికల్లో వెలువడిన నవలా సంబంధ వ్యాసాలను మనోవైజ్ఞానిక నవలా వ్యాసాలు, అనువాద నవలా వ్యాసాలు, గిరిజన నవలా వ్యాసాలు, నవలా సంబంధ స్మరణ వ్యాసాలు, నవలా సంబంధ నివేదిక వ్యాసాలు అని ఉపవిభాగాలుగా విభజించి, కవిజీవిత విమర్శ, మనోవైజ్ఞానిక విమర్శ పద్ధతుల్లో విశ్లేషించాను. మిగిలిన నవలా వ్యాసాలను ఉపవిభాగం చివరన పట్టికల్లో పేర్కొన్నాను.

**ఐదవ అధ్యాయం –** 'సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – భాషా సాంస్కృతిక అధ్యయనం'లో భాష, సంస్కృతులను మొదట పరిచయం చేశాను. ఈ రెండు పత్రికల్లో వెలువడిన భాష, సాంస్కృతిక, చారిత్రక సంబంధ వ్యాసాలను సాక్షి భాషాసంబంధ వ్యాసాలు, నమస్తే తెలంగాణ భాషాసంబంధ వ్యాసాలు, సాంస్కృతిక సంబంధ వ్యాసాలు, చారిత్రక సంబంధ వ్యాసాలు, సామెతలు, పత్రికలు, సాహిత్య ఉత్సవాలు అను ఉపవిభాగాలుగా

విభజించి  విశ్లేషించాను. మిగిలిన వ్యాసాల వివరాలను ఆయా ఉపవిభాగాల కింద పట్టికలో పొందుపరిచాను.

## 8) అనుబంధాలు (Annexures)

ఈ పరిశోధన గ్రంథం  చివర్లో ఐదు అనుబంధాలను జతపరచటం జరిగింది.

**అనుబంధం – 1**

మొదటి అనుబంధంలో సాక్షి, నమస్తే తెలంగాణ పత్రిక సంబంధ వివరాల కోసం సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ కె. రామచంద్రమూర్తి గారిని కలిసి ఇంటర్వ్యూ తీసుకున్నాను. వారి ఇంటర్వ్యూ సంబంధ వివరాలను ప్రశ్నావళి రూపంలో పొందుపరచడం జరిగింది.

**అనుబంధం – 2**

రెండవ అనుబంధంలో నా పరిశోధనకు ముఖ్య ఆకరాలైన సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లో వెలువడిన (2016, 2017) రెండు సంవత్సరాల సాహిత్య వ్యాసాలను కాలక్రమానుసారంగా పట్టిక రూపంలో పొందుపరిచాను.

**అనుబంధం – 3**

మూడవ అనుబంధంలో పరిశోధన కాలంలో నేను వివిధ జాతీయ సదస్సుల్లో పాల్గొని పత్ర సమర్పణ చేశాను. వాటిలో రెండింటిని మాత్రమే పొందుపరిచాను. అలాగే నా పరిశోధన అంశానికి సంబంధించి నేను రాసిన వ్యాసాలు UGC–CARE Listed Journal లో ప్రచురితమయ్యాయి. వాటిని కూడా దీనిలో జతపర్చాను.

**అంతర్జాతీయ, జాతీయ సదస్సు పత్రాల వివరాలు**

1) ‘భాషా సాహిత్య, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ పరివ్యాప్తి – సినిమా పాత్ర’ అనే అంశంపై తెలుగుశాఖ. ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాల (కరీంనగర్) 17, 18 ఫిబ్రవరి 2017న నిర్వహించిన జాతీయ సదస్సులో **‘నమస్తే తెలంగాణ సాహిత్య వ్యాసాలు – విమర్శ తీరు తెన్నులు  (సెప్టెంబర్ 2016)’** పేరిట పత్రం సమర్పించాను.
2) ‘అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం – తెలుగు భాష విశిష్టత’ అనే అంశంపై తెలుగుశాఖ, ఆంధ్రాయూనివర్సిటీ. (విశాఖపట్టణం) 21 ఫిబ్రవరి 2024న నిర్వహించిన అంతర్జాతీయ  సదస్సులో **‘తెలుగు దినపత్రికల్లో సాహిత్య పుటలు – భాషా సాహిత్య సేవ’** పేరిట పత్రం సమర్పించాను.

**ప్రచురిత వ్యాసాల వివరాలు**

1) ఔచిత్యం (అంతర్జాల తెలుగు మాసపత్రిక. UGC–CARE Listed Journal. Volume–5, Issue–2) ఫిబ్రవరి, 2024 (ISSN–2583–4797)లో **'నమస్తే తెలంగాణ' దినపత్రిక కవిత్వ వ్యాసాలు (2016 – 2017):పరామర్శ.పుటలు**: 24–34.

2) ఔచిత్యం (అంతర్జాల తెలుగు మాస పత్రిక. UGC–CARE Listed Journal. Volume–5, Issue–3) మార్చి, 2024 (ISSN–2583–4797) లో **'సాక్షి, నమస్తేతెలంగాణ దినపత్రికల్లోని కథానికావ్యాసాలు: సూత్రవిమర్శ'**. (పుటలు:61–67)

**అనుబంధం – 4**

నాల్గవ అనుబంధంలో నా పరిశోధనలో భాగమైన సాహిత్య వ్యాస ప్రతులను కొన్నింటిని ఇక్కడ పొందుపరిచాను.

**అనుబంధం – 5**

ఐదవ అనుబంధంలో ఈ రెండు దినపత్రికల్లో వెలువడిన సాహిత్య వ్యాసాలను సంఖ్య ఆధారంగా నెలల వారిగా, ప్రక్రియల వారిగా సాహిత్య వ్యాసాల రేఖచిత్రాన్ని జతపరచడం జరిగింది.

**9. పరిశోధన లక్ష్యం**

'సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – విమర్శనాత్మక అధ్యయనం' అనే నా పరిశోధన ద్వారా సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య పుటలలో వచ్చిన వ్యాసాల్లోని కవిత్వం, కథానిక, నవల మొదలైన ప్రక్రియలను, భాషా సాంస్కృతిక సంబంధ విషయాలను విమర్శనాత్మక దృష్టితో పరిశీలించటం. విమర్శ భేదాలను ఈ వ్యాసాల్లో సమన్వయం చేస్తూ సాహిత్య వ్యాసాల అధ్యయన ప్రయోజనాన్ని చెప్పటమే ఈ పరిశోధన లక్ష్యం.

**10) పరిశోధన ప్రయోజనాలు**

1) దినపత్రికల సాహిత్య పుటల్లో ఏ విధమైన సాహిత్య ప్రచురణ జరుగుతుందో తెలుస్తుంది.

2) కవిత్వ సంబంధ వ్యాసాల్లో ఏ విధమైన కవిత్వం వస్తుందో తెలుస్తుంది. కవిత్వంలోని వస్తు విశేషాలు తెలుస్తాయి.

3) విమర్శ వ్యాసాల్లో రకాలు వ్యాస నిర్మాణపరమైన విషయాలు అవగతమవుతాయి.

4) విమర్శ పద్ధతులుపై అవగాహన కలుగుతుంది.

5) భాష, సంస్కృతి పరిరక్షణలో పత్రికలు నిర్వహిస్తున్న పాత్ర తెలుస్తుంది.

6) తెలంగాణ ప్రాంత భాషాసాహిత్య సాంస్కృతికాభివృద్ధికి నమస్తే తెలంగాణ పత్రిక చేస్తున్న కృషి అవగతమవుతుంది.

7) వివిధ ప్రక్రియలకు సంబంధించిన పరిచయం అలాగే పాశ్చాత్య సాహిత్య పరిచయం జరుగుతుంది.

8) భావితరం పరిశోధకులు దినపత్రికల భాషా, సాహిత్యంపై పరిశోధన చేయాలనుకునే వారికి, అలాగే సాహిత్యాన్ని విమర్శనాత్మక పద్ధతిలో విశ్లేషణ చేయాలనుకునే వారికి ఇది ఉపకరిస్తుంది.

9) కవి జీవిత విమర్శ, ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ, తులనాత్మక విమర్శ, సూత్ర విమర్శ, నైతిక విమర్శ, మనోవైజ్ఞానిక విమర్శ వంటి విమర్శ పద్ధతులపై అవగాహన ఏర్పడుతుంది.

★★★

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| **అంకితం** | | | **iii** |
| **డిక్లరేషన్** | | | **iv** |
| **సర్టిఫికెట్** | | | **v** |
| **కృతజ్ఞతలు** | | | **vi–vii** |
| **సంకేత పదసూచి** | | | **viii** |
| **ప్రవేశిక** | | | **ix–xviii** |
| **విషయసూచిక** | | | **xix–xxviii** |
| **అధ్యాయం–1: సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య అనుబంధాలు** | | | **1–38** |
| 1.0. | పరిచయం | | 1 |
| 1.1. | సమాచార వినిమయం | | 2 |
| 1.2. | ముద్రణ యంత్రాల ఆవిర్భావం | | 3 |
| 1.3. | తెలుగులో ముద్రణ యంత్రాల ఆవిర్భావం | | 5 |
| 1.4. | భారతీయ పత్రికల ఆవిర్భావం–వికాసం | | 6 |
| 1.5. | తెలుగు పత్రికల ఆవిర్భావం–వికాసం | | 8 |
| 1.6. | తెలుగు దినపత్రికల ఆవిర్భావం | | 9 |
| 1.7. | తెలుగు దినపత్రికల నిర్మాణం | | 10 |
| 1.8. | సాక్షి దినపత్రిక పరిచయం | | 11 |
| | 1.8.1. | సాక్షి దినపత్రిక ఆవిర్భావం–రాజకీయ నేపథ్యం | 11 |
| | 1.8.2. | సాక్షి దినపత్రిక–ప్రత్యేకతలు | 13 |
| | 1.8.3. | సాక్షి దినపత్రిక–లక్ష్యాలు | 14 |
| | 1.8.4. | సాక్షి దినపత్రిక–అనుబంధ పత్రికలు | 14 |
| | 1.8.5. | సాక్షి దినపత్రిక–అవార్డులు | 15 |
| | 1.8.6. | సాక్షి దినపత్రిక నిర్మాణం | 17 |
| | | 1.8.6.1. సంపాదకీయం | 17 |
| | | 1.8.6.2. భవిత | 18 |
| | | 1.8.6.3. సాగుబడి | 19 |
| | | 1.8.6.4. ఫ్యామిలీ | 19 |

1.8.6.5. ప్రాఫిట్ ప్లస్ 20
1.8.6.6. స్పోర్ట్స్ 20
1.8.6.7. బిజినెస్ 20
1.8.6.8. పెళ్లిచూపులు 21
1.8.6.9. ఫన్ డే 21
1.8.6.10. సాక్షి–సాహిత్యం 21
1.9. తెలంగాణ పత్రికల ఆవిర్భావం–వికాసం 24
1.9.1. తెలంగాణ తెలుగు పత్రికల ఆవిర్భావం 26
1.9.2. తెలంగాణ తెలుగు దినపత్రికల ఆవిర్భావం 28
1.9.2.1. తెలంగాణ 28
1.9.2.2. మీజాన్ 29
1.9.2.3. గోల్కొండ 29
1.9.3. నమస్తే తెలంగాణ దినపత్రిక ఆవిర్భావం–వికాసం 30
1.9.3.1. నమస్తే తెలంగాణ దినపత్రిక ఆవిర్భావం–ఉద్యమ నేపథ్యం 30
1.9.3.2. నమస్తే తెలంగాణ దినపత్రిక–లక్ష్యాలు 32
1.9.3.3. నమస్తే తెలంగాణ దినపత్రిక–అనుబంధ పత్రికలు 32
1.9.3.4. నమస్తే తెలంగాణ దినపత్రిక–నిర్మాణం 33
1.9.3.5. సంపాదకీయం 33
1.9.3.6. జీవన రేఖ 34
1.9.3.7. సలహా 34
1.9.3.8. నిపుణ 34
1.9.3.9. రైతు బడి 34
1.9.3.10. నమస్తే నోటిఫికేన్ 35
1.9.3.11. బిజీ మార్కెట్ 35
1.9.3.12. ఖేల్ 35
1.9.3.13. టాకీస్ 35
1,9.3.14. జిందగీ 36
1.9.3.15. బతుకమ్మ 36

1.9.3.16. చెలిమె 36

**అధ్యాయం–2: సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు–కవిత్వ విమర్శ 39–117**

2.0. పరిచయం 39

2.1. కవిత్వం–ఆలంకారిక నిర్వచనాలు, లక్షణాలు 39

2.1.1. కవి 39

2.1.2. కవిత్వం 41

2.1.3. ఇతర ఆలంకారికుల నిర్వచనాలు 43

2.1.4. పాశ్చాత్యులు 44

2.1.5. తెలుగు ప్రాచీన కవుల నిర్వచనాలు 46

2.2. కవిత్వం–ఆధునిక నిర్వచనాలు, లక్షణాలు 47

2.2.1. ఆధునికత 47

2.2.2. ఆధునిక కవిత్వం–నిర్వచనాలు 50

2.2.3. ఆధునిక కవిత్వం–విభిన్న రూపాలు 51

2.3. పద కవిత్వ సంబంధ వ్యాసాలు 51

2.3.1. అన్నమయ్య వేమన్న పదాలు 52

2.3.2. అన్నమయ్య అచ్చ తెలుగు 54

2.4. ప్రబంధ కవిత్వ సంబంధ వ్యాసాలు 55

2.4.1. రైతుల కోసం రాయలనీతి 56

2.5. గేయ కవిత్వ సంబంధ వ్యాసాలు 59

2.5.1. ప్రచారాస్త్రాలుగా జానపదాలు 60

2.5.2. జనజీవన హాస్య గేయాలు 61

2.5.3. గేయ కవిత్వ సంబంధ వ్యాసాల పట్టిక 62

2.6. స్త్రీవాద కవిత్వ సంబంధ వ్యాసాలు 62

2.6.1. స్త్రీవాద కవిత్వం–పరిచయం 62

2.6.2. తెలుగు సాహిత్యంలో మైనార్టీ స్త్రీవాద జీవన చిత్రణ 63

2.6.3. ఫెమినిజం కాదు అస్తిత్వవాదం! 64

2.6.4. స్త్రీవాద కవిత్వ సంబంధ వ్యాసాల పట్టిక 65

2.7. హైకూ కవిత్వ సంబంధ వ్యాసాలు 65

2.7.1. హైకూ కవిత్వం–పరిచయం 65

| | | | |
|---|---|---|---|
| | 2.7.2. | తెలుగు హైకూ: ఒక అవలోకనం | 66 |
| | 2.7.3. | భూమ్యాకాశాల మార్పులే కవితా బీజాలు | 67 |
| 2.8. | | గజల్ కవిత్వ సంబంధ వ్యాసాలు | 67 |
| | 2.8.1. | గజల్ కవిత్వం—పరిచయం | 67 |
| | 2.8.2. | వలపునై నీ హృదయ సీమల నిలువవలెనని ఉన్నది | 68 |
| | 2.8.3. | మరణం నను వరించి వస్తే ఏమంటాను | 69 |
| 2.9. | | కవిత్వ సంబంధ విమర్శ వ్యాసాలు | 70 |
| | 2.9.1. | తొలి తెలుగు దళిత మహిళాకావ్యం | 72 |
| | 2.9.2. | కవిత్వ సంబంధ విమర్శ వ్యాసాల పట్టిక | 73 |
| 2.10 | | కవిత్వ సంబంధ గ్రంథ సమీక్షలు | 74 |
| | 2.10.1. | సమీక్ష—పరిచయం | 74 |
| | 2.10.2. | బతుకాట సవ్వడుల గవ్వలు | 75 |
| | 2.10.3. | కలల్ని వెంటాడే విద్యార్థులు | 77 |
| | 2.10.4. | కవిత్వ సంబంధ గ్రంథ సమీక్షల పట్టిక | 79 |
| 2.11. | | కవిత్వ సంబంధ వ్యాసాలు—కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ | 79 |
| | 2.11.1. | కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ—నిర్వచనాలు | 80 |
| | 2.11.2. | జయంతి సంబంధ వ్యాసాలు | 81 |
| | 2.11.2.1. | కవిత్వ అగ్నిధార దాశరథి | 82 |
| | 2.11.2.2. | ధిక్కార స్వర ఆది గురువు | 85 |
| | 2.11.2.3. | అభినవ కాళిదాసు కృష్ణమాచార్యులు | 86 |
| | 2.11.2.4. | లలితమైన భాష, రమ్యమైన భావం | 87 |
| | 2.11.2.5. | జ్ఞానపీఠం జ్ఞాపకాల దొంతర | 88 |
| | 2.11.2.6. | జయంతి సంబంధ వ్యాసాల పట్టిక | 89 |
| | 2.11.3. | వర్ధంతి సంబంధ వ్యాసాలు | 89 |
| | 2.11.3.1. | ఎవడాపును కవి వాక్కును... | 90 |
| | 2.11.3.2. | శివసాగర్ మ్రోగించిన తొలి గంటలు | 92 |
| | 2.11.3.3. | కవుల వర్ధంతి సంబంధ వ్యాసాల పట్టిక | 93 |
| | 2.11.4. | కవుల ఇంటర్వ్యూలు | 94 |
| | 2.11.4.1. | ఇంటర్వ్యూ—పరిచయం | 94 |

| | | | |
|---|---|---|---|
| | 2.11.4.2. | ఇంటర్వ్యూ—నిర్వచనాలు | 95 |
| | 2.11.4.3. | సాహిత్యమంటే జీవితమే | 96 |
| | 2.11.4.4. | జానపద పాట... ఉద్యమ పాట... ధూంధాం... | 97 |
| | 2.11.4.5. | భావాలను భౌతిక శక్తిగా మార్చిన సాంస్కృతిక సైనికుడు | 98 |
| | 2.12.4.6. | కవుల సంబంధ ఇంటర్వ్యూల పట్టిక | 99 |
| 2.12. | కవిత్వ సంబంధ వ్యాసాలు—ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ | | 100 |
| | 2.12.1. | ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ—పరిచయం, నిర్వచనాలు | 100 |
| | 2.12.2. | సాహిత్యంలో తొలి రచనలు | 102 |
| | 2.12.3. | సాహిత్యంలో స్వాభిమాన ప్రకటన | 104 |
| | 2.12.4. | ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ సంబంధ వ్యాసాల పట్టిక | 105 |
| 2.13. | కవిత్వ సంబంధ నివేదిక వ్యాసాలు | | 105 |
| | 2.13.1. | సదస్సు/సమావేశ సంబంధ వ్యాసాలు | 106 |
| | 2.13.1.1. | ఉద్యమానికి ఊపిరి సాహిత్యం | 106 |
| | 2.13.1.2. | స్వతంత్ర మేధావి హృదయ సంస్కర్త | 108 |
| | 2.13.1.3. | సంఘటనల వెంట సమకాలీన కవి | 108 |
| | 2.13.2. | పురస్కార/సన్మాన సంబంధ వ్యాసాలు | 109 |
| | 2.13.2.1. | పచ్చనాకుపై వెచ్చని రాత | 109 |
| | 2.13.2.2. | సాహిత్య శిల్పులకు కబీర్ సమ్మాన్ | 110 |
| | 2.13.2.3. | సన్మాన/పురస్కార సంబంధ వ్యాసాల పట్టిక | 112 |
| | 2.13.3. | పుస్తకావిష్కరణ/పునర్ముద్రణ సంబంధ వ్యాసాలు | 113 |
| | 2.13.3.1. | 50 ఏళ్ళ తర్వాత బాణుడి కాదంబరి | 113 |
| | 2.13.3.2. | పుస్తకావిష్కరణ/పునర్ముద్రణ సంబంధ వ్యాసాల పట్టిక | 114 |
| 2.14. | పాశ్చాత్య కవిత్వ సంబంధ వ్యాసాలు | | 114 |
| | 2.14.1. | కవిత్వమే మతం అయిన సందర్భం | 114 |
| | 2.14.2. | సామాన్య మానవుల అసామాన్య కవి | 115 |
| | 2.14.3. | పాశ్చాత్య కవిత్వ సంబంధ వ్యాసాల పట్టిక | 116 |
| **అధ్యాయం—3: సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు—కథానిక విమర్శ** | | | **118—160** |
| 3.0. | పరిచయం | | 118 |
| 3.1. | కథానిక నిర్వచనం—లక్షణాలు | | 119 |

3.1.1. కథానిక—నిర్వచనాలు 120

3.1.2. కథానిక—లక్షణాలు 122

3.2. కథానిక ఉపోద్ఘాతాలు 122

3.2.1. ముందుమాట—నిర్వచనాలు 123

3.2.3. సూత్ర విమర్శ (Theoretical Criticism) 125

3.2.4. సామాజిక వాస్తవ చిత్రాలు 126

3.2.5. పాతికేళ్ల కథ ప్రయాణం 126

3.2.6. తెలుగులో మామ్ కథలు 127

3.2.7. కథానిక ఉపోద్ఘాత వ్యాసాల పట్టిక 129

3.3. కథానిక వ్యాసాలు—వస్తువైవిధ్యం 129

3.3.1. వస్తువు—నిర్వచనాలు 129

3.3.2. కథానిక వ్యాసాలు—ప్రాంతీయత 133

3.3.2.1. ఆధునిక జీవన 'నిశ్శబ్ద వేదన' 133

3.3.2.2. ప్రాంతీయ కథానిక వ్యాసాల పట్టిక 134

3.3.3. కథానిక వ్యాసాలు—మైనారిటీ సాహిత్యం 135

3.3.3.1. నవాబుల సంస్కృతికి ప్రతిరూపాలు—'చార్మినార్' కథలు 135

3.3.3.2. మైనారిటీ కథానిక వ్యాసాలు పట్టిక 137

3.4. కథాశిల్ప సంబంధ వ్యాసాలు 137

3.4.1. శిల్పం—నిర్వచనాలు 137

3.4.2. నా కథారచనలోని రహస్యాలు 140

3.4.3. కథాశిల్ప సంబంధ వ్యాసాల పట్టిక 141

3.5. కథానికి వ్యాసాలు—వాద ప్రతివాదాలు 141

3.5.1. శిల్పం—కథ 143

3.5.2. ఇంత మొహమాటం అవసరమా? 144

3.5.3. కథాసాహిత్యంల స్తబ్దత 146

3.5.4. వాద ప్రతివాద విమర్శ వ్యాసాల పట్టిక 147

3.6. కథానిక గ్రంథ నేపథ్యాలు 147

3.6.1. కథ కథా వాన వాన 147

3.6.2. ఊరు చరిత్ర మీద పాదముద్ర 149

| | | |
|---|---|---|
| 3.6.3. | జీవించు... నేర్చుకో... అందించు... | 150 |
| 3.7. | కథానిక గ్రంథ సమీక్షలు | 151 |
| 3.7.1. | మూలాల్ని ముట్టిన కథలు | 151 |
| 3.7.2. | కథానిక సమీక్ష సంబంధ వ్యాసాల పట్టిక | 152 |
| 3.8. | కథానిక సంబంధ స్మరణ వ్యాసాలు | 153 |
| 3.8.1. | అదృశ్యమైన నిప్పుపిట్ట, ఎర్ర కుందేలు | 153 |
| 3.8.2. | అస్తమించిన ప్రతిభామూర్తి | 154 |
| 3.8.3. | కథానిక సంబంధ స్మరణ వ్యాసాల పట్టిక | 155 |
| 3.9. | కథానిక సంబంధ నివేదికా వ్యాసాలు | 155 |
| 3.9.1. | కొత్త సందర్భంలో రాయలసీమ కథ | 156 |
| 3.9.2. | సూర్యలంకలో కథాసరిత్సాగరం | 157 |
| 3.9.3. | ఈ సమాజం రచయితకి, కళాకారులకి స్వర్గం | 158 |
| 3.10. | పాశ్చాత్య కథాసంబంధ వ్యాసాలు | 158 |
| 3.10.1. | కామూ, సార్త్రే స్నేహపూర్వక శత్రుత్వం | 159 |
| **అధ్యాయం–4: సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు–నవలా విమర్శ** | | **161–199** |
| 4.0. | పరిచయం | 161 |
| 4.1. | నవల నిర్వచనం–లక్షణాలు | 161 |
| 4.1.1. | నవల–ప్రారంభం | 162 |
| 4.1.2. | నవల ఆధునిక–సంప్రదాయం | 163 |
| 4.1.3. | నవల–నిర్వచనాలు | 165 |
| 4.1.4. | నవల–లక్షణాలు | 166 |
| 4.1.5. | నవలా విమర్శ | 167 |
| 4.2. | అనువాద నవలా వ్యాసాలు | 170 |
| 4.2.1. | అనువాద సమస్యలు | 172 |
| 4.2.2. | అనువాదయుగం (క్రీ.శ.1900–1920) | 173 |
| 4.2.3. | అనువాదం–పత్రికల పాత్ర | 173 |
| 4.2.4. | విపుల ప్రపంచంలోకి వేయి పడగలు | 174 |
| 4.2.5. | ఒక కళాకారుడి జీవన లాలస | 176 |
| 4.2.6. | అనువాద నవలా వ్యాసాల పట్టిక | 178 |

4.3. మనోవైజ్ఞానిక నవలా వ్యాసాలు 178

4.3.1. మనోవైజ్ఞానిక నవలలు 182

4.3.2. తెలుగులో మనోవైజ్ఞానిక యుగం (1942 నుండి 1960 వరకు) 183

4.3.3. తొలి తెలుగు మనోవైజ్ఞానిక నవలకు 70! 184

4.3.4. అంతరంగమే ఆయన కథనరంగం 186

4.3.5. మనోవైజ్ఞానిక నవలా సంబంధం వ్యాసాల పట్టిక 187

4.4. గిరిజన నవలా వ్యాసాలు 188

4.4.1. గిరిజన నవలలు—పరిచయం 189

4.4.2. అడవి మీద విరిసిన అక్షరం 191

4.4.3. ...చాలా పెద్దమ్మ! 192

4.4.4. అపనమ్మకం ఆగిపోయే సందర్భం 193

4.5. నవలా సంబంధ స్మరణ వ్యాసాలు 194

4.5.1. అస్తమయం—నలుపు మందరాల మాన్యం చెల్క 194

4.5.2. నివాళి—అడవి మీద విరిసిన అక్షరం 196

4.5.3. నవలా సంబంధ స్మరణ వ్యాసాల పట్టిక 197

4.6. నవలా సంబంధ నివేదిక వ్యాసాలు 197

4.6.1. బ్రిటన్ దేహంలో జపాన్ ఆత్మ 198

4.6.2. నవలా సంబంధ నివేదికా వ్యాసాల పట్టిక 199

**అధ్యాయం—5: సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు—భాషాసాంస్కృతిక అధ్యయనం 200—246**

5.0. పరిచయం 200

5.1. భాషా సంబంధ వ్యాసాలు 200

5.1.1. భాష 201

5.1.2. భాష—స్వరూప స్వభావాలు 203

5.1.3. భాష—సంస్కృతి 203

5.1.4. భాష—మార్పు వికాసం 204

5.1.5. వార్తాపత్రికలు—భాష 205

5.2. నమస్తే తెలంగాణ దినపత్రికలోని భాషా సంబంధ వ్యాసాలు 206

5.2.1. భాష: ప్రామాణికం, తెలంగాణం 208

| | | |
|---|---|---|
| 5.2.2. | సమగ్ర నిఘంటువు అవసరం | 210 |
| 5.2.3. | తేట తెనుగు పదాల తోట | 211 |
| 5.2.4. | నమస్తే తెలంగాణ పత్రికలోని భాషా సంబంధ వ్యాసాల పట్టిక | 212 |
| 5.3. | సాక్షి దినపత్రికలోని భాషా సంబంధ వ్యాసాలు | 213 |
| 5.3.1. | అన్నమయ్య అచ్చ తెలుగు | 213 |
| 5.3.2 | తెలుగు భాషకు చిరునామాలు గ్రామాలు | 214 |
| 5.3.3. | ఇంగ్లీష్ కన్నా వందేళ్ల ముందే తెలుగులో తిసారెస్ | 215 |
| 5.3.4. | సాక్షి పత్రికలోని భాషా సంబంధ వ్యాసాల పట్టిక | 217 |
| 5.4. | చారిత్రక విషయ సంబంధ వ్యాసాలు | 217 |
| 5.4.1. | చారిత్రక గ్రంథ సంబంధ వ్యాసాలు | 217 |
| 5.4.2. | తెలంగాణ చరిత్రపై మొదటి సమగ్ర రచన | 218 |
| 5.4.3. | తెలంగాణ సమగ్ర చరిత్ర | 219 |
| 5.4.4. | చరిత్ర సంబంధ వ్యాసాల పట్టిక | 221 |
| 5.5. | సాంస్కృతిక సంబంధ వ్యాసాలు | 221 |
| 5.5.1. | జానపద విజ్ఞానం—తెలంగాణ సంస్కృతి | 224 |
| 5.5.2. | తెలంగాణ ప్రాంత జానపద కళారూపాలు | 227 |
| 5.5.2.1. | ఇది మన స్వేచ్ఛానర్తనం | 229 |
| 5.5.2.2. | తెలంగాణ సంస్కృతి జానపద కళారూపాలు | 230 |
| 5.4.2.3. | మల్లన్న పురాణం—వృత్తి సాహిత్యం | 232 |
| 5.4.2.4. | మన మాగాణంలో యక్షగాన ఘనకీర్తి | 233 |
| 5.5.2.5. | సాంస్కృతిక సంబంధ వ్యాసాల పట్టిక | 234 |
| 5.6. | సామెతలు | 234 |
| 5.6.1. | సామెతలు సాహిత్యానికి సొబగులు | 237 |
| 5.6.2. | సామెతల్లో జీవన చిత్రణ | 238 |
| 5.7. | సాహిత్య ఉత్సవాలు | 240 |
| 5.7.1. | ఎన్ని తీర్లుగ మాట్లాడిన తెలుగు తెలుగే | 240 |
| 5.7.2. | యాస భాషల అలయ్ బలయ్ | 241 |
| 5.7.3. | సాహిత్య ఉత్సవ సంబంధ వ్యాసాల పట్టిక | 242 |
| 5.8. | పత్రికలు— సాంస్కృతిక కృషి | 242 |

5.8.1. ఓరుగల్లు పత్రికలు... ఉద్యమ వేదికలు 242
5.8.2. తెలంగాణలో తొలి తెలుగు పత్రిక ‘శేద్యచంద్రిక’ 244
**ఉపసంహారం** **247–249**
**ఫలితాంశాలు** **250–255**
**ఉపయుక్త గ్రంథసూచి** **256–266**
**అనుబంధాలు** **267–321**
అనుబంధం–1 (ఇంటర్వ్యూ) 267-269
అనుంబంధం–2 (సాహిత్య వ్యాసాల పట్టిక) 270-282
అనుబంధం–3 (సదస్సులు మరియు పరిశోధన వ్యాసాలు) 283-301
అనుబంధం–4 (సాహిత్య వ్యాసాల పుటలు) 302-307
అనుబంధం–5 (సాహిత్య వ్యాసాల రేఖాచిత్రం) 308

# మొదటి అధ్యాయం

## సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల

## సాహిత్య అనుబంధాలు

## అధ్యాయం–1

## సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య అనుబంధాలు

### 1.0. పరిచయం

ప్రస్తుత కాలంలో పత్రికా రంగం విస్తృతిని పొందినదని చెప్పవచ్చు. ఎందుకంటే చిన్నపిల్లల నుండి పెద్దవాళ్ల వరకు ప్రతి ఒక్కరికి కావాల్సిన సమాచారాన్ని నేడు పత్రికా రంగం అందిస్తుంది. పాఠకులకు కేవలం సమాచారమే కాకుండా సాహిత్య, సాంస్కృతిక సంబంధమైన విషయాలను తెలియపరుస్తూ, వాస్తవికతలను సమకాలీన సామాజిక జీవన చిత్రణను చూపిస్తుంది. నేడు పత్రికలలో అన్ని రకాల వార్తా సమాచారాలు ఉంటున్నాయి. వర్తమాన విషయాలపై సేకరించిన సమాచారాన్ని వార్తలు, వ్యాఖ్యలుగా మలచి పత్రికలు సమాజానికి అందజేస్తున్నాయి. అనేక రకాల విషయాలను ప్రతిరోజు ప్రజలకు చేర్చే సమాచార వాహిని దినపత్రిక. పత్రికల్లో సాహిత్య ప్రచురణ అనేది పత్రికల ప్రారంభ కాలం నుండి మనకు కనిపిస్తుంది. సుజన రంజని మొదలుకొని నేటి వరకు పత్రికలు సాహిత్యానికి చోటు కల్పిస్తూ సాహిత్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నాయి. నేడు దినపత్రికలు సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలతో పాటు సాహిత్య సంబంధ అంశాలకు ఒక ప్రత్యేక పుటను కేటాయించి సాహిత్య సంబంధ విషయాలను ప్రచురిస్తున్నారు. దాదాపు అన్ని పత్రికలు వారానికి ఒకరోజు సాహిత్య విషయాలను ఈ పుటల ద్వారా ప్రజలకు అందిస్తున్నారు. సాక్షి 'సాహిత్యం', నమస్తే తెలంగాణ 'చెలిమె', ఆంధ్రజ్యోతి 'వివిధ', నవతెలంగాణ 'దర్వాజ' అని వివిధ రకాల పేర్లతో దినపత్రికల సాహిత్య పుటలు మనకు కనిపిస్తున్నాయి. సాహిత్యపుటల్లో కవిత్వం, సాహిత్య వ్యాసాలు, నూతన పుస్తక పరిచయాలు, సమీక్షలు, సాహిత్య సంబంధ సమాచారాలు వంటి అనేక అంశాలు వెలువడుతున్నాయి. కావున ప్రముఖ దినపత్రికలైన సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య పుటలను పరిచయం చేస్తూ ఆ పుటల్లోని వివిధ ప్రక్రియలకు సంబంధించిన సాహిత్య వ్యాసాలను విమర్శనాత్మక పద్ధతిలో విశ్లేషించడమే ఈ పరిశోధన ప్రధాన ఉద్దేశ్యం. నా ఈ పరిశోధనకు గాను సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్యపుటల్లో 2016, 2017 సంవత్సరాలలో వచ్చిన సాహిత్య వ్యాసాలను స్వీకరించి విమర్శనాత్మక పద్ధతిలో విశ్లేషించాను.

సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య అనుబంధాల గురించి తెలుసుకునే ముందు ప్రచార సాధనమైన పత్రికలు ఆవిర్భావం నుండి నేటి వరకు అనేక మార్పులకు గురవుతూ నిత్య నూతనంగా విలసిల్లుతున్నాయి. కావున ఇటువంటి ప్రసార సాధనాలైన పత్రికల ఆవిర్భావం,

నిర్మాణాలను స్థూలంగా పరిచయం చేస్తూ ప్రస్తుతం వెలువడుతున్న ప్రముఖ దినపత్రికలైన సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల ఆవిర్భావం, వికాసం, వాటి నిర్మాణంలోని ప్రత్యేకతలు అలాగే వాటి సాహిత్య అనుబంధాలు మొదలైన అంశాలను ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

### 1.1. సమాచార వినిమయం

పత్రికల చరిత్ర మొత్తం ముద్రణ యంత్రాల రాక మరియు సమాచార వినిమయంతో ముడిపడి ఉంది. మానవుల మధ్య ఈ సమాచార వినిమయం లేదా మార్పిడి ముద్రణ యంత్రాలు రాకపూర్వం నుండే ఉండేదని అది వారాంతపు సంతల్లో వివిధ రకాల వస్తువుల కొనుగోలుకు వచ్చిన వ్యక్తుల మధ్య జరిగే సంభాషణల్లో సమాచార మార్పిడి జరిగేదని చారిత్రక ఆధారాల వలన తెలుస్తుంది. మొదట మనం సమాచారం మార్పిడి అంటే ఏమిటో చర్చించుకున్నట్లయితే మానవుడు సంఘజీవి. సమాజంలోని తోటి వ్యక్తులకు తన మనోభావాలను వ్యక్తపరచడానికి భాషను సాధనంగా వినియోగించుకుంటాడు. భాష ద్వారా తన మనోభావాలను ఇతరులకు తెలియజేస్తాడు. ఇలా ఒక వ్యక్తి నుండి సమాచారం అనేది మరో వ్యక్తికి అందించబడుతుంది దీన్నే మనం సమాచారం వినిమయంగా పరిగణిస్తున్నాము. ఒక వ్యక్తి తన ఆలోచనలను, మనోభావాలను మరో వ్యక్తికి తెలియజేయడాన్ని మనం సమాచార మార్పిడిగా వ్యవహరిస్తున్నాము.

"ఒక మనిషి లేక వ్యక్తి తన ఆలోచనలను భావాలను అభిప్రాయాలను ఇతరులకు చేరవేయడాన్ని సమాచార చేరవేత (communication) అని అంటారు. సమాచారాల చేరవేతను ఆంగ్లంలో కొందరు ఇలా నిర్వచించారు

Exchange of ideas

Conveyance of information

Interchange of thoughts or opinions

ఈ నిర్వచనాలన్నింటినీ పరిశీలిస్తే ఒక వ్యక్తి నుంచి గానీ ఒక సంస్థ నుంచి గానీ లేదా ఒక ప్రాంతం నుంచి గానీ ఏవైనా విషయాలను లేక సంగతులను ఒక మార్గం (channel) ద్వారా వేరొక వ్యక్తికి గాని వేరొక సంస్థకు గాని లేదా వేరొక ప్రాంతానికి గాని చేరవేయడమే సమాచారాల చేరవేత (communication) అనే విషయం స్పష్టమవుతుంది" (చంద్రశేఖర్,ఎస్జీ.డి.1987. పుట.1&2).

భాష లేని కాలంలో మానవుడు గుర్తుల ద్వారా సమాచారాలను చేరవేసేవాడు తర్వాత మాట్లాడడం నేర్చుకొని భాష ద్వారా సమాచారాలను చేరవేయడానికి అలవాటుపడ్డాడు. ఆ తర్వాత రాత మూలకంగా సమాచారాల్ని చేరవేసేవాడు. మానవమేధస్సు అభివృద్ధి చెందినా కొద్ది పక్షుల్ని,

జంతువుల్ని, చివరకు మనుషుల్ని, సమాచారాల చేరవేతకు సాధనా సామాగ్రిగా ఉపయోగించుకుంటూ వచ్చాడు. ఈ విధంగా ప్రారంభమైన సమాచార మార్పిడి కాలంతో పాటు అనేక పరిణామాలను సంతరించుకుంది. నేడు సమాచార మార్పిడిలో నూతన విధి విధానాలను అవలంబిస్తున్నారు. మానవుడు తన తెలివితేటలను మరింత పెంపొందించుకొని టెలిగ్రాఫ్, టెలిఫోన్, రేడియో, టెలివిజన్ వంటి కొత్త కొత్త పరికరాలు రూపొందించుకుని సమాచారాల చేరవేతను సులభతరం చేసుకున్నాడు. ప్రస్తుతం మనం సమాచారాల చేరవేతకు సాటిలైట్లనే ఉపయోగించుకుంటున్నాము. ఆధునిక ప్రయాణ సాధనాలైన తంతి, తపాలా సౌకర్యాలు లేని కాలంలో భారత దేశంలో వార్తల ప్రసారం జరిగిన విధానం పరిశీలిస్తే చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

“సామ్రాట్ అశోకుడు రాతి పలకల పైన, రాతి స్తంభాల పైన రాజకీయ ప్రకటనలు రాయించి వాటిని రాజ్యంలోని మారుమూల ప్రాంతాల్లో కూడా ప్రతిష్ఠించాడు. తర్వాతి రాజులు కొందరు గోడలపై రంగుల ద్వారా చిత్రలిపి వార్తలు రాసే ఏర్పాటు చేశారు. రోజు వాటిని తుడిచి వేసి తాజా వార్తలు రాసేవారు. వార్తా ప్రసారంలో మొగలాయి రాజుల కాలం ఒక నూతన శకం స్థాపించింది. ఆ కాలంలో వార్త లేఖలు వ్యాప్తిలో ఉండేవి. ప్రతి మండల కేంద్ర నగరంలో వార్తా సేకరణ కేంద్రాలు ఉండేవి. అక్కడ విలేకరులు కూడా ఉండేవారని నికోల మునక్కి అనే యాత్రికుడు రాశాడు. (లక్ష్మణ రెడ్డి, వి. 2002. పుట.9). దీనిని బట్టి చూస్తే ముద్రణ యంత్రాలు రాకపూర్వం నుండే సమాచార వినిమయం అనేది అనేక రకాలుగా జరిగినదనే విషయం మనకు తెలుస్తుంది. ముద్రణ యంత్రాల రాకతో సమాచార మార్పిడి మరింత వేగవంతమైందని చెప్పవచ్చు.

### 1.2. ముద్రణ యంత్రాల ఆవిర్భావం

భారతదేశంలో ఆంగ్లేయుల పరిపాలన వల్ల నష్టాలతో పాటు మనకు కొన్ని లాభాలు కూడా జరిగాయి. వాటిలో ప్రధానంగా ముద్రణా యంత్రాల రాక మరియు వార్తాపత్రికల ఆవిర్భావం వంటివి చెప్పవచ్చు. 19వ శతాబ్దం పూర్వార్ధం భారతదేశ చరిత్రలో చాలా ప్రాముఖ్యాన్ని కలిగి ఉంది. 1800 నాటికి బ్రిటిష్ పాలన ఈ దేశంలో సుస్థిరమైంది. భారతీయ పత్రికా చరిత్రలో కూడా ఈ కాలానిది ఒక మహత్తర అధ్యాయం పత్రికా రంగంలో కొత్త శకానికి ఇది నాంది. ఈ శతాబ్దం ప్రారంభంలోనే భారతీయ భాషా పత్రికలు ఆవిర్భవించాయి. దీనికంతటికీ మూల కారణం భారతదేశంలో ముద్రణ కళ సుస్థిరం కావడం. భారతదేశానికి వ్యాపారం, మత ప్రచారం కోసం వచ్చిన ఆంగ్లేయులకు తమ పరిపాలనను పటిష్టం చేసుకోవడానికి భారతీయ భాషలను

నేర్చుకోవలసిన అవసరం ఏర్పడింది. దీని కోసం వారు స్థానిక భాషలను అభ్యసించి వాటికి ముద్రణా సౌకర్యాలను కల్పిస్తూ వచ్చారు. మొదట ఈ ముద్రణ ఆంగ్లంలోనే కొనసాగించి తర్వాత వివిధ భారతీయ భాషల్లో ముద్రణాశాలలను ప్రారంభించారు. ఈ విధంగా భారతదేశంలో ముద్రణ కళను అభివృద్ధి పరిచారు.

ముద్రణ యంత్రాల ఆవిర్భావ విషయానికి వస్తే "ప్రపంచంలో ప్రాచీన కాలం నుండి అనేక విషయాల్లో ముందడుగు వేసిన చైనా దేశమే కాగితాన్ని కనిపెట్టడంలోనూ తొలిసారి ముద్రణ జరపడంలోనూ అగ్రస్థానం వహించింది. క్రీ.శ.401లో చైనీస్‌లోకి అనువదించబడిన DIAMOND SUTRA అనే గ్రంథం చైనాలో క్రీ.శ.868లో ముద్రితమైంది. ప్రపంచంలో అదే తొలి ముద్రణగా భావించబడుతుంది. ఈ గ్రంథం బ్రిటిష్ మ్యూజియంలో ఉంది. లభిస్తున్న వాటిలో అతి ప్రాచీనమైన ముద్రిత గ్రంథం ఇది. ఐరోపాలో 15వ శతాబ్దం మధ్య ముద్రణ ప్రారంభమైందని చెప్పవచ్చు మన దేశానికి ముద్రణ అక్కడి నుంచే వచ్చింది" (చెన్నయ్య, జె. 2003. పుట. 2).

మొదటి ముద్రణ చైనా దేశస్థులు జరిపిన జర్మనీలోని మెయింజ్‌కు చెందిన జాన్ గూటెన్‌బర్గ్ (1400–1468)ను ముద్రణ కళకు పితామహునిగా భావిస్తున్నారు. జర్మనీలో జాన్ గూటెన్‌బర్గ్ బైబిల్‌ను ముద్రించిన నూరేళ్లకు ముద్రణ మనదేశంలోకి ప్రవేశించింది. ఈ ఘనత క్రైస్తవ మిషనరీలకే దక్కుతుంది. "భారతదేశంలో క్రైస్తవ మత ప్రచారకులే మొట్టమొదట ముద్రణశాలను స్థాపించారు. క్రీ.శ.1556లో జెయింట్ మిషనరీలు గోవాలో ముద్రాశాల నెలకొల్పారు. అక్కడ 'డౌట్రినా క్రిష్టా' అనే గ్రంథం ముద్రించారు. ఇదే భారతదేశంలో ముద్రితమైన మొదటి పుస్తకం అని వి. లక్ష్మణ రెడ్డి అభిప్రాయపడ్డారు (2002. పుట.12). తర్వాత క్రీ.శ.1578లో తిరునల్వేలి జిల్లాలోనూ, క్రీ.శ.1579లో కొచ్చిన్‌లోను, క్రీ.శ.1581లో వైపి కోటలోనూ ముద్రణాశాలలు వెలిశాయి.

క్రీ.శ.1674లో బొంబాయిలో భారతీయుడు మొట్టమొదట ముద్రణశాలను స్థాపించాడు. క్రీ.శ.1767లో చాలా విచిత్రమైన పరిస్థితుల్లో మద్రాస్‌లో ముద్రణశాల స్థాపితమైంది. దక్షిణ భారతదేశంలో 16వ శతాబ్దంలోనే ముద్రణ ప్రారంభమైంది. ఉత్తర భారతదేశంలో 18వ శతాబ్దం వరకు ముద్రణ ప్రారంభం కాలేదు. క్రమంగా ఈ ముద్రణ భారతదేశ నలు మూలలకు వ్యాపించి వికాసం పొందింది. ముద్రణా యంత్రాలు వచ్చాక భారతదేశంలో సమాచార మార్పిడి మరింత వేగవంతమైనదని చెప్పవచ్చు. ఈ విధంగా క్రైస్తవ మిషనరీలు తమ మత ప్రచారం కోసం భారతదేశంలో ముద్రణాశాలలు స్థాపించి, వాటి అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు.

### 1.3. తెలుగులో ముద్రణ యంత్రాల ఆవిర్భావం

తెలుగులో ముద్రణ క్రీ.శ.1806 ప్రాంతంలో మొదలైనా 1830 వరకు అది అభివృద్ధి చెందలేదని తెలుగు భాషకు సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన సి. పి. బ్రౌన్ అభిప్రాయపడ్డాడు. (చంద్రశేఖర్, ఎస్.జి.డి. 1987. పుట. 66). తెలుగు వారి మధ్య కాకపోయినా తెలుగు ముద్రణ 18వ శతాబ్దంలోనే ప్రారంభమైందని చెప్పవచ్చు. క్రీ.శ.1742లో భారతదేశంలో తెలుగు ముద్రణ సౌకర్యాలు లేకపోవడం వల్ల జర్మనీ దేశస్థుడైన బెంజమిన్ షూల్జి అనే క్రైస్తవ మతాచార్యుడు 1746లో నాలుగు తెలుగు పుస్తకాలను జర్మనీ దేశంలోని హాలీ పట్టణంలో ముద్రించారు. కలకత్తా సమీపంలోని సిరాంపూర్‌లో 1812లో మొదట తెలుగు ముద్రణ ప్రారంభమైంది. ఈ ముద్రణాశాలను విలియం కేరి, విలియం వార్డ్ మరియు ఇతర బ్రిటిష్ క్రైస్తవ మిషనరీల సహాయంతో ప్రారంభించారు. సిరంపూర్‌లో పంచానన్ అనే కంసాలి ఉండేవాడు. తెలుగు అచ్చు అక్షరాలను మొట్టమొదట తయారీ చేయడంలో పంచానన్, అతనికి సహాయకుడైన మనోహర్ గణనీయమైన పాత్రను పోషించారు. బెంగాలీ బైబిల్, విలియం కేరి రచించిన తెలుగు వ్యాకరణం సిరంపూర్‌లోనే ముద్రితమయ్యాయి. వీరు దాదాపు 40 సంవత్సరాల పాటు తెలుగు ముద్రణను సిరంపూర్‌లో జరిపారు.

సిరంపూర్ తర్వాత తెలుగు ముద్రణలో చెప్పుకోదగినది మద్రాసు. మద్రాస్ ముద్రణాశాల విచిత్రమైన పరిస్థితిలో ఏర్పడింది. 1761లో బ్రిటిష్ వారు ఫ్రెంచి ఆధీనంలో ఉన్న పాండిచ్చేరిని స్వాధీనం చేసుకొని, అక్కడి గవర్నర్ భవనంలో ఉన్న ముద్రణాశాలను మద్రాస్ కు తెచ్చారు. ఈ విధంగా స్థాపించబడిన మద్రాసు ముద్రణాశాలలో 1779 లో తమిళ–ఇంగ్లీషు నిఘంటువును ముద్రించారు. అలాగే 1816లో ఏ.డి. కాంబెల్ రాసిన తెలుగు వ్యాకరణం, 1817లో విలియం బ్రౌన్ రచించిన తెలుగు వ్యాకరణం ఇక్కడే ముద్రితమయ్యాయి.

మద్రాస్ తర్వాత చెప్పుకోదగినది బళ్లారి. 1825లో ట్రాక్ట్ సొసైటీ వారు బళ్లారిలో ముద్రణాశాలను స్థాపించారు. బళ్లారి వారు 1825–35 మధ్యకాలంలో చిన్నచిన్న కరపత్రాల వంటి వాటిని ప్రచురించేవారు. “మొదటి తెలుగు పత్రిక ‘సత్యదూత’ బళ్లారిలో ముద్రతమయ్యేదంటారు. కొందరు ఈ పత్రిక ఇక్కడ అచ్చయి మద్రాస్ నుంచి ప్రచురితమయ్యేదంటారు. సత్యదూత ప్రతులు ఎక్కడా లభించడం లేదు. కాబట్టి ఇది ఎక్కడ నుంచి ప్రచురితమయ్యేదో చెప్పడం కష్టం” (లక్ష్మణ రెడ్డి, వి. 2002. పుట.19).

బళ్లారి తర్వాత విశాఖపట్నంలో తెలుగు ముద్రణ ప్రారంభమైంది. 1805లో విశాఖపట్నం వచ్చిన లండన్ మిషన్ సొసైటీ వారు ఈ ముద్రణశాలను స్థాపించి క్రైస్తవ బోధనలకు సంబంధించిన అనేక గ్రంథాలను తెలుగులో ప్రచురించారు. పాత నిబంధనను తెలుగులో ముద్రించారు. దీని తర్వాత మచిలీపట్నం, కాకినాడ మొదలైన ప్రాంతాల్లో కూడా తెలుగు ముద్రణాశాలలు ప్రారంభమయ్యాయి.

1830 నుండి తెలుగులో ముద్రణ బహుముఖంగా అభివృద్ధి చెందింది. 1820 నాటికి తెలుగులో పత్రికలు కూడా వెలువడ్డాయి. దక్షిణ భారతదేశంలో 16 వ శతాబ్దంలో ప్రారంభమైన తెలుగు ముద్రణ 19వ శతాబ్దం పూర్వార్ధంలో వికాసం పొందింది. భారతదేశంలో ముద్రణ యంత్రాల రాకతో మానవ మేధో వికాసంతోపాటు సమాచారం మార్పిడి మరింత వేగవంతమైనదని చెప్పవచ్చు.

### 1.4. భారతీయ పత్రికల ఆవిర్భావం–వికాసం

“ముద్రణ యంత్రాలు వచ్చాక భారతదేశంలో వెలువడ్డ మొదటి ముద్రిత వార్తాపత్రిక ‘బెంగాల్ గెజిట్’. దీన్ని ‘కలకత్తా జనరల్ అడ్వర్టయిజర్’ అని కూడా పిలిచేవారు. ఈ పత్రిక మొదటి సంచిక 1780 జనవరి 29వ తేదీన శనివారం నాడు వెలువడింది. ఈ పత్రికను కలకత్తా నుంచి జేమ్స్ ఆగస్టస్ హికీ అనే ఆంగ్లేయుడు ప్రారంభించాడు. ఇది ఒక ఆంగ్ల భాష వార పత్రిక. ఇది రెండు సంపుటాలతో 12 అంగుళాల పొడవు 8 అంగుళాలు వెడల్పు కలిగి ఉండేది. పుటకు మూడు వరుసల చొప్పున అచ్చయ్యేది. హికీ ఒక్కడే వ్యవస్థాపకుడుగా, సంపాదకుడుగా, ముద్రపకుడుగా ఈ పత్రిక నడిచింది. కాబట్టే ఈ పత్రికను ప్రజలు ‘హికీస్ గజెట్’ అని పిలిచేవారు”. (లక్ష్మణ్ రెడ్డి, వి. 2002. పుట. 20).

ఈ పత్రిక కేవలం రెండు సంవత్సరాలు ప్రచురించబడింది. ఈ తక్కువ కాలంలోనే పత్రికా స్వాతంత్ర్యం కోసం పోరాడింది.  దీనిలో వార్తల కన్నా వ్యక్తిగత విమర్శలు ఎక్కువగా ఉండేవి. హికీ ఈ పత్రిక ద్వారా ఈస్ట్ ఇండియా కంపెనీ అవినీతిని, నిరంకుశత్వాన్ని, అలాగే అప్పటి గవర్నర్ జనరల్ అయిన వారన్ హేస్టింగ్స్ అవినీతిని, అన్యాయాన్ని బయట పెట్టారు. దీనివలన 1782 మార్చిలో ప్రభుత్వం హికీ ముద్రణశాలను స్వాధీనం చేసుకొని హికీని దేశం నుండి పంపేశారు.

భారతదేశంలో వెలువడిన రెండవ ముద్రిత వార్తాపత్రిక ఇండియాగజెట్. బెర్నార్డ్ మెస్సినిస్, పీటర్ రీడ్ అనే ఇద్దరు కలిసి 1780లో ఈ పత్రికను స్థాపించారు. ఇది కలకత్తా నుండి వెలువడింది. దీని తర్వాత 1784లో కలకత్తా గజెట్ పేరుతో ఆంగ్ల భాషా వార పత్రిక వెలువడింది.

కలకత్తా నుండి పత్రికలు వెలువడిన తర్వాత భారతదేశంలోని అనేక ప్రాంతాల నుండి పత్రికలు వెలువడ్డాయి. రిచర్డ్ జాన్సన్ సంపాదకత్వంలో 1785లో 'మెద్రాస్ కొరియర్', 1791లో బోయ్డ్ వెలువరించిన హరకారం, బొంబాయి నుంచి 1789లో బాంబే హెరాల్డ్ 1790లో బాంబే కొరియర్, 1791లో బాంబే గజట్ మొదలైన పత్రికలు ఆవిర్భవించాయి.

ఈ విధంగా 1780 నుండి 1813 వరకు ప్రచురితమైన పత్రికలన్నీ ఆంగ్ల పత్రికలే. 18వ శతాబ్దంలో పత్రికా నిర్వహణ మొత్తం ఆంగ్లేయుల అధికారంలోనే ఉండేది. కావున ఈ పత్రికలు భారతీయులకు సంబంధించిన విషయాలను అంతగా ప్రచురించకపోయేవి. వ్యాపార ప్రకటనల వంటివి మాత్రమే భారతీయ భాషల్లో ఉండేవి. ఈ కారణంగానే భారత దేశంలో 1816లో భారతీయ భాషా పత్రికలు ఆవిర్భవించాయి.

"భారతీయ భాషల్లో వెలువడిన మొదటి పత్రిక 'బెంగాల్ గజట్'. క్రీ.శ.1816లో గంగాధర భట్టాచార్య 'బెంగాల్ గజెట్' అనే వంగ భాషా పత్రిక స్థాపించాడు. ఇదే భారతీయుడు స్థాపించిన తొలి పత్రిక. మొదటి దేశ భాషా పత్రిక కూడా ఇదేనని లక్ష్మణ రెడ్డి, వి. (2002. పుట. 24) తెలుపగా, తిరుమల రామచంద్ర "భారతదేశంలో వెలువడిన తొట్టతొలి పత్రిక దిగ్దర్శన్". ఇది మార్షమెన్ సంపాదకత్వాన1818 లో వంగరాష్ట్రంలో శ్రీరాంపూర్‌లో అవతరించిందని పేర్కొన్నారు" (రామచంద్ర, తిరుమల. 1992. పుట. 1).

రాజా రామ్మోహన రాయ్ 1821లో 'సంవాద కౌముది' అనే వంగ భాషా వారపత్రిక స్థాపించారు. దీనిలో సంఘసంస్కరణకు సంబంధించిన ఆలోచనాత్మకమైన వ్యాసాలు సంపాదకీయాలను ప్రచురించేవారు. 1822లో ఫర్దూన్జి మర్జబాన్ 'ముంబాయి – నా సమాచార్' అనే గుజరాతి వార పత్రిక స్థాపించారు. ఈ పత్రిక 1832లో దినపత్రికయింది. 'బాంబే సమాచార్' బతికి ఉన్న దేశభాషా పత్రికల్లో అతి ప్రాచీనమైందంటారు. "1826లో యుగల్ కిషోర్ శుక్లా కలకత్తా నుండి 'ఉదంతా మార్తాండ్' పత్రికను వెలువరించారు. ఇది హిందీలో మొదటి పత్రిక" (లక్ష్మణ రెడ్డి, వి. 2002. పుట. 27).

ఈ విధంగా 1780 నుండి 1830 వరకు ఉన్న ఈ కాలాన్ని పత్రికల ఆరంభ కాలంగా చెప్పవచ్చు. ఈ కాలంలో భారతదేశంలో ముద్రణాశాలలు ఆంగ్లంలోనూ, ఇతర భారతీయ భాషల్లోనూ వెలువడ్డాయి. కావున ఆంగ్లో – ఇండియన్ పత్రికలే అధికంగా వెలువడ్డాయి. ఈ పత్రికలన్నీ రాజధాని నగరాలైన కలకత్తా, బొంబాయి, మద్రాసులలోనే కేంద్రీకృతమయ్యాయి" (చంద్రశేఖర్, ఎస్జీ.డి. 1987. పుట. 52). 1816లో వంగ భాషలో ప్రారంభమైన భాషా పత్రికలు

1830 నాటికి తెలుగు భాషలోకి ప్రవేశించాయి. 1830 నాటికి తెలుగు ముద్రణ ఎంతగానో అభివృద్ధి చెందింది.

### 1.5. తెలుగు పత్రికల ఆవిర్భావం—వికాసం

తెలుగులో వెలువడిన మొదటి పత్రిక ఏది అనేది వివాదాస్పదమైన విషయం. దాని గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. తొలి తెలుగు పత్రిక సత్యదూత అని అది 1835 ప్రాంతంలో వెలువడిందని నిడదవోలు వెంకటరావు, నార్ల మొదలైన వారు ఊహించారు. ఇది మద్రాసులో ముద్రితమై బళ్లారి క్రైస్తవ సంఘం వారిచే ప్రచురించబడేదంటారు. కానీ ఆధారాలు దొరకడం లేదు. మిషనరీ రికార్డుల్లో ట్రూత్ ఫుల్ మెసెంజర్ అనే పత్రిక తమిళ ప్రతిని గురించి ప్రస్తావన ఉంది. ఈ శీర్షికను తెలుగులోకి అనువదిస్తే సత్యదూత అవుతుంది. దీన్నిబట్టి తెలుగులో కూడా అలాంటి పత్రిక వెలువడి ఉండవచ్చునని బహుశా మన పండితుల ఊహ కావచ్చు. దీని ప్రతులు లభించడం లేదని లక్ష్మణరెడ్డి అభిప్రాయపడ్డారు (2002. పుట. 28).

"బంగోరె మరియు డాక్టర్ జి.యన్.రెడ్డిల పరిశోధనల ప్రకారం తొలి తెలుగు పత్రిక కర్నాటిక్ క్రానికల్. ఇది మద్రాసు నుండి వెలువడేది కానీ దీనికి సంబంధించిన ప్రతులు ఏవి దొరకలేదని తిరుమల రామచంద్ర పేర్కొన్నారు (రామచంద్ర, తిరుమల.1992.పుట.2). లభిస్తున్న ఆధారాలను బట్టి తెలుగులో వెలువడిన మొదటి పత్రిక వృత్తాంతి. ఈ పత్రిక ప్రతులు లభించలేదు కానీ గిడుగు రామ్మూర్తి తన గద్య చింతామణిలో వృత్తాంతి పత్రికలో అచ్చయిన ఒక జాబు గురించి ప్రస్తావించడం వల్ల ఈ పత్రిక 1838లో మద్రాసు నుంచి ప్రారంభమైందని సంపాదకులు మండిగల వెంకట్రామయ్య శాస్త్రి అని, 1843 నాటికి పత్రిక ఆగిపోయిందని తెలుస్తుంది. "లోక వ్యాపారములను తెలియజేయడం వృత్తాంతి పత్రిక ప్రయోజనమని ఈ పత్రిక సంపాదకులు వర్తమాన తరంగిని పత్రికకు రాసిన జాబు వల్ల తెలుస్తుంది. నీలగిరి చరిత్ర లాంటి రచనలు ఈ పత్రికల్లో ప్రచురించారు. ఈ పత్రిక బ్రిటిష్ ప్రభుత్వానికి విధేయత ప్రకటించిన హిందువులు క్రీస్తు మత ప్రవిష్టులు కావటాన్ని వ్యతిరేకించింది" (లక్ష్మణ రెడ్డి, వి. 2002. పుట.30).

మొదటి పత్రిక ఏది అన్న అంశాన్ని పక్కన పెడితే 1835 నుంచి మనకు తెలుగు భాషలో పత్రికలు లభిస్తున్నాయని చెప్పవచ్చు. 1835 తర్వాత వృత్తాంతి (1841), వర్తమాన తరంగిణి (1842), హితవాది (1848), సంవాదకౌముది (1952), దినవర్తమాని (1855), శ్రీ యక్షిణి (1863), సుజనరంజని (1864), తత్వబోధిని (1864), ఆంధ్ర భాషా సంజీవని (1871),

పురుషార్థ ప్రదాయిని (1972) వంటి అనేక పత్రికలు వెలుపడ్డాయి. ఇలా తెలుగు పత్రిక ఆరంభంలో చినుకు చినుకుగా ప్రారంభమై రానురాను వేగాన్ని పుంజుకుంది.

160 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న తెలుగు పత్రికలు మొదట దినపత్రికలుగా వెలువడలేదు. ఇవి మొదట పక్ష, వార, మాస పత్రికలుగా వెలువడి తర్వాత కాలంలో దినపత్రికలుగా రూపొందాయి. 20వ శతాబ్దం ప్రారంభంలో పత్రికారంగం మరింత అభివృద్ధి చెంది దినపత్రికలు వెలువడటం ప్రారంభమైంది.

### 1.6. తెలుగు దినపత్రికల ఆవిర్భావం

రోజువారి సమాచారాన్ని అందించే ప్రచార సాధనమే దినపత్రిక. దినపత్రిక అంటే నేటి పత్రిక అని అర్థరూఢి అయిపోయింది. "దినపత్రిక అంటే దైనందిన వార్తలను ఎప్పటికప్పుడు పాఠకులకు అందించడమే ప్రధాన వ్యాపకంగా పెట్టుకున్న పత్రిక అంటే ప్రధానంగా అది వార్తాపత్రిక అని శ్రీ నండూరి రామమోహనరావు తెలుగు పత్రికలలో నూతన ప్రయోగాలు, పరిణామాలు" అనే వ్యాసంలో పేర్కొన్నారు (రామమోహనరావు, నండూరి. 1991. పుట. 3).

20వ శతాబ్దంలోనే ప్రప్రథమంగా దినపత్రికలు వెలిశాయి. ప్రజలకు రోజు వారి సమాచారాన్ని అందుబాటులోకి తేవాలనే అవసరం దినపత్రికల ఆవిర్భావానికి దారితీసింది. అయితే తెలుగులో మొదటి దినపత్రిక ఏది? అనే అంశం కూడా వివాదాస్పదమైనదే. మొదటి తెలుగు పత్రిక ఆంధ్ర పత్రిక అని కొందరు, 'దేశాభిమాని' అని మరికొందరు వారి వారి అభిప్రాయాలు తెలిపారు. ఇప్పటివరకు లభించిన ఆధారాలను బట్టి తెలుగులో వెలువడిన మొదటి దినపత్రిక 'దేశాభిమాని'. దీనిని దేవగుప్తం శేషాచలపతిరావు స్థాపించారు. ఈ పత్రిక కొంతకాలం బెజవాడ నుండి మరికొంత కాలం గుంటూరు నుండి కృష్ణ వృత్తాంతిని, కృష్ణా న్యూస్ అనే పేర్లతో వెలువడింది. తర్వాత ఈ పత్రికనే దేశాభిమానిగా మార్చి తెలుగు, ఇంగ్లీషు ద్విభాషా పత్రికగా ప్రచురించేవారు. ఇది మొదట పక్షపత్రికగా ప్రారంభమై కొంతకాలం వార పత్రికగా, మరికొంత కాలం ద్వైవార, త్రైవార పత్రికగా నడిచి దినపత్రికగా మారి 30 సంవత్సరాలకు పైగా వెలువడింది. 1887లో స్థాపించబడిన ఈ పత్రిక 1906లో దినపత్రికగా మారింది. ఈ పత్రికను స్థాపించిన దేవగుప్తం శేషాచలపతిరావు తొలి తెలుగు పత్రికా సంపాదకుడనే కీర్తి పొందారు.

1894లో గట్టుపల్లి శేషాచార్యులు సంపాదకత్వంలో మద్రాసు నుండి శశిలేఖ పత్రిక వెలువడింది. దీనికి గట్టుపల్లి శేషాచార్యులతో పాటు నేలటూరి పార్థసారథి సంపాదకులుగా ఉన్నారు. బోయరు యుద్ధ సమయంలో దీనికి బాగా ఆదరణ లభించింది. తెలుగు పాఠకులకు

యుద్ధ వార్త పఠనాభిలాష కల్పించిన పత్రిక ఇది. ఆంధ్రోద్యమానికి ఎంతగానో తోడ్పడింది. ఈ పత్రిక మొదట వారపత్రికగా ప్రారంభమై, కొంతకాలం ద్వైవార పత్రికగా నడిచి దినపత్రికగా మారింది. చివరకు వారపత్రికగా మారి అంతరించిపోయింది. 1908లో రాజమహేంద్రవరం నుండి శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి సంపాదకత్వంలో గౌతమి దినపత్రిక వెలువడింది. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు 1908 సెప్టెంబర్ 9న బొంబాయిలో ఆంధ్ర పత్రికను వారపత్రికగా స్థాపించారు. 1914 ఏప్రిల్ 1న ఆంధ్ర పత్రికను బొంబాయి నుండి మద్రాస్ కు తీసుకొనివచ్చి దినపత్రికగా వెలువరించారు. ఇదే తెలుగులో వెలువడ్డ మొదటి దినపత్రిక అనే అభిప్రాయం వాడుకలో ఉంది.

మొదటి దినపత్రిక ఏది అనే అంశం గురించి భిన్నాభిప్రాయాలు కనిపిస్తున్నాయి. మొదటి దినపత్రిక అనే అంశాన్ని విడిచిపెడితే మొదట వార, మాస పత్రికలుగా ఉండి తర్వాత దినపత్రికలుగా మారినవే మనకు కనిపిస్తున్నాయి. ఇవే కాకుండా 20వ శతాబ్దంలో అనేక నూతన పత్రికలు వెలువడ్డాయి. తెలుగులో దినపత్రికలుగా ప్రారంభమై కొంతకాలం నడిచి ఆగిపోయిన పత్రికలు, తక్కువ స్థాయిలో కూడా కొన్ని దశాబ్దాలుగా నడుస్తున్న పత్రికలు అనేకం ఉన్నాయి.

తెలుగులో 1914 ఆంధ్ర పత్రిక మొదలుకొని జనవాణి (1935), ఆంధ్రప్రభ (1938), తెలంగాణ (1945), ఆంధ్రజ్యోతి (1960), ఆంధ్రభూమి (1960), ఈనాడు (1974), ఉదయం (1984), వార్తా (1996), సూర్య (2007) సాక్షి (2008), నమస్తే తెలంగాణ (2011) వంటి అనేక దినపత్రికలు వెలుపడ్డాయి. ఇంకా వెలువడుతూనే ఉన్నాయి. నేడు అనేక దినపత్రికలు ఉన్నప్పటికీ ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, సాక్షి, నమస్తే తెలంగాణ, నవతెలంగాణ వంటి పత్రికలు రాష్ట్రవ్యాప్త ప్రచారం కలిగి పెద్ద పత్రికలుగా చెలామణి అవుతున్నాయి.

### 1.7. తెలుగు దినపత్రికల నిర్మాణం

మారుతున్న కాలానికనుగుణంగా శాస్త్ర సాంకేతికాభివృద్ధి చెందిన ఈ కాలంలో అనేక రకాల పత్రికలు వెలువడుతున్నాయి. ప్రారంభ దశలోని పత్రికలకు, సాంకేతికాభివృద్ధి జరిగిన తర్వాత వెలువడుతున్న నేటి పత్రికలకు నిర్మాణపరంగా ఎన్నో వైవిధ్యాలున్నాయి. 1980 నుంచి ప్రపంచవ్యాప్తంగా సమాచార రంగంలో అనేక విప్లవాత్మక మార్పులొచ్చాయి. ఈ విప్లవం తెలుగు జర్నలిజం పైన కూడా తన ప్రభావాన్ని చూపింది. పాత ప్రింటింగ్ పద్ధతుల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. శాటిలైట్ల ద్వారా వార్తల కమ్యూనికేషన్, కలర్ ప్రింటింగ్ వంటి ఎన్నో అధునాతన పద్ధతులు తెలుగు పత్రికారంగంలో ప్రవేశించాయి. శాస్త్ర, సాంకేతికాభివృద్ధి చెందిన ఈ

కాలంలో అన్నిరకాల పత్రికల ముద్రణ జరుగుతుంది. కొత్త హంగులతో ఆకర్షణీయంగా, వినూత్నంగా పేజీల అమరికలు చోటు చేసుకున్నాయి. సర్క్యులేషన్ కోసం పోటీ పెరుగుతుంది.

దేశ, రాష్ట్ర, స్థానిక అవసరాలకనుగుణంగా సమాచారాన్ని అందించే వార్తల ప్రచురణ తప్పనిసరిగా మారింది. పత్రికల ప్రారంభ దశలో కేవల రాజకీయ, సమాచార వార్తలు మాత్రమే ప్రధానంగా ప్రచురించేవారు. ఈ పాతపద్ధతి పోయి నేడు పాఠకుడిని మరింత ఆకర్షించడానికి రాజకీయ వార్తలతో పాటు జిల్లా ఎడిషన్లు, సాహిత్యం, మహిళ, విద్యా, ఉద్యోగం, వైద్యం, యువత, ఫ్యాషన్ వంటి తదితర అంశాలతో రోజుకో ప్రత్యేక పేజీ, ప్రతిరోజు షేర్లు, బిజినెస్ సమాచారం, ఆదివారం ప్రత్యేక అనుబంధం మొదలైనవి పత్రికా రంగంలో చోటుచేసుకున్న నూతన పరిణామం. ఈ లక్షణాలు నేడు అన్ని పత్రికల్లోనూ కనబడుతున్నాయి. అన్నింట ఆధునికతను ఆహ్వానిస్తూ నేడు ప్రపంచంలో ఏ ఇతర భాషా పత్రికా రంగానికి తీసిపోని విధంగా నేటి తెలుగు పత్రికారంగం అభివృద్ధి దిశలో పయనిస్తుందని చెప్పవచ్చు. ఈ విధమైన ప్రత్యేకతలు నేడు మనకు సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లో కూడా కనిపిస్తున్నాయి.

## 1.8. సాక్షి దినపత్రిక పరిచయం

ప్రస్తుతం వెలువడుతున్న తెలుగు దినపత్రికల్లో సాక్షి పత్రిక ప్రముఖమైనది. సాక్షి తెలుగు దినపత్రిక మార్చి 24, 2008 న 23 ఎడిషన్లుగా రూపొందింది. అమెరికాకు చెందిన మారియో గార్సియో ఈ పత్రికకు రూపకల్పన చేశాడు. జగతి పబ్లికేషన్స్‌లో భాగంగా ఈ పత్రిక పనిచేస్తుంది. తెలుగు దినపత్రిక రంగంలో మొదటిసారిగా అన్ని పేజీలు రంగుల్లో ముద్రితమయ్యాయి. దీనికి అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై. యస్. రాజశేఖర్ రెడ్డి కుమారుడు వై. యస్. జగన్ మోహన్ రెడ్డి ప్రధాన సంపాదకుడుగా, సజ్జల రామకృష్ణారెడ్డి సంపాదకీయ సంచాలనుకునిగా, కె.ఎన్.వై. పతంజలి వ్యవస్థాపక సంపాదకునిగా ఈ పత్రిక మొదలైంది. పతంజలి అకాల మరణంతో వర్ధెల్లి మురళి సంపాదకునిగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఎడిటోరియల్ డైరెక్టర్‌గా కె. రామచంద్ర మూర్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అప్పటికే మనుగడలో ఉన్న పత్రికలకు భిన్నంగా 22 ప్రచురణ కేంద్రాల నుండి ఒకేసారి ఈ పత్రిక ప్రారంభించి కోట్లలో సర్క్యులేషన్ ప్రకటించింది.

### 1.8.1. సాక్షి దినపత్రిక ఆవిర్భావం–రాజకీయ నేపథ్యం

సాక్షి దినపత్రిక మార్చి 24, 2008న 23 ఎడిషన్లుగా ప్రారంభమైంది. ఇది కేవలం సమాచార వాహినిగా ఏర్పడ్డ పత్రిక మాత్రమే కాదు. దీనిని స్థాపించడానికి ప్రధాన కారణం, లక్ష్యం రెండు ఉన్నాయి. ఈ పత్రిక స్థాపన వెనుక ఒక రాజకీయ నేపథ్యం కూడా ఉంది అని ఎడిటోరియల్

డైరెక్టర్ కె. రామచంద్ర మూర్తి ఈ విధంగా వివరించారు వై.యస్. రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ నాయకుడిగా ఉన్నప్పుడు, అంటే ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గానీ, పిసిసి ప్రెసిడెంట్ గా ఉన్నప్పుడుగానీ (1984–85లో ఎన్టీఆర్ గెలిచినప్పుడు వై.ఎస్.ఆర్. పి.సి.సి. ప్రెసిడెంట్‌గా ఉన్నారు. అలాగే 1999లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయినప్పుడు ఆయన పి.సి.సి. ప్రెసిడెంట్‌గా ఉన్నారు) అప్పుడు గానీ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు గానీ, 2003లో పాదయాత్ర 2004లో ముఖ్యమంత్రిగా ఎన్నికైనప్పుడు గానీ, తెలుగులో ఉన్న ప్రధానమైన రెండు పత్రికలు ఈనాడు, ఆంధ్రజ్యోతి తన గురించి పనికొట్టుకుని వ్యతిరేకంగా రాస్తున్నాయని తన అసంతృప్తిని బాహటంగా వ్యక్తపరిచేవారు.

ఆయన ఢిల్లీలో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడినా, హైదరాబాద్‌లో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడినా, శాసనసభలో మాట్లాడినా, ఈ రెండు పత్రికలు తన గురించి కావాలని వ్యతిరేక వార్తలు ప్రచురిస్తున్నాయని పేరు పెట్టి చెప్పేవారు. ఇవి కావాలనే తనకు వ్యతిరేకంగా రాస్తున్నాయని బలంగా వై.ఎస్.ఆర్. నమ్మినారు. ఆ రెండు పత్రికలు ఒకే సామాజిక వర్గానికి చెందినవి. కావున పత్రికా పరంగా, రాజకీయపరంగా, సామాజిక పరంగా ఆ వర్గానికే మద్దతునిస్తాయనే అభిప్రాయం ఆయనది. ఆ అభిప్రాయం బలపడి దీనికి ఏదైనా విరుగుడు సాధించాలని ఉద్దేశంతో కనబడని మరో కోణాన్ని ప్రజలకు చూపించడం కోసమే ఈ పత్రికను స్థాపించానని, పత్రిక ప్రారంభించినప్పుడు వై.ఎస్.ఆర్. చెప్పుకున్నారు. తన గురించి తన ప్రభుత్వం గురించి చెడుగా రాస్తున్నారని, తన సంక్షేమ కార్యక్రమాల ప్రస్తావనే లేకపోవడంతో ఈ పత్రిక వారు ఏకపక్షంగా వార్తలను ప్రచురిస్తున్నారు. ప్రభుత్వానికి ఏకపక్షంలో కాకుండా ప్రజల వద్దకు రాకుండా ఉండిపోతున్న ఇంకో పార్శ్వాన్ని బయటకు తీయాలని ఆలోచించారు. ఆ పత్రికలో నాణెముకి ఒకవైపు మాత్రమే ప్రచురిస్తున్నారని, వారు చూపించని మరొక కోణం ఎలాగైనా ప్రజలకు తెలియపరచాలన్న ఆలోచనతో తనవైపు కథనం కూడా ప్రజలకు తెలియాలని తనకి కూడా ఒక మీడియా వ్యవస్థ, వార్తాపత్రిక ఉండాలని భావించారు. అప్పటి వారి ఆలోచన ఫలితమే సాక్షి పత్రిక స్థాపనకు కారణమైంది"(కె. రామచంద్ర మూర్తి, ఇంటర్వ్యూ. అను.1).

వై.ఎస్.ఆర్. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బెంగుళూరు కేంద్రంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న తన కొడుకు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అధ్యక్షునిగా, జగతి పబ్లికేషన్స్ అనే ఒక సంస్థను ఏర్పాటు చేసి, దాని తరఫున సాక్షి పత్రికను మార్చి 24, 2008న ప్రారంభించారు. అలాగే ఇందిరా

టెలివిజన్ పేరుతో మరొక సంస్థను ఏర్పాటు చేసి సాక్షి టీవీని ప్రారంభించారు. 2008లో సాక్షి పత్రిక, 2009లో సాక్షి మీడియా ఏర్పడింది.

### 1.8.2. సాక్షి దినపత్రిక–ప్రత్యేకతలు

బెంగుళూరు కేంద్ర వ్యాపారాలు నిర్వహిస్తున్న వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి కుమారుడు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి మార్చి 24, 2008న హైదరాబాద్ కేంద్రంగా సాక్షి దినపత్రికను ప్రారంభించారు. 22 ప్రచురణ కేంద్రాలనుండి 23 ఎడిషన్లుగా జగతి పబ్లికేషన్ పేరు మీద ఇది వెలువడుతుంది. దీని ఆవిర్భావం పత్రిక రంగంలోనే ఒక సంచలనం. అన్ని పుటలు రంగులలోనే రావడం దీని ప్రత్యేకత. ఈ పత్రిక మొదట్లో అన్ని పత్రికల కన్నా ఎక్కువ పేజీలతో, అన్ని పత్రికల కన్నా తక్కువ ధరతో వెలువడింది. ప్రస్తుతం అన్ని పత్రికల ధరలాగే ఈ పత్రిక కూడా వస్తుంది. ప్రారంభమైన అనతి కాలంలోనే విశేష పాఠకాదరణ పొంది ప్రస్తుతం సర్క్యులేషన్‌లో ప్రథమ స్థానంలో ఉంది.

22 ప్రచురణ కేంద్రాల నుండి 23 ఎడిషన్లుగా ఒకేసారి ఒకేరోజు అన్ని పేజీలు రంగుల్లో ప్రచురించబడిన ఏకైక పత్రికగా సాక్షి చరిత్రలో నిలిచిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా 19 ఎడిషన్లు, నాలుగు మెట్రో నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగుళూరు, చెన్నైలో నుండి కూడా ఇది వెలువడుతుంది. 1974లో విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభమైన ఈనాడు పత్రిక క్రమంగా హైదరాబాద్, విజయవాడ, తిరుపతి ఇలా వివిధ కేంద్రాలకు విస్తరించుకుంటూ వెళ్ళింది. మొదటి నుండి సాక్షి పత్రిక ఈనాడుకు గట్టి పోటీగా నిలిచింది. 1974లో ప్రారంభమైన ఈనాడు 1984లో నెంబర్ వన్‌గా మారిపోయింది. కనుక దీనికి ధీటుగా ఉండాలంటే ఈనాడుకు ఎన్ని ఎడిషన్స్ ఎక్కడెక్కడ ఉన్నాయో అదే ప్రాంతాల్లో సమానమైన ఎడిషన్లతో ఈనాడుకు గట్టి పోటీతో దీనిని ప్రారంభించారు. తెలుగు పత్రికా రంగంలోనే ఒక సంచలనం సృష్టించారు. అప్పటివరకు వెలువడుతున్న పత్రికలలా కాకుండా సాక్షి పత్రిక తనదైన ప్రత్యేక పేజీ డిజైన్‌తో వినూత్న కాలమ్స్‌తో విశేష పాఠకాదరణ పొందింది.

సాక్షి పత్రిక ప్రత్యేకతల్లో ప్రధానంగా చెప్పుకోదగింది దీని రూపకల్పన. బ్రిటిష్ కు చెందిన అంతర్జాతీయ డిజైనర్ మారియో గార్సియోతో పత్రిక రూపకల్పన చేయించారు. ప్రపంచ ప్రఖ్యాత న్యూస్ డిజైనర్‌తో రూపకల్పన పొందిన మొదటి తెలుగు పత్రిక ఇది. వార్తల ప్రెసెంటేషన్‌లో గాని రంగుల పొందికలో తనదైన ప్రత్యేకత నిరూపించుకుంటూ, ఈనాడు ఉండగా మరొక పత్రికను ఆదరిస్తారా? అనే అనుమానాలకు తెర దించుతూ తన పాఠకవర్గాన్ని ఏర్పరుచుకుంది. అనతి కాలంలోనే 11 లక్షల సర్క్యులేషన్‌తో ముందంజలో నిలబడింది. ఇండియన్ రీడర్‌షిప్ సర్వే

(IRS) 2022 ప్రకారం 10,02,585 మంది రీడర్‌షిప్ (TR)తో అత్యధికంగా ప్రచురణ చేయబడిన భారతీయ భాషా దినపత్రికల్లో సాక్షి 12వ స్థానంలో ఉంది.

### 1.8.3. సాక్షి దినపత్రిక–లక్ష్యాలు

రాజకీయ అవసరాల అనివార్యతల్లోంచి ప్రారంభమైన పత్రిక సాక్షి. ప్రభుత్వాన్ని ఏకపక్షంగా కాకుండా నాణానికి రెండు పార్శ్వాలను ప్రజల దగ్గరికి తీసుకెళ్లాలనే ప్రధాన లక్ష్యంగా ఏర్పడింది. సాక్షి పత్రిక రాజకీయ అవసరాల నుండి ఆవిర్భవించిన ప్రజాహితమే ప్రధాన లక్ష్యంగా కొనసాగుతుంది" (రామచంద్ర మూర్తి, కె.ఇంటర్వ్యూ. అను.1). మారుతున్న కాలానికి అనుగుణంగా పత్రిక డిజైన్‌లోను ప్రత్యేక పేజీల రూపకల్పనలో నూతన విధి విధానాలను అవలంబిస్తూ ప్రజాహితమే ప్రధాన లక్ష్యంగా రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలను ప్రచురిస్తుంది. రాజకీయ అంశాలకన్నా ఎక్కువగా సామాజిక చైతన్యానికి ప్రాధాన్యతనిస్తూ స్త్రీ సాధికారత, దళితుల అభ్యున్నతి, మానవ హక్కుల పరిరక్షణ, విద్య, వైద్యం, సంక్షేమ సంబంధ వార్తలు వంటి అనేక సామాజిక అంశాలను ప్రచురిస్తూ, ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్య పరచడమే ధ్యేయంగా కొనసాగుతుంది. పాఠకుల అభిరుచికి తగిన వార్తలను ప్రచురిస్తూ, సమకాలీన సమాజాన్ని ఎప్పటికప్పుడు పాఠకలోకానికి అందిస్తుంది. వార్తా రచనలో ప్రామాణిక భాషను వినియోగిస్తూ అన్ని ప్రాంతాల ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో వార్తా ప్రచురణ ఉంది. అన్ని రకాల వార్తలను రాజకీయ, క్రీడా, సినిమా, విద్య వంటి అనేక అంశాలను ప్రచురిస్తుంది. వై.యస్. జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రారంభమైనప్పటికీ అన్ని రకాల పార్టీల సమాచారంతోపాటు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ విషయాలను ప్రచురించడంలో సాక్షి ప్రత్యేకతను చాటుకుంటున్నది. సమగ్ర వార్తాపత్రిక అనే అభిప్రాయం కల్పించాలనే లక్ష్యంతో సాక్షి దినపత్రిక ముందుకు సాగుతుంది.

### 1.8.4. సాక్షి దినపత్రిక–అనుబంధ పత్రికలు

మార్చి24, 2008లో ఏర్పడ్డ సాక్షి పత్రిక 23 ఎడిషన్లకు అనుబంధంగా సాక్షి ఇంటర్నెట్ ఎడిషన్ వెలువడింది. మందలపర్తి కిషోర్ వ్యవస్థాపక సంపాదకునిగా విశ్వవ్యాప్త పాఠకుల కొరకు ఇది అందుబాటులోకి వచ్చింది. అలాగే సాక్షి పత్రిక స్థాపించిన ఏడాదికి 2009 మార్చిలో సాక్షి టీవీ కూడా అధునాతన టెక్నాలజీతో ప్రసారాలను ప్రారంభించింది. దీని తర్వాత సాక్షి డిజిటల్ వచ్చింది. సాక్షి.కామ్, సాక్షి పోస్ట్, సాక్షి సమాచార్ (ఇంగ్లీష్, తెలుగు, హిందీ మూడు భాషల్లో ఉంది), ఆ తర్వాత సాక్షి ఎడ్యుకేషన్ పోర్టల్, ఈవెంట్ పోర్టల్ వంటి అనేక శాఖలుగా విస్తరిస్తూ వస్తుంది.

జర్నలిజం పట్ల ఆసక్తిగల యువతకు అవకాశం కల్పించడానికి సాక్షి జర్నలిజం స్కూల్ కూడా నెలకొల్పారు. ఏ పత్రికకు తీసిపోని విధంగా విద్యార్థుల కోసం సాక్షి విద్య పేరుతో ప్రతి గురువారం కెరియర్ పై ప్రత్యేక సంచిక 'సాక్షి భవిత'ను వెలువరిస్తున్నారు. ప్రతి ఆదివారం మిగతా పత్రికల వలె సాక్షి 'ఫన్ డే' పేరుతో ఆదివార అనుబంధం వెలువడుతుంది. మిగతా పత్రికల మాదిరి క్రీడలు, సినిమా, సాహిత్యం, ఆర్థిక విషయాలు, అంతర్జాతీయ, జాతీయ విషయాల కోసం ప్రత్యేక పుటలు వెలువడుతున్నాయి. "ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాన్ని ప్రాతిపదికగా చేసుకొని జిల్లా టాబ్లాయిడ్‌కి అదనంగా కమ్యూనిటీ పేజీల ప్రత్యేక ఫుల్‌అవుట్‌ను సాక్షి వెలువరించింది. అట్టడుగు స్థాయి వరకు ప్రజల సమస్యలను వెలికి తీయడం వాటికి పరిష్కారాలు కనుగొనడం ఈ కమ్యూనిటీ పేజీల ప్రధాన లక్ష్యం. ఆర్థికంగా భారం కావడంతో ప్రత్యేక ఫుల్‌అవుట్‌ను ఉపసంహరించి జిల్లా అనుబంధంలోనే రెండు పేజీలను కమ్యూనిటీకి కేటాయిస్తున్నారు. ఆ తర్వాత కమ్యూనిటీ పేజీలను పూర్తిగా ఉపసంహరించారు" (చక్రధర్, గోవిందరాజు.2014. పుట.82).

మిగతా పోటీ పత్రికలకు తీసిపోకుండా వార్తను ప్రచురించడంతోపాటు వార్తల నాణ్యతను పరీక్షించాల్సి ఉంటుంది కాబట్టి ఏయే వార్తలను ప్రచురించాము, వేటిని ఇవ్వలేకపోయాము, అనే సమీక్షతోపాటు వార్తారచనా, విషయ నివేదిక, ప్రాధాన్య నిర్దేశాల్లో జరిగిన పొరపాట్లను సమీక్షించడానికి ప్రత్యేకించి 'క్వాలిటీ సెల్' కూడా పనిచేస్తుంది. ఈ సెల్ లోని జర్నలిస్టులు వివిధ ప్రచురణ కేంద్రాల నుంచి వెలువడుతున్న పత్రికలను పరిశీలించి ఏ రోజుకారోజు లోపాలపై నివేదికను సమర్పిస్తారు. దీనితో పాటు 'మనస్సాక్షి' పేరుతో నెలకోసారి 'హౌస్ జర్నల్'ను కూడా క్వాలిటీ సెల్ ప్రచురిస్తోంది. ఈ విధంగా 2008లో తెలుగు దినపత్రికగా ప్రారంభమైన సాక్షి పత్రిక అనేక శాఖలుగా విస్తరిస్తూ పత్రిక రంగంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటుంది.

### 1.8.5. సాక్షి దినపత్రిక–అవార్డులు

సాక్షి దినపత్రిక తరపున 2014 నుండి ప్రతి సంవత్సరం 'సాక్షి ఎక్స్‌లెన్షియా' పేరుతో వార్షిక అవార్డులను అందజేస్తున్నారు. సాక్షి మీడియా గ్రూప్ చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రయత్నం ఇది. నేటి యువతకు రోల్ మోడల్స్‌ను అందజేయడం ఈ అవార్డుల ప్రధాన లక్ష్యం. యువతకు స్ఫూర్తిదాయకమైన ప్రమాణాలను నిర్దేశించడం భవిష్యత్తులో వారు గొప్ప విజయాలు సాధించేందుకు చక్కని ఉత్ప్రేరకంగా నిలవడం దీని ఉద్దేశం. ఆంధ్రప్రదేశ్/తెలంగాణ ప్రాంతంలో స్వచ్ఛంద సేవ, విద్య, వ్యవసాయం, క్రీడలు, వినోదం, సామాజిక రంగాల్లో సమాజానికి సేవ చేయడంతో పాటు తమదైన ప్రభావం చూపించిన వ్యక్తులకు లేదా సంస్థలకు దీనిని ప్రధానం

చేస్తారు. ఈ అవార్డులను రెండు విభాగాలుగా విభజించారు. అవి క్రింది విధంగా కనబడుతున్నాయి.

1) **Main awards**

Lifetime achievement award

Telugu person of the year

Telugu NRI of the year

Excellence in healthcare

Excellence in education

Excellence in social development

Business person of the year–small/medium

Business person of the year–large scale

Excellence in environment conservation individual

Excellence in environment conservation corporate

Excellence in environment conservation–NGO

Telugu NRI of the year

Telugu person of the year

2) **Young achiever awards**

Young achiever of the year–

Young achiever of the year–service

Young achiever of the year–environment conservation – individual

Young achiever of the year–environment conservation – corporate

Young achiever of the year–environment conservation – NGO

'సాక్షి ఎక్స్‌లెన్షియా' అవార్డులో భాగమైన మొదటి లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డుని మొదటిసారిగా 2014లో ప్రముఖ తెలుగు కవి మరియు సినీ గేయ రచయిత అయిన డాక్టర్ సి. నారాయణరెడ్డి గారికి అందజేశారు. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో ముందెన్నడూ లేని విధంగా ఇంత భారీ స్థాయిలో ప్రాంతీయ అవార్డులను సాక్షి సంస్థ ఏర్పాటు చేసి అందజేస్తూ, తనదైన ప్రత్యేకతను చాటుకుంటుంది.

### 1.8.6. సాక్షి దినపత్రిక నిర్మాణం

సాక్షి మిగతా పత్రికలతో పోటీపడుతూ ప్రతిరోజు ప్రత్యేకమైన పుటలతో, పత్రిక ఆవిర్భావం నుండి నేటి వరకు పత్రికా రంగంలో తనదైన ప్రత్యేకతను తెలుపుకుంటుంది. ఆరంభ విషయంలోనే కాకుండా పత్రికా నిర్మాణంలో కూడా ప్రత్యేక స్థానాన్ని నిలుపుకుంది. మిగతా పత్రికలతో సమానంగా సాక్షి పత్రిక కూడా వార్తా ప్రచురణాలతో పాటు ప్రతిరోజు ప్రత్యేకమైన పుటలతో మనకు కనిపిస్తుంది. ఈ పత్రిక ప్రతిరోజు 16 పేజీల మెయిన్ ఎడిషన్ మరియు హైదరాబాద్ జిల్లా టాబ్లాయిడ్ 20 పుటలు మిగతా జిల్లాలో16 పుటలతో వెలుదుతుంది. పుటల ప్రచురణలో కూడా రోజుకో ప్రత్యేకతను కనబరుస్తుంది. పత్రికా పుటల నిర్మాణాన్ని గమనించినట్లయితే దానిలోని ప్రత్యేకతలు మనకు అవగతమవుతాయి. జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ వార్తలతో పాటు ప్రతిరోజు ఒక ప్రత్యేక పుటలతో వెలువడుతుంది. వీటితోపాటు ప్రత్యేక అనుబంధాలైన 'ఫన్డే' సంచిక ప్రతీ ఆదివారం, 'భవిత' ప్రతీ గురువారం వెలువడుతాయి. ఈ పత్రిక పూర్తి స్వరూప స్వభావాలు క్రింది విధంగా ఉన్నాయి పరిశీలిద్దాం.

సాక్షి పత్రిక మొదటి పేజీ ప్రారంభంలో 'సత్యమేవ జయతే' అని ఉండి, దాని కింద సాక్షి అని పెద్ద అక్షరాలతో పత్రిక పేరు కనిపిస్తుంది. సాక్షి పేరుకు కుడివైపున వై.యస్. రాజశేఖర్ రెడ్డి ఫోటో దాని కింద ఒక కొటేషన్/సూక్తి ఉంటుంది. రోజుకో కొత్త వాక్యాలతో మనకు పత్రిక కనబడుతుంది.

"ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి" (30/12/2022. సాక్షి) ఇలా వై.యస్. రాజశేఖర్ రెడ్డి వాక్యాలు ప్రచురించడం అనేది ఆయన మరణానంతరం నుండి ప్రారంభమైంది. ఇంకా పుటల వారిగా చూసినట్లయితే దాని ప్రత్యేకతలు మనకు అవగతమవుతాయి.

#### 1.8.6.1. సంపాదకీయం

పత్రిక హృదయంగా భావించబడే సంపాదకీయ పుట 'సాక్షి ఫోకస్' పేరుతో వెలువడుతుంది. దీనిలో సంపాదకీయ వ్యాసంతో పాటు వర్తమాన సామాజికాంశాలకు సంబంధించిన వ్యాసాలు ఉంటాయి. వర్ధెల్లి మురళి ఈ పత్రిక సంపాదకత్వ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. సంపాదకీయ ఫోటోలో ప్రధానంగా సమకాలీన సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను చిత్రిస్తూ ఆయా సందర్భాలను బట్టి సంపాదకీయ వ్యాసాలతోపాటు సాధారణ వ్యాసాలు వెలువడుతున్నాయి. అంతేకాకుండా ప్రతీరోజు ప్రత్యేక విభాగాలలో వ్యాసాలను

ప్రచురిస్తారు.  సంపాదకీయంతో పాటు ప్రచురితమయ్యే సాధారణ వ్యాసాలు సోమవారం తప్ప మిగతా వారాల వారీగా పరిశీలిస్తే క్రింది విధంగా ప్రచురిస్తున్నారు.

సోమవారం సంపాదకీయ పుట 'సాక్షి సాహిత్యం' పుటగా వెలువడుతుంది. సంపాదకీయ పుటలో ప్రతి మంగళవారం సంపాదకీయంతో పాటు, సామాజిక పరిస్థితులను చిత్రిస్తూ, సీనియర్ పాత్రికేయులు  ఏ.బి.కె ప్రసాద్ రాసిన వ్యాసాలు రెండో మాట శీర్షికన వెలువడుతున్నాయి. విశ్లేషణ పేరుతో సీనియర్ పాత్రికేయులు మహేశ్ విజాపృకర్ రాసిన వ్యాసాలు మనకు కనిపిస్తాయి.  అలాగే 'సందర్భం' అనే శీర్షికన ప్రముఖుల జయంతి లేదా వర్ధంతులకు సంబంధించిన మరియు వర్తమాన సంఘటనలకు సంబంధించిన వ్యాసాలు ఉంటాయి. ప్రతి బుధవారం "మనసులో మాట" శీర్షికన ఒక రాజకీయ నాయకునితో కొమ్మినేని శ్రీనివాసరావు ఇంటర్వ్యూ ఉంటుంది. గురువారం సామాజిక అంశాలను తెలుపుతూ మల్లెపల్లి లక్ష్మయ్య ప్రధాన వ్యాసం, అలాగే 'జీవన కాలమ్' పేరున గొల్లపూడి మారుతీ రావు రాసిన వ్యాసాలను ప్రచురిస్తారు. 'జ్యోతిర్మయి' పేరుతో రామాయణ సంబంధ విషయాలను తెలిపే వ్యాసాలు వెలువడుతాయి.

శుక్రవారం దిలీప్ రెడ్డి రాసిన వ్యాసాలు 'విశ్లేషణ' శీర్షికన వెలువడుతున్నాయి. 'రుజుమార్గం' పేరుతో ఆధ్యాత్మిక అంశాల గురించి ఎం.డి. ఉస్మాన్ ఖాన్ రాసిన వ్యాసం ప్రచురిస్తున్నారు. శనివారం 'జాతిహితం' పేరుతో  శేఖర్ గుప్తా, అలాగే 'అక్షర తూనీరం' పేరున శ్రీరమణ రాసిన వ్యాసాలు వెలువడుతున్నాయి. ఆదివారం 'త్రికాలమ్' పేరుతో కె. రామచంద్రమూర్తి వ్యాసాలు, 'పరలోకనం' పేరుతో ఆకార పటేల్ వ్యాసాలు, 'రాయని డైరీ' శీర్షికన ప్రముఖ నటులు, రాజకీయ నాయకులకు సంబంధించిన అంశాలపై మాధవ్ లింగరాజు రాసిన వ్యాసాలు వెలబడుతున్నాయి. ఈ విధంగా సాక్షి పత్రిక సంపాదకీయ పుటను 'సాక్షి ఫోకస్' అనే పేరుతో వెలువరిస్తూ, రోజుకొక ప్రత్యేక శీర్షికలతో సామాజిక, రాజకీయ, ఆర్థికాంశాలకు సంబంధించిన విభిన్న వ్యాసాలను ప్రజలకు అందజేస్తూ తమదైన ప్రత్యేకతను తెలుపుతున్నారు.

### 1.8.6.2. భవిత

సాక్షి దినపత్రిక విద్యార్థులు, ఉద్యోగార్థుల కోసం 'భవిత' పేరుతో ప్రతి గురువారం ఒక ప్రత్యేక సంచికను వెలువరుస్తుంది. ఇందులో విద్యార్థుల కోసం స్టడీ ప్లాన్, ఎంసెట్, జేఈఈ, నీట్, నెట్, సెట్, పీజీ, సెట్ వంటి వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన ఎంట్రన్స్ పరీక్షల నోటిఫికేషన్ వంటి అంశాలను ప్రచురించి, విద్యార్థులకు ఎంతగానో సహాయపడుతుంది. అలాగే

ఆయా పరీక్షల మోడల్ పేపర్స్ ను ప్రచురిస్తుంది. పరీక్షల్లో విద్యార్థులు పొరపాట్లు చేయకుండా పాటించాల్సిన జాగ్రత్తలను సూచనలు నిపుణుల ద్వారా అందిస్తుంది.

ఉద్యోగార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు విడుదల చేసే ఉద్యోగ నోటిఫికేషన్ కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందిస్తుంది. గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4 వంటి పరీక్షల సిలబస్, స్టడీ మెటీరియల్ అందిస్తూ, జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్ వంటి పరీక్షలకు సంబంధించిన విషయాలను మిగతా పత్రికలకు ధీటుగా సాక్షి ప్రచురిస్తుంది. సాక్షి భవిత ప్రత్యేక సంచికతో పాటుగా ప్రతిరోజు మెయిన్ పేపర్లో ఒక ప్రత్యేక పుటగా కూడా ప్రచురితమవుతుంది. దానిలో  ప్రతిరోజు గ్రూప్స్ ప్రత్యేక అంశాలతో పాటు రోజుకో విభిన్న అంశాలు  క్రింది విధంగా కనిపిస్తున్నాయి. ప్రతి సోమవారం 10+2 / గ్రాడ్యుయేట్ స్పెషల్, మంగళవారం ఇంజనీరింగ్ / స్పెషల్, బుధవారం జాబ్ పాయింట్, గురువారం కెరీర్ గైడెన్స్ / టెక్నాలజీ స్పెషల్, శుక్రవారం ఫారిన్ ఎడ్యుకేషన్ స్పెషల్, శనివారం యూత్ స్టోరీ / కరెంట్ అఫైర్స్ (ఇంగ్లీష్), ఆదివారం జాబ్ / గెస్ట్ కాలం వంటి ప్రత్యేక అంశాలతో సాక్షి భవిత విద్యా ఉద్యోగ సంబంధ విషయాలను పాఠకులకు అందిస్తుంది.

### 1.8.6.3. సాగుబడి

మన దేశం వ్యవసాయ రంగ ప్రాధాన్యత కలిగిన దేశం కావున వ్యవసాయ రంగానికి తెలుగు పత్రికలు వారంలో ఒకరోజు ప్రత్యేక పుటను కేటాయిస్తున్నాయి. సాక్షి పత్రిక కూడా ప్రతి మంగళవారం "సాక్షి సాగుబడి" పేరుతో వ్యవసాయ సంబంధ ప్రత్యేక పుటను ప్రచురిస్తుంది. దీనిలో వివిధ రకాల పంటల గురించి అలాగే వ్యవసాయ రంగంలో నూతన విధానాల గురించి తెలియజేస్తున్నాయి. రైతులకు వ్యవసాయంపై శాస్త్రీయ అవగాహనను పెంపొందిస్తున్నాయి. వ్యవసాయంలోని ఆధునిక పద్ధతుల్లో తెలుపుతూ, ఎరువుల వాడకం అలాగే సేంద్రియ ఎరువుల ద్వారా అధిక దిగుబడి ఎలా సాధించాలి? రసాయన ఎరువుల వాడకం తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వంటి అనేక అంశాలకు సంబంధించిన విజ్ఞానాన్ని నేడు పత్రికలు అందిస్తున్నాయి. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తూ, అధిక దిగుబడులను సాధించడానికి కృషి చేస్తున్నాయి.

### 1.8.6.4. ఫ్యామిలీ

సమకాలీన అంశాలపై స్ఫూర్తి ప్రధానమైన వార్తలను, స్టోరీలను 'సాక్షి ఫ్యామిలీ' పేరుతో ప్రత్యేక పుటను ప్రచురిస్తుంది. ఇది ప్రతిరోజు విలక్షణమైన అంశాలతో ప్రచురితమవుతుంది. దీనిలో

ఎక్కువగా స్త్రీల సంబంధ విషయాలు, స్ఫూర్తిని కలిగించే వ్యక్తుల జీవిత విషయాలు, ప్రస్తుత సమాజంలో ముందంజలో ఉన్న స్త్రీల ఇంటర్వ్యూలు మనకు కనబడతాయి. వీటితోపాటు, 'హస్తవాసి' పేరుతో వైద్య సంబంధ విషయాలు, డాక్టర్ల సలహాలు, సూచనలు, ఆరోగ్య సంబంధ విషయాలు ప్రచురిస్తున్నారు. తీర్థ క్షేత్రాల గొప్పదనాన్ని వాటి వివరాలు కూడా మనకు ప్రతి బుధవారం సాక్షి ఫ్యామిలీలో కనిపిస్తాయి. సినీ రంగానికి సంబంధించిన వార్తలు, విశేషాలు కూడా సాక్షి ఫ్యామిలీలో 'సినిమా' అనే పేరుతో ప్రతిరోజు కనబడతాయి. ప్రతి శుక్రవారం ఫ్యామిలీ పుటలో స్త్రీలకు సంబంధించిన నగలు, వస్త్రాలు, ఫ్యాషన్ డిజైన్ కు సంబంధించిన వార్తలు ఉంటాయి. శనివారం ఫ్యామిలీ పుటలో పంటలకు సంబంధించిన విషయాలతో కనిపిస్తుంది. ఆధ్యాత్మిక సంబంధ విషయాలు ప్రతి ఆదివారం ఫ్యామిలీ పుటలో కనిపిస్తాయి. ఇలా రోజుకో విలక్షణమైన అంశాలతో సాక్షి ఫ్యామిలీ ఎంతోమంది పాఠకాదరణ పొందుతుంది.

### 1.8.6.5. ప్రాఫిట్ ప్లస్

సాక్షి దినపత్రికలో 'ప్రాఫిట్ ప్లస్' అని ఈ పుట ప్రధాన పుటల్లో భాగంగా ప్రతి సోమవారం వెలువడుతుంది. దీనిలో ఆర్థిక సంబంధ విషయాలు ఉంటాయి. గృహ సంబంధ లోన్లు, వడ్డీ రేట్లు వివరణ, షేర్ మార్కెట్లో వివరణ వంటి అంశాలు ఇందులో ప్రచురితమవుతాయి. ఎలాంటి మార్గాల ద్వారా ఆదాయ అభివృద్ధి పొందగలం, అలాగే ఏఏ మార్గాల ద్వారా ఆదాయాన్ని నిలువ చేయవచ్చు, ఎలాంటి పాలసీలు మనకు లభిస్తాయి, హెల్త్ ఇన్సూరెన్స్ గురించి అవగాహన వంటి అంశాల మీద సలహాలు, సూచనలకు సంబంధించిన వ్యాసాలు ఈ పుట ద్వారా అందిస్తున్నారు.

### 1.8.6.6. స్పోర్ట్స్

నేడు దినపత్రికల్లో క్రీడా సంబంధ ప్రత్యేకపుట రోజూ వెలువడుతుంది. ఈ పుటలో జాతీయ, అంతర్జాతీయ క్రీడా సంబంధ వార్తలు ప్రచురిస్తున్నారు. సాక్షి పత్రిక కూడా ప్రతిరోజు 'స్పోర్ట్స్' అనే పేరుతో క్రీడా సంబంధ పుటను వెలువరిస్తుంది. దీనిలో జాతీయ, అంతర్జాతీయ క్రీడల సంబంధ వివరాలు వారు సాధించిన విజయాలు మొదలైన అంశాలను ప్రతిరోజు ప్రచురిస్తుంది. అన్ని రకాల క్రీడలు మనకు దీనిలో కనబడతాయి.

### 1.8.6.7. బిజినెస్

వాణిజ్య సంబంధమైన విషయాలను 'సాక్షి బిజినెస్' పుట ద్వారా రోజు మనకు అందిస్తుంది. వర్తక వాణిజ్య సంబంధ విషయాలతో పాటు సెన్సెక్స్, షేర్ మార్కెట్ల విదేశీ మారకం, అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ, బంగారం, వెండి ధరలు, బ్యాంకు సంబంధ విషయాలు, శాస్త్ర

సాంకేతిక రంగాల్లో వివిధ సంస్థలు సాధించిన విజయాలు, నూతన ఆవిష్కరణలు మొదలైన అనేక అంశాలను ఈ పుట ద్వారా మనకు అందిస్తున్నారు.

### 1.8.6.8. పెళ్లిచూపులు

వివాహ సంబంధ విషయాలను సాక్షి దినపత్రిక 'పెళ్లిచూపులు' పేరుతో ప్రతి ఆదివారం ప్రత్యేక పుటను ప్రచురిస్తుంది. దీనిలో వధూవరుల వివరాలు, వివాహ సంబంధ ప్రకటనలు, మ్యారేజ్ బ్యూరోలకు సంబంధించిన ప్రకటనలను ఇస్తున్నారు.

### 1.8.6.9. ఫన్ డే

సాక్షి దినపత్రిక మిగతా పత్రికల వలె ప్రతి ఆదివారం 'సాక్షి ఫన్ డే' పేరుతో ఆదివార అనుబంధ సంచికను ప్రచురిస్తుంది. దీనిలో కవర్ స్టోరీలు, సైన్స్ అండ్ టెక్నాలజీ సంబంధిత విషయాలు, నూతన ఆవిష్కరణలు, కథలు, కవిత్వం, విజ్ఞాన, వినోదసంబంధ విషయాలు, వంటకాలు, రాశి ఫలాలు, పుస్తక సమీక్షలు, వైద్యసంబంధ సలహాలు వంటి అనేక రకాల అంశాలను ప్రచురిస్తున్నారు. 'సైంకాలం' శీర్షికన సైకాలజీ విషయాలు, 'స్నాక్స్ కార్నర్' శీర్షికన వంటకాలు, 'కొత్త కొత్తగా' శీర్షికతో నూతన వస్తు ఆవిష్కరణలు, 'స్టార్ స్టైల్' శీర్షికన సినీ తారల ఇంటర్వ్యూలు, 'అచీవర్స్' శీర్షికన విజేతలుగా నిలిచిన క్రీడాకారుల సక్సెస్ స్టోరీలు, 'పిల్లల కథ' పేరుతో పిల్లల కోసం ప్రత్యేకమైన కథలు, బాలల గేయాలు వంటి ఎన్నో విజ్ఞాన వినోదాత్మకమైన అంశాలతో పాటు ప్రపంచంలోని వింతలు, హాస్య సంబంధ విషయాలు, సామెతలు మొదలైన వాటిని ప్రచురిస్తూ, ప్రతి ఆదివారం పాఠకునిలో ఒక నూతన ఉత్తేజాన్ని నింపుతూ సండేని 'ఫన్ డే' గా సాక్షి పత్రిక వెలువరిస్తుంది.

### 1.8.6.10. సాక్షి–సాహిత్యం

దినపత్రికల్లో జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ వార్తలు, అలాగే రాజకీయ, ఆర్థిక వార్తలతో పాటు సాహిత్య సంబంధ విషయాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. పత్రికల్లో సాహిత్య ప్రచురణ అనేది మొదటి నుండి మనకు కనిపిస్తుంది. పూర్తిగా సారస్వత విషయాలకే ప్రాధాన్యమిచ్చిన 'సుజనరంజని' మొదలుకొని ఈనాటి వరకు పత్రికల్లో సాహిత్యానికి చోటు లభిస్తూనే ఉంది. 19వ శతాబ్ది ఉత్తరార్థంలో కవులు, పండితులు స్వయంగా పత్రికలు నడిపారు. తమ వద్దనున్న తాళపత్ర ప్రతుల నుండి వెలికి తీసిన ప్రాచీన కావ్యాలను ప్రతి సంచికలో ధారావాహికగా ప్రచురించేవారు. ఈ విధంగా ప్రారంభమైన, సాహిత్య ప్రచురణ నేటికీ ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు. నేడు పత్రికలు సాహిత్యానికి ఒక ప్రత్యేక పుటను కేటాయించి,

వాటి ద్వారా సమకాలీన సాహిత్యాన్ని భిన్న ప్రక్రియల ద్వారా పాఠకులకు అందిస్తున్నారు. సాధారణంగా సాహిత్యపుటల్లో సాహిత్య సంబంధ వ్యాసాలు, కవితలు, సమీక్ష వ్యాసాలను ప్రచురిస్తూ సాహిత్య అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నాయి.

సాహిత్యం సంస్కృతిలో భాగం. సాహిత్యం అనేది ఒక దేశ సంస్కృతి, సామాజిక జీవితానికి ప్రతిబింబం. ఈనాడు తప్ప దాదాపు అన్ని పత్రికల్లో సాహిత్యానికి ప్రత్యేకమైన పేజీని కేటాయిస్తున్నారు. ఈనాడులో సాహిత్యాంశాలు ప్రచురిస్తారు. కానీ సాహిత్యానికి ప్రత్యేక పుట అనేది మనకు కనబడదు. సాహిత్య పుటల్లో సాహిత్య సంబంధ ప్రక్రియలు, కార్యక్రమాలు, విభిన్న ధోరణులు, సాహిత్యకారుల వివరాలుంటాయి. అది ఒక పద్యం, కవిత్వం, విమర్శ, సమీక్ష, కథలు ఇలా అనేక రూపాల్లో మనకు కనిపిస్తుంది. ఈ సాంప్రదాయాన్ని సాక్షి పత్రిక కూడా పాటిస్తుంది. ప్రతి సోమవారం 'సాక్షి సాహిత్యం' అనే పేరుతో సాహిత్య పుట వెలువడుతుంది. దీనిలో సాహిత్యానికి సంబంధించిన అంశాలు ప్రచురిస్తారు. ఈ పుటలో ఒక ప్రధాన వ్యాసం, కొన్ని కవితలు, 'ఈవెంట్స్' శీర్షికన సాహిత్య సమావేశాల సమాచారం, 'అల్మారా' శీర్షికన నూతన పుస్తకాల పరిచయం వంటి మొదలైన అంశాలుంటాయి. సాక్షి పత్రికలో సాహిత్యం పుటను పత్రిక ప్రారంభం నుండే ప్రచురిస్తున్నారు. ఇది ప్రారంభంలో సోమవారం రోజు వచ్చేది. కొంతకాలానికి బుధ వారానికి మారి, ఆ తర్వాత శని వారానికి, ఆదివారానికి కూడా మారి, ప్రస్తుతం చివరగా తిరిగి సోమవారం రోజు ప్రచురించబడుతుంది.

సాక్షి సాహిత్యం పుటలో ఒక ప్రాంతానికి సంబంధించినవి కాకుండా అన్ని ప్రాంతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ అన్ని రకాల సాహిత్య వ్యాసాలను ప్రచురిస్తున్నారు. ప్రాచీనం, అలాగే ఆధునిక సాహిత్య ధోరణులైన స్త్రీవాదం, దళితవాదం, మైనార్టీ వాదం వంటి అనేక రకాల సాహిత్య వ్యాసాలు మనకు కనిపిస్తాయి. కేవలం ఒక తెలుగు సాహిత్యానికి, రచయితలకే కాకుండా పాశ్చాత్య సాహిత్యానికి కూడా ఎంతో ప్రాధాన్యతనిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కొత్త శీర్షికలను ఏర్పాటు చేసి నూతన అంశాలను ఈ పుట ద్వారా అందించడంలో ఎంతో కృషి చేస్తున్నారు. పుట మొత్తానికి ఒకే వ్యాసాన్ని ప్రచురించకుండా, వీలైనంత ఎక్కువ అంశాలను భిన్న రకాల సాహిత్యాన్ని చిన్నచిన్న వ్యాసాలుగా మలచి పాఠకుడు తన అభిరుచికి అనుగుణంగా నచ్చిన అంశాన్ని చదువుకోవడానికి వీలుగా సాహిత్య వ్యాసాలు, సమీక్ష వ్యాసాలు, కవితలు, ఈవెంట్ అని 'అల్మారా' పేరుతో కొత్త పుస్తకాల పరిచయం, సూక్తులు వంటి అనేక అంశాలు ఈ పుటలో పొందుపరుస్తున్నారు. మిగతా పత్రికల్లో ఎక్కువగా ఆదివార అనుబంధాల్లో సమీక్ష

వ్యాసాలు వస్తుంటే, సాక్షి పత్రిక వారు సాహిత్యపుటలోనే సమీక్ష వ్యాసాలను ప్రచురిస్తున్నారు. ముందుమాటలను సంక్షిప్తం చేసి ప్రచురించడం ఈ మధ్యకాలంలో దినపత్రికలో వస్తున్న నూతన సంప్రదాయం. దీన్ని సాక్షి పత్రిక కూడా పాటిస్తుంది. నూతనంగా వెలువడిన పుస్తకాల గురించి తెలియజేయడానికి ఆ గ్రంథ లక్ష్యాన్ని, సారాంశాన్నితెలిపే విధంగా ముందు మాటలను సంక్షిప్తం చేసి వ్యాసాలుగా ప్రచురిస్తున్నారు. సాహిత్యంలో వస్తున్న నూతన గ్రంథాలను పాఠకులకు తెలపాలని ఉద్దేశంతో విలువైన ముందు మాటలను వీరు ప్రచురిస్తున్నారు.

సాక్షి సాహిత్యం పుట ప్రతి సోమవారం ఎడిట్ పేజీ అయినా నాలుగవ పుటలో వస్తుంది. ప్రకటనలు ఎక్కువగా ఉన్నప్పుడు ఇది ఆరవపుటలో కూడా కనిపిస్తుంది. సమకాలీన సాహిత్యానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రాచీన సాహిత్యం, పాశ్చాత్య సాహిత్యం, తత్సంబంధ విషయాలను ఈ పత్రిక 'సాక్షి సాహిత్యం' వేదికగా పాఠకులకు చేరవేస్తుంది. సాహిత్యం అంటే సంస్కృతికి, సంస్కారవంతమైన జీవితానికి అవసరమైన పద్ధతులను నేర్పడానికి ఉపయోగపడుతుంది. సమాజంలో ఉన్న రకరకాల సమస్యలను కొత్త కోణంలో ఆలోచించడానికి, మన వారసత్వం మన చుట్టూ ఉన్న సమాజపోకడ తెలియజేయడానికి, మానవ స్వభావాన్ని తెలపడానికి, సాహిత్య పుట ఉపయోగపడుతుంది. కవిత్వం, కథ, నవల, వ్యాసం వంటి అనేక సాహిత్య రూపాల్లో జ్ఞానాన్ని అందిస్తుంది. పత్రిక ప్రారంభ కాలంలో ప్రాచీన సాహిత్యాన్ని ఎక్కువగా ప్రచురించేవారు. కానీ ఇప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాహిత్యానికి, అలాగే పాశ్చాత్య సాహిత్యానికీ సాక్షి పెద్దపీట వేస్తుంది. మిగతా సాహిత్య పుటలతో పోల్చుకుంటే సాక్షి పత్రికలో పాశ్చాత్య కవుల, ప్రక్రియల పరిచయం ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ సాహిత్యాన్ని పరిచయం చేయడానికి సాక్షి సాహిత్య వేదికగా మారింది. సమకాలీన విషయాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ, నేడు వెలువడుతున్న మిగతా పత్రికలకన్నా వైవిధ్యంగా సాక్షి సాహిత్యం పాఠకాదరణ పొందుతూ తనదైన ప్రత్యేకతను చాటుతుంది.

ఈ విధంగా సాక్షి పత్రిక ప్రతిరోజు ప్రత్యేక పుటల నిర్మాణంతో ప్రారంభం నుండి నేటి వరకు నిర్మాణ పరమైన వైవిధ్యాన్ని చూపుతూ మిగతా పత్రికలకు ధీటుగా నిలుస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా పత్రిక నిర్మాణంలో కూడా మార్పులు జరుగుతూ నిత్య నూతనంగా సాక్షి పత్రిక వెలువడుతుంది.

సాక్షి పత్రిక స్థాపించిన తర్వాత 2009లో వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసారు. కొంతకాలానికి ఆయన హెలికాప్టర్ ప్రమాదంలో

2009 సెప్టెంబర్ 2న ఆకస్మికంగా మరణించారు. దీనితో తన కుమారుడు వై.యస్. జగన్మోహన్ రెడ్డి తన కార్యక్షేత్రాన్ని హైదరాబాదుకుకు మార్చి సొంతపార్టీని ఏర్పాటు చేసుకొని రాజకీయాల్లో క్రియాశీల పాత్రను పోషించారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయాల్లోకి ప్రవేశించాక తన భార్య అయిన వై.యస్. భారతిని సాక్షిపత్రికకు చైర్పర్సన్ని చేసారు. తను రాజకీయ కార్యక్రమాల్లో నిమగ్నులయ్యారు. ప్రస్తుతం ఈ పత్రిక చైర్మన్ వై.ఎస్. భారతి. ఎడిటోరియల్ డైరెక్టరుగా కె. రామచంద్రమూర్తి, ఎడిటరు గా వర్దెల్లి మురళి కొనసాగుతున్నారు.

**1.9. తెలంగాణ పత్రికల ఆవిర్భావం—వికాసం**

ముద్రణాయంత్రాల రాకతో సమాచార వినిమయం వేగవంతమయి ప్రజలు చైతన్యవంతులయ్యారు. బ్రిటిష్ పరిపాలన వలన కలిగిన ఈ లాభాలు తెలుగు పత్రికల ఆవిర్భావానికి దోహద పడినప్పటికి, తెలంగాణ ప్రాంతంలోనికి అవి ప్రవేశించడానికి చాలా సమయం పట్టింది. వలసరాజుల పాలనలో మగ్గిపోతున్న తెలంగాణ ప్రాంతంలో పత్రికల ప్రస్తావన కాస్త ఆలస్యంగానే మొదలైంది. ముస్లిం రాజుల పరిపాలనతో నలిగిపోతున్న తెలంగాణలో క్రీస్తుశకం 19వ శతాబ్దం వరకు తెలుగు పత్రికల ఊసే లేదని చెప్పవచ్చు. ఉద్యమ స్ఫూర్తి, సామాజిక, రాజకీయ అణచివేతల ఫలితంగానే తెలంగాణ పత్రికల ఆవిర్భావం మొదలైంది. కావున తెలంగాణ పత్రిక ఆవిర్భావం దాని వికాసాన్ని తెలిపి నమస్తే తెలంగాణ పత్రికలోని విశేషాలను ఇక్కడ వివరించదలచాను.

మనుగడ కోసం పోరాటమనే డార్విన్ సిద్ధాంతం తెలంగాణ ప్రజానీకంలో కనిపిస్తుంది. ఘనత వహించిన నిజాం నవాబులు ఆంధ్ర ప్రాంతంలోని కొన్ని ప్రాంతాల్ని బ్రిటిష్ దొరలకు ధారాదత్తం చేయగా మిగిలిన ప్రాంతాలతో హైదరాబాద్/ నిజాం రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. హైదరాబాద్, అదిలాబాద్, నిజామబాద్, కరీంనగర్, మెదక్ వరంగల్, మహబూబ్ నగర్, తెలుగు ప్రాంతంలోని జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని ఔరంగాబాద్, పర్భని, బీడ్, నాందేడ్, ఉస్మాన్బాద్ జిల్లాలు అలాగే కర్ణాటకలోని గుల్బర్గా, రాయచూర్, బీదర్ జిల్లాలు కూడా నిజాం (హైదరాబాదు) రాష్ట్ర అంతర్భాగాలుగా ఉండేవి. నేడు మనం వ్యవహరిస్తున్న ఈ తెలంగాణ రాష్ట్రాన్ని పూర్వం హైదరాబాద్/నిజాం రాష్ట్రంగా వ్యవహరించేవారు. తెలంగాణకి లిపి విషయంలో ఎంతో ప్రాచీనత ఉంది. చిత్రలిపి శాసనాలు కరీంనగర్ జిల్లాలో లభించాయని ఆదిరాజు వీరభద్రరావు ఒకచోట రాశారు. ఇవి రమారమి రెండువేల కిందటివి అని జి. బాల శ్రీనివాసమూర్తి (2004. పుట.13) తెలియజేశారు. ముస్లిం రాజులు పరిపాలించే కాలంలో తెలుగును 'తెలంగి' అని పిలిచేవారు.

'తెలంగి' వ్యవహారంలో ఉన్న ప్రాంతాన్ని తెలంగాణగా వ్యవహరించేవారు. ఈ విధంగా ప్రస్తుతం ఉన్న తెలంగాణ అనే పేరు స్థిరపడింది. నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న తెలంగాణ ప్రాంతానికి 19వ శతాబ్ది వరకు తెలుగు పత్రిక ఊసే లేదని, మిగతా ప్రాంతాలతో పోల్చుకుంటే తెలంగాణ ప్రాంతాల్లో తెలుగు పత్రికలు కాస్త ఆలస్యంగానే వెలువడ్డాయని అర్థమవుతుంది.

పత్రికల గురించి ప్రాథమిక అవగాహన లేకపోవడం, పత్రికలు స్థాపిస్తే ప్రజలు చైతన్యవంతులవుతారనే భయం నిజాం రాజుల మనసులో బలంగా ఉండేది. అచ్చు యంత్రం చైతన్యానికి బీజరూపంగా వారు భావించారు. చైతన్యానికి పోరాటమే అంతిమలక్ష్యం అవుతుందని వీరు భయపడి, అచ్చుయంత్రం చైతన్యానికి కారణమవుతుందని, దానిని రాష్ట్ర సరిహద్దుల్లోకి రాకుండా జాగ్రత్త పడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ పత్రిక స్థాపన అనేది కత్తి మీద సాముల ఉండేది. ఒకవేళ పత్రికలు స్థాపించిన వాటి మనుగడ ఒక యుద్ధంలా ఉండేది. నిజాం, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచురించకూడదు, విమర్శించకూడదు. నిజాం రాజులు పత్రికలపై విపరీతమైన ఆంక్షలు విధించారు. వాటన్నిటిని  పాటిస్తూ, తెలంగాణలో పత్రికలను నడపడం ఒక యుద్ధం చేయడంతో సమానంగా మారింది. తెలంగాణ పత్రికలు స్థాపించి అణా  పైస లాభాలు పొందిన సంపాదక ముద్రాపకులు లేరని చెప్పవచ్చు. అయినా ఇటువంటి కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూనైనా తెలంగాణ ప్రజల చైతన్యం కోసం కొంత ఆలస్యంగానైనా పత్రికల స్థాపన జరిగింది.

తెలంగాణలో వెలువడిన మొదటి పత్రిక ఏది? అనే అంశంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. "నిజాం రాష్ట్రంలో వెలువడిన తొలి పత్రిక పారశీ భాషకు చెందింది కావడం విశేషం. 'అఖ్తరరీఫ్' అనే పారశీక పత్రిక 1878లో హైదరాబాద్ నుంచి వచ్చేది. ఇప్పటికీ పలువురు నిర్ధారించిన సత్యం ఇది. ఇదే నిజాం రాష్ట్రం నుండి వెలుగు చూసిన తొలి పత్రిక. అయితే అంతకు ముందే 1864 లోనే సికింద్రాబాద్ నుంచి దక్కన్ టైమ్స్ అనే పత్రిక ప్రచురణ పొందిందని పి. వామనరావు రాశారు. ఈ విషయం ఇంకా స్పష్టం కాలేదు" (2004.పుట.32) అని జి. బాల శ్రీనివాసమూర్తి అభిప్రాయపడ్డారు.

నిజాం రాష్ట్రంలో వెలువడిన మొదటి పత్రిక ఏది అనే అంశాన్ని విడిచి పెడితే నిజాం రాష్ట్రంలో వెలువడిన తొలి పత్రిక తెలుగు భాషలో రాలేదని విషయం స్పష్టం అవుతుంది. దీనికొక బలమైన సాంకేతిక కారణం ఉంది. నిజాం రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలు ఒక ఎత్తు అయితే మరో పక్కన పత్రిక ముద్రణకు కావాల్సిన తెలుగు అక్షరాల కూర్పు కూడా లభించేది కాదు.

గద్వాల, వనపర్తి వంటి ఒకటి రెండు రాజాస్థానాలలో తప్ప మరెక్కడ తెలుగు ప్రెస్సులు ఉండేవి కావు. నీలగిరి పత్రిక ఈ పరిస్థితులకు చింతిస్తూ 1926వ సంవత్సరం డిసెంబర్‌లో ఒక సంపాదకీయం రాసింది.

"హైదరాబాద్ నగరం మొత్తం గాలించిన కేవలం తెలుగు ముద్రణ మాత్రమే ఉన్న ప్రెస్సులు అస్సలు లేవు. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్ని విడిచి పెడితే, వరంగల్, నలగొండ, ఇనుగుర్తిలలో తప్ప మరెక్కడా తెలుగు ముద్రణాలయం లేదు. ముద్రణాలయాల వారికి పనీ లేదు. ఈ వృత్తిలో చేరిన వారు దండిగా దండుగులు పడుతూ సగం వెలకే అచ్చుయంత్రాలు అమ్ముకున్న సందర్భాలున్నాయి" (బాల శ్రీనివాసమూర్తి, జి. 2004. పు.32). దీని ద్వారా ఆనాటి తెలుగు ముద్రణ పరిస్థితి మనకు అర్థమవుతుంది. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో కూడా నిజాం రాష్ట్ర పత్రికాధిపతులు సమస్యలను ఎదుర్కొంటూ ముందుకు సాగారు. కొంత ఆలస్యం అయినా వారి సంకల్ప బలంతో తెలుగు పత్రికల ఆవిర్భావానికి కృషి చేశారు.

### 1.9.1. తెలంగాణ తెలుగు పత్రికల ఆవిర్భావం

తెలంగాణలో తొలి తెలుగు పత్రిక ఏది? అన్న విషయంలో కూడా పరిశోధకుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. తెలంగాణ తొలి తెలుగు పత్రిక 'శేద్య చంద్రిక' అని కొందరు 'దిన వర్తమాన' అని మరికొందరు భావిస్తున్నారు. 'హితబోధిని' అనేదే తొలి పత్రిక అని చాలా కాలం నుండి వినిపిస్తున్న అభిప్రాయం. 'శేద్య చంద్రిక' పేరుతో ఒక పత్రిక వెలువడిందని, అదే తెలంగాణలో ప్రచురణ పొందిన తొలి తెలుగుపత్రిక అని, ఇటీవల పరిశోధకులు చెబుతున్నారు. నిజం నిగ్గు తేలవలసి ఉందని బాల శ్రీనివాసమూర్తి తన అభిప్రాయాన్ని తెలియజేశారు (2004. పు.33).

"హైదరాబాద్ రాజ్యంలో 'శేద్యచంద్రిక' తొలి తెలుగు పత్రికగా గుర్తింపు పొందింది. ఈ పత్రిక నిజాం ప్రభుత్వం 1886 వ సంవత్సరంలో ఉర్దూలో ప్రారంభించిన 'ఫూనూన్' పత్రిక తెలుగు అనువాదంగా ప్రారంభించబడింది. ఈ పత్రిక యొక్క ప్రధాన ఉద్దేశ్యం వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకొని రావడం. వ్యవసాయ అభివృద్ధి కొరకు నూతన పనిముట్ల వినియోగం, భూముల రకాలు, వంగడాలు, ఎరువుల వాడకం, పూల తోటల పెంపకం, వగైరా అంశాలకు సంబంధించిన వ్యాసాలు 'శేద్యచంద్రిక' లో ప్రచురింపబడినాయి. అయితే 'శేద్యచంద్రిక' మొదటగా తెలుగులో ప్రచురితమైనప్పటికీ అది ఉర్దూ పత్రిక అనువాదం" (సత్యనారాయణ, అడపా.

సత్యనారాయణ, ధ్యావనపల్లి. 2016.పు.232). కావున దీని గురించి ఇంకా నిజనిర్ధారణ జరగవలసి ఉంది.

"1912లో మహబూబ్ నగర్ (పాలమూరు) నుంచి పురుడు పోసుకున్న హితబోధిని తొలి తెలంగాణ తెలుగు పత్రిక అన్నదే చాలా కాలం నుంచి వినిపిస్తున్న అభిప్రాయం. తిరుమల రామచంద్ర, సురవరం ప్రతాపరెడ్డి వంటి ప్రసిద్ధ పండితులు ఈ నిజాన్ని నిర్ధారించారు. 'సరోజినీ విలాస్' అనే ముద్రణాలయం నుంచి వెలువడిన 'హితబోధిని' ఒక మాసపత్రిక. స్థూల దృష్టితో జాతీయతను ప్రబోధిస్తూ తెలంగాణ (హైదరాబాదు రాష్ట్రపు) సామాజిక, ఆర్థిక, వ్యవసాయిక అంశాలను ఈ పత్రిక దినుసులుగా చేసుకుంది. హితబోధిని పత్రిక ప్రతులు ప్రస్తుతం అలభ్యం. ఇందులో సందేహానికి తావు లేదు. సురవరం ప్రతాపరెడ్డి ఒకే ఒక సంచికను సంపాదించగలిగారు హితబోధిని నాలుగవ సంచిక ఆయనకు లభ్యమయింది. అది 1913 సంవత్సరం నాటిది" (2004.పు.33) అని బాల శ్రీనివాసమూర్తి, జి పేర్కొన్నారు. కావున తెలంగాణ తొలి తెలుగు పత్రిక హితబోధిని. శ్రీనివాస శర్మ సంపాదకత్వంలో వెలువడిన ఈ పత్రిక సంవత్సరంలోపే మూతపడింది. ఆ తర్వాత నిజాం రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు కారణంగా దాదాపు పది సంవత్సరాలు పాటు తెలంగాణలో తెలుగు పత్రికలు వెలువడలేదు.

1922 ఆగస్టు 24న షబ్నవీసు వెంకట రామ నరసింహారావు నల్గొండ నుంచి 'నీలగిరి' అనే వార పత్రికను ప్రారంభించాడు. నీలగిరి వెలువడిన నాలుగు రోజులకు వరంగల్ జిల్లా, మహబూబాబాద్ తాలూకా ఇనుగుర్తి గ్రామం నుండి 1922లో 'తెనుగు' వార పత్రిక వెలుబడింది. దీనికి ఒద్దిరాజు సీతారామచంద్రరావు వారి సోదరులు ఒద్దిరాజు రాఘవరంగారావు సంపాదకులు. ఈ రెండు పత్రికలు సొంత ముద్రణాలయాల్లో ముద్రితమయ్యేవి. 1920 దశకంలో సామాజిక, సాంస్కృతిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడంలో నీలగిరి, తెనుగు పత్రికలు విశేష కృషి చేశాయి.

1923 జూన్‌లో హనుమకొండ నుండి కోకల సీతారామాచార్యులు సంపాదకత్వాన 'ఆంధ్రాభ్యుదయము' అనే మాసపత్రిక వెలువడింది. తెలుగు ప్రజానీకానికి విద్యావ్యాప్తిని పెంపొందించడం దీని ప్రధాన లక్ష్యం. ఎంతోమంది యువ రచయితల్ని ప్రోత్సహించినా అనుకున్న ఆశలు నెరవేరకముందే ఆగిపోయింది.

1925 మే 10న సురవరం ప్రతాపరెడ్డి సంపాదకత్వాన గోల్కొండ పత్రిక వెలువడింది. ఇది తెలంగాణ ప్రాంతంలో జాతీయ భావవ్యాప్తికి పాటుపడింది. వడ్డేపల్లి నుండి 1926 జూలైలో

బెల్లంకొండ రామానుజాచార్యుల సంపాదకత్వాన 'దేశబంధు' మాస పత్రికగా వద్దేపల్లి నుండి వెలువడింది. దీనిలో కథలు, అముద్రిత శాసనాలు, నిజాం రాష్ట్ర చరిత్రలు, కవి జీవిత విశేషాలు మొదలైనవి ప్రచురించేవారు. ఇది మూడు సంవత్సరాల పాటు కొనసాగి చరిత్ర కాలగర్భంలో కలిసిపోయింది. ఆ తర్వాత ఆంధ్ర మాత, శైవప్రచారిని, బాల సరస్వతి వంటి అనేక పత్రికలు వెలువడ్డాయి. 1927లో సుజాత, ప్రభ (1935), శోభ (1937), ఆంధ్రవాణి (1938), దక్కన్ క్రానికల్ (1938), నవశక్తి (1935), ప్రజాశక్తి (1942), విశాలాంధ్ర (1952), తెలుగు తల్లి (1939), తరణి (1942), మీజాన్ (1940), సృజన (1966), ప్రజాసాహితి (1977), విమోచన (1971), క్రాంతి (1978) వంటి అనేక పత్రికలు వెలుపడ్డాయి. 1913 నుంచి వెలుపడ్డ ఈ పత్రికలు ఏవి మొదట దినపత్రికలుగా వెలువడలేదు. పక్ష, మాస, ద్వైమాస, వార పత్రికలుగా స్థాపించబడి తర్వాత దినపత్రికలుగా మారాయి.

### 1.9.2. తెలంగాణ తెలుగు దినపత్రికల ఆవిర్భావం

మారుతున్న కాలానికి అనుగుణంగా తెలంగాణలో కూడా శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందాయి. దైనందిన వార్తల ప్రచారం కొరకు దినపత్రికల ఆవిర్భావం జరిగింది. మారుతున్న కాలంతో పాటు ప్రజల అభిరుచి కనుగుణంగా నూతన శీర్షికలతో దైనందిన వార్తల ప్రచారం కొరకు తెలుగు దినపత్రికల ఆవిర్భావం జరిగింది. తెలంగాణ ప్రజల విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలన నుండి ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం వరకు తెలంగాణ తెలుగు దినపత్రికలు ఎంతో కృషి చేశాయి. జాతీయోద్యమం, హైదరాబాదు రాష్ట్రంలో గ్రంథాలయోద్యమాలు, నిజాం నిరంకుశ పాలనపై వ్యతిరేకత మొదలైన అంశాలు తెలంగాణ ప్రజల్ని చైతన్య పరిచాయి. రెండో ప్రపంచ యుద్ధం సమాప్తమయ్యే కాలానికి హైదరాబాదులో తెలుగు దినపత్రిక స్థాపించాలనే ప్రయత్నాలు జరిగాయి. దాని ఫలితంగా తెలంగాణలో దినపత్రికల ఆవశ్యకత గుర్తించిన పత్రికా యాజమాన్య సంస్థలు నిజాం ప్రభుత్వ ఆంక్షలకు లోబడి దినపత్రికలను స్థాపించారు.

#### 1.9.2.1. తెలంగాణ

"తమిలుడైన రాజగోపాల్ మొదలియార్ 1942లో తెలంగాణను స్థాపించినాడు. ఇది తెలంగాణలో తొలి తెలుగు దినపత్రిక" (సత్యనారాయణ, అడప.2016.పుట.236). హైదరాబాద్‌లో స్థాపించిన ఈ పత్రికకు బుక్కపట్టణం రామానుజాచార్యులు సంపాదకులు. వీరు ఆంగ్ల, ఆంధ్ర భాషల్లో దిట్టలు. పత్రికా రచనలో చేయి తిరిగిన వారు తెలంగాణ పత్రిక రెండు మూడేళ్లకు మించి నడవలేదు.

### 1.9.2.2. మీజాన్

హైదరాబాదు నుండి 1944లో గులాం మహమ్మద్ 'కలకత్తా వాలా' అనే ముస్లిం వర్తకుడు 'మీజాన్' అనే అరబ్బీ పేరుతో ఉర్దూ, ఇంగ్లీష్ దిన పత్రికలతోపాటు ఒక తెలుగు దినపత్రికను ప్రారంభించాడు. దీనికి అడవి బాపిరాజు సంపాదకుడు. అడవి బాపిరాజు రచించిన గోన గన్నారెడ్డి, అడవి శాంతి శ్రీ, తుఫాను మొదలైన నవలలు మీజాన్ లో ప్రచురింపబడినవి. ఒకేసారి మూడు భాషల్లో వెలువడ్డ ఏకైక పత్రిక మీజాన్.

### 1.9.2.3. గోల్కొండ

తెలంగాణ తెలుగు పత్రిక అనగానే గుర్తుకు వచ్చేది 'గోల్కొండ' పత్రిక. ఈ పత్రిక అప్పటి పోలీస్ కమిషనర్ రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి ప్రోత్సాహంతో 1926 మే 10న హైదరాబాద్ నుండి వెలువడింది. సురవరం ప్రతాపరెడ్డి స్థాపించిన గోల్కొండ పత్రిక జాతీయ భావ వ్యాప్తికి పాటుపడింది. ఈ పత్రిక వారానికి రెండు సార్లు వెలువడేది. ఆ రోజుల్లో తెలంగాణ ప్రజల వాస్తవిక జీవన విధానాన్ని ప్రతిబింబించిన ఏకైక పత్రికగా దీనిని చెప్పవచ్చు. తెలంగాణలోని అజ్ఞాత కవులను, వారి రచనలను వెలుగులోకి తీసుకురావడానికి ఎంతో కృషి చేసింది. ఎన్నో క్లిష్టమైన సాంఘీక, రాజకీయ, ఆర్థిక ప్రతిబంధకాలను అధిగమిస్తూ గోల్కొండ పత్రిక నిలదొక్కుకొని తెలంగాణ ఆంధ్రాభ్యుదయానికి కృషి చేసింది. తెలంగాణ ఆంధ్రోద్యమానికి బాసటగా నిలిచిన గోల్కొండ అర్ధవారపత్రిక 1947లో దినపత్రికగా మారింది. నిజాం పాలనలో తెలుగు ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం కృషి చేస్తూ 41 ఏళ్ల పాటు వెలువడిన ఈ పత్రిక 1966లో ఆగిపోయింది.

1947లో స్వాతంత్ర్య సముపార్జన, 1948లో పోలీస్ చర్య తర్వాత నిజాం రాష్ట్రం ఇండియన్ యూనియన్ లో అంతర్భాగమవడం మొదలైన కారణాల వలన పత్రికలపై ఆంక్షలు చాలా వరకు తగ్గాయి. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులయ్యారు. దీని ఫలితంగా అనేక తెలంగాణ తెలుగు దినపత్రికలు ఆవిర్భవించాయి.

తెలంగాణ (1942), మీజాన్ (1945), గోల్కొండపత్రిక (1947), ఆంధ్రప్రభ(1938), ప్రజాశక్తి(1945), విశాలాంధ్ర/మన తెలంగాణ (1952), ఆంధ్ర జనత (1955), ఆంధ్రజ్యోతి (1960), ఆంధ్రభూమి (1960), ఈనాడు(1974), ఉదయం (1984), వార్త (1996), సూర్య (2007), సాక్షి (2008), నమస్తే తెలంగాణ (2011) వంటి అనేక తెలంగాణ తెలుగు దినపత్రికలు ఆవిర్భవించాయి.

### 1.9.3. నమస్తే తెలంగాణ దినపత్రిక ఆవిర్భావం–వికాసం

అచ్చు యంత్రాల స్థాపన ప్రపంచ పత్రికారంగ ఆవిర్భావానికి కారణమయినట్లే తెలంగాణ ప్రాంతంలో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాల అణచివేత, ఆంధ్ర వలస పాలన వంటి కారణాలు నమస్తే తెలంగాణ పత్రిక ఆవిర్భావానికి దారి తీసాయి. అప్పటివరకు గల తెలుగు పత్రికల్లో తెలంగాణ ప్రాంత వార్తలకు సంస్కృతికి, సాహిత్యానికి, భాషకు తగిన ప్రాధాన్యత లేకపోవడం, వలస పాలనలో తెలంగాణ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక అణిచివేత మొదలైన కారణాలు పత్రికాస్థాపనకు దారితీసాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం తారాస్థాయికి వెళ్ళిన ఉధృతమైన దశలో తెలంగాణ ప్రాంత ప్రజల ఆవేదనను, అవసరాలను సంపూర్ణంగా చిత్రించడానికి తమదైన ఒక పత్రిక ఉంటే బాగుంటుందని ఉద్యమకారులు భావించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ వార్తలకు, వార్త కథనాలకు పెద్దపీట వేయాలని, ఇంత కాలం చులకనగా భావించబడిన తమ భాషను ప్రామాణికరించి, తెలంగాణ సంస్కృతికి పునరుజ్జీవనం కల్పించాలని నిర్ణయించుకున్నారు. తెలంగాణ ప్రాంత ఉనికిని తెలుపుతూ ఇంతకాలము తామేం కోల్పోయామో సామాన్య ప్రజల వద్దకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఏర్పడింది. దీని ఫలితంగా సంపూర్ణ తెలంగాణ ప్రాంత పత్రిక నమస్తే తెలంగాణ దినపత్రిక ఆవిర్భావానికి పునాదులు ఏర్పడ్డాయి.

#### 1.9.3.1. నమస్తే తెలంగాణ దినత్రిక ఆవిర్భావం–ఉద్యమ నేపథ్యం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నేపథ్యంతో తెలంగాణ ప్రజల కోసం, తెలంగాణ ప్రాంత అస్తిత్వ గౌరవం కోసం,  పోరాటస్ఫూర్తితో వెలువడిన దినపత్రిక నమస్తే తెలంగాణ. ఈ పత్రిక తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ పత్రికగా జూన్ 6, 2011న అల్లం నారాయణ సంపాదకత్వంలో హైదరాబాద్ నుండి వెలువడింది. 2011లో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో కె. చంద్రశేఖరరావు తెలంగాణ పబ్లికేషన్స్  ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ పత్రికను ప్రారంభించారు. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత పత్రిక యాజమాన్య మండలి నుండి వెళ్ళిపోయారు. దీనికి మొదట అల్లం నారాయణ వ్యవస్థాపక సంపాదకులుగా వ్యవహరించారు. ఆయన జూలై 14, 2014న తెలంగాణ ప్రెస్ అకాడమీ తొలి చైర్మన్‌గా నియమితులయ్యారు. అల్లం నారాయణ తర్వాత కట్టా శేఖర్ రెడ్డి పత్రిక సంపాదకులుగా కొనసాగారు. ప్రస్తుత సంపాదకులు తిగుళ్ళ కృష్ణమూర్తి.

‘మన రాష్ట్రం – మన ఆత్మ గౌరవం’ అనే ఉద్యమ నినాదంతో ప్రారంభమైన ఈ దినపత్రిక తెలంగాణ ప్రాంత జిల్లాలకు మాత్రమే పరిమితమై, తెలంగాణ రాష్ట్ర పాత ఏడు జిల్లాల నుండి (హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్, నిజామాబాద్) ఏడు

ఎడిషన్‌లుగా వెలవడుతుంది. ప్రారంభంలో ఉద్యమ నేపథ్య వార్తలకే పెద్ద పీట వేసినప్పటికీ క్రమంగా జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రీయ వార్తలతో పాటు స్పోర్ట్స్, సినిమా, బిజినెస్ వంటి అనేక అంశాలతో మిగతా తెలుగు పత్రికలకు ధీటుగా తెలంగాణ ప్రాంతీయ పత్రికగా వెలువడుతుంది. మిగతా పత్రికలతో పోలిస్తే తెలంగాణ భాష విషయంలో చెప్పుకోదగిన మార్పే కనిపిస్తుంది. మిగతా తెలుగు పత్రికల్లో తెలంగాణ ప్రాంతీయ భాష అరుదుగా కనిపిస్తాయి. కానీ ఈ పత్రికలో వ్యాస శీర్షికలు, పుటల శీర్షికలలో తెలంగాణ ప్రాంతీయ పదాలను గుర్తించవచ్చు.

ఉద్యమానికి సారథిగా ప్రారంభమైన ఈ దినపత్రిక ప్రత్యేక రాష్ట్ర సాధనలో విశేష పాత్రను పోషించింది. మారుతున్న కాలంతో పాటు అనేక మార్పులకు గురవుతూ కేవల రాజకీయ వార్తలే కాకుండా సాహిత్య, సామాజిక, చారిత్రక, వినోద, విజ్ఞాన సంబంధమైన అంశాలను ప్రచురిస్తూ ప్రజల చైతన్యమే ధ్యేయంగా ముందుకు సాగుతుంది. 2011లో 'మన రాష్ట్రం – మన ఆత్మగౌరవం' అనే నినాదంతో ప్రారంభమైన ఈ పత్రిక జూన్ 2, 2014న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 'మన రాష్ట్రం – మన పత్రిక' అనే నినాదంతో వెలువడింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత రాష్ట్ర ప్రగతిని, నాగరికతను, సంస్కృతిని ప్రోత్సహించే విధంగా పత్రిక రూపుదిద్దుకుంది. ఇంతకాలం వలస పాలనలో మగ్గిపోయిన, కనుమరుగైన తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సాహిత్యానికి తిరిగి పునర్జీవనం కల్పించే దిశగా ప్రయాణిస్తుంది. ఇది తెలంగాణ పత్రిక రంగ వికాస దశగా చెప్పవచ్చు. సమకాలీన సమాజంలో ఆదర్శ భావాలతో కూడిన విశ్లేషణాత్మక, సైద్ధాంతిక, విమర్శనాత్మక వ్యాసాలను, రాజకీయ, ఆర్థిక, వాణిజ్య సంబంధ వార్తా కథనాలను ప్రచురిస్తూ పత్రికారంగంలో తనదైన ప్రత్యేక స్థానాన్ని నిలుపుకుంటుంది. ప్రత్యేక రాష్ట్ర సాధనలో భాగంగా ప్రారంభమైన ఈ పత్రిక ప్రజాక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుంది.

రోజూ కొత్తదనాన్ని కోరుకునే నేటి తరానికి తగినట్టుగా జ్ఞానాన్ని అందించడం కోసం విషయానుగుణంగా ప్రత్యేక పుటలను విభిన్న శీర్షికలతో పాఠకులకు అందిస్తుంది. మారుతున్న కాలానుగుణంగా నిర్మాణపరమైన మార్పులను చేసుకుంటూ, నిత్య నూతనంగా కొనసాగడానికై ప్రయత్నిస్తూ, మిగతా పోటీపత్రికలకు ఏమాత్రం తీసిపోని విధంగా నమస్తే తెలంగాణ దినపత్రిక వెలువడుతుంది.

### 1.9.3.2. నమస్తే తెలంగాణ దినపత్రిక–లక్ష్యాలు

ప్రత్యేక రాష్ట్ర సాధననే ప్రధాన లక్ష్యంగా ఉద్యమ స్ఫూర్తితో ప్రారంభమైన తెలంగాణ దినపత్రిక నమస్తే తెలంగాణ. వలస పాలనలో తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను రాష్ట్ర సాధన ఉద్యమాల అణిచివేతలను వ్యతిరేకిస్తూ, తెలంగాణ ప్రాంత చరిత్ర, సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం, చారిత్రక ఆవశ్యకతల నుండి నమస్తే తెలంగాణ పత్రిక ఏర్పడింది. ప్రజాక్షేమమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగింది. అంతకుముందున్న తెలుగు పత్రికల్లో తెలంగాణ ప్రాంత ప్రజలకు, తెలంగాణ సంస్కృతికి, భాషకు, సాహిత్యానికి, రాజకీయానికి తావు లేదని గుర్తించి, ఎలాగైనా తన ఉనికిని తెలియజేయాలనే పోరాట స్ఫూర్తితో ప్రారంభమైంది. ఉద్యమానికి ఊతంగా నిలుస్తూ, ప్రజలను చైతన్య పరుస్తూ ప్రత్యేక రాష్ట్ర సాధనలో తన వంతు కృషిని నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత కూడా ఇంతకాలం మరుగునపడిన చరిత్రకు ప్రాణం పోసి, తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని పునర్నిర్మించే దిశగా అడుగులు వేస్తుంది.

### 1.9.3.3. నమస్తే తెలంగాణ దినపత్రిక–అనుబంధ పత్రికలు

జూన్ 6, 2011న రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పడిన నమస్తే తెలంగాణ పత్రికకు ప్రతి బుధవారం 'నిపుణ' పేరుతో విద్యా, ఉద్యోగ సమాచారాలను అందిస్తూ నాలుగు పేజీల ప్రత్యేక అనుబంధం వెలబడుతుంది. అలాగే ప్రతి ఆదివారం 'బతుకమ్మ' పేరుతో ఆదివార అనుబంధ సంచిక వెలువడుతుంది. తెలంగాణ రాష్ట్ర సమితి తరపున నమస్తే తెలంగాణ పత్రిక అనుబంధంగా 2011లో 'టీ న్యూస్' వార్తా ఛానల్ హైదరాబాదులో ప్రారంభించబడింది. టీ న్యూస్ 'తెలంగాణ గుండె చప్పుడు'అనే నినాదంతో ప్రసారమవుతుంది. ఈ ఛానల్ ద్వారా తెలంగాణ వార్తలు, సంస్కృతి సంబంధ విషయాలు, లైవ్ రిపోర్టులు, ఇంటర్వ్యూలు, రాజకీయ చర్చలు, క్రీడలు, వాతావరణం, కరెంట్ అఫైర్స్, వినోద కార్యక్రమాలు మొదలైనవి ప్రసారమవుతాయి.

నమస్తే తెలంగాణ అనుబంధ పత్రికగా డిసెంబర్ 15, 2016న 'తెలంగాణ టుడే' అనే తెలంగాణ ఆంగ్లభాషా దినపత్రిక హైదరాబాద్ నుంచి ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర సమితి వ్యవస్థాపకులు కె. చంద్రశేఖరరావుకు చెందిన తెలంగాణ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా ఈ పత్రిక వెలువడుతుంది. ఈ పత్రిక తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు, పరిణామాలపై ప్రధాన దృష్టి సారిస్తుంది. 'తెలంగాణ టుడే' పత్రిక సంపాదకులు కె. శ్రీనివాస్ రెడ్డి. సహసంపాదకులు ఎస్. శ్రీ వాస్తన్. ఈ విధంగా 2011లో దినపత్రిక తెలంగాణ దినపత్రిక గా ప్రారంభమైన, నమస్తే

తెలంగాణ పత్రిక శాఖలుగా విస్తరించి తెలుగు పత్రిక రంగంలో మిగతా పత్రికలకు ధీటుగా తన ప్రత్యేకతను చాటుతుంది.

### 1.9.3.4. నమస్తే తెలంగాణ దినపత్రిక–నిర్మాణం

జూన్ 6, 2011న నమస్తే తెలంగాణ దినపత్రిక 'మన రాష్ట్రం – మన ఆత్మగౌరవం' అనే నినాదంతో వెలువడి, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుండి 'మన రాష్ట్రం – మన పత్రిక' అనే నినాదంతో మారుతున్న కాలానికి అనుగుణంగా అనేకమైన నిర్మాణపరమైన మార్పులతో నిత్య నూతనంగా వెలువడుతుంది. ఈ దినపత్రికలో 16 + 4 + 16 = 36 (మెయిన్, డిస్ట్రిక్ట్ పుటలతో కలిపి) పుటలు ఉంటాయి. దీనితోపాటు ప్రతి బుధవారం నిపుణ, ఆదివారం బతుకమ్మ సంచికలు వెలువడుతాయి. రోజుకో ప్రత్యేక పుటతో పాఠకుల అభిరుచికి తగిన విధంగా విజ్ఞానాన్ని అందించడంలో మిగతా పత్రికలతో పోటీ పడుతూ నమస్తే తెలంగాణ పత్రిక వెలువడుతుంది. కేవలం రాజకీయ అంశాలే కాకుండా, ప్రజా సంక్షేమ సంబంధ విషయాలు, విద్యా, ఉద్యోగం, వైద్యం, సాహిత్యం, వినోదం, వ్యాపారం, ఆటలు వంటి అనేక రకాల అంశాలతో ప్రత్యేక పుటలతో నమస్తే తెలంగాణ దినపత్రిక వెలుబడుతుంది. ఈ పత్రిక నిర్మాణాన్ని పరిశీలిస్తే దాని ప్రత్యేకతలు మనకు అవగమవుతాయి.

### 1.9.3.5. సంపాదకీయం

నమస్తే తెలంగాణ దినపత్రిక అల్లం నారాయణ సంపాదకత్వంలో వెలువడింది. మెయిన్ ఎడిషన్‌లోని నాలుగవ పుటలో సంపాదకీయం వెలువడుతుంది. ఇందులో ప్రచురించే వ్యాసాలు వివరణాత్మకంగా, విశ్లేషణలతో, పరిశోధనాత్మకంగా సమకాలీన సమాజాన్ని చిత్రించేవిగా ఉంటాయి. రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలకు సంబంధించిన విషయాలతో ఆయా సందర్భానుసారంగా సంపాదకీయ వ్యాసాలు వెలువడుతాయి. కొన్ని సందర్భాల్లో సాహిత్య సంబంధ సంపాదకీయాలు కూడా వెలువడుతాయి. ఈ పుటలో పత్రిక హృదయంగా చెప్పబడే సంపాదకీయ వ్యాసంతో పాటు ఇతర వ్యాసాలు కూడా రోజు వెలువడుతాయి. 'జనగళం' శీర్షికన ప్రజల సమస్యలను చిత్రించే వ్యాసాలను, 'చరిత్రలోనేడు' శీర్షికన చారిత్రాత్మక విషయాలను ప్రచురిస్తున్నారు. వీటితో పాటు మంచి మాట, మాట ముచ్చట, భక్తి ప్రబోధం, ధర్మ ప్రబోధం వంటి ఉపవిభాగాలలో ఆయా అంశాల చర్చ ఉంటుంది. అల్లం నారాయణ తర్వాత కట్టా శేఖర్ రెడ్డి సంపాదకులుగా వ్యవహరించారు. ప్రస్తుత సంపాదకులు తిగుల్ల కృష్ణమూర్తి.

### 1.9.3.6. జీవన రేఖ

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రతి సోమవారం 'జీవన రేఖ' పేరుతో ప్రధాన పుటలలో భాగంగా ఒక ప్రత్యేక పుట వెలువడుతుంది. దీనిలో ప్రజా ఆరోగ్య సంబంధ విషయాలు ప్రచురిస్తారు. ఆరోగ్య సమస్యలకు సంబంధించిన సలహాలు, సూచనలు దీనిలో వెలువడుతాయి. యువతీ, యువకుల ఆరోగ్య సంబంధ విషయాలను 'టీన్స్ కాలమ్' పేరుతో ప్రచురిస్తున్నారు. ఈ పుట ద్వారా వ్యాధుల గురించిన ప్రాథమిక జ్ఞానం, నివారణ చర్యలు, పాటించవలసిన జాగ్రత్తలు పాఠకులకు అందిస్తున్నారు.

### 1.9.3.7. సలహా

నమస్తే తెలంగాణ దినపత్రిక ప్రతి బుధవారం 'సలహా' పేరుతో ఒక ప్రత్యేక పుటను వెలువరిస్తుంది. జీవన రేఖ వలె దీనిలో కూడా ఆరోగ్య సంబంధ విషయాలు ప్రచురితమవుతాయి. కానీ వ్యాధుల సమాచారం కాకుండా లేఖా రూపంలో రోగులు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ సలహాలు ఇందులో ప్రచురిస్తున్నారు.

### 1.9.3.8. నిపుణ

నమస్తే తెలంగాణ దినపత్రిక ప్రతి బుధవారం 'నిపుణ' పేరుతో విద్యా, ఉద్యోగ సమాచారాన్ని తెలిపే నాలుగు పుటల ప్రత్యేక అనుబంధాన్ని ప్రచురిస్తుంది. దీనిలో విద్యార్థుల కోసం పోటీ పరీక్షల మాదిరి ప్రశ్నపత్రాలు, స్టడీ మెటీరియల్స్, అలాగే ప్రవేశ పరీక్షల సమాచారము, వివిధ అడ్మిషన్ ప్రక్రియల సమాచారం, ఎంసెట్, నీట్, జెఈఈ, సెట్ యుజిసి నెట్ వంటి అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రచురిస్తూ విద్యార్థులకు ఎంతగానో సహాయపడుతుంది. పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిపుణులు పాఠకులకు అందిస్తుంది.

అలాగే ఉద్యోగ సమాచారానికి సంబంధించిన నోటిఫికేషన్లు, గ్రూప్స్, సివిల్ సర్వీస్, పబ్లిక్ సర్వీస్ పరీక్షల వివరాలు, దానికి సంబంధించిన స్టడీ మెటీరియల్స్ ప్రచురిస్తోంది. పోటీ పరీక్షలపై కరెంట్ అఫైర్స్, జనరల్ స్టడీస్ మొదలైన అంశాలను ప్రచురిస్తూ మిగతా పత్రికలకు ధీటుగా నిలబడి పాఠకాదరణ పొందుతుంది.

### 1.9.3.9. రైతు బడి

వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవిస్తున్న ప్రజల కోసం పత్రికా రంగం వారంలో ఒక పుటను ప్రత్యేకించి వ్యవసాయ సంబంధ వార్తలకు కేటాయిస్తుంది. ఈ సంప్రదాయాన్ని నమస్తే తెలంగాణ దినపత్రిక కూడా పాటిస్తుంది. నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రతి శనివారం '

రైతుబడి' పేరుతో వ్యవసాయ సంబంధ ప్రత్యేక పుట వెలువడుతుంది. ఈ పుటలో పంటల రకాలు, ఎరువుల వాడకం, సేంద్రియ ఎరువుల ద్వారా అధిక దిగుబడి సాధించడం ఎలా?, తెగుళ్ళ రకాలు, వాటి నివారణ చర్యలు వంటి అనేక అంశాలకు సంబంధించిన విషయాలను ప్రచురిస్తున్నారు. ఆధునిక పరికరాల పరిచయం, ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులను పాఠకులకు రైతు బడి వేదికగా తెలియజేస్తుంది. దీని ద్వారా పాఠకులకు నూతన వ్యవసాయ సంబంధ విషయాలపై అవగాహన ఏర్పడుతుంది.

### 1.9.3.10. నమస్తే నోటిఫికేషన్

'నమస్తే నోటిఫికేషన్' పేరుతో నమస్తే తెలంగాణ దినపత్రిక వారంలో నాలుగు రోజులు ఒక ప్రత్యేక పుటను ప్రచురిస్తుంది. ఈ పుట ద్వారా ఉద్యోగ నోటిఫికేషన్లు, విశ్వవిద్యాలయాల అడ్మిషన్స్ కి సంబంధించిన నోటిఫికేషన్లు ప్రచురిస్తున్నారు. దేశ, విదేశాల్లో కల అన్ని రకాల విద్యా, ఉద్యోగ సంబంధ నోటిఫికేషన్ల సమాచారాన్ని పాఠకులకు అందిస్తూ, వారికి ఎంతగానో సహాయపడుతున్నారు.

### 1.9.3.11. బిజీ మార్కెట్

నమస్తే తెలంగాణ దినపత్రిక వాణిజ్య సంబంధమైన వార్తలను బిజీ మార్కెట్ శీర్షికతో ప్రతిరోజు ఒక ప్రత్యేక పుటను ప్రచురిస్తుంది. దీనిలో వ్యాపార సంబంధ విషయాలు, స్టాక్ మార్కెట్, బంగారం, వెండి ధరలు, విదేశీ వర్తక వాణిజ్యం, అంతర్జాతీయ వ్యాపారం మొదలైన విషయాలను ఈ పుటలో ప్రచురిస్తున్నారు.

### 1.9.3.12. ఖేల్

నమస్తే తెలంగాణ దినపత్రికలో క్రీడా సంబంధ విషయాలకై ప్రతిరోజు 'ఖేల్' అనే పేరుతో ప్రత్యేక పుట వెలువడుతుంది. దీనిలో జాతీయ, అంతర్జాతీయ క్రీడా సంబంధ విషయాలు, క్రీడాకారుల విజయాలకు సంబంధించిన విషయాలుంటాయి.

### 1.9.3.13. టాకీస్:

సినిమా రంగానికి సంబంధించిన విషయాలను 'టాకీస్' పేరుతో ప్రతిరోజు నమస్తే తెలంగాణ దినపత్రిక ప్రచురిస్తుంది. దీనిలో అన్ని ప్రాంతాల సినిమాల గురించి, కొత్తగా విడుదలయ్యే సినిమా సమాచారం, సినీ పరిశ్రమకు సంబంధించిన విషయాలు, నటీ, నటుల జీవిత విశేషాలు, సినీ విజయాలు, సినీ తారల ఇంటర్వ్యూలు, సినీ కార్యక్రమాలు మొదలైన విషయాలను ప్రచురిస్తూ అధిక పాఠకాదరణ పొందుతుంది.

### 1.9.3.14. జిందగీ

నమస్తే తెలంగాణ దినపత్రిక సమకాలీన సమాజానికి సంబంధించిన విషయాలను, విజేతలుగా నిలిచిన వ్యక్తుల జీవిత విశేషాలను స్పెషల్ స్టోరీలుగా మలచి, 'జిందగీ' అనే పేరుతో ప్రత్యేక పుటను ప్రతి రోజు ప్రచురిస్తుంది. దీనిలో స్త్రీలకు సంబంధించిన విషయాలు, ప్రముఖుల ఇంటర్వ్యూలు, తెలంగాణ పురాతన చరిత్ర, యాత్ర స్థలాల వివరాలు, స్ఫూర్తిదాయకమైన వ్యక్తుల సమాచారం వంటి అనేక అంశాలతో రోజుకో ప్రత్యేక కథనంతో జిందగీ పుట పాఠకులను ఆకర్షిస్తుంది.

### 1.9.3.15. బతుకమ్మ

నమస్తే తెలంగాణ దినపత్రిక ఆదివారం అనుబంధ సంచిక 'బతుకమ్మ' పేరుతో వెలువడుతుంది. తెలంగాణ ప్రాంతీయ పండుగ బతుకమ్మను సంచిక శీర్షికగా పెట్టి ప్రతి ఆదివారం ప్రచురిస్తున్నారు. దీనిలో తెలంగాణ ప్రాంత చరిత్ర, పండుగలు, బుక్ రివ్యూ పేరుతో పుస్తక సమీక్షలు, సైన్స్ శీర్షికతో శాస్త్ర సాంకేతిక విషయాలు, స్పోర్ట్స్ శీర్షికన క్రీడా సంబంధ విషయాలు, వాస్తు సంబంధ విషయాలు, 'వాసి– రాశి' శీర్షికన రాశి ఫలాలు, ఎంటర్టైన్మెంట్ పేరుతో వినోద సంబంధ విషయాలను ప్రచురిస్తున్నారు. పిల్లల కోసం ప్రత్యేకించి 'అల్లరి' అనే పేరుతో బాలల గేయాలు, కథలు, ఆటలు మొదలైన అంశాలను బతుకమ్మలో ప్రచురించి విశేష పాఠకాదరణ పొందుతున్నారు.

### 1.9.3.16. చెలిమె

ప్రస్తుతం వెలువడుతున్న తెలుగు దినపత్రికల వలె నమస్తే తెలంగాణ దినపత్రికలో కూడా ప్రతి సోమవారం 'చెలిమె—సాహిత్య సర్వస్వం' అనే పేరుతో సాహిత్య పుట పత్రిక ప్రారంభం నుండి వెలువడుతుంది. 2011లో పత్రిక ప్రారంభమైన నాటి నుండి 2013 వరకు చెలిమె పుట ప్రతి బుధవారం వెలువడేది. 2014 నుండి ప్రతి సోమవారం ప్రధాన పుటలలో నాలుగవ పుటగా వెలువడుతుంది. దీనిలో ప్రధానంగా సాహిత్య సంబంధ విషయాలు, సాహిత్యకారుల పరిచయం, నూతన పుస్తకాల పరిచయం, సాహిత్య సమావేశాల వివరాలు మొదలైన అంశాలుంటాయి. మిగతా సాహిత్య పుటలకన్నా దీనిలో తెలంగాణ ప్రాంతీయ సాహిత్యానికి, కవులకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. వలస పాలనలో తెలుగు పత్రికల్లో తెలంగాణ ప్రాంత భాషా సాహిత్యాలకు అంతగా ఆదరణ లభించకపోవడం వలన తెలంగాణ ఆత్మగౌరవంగా ప్రారంభించిన ఈ పత్రికలో,

తెలంగాణ ప్రాంతీయ సాహిత్యానికి పెద్దపీట వేస్తున్నారు. తెలంగాణ ప్రాంతీయ సాహిత్యంతో పాటు మిగతా తెలుగు సాహిత్యాంశాల వ్యాసాలు కూడా దీనిలో ప్రచురిస్తున్నారు.

'చెలిమె–సాహిత్య సర్వస్వం' అనే ఈ శీర్షికలో 'చెలిమె' పదానికి తెలంగాణ మాండలిక వ్యవహారంలో ఒక 'ఊట జల' అని అర్థం. దీన్ని ఇతర ప్రాంతాలలో 'చెలమ' అని వాడుతారు. చెలిమెలో మనం తీసినకొద్దీ నీరు ఊరుతూ ఉంటుంది. ఆ నీటికి అంతం అనేది ఉండదు. సాహిత్యం కూడా ఒక ఊట జలలాంటిదని, అది ఎన్నటికీ తరగదనే భావనతో ఈ పుట కు 'చెలిమె' అనే పేరు పెట్టి ఉంటారని నా అభిప్రాయం.

'చెలిమె.. సాహిత్య సర్వస్వం' అనే పేరుతో వస్తున్న ఈ సాహిత్య పుట  మొదట గొప్ప వ్యక్తుల సూక్తితో ప్రారంభమవుతుంది. "మీరు చేసే పని అద్భుతంగా ఉండాలంటే దాన్ని ప్రేమించడం నేర్చుకోండి..." ఐన్‌స్టీన్ (నవంబర్ 20, 2017; నమస్తే తెలంగాణ – చెలిమె). ఇలా ప్రతివారం ఒక సూక్తితో ఈ పుట ప్రారంభమవుతుంది.

ఈ సాహిత్య పుటలో ప్రధానంగా భాషా, సాహిత్యం, కవిత్వం, కథలు, కవులు, రచయితలకు సంబంధించిన వ్యాసాలు, పుస్తక సమీక్ష వ్యాసాలు, నూతన పుస్తకాల పరిచయం, సాహిత్య సమావేశాలు, పుస్తకావిష్కరణలు, సభలకు సంబంధించిన సమాచారం మొదలైనవి ప్రచురితమవుతాయి.  పత్రిక ప్రారంభంలో తెలంగాణ ఉద్యమ సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలు ఎక్కువగా వచ్చేవి. ప్రస్తుతం అన్ని రకాల సాహిత్యానికి 'చెలిమె' పుట వేదికగా మారింది. చెలిమె పుట  తెలంగాణలో మరుగున పడిన కవులను, వారి రచనలు వెలికి తీయడమే ప్రధానలక్ష్యంగా సాగుతుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ సాహిత్య పునర్నిర్మాణం జరగాల్సిన అవసరం ఉంది. కావున కొత్త కొత్త కవులను, రచయితలను పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రధానంగా పత్రికల పైన ఉంది. కాబట్టి ఆ కృషిని పత్రిక ప్రారంభం నుంచి నేటి వరకు నమస్తే తెలంగాణ దినపత్రిక సాహిత్య పుట చాలా వరకు నిర్వహిస్తుంది. ప్రస్తుతం నమస్తే తెలంగాణ పత్రిక సాహిత్య పుట ప్రతి ఆదివారం ప్రధాన పుటలో నాలుగో పుటగా వెలువడుతుంది.

ప్రత్యేక రాష్ట్ర సాధనయే  ధ్యేయంగా, ఉద్యమ పోరాట పత్రికగా ప్రారంభమైన నమస్తే తెలంగాణ దినపత్రిక ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, నేడు ఎంతగానో విస్తృతమై జాతీయ, అంతర్జాతీయ విషయాలను ప్రచురిస్తూ రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాహిత్యం క్రీడా, వ్యాపారం మొదలైన అనే విషయాలను ప్రతిబింబిస్తూ, ప్రజా క్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణానికి తన వంతు కృషి చేస్తుంది. మిగతా తెలుగు పత్రికలకు ధీటుగా

కాలానుగుణమైన, నిర్మాణపరమైన, మార్పులతో నిత్య నూతనంగా విలసిల్లుతూ, పాఠకాదరణ పొందుతుంది.

**ఈ అధ్యాయంలోని ముఖ్యాంశాలు**

1) ఈ అధ్యాయంలో భారతదేశ ముద్రణాయంత్రాల ఆవిర్భావము, పరిణామాలను అలాగే తెలుగు ముద్రణా యంత్రాలు ఆవిర్భావం, పరిణామ వికాసాలను వివరించాను.

2) భారతీయ పత్రిక ఆవిర్భావం, తొలి తెలుగు పత్రికల వివరాలు తెలిపాను.

3) తెలుగు దినపత్రికల ఆవిర్భావం, వాటి నిర్మాణాన్ని తెలియజేస్తూ సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల ఆవిర్భావ వికాసాలను, లక్ష్యాలను, అనుబంధాలను పరిచయం చేస్తూ, వాటి నిర్మాణంలోని ప్రత్యేకతలను వివరించాను.

4) సాక్షి, నమస్తే తెలంగాణ అనే రెండు దినపత్రికలలోని సాహిత్య అనుబంధాల పరిచయం జరిగింది.

ఈ విధంగా  ఈ అధ్యాయంలో సాక్షి , నమస్తే తెలంగాణా పత్రికల ఆవిర్భావ వికాసాలు, వాటి నేపథ్యం, స్వరూప స్వభావాలను పరిచయం చేశాను. అలాగే ఈ పత్రికల్లో ఉన్న సాహిత్య పుటలను పరిచయం చేస్తూ, వాటి ప్రత్యేకతలను వివరించాను. ఈ పత్రికల్లోని వ్యాసాలను పరిశీలించి, అందులో ఉన్న విమర్శ భేదాలను గుర్తించి, రాబోయే అధ్యాయాల్లో వాటిని విమర్శ లక్షణాలకు అనుగుణంగా నిరూపించే ప్రయత్నం చేస్తాను. రాబోయే అధ్యాయాల్లో ఈ రెండు పత్రికల్లోని సాహిత్య వ్యాసాలను విమర్శనాత్మక పద్ధతిలో పరిశీలిద్దాం.

★★★

# రెండవ అధ్యాయం

## సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య

## వ్యాసాలు–కవిత్వ విమర్శ

# అధ్యాయం–2

# సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు–కవిత్వ విమర్శ

## 2.0. పరిచయం

ప్రస్తుత కాలంలో సాహిత్య పుటల్లో కవిత్వ సంబంధ విషయాలకు అధిక చోటు కల్పిస్తున్నారు. కవిత్వ సంబంధ వ్యాసాలు, కవిత్వ పుస్తక సమీక్షలు, కవితలు, కవిత్వ సంబంధ సమాచార ప్రచురణ ఇలా అనేకరకాలుగా కవిత్వ సంబంధ విషయాలను సాహిత్య పుటల్లో ప్రచురిస్తున్నారు. సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్యపుటలు కూడా ఈ సంప్రదాయాన్ని పాటిస్తూ మిగతా వ్యాసాల కంటే కవిత్వ వ్యాసాలకే అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారు. 2016, 2017 రెండు సంవత్సరాల సాహిత్య పుటల్లో వెలువడిన మొత్తం 204 వ్యాసాల్లో 90 వ్యాసాలు కవిత్వానికి సంబంధించినవే కావడం విశేషం. దీనిని మీరు అనుబంధం–5 లో పేర్కొన్న ఈ రెండు పత్రికల్లోని సాహిత్య వ్యాసాల రేఖా చిత్రంలో గమనించవచ్చు. ఈ కవిత్వ సంబంధ వ్యాసాలు అనేక రకాలుగా వెలువడుతున్నాయి. నా పరిశోధనా సౌలభ్యం కొరకు వీటిని వివిధ ఉపవిభాగాలుగా విభజించి విశ్లేషించాను. పరిశోధన గ్రంథ భీతిచే అన్ని వ్యాసాలను ఈ అధ్యాయంలో విశ్లేషించలేకపోయాను. ఒక్కొక్క విభాగానికి ఒకటి లేదా రెండు వ్యాసాలను కొన్ని సందర్భాల్లో మూడు వ్యాసాలను స్వీకరించి విమర్శనాత్మక పద్ధతుల ఆధారంగా విశ్లేషించాను. కవిత్వ సంబంధ వ్యాసాలను విశ్లేషించుకునే ముందు అసలు కవిత్వమంటే ఏమిటి? కవి అంటే ఎవరు? కవిత్వ నిర్వచనాలు, వాటి లక్షణాల గురించి తెలుసుకోవాలి. ప్రాచీన కాలం నుండి నేటివరకు కవితా ప్రస్థానం ఏ విధంగా సాగిందో తెలుసుకున్నట్లయితే మనకు కవిత్వ విశిష్టత అలాగే కవిత్వ విమర్శ గురించి సులువుగా అవగతమవుతుంది.

## 2.1. కవిత్వం–ఆలంకారిక నిర్వచనాలు, లక్షణాలు

కవిత్వ విమర్శ గురించి తెలుసుకునే ముందు కవి, కవిత్వం, కవిత్వ నిర్వచనం, స్వరూపం (కవితా రూపాలను) గురించి అధ్యయనం చేయాలి. ప్రాచీన సాహిత్యంలో నేటి కవిత్వము కావ్యముగా చెప్పబడింది. ప్రాచీన అలంకారికులు కవి, కావ్యం గురించి భిన్న అభిప్రాయాలను తెలిపారు.

### 2.1.1. కవి

కవి గురించి చెప్పాలంటే "ప్రప్రథమమున కవిర్మనీషీపరిభూః స్వయంభూః" అని కవి శబ్దము పరమాత్మ పరముగా వైదిక మంత్రములందుఁగానవచ్చుచున్నది. క్రమముగా నా పదము

పరమాత్మ యొక్క సాక్షాత్కారమును బొందిన 'ఋషి'పరముగా వ్యవహారమునకు వచ్చినది. సాక్షాద్ద్రష్టలయిన వైదిక ఋషులు కవులు. వారి కావ్యములుపనిషత్తులు. ఆద్యులగు వైదిక కవులును, లౌకికులగు వాల్మీకి వ్యాసాదులును ఋషులగుటచేతను, వారు దివ్యదృష్టితో లోక రహస్య మెఱిఁగిన వారగుటచేతను, వారి కావ్యములు లోకోత్తర వర్ణనాత్మకములగుట చేతను "నానృషిః కురుతే కావ్యం" (ఋషిగానివాఁడు కావ్యమును రచింపఁజాలఁడు) కవయః క్రాంతదర్శినః (కవులు దివ్యదృష్టిగలవారు) అనులోకోక్తులు గలిగినవి"(సూర్యనారాయణ శాస్త్రి, సన్నిధానం.2013. పుట.109).

ఋషికానివాడు కవికాడని చెప్పారు ప్రాచీన అలంకారికులు. ఋషి అంటే ద్రష్ట అని అతను దర్శించిన విచిత్ర వస్తువుల యొక్క ధర్మాలను తెలుసుకోవటమే ప్రతిభ అని చెప్పారు.

**"ప్రజ్ఞానవనవోన్మేష శాలినీ ప్రతిభామతా**
**తదను ప్రాణనాజ్జీవే ద్వర్ణనా నిపుణః కవి"**

(సూర్యనారాయణ శాస్త్రి, సన్నిధానం.2013. పుట:110).

నవనవోన్మేషశాలిని యగు ప్రజ్ఞ అనేది ప్రతిభ అని తెలిపాడు ఆనందవర్ధనుడు.

**"అపారే కావ్యసంసారే కవిరేవప్రజాపతిః**
**యథాస్మైరోచతే విశ్వం తథేదం పరివర్తతే"**

(సూర్యనారాయణ శాస్త్రి, సన్నిధానం.2013. పుట:110).

అని చెప్పి కవిలోకాన్ని పాలించే బ్రహ్మ తనకు నచ్చినట్టుగా లోకాన్ని మార్చగల శక్తి కలవానిగా నిర్వచించాడు.

"కవనీయం కావ్యం" (వర్ణింపఁదగినది) అని లోచనకారుడు, "కవయతీతి కవిః తస్యకర్మ కావ్యం" (వర్ణించువాడు కవి. అతని కర్మ కావ్యము) అని విద్యాధరుడు. "కౌతి శబ్దాయతే విమృశతి రసభావాన్ ఇతి కవిః తస్యకర్మ కావ్యం" (రసభావములను విమర్శించువాఁడు కవి. వాని కర్మ కావ్యము) అని భట్టగోపాలుడు, "లోకోత్తర వర్ణనా నిపుణ కవికర్మ కావ్యం" (లోకోత్తర వర్ణనా నిపుణకవి కర్మ కావ్యం) అని మమ్మటుడు ఇవన్నియుఁగవికర్మను దెలుపుచున్నను నిందుఁ గవిలక్షణ మిమిడియే యున్నది. వీనిలోని "లోకోత్తర వర్ణనా నిపుణ కవికర్మ కావ్యం" అను దానిని బట్టి లోకోత్తర వర్ణనా నిపుణుఁడే కవియని సారాంశము" (సన్నిధానం, సూర్యనారాయణ, 2013, పుట.111). కవి గూర్చిన నిర్వచనాన్ని ప్రాచీనులు తెలుపుతూ ఋషి, బ్రహ్మ, నిపుణుడు, లోకోత్తర వర్ణనా నైపుణ్యం కలిగినవాడిగా అభిప్రాయాన్ని తెలిపారు.

### 2.1.2. కవిత్వం

కావ్యాన్ని కవిత్వం అనే అర్థంలో వాడారు భారతీయ అలంకారికులు తమకు తోచిన విధంగా కావ్యాన్ని నిర్వచించారు. కవి తన భావాలను వ్యక్తీకరించే విధానం ఏదైతే ఉందో దాన్ని కవిత్వంగా చెప్పారు.

**భరతుడు**

"ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితమ్" అని ఏదైనా ఇతివృత్తం, వస్తు విషయానికి సంబంధించిన కవిత్వం కావ్యం అని చెప్పాడు. కవిత్వం గూర్చి సంస్కృత లాక్షణికులు ఎక్కువగా చర్చించారు. భరతున్ని మొదలుకొని చాలామంది కవిత్వాన్ని నిర్వచించారు. "దాదాపు రెండు వేల సంవత్సరముల క్రితమే భరతుడు నాట్యశాస్త్రమును రచించెను. ఈ గ్రంథము ప్రధానముగా రూపకముల గురించి, రూపక భేదముల గురించి ఉద్దేశింపబడినది. భరతుడు దృశ్యకావ్యమునకు శ్రవ్యకావ్యమునకు భేదము పాటింపలేదు. రెంటిని కావ్యము క్రిందనే పరిగణించెను. నాట్యమునకు కావ్యమునకు ఇతడభేదము పాటించినట్లు ఈ క్రింది ఉదాహరణము వలన స్పష్టమగును.

**"ఉపమా రూపకంచైన దీపకం యమకం తథా**
**అలంకారాస్తువిజ్ఞేయాః చత్వారోనాటకశ్రయాః**
**యత్కించిత్కావ్య బంధేషు సాదృశ్యానోపమీయతే**
**ఉపమానామవిజ్ఞేయా గుణాకృతి సమాశ్రయా"**

భరతుడు నాట్యము, కావ్యబంధము అను పదములు సమానార్థమున ఉపయోగించినాడన్నది పై యుదాహరణము వలన స్పష్టము" (2011.పుట.53) అని సి. నారాయణ రెడ్డి గారు తెలిపారు.

భరతుని దృష్టిలో కావ్యమంటే ఏమిటి అనే విషయాన్ని సి.నా.రె. వివరిస్తూ "అతని దృష్టిలో కావ్యమనగా ఇది:

**"మృదులలిత పదార్థం గూఢ శబ్దార్థహీనం**
**బుధ జనసుఖయోగ్యం బుద్ధిమన్నృత్యయోగ్యం**
**బహురసకృతమార్గం సంధిసంధానయుక్తం**
**సభవతి శుభకార్యం నాటక ప్రేక్షకానామ్"**

కావ్యము మృదు పదార్థములతో కూడుకొని ప్రసాదగుణమయముగా నుండవెలనని భరతుని అభిప్రాయమైనట్లు స్పష్టమగుచున్నది. ఇతని యభిమతమున కావ్యశరీరమితివృత్తమై.

‘ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితమ్’ అని యతడనెను. కావ్యశరీరమితివృత్తమైనను దాని సౌందర్య హేతువు రసమని స్పష్టపరిచెను” (సి.నా.రె. 2011. పుట.53).

భరతుని తర్వాత అలంకారికులు తమ అభిప్రాయాలను తెలియజేసారు. భామహుడు, దండి, వామనుడు, ఆనందవర్ధనుడు, మహిమభట్టు, కుంతకుడు, క్షేమేంద్రుడు, మమ్మటుడు, విశ్వనాథుడు, జగన్నాథుడు ముఖ్యులుగా చెప్పవచ్చు. చాలామంది ఇచ్చిన నిర్వచనాలు ఉన్నప్పటికి అందులో విశ్వనాథుడు, జగన్నాథుడు, మమ్మటుల నిర్వచనాల కావ్యసంబంధమైన వాటిలో ముఖ్యమైనవిగా చెప్పవచ్చు అంటూ కాకర్ల వెంకట రామ నరసింహం వారి సాహిత్య దర్శనములో వివరిస్తూ “అలంకారికులు చెప్పిన కావ్య నిర్వచనములు పెక్కులు గలవు. అందు పిమ్మట విశ్వనాథ జగన్నాథులు చెప్పిన నిర్వచనములు ముఖ్యములు. ఈ యాలంకారికులు ముప్వురిలో మమ్మటుడు ప్రథముడు. అతఁడు చెప్పిన కావ్యలక్షణము.

**మమ్మటుడు**

**“తదదోషౌ శబ్దార్థౌ సగుణావనలంకృతీ పునఃక్వాపి”**

“అదోషములును, సగుణములును, సాలంకారములును అగు శబ్దార్థములు కావ్యము” (1985.పుట:43) అని తమ అభిప్రాయాన్ని చెప్పారు.

**విశ్వనాథుడు**

మమ్మటుడు చెప్పిన కావ్య లక్షణాన్ని విశ్వనాథుడు ఖండించాడు. “విశ్వనాథుడు కావ్యలక్షణమునిట్లు చెప్పియున్నాఁడు. “వాక్యం రసాత్మకం కావ్యమ్” రసాత్మకమయిన వాక్యము కావ్యము. విశ్వనాథుడు చెప్పిన ఈ లక్షణమును జగన్నాథుడు ఖండించియున్నాడు. ఆతని ఖండన విధానమిది. “వాక్యం రసాత్మకం కావ్యమ్” అను లక్షణము చింత్యము. రసాత్మకమే కావ్యము, అన్యము కాదు అని చెప్పినచో, వస్త్వలంకార ప్రధానములు కావ్యములు కాకపోవలసి వచ్చును” (కాకర్ల వెంకట రామ నరసింహం.1985.పుట.47) అని విశ్వనాథుడు చెప్పిన దాన్ని ఖండించి వివరణ ఇచ్చాడు జగన్నాథుడు. అలాగే మమ్మటుని కావ్య లక్షణాన్ని కూడా ఖండించాడు.

**జగన్నాథుడు**

జగన్నాథుడు రసగంగాధరంలో కావ్యాన్ని నిర్వచిస్తూ లక్షణాన్ని చెప్పాడు.

**“రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్**

**రమణీయమగు నర్థమును ప్రతిపాదించు శబ్దము కావ్యము”**

(కాకర్ల వెంకట రామ నరసింహం.1985.పుట.50)

"ఇది నిర్దుష్టమగు కావ్య లక్షణము. రమణీయార్థ ప్రతిపాదక శబ్దమగుట వలన కావ్యము కావ్యేతర భిన్నము. ఏది రమణీయార్థ ప్రతిపాదిక శబ్దము కాదో అది కావ్యము కాదు. తర్కసంగ్రహమువలె, ఏవి రమణీయార్థ ప్రతిపాదక శబ్దమగునో, అది కావ్యము" (కాకర్ల వెంకట రామ నరసింహం. 1985.పుట.50) ఇలా జగన్నాథుడు కావ్య నిర్వచనాన్ని వివరించాడు.

### 2.1.3. ఇతర ఆలంకారికుల నిర్వచనాలు

ఆలంకారికులలో శబ్దాన్ని ఆధారం చేసుకొని కావ్యమన్నవారు కొందరైతే అర్థాన్ని కూడా కలుపుకొని శబ్దార్థాలు కావ్యమన్నవారు కొందరున్నారు. అందులో శబ్దం కావ్యమన్న వాళ్ళ గూర్చి తెలుసుకుందాం:

"1) ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళి, కావ్యాదర్శము – దండి.

2) కావ్యం రసాది మద్వాక్యం శ్రుతం సుఖవిశేషకృత్ – అలంకార శేఖరమహాశౌద్ధోదని – తద్వృత్తికారుఁడు కేశవమిశ్రుడు.

3) నిర్దోషం గుణవత్కావ్య మలంకారైరలంకృతమ్, రసాత్మకం కవిఃకుర్వన్ కీర్తిం ప్రీతించవిందతి. సరస్వతీ కంఠాభరణము – భోజుడు.

4) నిర్దోషా లక్షణవతీ సరీతిర్గుణ గుంఫితా సాలంకార రసానేక వృత్తిర్వాక్ కావ్యనామభాక్ చంద్రాలోకము – జయదేవుడు"

(కాకర్ల వెంకట రామ నరసింహం. 1985. పుట:53)

**శబ్దార్థాలు కావ్యం అనేవారు:**

"1) శబ్దార్థౌ సహితౌ కావ్యమ్ – భామహాలంకారము – భామహుడు.

2) నను శబ్దార్థౌకావ్యమ్ – రుద్రటుడు.

3) కావ్యశబ్దో అయం గుణాలంకార సంస్కృతయోః శబ్దార్థయోర్వర్తతే. కావ్యాలంకారము – వామనుడు.

4) సాధుశబ్దార్థ సందర్భంగుణాలంకార భూషితమ్; స్ఫుటరీతిరసోపేతం కావ్యం కుర్వీత కీర్తయే – వాగ్భటుఁడు.

5) గుణాలంకార సహితౌ, శబ్దార్థో దోష వర్జితౌ – కావ్యం విదోవిదుః ప్రతాపరుద్రీయము – విశ్వనాథుడు.

6) తత్ర నిర్దోష శబ్దార్థ గుణవత్త్వేసతిస్ఫుటమ్, గద్యాది బంధరూపత్యమ్, కావ్య సామాన్య లక్షణమ్. సాహిత్యసారము – అచ్యుతరాయలు.

7) **గుణాలంకార సంయుక్తౌ**
**శబ్దార్థౌరసభావగే**
**నిత్యదోష వినిర్ముక్తౌ**
**కావ్యమిత్య భియధీయతే** **(అలంకార చంద్రిక – న్యాయవాగీశుఃడు)"**

(కాకర్ల వెంకట రామ నరసింహం. 1985.పుట. 53, 54)

ప్రాచీన ఆలంకారికులు తమ ఇష్టానుసారంగా శబ్దార్థములను, గుణములను ఆధారం చేసుకొని కావ్య చర్చ చేసారు. వాటి లక్షణాలను ఈ విధంగా నిర్వచించారు.

**2.1.4. పాశ్చాత్యులు**

పాశ్చాత్యుల కావ్య నిర్వచనానికి, ప్రాచీనుల కావ్య నిర్వచనాలకి భేదం అనేటువంటిది గుర్తించాలి. మన ప్రాచీన ఆలంకారిక దృష్టిలో కావ్యం అనే పదం పద్యం, గద్యం కావచ్చు కానీ పాశ్చాత్యులు అన్ని సాహిత్య ప్రక్రియలను కావ్యాలుగా పరిగణించలేదు. విశిష్టమైన లక్షణాలతో ఉన్న ప్రక్రియనే కవిత్వంగా పరిగణించారు. కవిత్వ లక్షణాలను వివిధ రకాలుగా నిర్వచించారు.

"కవిత్వమును తొలిసారిగా నిర్వచించిన పాశ్చాత్య లాక్షణికుడు అరిస్టాటిల్. ఇతడు కవిత్వమును (కళలన్నిటిని) ప్రకృతికనుకరణమనెను. అరిస్టాటిల్ ప్రత్యేకించి ఒక సూత్రములో ఈ విషయము చెప్పకున్నను, ఆ భావము నాధారముగా జేసికొని కవిత్వమును, కళలను, వాని స్వరూప స్వభావములను నిర్ణయించెను. ఇతనిది అనుకరణ సిద్ధాంతము (Imitation Theory)" (సి.నా.రె. 2011.పుట.66).

అనుభూతిని ఆధారం చేసుకొని కొందరు ఊహాశక్తిని కొందరు లయను, శబ్దాన్ని, వ్యక్తీకరణను దృష్టిలో పెట్టుకొని కొందరు కవిత్వ నిర్వచనాలను ఇచ్చారు.

"అనుభూతిని (Feeling), ఆవేశమును (Emotion) పురస్కరించుకొని చేసిన నిర్వచనములు.

i) Poetry is 'the spontaneous overflow of powerful feelings'– Wordsworth.
(తీవ్రానుభూతుల స్వచ్ఛంద విజృంభణమే కవిత్వము)

ii) 'But the thought and words in which emotion spontaneously embodies itself – Mill.
(ఆవేశము స్వచ్ఛందముగా రూపొందిన శబ్దార్థములు కవిత్వము)

iii) 'A vent for over – charged feeling' – Keble

(ఉప్పొంగు అనుభూతుల అభివ్యక్తి కవిత్వము)

iv) 'The suggestion by the imagination of noble grounds for the noble emotions' – Ruskin

(ఊహ ద్వారా ఉదాత్తవేశములకు ఉత్తమాలంబనము కల్పించునది కవిత్వము)" (సి.నా.రె. 2011.పుట:66, 67)

"John Dryden: Delight is the chief, if not the only end poesy; instruction can be admitted but in the second place; for poesy only instructs as it delights".

కవిత్వమున కానందము ఏకైక ప్రయోజనము కాకపోయినను, ముఖ్య ప్రయోజనము. ఉపదేశము గౌణమే కాని ప్రధానము కాదు. ఏలన కవిత్వము, ఆనందమును కలిగించుచునే ఉపదేశము చేయును. మన అలంకారికుల అభిప్రాయములకును, డ్రైడెన్ మహాకవి అభిప్రాయమునకును భేదమే లేదనుట నిర్వివాదము (కాకర్ల వెంకట రామ నరసింహం 1985. పుట. 60).

"Dr. Johnson: 'poetry' says Johnson is, "metrical composition": it is "the art of uniting pleasure with truth, by calling imagination, to the help of reason", and its 'essence' is "invention" (కాకర్ల వెంకట రామ నరసింహం. 1985. పుట:60).కవిత్వం అనేది ఒక ఛందోబద్ధమైన రచన. ఆనందాన్ని, సత్యాన్నిచ్చే కళయిది. కొత్త కల్పనే దీని ప్రధాన గుణం అని నిర్వచించాడు జాన్సన్.

అలాగే మాథ్యూ ఆర్నాల్డ్ అనే నైతికవాది కవిత్వాన్ని – "Poetry is at bottom a criticism of life. Poetry is simply the most delightful and perfect form of utterance that human words can reach" (సి.నా.రె. 2011. పుట:67) అని నిర్వచించాడు. కవిత్వాన్ని మానవసంబంధ విమర్శగా చెప్పాడు. ఇందులో శబ్ద ప్రాముఖ్యత కన్పిస్తుంది. శబ్దాన్ని బట్టి పొందిక బట్టి అత్యుత్తమరూపం కవిత్వానికి వర్తిస్తుందని అర్థం.

శామ్యూల్ జాన్ సన్ అనే పండితుడు – "Poetry is the metrical composition. It is the art of uniting pleasure with truth by calling for the imagination

to the help of reason (సి.నా.రె. 2011. పుట.68) కవిత్వం ఛందోబద్ధరచనగా చెప్పాడు. వీళ్ళే కాకుండా షెల్లీ, కాల్ రిడ్జ్, ప్లేటో ఎంతోమంది కవిత్వం గూర్చి వివరించారు.

### 2.1.5. తెలుగు ప్రాచీన కవుల నిర్వచనాలు

కవులు తమ కావ్యాల్లో కవితాగుణాలను చెప్పే సందర్భంలో కవిత్వ లక్షణాలను చెప్పారు. "నన్నయ జగద్ధితంబుగా రచించినాడు. అలాగే ఆంధ్ర శబ్ద చింతామణిలో మనకు "విశ్వశ్రేయః కావ్యమ్" అనే వాక్యం కన్పిస్తుంది. ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని చేసిన నిర్వచనం ఇది. కవిత్వ ప్రయోజనంగా ఇతడు ఆనందాన్ని ఆహ్లాదాన్ని చెప్పలేదు. సమస్త ప్రజా శ్రేయస్సే కావ్య లక్ష్యంగా ప్రకటించాడు. శివకవులుగా ప్రసిద్ధి గాంచిన వారిలో పాల్కురికి సోమనాథుడు కవిత్వాన్ని గురించి చెప్తూ –

**"అల్పాక్షరముల అనల్పార్థరచన**
**కల్పించుటయే గాదె కవి వివేకంబు"**

(ప్రాచీనాంధ్ర కవులు సాహిత్యాభిప్రాయాలు – అభిరుచులు, పుట.13)

అన్నాడు. ఇది మామూలు భాషకీ, కవిత్వ భాషకీ తేడాని స్పష్టం చేస్తున్న నిర్వచనం. భావాన్ని అతి తక్కువ మాటల్లో కుదించి, విశిష్టమైన, విస్తృతమైన అర్థాన్ని స్ఫురింపజేయడమే కవిత్వం అని ఇతని భావన".

"ఛందోబద్ధమైన రచనలే కావ్యాలుగా భావించి చెప్పినవారూ ఉన్నారు. వీరిలో తిక్కన

**"తెలుగు కవిత్వం చెప్పం**
**దలచిన కవియర్థమునకుదగియుండెడుమా**
**టలుగొని వళులు బ్రాసం**
**బులు నిలుపక యొగిని బులిమివచ్చుట చదురే?"**

(ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు – అభిరుచులు, పుట.92)

అంటూ కావ్య రచనకు నిర్దిష్టమైన సూత్రాలను, పరిమితులను వివరిస్తున్నాడు"(ధర్మారావు, గోనిపాటి. 2015. పుట.9).

శ్రీనాథుడు కూడా భీమఖండంలో 'హరచూడా హరిణాంక వక్రత' పద్యంలో వక్రోక్తి, కాఠిన్యం, సరసత్వం ఉండే చిరకాలం కవిత్వం నిలిచి ఉంటుందని తెలియజేసాడు. ఇలా చెప్పుకుంటూపోతే ఒక్కొక్కరు ఒక్కోవిధంగా కవిత్వ నిర్వచనాలను ఇచ్చినట్లుగా తెలుస్తుంది. నన్నయ మొదలుకొని కవిత్వం భారత, రామాయణ, భాగవతాది కావ్యాలలో పద్యాలలో నడిచింది.

మార్గ, దేశీ ఛందస్సులలో కవిత్వం ఆధునికం, పురాణం, ఇతిహాస తర్వాత శతకం, వస్తుకవిత, చిత్రకవిత, ప్రబంధం, యక్షగానం మొదలైన ప్రక్రియల్లో కవిత్వం వచ్చింది.

### 2.2. కవిత్వం–ఆధునిక నిర్వచనాలు, లక్షణాలు

ప్రాచీన ఆలంకారికులే కాకుండా ఆధునికులు కూడా కవిత్వాన్ని అనేక రకాలుగా నిర్వచించారు. ఆధునిక కవిత్వ నిర్వచనాలు తెలుసుకునే ముందు ఆధునికత అంటే ఏమిటో తెలుసుకోవాలి.

#### 2.2.1. ఆధునికత

"ఆధునికత అనేది సాహిత్య సంబంధమైన విషయం మాత్రమే కాదు, సమాజంలోని అన్ని రంగాలలోనూ వచ్చిన కొత్త మార్పుల ప్రభావం సాహిత్యం మీద పడినప్పుడు మార్పులను స్థూలంగా ఆధునికత అని చెప్పవచ్చు. ఆధునికత నిర్వచనం ఒక పరిధిలో లొంగదు" (యాకూబ్.2018. పుట.34).

"తెలుగు సాహిత్యంలో సమకాలీనతను ఆధునికతగా, మారిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు పునాదిగా ఏర్పడిన కొత్త దృక్పథాలను, స్వరూపాన్ని కూడా ఆధునికతగా గుర్తిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఆధునికతను కాలవాచిగా కూడా వాడుతున్నారు. కాలవాచికి ఆధునికతకు ఉన్న ప్రాముఖ్యత ఏమీ లేదు. ఒక తత్త్వంగా ఆధునికతను గుర్తించి ఆధునికత వైపు దృష్టి సారిస్తే ఎన్నో అంతరాలు కనిపిస్తాయి. ముఖ్యంగా ఆధునికతలో రెండు అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది" (యాకూబ్.2018.పుట.35).

"సామాజిక ప్రయోజనం, హేతుబద్ధమైన శాస్త్రీయ దృష్టి, వాస్తవికతలపైన ఆధారపడిన సాహిత్య దృక్పథాలు తాత్త్విక భూమికగా కలిగిన ఆధునికత ఒకటి. అభ్యుదయవాద విప్లవవాద వాస్తవికతావాదం కొంత మేరకు హేతువాదం ఈ కోవలోకి వస్తాయి. పైన చెప్పిన విలువలు లేకుండా వ్యక్తివాద, అరాచకవాదాలు, తాత్త్విక భూమికగా కనిపించే ఆధునికత రెండోది" (రంగనాథాచార్యులు,కె.కె.(సంపా.వ్యాసం)1982.పుట.v). ఆధునికత ప్రధాన లక్షణం వర్తమానంతో గతం సంఘర్షించడమని కూడా చెప్పుకోవచ్చు.

కె.కె. రంగనాథాచార్యులు ఆధునికతను నిర్వచిస్తూ "రాజకీయ, సామాజిక, తాత్విక, వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాలలో గత సమాజంతో పోల్చినప్పుడు సమకాలీన సమాజంలో నూతనంగా కనిపించే అంశాలే ఆధునికత. ఈ ఆధునికత మొదట ఉపరితలాంశంగా ఉద్యమాల

ద్వారా ప్రారంభమై క్రమంగా ఆర్థిక రంగంలో, ఆతర్వాత సాహిత్య రంగంలోస్థిరపడుతుంది" (1984. పుట. xi) అని అంటారు.

"మానవుడు పరిపూర్ణత కోసం నిరంతరం జిజ్ఞాసులై కొనసాగించే చైతన్య ప్రస్థానం ఆధునికత. ఆధునికత అన్నింటినీ ఇముడ్చుకోగలిగే స్వభావం కలిగి ఉంది. ఆ కారణంగా అది నిరంతరం అనేక మార్పులకు లోనవుతూ పురోగమిస్తుంది. ఆధునికతను కాలాన్ని బట్టి గానీ, కేవలం నూతనత్వాన్ని బట్టి గానీ నిర్వచించలేం కాలానికి సంబంధించిన అంశ, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో కొత్తదనానికి సంబంధించిన అంశ రెండూ ఆధునికతలో ఉంటాయి" (యాకూబ్. 2018. పుట. 35).

"సామాజిక వస్తువులో రూపంలో గుర్తించదగిన ప్రగతిశీలమైన మార్పు ఆధునికత" (శివశంకర్, పాపినేని.1996. పుట.104).

"ఆధునికత అనే భావన సాపేక్షమైందే గాని సుస్థిరమైంది కాదు. అంటే అన్ని కాలాలకు ఒకే ఆధునికత అంటూ ఉండదు. ఎప్పటికప్పుడు మారుతున్న సామాజిక స్థితులను బట్టి వాటిలోని అంశాలను గుర్తించి చూసే పద్ధతిని బట్టి ఆధునికత అనే భావన ఎప్పటికప్పుడు కొత్తగా అన్వయించుకోవాల్సి ఉంటుంది. అయితే ఆధునికత అనే ఈ భావన సంక్లిష్టమైంది. వైఖరి, భావన విలువలకు సంబంధించింది. విమర్శకు సంబంధించినంత వరకూ ఆధునిక సాహిత్యానికి సంబంధించిన విమర్శ అని అర్థం కాదు. ఆధునిక భావజాలం నుంచి రూపొందిన సాధారణ సాహిత్య విమర్శన విధానం అని అర్థం. ఆధునిక సాహిత్య విమర్శ పద్ధతులతో, పరికరాలతో ప్రాచీన సాహిత్యాన్ని కూడా విమర్శించవచ్చు" (యాకూబ్. 2018. పుట. 36).

ఆధునికం అంటే కొత్తది అనే అర్థమే అందరికి తెలుసు. 'ఆధునికత' అనే పదానికి స్పష్టమైన నిర్వచనం లేదు. కాని వివిధ అర్థాలలో ఈ పదాన్ని పదే పదే వాడక తప్పడం లేదు. కొందరు ఆధునికత 'కాలవాచి' అన్నారు, మరికొందరు అది కేవలం కాలవాచి కాదు, ఆ పదం ఒక తాత్త్విక దృక్పథాన్ని సూచిస్తోందని అన్నారు" (అఫ్సర్.1993. పుట.1).

"సంప్రదాయం అంటే పాతది అని కాదు. పరంపరగా – ఏనాటి నుంచో ఈనాటి దాకా వస్తున్నది అని దాని ముఖ్యార్థం / ముఖ్య భావన. ఈ శబ్ద భావన ఏ రంగంలోనైనా అట్లే కలగవలసింది, అలాగే చెల్లవలసింది. కానీ పరంపరగా వస్తున్నది కదా! అందుకే అది పాతది అని నేటి వాళ్ళు ఎదురు తర్కంతో కొత్త అర్థం/భావన రూపొందించుకోవచ్చు. బహుశా అలా రూపొందించుకోబట్టే సంప్రదాయం పాతదిగా వ్యవహారంలోకి వచ్చినట్లుంది. దీని సంగతి తర్వాత

చూస్తాం. అధునా → ఆధునిక – ఇప్పటి అనే అర్థంలో బాగానే కుదిరింది. అయినా modern అనే ఇంగ్లీషు పదానికి 'ఆధునిక' అనే భారతీయ పదం ఉటంకించుకొన్నట్లు తెలుస్తున్నది" (రంగనాథాచార్యులు, కె. కె. 1982. పుట. 205).

సాహిత్యానికి సంబంధించి 20వ శతాబ్దంలో చాలా మార్పులు వచ్చాయి. "1910లో ఇంగ్లీషు సమాజాన్ని పరిశీలించి 'మానవ స్వభావం మారిపోయింది' (Human nature changed) అని ప్రకటించింది వర్జీనియా వుల్ఫ్. ఈ ఇరవైయ్యో శతాబ్ది మొదటి దశకంలో ఆంగ్ల సాహిత్యంలో ఆధునికత (Modernism) ప్రారంభం అయినట్లు విమర్శకులు గుర్తించారు. తెలుగు సమాజం ఆ దశకు చేరుకోకపోయినప్పటికి ఇంచుమించు అదే సమయంలో ఆధునిక కవిత్వం తెలుగు సాహిత్యంలో, మరీ ముఖ్యంగా తెలుగు కవిత్వంలో ప్రారంభమయినట్లు మనకు తెలుసు. 1960వ దశకం వరకు ఈ ఆధునికత తెలుగు సాహిత్యంలో వివిధ రూపాల్లో, ధోరణుల్లో కొనసాగుతూ వచ్చింది. దిగంబర కవుల రంగప్రవేశంతో దీనికి గండి పడటం ప్రారంభం అయింది. ఆధునిక కవిత్వ అన్ని లక్షణాలతో దిగంబర కవులు విభేదించారు. అయినా ఇది ఇంకో దశాబ్దంపాటు వర్ధిల్లి చివరికి 1980 లో క్షీణించి అంతరించింది. అప్పటినుండి తెలుగు కవిత్వంలో ఆధునికానంతరత్వం (Postmodernism) ప్రారంభం అయింది" (అఫ్సర్.1993. పుట. I).

శ్రీశ్రీ తెలుగు కవిత్వంలో వుండి అక కవితా ధోరణుల్ని తను ప్రవేశపెడ్తూ వచ్చాడని, అతను ప్రవేశపెట్టిన వస్తురూపాల్ని ఛేదించడానికి యాభై ఏళ్ళు పట్టిందని, ఆధునికానంతర కవిత్వం మనం జీవిస్తున్న సమాజం మీద, స్థితుల మీద దాని అసంబద్ధత మీద నిరసనగా ప్రారంభమైందని "ఆధునికత అనేది కేవలం కాల సంబంధి ఎలా కాదో, ఆధునికానంతర కవిత్వం కూడా కాలసంబంధి మాత్రమే కాదు. వస్తువు, రూపం, భాష, అన్నింటిలోనూ ఆధునికానంతరత్వపు కవిత్వంతో విభేదిస్తుంది. మితోపోయిక్ గా వర్ధిల్లిన ఆధునిక కవిత్వంలో లాగా Myths ఆధునికానంతరత్వ కవిత్వంలో చూడం" (అఫ్సర్.1993. పుట. 2).

ఇరవయ్యో శతాబ్దంలో సాహిత్యానికి సంబంధించన మార్పులు చాలా వచ్చాయి. సమాజంలో మార్పులు సాహిత్యాన్ని మార్చాయి. సాహిత్య ప్రయోజనం ఏంటి? అనే దృక్పథం ఏర్పడింది. సమకాలీన తెలుగు కవిత్వం వచ్చింది. వీరేశలింగం పంతులుగారు కొత్త మార్గాన్ని, తను ఉద్దేశించిన సంఘ సంస్కరణను 'సరస్వతీ నారద సంవాదం' తో తీసుకొచ్చారు. తర్వాత వీరేశలింగం బాధ్యతని గురజాడ పట్టుకొని సామాజిక విలువలను తన కవిత్వం ద్వారా అందించాడు. కవిత్వ రూపాన్ని సులభతరం చేసి "ముత్యాలసరాన్ని వెలుగులోకి తెచ్చి చిత్రిక

పట్టాడు. కవిత్వ పరిధిలో కలిగిన ఈ మార్పులు ఆధునిక, సామాజిక విలువల్ని సునాయాసంగా తమలోకి ఇముడ్చుకోగలిగాయి. కవిత్వానికి, సమాజానికీ మధ్య సరైన సంబంధం ఏర్పడింది. ఆధునిక కవిత్వానికి ఇది తొలిమెట్టు" ( అఫ్సర్.1993. పుట. 3).

### 2.2.2. ఆధునిక కవిత్వం–నిర్వచనాలు

ఆధునిక కవిత్వం వచ్చిన తర్వాత కాలానుగుణంగా నిర్వచనాలు మారాయి. "ఛందోబద్ధంబగు పదబృందాటోపంబు కవిత్వమగునే" (కందుకూరి అధిక్షేప రచనలు, పుట. 2) అని అన్నాడు. ఈ విధంగా ఇతడు శబ్దార్థాలకు రెంటికీ ప్రాధాన్యతనివ్వాలని సూచించాడు" (ధర్మారావు, గోనిపాటి.2015. పుట. 9).

శ్రీశ్రీ తన నవ'కవిత' గేయంలో

**"కదిలేదీ కదిలించేదీ**
**మారేదీ మార్పించేదీ**
**పాడేదీ పాడించేదీ**
**పెనునిద్దుర వదిలించేదీ**
**మునుముందుకు సాగించేదీ**
**సంపూర్ణ బ్రతుకిచ్చేదీ**
**కావాలోయ్ నవకవనానికి"**

(శ్రీశ్రీ, మహాప్రస్థానం, పుట. 26)

అంటూ ప్రయోజనం లక్ష్యంగా చెప్పాడు.

"శ్రీశ్రీ మహాప్రస్థానానికి 'యోగ్యతాపత్రం' రాస్తూ చలం "తనకీ ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవి చేసే అంతర్ బహిర్ యుద్ధావరమే కవిత్వం" (శ్రీశ్రీ, మహాప్రస్థానం, పుట. 10) అని అంటాడు. వీరి తర్వాత వచ్చిన కవులు కూడా సందర్భానుసారంగా వారి కవితానుభవం నుండి కవికి కవిత్వానికి నిర్వచనాలను ఇచ్చారు.'ఆధునిక కవిత్వం అర్థం కాలేదంటే ఆధునిక జీవితమే అర్థం కాలేదన్నమాట" (రామ్ మోహన రాయ్, కడియాల.1982. ప్రవేశిక. పుట.1).

ఆధునిక కవిత్వమంటే ఉన్నట్టుండి ఒక్కసారిగా ఊడిపడలేదు. పదకొండవ శతాబ్దం నుండి ఉన్న సాహిత్యం తొమ్మిది దశాబ్దాల తర్వాత వచ్చిందని చెప్తూ కడియాల రామ్ మోహన్ రాయ్ "ఆధునిక కవిత్వమంటే వ్యక్తి స్వేచ్ఛ అని కొందరు కవులు భావ కవితాయుగంలో భావించారు. సమాజంలో వ్యక్తి భాగస్వామియే గాని ఆతనికి వేరుగా వ్యక్తి స్వేచ్ఛ వుండాలనటం సరికాదని

అభ్యుదయ కవులు తలచారు. సమాజం అన్ని విధాల పీడన నుండి దోపిడి నుండి విముక్తి పొందడమే నిజమైన స్వేచ్ఛకు అర్థం, పరమార్థం" (1982. ప్రవేశిక. పుట.15) అని తన అభిప్రాయాన్ని తెలిపారు.

కవిత్వమంటే భావావేశం పొంది ఆవేశాన్ని మాటలలో వ్యక్తీకరించటం కాక, భావావేశం నుండివిముక్తి పొందటమేనని కవులు తలంచసాగారు" (1982. ప్రవేశిక. పుట.14) అని కడియాల రామ్ మోహన్ రాయ్ తెలిపారు. కవికి స్పందనాగుణం ఎక్కువ, ఆ స్పందనే కవితారూపంలో వ్యక్తమవుతుందని చెప్పుకు వచ్చారు ఆధునికులు.

### 2.2.3. ఆధునిక కవిత్వం–విభిన్న రూపాలు

ప్రతి యుగంలోను కవిత్వ సృష్టికి దోహదం చేసే అంశాలు ముఖ్యంగా రెండు: అవి 1) కవి చుట్టూ ఆవరించుకొని ఉన్న వ్యవస్థ. దాని సూత్రాలు, 2) కవి స్వీయ చైతన్యం. ఈ రెండు ఒకదానితో ఒకటి కలిసినప్పుడే కవిత్వ సృష్టి జరుగుతుంది. కవి స్వీయ జగత్తుకూ, తత్కాలీన సమాజానికీ జరిగే సంఘర్షణలోంచే కవిత్వం పుడుతుంది. ఆధునిక యుగంగా పేరొందిన ఈ కాలంలో కవిత్వం భావ, అభ్యుదయ, దిగంబర, విప్లవ, స్త్రీవాదం, దళిత, మైనారిటీవాదం, మినీకవిత్వం, హైకు, నానీలు, రుబాయీ, గజల్, ప్రాంతీయవాదం, బి.సి. వాదాలుగా బహుముఖాలుగా విస్తరించింది. ఈ విధంగా ప్రాచీనులు, ఆధునికులు కవిత్వం మీద వారి అనుభవాలను, అభిప్రాయాలను తెలిపారు.

సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య పుటల్లో కవిత్వ సంబంధ వ్యాసాలు అనేక రకాలుగా ప్రచురితమవుతున్నాయి. వాటిని ఉపవిభాగాలుగా విభజించి విమర్శనాత్మక పద్ధతిలో విశ్లేషించుకుందాము.

## 2.3. పద కవిత్వ సంబంధ వ్యాసాలు

"పద సాహిత్యం పాడుకునేందుకు అనువుగా ఉండే గేయ ప్రక్రియ. ఇది శిష్ట సాహిత్యానికి, జానపద సాహిత్యానికి మధ్యేమార్గంగా ఉంటుంది. శిష్ట సాహిత్య లక్షణాలు తక్కువగానూ, జానపద సాహిత్య లక్షణాలు ఎక్కువగానూ దీనిలో చోటు చేసుకుంటాయి. జానపద గేయాల బాణీలు కూడా ఈ సాహిత్యంలో దర్శనమిస్తాయి. ఒక రకంగా చూస్తే జానపదుల హృదయం, శిష్టుల మేధస్సు రెండూ కలసి పద కవిత అయ్యిందని చెప్పవచ్చు" (సుభాషిణి, యర్రదొడ్డి. 2011.పుట.36).

"ఏ సాహిత్యంలోనైనా పదపద్య కవితలలో పదమే మొదట ప్రారంభమైనదన్న సిద్ధాంతం సర్వజనామోదాన్ని పొందిందని వ్యక్తమైంది. అదే రీతిగా తెలుగు సాహిత్యంలో పదమే ప్రథమంగా

పుట్టింది. క్రీ.శ.11వ శతాబ్దంలో నన్నయ భారతంలో తెలుగు కవిత్వం ప్రారంభమైనప్పటికీ, నన్నయ ఆదికవియైననూ ఇంతకంటె భిన్నమయిన అసలు సిసలైన తెలుగు కవిత ఒకటి ఉండాలనీ, అదే పదకవిత అనీ, దాన్ని దేశీ అని అంటారని మనం మరువకూడదు" (గంగప్ప, ఎస్.1983. పుట.29).

పద్యం కన్నా ముందే పదం ఏర్పడిందని పై నిర్వచనాల వలన తెలుస్తుంది. పద సాహిత్య పితామహుడిగా పేరు పొందిన తాళ్ళపాక అన్నమాచార్యులు 32 వేల సంకీర్తనలు రాసి, పాడి పదసాహిత్యానికి ఎనలేని కృషి చేసారు. అన్నమయ్య సాహిత్యానికి, భాషా ప్రయోగాలను సంబంధించిన వ్యాసాలు మనకు సాక్షి–సాహిత్యం పుటలో కనబడుతున్నాయి.

### 2.3.1. అన్నమయ్య వేమన్న పదాలు

యానాద్రి రాసిన "అన్నమయ్య, వేమన్న పదాలు" అనే వ్యాసం ఫిబ్రవరి2, 2016న సాక్షి సాహిత్యం పుటలో వెలువడింది.

వ్యాసకర్త "అవే పదాలు" పేరుతో అన్నమయ్య, వేమన్న పదాల్లోని సామ్యాన్ని విశ్లేషిస్తూ పుస్తకం వెలువరించారు. ఈ వ్యాసంలో కూడా అన్నమయ్య, వేమన్న పదాల్లోని సామ్యాన్ని వివరించారు. 15వ శతాబ్దికి చెందిన అన్నమయ్య, 17వ శతాబ్దికి చెందిన వేమన్న వీరిద్దరి మధ్య 200 సంవత్సరాల తేడా ఉంది. అయినప్పటికి వీరిద్దరు రాయలసీమ ప్రాంత కవులని అలాగే వీరి రచనా విధానంలో అనేక పోలికలు, సాదృశ్యాలున్నాయని వేమన్న పద్యాల్లో చెప్పినా, అన్నమయ్య పదాల్లో పాడినా ఇరువురి భావాలు ఒకే విధంగా ఉన్నాయంటూ, వాటిని పరిశీలిస్తే మనకెన్నో పోలికలు కనిపిస్తాయని తులనాత్మక విమర్శ పద్ధతిలో అన్నమయ్య, వేమన్న పద ప్రయోగాలను వివరిస్తూ ఈ వ్యాసాన్ని రాసారు. అన్నమయ్య ప్రభావం వేమన్నపై ఉందని పరిశోధనాత్మకంగా తెలిపారు.

తులనాత్మక విమర్శ అనగా "రచయితపై పూర్వకవి ప్రభావము ప్రసరించుట స్వాభావికము. అది అనుకరణము కాదు. ప్రతిభావంతుడైన కవి తర్వాతి వారికి మార్గదర్శకుడగును. కావున తులనాత్మక పరిశీలనము కవి స్థానమును నిర్ణయించుటకు, కావ్యతత్త్వమును నిరూపించుటకు ఉపకరించును. ఒక యుగములోని కవులనుగాని, ఒక ప్రక్రియను అవలంబించిన కవులను గాని, ఒకే వస్తువును స్వీకరించిన కవులను గానీ తారతమ్య నిరూపకముగా సమాలోచన చేయుట ఉచితము. వివిధ భాషాకవులలోని సామ్యవైషమ్యాల పరిశీలన కూడా కావ్య ప్రమాణ నిర్ణయమునకు తోడ్పడును" (రామారావు,ఎస్వీ.2007. పుట.12).

పై నిర్వచనం ప్రకారం ఇక్కడ వ్యాసకర్త అన్నమయ్య. వేమన్న పదాల్లో ఒకే వస్తువు తీసుకున్న ఇరువురి కవులలో ఉన్న సామ్యాన్ని వివరించాడు. కావున ఇది తులనాత్మక విమర్శ అవుతుంది.

దీనిలో వ్యాసకర్త మొదట అన్నమయ్య, వేమన్న జీవిత విశేషాలను, రచనా విశేషాలను కవి జీవిత విమర్శ పద్ధతిలో ప్రస్తావించారు. తర్వాత అన్నమయ్య ప్రభావం వేమన మీద ఉందని అన్నమయ్య చెప్పిన భావాన్నే అవే పదాలనే ఎన్నో పద్యాల్లో చెప్పారని వివరించారు. "తులనాత్మక సూత్రాలను అనుసరించి, సమాన భావమున్న వారి పదాలను ఎంపిక చేసి ఒకదానితో ఒకటి సమాంతరంగా పోల్చి చూపవచ్చు. భావాలు ఆలోచనలలో సామ్యం ఉండటమే కాకుండా అవే పదాలు ఉండటం ఆసక్తి కలిగించే అంశం. పదముతో, పాదముతో, విషయముతో అన్నింటా అనుకరణము నుందుననుటకు దృష్టాంతాలే యీ 'అవే పదాలు' అని వ్యాసకర్త తన గ్రంథం గురించి పరిచయం చేసారు.

అన్నమయ్య, వేమన పదాల్లో సామ్యాన్ని వివరిస్తూ

**"తలమేల కులమేల తపమే కారణము**
**యెలమి హరిదాసులు యే జాతియైన నేమి"**

అని అన్నమయ్య కీర్తన ఇలా మొదలవుతుంది.

**'ఏది కులము నీకు? ఏది స్థలంబురా**
**పాదుకొనుము మదిని పక్వ మెరిగి**
**యాదరించు దాని నవనీల ముట్టరా**
**విశ్వదాభిరామ వినురవేమ!'**

అని వేమన పద్యం. ఇందులో 'తలమేల, కులమేల తపమే కారణము'. 'ఏది కులము నీకు? ఏది స్థలంబురా' అనేవి అవే పదాలంటూ వివరించారు.

ఈ విధంగా వ్యాసకర్త అన్నమయ్య, వేమన కవుల రచనలలో ఉన్న పద, భావసామ్యాన్ని ఉదాహరణలతో తులనాత్మక విమర్శ పద్ధతిలో వివరించారు. ఇద్దరు కవుల భావజాలంలో, సామాజిక పరిస్థితులలో, అభివ్యక్తి, పదప్రయోగంలో సారూప్యత ఉందని నిరూపించారు. ఈ వ్యాసం కవి జీవిత పరిచయాల్ని చేస్తూనే వస్తువు, అభివ్యక్తి, భాషాప్రయోగాల చర్చతో కొనసాగింది. చారిత్రకాంశాలతోపాటు కవి జీవిత విమర్శ, తులనాత్మక విమర్శ ధోరణి ఈ వ్యాసంలో

కనిపిస్తుంది. ఇలాంటి వ్యాసాల వలన పాఠకుడిలో తులనాత్మక పరిశోధన పట్ల ఆసక్తి, అవగాహన ఏర్పడును.

### 2.3.2. అన్నమయ్య అచ్చ తెలుగు

"అన్నమయ్య అచ్చ తెలుగు" అనే వ్యాసాన్ని రవ్వా శ్రీహరి రాశారు. ఇది ఏప్రిల్ 04, 2016 న సాక్షి సాహిత్యం పుటలో ప్రచురితమయింది.

అన్నమయ్య వర్ధంతి అలాగే ఉగాది సందర్భంగా రాసిన వ్యాసం ఇది. దీనిలో వ్యాసకర్త అన్నమయ్య జీవిత విశేషాలను కాకుండా ఆయన సాహిత్యంలో ప్రయోగించిన దేశి పదాల గురించి భాషాపరమైన చర్చ చేసారు.

వ్యాసకర్త మొదట మార్గ, దేశి కవితల గురించి చర్చిస్తూ వాటి చారిత్రక పరిణామాన్ని తెలిపారు. దేశి కవితోద్యమం, దేశి పదాల వాడుకను ప్రస్తావించారు. తిక్కన దేశి పదాల వాడకాన్ని తెలుపుతూ "భాషలో అంతకు ముందు వ్యవహారంలో స్థిరపడి ఉన్న దేశ్య పదజాలాన్ని వాడడమే కాకుండా సంస్కృత శబ్దాలకు కూడా దేశ్య శబ్దాలను స్వయంగా కల్పించి వాడడం కనిపిస్తుంది. అందుకే అతడు స్వాగతం, న్యాయ దృష్టి, పద్మ వ్యూహం, రక్త సంబంధం, జీవచ్ఛవం, దేశకాలాలు మొదలైన పదాలను క్రమంగా మేలు రాక, నెఱిగుఱి, తమ్మి మొగ్గరం, నెత్తురు పొత్తు, మనుపీనుగ, నేల పొద్దులు ఇత్యాది దేశ్యపదాలను వాడడం కనిపిస్తుందని తెలిపి 15, 16 శతాబ్దంలోని తాళ్ళపాక కవుల్లో ప్రముఖుడైన అన్నమయ్య దేశి పద ప్రయోగాలను వివరించారు.

అన్నమయ్య దేశ్య పదాభిమానాన్ని తెలుపుతూ బాగా ప్రసిద్ధమైన సంస్కృత పదాలకు కూడా దేశ్యపదాలనే వాడుకోవడం గమనించవచ్చు. ఈ దేశ్య పదాలలో కొన్ని తెలుగు భాషలో అంతకు ముందే ఉన్నవీ కావచ్చు. లేదా అన్నమయ్యే స్వయంగా కొన్నింటిని కల్పించుకొని ఉండవచ్చునని అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అన్నమయ్య దేశిపద ప్రయోగాలను వివరించారు.
సంస్కృత పదాల స్థానంలో అన్నమయ్య ప్రయోగించిన దేశ్యపదాలను ఉదహరిస్తూ అన్నమయ్య భాషాభిమానాన్ని వివరించారు.

"**పాలకూడు:** క్షీరాన్నం, పాయసం అనే శబ్దాలకు ఇది దేశ్యపదం. కూడు పదం ఇప్పటిలాగ ఒకప్పుడు మోటుపదం కాదు. సభ్య పదమే.

**"పనివడి వెన్నెల పాలకూడు గడిచి**
**తనివోని పెండ్లి దగి లెగా నీకు"**

అన్నమయ్య. నాలుకకు క్షీరాన్నం, పాయసం కన్నా పాలకూడే రుచికరమేమో అంటూ వ్యాసకర్త అన్నమయ్య ప్రయోగించిన దేశిపదాలను పేర్కొన్నాడు.

**ఎముకల యిల్లు:** అస్థిపంజరానికి చక్కని దేశ్యపదం, **ఊరుపు గాలి**: నిశ్వాస వాయువుకు తెలుగు పదం, **గాలి మూట**: శరీరం అన్న సంస్కృత పదానికి అన్నమయ్య వాడిన దేశ్య శబ్దం అంటూ ఇలా అనేక దేశీపదాలను వాటిని ప్రయోగించిన సందర్భాలను ఈ వ్యాసంలో ప్రస్తావించారు. సంస్కృత పదాలు వాడే చోట్ల అచ్చమైన తెలుగు పదాలని వాడి అన్నమయ్య తన దేశీ పదాభిమానాన్ని చాటుకున్నారని వివరించారు. భాషా ప్రయోగాలను తెలుపుతూ వస్తువు చర్చకు కాకుండా రూప చర్చ భాషా చర్చకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. వ్యాసకర్త ఆచార్య రవ్వా శ్రీహరి ప్రత్యేకంగా భాషావేత్త, భాషాభిమాని కనుక ఈ వ్యాసంలో వస్తువు గురించి కాకుండా భాషాపరమైన చర్చనే ఎక్కువగా కనిపిస్తుంది. "కావ్యాను శీలనము ఆత్మాశ్రయ ధోరణిలో అనగా విమర్శకుని అభిరుచి ప్రధానముగా సాగినచో అది Impressionistic Criticism అనబడును" (రామారావు, ఎస్వీ. 2007. పుట. 11) అని ఎస్వీ రామారావు తెలుగులో సాహిత్య విమర్శ అవతరణ వికాసములు అనే గ్రంథంలో వివరించారు. కావున ఈ వ్యాసాన్ని అభిరుచి విమర్శ పద్ధతిలో రాసారని చెప్పవచ్చు. ఇలాంటి వ్యాసాల వలన పాఠకుడికి భాషాపరమైన అభిమానము అలాగే సంస్కృత పదాల స్థానములో ఉన్న తెలుగు పదాల ఉనికి తెలుస్తుంది. పద సాహిత్యంలో అన్నమయ్య భాషా ప్రయోగాల విశిష్టత అవగతమవుతుంది.

### 2.4. ప్రబంధ కవిత్వ సంబంధ వ్యాసాలు

తెలుగు సాహిత్య చరిత్రలో 16వ శతాబ్దాన్ని ప్రబంధ యుగం లేదా రాయల యుగంగా సాహిత్యాకారులు విభజించారు. ప్రబంధం అంటే ఒక కావ్య విశేషం. ప్రకృష్టమైన బంధం కలది ప్రబంధం. బంధం అంటే కూర్పు. తెలుగు ఆలంకారికులు ప్రబంధం కావ్య విశేషమని చెప్పి దానికి లక్షణ నిర్దేశం చేసారు. సంస్కృత ఆలంకారికుడు దండి మహాకావ్యానికి చెప్పిన లక్షణాలను ఆంధ్ర లాక్షణికులు ప్రబంధ లక్షణాలుగా పేర్కొన్నారు. ప్రబంధాల్లో అష్టాదశ వర్ణనలు, ధీరోదాత్తాది నాయకుడు, శృంగారం ప్రధాన రసం, అలంకార శైలి, వస్త్వైక్యం, స్వతంత్ర రచన వంటి లక్షణాలుండాలని ఆలంకారికులు పేర్కొన్నారు. ఈ విధమైన లక్షణాలతో కూడిన రచనలు మనకు 16వ శతాబ్దం నుండి తెలుగు సాహిత్యంలో కనబడుతున్నాయి.

పురాణాంతర్గతమైన ఏదో ఒక చిన్న కథను ఇతివృత్తముగా తీసుకొని దానిని అష్టాదశ వర్ణనలతో పెంచి పోషించి, పాత్రచిత్రణ, రసపోషణపై దృష్టి నిల్పి ప్రౌఢ ఆలంకారిక శైలితో

రచించిన స్వతంత్ర కావ్యాలు ప్రబంధాలుగా పిలువబడుతున్నాయి. అల్లసాని పెద్దన రచించిన 'మనుచరిత్ర'ను ప్రథమ ప్రబంధముగా పండితులు అభిప్రాయపడుతున్నారు. అల్లసాని పెద్దన మనుచరిత్రతోపాటు 16వ శతాబ్దంలో వసు చరిత్ర, పారిజాతాపహరణం, శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యం, కళాపూర్ణోదయం, ఆముక్త మాల్యద వంటి అనేక ప్రబంధాలు వెలువడ్డాయి. వీటిలో శ్రీకృష్ణ దేవరాయలు రచించిన విష్ణుచిత్తీయమనే నామాంతరముగల 'ఆముక్త మాల్యద' ప్రౌఢ ప్రబంధంగా చెప్పబడుతుంది. 16వ శతాబ్దము నాటి సాంఘీక, రాజకీయ అంశాలను సందర్భోచితముగా చిత్రిస్తూ రాయలు ఆముక్త మాల్యదను రచించారు. దీనిలో రాయలు ప్రస్తావించిన రాజనీతి, నైతిక విషయాలు సార్వకాలీనమైనవి. కావుననే ప్రబంధ రచన నేడు తగ్గిపోయిన ఆనాటి కవులు సూచించిన ధర్మాలు నేటికి ఆచరణీయులుగా తెలిపే ప్రబంధ సంబంధ వ్యాసాలు మనకు అప్పుడప్పుడు పత్రికల్లో కనిపిస్తున్నాయి.

### 2.4.1. రైతుల కోసం రాయలనీతి

గార రంగనాథం రాసిన 'రైతుల కోసం రాయలనీతి' అనే వ్యాసం సాక్షి – సాహిత్యం పుటలో జూన్ 05, 2017న ప్రచురితమయింది.

ఈ వ్యాసంలో వ్యాసకర్త శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యదలో చెప్పబడిన రాజనీతి సంబంధ విషయాలను ప్రస్తావించారు. దీని ద్వారా రాయల రాజనీతిజ్ఞత మనకు అవగతమవుతుంది. అలాగే రాజు తన ప్రజల పట్ల వ్యవహరించవలసిన తీరు, రైతులు వ్యవసాయంలో నష్టపోయిన సందర్భాల్లో ప్రభుత్వం వారిని ఎలా ఆదుకోవాలో తెలియజేసే అంశాలను దీనిలో చర్చించారు. వ్యవసాయమే జీవనోపాధిగా బ్రతికే రైతులు వ్యవసాయం చేసి నష్టపోయి ఇండ్లను, ధాన్యాన్ని వదిలేసి వలస పోయినప్పుడు అధికారులు వారిని వదిలేయకుండా వారిని రప్పించి సహాయ చర్యలు తీసుకొని వ్యవసాయానికి తోడ్పడాలని రాయలు వివరించిన పద్ధతులను వ్యాసకర్త పేర్కొన్నారు.

తెలుగులో వెలువడిన ప్రౌఢ ప్రబంధం ఆముక్తమాల్యద. దీనిలో ప్రధాన కథ గోదాదేవిది కాగా, యమునాచార్యుని వృత్తాంతం ఒక ఉపాఖ్యానం. కథ ముగింపులో యమునాచార్యుడు సన్యాసం స్వీకరించాలని నిశ్చయించుకొని రాజ్యాన్ని తన కొడుకుకి అప్పగిస్తాడు. ఆ సందర్భంలో కుమారుడికి రాజనీతిని బోధిస్తాడు. ఇక్కడ రాయలు స్వయాన రాజు అలాగే అనేక రాజనీతి గ్రంథాలు చదివినవారు కనుకనే తన అనుభవాన్ని యమునాచార్యుని పాత్ర ద్వారా 82 పద్యాల గద్యాలతో రాజనీతిని వివరించారు. ఈ రాజనీతిలో పొరుగు రాజులతో యుద్ధాలు, సంబంధాలు,

విదేశీ వర్తకులకు చేయవలసిన మర్యాదలు, రాజ్యంలోని వివిధ వర్గాలు, మనస్తత్వాల వ్యక్తులతో వ్యవహరించే విధానాలు ఇలా ఎన్నో ఉన్నాయి. అయితే వీటిలో కేవలం ప్రభువు ప్రజలను ఎలా కాపాడాలని చెప్పే పద్యాలను వ్యాసకర్త ఈ వ్యాసం ద్వారా విశ్లేషించారు. ఈ వ్యాసం సాంఘిక విమర్శ, నైతిక విమర్శ పద్ధతిలో కొనసాగింది.

**సాంఘిక విమర్శ**

"కవిపై దేశకాల సంఘ పరిస్థితులకు గల ప్రభావమును వివరింప యత్నించు విమర్శనే సాంఘిక విమర్శయందురు. కవి ఎంతటి స్వతంత్ర బుద్ధి గలవాడయినను, ఎంతటి వ్యక్తిత్వము కలవాడఁయినను, దేశ కాల పరిస్థితుల ప్రభావము అతనిపై వ్యాపింపక తప్పదు. కళాకారుడాకస్మికముగ నాకసము నుండి యూడిపడడు. అతఁడు కూఁడ నిర్దిష్టమగు నొక సంఘమున, నేదేశమున, నేకాలమున పుట్టి పెరిగెనో ఆ సంఘ దేశ కాల ప్రభావమాతనిపై నుండి యుండును. ఆ ప్రభావ మాతఁడు రచించిన కావ్యమునందును గన్పట్టును. ఒకచో స్పష్టముగ నుండవచ్చును. మరొకచో నస్పష్టముగ నుండవచ్చును. ప్రత్యక్షముగ నొకయెడ నుండవచ్చును. పరోక్షముగ నింకొకయెడ నుండవచ్చును కాని ప్రభావము మాత్రముండి తీరును అని ఆచార్య కాకర్ల వెంకట రామనరసింహం వారి సాహిత్య దర్శనం గ్రంథంలో నిర్వచించారు (1985:పుట.26).

పై నిర్వచనమాధారముగా చూసినట్లయితే రాయలు స్వయాన రాజు కావున తన రాజ్యంలో ఎదుర్కొన్న అనేక సమస్యలను పరిష్కరించిన అనుభవం, అతనికి గల రాజనీతిజ్ఞత యమునాచార్యుని పాత్రలో కనిపిస్తుంది. కావున దీనిని సాంఘిక విమర్శగా చెప్పవచ్చు. అలాగే రాజుకు ఉండవలసిన అనేక నైతిక విలువలను ఈ వ్యాసం ద్వారా చర్చించారు.

**ఏ పట్టున విడువక ర**
**క్షాపరుడవు గమ్ము ప్రజల చక్కి, విపన్ను**
**ల్కూపెట్టిన విని తీర్పుము**
**కాపురుషుల మీద నిడకు కార్యభరంబుల్**

అని రాజు ప్రజలను నిత్య కష్టాల నుండి కాపాడుతూ, ప్రజల ఆపదలను తొలగించాలి, దుర్జనులను కార్య నిర్వహణకు నియోగించవద్దని తెలిపారు. ఇలా ప్రజల సంక్షేమం కోసం రాజు ఎటువంటి పనులు చేయాలి, రాజు రక్షణ, దుర్మార్గుల శిక్షణ, యుద్ధ నిర్వహణ, సంధి కార్యాలు వంటి అనేక నైతికాంశాలను వివరించారు. రైతులను కష్ట పెట్టే అధికారులున్న రాజ్యము బాగుపడదు. రాజు

బాగుపడదని చెప్తూ, రైతులను కష్ట పెట్టే అధికారులకు రాజు ఏడు దీవులు జయించి ఇచ్చిన రాజ్యం సుభిక్షం కాదంటూ, రైతుల పట్ల రాయల నీతిని ఈ వ్యాసం ద్వారా వివరించారు. ఎటువంటి సందర్భాల్లో అయిన రాజు తన రాజ్యాన్ని ఒక కంట కనిపెడుతుండాలని చెప్తూ కింది పద్యాన్ని వివరించారు.

**కన్నొకటి నిద్రవో బెఱకంటి జాగ**
**రంబు గావించు భూరుహాగ్రంబు మీది**
**యచ్చ భల్లంబు గతి భోగమనుభవించు**
**నెడను బహిరంతరులపై దృష్టివలయు**

కొమ్మ చివర ఎలుగుబంటి కన్నొకటి మూసి నిద్రిస్తుంది. రెండవ కన్నుతో పరిసరాలను, పరిస్థితులను గమనిస్తూనే ఉంటుంది. రాజు కూడా అలాగే ఎన్ని భోగాలు అనుభవిస్తున్న ఒక కంట రాజ్యాన్ని కనిపెట్టాలని ఎన్నో నైతిక అంశాలను రాయలు ఆముక్త మాల్యద గ్రంథంలో తెలిపారని వ్యాసకర్త వాటిని వివరించారు. కావున దీనిని నైతిక విమర్శగా చెప్పవచ్చు.

**నైతిక విమర్శ**

“నైతికములగు నాదర్శనముల నాధారముగా గైకొని, సాహిత్యమును విమర్శించినచో, అది నైతిక విమర్శ యనబడును. ఇందు నైతిక శబ్దము బహుళార్థ బోధకము. జీవితమందు మానవుడే యేయంశముల నుత్తమములుగను, ప్రధానములుగను భావించునో ఆయా యంశములన్నియు నిందిమిడియున్నవి” అని కాకర్ల వెంకట రామనరసింహం నిర్వచించారు (1985: పుట. 21). పై నిర్వచనమాధారంగా వ్యాసకర్త ఈ వ్యాసంలో రాయలు వివరించిన అనేక రాజనీతి సంబంధ నైతికాంశాలను చర్చిస్తూ వ్యాసాన్ని రాసారు కావున దీనిని నైతిక విమర్శ పద్ధతిగా పరిగణించవచ్చు.

ఈ విధంగా సాంఘిక, నైతిక విమర్శ పద్ధతిలో కొనసాగిన ఈ వ్యాసం ద్వారా రాయల కాలంనాటి రాజనీతి, పరిపాలన దక్షత, సామాజికాంశాలు వంటి అనేక విషయాలను వివరించారు. ఆనాటి రాయల నీతి నేటికి ఆచరణీయంగా తెలుపుతూ ఆముక్తమాల్యద గొప్పతనం, రాయల రచనా వైశిష్ట్యం, రాజనీతిజ్ఞతను తెలియజేసారు. ఆముక్తమాల్యద కేవలం ప్రబంధమే కాక ఒక రాజనీతి గ్రంథమనే నూతన కోణాన్ని ఈ వ్యాసం ద్వారా పాఠకులకందించారు. రూపపరంగా ప్రాచీన పద్యరూపంలో ఉన్న సార్వకాలీనమైన ఎన్నో అంశాలను ఆధునిక మానవునికి సహకరించే విధంగా ఉన్నాయని విశ్లేషించారు.

## 2.5. గేయ కవిత్వ సంబంధ వ్యాసాలు

శిశుర్వేత్తి పశుర్వేత్తి వేతిగాన రసం ఫణి అనే పాట (శ్లోకం) ఆర్యోక్తుల వలన ప్రాముఖ్యత తెలుస్తుంది. చిన్న పిల్లల నుండి పెద్దల వరకు ఎలాంటి వారినయిన కట్టిపడేసే కదిలించే సమ్మోహన శక్తి పాటకి కలదు. ఎక్కడో ఒక చోట నుండి పాట వినిపిస్తుందంటే చాలు ఎంతటి వారిలోనైనా అప్రయత్నంగానే శరీరంలో ఏదో ఒక కదలిక ప్రారంభమవుతుంది. పాటకున్న పరవశింపజేసే శక్తే దీనికంతటికి కారణం. తెలుగు భాషా సాహిత్యాల్లోనే కాదు ప్రపంచ దేశ భాషా సాహిత్యాలన్నింటిలో పాటకు ప్రత్యేక స్థానం ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు సంభవించిన పాటకున్న ఆదరణ ఏమాత్రం తీసిపోలేదని చెప్పాలి. పాట సామాన్య ప్రజల జీవితం నుండి పుట్టింది. పనిలో, ఉత్పత్తిలో భాగంగా ఏర్పడింది. శ్రమజీవుల జీవితంతో పెనవేసుకుపోయింది. శ్రమను మర్చిపోవడానికి శ్రమజీవులు నోటి ద్వారా చేసిన లయాత్మక శబ్దం పాటగా మారింది. ఆదిమకాలం నుండే పాటకు, పనికి, పాటకు, ప్రజలకు అవినాభావ సంబంధముంది. అలాంటి పాట కవిత్వం నేటికి ప్రజలను చైతన్య దిశగా నడుపుతూ వారి జీవితాల్లో ఆనందాల్ని నింపుతుంది. ప్రస్తుత కాలంలో గేయం, పాట, గీతం, గానం అనేవి సమానార్థకాలుగా పిలువబడుతున్నాయి. గేయానికి సంబంధించిన కొందరి నిర్వచనాలు కింది విధంగా ఉన్నాయి.

“పద్య కవిత్వమును మార్గ కవిత్వమనియుఁ బదకవిత్వమును దేశి కవిత్వమనియు వ్యవహరింతురు. అనఁగా సంస్కృత పదభూయిష్ఠమై సంస్కృతచ్ఛంద శాస్త్ర సంగతములగు వృత్తముల రచన దేశీకవిత. ఈ దేశీ కవితకు జానుఁదెనుఁగు, పదకవిత, గేయ వాఙ్మయము అనియు నామాంతరములు” (సూర్యనారాయణ శాస్త్రి, సన్నిధానం. 2013.పుట.254).

“పదం అన్న పాట అన్న ఒకటే. ఈ పదాలనేక విధాలు. ఊయల పాటలు, రోకటి పాటలు, తుమ్మెద పాటలు, కోలాట పాటలు, జోల పాటలు, లాలి పాటలు, గొబ్బి పదాలు, ఏలపదాలు, బొబ్బిలి పదాలు, వెన్నెల పదాలు, గొల్ల సుద్దులు, రగడలు మొదలైనవి. ఈ పదాలే గేయాలు గానయోగ్యమైనవి కనుకనే గేయాలు. కీర్తించుటకు ఉపయోగపడునవి కావున గేయాలు. ఆ గేయాలే గీతాలు. అట్టి పదాలతో కూడినవి జానపదుల హృదయానికి చేరువలో ఉండి సులభ గ్రాహ్యమైన గానం చేయుటకు అనువైన పదాలు గేయాలు” (విజయ్ కుమార్, గుజ్జం. 2003. పుట.48).

"ఛందోఃపరంగా చూస్తే సాహిత్యాన్ని రెండు విధాలుగా వర్గీకరించవచ్చు. అవి 1) ఛందస్సహిత సాహిత్యం (verse), 2) ఛందోరహిత సాహిత్య (prose). ఛందస్సహిత సాహిత్యాన్ని పద సాహిత్యం, గేయ సాహిత్యం, పద్య సాహిత్యం అని స్థూలంగా విభజించుకోవచ్చు. గేయం అంటే మాత్రా ఛందస్సులో రాసిన కవిత్వమని, పాట అంటే రాగ, తాళాలతో పాడే సంగీత రచన అని సాహిత్య రంగంలో రూఢమై పోయింది"( విజయ్ కుమార్, గుజ్జం. 2003. పుట.52). "శ్రమ చేస్తూ శరీర కష్టాన్ని మర్చిపోవడానికి సమిష్టిగా ప్రజలు సృష్టించే మౌఖిక సాహిత్య రూపం పాట" (కాశీం. 2015. పుట.14).

"గేయ సారస్వతము బాగుగా పరిణతి చెందిన తరువాతి కాలముననే ఛందోబద్ధమగు పద్యకవిత యేర్పడుచున్నది. దక్షిణదేశ సారస్వతమందలి మాత్రా ఛందస్సులన్నియు నిట్లు గేయముల నుండియే యేర్పడినవి. కావుననే అవి లయతో పాడుటకనువై యుండుననుట. నన్నయ్యకు పూర్వమునకు ఇట్టి దేశియమగు గేయ సారస్వతము వ్యాప్తి యందుండినది. ఈ గేయముల నుండి యేర్పడిన మధ్యాక్కర, తరువోజ, సీసము మున్నగు దేశీయ ఛందస్సులు నన్నయ నాటికే యేర్పడి శాసనస్థములైయున్నవి అని శ్రీభూపతి లక్ష్మీనారాయణ గారనిరి" (నరసయ్య, సంగనభట్ల.2009.పుట.500).

"మాత్రాబద్ధమైన రచనను నేడు 'గేయం' అని వ్యవహరిస్తున్నారు. పాడేది గీతం లేక గేయం. అలాగే గేయ కవిత్వం ఈ మాటను అనేక రకాలుగా చెబుతున్నారు. గేయ కవిత్వం అంటే ఒక సంగీత వాద్యం సహాయంతో పాడుకునేందుకు వీలైన కవితారూపం అనీ, కథనాత్మక, నాటకీయత లేని కవితా రూపమని కథా వస్తువు అంటూ ఏమీ లేకుండా కవిలోని ఊహలను, వ్యక్తిగత భావాలను, తన స్వంత అనుభూతులను ఆధారంగా చేసుకొని రాసే కవిత్వమని, ప్రేమ, మరణం, ప్రకృతి, సమాజం, దేశభక్తి... ఇలా ఏ అంశం గురించైనా తన భావాలను వ్యక్తం చేసేందుకు కవి ఎంచుకునే రూపమని విమర్శకులు భావిస్తున్నారు"(లక్ష్మణ చక్రవర్తి, సి.ఎచ్.2016.పుట.179) తెలుగు సాహిత్యంలో గేయ కవిత్వం అనేది ప్రాఙ్నన్నయ కాలం నుండి నేటివరకు మానవ జీవితంతో మమేకమైంది. ఇటువంటి గొప్పదైన గేయ కవిత్వ సంబంధ వ్యాసాలు మనకు నమస్తే తెలంగాణ సాహిత్య పుటల్లో కనిపిస్తున్నాయి.

### 2.5.1. ప్రచారాస్త్రాలుగా జానపదాలు

బోనాల ప్రకాశ్ రాసిన "ప్రచారాస్త్రాలుగా జానపదాలు" అనే వ్యాసం నమస్తే తెలంగాణ చెలిమె సాహిత్య పుటలో మే 22, 2017న ప్రచురితమయింది. వ్యాసకర్త జానపద గేయాలు వివిధ

సందర్భాల్లో అనేక రకాలుగా రూపాంతరం చెందాయని తెలుపుతూ రాసిన వ్యాసం ఇది. ప్రజాదరణ పొందిన ఒక జానపద గేయ బాణీలో వివిధ సందర్భాల్లో రూపాంతరం చెందిన పాట ఒకసారి రాజకీయ ప్రచారానికి ఉపయోగిస్తే, అదే బాణీకి భక్తి పాటగా, వేరొక సందర్భంలో విప్లవగీతంగా మార్పులకు గురై అనువర్తిత రూపం మూలరూపాన్ని మింగేస్తున్నది. అందువల్ల ప్రజలు మౌలిక సంస్కృతిని కోల్పోతున్నారు. ఆ సంస్కృతిలో దాగున్న అపారమైన విజ్ఞానాన్ని నష్టపోతున్నారని విభిన్న రూపాంతరాలు చెందిన కొన్ని జానపద గేయాలను ఈ వ్యాసంలో వివరించారు. గేయాల్లోని వస్తువుకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ విశ్లేషించారు.

జాతీయోద్యమ కాలంలో 'పాంచాల పరాభవం' అనే హరికథ ఎంతో ప్రజాదరణ పొందినదని చెపుతూ అందులోని "శ్రీరామ నామం మరువం" అన్న భజన గీతానికి అనువర్తితంగా రాయబడినదే. "శ్రీగాంధీ నామం మరువం/సిద్ధము యమునకు బెరువం అనే గేయాన్ని ఉదహరించారు.

అలాగే బండి యాదగిరి రాసిన బండెనుక బండి గట్టి/పదహారు బండ్లు గట్టి అంటూ సాగిన జానపద పాటలెన్నో ప్రజలను చైతన్యపరుస్తూ వచ్చాయని వివరించారు. ఈ విధంగా మార్పులకు గురవుతూ మూలాల్ని కోల్పోతున్నామనే విషయాన్ని వివరిస్తూ జానపద గేయాలు, కళారూపాల పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేశారు.

### 2.5.2. జనజీవన హాస్య గేయాలు

సందినేని రవీందర్ రాసిన "జనజీవన హాస్య గేయాలు" వ్యాసం అక్టోబర్ 16, 2017న నమస్తే తెలంగాణ చెలిమె పుటలో వెలువడింది.

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు. ఆ పల్లెల ప్రజా జీవితంలో సంఘటనలను చిత్రిస్తూ వస్తున్న ఎన్నో జానపద గేయాలున్నాయి. వాటిలో హాస్య ప్రధానమైన జానపద పాటల ప్రత్యేకతను తెలుపుతూ రాసిన వ్యాసం ఇది. మానవ పుట్టుక నుండి వారి జీవితంలో అనేక సందర్భాల్లో హాస్య గేయాల ఉనికి ఉందంటూ పెండ్లి, వదినె మరదళ్ళు, బావమరదళ్ళు, పిల్లల హాస్య పాటలు, అత్తాకోడళ్ల పాటలు ఇలా అనేక రకాల హాస్య గేయాలను ఉదహరించారు. గేయాల్లోని వస్తువుని విశ్లేషించారు.

వదినె మరదండ్ల హాస్యాన్ని వివరిస్తూ –

**"తంటాల మారి వదినకు! వంటా సేయరాదు**
**వంటపాలెకింద! మంట పెట్టరాదు"**

వంటి గేయాలను ఉదహరిస్తూ వాటిలోని హాస్యాన్ని జానపదగేయాల గొప్పతనాన్ని వివరించారు. హాస్యం లేకుండా మానవ జీవితం పల్లె జీవనం గడవదంటూ హాస్యగేయాల ప్రాముఖ్యతను తెలిపారు. మౌఖిక సాహిత్య విశిష్టతను కొనియాడారు.

### 2.5.3. గేయ కవిత్వ సంబంధ వ్యాసాల పట్టిక

గేయ కవిత్వ సంబంధ వ్యాసాలు నమస్తే తెలంగాణ చెలిమె పుటలో మరికొన్ని మనకు కనిపిస్తున్నాయి. వాటి వివరాలను కింది పట్టికలో గమనించగలరు.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | మోటబాయి సప్పుడు... మోదుగుపూల సౌందర్యం... | సందీప్ రెడ్డి కొత్తపల్లి | ఏప్రిల్ 04, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | ఆ పాట అజరామరం | బి.ఎస్. రాములు | జూన్ 27, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 3) | పల్లెపాట పట్టిన పరిశోధకుడు | రవ్వా శ్రీహరి | ఏప్రిల్ 18, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 4) | వెండితెరపై వెన్నెలరేడు | సుంకర రమేశ్ | మే 29, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 5) | తెలంగాణ జానపద జావళీలు | వెల్దండి శ్రీధర్ | సెప్టెంబర్ 11, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 6) | మన మాగాణంలో యక్షగాన ఘనకీర్తి | డా॥ జె. విజయ్ కుమార్ జీ | డిసెంబర్ 11, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక – 1**

## 2.6. స్త్రీవాద కవిత్వ సంబంధ వ్యాసాలు

సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య పుటల్లో స్త్రీవాద కవిత్వాన్ని పరిచయం చేస్తూ స్త్రీ వాద కవిత్వ సంబంధ వ్యాసాలను ప్రచురిస్తున్నారు. ఈ వ్యాసాలను విశ్లేషించుకునే ముందు స్త్రీవాద కవిత్వం గురించి కొంత తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

### 2.6.1. స్త్రీవాద కవిత్వం–పరిచయం

ఆంగ్లంలోని 'Feminism' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో స్త్రీవాదం అని వ్యవహరిస్తున్నారు. జయప్రభ రాసిన భావకవిత్వంలో స్త్రీ అన్న సిద్ధాంత వ్యాసంలో స్త్రీవాదం అన్న పదాన్ని మొదటిసారిగా ప్రయోగించారు. అప్పటి నుండి ఈ పదం ఎంతో ప్రచారంలోకి వచ్చి సాహిత్యరంగంలో ఒక ఉద్యమంగా ప్రవర్తిల్లుతుంది. మొదట పాశ్చాత్య దేశాల్లో ప్రారంభమైన ఈ

భావజాలం ఆయా దేశాల్లో 1960 ప్రాంతాల్లో కనబడినా, 1980 నాటికి తెలుగు సాహిత్యంలో ప్రవేశించింది. 1980లో ప్రారంభమైన ఈ సాహిత్యం 1990 నాటికి బహుముఖాలుగా విస్తరించింది. ఈ కాలంలో ఎందరో కవయిత్రులు కవితలు, కథలు, నవలలు వెలువరించి తెలుగు సాహిత్యంలో ఒక కొత్త దృక్పథాన్ని, సమాజంలో స్త్రీల ప్రాధాన్యతను వ్యాప్తి చేసారు.

స్త్రీవాద కవితలన్నీ పురుష ద్వేషంతో కాక పురుషాధిక్య, పురుషాధిపత్య ప్రాతిపదిక గలవే. ఆకాశంలో సగం మాది అన్న నినాదంతో సమాజంలో తమకు సమానత్వం కావాలని చేసిన ప్రయత్నం వీటిలో కనిపిస్తుంది. స్త్రీల సమస్యలు, బాధలు, అగచాట్లు ప్రదర్శించి స్త్రీ స్వేచ్ఛ కోసం స్త్రీవాద సాహిత్యం కృషి చేసింది. అయితే స్త్రీవాద దృక్పథంతో కేవలం మహిళలే కాకుండా పురుషులు కూడా తమ సాహిత్య రచనల ద్వారా స్త్రీవాద వ్యాప్తికి కృషి చేసారు. ప్రస్తుతం స్త్రీవాదం అంతగా చెలామణిలో లేకున్నా స్త్రీవాద సాహిత్య సంబంధ వ్యాసాలు మనకు దినపత్రిక సాహిత్య పుటల్లో అప్పుడప్పుడు కనిపిస్తున్నాయి.

### 2.6.2. తెలుగు సాహిత్యంలో మైనార్టీ స్త్రీవాద జీవన చిత్రణ

మహ్మద్ హసేన రాసిన తెలుగు సాహిత్యంలో మైనార్టీ స్త్రీవాద జీవన చిత్రణ వ్యాసం నవంబర్ 07, 2016 న నమస్తే తెలంగాణ చెలిమె పుటలో ముద్రితమయ్యింది. మైనార్టీ స్త్రీవాదం గురించి రాసిన వ్యాసమిది.

దీనిలో వ్యాసకర్త స్త్రీవాద సాహిత్యానికి దారితీసిన పరిస్థితులను వివరిస్తూ ముస్లిం స్త్రీల జీవన చిత్రణను తెలిపారు. మహిళాభ్యుదయానికి కృషి చేసిన కందుకూరి వీరేశలింగం, చలం, రంగనాయకమ్మ వంటి వారిని గుర్తు చేస్తూ మార్క్సిస్టులు, విప్లవవాదులు స్త్రీల ప్రత్యేక సమస్యలను పట్టించుకోలేదనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. మార్క్సిస్టులుగానీ, విప్లవవాదులుగానీ స్త్రీల ప్రత్యేక సమస్యల్ని పట్టించు కోలేదనీ, గత ఉద్యమాల్లో ఈ స్పృహ కనిపించదనీ, స్త్రీవాదం గురించి వివరిస్తూ స్త్రీవాద కవితా సంకలనాలని పరిచయం చేసారు. అలాగే మైనార్టీవాదం గురించి వివరిస్తూ అల్ప సంఖ్యాకులైన ముస్లింలు 1947లో దేశం రెండుగా విడిపోయినప్పటి నుంచి మతపరంగా అణచివేతకు గురవుతూ ఎన్నో సమస్యల్ని, అవమానాల్ని ఎదుర్కొంటున్న సందర్భంలో ముస్లింవాద కవిత్వం, సాహిత్యం లేదా ఉద్యమం పుట్టుకొచ్చిందని మైనార్టీవాద సాహిత్యాన్ని నిర్వచించారు. ప్రపంచ వ్యాప్తంగా అల్ప సంఖ్యాక వర్గం కావడం వల్ల అభద్రతా భావంతో ముస్లింల మనోభావాలను ప్రతిఫలిస్తూ వస్తున్న సాహిత్యమే మైనార్టీవాద సాహిత్యంగా వర్ణించారు.

ముస్లిం వాద కవిత్వం ప్రారంభంలో దళితవాద పాయగా ఉండి, బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత ముస్లింవాద ప్రత్యేక ధోరణిగా మారిందని వివరించారు. ముస్లిం స్త్రీ సమస్యలు ఇతర స్త్రీ సమస్యల కన్న భిన్నంగా ఉంటాయంటూ సంప్రదాయం పేరుతో మైనార్టీ స్త్రీలపై జరిగే అణచివేతను నిరసిస్తూ ముస్లిం స్త్రీవాదులు కలం పట్టారని మైనార్టీ స్త్రీవాద కవులను, వారి రచనలను పరిచయం చేసారు. షాజహాన, స్కైబాబా, ఖాజా, యాకూబ్ వంటి మైనార్టీ స్త్రీవాద కవుల రచనలను ఉదహరిస్తూ పరదా పద్ధతి, బహుభార్యత్వం, విడాకులు, బహు సంతానోత్పత్తి, పురుషాధిక్యత వంటి వివక్షలపై వచ్చిన ముస్లింవాద కవితా వస్తువును విశ్లేషించారు.

**"గుమ్మానికి కట్టినట్టే**
**అమ్మ ముఖానికి బురఖా కడితే**
**స్వప్నంలాంటి జిందగీకి శాపమని అప్పట్లో తెలియనిదాన్ని"**

అంటూ పరదా పద్ధతిపై నిరసనగా రాసిన షాజహాన కవితా వస్తువును విశ్లేషించారు.

ఈ విధంగా వ్యాసకర్త స్త్రీవాదం, మైనార్టీవాదాల గురించి పరిచయం చేస్తూ, మైనార్టీ స్త్రీల సమస్యలను చిత్రిస్తూ వచ్చిన మైనార్టీ స్త్రీవాద సాహిత్యాన్ని, వాటి ప్రత్యేకతలను పాఠకులకు అందించారు. దీని ద్వారా పాఠకులకు స్త్రీవాదం అలాగే మైనార్టీ స్త్రీవాదం రెండు విషయాలపై అవగాహన ఏర్పడుతుంది. అలాగే మైనార్టీ స్త్రీవాద కవుల రచనల పరిచయం జరుగుతుంది. ఈ వ్యాసంలో శిల్పానికన్నా వస్తువుకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు.

### 2.6.3. ఫెమినిజం కాదు అస్తిత్వవాదం!

ఫెమినిజం కాదు అస్తిత్వవాదం అనే పేరుతో సెప్టెంబర్ 12, 2016న సాక్షి–సాహిత్యం పుటలో వ్యాసం వెలువడింది. దీనిని ఫెమినిస్ట్ ప్రసాద్ రాసారు. ఫెమినిజం అస్తిత్వవాదం కాదు అనే అభిప్రాయాన్ని ఈ వ్యాసం ద్వారా వ్యక్తపరిచారు. "ఫెమినిజం అస్తిత్వవాదం కాదు. అస్తిత్వవాదాల పరిధి పరిమితమైనది. అవి ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలకు, ప్రజా సమూహాలకు చెందినవి. ఫెమినిజం అలాంటిది కాదు. అది ప్రపంచంలోని స్త్రీలందరికి సంబంధించినది. స్త్రీలకే కాదు పురుషులకు కూడా సంబంధించినది అని స్త్రీ పురుషులు వేరు వేరు జాతి కాదు ఒకే జాతికి చెందిన పరస్పర పూరకాలని" అని వివరించారు.

ఫెమినిజంలో రకాలు ఉన్నట్లే దశలు కూడా ఉన్నాయని ఫెమినిజంలోని రకాలను మొదటితరం, రెండవతరం, మూడవతరం ఫెమినిస్టులుగా దశలను పేర్కొన్నారు. ఇంత విస్తృత పునాది, స్థాయి ఉన్న ఫెమినిజాన్ని అస్తిత్వవాదంగా భావించడం సరికాదని అభిప్రాయపడ్డారు.

1990 నుండి ఫెమినిజం ప్రభావం తగ్గినా అది అంతరించి పోలేదని ఆధునికాంతర వాదం, ఆర్థిక విధానంలోని సరళీకృత ఆర్థిక విధానాలు ఫెమినిజాన్ని మసకబార్చాయని తెలుపుతూ, ప్రస్తుత సమాజ స్థితిగతులను, ఫెమినిజం లక్ష్యాలను పరిణామ క్రమాలను ఈ వ్యాసం ద్వారా తెలియజేయడానికి ప్రయత్నించారు వ్యాసకర్త.

### 2.6.4. స్త్రీవాద కవిత్వ సంబంధ వ్యాసాల పట్టిక

ఈ వ్యాసాలతోపాటు ఈ రెండు పత్రికల్లో ప్రచురితమైన మరికొన్ని స్త్రీవాద సంబంధ వ్యాసాల వివరాలను కింది పట్టికలో పొందుపరిచాను.

| క్ర. సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | గురజాడ కార్పెంటర్ దృష్టిలో స్త్రీ | కాళిదాసు పురుషోత్తం | అక్టోబర్ 10, 2016 | సాక్షి – సాహిత్యం |
| 2) | స్త్రీ స్వేచ్ఛ అంటే? | రంగనాయకమ్మ | మార్చి 07, 2016 | సాక్షి – సాహిత్యం |

**పట్టిక – 2**

## 2.7. హైకూ కవిత్వ సంబంధ వ్యాసాలు

సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య పుటల్లో హైకూ ప్రక్రియను పరిచయం చేస్తూ హైకూ కవిత్వ సంబంధ వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఈ వ్యాసాలను విశ్లేషించుకునే ముందు హైకూ కవిత్వం గురించి కొంత తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

### 2.7.1. హైకూ కవిత్వం–పరిచయం

జపాన్ దేశ కవిత్వం నుండి తెలుగులోకి వచ్చిన కవితారూపం హైకూ. ఆధునిక తెలుగు కవిత్వంలో ఏర్పడిన లఘు కవితా రూపం హైకూ. 'బషో' హైకూ పితామహునిగా పేరొందారు. "కవి ప్రకృతిలో తాదాత్మ్యం చెందినపుడు కలిగిన అనుభూతి వ్యక్తీకరించే సంక్షిప్త కవితల్ని హైకూలంటారు అని ఇస్మాయిల్ నిర్వచించారు" (సురేష్, టి. 2010. పుట. 59). హైకూ జపాన్‌లో 16వ శతాబ్దానికే ఉన్నప్పటికీ తెలుగు కవిత్వంలో మాత్రం స్వాతంత్ర్యానంతరమే వచ్చింది. ఒకే ఒక భావాన్ని అందంగా వ్యక్తం చేయడం హైకూ ప్రత్యేకత. హైకూలో 17 సిలబుల్స్ (5–7–5) మూడు పాదాల్లో ఉంటాయి. ఇది బౌద్ధతాత్త్విక బలంతో జపాన్‌లో వస్తే, తెలుగులో మాత్రం ఆ లక్షణాలను, నియమాలను చాలామంది లెక్క చేయకుండా హైకూలు పేరుతో మూడు పాదాల్లో రాస్తున్నారు. "హైకూలో కవి ఆత్మీయత, అనుభూతి ఉండి ప్రతీక, భావచిత్రణలో ఏదోకటి ఉంటుంది. హైకూలో తాత్వికత తాదాత్మ్యం, ప్రకృతి సంలీనం, మార్మికత ఎక్కువగా ఉంటాయి" (2003: పుట: 64). అని యస్. శరత్ జ్యోత్స్నారాణి వారి స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత

వస్తువు, రూపం, శిల్పం గ్రంథంలో తెలిపారు. బౌద్ధ తాత్త్వికతో ఏర్పడిన హైకూ కవితా ప్రక్రియకు సంబంధించిన వ్యాసాలు మనకు సాక్షి దినపత్రిక సాహిత్యం పుటలో కనిపిస్తున్నాయి.

### 2.7.2. తెలుగు హైకూ: ఒక అవలోకనం

రోచిష్మాన్ రాసిన 'తెలుగు హైకూ': ఒక అవలోకనం' అనే వ్యాసం మే 08, 2017న సాక్షి–సాహిత్యం పుటలో ముద్రితమయింది. తెలుగు హైకూ ప్రక్రియ ఆవిర్భావ వికాసాలను తెలుపుతూ రాసిన వ్యాసం ఇది.

జపాన్‌లో పుట్టిన హైకూ కవితకు ఆద్యుడు బషో అని తెలిపి, హైకూను పరిపుష్టం చేసిన బుసోన్, హకషి వంటి కవుల గురించి ప్రస్తావించారు. హైకూ అన్న పదంలో 'హై' అంటే వినోదకర 'కు' అంటే కవిత అని అర్థాలు. ఇక్కడ 'కూ' హ్రస్వమే అని తెలిపారు. ఇది వ్యాసకర్త అభిప్రాయం. సాధారంగా అందరూ దీర్ఘాన్నే వాడుతారు. సందర్భాను సారంగా హ్రస్వం, దీర్ఘం కూడా వాడుతూ ఉంటారు. ఈ 'హై', ఈ 'కూ' రెండూ చైనీస్ – బై – కియు నుంచి వచ్చాయి. తెలుగులో మనం హైకులు అనొచ్చని హైకూ పదగతమైన వివరణ ఇచ్చారు. ఇమేజిజం అనే ఎజ్రా పౌండ్ ఉద్యమం ద్వారా హైకూ ఇంగ్లీషులోకి వ్యాపించిందంటూ ఇంగ్లీషు కవుల గురించి పేర్కొన్నారు.

హైకూ కవిత నిర్మాణాన్ని చర్చిస్తూ జపనీస్ హైకూ ఒకే పాదంలో ఉంటుంది. ఇంగ్లీషులో హైకు ను మూడు పాదాల్లో రాస్తారు. అది తప్పని వ్యాసకర్త అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

తెలుగు హైకూ ఆవిర్భావాన్ని తెలుపుతూ 1923లో దువ్వూరి రామిరెడ్డి మర్మ కవిత్వ వ్యాసం ద్వారా బషో హైకూ లను తెలుగుకు పరిచయం చేయగ గాలి నారసరెడ్డి తొలి తెలుగు హైకూ "నదిలో ఈత/చంద్రుని శకలాలు గుచ్చుకున్నాయి" అని వివరించారు. దీని తర్వాత పెన్నా శివరామకృష్ణ, ఇస్మాయిల్, బి.వి.వి. ప్రసాద్ వంటి అనేక మంది హైకూ కవుల రచనల గురించి వివరించారు. తొలి తెలుగు హైకూ కవయిత్రి రత్నమాల తెలుగులో హైకూ పేరుతో ఎక్కువ రచనలు చేసింది. పృథ్వీరాజ్, దేశదేశాల పేరుతో పెన్నా శివరామకృష్ణ కొన్ని విదేశీ హైకూలని తెలుగులోకి అనువదించారని హైకూ కవిత ఆవిర్భావ పరిణామ వికాసాలను తెలుపుతూ, హైకూ గ్రంథాలను పరిచయం చేసారు.

వ్యాసకర్త "హైకు అన్నది శిల్పాత్మకమైన ఓ ప్రక్రియ. హైకు శిల్పంలో ఋతువుల్ని సూచించే పదాలు, చిత్రణలు, ఘటనలు, రెండు చిత్రణల కలయిక, రెండు ఘటనల కలయిక, చిత్రణ,

ఘటనల కలయిక అన్నవి ముఖ్యం. హైకు అన్నది నిర్వచనంలా ఉండదు. వివరణలా ఉండదు" అని హైకు పదాన్ని హ్రస్వంగా వాడుతూ నిర్వచించారు.

హైకు 5, 7, 5 మాత్రలతో ఒకే పాదంలో ఉండటం శాస్త్రీయమైన పద్ధతి. ఆ పద్ధతిలో సిసలైన హైకు శిల్పంతో హైకు హైకుగా పునర్భవం పొందాల్సిన అవసరం ఉందని వ్యాసకర్త తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఈ వ్యాసం ద్వారా హైకూ ప్రక్రియ ఆవిర్భావం అలాగే తెలుగు హైకూ ఆవిర్భావం, వికాసాలు హైకూ కవిత గ్రంథాల పరిచయం పాఠకులకు అందుతుంది.

### 2.7.3. భూమ్యాకాశాల మార్పులే కవితా బీజాలు

సాక్షి – సాహిత్యం పుటలో మే 01, 2017న "భూమ్యాకాశాల మార్పులే కవితా బీజాలు" అనే వ్యాసం వెలువడింది. భూమ్యాకాశాల మార్పులే కవితా బీజాలంటూ హైకూ పితామహుడు బషో కవితాతత్త్వాన్ని వివరించే గాలి నాసరరెడ్డి అనువాదాన్ని వ్యాసంగా ప్రచురించారు.

"జగమెరిగిన జపనీయ మహాకవి మచువో బషో (1644–1694) ఆయన కవితా మార్గానికి సంబంధించిన ఎటువంటి సిద్ధాంత గ్రంథాలు వెలువరించలేదు. కానీ క్యొరై, దొహో వంటి శిష్యులు ఆయన అభిప్రాయాన్ని గ్రంథస్థం చేశారు. ఇక ఆయన రాసిన యాత్రాకథనాలు, హైబున్‌లూ ఉండనే ఉన్నాయి. ఆ రచనల్లో కాంతిమంతంగా కనిపించే బషో అభిప్రాయాలు కొన్నింటికి మకోతొ ఉయెద, హరువొ షిరనె, రాబర్ట్ హ్యాస్ ఆంగ్లానువాదల ఆధారంగా ఈ తెలుగు సేత" అని వ్యాసకర్త  అంటూ బషో కవిత్వతత్త్వాన్ని హైకూ తత్త్వాన్ని గురించి గాలి నాసరరెడ్డి చేసిన అనువాదం ద్వారా ఈ వ్యాసంలో పొందుపరిచారు.

## 2.8. గజల్ కవిత్వ సంబంధ వ్యాసాలు

ఈ రెండు సాహిత్య పుటల్లో ఉర్దూ కవితా రూపమైన గజల్ కవిత్వాన్ని పరిచయం చేస్తూ కొన్ని వ్యాసాలు వెలువడ్డాయి. వాటి విశ్లేషణకు ముందు గజల్ అంటే ఏమిటో తెలుసుకుందాం.

### 2.8.1. గజల్ కవిత్వం–పరిచయం

ఉర్దూ భాష నుండి తెలుగులోకి ప్రవేశించి తెలుగు ప్రజలను పరవశింపజేస్తున్న గేయ కవితా ప్రక్రియ గజల్. గజల్ అనే పదానికి అరబ్బీ భాషలో రాగాలాపని అనే అర్థం ఉన్నా ప్రియురాలితో సల్లాపం అనే భావాన్నే వ్యక్తపరుస్తుంది. "గజల్ జ్వలిస్తున్న ఒక అగ్ని కణం. గజల్ నుండి వెలువడే అంత్య ప్రాసాలంకరణే దానికి జీవం. శ్రోతల్ని ఆకర్షించే అయస్కాంత కాంతామణి గజల్ ఒకనాటి చరిత్రకు, సంస్కృతికి ప్రతీక గజల్. కొన్ని బేసి సంఖ్యలు గల ద్విపద రూపం గజల్. ప్రతి ద్విపదను షేర్ అంటారు. ప్రతి షేర్ రెండు మిస్రాల్లో ఉంటుంది. రెండు షేర్‌లు కలిస్తే రుబాయి అవుతుంది.

గజల్‌లోని ప్రథమ చరణాన్ని 'మత్లా' (ఉదయించే చోటు) అనీ, ఆఖరి చరణాన్ని 'మక్తా' అని పిలుస్తారు" (2003:పుట.67) అంటూ చివరి మక్తాలో నామ ముద్ర తఖల్లుస్ ఉంటుందని యస్.శరత్ జ్యోత్స్నారాణి స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత వస్తువు, రూపం, శిల్పం గ్రంథంలో తెలిపారు.

ఉర్దూ కవితా ప్రక్రియ అయిన గజల్ యొక్క విశిష్టతను, దాని శిల్పాన్ని తెలుపుతూ సాక్షి సాహిత్య పుటలో మనకు గజల్ కవిత్వ సంబంధ వ్యాసాలు కనిపిస్తున్నాయి. వాటిని పరిశీలిద్దాం.

### 2.8.2. వలపునై నీ హృదయ సీమల నిలువవలెనని ఉన్నది

రోచిష్మాన్ రాసిన 'వలపునై నీ హృదయ సీమల నిలువవలెనని ఉన్నది' అనే వ్యాసం సాక్షి – సాహిత్యం పుటలో నవంబర్ 14, 2016న వెలువడింది. తెలుగు గజల్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దీనిని రాసారు.

ఇది తెలుగు గజల్ స్వర్ణోత్సవ సంవత్సరం అని తెలుపుతూ 1966లో తొలి తెలుగు గజల్ రాసిన కవి దాశరథి. తొలి తెలుగు గజల్ వాగ్గేయకారుడు పి.బి. శ్రీనివాస్. తెలుగు గజల్‌ను చలామణిలోకి తెచ్చిన కవి సి. నారాయణ రెడ్డి. తెలుగు గజల్‌ను విశ్వవిఖ్యాతం చేసిన గాయకుడు కేశిరాజు శ్రీనివాస్ అంటూ గజల్ ప్రక్రియ ఆవిర్భావం వికాసాలను గజల్ కవుల పరిచయాన్ని, తొలి గజల్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని ఈ వ్యాసం ద్వారా తెలిపారు.

గజల్ ప్రక్రియ అరబ్బీ భాషలో పుట్టి పారసీలో పెరిగింది. పారసీ మూలంగా మన దేశం కొచ్చింది. పదమూడవ శతాబ్దంలో సార్సీ కవి హజ్రత్ అమీర్ ఖుస్రో గజల్‌కు మనదేశంలో ప్రాణ ప్రతిష్ఠ చేశాడని గజల్ ఆవిర్భావాన్ని పరిచయం చేస్తూ ఇబ్రహీం ఆదిల్‌షా, మొహమ్మద్ కులీకుతుబ్‌షా, అబ్దుల్ హసన్ తానీషా వంటి గజల్‌ను వ్యాప్తిలోకి తెచ్చిన కవుల గురించి ప్రస్తావించారు.

1910 నాటికే గజల్ రికార్డుపై వచ్చిందంటూ చారిత్రకాంశాలను తెలుపుతూ 1966లో దాశరథి కవితాపుష్పకంలో "కామన" శీర్షికలో తొలి గజల్ వచ్చిందని దాని మొదటి షేర్‌ని పేర్కొన్నారు.

**"వలపునై నీ హృదయ సీమల నిలువవలెనని ఉన్నది"**

పిలుపునై నీ అదర వీథు పలుకవలెనని ఉన్నది" అనే ఈ తొలి గజల్‌కు నేటితో 50 సంవత్సరాలు. దీనికి మొదటిసారిగా పి.బి. శ్రీనివాస్ స్వరపరిచి పాడి వినిపించారు. 1978లో కడప ఆకాశవాణి కేంద్రం నుండి తొలి గజల్ ప్రసారం అయింది అని తొలి గజల్‌కు సంబంధించిన

చారిత్రకాంశాలను వివరించారు. అలాగే పి.బి. శ్రీనివాస్, సినారె రాసిన గజల్ కవితా సంకలనాలను, వాటి గొప్పతనాన్ని తెలిపి, దాశరథి మొదలుకొని నేటివరకు గల గజల్ కవులు, గాయకుల వివరాలను ఈ వ్యాసంలో పొందుపరిచారు.

2000 సంవత్సరంలో వెబ్ ప్రపంచం.కామ్ అనే అంతర్జాల పత్రికలో రోచిష్మాన్ రాసిన గజల్ అంతర్జాలంలో వచ్చిన తొలి గజల్‌గా నమోదయిందని తెలుపుతూ ఎం.డి. శ్యామల తొలి తెలుగు గజల్ కవయిత్రిగా పేర్కొన్నారు. పి.బి. శ్రీనివాస్, మహ్మద్ రఫీ, ఎమ్. చిత్తరంజన్ దాస్, సినారె తర్వాత గజల్ గానం చేస్తున్న కేశిరాజు శ్రీనివాస్ మొదలైన గాయకులను ప్రస్తావిస్తూ తొలి తెలుగు గజల్ గాయని శౌంఠి పద్మజ అని తెలిపారు.

తెలుగు గజల్ స్వర్ణోత్సవం సందర్భంగా 'గజల్ లోగిలి' అనే పేరుతో ఒక ఫేస్‌బుక్ సమూహం తెలుగు గజళ్ల కోసం మొదలై సాగుతుంది. అని గజల్ ఆవిర్భావ పరిణామ వికాసాలను ఈ వ్యాసం ద్వారా అందించారు. అలాగే తెలుగు గజల్‌లో మూడు దోషాలు ఉన్నాయని చెప్తూ "గజల్ తెలుగులోకి మూడు దోషాలతో వచ్చింది. ఒకటి కాఫియా అంటే అంత్యానుప్రాస విషయంలో జరిగింది. రెండవది బహర్ అంటే ఛందస్సు లేకుండా రాయడం, మూడవది గజలియత్ అంటే గజల్‌తనం లేకపోవడం. గజల్ రాస్తున్నందుకు తెలుగునూ, తెలుగులో రాస్తున్నందుకు గజల్‌ను భ్రష్టు పట్టిస్తున్న పరిస్థితి కూడా కనిపిస్తుందని వ్యాసకర్త అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఇంకా తెలుగు గజల్ ప్రక్రియ బాగా పుంజుకొని సరైన దారిలో రాణించాల్సిన అవసరముందని ఈ సందర్భంగా సూచించారు. తెలుగు గజల్ అవతరణ వికాసాలను విమర్శనాత్మక పద్ధతిలో విశ్లేషించారు.

### 2.8.3. మరణం నను వరించి వస్తే ఏమంటాను

జూలై 24, 2017న 'మరణం నను వరించి వస్తే ఏమంటాను' అనే వ్యాసం సాక్షి–సాహిత్యం పుటలో వెలువడింది. దీనిని ఎన్. గోపి రాసారు. జూలై 29న సినారె జయంతి సందర్భంగా రాసిన వ్యాసం ఇది.

దీనిలో వ్యాసకర్త సినారె జీవిత విషయాల గురించి కాకుండా ఆయన రాసిన "తెలుగు గజళ్ళు" గ్రంథం గురించి గజల్ ప్రక్రియ గురించి ప్రస్తావించారు. సినారె కవిత్వం రాయడమే కాదు కమ్మగా పాడతారని కూడా అంటూ, తెలుగు గజళ్ళు గ్రంథంలోని 35 గజళ్ళను సినారె స్వయంగా పాడి క్యాసెట్ రూపంలో విడుదల చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ కవే గాయకుడిగా రవళించడం తెలుగులో ఇదే ప్రథమం అని పేర్కొన్నారు. 'గజల్ అంటే ప్రియురాలితో సల్లాపం' అనే అర్థాన్ని

సినారె స్వీకరించారని చెప్తూ తెలుగు గజళ్ళు గ్రంథాన్ని అలాగే గజల్ ప్రక్రియ లక్షణాలైన రదీఫ్, కాఫియా, మక్తా, మత్లా, తఖల్లుస్ లను సోదాహరణంగా వివరించారు. దీనిలో వస్తువు చర్చ కన్నా రూప చర్చకు అధిక ప్రాధాన్యత నిచ్చారు. సినారె గజళ్ళ విశిష్టత గురించి చెప్తూ "ప్రణయానికి రూఢికెక్కిన గజల్‌ను మానవీయ దృక్పథానికీ, ప్రగతిశీలానికీ వాహికగా స్వీకరించడం సినారె గజళ్ళలోని విశేషం. గజల్ ప్రణయేతరాలను తీసుకోవడం సరికొత్త ప్రయోగం కూడా. ఉర్దూలో కూడా గజల్‌ను అధిక్షేపానికి మలుచుకున్న వాళ్ళున్నారు. అహమ్మద్ ఫైజ్, సాహిల్ లుధ్యాన్వీ వంటివారు ఈ ప్రయోగంలో విజయం సాధించారని తెలియజేసారు.

సినారె కవితా దృక్పథాన్ని గజల్‌లో వస్తువు గురించి చెప్తూ ఆయన కవిత్వంలో తాత్త్విక భావాలు విశ్వంభర ముందు నుండే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. "సినారె కవిత్వంలో విశ్వంభరకు ముందు నుంచి కూడా తాత్త్విక ఛాయలు కనబడుతున్నాయి. విశ్వంభరలో మరీ ఎక్కువ".

**"మరణం నను వరించి వస్తే ఏమంటాను**
**పాలుపట్టి జోలపాడి పడుకోమంటాను"**

మరణం అనివార్యమనే తాత్త్విక భావాన్ని ఈ గజల్‌లో పొందుపరిచాడని దానిలోని వస్తువును వివరించారు. తెలుగు గజల్‌ను సామాజిక వస్తువుతో రాయడం అప్పటికి తెలుగులో తొలి ప్రయత్నం అంటూ, సినారె గజళ్ళ విశిష్టతను తెలుగు గజళ్ళ గ్రంథం ఆధారంగా ఆతని కవితా దృక్పథాన్ని, గజళ్ళ రూపాన్ని ఆయన జయంతి సందర్భంగా ఈ వ్యాసంలో వివరించారు. ఈ వ్యాసం ద్వారా గజల్ ప్రక్రియ నిర్మాణం, లక్షణాలు సినారె గజళ్ళ ప్రత్యేకత మనకు అవగతమవుతుంది. అలాగే సాధారణంగా జయంతి సందర్భంగా కవుల జీవిత విశేషాలను తెలుపుతూ రాసే వ్యాసాలకు భిన్నంగా కవి యొక్క కవితా విశిష్టతను కవి రాసిన గ్రంథం ఆధారంగా సాహిత్య ప్రక్రియ లక్షణాలను, వివరాలను పరిచయం చేసారు. సాహిత్య చర్చ చేస్తూనే కవిలోని ప్రత్యేకతలను వివరించడమనే కొత్త పద్ధతిలో ఈ వ్యాసం మనకు కనిపిస్తుంది.

### 2.9. కవిత్వ సంబంధ విమర్శ వ్యాసాలు

దినపత్రికల సాహిత్య పుటల్లో కేవలం కవులను వారి రచనలను పరిచయం చేయడమే కాకుండా కవితావస్తువుకు సంబంధించిన విమర్శనాత్మక విశ్లేషణ మనకు కనిపిస్తుంది. కవి ఎంచుకున్న కావ్యవస్తువును, కావ్య రచనా నేపథ్యం, కావ్య రచన కాలం నాటి కవి దృక్పథం మొదలైన అంశాలను విమర్శనాత్మక పద్ధతిలో పాఠకులకు అందిస్తున్నారు.

ఆంగ్ల సాహిత్య ప్రభావముతో తెలుగులోకి వచ్చిన సాహిత్య ప్రక్రియ విమర్శ. “విమర్శ గురించి పలువురు సాహితీవేత్తల నిర్వచనాలు కింది విధంగా ఉన్నాయి.

“విమర్శ శబ్దము ‘మృశ్’ ధాతువునకు ‘వి’ అను ఉపసర్గ చేరగా ఏర్పడినది. ఈ శబ్దమునకు పరామర్శము, విచారణము అని నైఘంటికార్థములు. ఒక వస్తువు యొక్క స్వరూప స్వభావములను బాగుగా పరిశీలించి, దాని మంచిచెడులను వివరించుటయే విమర్శనము. కావున విమర్శనమనగా వస్తుతత్త్వ నిరూపణమని స్పష్టమగుచున్నదని” ఎస్వీ. రామారావు తెలుగులో సాహిత్య విమర్శ అవతరణ – వికాసములు అను గ్రంథంలో తెలిపారు (2007.పుట.01).

“విమర్శయనగా ఒకరు చేసిన పనియందలి బాగోగులను ఇంకొకరు వివేచించి తెలుపుట, ఒక్కొక్కప్పుడు ఆ పనిని చేసినవాడే తన పని బాగున్నదియు లేనిదియు తానే విమర్శించుకొనవచ్చును” అని పింగళి లక్ష్మీకాంతం సాహిత్య శిల్ప సమీక్ష గ్రంథంలో నిర్వచించారు (2012.పుట.190).

“ఒక గ్రంథమును గైకొని, అందలి లోపాలోపములను, ఔచిత్యనౌచిత్యములను, భావ గంభీరతను అలంకార రచన పాటవములను ధ్వని విశేషములను, శయ్యా సౌభాగ్యమును, వస్తు నిర్మాణ సౌష్ఠవమును, పాత్రపోషణ, రసపోషణ, సన్నివేశ కల్పనాదులను వేయేల ఆ గ్రంథమునకు సంబంధించిన సర్వవిషయములను కూలంకషముగ చర్చించి వాఙ్మయమున గ్రంథమునకు గల స్థానమును నిరూపించుటయే విమర్శ యనబడును” అని కాకర్ల వెంకట రామనరసింహం వారి సాహిత్యదర్శనము గ్రంథములో పేర్కొన్నారు (1985.పుట.16).

“విమర్శ యనగా నేదైన గ్రంథమునుగాని కళారూపమునుగాని లెస్సగా బరిశీలించి దానిని గూర్చి మననము చేసి, చర్చా పురస్సరముగా నందలి బాగోగులను బ్రదర్శించుటయని గ్రహింపవచ్చును” అని దివాకర్ల వెంకటావధాని వారి సాహిత్యసోపానాలు గ్రంథమున తెలిపారు (1981.పుట.01).

పై నిర్వచనాల ఆధారంగా విమర్శ అనగా ఒకరు చేసిన పనిలోని గుణదోష విచారణ అని అర్థమవుతుంది. విమర్శకు సహృదయ, నిష్పక్షపాత లక్షణాలుండాలని అర్థమవుతుంది. ఇలాంటి విమర్శనాత్మక దృష్టితో కవిత్వంపై వచ్చిన వ్యాసాలు మనకు సాక్షి, నమస్తే తెలంగాణ సాహిత్య పుటల్లో కనిపిస్తున్నాయి.

### 2.9.1. తొలి తెలుగు దళిత మహిళాకావ్యం

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి రాసిన 'తొలి తెలుగు దళిత మహిళాకావ్యం' అనే వ్యాసం సాక్షి–సాహిత్యం పుటలో ఏప్రిల్ 03, 2017న వెలువడింది.

గుర్రం జాషువా రాసిన సాంఘిక కావ్యం అనాథ. ఈ అనాథ కావ్యాన్ని విమర్శనాత్మక దృష్టితో విశ్లేషిస్తూ రాసిన వ్యాసం ఇది. దీనిలో వ్యాసకర్త జాషువా రచనా దృక్పథాన్ని, చారిత్రకాంశాలను ప్రస్తావిస్తూ అనాథ కావ్య రచన గురించి వివరించారు. ఈ వ్యాసం ద్వారా జాషువా రచనా దృక్పథం, అనాథ కావ్య నేపథ్యం, వస్తువు, ఆనాటి సాంఘీక, చారిత్రకాంశాలు అవగతమవుతాయి.

ఉత్పత్తి రంగంతో సంబంధంలేని భావకవులు విశ్రాంతివర్గ స్త్రీలను ప్రణయమూర్తులుగా చిత్రిస్తుంటే, జాషువా వాళ్లకు భిన్నంగా శ్రామిక దళిత స్త్రీ జీవితాన్ని వస్తువుగా తీసుకొని వాస్తవిక దృక్పథంతో అనాథ కావ్యాన్ని రచించారు. అని దళిత, అభ్యుదయ కవిత్వ ధోరణిలో వ్యాసాన్ని రాసారు. దళిత స్త్రీ జీవితాన్ని కావ్యంగా రాసిన మొదటి కవి జాషువా అంటూ 'అనాథ' కావ్యాన్ని తొలి తెలుగు దళిత మహిళా కావ్యంగా వ్యాసకర్త పేర్కొన్నారు.

అనాథ కావ్య వస్తువును తెలుపుతూ ఈ కావ్యంలో స్త్రీ వస్తువుగా వచ్చే భావ కవిత్వ ధోరణి, భారతీయ సామాజిక అసమానతను ప్రశ్నించే అభ్యుదయ కవిత్వ ధోరణి, భారతీయ సామాజిక నిర్దిష్టతకు చెందిన అట్టడుగు వర్గ చిత్రణ చేసే దళిత కవిత్వ ధోరణి ముప్పేటగా పెనవేసుకొని ఉంటాయని వివరించారు.

'అనాథ' 72 పద్యాల ఖండకావ్యం. ఒక పేద దళిత వితంతువు. ఆమెకు ఆరుగురు సంతానం. అందరూ 'నేదరులు'. నడుచు పీనుగులు లాగా ఉన్నారు. ఆమెకు కట్టుకున్న బట్ట తప్పా ఏ ఆస్తి లేదు. భిక్షాటన తప్పా మరో బ్రతుకు తెరువు లేదు. ఆమె బిచ్చమెత్తుకోవడంలో పడిన బాధలే ఈ కావ్యమని అనాథ కథాసంగ్రహాన్ని తెలిపి ఈ కావ్యంలో జాషువా ప్రధానంగా మూడు విషయాలను ప్రతిపాదించారని వాటిని దీనిలో వివరించారు. అవి –

(1) మన సమాజం ధనిక, పేద వర్ణాల సమాజం,

(2) దళితుల–పేదరికానికి కారణం ఎవరు? అన్న ప్రశ్న,

(3) సాంఘిక, ఆర్థిక అసమానతలు గల సమాజమే అయినా అందరూ చెడ్డవాళ్ళు కాదు.

పై మూడు విషయాలను కావ్యంలోని సంఘటనల ఆధారంగా ఈ వ్యాసంలో చర్చించారు. అలాగే ఈ మూడు అంశాలతోపాటు, నాల్గవ అంశము మరొక్కటి ఇక్కడ గమనించదగినదని అది చాలా

ప్రధానమైన అంశమంటూ, 1934 నాటి జాషువా భావజాలాన్ని ప్రస్తావించారు. "సాంఘిక,ఆర్థిక అసమానతలతో కూడిన సమాజంలో భగవంతుడు పేదల వైపే ఉన్నాడన్నది నాల్గవ అంశం". ఈ మూడు సందర్భాల్లో కొందరు దళితేతరులు అనాథల పట్ల మానవత్వాన్ని, అమానుషత్వాన్ని చూపించారని పేర్కొన్నారు.

ఈ కావ్యం రాసే నాటికి జాషువా భావవాదిగానే ఉన్నాడు. భగవంతుడు పేదవాళ్ళ వైపే ఉంటాడు అన్న అవగాహనతో ఉన్నాడని –

**"పరుల దుర్గతిగని గుండె గటిగి వగచు**
**సదాయ సహృదయుల వీక్షణాంచలమునందు**
**బుట్టుచుండును కన్నీటి బొట్టువోలె**
**ఏడి భగవంతుడని సంశయింతు వేల?"**

పై పద్యాన్ని ఉదహరిస్తూ ఈ అంశాన్ని చెప్పడానికే జాషువా ఈ కావ్యం రాశాడేమో అనిపిస్తుందని వ్యాసకర్త అభిప్రాయాన్ని వ్యక్తపరిచాడు."గబ్బిలం కాలం నాటికి ఈ విశ్వాసాల పట్ల జాషువాకు అనుమానాలు మొలకెత్తాయి. ఈ కావ్యంలో జాషువా సాంఘిక, ఆర్థిక అసమానతలను గుర్తించాడు. కాని ఇందుకు కారణాలను అసమానతలను నడిపిస్తున్న తాత్విక విశ్వాసాలను అనుమానించే దశకు చేరలేదు. అప్పటికి జాషువా పరిణతి ఇది" అంటూ అనాథ కావ్య రచనా నేపథ్యం, వస్తువు, జాషువా రచనా దృక్పథాన్ని విమర్శనాత్మకంగా వ్యాసకర్త పాఠకులకు అందించారు. ఇలాంటి విమర్శనాత్మక వ్యాసాల వలన కేవలం రచన పరిచయం కాకుండా, రచయిత దృక్పథం మరియు రచనా నేపథ్యం, వస్తువు, సామాజిక పరిస్థితుల వంటి అనేక అంశాలు తెలుసుకోవచ్చు.

## 2.9.2. కవిత్వ సంబంధ విమర్శ వ్యాసాల పట్టిక

ఇలాంటి కవిత్వ సంబంధ విమర్శ వ్యాసాలు మనకు రెండు పత్రికల్లో మరికొన్ని కనిపిస్తున్నాయి. వాటి వివరాలను కింద పట్టికలో పొందుపరిచాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించి తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | ★పరామర్శ<br>నూటపాతికేళ్ల క్రితం ఒకనాడు | శ్రీరామదాసు అమరనాథ్ | అక్టోబర్ 02, 2017 | సాక్షి–సాహిత్యం |
| 2) | ★విమర్శ<br>అరవై ఏళ్ల తెలుగు రుబాయి | రోచిష్మాన్ | మార్చి 06, 2017 | సాక్షి–సాహిత్యం |

**పట్టిక – 3**

## 2.10. కవిత్వ సంబంధ గ్రంథ సమీక్షలు

చెలిమె పుటలో కవిత్వ సంబంధ సమీక్షా వ్యాసాలు వెలువడుతున్నాయి. కవిత్వ పుస్తకాలకు సంబంధించిన సమీక్షలు, నూతన పుస్తక ఆవిష్కరణ సందర్భంగా సమీక్ష రూప వ్యాసాలు మనకు కనిపిస్తున్నాయి. ఈ సమీక్ష వ్యాసాల వలన పాఠకుల్లో ఆ పుస్తకాన్ని చదవాలనే ప్రేరణ కలుగుతుంది. నూతన కవులు, కవిత్వ గ్రంథాల సమాచారంతో పాటు సాహిత్యంలో వస్తున్న కొత్తకొత్త కవిత్వ రూపాలను పరిచయం చేస్తూ పాఠకుల్లో పఠణాభిలాషను కల్పించడంలో చెలిమె 'పుట' తన వంతు పాత్ర నిర్వహిస్తుంది.

### 2.10.1. సమీక్ష–పరిచయం

"బ్రౌన్య ఇంగ్లీష్ – తెలుగు నిఘంటువులో రివ్యూకు 'పునర్విమర్శ' 'పునర్విచారణ' అనే అర్థాలను పేర్కొన్నారు (1990.పుట.964).

"సమీక్ష వ్యాసం వస్తుతః సాహిత్య విమర్శ స్వభావం కలది. శైలిలో జర్నలిజం జీవలక్షణాన్ని పొందుపరచుకున్నది. అస్పష్టతారాహిత్యం, అక్లిష్టత, సంక్షిప్తత, ఆసక్తి, అవగాహన, అనుభూతి అనేవి జర్నలిజానికి అంటే పత్రికా రచనకు జన్మతః ఉండే షడ్గుణాలు. ఈ ఆరు గుణాలలో ఒక అభివ్యక్తిని కల్పించుకొనే తెలుగు వచన రచన సమీక్షా వ్యాస రూపం. సమీక్షా వ్యాసంలోని శక్తి చర్చనీయం, ఆసక్తి రచయిత వ్యాఖ్యాన వైఖరి, నవ్యత రచయిత దృక్కోణం, అభివ్యక్తి పత్రికా రచనా ప్రవృత్తి. సమీక్షా వ్యాసం ఒక సాహిత్యానికి మాత్రమే పరిమితమైంది కాదు" (2012.పుట.707) అని జి.వి.సుబ్రహ్మణ్యం 'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు' అనే గ్రంథంలో తెలిపారు.

"ఒక పుస్తకం ప్రచురించబడిన వెంటనే ప్రచురణ వివరాలతో ఆ పుస్తకంలోని విషయాన్ని క్లుప్తంగా పరిచయం చేస్తూ, వివిధ పత్రికల్లో వచ్చేవి సమీక్షలు" (2013.పుట.5) అని కేతవరపు రామకోటి శాస్త్రి 'శాస్త్రీయ సమీక్షలు – ముందు మాటలు' అనే గ్రంథంలో నిర్వచించారు.

"సమీక్ష ఒక ప్రక్రియ సమీక్ష వ్యాసాలుగా ఇవి కనిపిస్తుంటాయి. 'రివ్యూ' అంటే మరోసారి పరిశీలించడం అని అర్థం. కొత్త పుస్తకాలను గురించి రాయడం/పరిచయం చేయడం అనే అర్థంలో ప్రసారమాధ్యమాల్లో ఇది వాడుకలో ఉంది" (2016: పుట: 150) అని పమ్మి పవన్ కుమార్, 'ప్రసారమాధ్యమాలు – భాష నైపుణ్యాలు' అనే గ్రంథంలో నిర్వచించారు. "దిన,వార, పక్ష, మాస, త్రైమాస పత్రికల్లో పుస్తకాల్ని సమీక్షిస్తూ రాసే వ్యాసాలు సమీక్షా వ్యాసాలు. తెలుగులో ఎప్పుడు పత్రికలు ఆరంభమయ్యాయో అప్పుడే ఈ రకమైన వ్యాసాలు ప్రారంభమయ్యాయి.

సాధారణంగా ఈ వ్యాసాల్ని విమర్శకుడో లేదా సంపాదకుడో రాస్తాడు. పుస్తకాన్ని సమీక్షించి వ్యాసాల్ని రాయాలి". (సిమ్మన్న, వెలమల.2011.పుట.721)

"కొత్తగా వచ్చిన సాహిత్య రచనను పరిచయం చేస్తూ వచ్చే వ్యాసం. పుస్తకంలో చర్చించిన విషయమూ, పద్ధతి, ప్రత్యేకతలూ, గుణాలు ఇలా పుస్తకానికి సంబంధించిన వివరాలన్నీ ఇచ్చి పుస్తకంపై పాఠకుడికి ఒక అభిప్రాయం అందివ్వడం. తద్వారా పాఠకుడు చదవాలో వద్దో నిర్ణయించుకుంటాడు.

"సమీక్షలు సాధారణంగా తక్కువ నిడివితో ఉంటాయి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సుదీర్ఘమైనవిగా కూడా ఉండవచ్చు. సమీక్షలు రకరకాలుగా జరగవచ్చు. విమర్శకుడు, రచయిత దృక్పథాన్ని గ్రహించి ఆ దృక్పథం దృష్ట్యానే ఎంత వరకు బాగా రాణించగలిగాడో అంచనా వేయడం, అలాగే రచయిత దృక్పథాన్ని విమర్శకుడు తన దృక్పథంతో చర్చించి విమర్శించడం, రచయిత దృక్పథాన్ని తటస్థవైఖరితో దానిలోని మంచి చెడ్డలను నిరూపించడం". (నళిని,ఎస్.ఎస్.2009.పుట.182)

పై నిర్వచనాల ఆధారంగా చూస్తే ఒక గ్రంథాన్ని గురించి పరిచయం చేసే వ్యాసాలను సమీక్షా వ్యాసాలుగా చెప్పవచ్చు. కవిత్వ సంబంధ పుస్తక సమీక్షా వ్యాసాలు మనకు సాక్షి, నమస్తే తెలంగాణ రెండు పత్రికల్లోను కనిపిస్తున్నాయి.

### 2.10.2. బతుకాట సవ్వడుల గవ్వలు

జిందం అశోక్ రాసిన 'గవ్వలు' అనే లఘు కవితాసంపుటిని పరిచయం చేస్తూ వెల్దండి శ్రీధర్ 'బతుకాట సవ్వడుల గవ్వలు' అనే పేరుతో సమీక్షా రూప వ్యాసాన్ని రాసారు. ఇది మార్చి 13, 2017న చెలిమె సాహిత్య పుటలో వెలువడింది.

దీనిలో వ్యాసకర్త వెయ్యేళ్ల తెలుగు కవిత్వంలో అనేక అభివ్యక్తి రూపాలు రోజురోజుకు పాఠకుడిని పరవశింప చేస్తున్నామని నన్నయ పద్యం మొదలుకొని నేటి వరకు కవిత్వంలో ఎన్నో నూతన రూపాలు ఆవిర్భవిస్తూనే ఉన్నాయని తెలిపారు. అలాంటి నూతన కవితా ప్రక్రియ జిందం అశోక్ సృష్టించిన గవ్వలను పేర్కొంటూ, గవ్వల నిర్మాణాన్ని, వస్తువును పరిచయం చేస్తూ సమీక్షా రూపంలో సాగిన వ్యాసం ఇది.

వ్యాసకర్త తెలుగు సాహిత్యంలో తొలి కంద పద్యం మానేరు నది తీరాన పుట్టినదని చెపుతూ, మానేరు నది ఎందరో కవులకు జన్మస్థలిగా పేర్కొని నేడు అదే కోవలో జిందం అశోక్ నిలిచారని, ప్రాంతీయ గొప్పతనాన్ని తెలుపుతూ జిందం అశోక్ కవితావస్తువును వివరించారు. వెయ్యేళ్ల తెలుగు

కవిత్వంలో అనేక అభివ్యక్తి రూపాలు రోజురోజుకి పాఠకుడిని పరవశింపజేస్తున్నాయి. నన్నయ పద్యం మొదలుకొని పాల్కురికి సోమన 'ద్విపద', గురజాడ 'ముత్యాల సరాలు', దాశరథి, సినారె 'గజల్', దువ్వూరి రామిరెడ్డి 'రుబాయి', గాలినాసర రెడ్డి 'హైకూలు', ఎన్. గోపి 'నానీలు', ఎం.కె. సుగంబాబు 'రెక్కలు', ఈగ హనుమాన్ 'నానోలు' ఇలా విస్తరించుకుంటు పోయిందని తెలిపి ప్రస్తుతం జిందం అశోక్ గవ్వలు పేరుతో వచ్చిన నూతన కవిత్వాన్ని పరిచయం చేసారు.

ఈ వ్యాసంలో ఒక నూతన కవితా ప్రక్రియను దాని నిర్మాణాన్ని తెలుపుతూ గవ్వలు కవితా వస్తువును విశ్లేషించారు. గవ్వలు రూపాన్ని చెపుతూనే వస్తువుకు అధిక ప్రాధాన్యత నిచ్చారు. ఈ వ్యాసం ద్వారా ఒక నూతన ప్రక్రియ మరియు కవితా పుస్తక పరిచయం పాఠకుడికి అందుతుంది. ఇలంటి వ్యాసాలు నూతన కవితా సృజనకు తోడ్పడుతాయి. పాఠకుడిలో అవగాహనతోపాటు కొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయి.

జిందం అశోక్ గవ్వలను పచ్చీసు ఆటతో పోలుస్తూ, పచ్చీసు ఆటకు ప్రధానమైన గవ్వలకు రెండు ముఖాలే ఉంటాయి కానీ, జీవితపు పచ్చీసు ఆటలో ఈ గవ్వలకు మనిషి, రాజ్యం, సమాజం, వ్యవస్థవంటి అనేక పార్శ్వాలను చూపించాడని దాని వస్తువును వివరించారు.

ఇక గవ్వలు రూప విషయానికొస్తే "కవి దీనికి ప్రత్యేకంగా వ్యాకరణాన్ని ఏమి నిర్మించుకోలేదు. కానీ మాట ఎక్కడికి విరిగితే అక్కడికి ఒక పాదంగా రాస్తూ మూడు పాదాల్లో చెప్పాల్సిన విషయాన్ని ముగించాలి. అక్షర నియమం ఏమీ లేదు. కానీ కవిత్వపు సాంద్రత వాంఛనీయం. సూక్ష్మ ప్రక్రియలన్నింటిలో ఉన్నట్టుగానే ముగింపులో ఒక చరుపు, ఒక విరుపు, ఒక మెరుపు ఉండటం తప్పనిసరి" అని తెలిపారు.

సామాజిక అంశాలను వస్తువుగా ఎంచుకోని కవి గవ్వలను మనకందించారంటూ, కొన్ని గవ్వలను ఉదహరిస్తూ వాటి వస్తువును విశ్లేషించారు. భ్రూణహత్యల గురించి కవిత చూసినట్లయితే

**ఆడపిల్లను చంపితే**
**అమ్మను చంపినట్లు**
**బేటి బచావో... బేటీ పడావో...**

2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యి మంది పురుషులకు 940 స్త్రీలు మాత్రమే ఉన్నారనే వాస్తవానికి చలించి రాసిన కవిత ఇది. భూమి లేకపోతే లోకానికి జరుగుబాటు లేనట్లే స్త్రీ లేకపోతే ప్రపంచానికి వికాసం లేదు. జన్మనే లేదని వస్తువుని మనసు గోడలకు సువ్వల్లాగా గుచ్చుకుంటాయీ గవ్వలు. దేన్ని ముట్టుకున్నా, పట్టుకున్నా అది కవ్వంలాగా సమాజం చుట్టే

తిరుగుతుంది. బొమ్మరింట్లో అవ్వంట, బువ్వంట మట్టి గురుగుల్ ఒదిగిన బాల్యం గురించి, సామాన్యునికి అందని ప్రభుత్వ పథకాలు, ఆధార్ కార్డు లేకపోతే మనిషిగా గుర్తించని ప్రభుత్వాల తెలివి మాలినతనం, అధికార వాంఛ, రైతు శ్రమను రూపాయికి కిలో అమ్ముతున్న తీరు, మద్యపానం, నల్లధనం, అవినీతి, కరువు, మానవ సంబంధాలు, కరువు, సబ్సీడీ పేరుతో కొనుగోలు శక్తిని కూల్చుతున్న తీరు, పర్యావరణ విధ్వంసం... ఇలా అనేకాంశాలు ఈ గవ్వల్లో ధ్వనిస్తాయి. అయితే మనకు వినగలిగే నెనరుండాలి, స్పందించే హృదయముండాలంటూ వస్తువు విశ్లేషణ చేసారు.

వ్యాస ప్రారంభంలో మానేరు నదీ ప్రాంత కవులు అంటూ స్వాభిమాన ప్రకటనతో కొంత ప్రాంతీయ ధోరణిలో మొదలైన తర్వాత కవిత్వంలోని నూతన అభివ్యక్తి గవ్వలను పచ్చీసు ఆటతో పోలుస్తూ రూప పరిచయం, వస్తు విశ్లేషణతో కొనసాగింది. ఇలాంటి వ్యాసాల వలన నూతన ప్రక్రియ పరిచయం, పుస్తక పరిచయం మాత్రమే కాకుండా నూతన కవిత్వ సృజనకు ప్రేరణనిస్తాయి.

### 2.10.3. కలల్ని వెంటాడే విద్యార్థులు

కలల్ని వెంటాడే విద్యార్థులు అనే వ్యాసం సాక్షి–సాహిత్యం పుటలో ఆగస్టు 28, 2017న వెలువడింది. దీనిని అఫ్సర్ రాసారు.

బాల సుధాకర్ మౌళి సంపాదకత్వాన వెలువడిన 'స్వప్నసాధకులు' అనే విద్యార్థుల కవితా సంకలన పుస్తక సమీక్షయే ఈ వ్యాసం. విజయనగరం జిల్లాకు చెందిన బాల సుధాకర్ మౌళి గర్భా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, ఉత్తరాంధ్ర కవిత్వంలో నవ్య గొంతుగా నిలిచాడు. తన తరగతి గదిలోని విద్యార్థుల కవితలలో 2017లో 'స్వప్నసాధకులు' అనే కవితా సంకలనాన్ని ప్రచురించారు. ఈ పుస్తక పరిచయమే ఈ వ్యాసం.

యంత్రాల సహవాసంతో పూర్తిగా యాంత్రికంగా మారిన జీవితంలో అక్షరాలు అసందర్భమవుతున్నాయి. సాహిత్యం అప్రస్తుతమై, కవిత్వం అనేది విరోధాభాసగా మిగిలిపోతుంది. ఈ చేదు విషయాన్ని జీర్ణించుకోలేని విషాదంలో ఉండగానే, ఇదిగో ఇక్కడ ఎనిమిది మంది విద్యార్థులతో అష్ట దిగ్బంధనం చేస్తున్నాడు బాల సుధాకర్ మౌళి, అంటూ వ్యాసకర్త స్వప్న సాధకులైన ఆ ఎనిమిది మంది కవితల్ని ఈ వ్యాసం ద్వారా పరిచయం చేసారు.

"స్వప్నం అంటే సాధించడం అంటే ఎప్పుడు నాకు గుర్తుకు వచ్చే పేరు మార్టిన్ లూథర్ కింగ్" అంటూ నల్ల జాతి ప్రజల హక్కులకై నినదించిన ఆయన స్వరాన్ని, పోరాటాన్ని గుర్తుకు

చేసారు వ్యాసకర్త . ఇది కేవలం నల్ల జాతుల స్వరం కాదని పీడిత ప్రజలందరి స్వరమంటూ మనకు మార్క్సిజమ్ సిద్ధాంతాల్ని గుర్తుకు చేస్తూ ఈ వ్యాసాన్ని రాసారు. స్వప్న సాధనలో మార్టిన్ అన్న "I have dream that my four little children will one day live in a Nation where they will not be judged by the colour of their skin but by the content at their character" ఈ మాటలను గుర్తు చేస్తూ ఈ వాక్యం ఏ తరానికైనా మేనిఫెస్టో కావాలి అంటారు వ్యాసకర్త. ఈ మాటల వలన దీనిని మార్క్సిస్టు ధోరణిలో రాసారని చెప్పవచ్చు.

ఈ వ్యాసంలో హరి, మోహిని, ఉమా మహేన్, గౌతమ్, కమలాకర్ వంటి ఎనిమిది మంది విద్యార్థులు రాసిన కవిత్వ వాక్యాలను ఉదహరిస్తూ వాటిలోని వస్తువును వివరించారు. ఆకలి, పేదరికాన్ని ఈ ఎనిమిది మంది కవులు చిత్రించిన తీరును విశ్లేషించారు. ఈ ఎనిమిది మంది కవులు వాక్యాల మంత్రజలం చల్లి ఒక కొత్త సందేశాన్ని మన వట్టిపోయిన రోజువారి బతుకుల్లోకి వంపుతున్నారు. వాళ్ళు వాళ్ళ కలల్ని వెంటాడుతూ వెళ్తూ మనం మరచిపోతున్న కలల్ని కూడా తట్టి లేపి వెళ్తున్నారు. అందుకే వీళ్ళు స్వప్న సాధకులని వారి కవిత్వాన్ని, వారిని ప్రేరేపించిన ఉపాధ్యాయుడు బాల సుధాకర్ మౌళి కృషిని ప్రశంసిస్తూ రాసిన సమీక్షా వ్యాసం ఇది.

ఈరోజు ఉదయం కురిసిన వాన పంటలు పండిస్తుందని, ఆకలి అంతమయ్యే రోజు వస్తుందని వారి ఆశావాద దృక్పథాన్ని వివరించారు. "ఆకలి నాకు తోబుట్టువు లాంటిది/మేమిద్దరము గదిలో మాట్లాడుకుంటున్నాం..." అనే కవితవాక్యాల్లో ఆకలి, పేదరికం, అణచివేతలే వారి కవితావస్తువుగా మలచుకున్న వైనాన్ని చిత్రించారు.

వ్యాసం చివరన పుస్తక తాలూకు వివరాలు, లభించు స్థలం, సంప్రదించవలసిన నెంబర్లు, ప్రచురణ వివరాలను తెలియజేస్తూ పరిచయాత్మకంగా అలాగే వస్తు వివరణలతో సాగిన సమీక్షా వ్యాసం ఇది. ఇలాంటి వ్యాస ప్రచురణ వలన మిగతా విద్యార్థులల్లో సృజనాత్మక ప్రేరణ కలుగుతుంది. యువ కవులకు మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది. వ్యాసం శీర్షికకు మొదటే విద్యార్థుల కవిత్వం అనే ఉపశీర్షిక పెట్టడం వలన వ్యాస మూల విషయాన్ని అర్థం చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది సాక్షి పత్రికలో కనబడుతున్న ప్రత్యేకాంశం. అలాగే సమీక్షా వ్యాసాలు ప్రచురించేటప్పుడు వ్యాసం చివరన పుస్తక తాలూకు ప్రచురణ వివరాలు ఇవ్వడం అనేది మనకు సాక్షి పత్రికలో కనబడుతుంది. ఇది నమస్తే తెలంగాణలో పుస్తక ప్రచురణ వివరాలుండవు.

వ్యాసం చివరన పుస్తక తాలూకు వివరాలు ఇలా కనిపిస్తున్నాయి. స్వప్న సాధకులు & సంపాదకుడు: బాల సుధాకర్ మౌళి; ప్రచురణ చంపావతి ప్రచురణలు; ప్రతులకు సంపాదకుడు బోయ స్ట్రీట్, నెల్లిమర్ల, విజయనగరం – 535 217; ఫోన్ – 9676493680 అంటూ పుస్తక సంబంధ వివరాలు మనకు కనిపిస్తాయి. దీని ద్వారా నూతన పుస్తక పరిచయమే కాకుండా అది లభించు స్థలం దాని వివరాలు పాఠకులకు అందుతాయి. ఈ విధమైన వివరాల ప్రచురణ మనకు సాక్షి మాత్రమే కనబడుతుంది.

### 2.10.4. కవిత్వ సంబంధ గ్రంథ సమీక్షల పట్టిక

కవితాపుస్తక సంబంధ సమీక్షా వ్యాసాలు ఈ రెండు పత్రికల్లో మరికొన్ని కనిపిస్తున్నాయి. వాటి వివరాలను కింది పట్టికలో గమనించగలరు.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | సంఘర్షణల మధ్య ‘మూడో మనిషి’ | పుష్యమీసాగర్ | మార్చి 28, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | తెలంగాణ సాహితీ రత్నమాలిక | పొత్తిరెడ్డి మల్లారెడ్డి | డిసెంబర్ 05, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 3) | ★పుస్తకంలోంచి... కవిత్వంతో తొలి ములాఖాత్ | N. వేణుగోపాల్ | ఫిబ్రవరి 29, 2016 | సాక్షి – సాహిత్యం |
| 4) | ★సమీక్షా వ్యాసం శిష్ట్లాకి దీర్ఘమిస్తే శ్రీశ్రీ | నామిని | ఆగస్టు 08, 2016 | సాక్షి – సాహిత్యం |
| 5) | అధిక్షేప ముక్తకాలు | పెన్నా శివరామకృష్ణ | జనవరి 01, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 6) | ఆధునికాంధ్ర కవిత్వం – పరిశోధన | అమ్మంగి వేణుగోపాల్ | జూలై 10, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 7) | మన తెలంగాణం... అక్షర జయగానం... | దేశపతి శ్రీనివాస్ | అక్టోబర్ 30, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక – 4**

### 2.11. కవిత్వ సంబంధ వ్యాసాలు–కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ

దిన పత్రికల సాహిత్య పుటల్లో కవుల జయంతి, వర్ధంతి సందర్భంగా అలాగే సన్మానాలు, సత్కారాలు లభించిన ప్రత్యేక సందర్భాలలో కవులకు సంబంధించిన జీవిత విషయాలను ఎక్కువగా ప్రచురిస్తున్నారు. అయితే లోతులకు వెళ్లకుండా వాటి మూలాలను మనకు అందిస్తున్నారు. ఈ రకమైన వ్యాసాలు మనకు సాక్షి, నమస్తే తెలంగాణ రెండు పత్రికల సాహిత్య

పుటల్లో కనిపిస్తున్నాయి. సాక్షి కన్నా ఎక్కువగా నమస్తే తెలంగాణ దినపత్రికలో వెలువడుతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత తెలంగాణ సాహిత్య పునర్నిర్మాణం జరగాల్సిన అవసరం ఉంది. కావున తెలంగాణ సాహిత్యానికి Biographical Criticism' ఎంతో అవసరం. ఇంతకాలం మరుగున పడిన కవులను, నూతన కవులను పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రధానంగా పత్రికల పైనే ఉంది. కావున ఉద్యమ స్ఫూర్తితో ఏర్పడిన నమస్తే తెలంగాణ పత్రిక సాహిత్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తుంది. ఈ వ్యాసాల విశ్లేషణకు ముందు Biographical Criticism అంటే ఏమిటి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

### 2.11.1. కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ–నిర్వచనాలు

'Biographical Criticism' గురించి కొంతమంది రచయితల నిర్వచనాలు కింది విధంగా ఉన్నాయి.

1) "కవుల జీవిత ఘట్టాలు, వారి మానసిక స్థితులూ, వారి తాత్విక భావనలు వారి రచనలలో ఎలా ప్రతిఫలించాయని కానీ, వారి వ్యక్తిత్వాలు కృతులనెలా రూపొందింపజేశాయని కానీ వివేచించే విమర్శనా పద్ధతి''(1983. పుట.145,146) అని జి. వి. సుబ్రహ్మణ్యం 'ఆంధ్ర సాహిత్య విమర్శ–ఆంగ్ల ప్రభావం' అనే గ్రంథంలో నిర్వచించారు.

2) "కవి జీవితమునకు, కావ్య రచనకు ఉన్న సంబంధమును పరిశీలించి వాని సమన్వయముతో విమర్శకు పూనుకొనిన అది కవి జీవిత కావ్య విమర్శ"(2007. పుట.11) గా పేర్కొనవచ్చునని యస్. వి. రామారావు 'తెలుగులో సాహిత్య విమర్శ' అనే గ్రంథంలో తెలిపారు.

3) "కవుల వ్యక్తిగత జీవిత పరిస్థితుల ప్రభావమూ, వారి మానసిక పరిస్థితులూ, వారు నమ్మే సిద్ధాంతాలు వారి రచనల్లో ఎలా ప్రతిబింబించాయో ఆలోచించే, నిరూపించే విమర్శనా పద్ధతి కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ''(2009: పుట.60)కవుల మానసిక స్థితి, వ్యక్తిత్వము అంచనా వేయటమే ఇందులో ప్రధానంగా జరిగేది కాబట్టి ఆ తర్వాత కాలంలో ఇది మనోవిశ్లేషణాత్మక విమర్శల్లో భాగంగా మారిపోయిందని యస్. యస్ నళిని 'సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ'లో పేర్కొన్నారు.

4) "కవి జీవిత కావ్య విమర్శ కావ్యంలో కవి యొక్క ఆత్మీయత ప్రతిఫలించే తీరును వివేచిస్తుంది. కవి జీవితాన్ని పరిశీలించిన అతని కావ్య తత్త్వము ఏమిటో తెలుస్తుంది"

(1992.పుట.19) అని యన్.ఝాన్సీరాణి 'Biographical Criticism in Telugu' అనే వీరి యమ్.ఫిల్. సిద్ధాంత వ్యాసంలో తెలిపారు.

ఈ విధంగా అనేకమంది కవి జీవిత కావ్య విమర్శను నిర్వచించారు. మొత్తం మీద కవి జీవిత విమర్శ అంటే కవికి సంబంధించిన కవి జీవిత పరిశీలనలు, కవి మీద ఏయే ప్రభావాలు పనిచేసాయి అనేదికూడా కవి జీవిత విమర్శ అవుతుంది. ఆ కవి ఆత్మకథలు రాస్తాడు. ఉత్తరాలు రాస్తాడు. వీటి గురించి ఎక్కడైనా ప్రస్తావించినా అది కూడా 'Biographical Criticism' అవుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కవి జీవితం, ఆయన రచనలకు ఉన్నటువంటి సంబంధ బాంధవ్యాలను వివరించేదే కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ. ఈ శాఖను ఆంగ్ల సాహిత్యంలో ప్రారంభించినవారు డ్రైడన్. పత్రికలకున్న పరిధి రీత్యా అత్యధిక శాతం కవి జీవిత విమర్శకు సంబంధించిన వ్యాసాలే ప్రచురిస్తున్నారు. కావున సాక్షి, నమస్తే తెలంగాణ పత్రికల్లో ఇలాంటి వ్యాసాలను మనం చూడవచ్చు.

### 2.11.2. జయంతి సంబంధ వ్యాసాలు

కవుల జయంతి సందర్భంగా గొప్ప కవులను, వారి సాహిత్య సేవను స్మరించుకోవడం అనేది ఒక సంప్రదాయం. కవుల జయంతి సందర్భంగా వారి జీవిత విశేషాలను కవితా విశేషాలను, కవులకు లభించిన సన్మాన, సత్కారాలు మొదలైన అనేక రకాల విషయాలను తెలుపుతూ జయంతి సంబంధ వ్యాసాలను పత్రికల్లో ప్రచురిస్తున్నారు. దీని ద్వారా కవి తాలూకు సమాచారమనేది పాఠకలోకానికి అందుతుంది. ఆ కవి గురించి వారి జీవితంలో తెలియని కొన్ని ముఖ్య ఘట్టాలను గురించి ఈ సందర్భంగా తెలుపుతున్నారు. కొన్ని సందర్భాలలో కవి రచనల కంటే కూడా జీవిత విషయాలకు, ఆనాటి చారిత్రక విషయాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ ధోరణిలో ఈ జయంతి సంబంధ వ్యాసాలను ప్రచురిస్తున్నారు. వ్యాసకర్తలకు కవితో గల అనుభవాలను అనుభూతులను పంచుకోవడం కూడా ఈ వ్యాసాల్లో మనకు కనిపిస్తుంది. వీటి ద్వారా కవుల జీవిత సంబంధ వివరాలు, రచనా వైశిష్ట్యం మనకు అవగతమవుతుంది. అలాగే వారి రచనలను చదవాలనే ప్రేరణ కూడా మనలో కలిగిస్తుంది. ఇలాంటి జయంతి సంబంధ వ్యాసాలు మనకు సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య పుటల్లో కనిపిస్తున్నాయి.

### 2.11.2.1. కవిత్వ అగ్నిధార దాశరథి

దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా డాక్టర్. ఎస్వీ. సత్యనారాయణ రాసిన 'కవిత్వ అగ్నిధార దాశరథి' అనే వ్యాసం నమస్తే తెలగాణ 'చెలిమె' సాహిత్య పుటలో జూలై 18, 2016 న ప్రచురితమయ్యింది.

దీనిలో వ్యాసకర్త దాశరథిని కవిత్వ అగ్నిధారగా తెలుపుతూ ఆయన జీవిత విశేషాలను, రచనా విశేషాలను, చారిత్రకాంశాలను తెలిపారు. కవిత్వంలోని వస్తువుకు అధిక ప్రాధన్యతనిచ్చారు. ఇక్కడ వ్యాస కర్త కవిత్వంలోని వస్తువు గురించి చర్చిస్తూనే కవి యొక్క జీవిత విశేషాలను తెలంగాణ ఉద్యమ చరిత్ర ఆనాటి సామాజిక పరిస్థితులను వంటి అనేక అంశాలను పాఠకులకు అందించారు. దీనిలో కవి జీవిత విమర్శ మనకు కనబడుతుంది.కవి జీవితం రచన దృక్పథాన్ని సంఘటనలను తెలుపుతూనే, తెలంగాణ ఉద్యమ పోరాట కాలంనాటి సంఘటనలను పోరాట కాలంలో రచయిత తన కవిత్వం ద్వారా చేసినటువంటి కృషిని ప్రస్తావించారు. ఉద్యమాన్ని గురించి వర్ణించడం ద్వారా ఇది కమ్యూనిస్టు భావజాలంతో రాసిన వ్యాసంగా మనం చెప్పవచ్చు. చరిత్ర సంబంధమైన విషయాలు 1947 స్వాతంత్ర కాలము, స్వాతంత్ర కాలాన్ని తరువాత హైదరాబాద్ చరిత్ర వంటి అనేక విషయాలను వ్యాసంలో చర్చించడం వల్ల దీన్ని మనము చారిత్రక విమర్శగా కూడా చెప్పుకోవచ్చు. చారిత్రకాంశాలు ఎక్కువగా చెబుతున్నారు. కవిత్వ విషయానికి వస్తే కవిత్వంలో రూపం కన్నా వస్తువుకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. పోరాటాన్ని తెలుపుతూ కమ్యూనిస్టు సిద్ధాంతాలతో ఈ వ్యాసం రాశారు. వ్యాస ప్రారంభంలో..

**'ఇదే మాట ఇదే మాట–పదే పదే అనేస్తాను**
**కదంతొక్కి పదం పాడి–ఇదే మాట అనేస్తాను**
**దగాకోరు బడాచోరు–రజాకారు పోషకుడవు**
**ఊళ్ల కూళ్ళు అగ్గిపెట్టి–ఇళ్ళన్నీ కొల్లగొట్టి**
**తల్లి పిల్ల కడుపుగొట్టి–నిక్కిన దుర్మార్గమంత**
**నీ బాధ్యత – నీ బాధ్యత…'**

అంటూ 'అగ్నిధారలు' కురిపించి, 'రుద్రవీణలు మీటిన కవి దాశరథి కృష్ణమాచార్య అని కమ్యూనిస్ట్ సిద్ధాంతాల ఆధారంగా రాస్తూ దాశరథిని తెలంగాణ ఉద్యమ కవిగా పరిచయం చేశారు.

**కవి జీవిత పరిశీలనలు**

వ్యాసకర్త కవి జీవిత విషయాలైన జననం, విద్యా, రచనా వ్యాసంగం, ఉద్యమ జీవితం, రచనా వస్తు విశేషాలను తెలుపుతూ కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ పద్ధతిలో ఈ వ్యాసాన్ని కొనసాగించారు. దీనిలో వ్యాసకర్త దాశరథి కవి జనన సంబంధ జీవిత విశేషాలను పేర్కొనడం వలన ఇది 'బయోగ్రాఫికల్ క్రిటిసిజం' అవుతుంది

"...1925 జూలై 22 న ఖమ్మం జిల్లాలోని చిన్నగూడూరు గ్రామంలో శ్రీమతి వెంకటమ్మ, శ్రీ వెంకటాచార్యుల దంపతులకు పుట్టిన కుమారుడు దాశరథి కృష్ణమాచారి. అతని తమ్ముడు దాశరథి రంగాచారి. బాల్యంలో కృష్ణమాచారి తండ్రి వద్ద సాంప్రదాయ రీతిలో విద్యాభ్యాసం చేశార..." అని చెప్తూ దాశరథి సృజనాత్మక రచన చేస్తూనే ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నాడని ఉద్యమ చరిత్రను తెలిపారు.

"...1942 లో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన రహస్య సమావేశాలకు హాజరయ్యాడు. ఆంధ్ర మహాసభ సభ్యత్వం స్వీకరించి హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమంలో తన మిత్రులతో కలిసి పాల్గొన్నాడు. మరోవైపు 1944 లో వరంగల్లో ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్ సభల్లో పాల్గొని ఉద్యమ కవిత్వాన్ని గానం చేశాడు... "అంటూ ఇలా కవి జీవిత విషయాలను, ఆయన స్వభావాన్ని ఇందులో తెలపడం వలన ఇది ఈ 'Biographical Criticism' అవుతుంది.

**చారిత్రక సంఘటనలు**

కేవలం సాహిత్యానికే ప్రాధాన్యం ఇవ్వకుండా చారిత్రకాంశాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఎందుకంటే తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత ఇంతకాలం మరుగున పడిన తెలంగాణ ప్రాంత చరిత్రను పునర్నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. తెలంగాణ ప్రాంత చరిత్ర ,ఉద్యమ చరిత్ర, ఆనాటి సామాజిక పరిస్థితులు, కవుల కృషి వాళ్ళు ఎదుర్కొన్న సమస్యలు వంటి అనేక విషయాలను పాఠకులకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. కావున వ్యాసకర్త చారిత్రకాంశాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఈ వ్యాసం రాశారు. కవి జీవితం రచన విశేషాలను తో పాటు తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని వివరించే ప్రయత్నం చేశారు. దాశరథి సృజనాత్మక రచన చేస్తూనే ప్రజా ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలుపుతూ ఉద్యమ చరిత్రను తెలియజేసారు.

"...1942లో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన రహస్య సమావేశాలకు హాజరయ్యాడు. ఆంధ్రమహాసభ సభ్యత్వం స్వీకరించి, హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమంలో తన మిత్రులతో

కలిసి పాల్గొన్నాడు. మరోవైపు 1944లో వరంగల్లో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలలో పాల్గొని ఉద్యమ కవిత్వాన్ని గానం చేశాడు…" 1947 డిసెంబర్‌లో దాశరథితో పాటు మరో ముప్పై మందిని నిజామాబాద్ జైలుకు తరలించారు.

**'ఓ నిజాము పిశాచమా! కానరాడు**

**నిన్నుబోలిన రాజుమాకెన్నడేని**

**తీగెలను తెంపి అగ్నిలో దింపినావు**

**నా తెలంగాణ కోటి రత్నాల వీణ…'**

అంటూ జైలు గోడల మీద బొగ్గుతో పద్యం రాశాడు. జైలు అధికారులు ఆ పద్యాన్ని చెరిపేశారు. దాశరథికి అత్యంత ఆత్మీయ మిత్రుడు వట్టికోట ఆళ్వారు స్వామి ఆ పద్యాన్ని జైలు గోడల మీద మళ్ళీ మళ్ళీ రాసేవాడు. జైలు అధికారులు తుడిచేసేవారు. మొత్తం మీద ఆ పద్యం ఖైదీలందరికీ కంఠస్థమైపోయింది. ఇలా చారిత్రక సంబంధమైన విషయాలను విశ్లేషిస్తూ, కవిత్వంలో సామాజికమైన వస్తువును స్వీకరించి ప్రజల సమస్యలను చిత్రిస్తూ, నిజాం ప్రభుత్వ వ్యతిరేక పోరాటాన్ని తన కవిత్వం ద్వారా కొనసాగించారని వస్తువుకు ప్రాధాన్యతనిస్తూ విశ్లేషించారు.

**"రానున్నది ఏది నిజం అది ఒకటే సోషలిజం**

**కలపండోయ్ భుజం భుజం కదలండోయ్ గజం గజం"**

అంటూ ఉద్యమ ఆహ్వానాన్ని పలికించారని, కమ్యూనిస్టు భావాలతో కమ్యూనిస్టు సిద్ధాంతాలతో ఈ వ్యాసాన్ని రచించారు. ఇందులో వస్తువుకే ప్రాధాన్యతనిచ్చారు కానీ కవితా శిల్పాన్ని ప్రస్తావించలేదు. అభ్యుదయ సాహిత్యంలో లేదా కమ్యూనిస్టు సాహిత్యంలో వస్తువు ప్రధానం కాని దాని శిల్పం కాదు కావున ఈ వ్యాసంలో కూడా ఎస్వీ. సత్యనారాయణ దాశరథి జీవిత విశేషాలను, కవిత విశేషాలను కవి జీవిత విమర్శ పద్ధతిలో పరిచయం చేశాడు. అలాగే చారిత్రక విషయాలను ఎక్కువ ప్రాధాన్యతని ఇచ్చాడు కమ్యూనిస్టు భావజాలానికి సంబంధించిన పదజాలాన్ని ఎక్కువగా ఉపయోగించారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణకు ముందు తెలంగాణ చరిత్ర, కవుల గురించిన రచనలు సరిగా రాలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రాంతానికి, కవులకు ప్రత్యేక గుర్తింపు లభించింది. వీరిపై అనేక రచనలు చేస్తున్నారు. వాటిని మనకు అందించాల్సిన బాధ్యత పత్రికలపై ఉంది. దీన్ని నమస్తే తెలంగాణ పత్రిక నిర్వర్తిస్తుందని చెప్పవచ్చు. మరుగునపడిన తెలంగాణ కవులను, వారి సృజనను ప్రజలకు తెలియజేయడమే ప్రధాన ధ్యేయంగా 'చెలిమె' పుట నడుస్తుంది.

తెలంగాణ ప్రాంతంలో మరుగున పడిన కవులకు, తెలంగాణ సాహిత్య సంబంధ వ్యాసాలకు అధిక ప్రాధాన్యతనిస్తుంది. చాలామందికి నామమాత్రమైన తెలియని మట్టిలో మాణిక్యాల వంటి ఎందరో తెలంగాణ కవులను చెలిమె పుట పాఠకులకు పరిచయం చేస్తుంది.

### 2.11.2.2. ధిక్కార స్వర ఆది గురువు

అమ్మంగి వేణుగోపాల్ రాసిన ధిక్కార స్వర ఆది గురువు అనే వ్యాసం సెప్టెంబర్05, 2016 న నమస్తే తెలంగాణ చెలిమె పుటలో వెలువడింది.

వ్యాసకర్త అమ్మంగి వేణుగోపాల్ కాళోజిని ధిక్కార స్వర ఆది గురువుగా తెలుపుతూ ఆయన జీవిత విశేషాలను, రచనా విశేషాలను ఇందులో పొందుపరిచారు. వ్యాసకర్త కాళోజిని గురించి తెలుపుతూ "ఒక్కో ప్రాంతానికి ఆ ప్రాంత భాషా వికాసాలకు ప్రతిరూపాలుగా ఒకరు నిలుస్తారు. బెంగాల్ కు ఠాగూర్ లాగానే తెలంగాణ ప్రాంత భాషా వికాసాలకు ప్రతి రూపం కాళోజి. జీవితాంతం తెలంగాణ భాషా వికాసం కోసం తపించి, తెలంగాణ బాస, యాసల సచ్చిలతను వివరించి, తెలంగాణ ఒట్టి యాస మాత్రమే కాదు అది తెలంగాణ భాష అని చాటిచెప్పిన వాడు కాళోజి" అని పేర్కొన్నారు. సెప్టెంబర్ 9 న ఆయన జన్మ దినాన్ని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్న సందర్భంగా ఆయన జీవిత విశేషాలను, రచన విశేషాలను తెలుపుకుంటూ రాసిన వ్యాసం ఇది. దీనిని కవి జీవిత కావ్య విమర్శగా చెప్పవచ్చు.

**కవి జీవిత పరిశీలనలు**

వ్యాస కర్త ఇందులో కాళోజి జీవిత విశేషాలను పేర్కొనటం వల్ల ఇది Biographical Criticism" అవుతుంది.

ఉదా: "చిన్న వయసులోనే పెద్ద ప్రపంచాన్ని అర్థం చేసుకున్నవాడు కాళోజి. ఆ పునాది మీదనే ఆయన ఉద్యమకారుడిగా, స్వాతంత్ర్యసమరయోధుడిగా, ప్రత్యేక తెలంగాణ ప్రవక్తగా, పౌరహక్కుల నేతగా పరిణామం చెందాడు......"

"ఇతరుల ఇళ్లల్లో ఉన్నపుడు కుడా తన పద్ధతిలోనే ఉంటే కాళన్నా, పరాయి ఇంటికి వచ్చినా నీ అలవాట్లు మానవా అని ఎవరైనా అంటే, పరాయి ఇంటికి మనమెందుకు పోతాం, ఇది మన యిల్లే". అంటూ అనగలగడం వెనుక ఉన్న సంస్కారము 'నాకు స్నేహితులు, స్ట్రేంజర్సే కానీ పరిచయస్తులు ఉండరనటం వెనుకనున్న కీలకము అదే. అంటే తన అభిప్రాయంతో ఏకీభావం లేని వ్యక్తులు కూడా కాళోజికి మిత్రులే..." ఇలా కాళోజి జీవిత విషయాలను ఆయన స్వభావాన్ని వ్యాసకర్త ఇందులో తెలిపారు.

కవి పై ఏయే ప్రభావాలు పని చేసాయి అనేది కూడా కవి జీవిత విమర్శ అవుతుంది. ఈ వ్యాసం నందు కాళోజి పై అనేక మంది ఆంగ్ల కవుల ప్రభావం కలదని క్రింది విధంగా వ్యాసకర్త తెలిపారు.

"...కాళోజి పుస్తకాలను చదువ లేదు. అధ్యయనం చేసాడు. జీవితంలో ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలకు ఆయా రచయితలు పరిష్కారాలేమైనా సూచించారేమో తెలుసుకోవడానికే బహుశా అధ్యయనం చేసి వుంటాడు. తనలాగే ప్రవాసశిక్ష, జైలుశిక్షలు అనుభవించిన తాత్త్వికుడు వాల్టెర్ (1694–1718) రాతలను ఇష్టపడ్డాడు. కాళోజి రాసిన తొలి కవితల్లో 'మాతృదేశము' గేయరచనకు సర్ వాల్టర్ స్కాట్ (1771–1832) ప్రేరణ వుంది. దారిద్ర్యం చేయించిన తప్పులను, ఆ తప్పులకు అనుభవించిన శిక్షలను మానవీయకోణంలో చూసి, చూపించినందుకు Les miserable (1852) 'బీదలపాట్లు' నవల రచయిత విక్టర్ హ్యూగోను కొన్ని వందల సార్లు కాళోజి ప్రస్తావించారు..."

ఈ విధంగా వ్యాసకర్త కవి జీవిత పరిశీలనలు, అతనిపై గల ఇతర కవుల ప్రభావం తెలపడం వలన ఇది 'Biographical Criticism' అవుతుంది. ఒకప్పుడు తెలంగాణ భాషా దినోత్సవం ప్రకటించే వరకు కాళోజి గురించి రచనలు సరిగ్గా రాలేదు. ఇప్పుడు కాళోజి మీద ఎంతోమంది రచనలు రాస్తున్నారు. ఆ రచనలను మనకందించవలసిన బాధ్యత పత్రికలపై ఉంది. దీనిని నమస్తే తెలంగాణ పత్రిక నిర్వహిస్తుందని చెప్పవచ్చు. చరిత్రకు ఉపయోగపడే ప్రాథమిక ఆధారాలకు 'Biographical Criticism' ఉపయోగపడుతుంది.

### 2.11.2.3. అభినవ కాళిదాసు కృష్ణమాచార్యులు

నిజామాబాద్ జిల్లాకు చెందిన గొప్ప కవి, అవధాని శిరిసినహల్ కృష్ణమాచార్యుల జయంతి సందర్భంగా వచ్చిన వ్యాసం ఇది. దీనిలో వ్యాసకర్త కవి జీవిత విషయాలను తెలుపుతూ ఆయన రచనా విశిష్టతను తెలియజేసి ఇంతకాలం మనకు తెలియని ఒక గొప్ప కవిని పాఠకులకు పరిచయం చేశారు. కవి జీవిత విమర్శ పద్ధతిలో మల్లారపు రాజు రాసిన ఈ వ్యాసం ఆగస్టు 14, 2017 న చెలిమె పుటలో వెలువడింది.

కృష్ణమాచార్యుల గురించి తెలుపుతూ "...ఈయనను తొలి తెలంగాణ శతావధానిగా పేర్కొనవచ్చు. ఈయన 1929 'కళాభ్యుదయం' అనే కవితా సంపుటిని వెలువరించారు. అపారమైన పాండిత్యం, అనర్గళమైన వాక్చాతుర్యం కలిగిన తొలితరం

కవికులజుడు. విశిష్టాద్వైతావలంబికులు శిరిసినహల్ కృష్ణమాచార్యులు నిజాం రాజ్య తొలి శతావధానిగా పేరొందారు..."

ఈ విధంగా కృష్ణమాచార్యుల గొప్పతనాన్ని, ఆయన జీవిత విషయాలను పాఠకులకు అందించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత ఇలాంటి మరుగునపడిన మాణిక్యాలను వెలికి తీసి వారి రచనలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. కావున దీన్ని కూడా కవి జీవిత విమర్శగా చెప్పవచ్చు. ఇందులో విశ్లేషణకంటే కవి అందించిన స్ఫూర్తి ప్రధానం.

### 2.11.2.4. లలితమైన భాష, రమ్యమైన భావం

సినారె జయంతి సందర్భంగా ఎ. రాధాకృష్ణ రాసిన వ్యాసం "లలితమైన భాష, రమ్యమైన భావం" సాక్షి సాహిత్యం పుటలో జూలై 25, 2016న ప్రచురితమయింది. వ్యాసకర్త సినారె కవి జీవితం, వారి కవిత్వంలోని రమణీయత గురించి, కవితా వస్తువు గురించి వివరించారు. సినారె కవితలో కాళిదాసాది భారతీయ మహాకవుల పరువముంది. ఉర్దూ కవుల ఆవేశం, నవ్యత కనిపిస్తాయి. భట్టుమూర్తి వంటి ప్రజ్ఞ ఉంది. భావ కవిగా, అభ్యుదయ కవుల్లో అభ్యుదయవాదిగా, విప్లవ ధోరణులకు నీరాజనం పట్టే విప్లవ రచయితగా, ప్రజాకవిగా భాసిల్లారు. విరసంతో సరసం ఆడగల సమర్థుడాయన. ఆయన హృదయమే కవిత్వం. ఆర్ద్రతతో తడిసిన ఆయన అంతరంగం నుండి పెకిలివచ్చే ప్రతిపదంలోనూ కవిత్వం ఉంటుందని సినారె కవిత్వం గురించి తెలుపుతూ దానిలోని వస్తువు గురించి చర్చించారు.

"నాపేరు కవి. ఇంటి పేరు చైతన్యం. ఊరు సహజీవనం, కవిత్వం నా మాతృభాష, ఇతివృత్తం మానవత్వం" అని మానవత్వానికి చెందిన తన కవితావస్తువు సినారె పరిచయం చేసుకున్నారని తెలిపారు. అలాగే కాల్పనికోద్యమ, అభ్యుదయ, మానవతోద్యమ భావాలు తన వస్తువులుగా చేసుకున్నారని వివరించారు. లలితమైన భావం, రమ్యమైన భావన ఆయన సొంతమంటూ వ్యాసకర్త సినారెను సహృదయతగల కవిగా సమతా మమతలను ఆకాంక్షిస్తున్న కవిగా పేర్కొన్నారు.

**"సమత నా తల్లి – సౌహార్దం నా తండ్రి**
**అనాది నా జననం – అనంతం నా పయనం**
**విశ్వం నా ఊరు**
**శాంతి నా పేరు"**

అంటూ ఇలా సినారె సమతా, శాంతులను కోరుతూ కవిత్వం రాసారు. సినారె కవిత్వానికి ప్రగతివాదం ప్రస్ఫుటిస్తుంది. "ఈ రాత్రి కనవలసింది – కవలలను కాదు. క్రాంతి గోళాలను/ఈనాడు కావలసింది – డోల ఊపడం కాదు – నిద్ర లేపడం" అంటూ ఇలా విభిన్న అంశాలతో ప్రతి మాటలో చైతన్యాన్ని ప్రగతివాదాన్ని కోరుతున్న సినారె కవిత్వాన్ని, ఆయన కవితా వస్తువును వర్ణిస్తూ, వివరిస్తూ కవి జీవిత విమర్శ పద్ధతిలో రచనా విశిష్టతను, రచయిత భావజాలాన్ని పాఠకులకు ఈ వ్యాసం ద్వారా అందించారు. జయంతి సందర్భంగా వచ్చే వ్యాసాల్లో సాధారణంగా కనిపించే జనన సంబంధ వివరాల కన్నా ఈ వ్యాసంలో రచయిత దృక్పథానికి కవితా వస్తువుకు అధిక ప్రాధాన్యత నిచ్చారు.

### 2.11.2.5. జ్ఞానపీఠం జ్ఞాపకాల దొంతర

సినారె జయంతి సందర్భంగా ఎన్. గోపి రాసిన వ్యాసం "జ్ఞానపీఠం జ్ఞాపకాల దొంతర". ఇది నమస్తే తెలంగాణ చెలిమె పుటలో జూలై 24, 2017న ప్రచురితమయింది.

ఈ వ్యాసంలో వ్యాసకర్త సినారెతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ రాసారు. కవి జీవిత విషయాలను ప్రస్తావించారు. జ్ఞానపీఠ పురస్కారం తర్వాత 1990 జనవరి 9న సినారెతో కలిగిన కొన్ని అనుభూతులను, జ్ఞాపకాలను స్మరిస్తూ రాసిన వ్యాసం ఇది. జ్ఞానపీఠ పురస్కారం తర్వాత సినారెకి తన స్వగ్రామం హనుమాజిపేటలో సన్మానాన్ని ఏర్పాటు చేసారు. ఆ సన్మాన కార్యక్రమానికి సినారె వ్యాసకర్తను పిలవడంతో ఎన్. గోపి ఆ సన్మాన కార్యక్రమానికి వెళ్ళారని చెప్తూ ఆనాటి మధురస్మృతులను సినారె జయంతి సందర్భంగా నెమరేసుకుంటూ రాసిన వ్యాసం ఇది. ఇది ఒక యాత్రాస్మృతిలా కవి జీవిత విమర్శ పద్ధతిలో సాగింది. ఈ వ్యాసం ద్వారా కవి జీవిత వివరాలు, సినారెకు లభించిన సన్మాన వివరాలు, పొందిన అనుభవాలను పాఠకుడికి అందిస్తున్నారు. కవుల జీవితంలో కొన్ని ముఖ్య సంఘటనలు లేదా ఎవరికి తెలియని విషయాలను అలాగే కవితో వారికున్న అనుభూతులను తెలుపుతూ జయంతి సంబంధ వ్యాసాలు ప్రచురిస్తున్నారు. నమస్తే తెలంగాణ పత్రిక చాలా వరకు కవి జీవిత విమర్శ వ్యాసాలను ప్రచురిస్తూ నూతన కవులను, రచయితలను, పాఠకులకు పరిచయం చేస్తూ తెలంగాణ సాహిత్య పునర్నిర్మాణంలో తమవంతు కృషిని నిర్వర్తిస్తుంది.

ఈ విధంగా కవుల జయంతి, వర్ధంతి అలాగే ప్రత్యేక సందర్భాలను పురస్కరించుకొని బయోగ్రాఫికల్ క్రిటిసిజం పద్ధతిలో కవిత్వ సంబంధ వ్యాసాలు సాహిత్య పుటల్లో చాలా కనిపిస్తాయి. ఉత్తరాలు, ఇంటర్వ్యూ రూప వ్యాసాలు ఇవన్నీ కూడా బయోగ్రాఫికల్ క్రిటిసిజం

కిందికే వస్తాయి. ఇలా కవిజీవిత విమర్శ ధోరణి కవిత్వ వ్యాసాలు మనకు రెండు పత్రికల సాహిత్య పుటల్లో చాలా కనిపిస్తున్నాయి.

### 2.11.2.6. జయంతి సంబంధ వ్యాసాల పట్టిక

ఇలాంటి జయంతి సంబంధ మరికొన్ని కవిత్వ వ్యాసాలు రెండు పత్రికల్లోను వెలువడ్డాయి. వాటి వివరాలు కింద పట్టికలో తెలియజేసాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | మమతామూర్తి జాషువా | డా॥ సందినేని రవీందర్ | అక్టోబర్ 03, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | అపూర్వ ప్రతిభాశాలి చందాల కేశవదాసు | పురుషోత్తమాచార్య | జూన్ 20, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 3) | ★నేడు చందాల కేశవదాసు తొలి తెలుగు సినీ కవి | పైడిపాల | జూన్ 20, 2016 | సాక్షి – సాహిత్యం |
| 4) | హైదరాబాద్ కీ షాన్ ఔర్ పహచాన్... | ఆచార్య ఎస్వీ. సత్యనారాయణ | జూలై 17, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 5) | సదాశివ సంగీత సంస్కారం | అమ్మంగి వేణుగోపాల్ | మే 08, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 6) | అతని కవిత అగ్నిధార | ఆచార్య ఎస్వీ. సత్యనారాయణ | జూలై 17, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 7) | తెలంగాణ అంతరాత్మ | అమ్మంగి వేణుగోపాల్ | సెప్టెంబర్ 04, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 8) | ★జూలై 29 సినారె జయంతి మరణం నను వరించి వస్తే ఏమంటాను! | డా॥ ఎన్. గోపి | జూలై 24, 2107 | సాక్షి – సాహిత్యం |
| 9) | ★సెప్టెంబర్ 22న పి.బి. శ్రీనివాస్ అష్టభాషా కవి పి.బి.ఎస్. | శ్రీకాంత్ జయంతి | సెప్టెంబర్ 18, 2017 | సాక్షి – సాహిత్యం |
| 10) | కాళోజి జీవితంలోని రెండు ఉదంతాలు | అమ్మంగి వేణుగోపాల్ | సెప్టెంబర్ 05, 2016 | సాక్షి – సాహిత్యం |

**పట్టిక – 5**

### 2.11.3. వర్ధంతి సంబంధ వ్యాసాలు

మనిషి మరణం అనివార్యమైనది. కవి మరణం సాహిత్య లోకానికి తీరని లోటు. కవి మరణించి ప్రజల హృదయాల్లో ఎప్పటికి జీవించే ఉంటారు. జాషువా చెప్పినట్లు

**"రాజు మరణించే నొక తార రాలిపోయె**

**కవియు మరణించె నొక తార గగనమెక్కె**

**రాజు జీవించె రాతి విగ్రహములందు**

**సుకవి జీవించె ప్రజల నాలుకలయందు**

**(జాషువా:2012. పద్యం.06: పుట.44)**

కవి మరణం శారీరకమైనదే గానీ వారు ఎన్నటికి ప్రజల నాలుకలపై చిరస్మరణీయులు. మరణించిన జీవించే మహర్షి కవి. కవుల మరణం లేదా వర్ధంతి సందర్భంగా వారి సాహిత్య సేవను, జీవిత విశేషాలను, రచనాదృక్పథాన్ని వివరిస్తూ వారికి నివాళిగా రాసేటటువంటి స్మృతి సంబంధ వ్యాసాలు మనకు దినపత్రికల్లో కనిపిస్తున్నాయి. కవుల వర్ధంతి సందర్భంగా లేదా కవుల మరణ వార్త విన్నప్పుడు ఆయా సందర్భాల్లో కవులతో వారికి ఉన్నటువంటి అనుభవాలను స్మరించుకుంటూ రాసిన వ్యాసాలను మనం సాహిత్య పుటల్లో గుర్తించవచ్చు. ఈ వ్యాసాల్లో కూడా కవి జీవిత విషయాలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. రచనా దృక్పథాన్ని, రచనా ప్రస్థానాన్ని చర్చించి అధికంగా జీవిత సంబంధ విషయాలకు, చారిత్రక సంబంధ విషయాలకు, కవితో వారికి గల అనుభవాలకు ప్రాధాన్యతనిస్తున్నారు కావున స్మరణ/స్మృతి సంబంధ వ్యాసాలను కూడా కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ పద్ధతిగా చెప్పవచ్చు. ఇటువంటి స్మృతి వ్యాసాలు మనకు సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య పుటల్లో కింది విధంగా కనిపిస్తున్నాయి.

### 2.11.3.1. ఎవడాపును కవి వాక్కును...

కొండపల్లి నీహారిణి రాసిన "ఎవడాపును కవి వాక్కును..." అనే వ్యాసం జూన్ 26, 2017న నమస్తే తెలంగాణ చెలిమె పుటలో వెలువడింది. జూన్ 12, 2017న మహాకవి సి. నారాయణ రెడ్డి (సినారె) మరణించిన సందర్భంగా ఆయనను, వారి సాహిత్య సేవను స్మరిస్తూ నివాళిగా రాసిన వ్యాసం ఇది. ఈ వ్యాసంలో కవి మరణం పట్ల సంతాపాన్ని తెలియజేస్తూ వారు కవిత్వానికి, సాహిత్యానికి చేసిన ఎనలేని కృషిని కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ పద్ధతిలో తెలిపారు.

వ్యాస ప్రారంభంలోనే

**"ఏదైనా రాయందే ఈ క్షణాన్ని పోనీయను**

**కలాన్ని పిండేయందే కాలాన్ని కదలనీయను**

**అవసరమైనప్పుడల్లా అగ్గిపుల్లతో చీకటి**

**కొవ్వును కరిగించందే కొత్త పొద్దును రానీయను...**

అంటూ ప్రతిజ్ఞ చేసిన సినారె జూన్ 12, 2017న కొత్త పొద్దు కోసం వేచి చూడలేదు. మరో లోకంలో కవితల అగ్గిపుల్లతో చీకటి కొవ్వును కరిగించాలని వెళ్ళారేమో... గానీ తెలుగు సాహిత్యాభిమానులకు తరగని బాధ మిగిల్చి వెళ్ళారని సంతాపాన్ని వ్యక్తపరిచారు.

వ్యాసకర్త సినారెను సాహితీవిరాట్రూపులుగా సంబోధిస్తూ ఆయన పరిశోధన గ్రంథం ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయాలు – ప్రయోగాలు వైశిష్ట్యాన్ని కొనియాడారు. వారి జీవిత విశేషాలను తెలియజేసారు. “1931 జూలై 29న కరీంనగర్ జిల్లా హనుమాజిపేటలో పుట్టిన సినారే తమ కన్నతల్లి బుచ్చమ్మగారి గురించి ‘బ్రతికినంతకాలం బంగరు మమతలు పొందించిన పాలవెల్లి’ అని కీర్తించారు. తండ్రి మల్లారెడ్డి గురించి ‘పదుగురు పాలేర్లున్నా నల్లని రేగుళ్లు దున్ని బ్రతుకున రవ్వలు పండించిన కర్షకమణి’ అని పొగిడి కొడుకుగా రుణం తీర్చుకున్నారు” అని ఆయన బాల్యం నుండి విద్యాభ్యాసం, ఉద్యోగం చేపట్టిన పదవులు మొదలైన అనేక అంశాలను తెలియజేస్తూ ఎన్ని పదవులు ఉన్న కవిత్వమే శ్వాసగా బతికిన కవి సినారె అని వారి జీవితాన్ని, రచనా ప్రస్థానాన్ని ఈ వ్యాసంలో కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ పద్ధతిలో వివరించారు. సినీ గీత రచయితగా ఆయన జీవిత ప్రస్థానాన్ని తెలిపి వారి పాటలలోని ఆణిముత్యాలను కొన్నింటిని ఉదహరించారు.

అన్ని తత్త్వాల కంటే మానవత్వం గొప్పదనే భావాన్ని సినారె తన కవిత్వం ద్వారా ప్రకటించిన మహామనిషి. విశ్వం నా ఊరు, శాంతి నా పేరు అంటూ కులమతాల ముసుగులో మనుషులమన్న అసలు సంగతి మరచిపోవడాల్ని ఖండించారు. అక్షర జ్ఞానమే జీవితంలో పరిపూర్ణత్వాన్ని సాధిస్తుందని గాఢంగా నమ్మిన సినారె

**పరిమళాల నెవడాపును, పైరగాలి నెవడాపును**

**ఎవడాపును మానవతా రవి రుక్కును... కవి వాక్కును...**

అని ప్రకటించారు. ఇది చాలదా కవి మూర్తిమత్వం గొప్పదనడానికి, అమ్మా నాన్నల ప్రేమ గురించి, ఆగిపోని కాలాన్ని గురించి, జీవన సంఘర్షణల గురించి, ప్రకృతి గురించి, పల్లెల గురించి రాసిన సినారె ఎందరో కవులకు మార్గదర్శకులు. అన్యాయాలను, అసూయలను, అమానుషాలను నిరసించడం, మాట్లాడాల్సిన సందర్భంలో మౌనం వహించడాన్ని ఖండించడం, బహురూపాలైన కోరికలు మనిషిని కుదిపేస్తుంటే అదుపులో పెట్టుకోగలిగే మనోస్థైర్యం అండగా ఉంచుకోవాలనడం, జ్వలన శీలతను, సృజన శీలతలను ఆహ్వానించాలని అనడం... లాంటి వెన్నో సినారె కవితల్లో గమనిస్తాం. వాక్కుకు వయసు లేదని ప్రకటించిన సినారె చివరి శ్వాస వరకు సాహితి సభల్లో

పాల్గొని రోజుకొక్క కవితను రాస్తూ తెల్లవారు జామున అనాయాసంగా దివ్యలోకాలకేగారని వారి జీవిత ప్రస్థానాన్ని ఈ వ్యాసంలో పొందుపరిచారు.

**రాస్తూ రాస్తూ పోతాను**
**సి రా ఇంకే వరకు**
**పోతు పోతు రాస్తాను**
**వసువు వాడే వరకు…!**

అని చెప్పిన తమ శపథాన్ని నెరవేర్చుకొని పోయారా. మంచితనాన్ని మాటల్లో చెప్పి చెడ్డతనాన్ని పోగొట్టుమన్న మన సినారె. ఆయనెక్కడికి పోయారు. మాటగా మన మధ్యే ఉన్నారు. చీకటి కొవ్వును కరిగించే అగ్గిపుల్లగా మనలోనే ఉన్నారంటూ వ్యాసకర్త స్మృతి సంబంధ వ్యాసం ద్వారా సినారెకు నివాళులర్పించారు. మహాకవులకు మరణమంటూ ఉండదని వారి సాహిత్య సేవ చిరస్మరనీయం అంటూ తెలియజేసే స్మృతి సంబంధ వ్యాసాలు కూడా కవి జీవిత కావ్య విమర్శగా చెప్పవచ్చు. ఈ వ్యాసంలో కవి జీవిత విశేషాలు, వారి రచనల గొప్పదనం, కవి దృక్పథం చర్చించబడినవి కావున ఇది కవి జీవిత కావ్య విమర్శ అవుతుంది.

### 2.11.3.2. శివసాగర్ మ్రోగించిన తొలి గంటలు

నామాడి శ్రీధర్ రాసిన స్మరణ వ్యాసం "శివసాగర్ మ్రోగించిన తొలిగంటలు" ఏప్రిల్ 17, 2017న సాక్షి సాహిత్యం పుటలో ప్రచురితమైంది. శివసాగర్‌గా పేరొందిన కె.జి. సత్యమూర్తి ఏప్రిల్ 17, 2012న మరణించారు. ఆయన వర్ధంతి సందర్భంగా రాసిన స్మృతి వ్యాసం ఇది. వ్యాసకర్త శివసాగర్‌ను విప్లవకవిగా చిత్రిస్తూ వారి కవిత్వ భావజాలాన్ని వివరించారు. మొదటి నుండి ఆయన పాట/కవిత రెండు ప్రక్రియల్ని స్వీకరించారని, వారి రచనా దృక్పథాన్ని విశ్లేషించారు. "అభ్యుదయ విప్లవ కవిత్వంలోని మూసధోరణులకు ఎడంగా నిలిచారు. కవిత్వాంశం మొదలుకొని పరిభాష, వక్తీకరణ నిర్మాణం వరకు తన ప్రత్యేకతను కనబరిచారు. కవి ఒకచోట చెప్పారంటూ శివసాగర్ కవితా వస్తు సంబంధ అభిప్రాయాన్ని వ్యాసకర్త ప్రస్తావించారు. "అభ్యుదయ రచయితలు చందమామ వంటి వాటి జోలికి పోకూడదని మా అభిప్రాయం. అభ్యుదయ కవిత్వంలో పులి చంపిన లేడినెత్తురుండాలి. హోచిమిన్‌ను చదివిన తర్వాతే చంటిపాప నుండి చందమామ వరకు విప్లవ కవిత్వంలో ఉండవచ్చని తెలుసుకున్నాను". ఆ ఎరుకతోనే అపూర్వ రీతిలో ఆకాశం, నెలవంక, చందమామ , వెన్నెల, వెదురు పొద, సెలయేరు, చిరుగాలి, ప్రేమ, ప్రియురాలు, ఎదురుచూపులు, కన్నీరు, గోరింటాకు, ఏక్‌తార్, ఫీనిక్స్ లాంటి రంగు, రుచి,

వాసన నిండిన ప్రతీకల్ని, శబ్దజాలాన్ని విప్లవ, దళిత కవిత్వంలోకి శివసాగర్ పట్టి తెచ్చారని వారి కవితా వస్తువును విశ్లేషించారు.

శివసాగర్ రాసిన కవిత ఊరిపాట (1972) అభివ్యక్తిలో ఈనాటికి క్రొత్తగానే ఉంటుందంటూ వారి రచనలు ఉద్యమం నెలబాలుడు, నెలవంకా మొదలైన వాటిని గుర్తుచేస్తూ సమాజంపై ఆయన రచనల ప్రభావాన్ని వివరించారు. కవి అభిరుచులను ప్రస్తావిస్తూ "ఆయనకు గురజాడ, కృష్ణశాస్త్రి, ఎంకి పాటల నండూరి, నయాగరా కవులు, శ్రీశ్రీ, పఠాభి, ఆలూరి బైరాగి అంటే ఇష్టం. మావో, హోచిమిన్, పాబ్లో నెరుడా అంటే అభిమానమని పేర్కొన్నారు.

కంభం జ్ఞానసత్యమూర్తిగా, ఉపాధ్యాయుడిగా, పాత్రికేయుడిగా పనిచేసినవారు శివసాగర్‌గా కడవరకు కమ్యూనిస్టుగా జీవించారంటూ వారి జీవిత సంఘటనలను, రచనా నేపథ్యాన్ని, రచనల ప్రత్యేకతలను కవి జీవిత విమర్శ ధోరణిలో తెలిపారు. పోరాట కమ్యూనిస్టు సిద్ధాంతాల ధోరణిలో కొనసాగుతూ స్మృతి సంబంధ వ్యాసంగా నిలిచింది. ఈ వ్యాసంలో కవి భావజాలాన్ని పాఠకులకు అధికంగా తెలిపారు. వివిధ ఇంటర్వ్యూల్లో శివసాగర్ తెలిపిన వారి అభిప్రాయాల్ని ఎక్కువగా ప్రస్తావించారు. కవి జీవిత సంబంధ విషయాలు అలాగే కవిపై ప్రభావం చూపించిన అంశాలను చర్చించారు. కావున ఇది కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ అవుతుంది.
ఏ విషయాన్నయినా స్పెసిఫిక్‌గా చెబుతూనే జనరలైజ్ చేయగలిగితే తర్వాత తరం కూడా చదువగలుగతుందని శివసాగర్ పాటించిన రచనాసూత్రమే ఆయనని మళ్ళీ మళ్ళీ చదివింపజేస్తుందని మనోహర కవితగానూ లేదా హోరెత్తే కవాతు గీతంలానూ, విప్లవ, దళిత కవిత్వంలో ఆయన మ్రోగించిన తొలిగంటలు ఎప్పటికీ మార్మోగుతుంటయ్ అని కవి గురించి వారి రచన గొప్పతనం వంటి ఎన్నో విషయాలను స్మరిస్తూ ఈ వ్యాసాన్ని రారు. దీని ద్వారా కవి రచనా దృక్పథం పాఠకులకు సులువుగా అవగతమవుతుంది.

### 2.11.3.3. కవుల వర్ధంతి సంబంధ వ్యాసాల పట్టిక

కవుల వర్ధంతి సందర్భంగా వారి జీవిత విషయాలను తెలుపుతూ రాసిన స్మరణ సంబంధ వ్యాసాలు మరికొన్ని సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య పుటల్లో ప్రచురితమయ్యాయి. వాటి వివరాలను కింది పట్టికలో తెలిపాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | ★అస్తమయం<br>గుడి,జైలు...బంధించడానికే రెండు | బొజ్జా తారకం | సెప్టెంబర్ 19, 2016 | సాక్షి – సాహిత్యం |

| | | | | |
|---|---|---|---|---|
| 2) | ★నివాళి<br>దళిత బహుజన కలల రేడు | బండి నారాయణస్వామి | అక్టోబర్ 24, 2016 | సాక్షి – సాహిత్యం |
| 3) | విశ్వమానవుడు సినారె | బి.ఎస్. రాములు | జూన్ 19, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 4) | సాదాసీదా సాహితీమూర్తి | వెల్చాల కొండల్రావు | ఫిబ్రవరి 20, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 5) | ★స్మరణ<br>నవ దార్శనిక మహాకవి శేషేంద్ర | గింజల నరసింహారెడ్డి | మే 29, 2017 | సాక్షి – సాహిత్యం |
| 6) | ★స్మరణ<br>దీపం వెలుగని కవి యిల్లు<br>'కయిమోఋ' | శ్రీరామదాసు అమర్‌నాథ్ | జూలై 31, 2017 | సాక్షి – సాహిత్యం |
| 7) | ఆ కలం వజ్రాయుధం<br>అచ్చ తెలంగాణ హృదయం | జూలూరి గౌరీ శంకర్ | ఆగస్టు 15, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక – 6**

## 2.11.4. కవుల ఇంటర్వ్యూలు

కవుల జయంతి లేదా సనమలు సత్కారాలు లభించినపుడు కవుల ఇంటర్వ్యూలను సాహిత్య పుటల్లో ప్రచురిస్తున్నారు. అలాంటి కవుల ఇంటర్వ్యూలు కొన్ని మనకు ఈ రెండు సాహిత్య పుటల్లో వెలువడ్డాయి. ఇంటర్వ్యూలను విశ్లేషించుకునే ముందు అసలు ఇంటర్వ్యూ అంటే ఏమిటో తెలుసుకోవాలి.

### 2.11.4.1. ఇంటర్వ్యూ–పరిచయం

ప్రసార మాధ్యమాల్లో వార్తా ప్రచురణల్లో వచ్చినటువంటి సరికొత్త విధానం ఇంటర్వ్యూ. ఈ ఇంటర్వ్యూ అనేది ఉద్యోగ అవకాశాల కోసం చేసేటువంటి ఇంటర్వ్యూ కాదు. అందుకు భిన్నమైనటువంటి ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా పత్రికలు వార్తా సమాచారాన్ని పాఠకులకు అందిస్తున్నాయి. నేడు దినపత్రికల్లో ఈ ప్రత్యేక పద్ధతి అధిక పాఠకాదరణ పొందుతున్న ప్రక్రియ. రాజకీయ, ఆర్థిక, శాస్త్ర సాంకేతిక, వైజ్ఞానిక, విద్యా వైద్యం, కళ, సాహిత్యం, సినిమా ఇలా ఏ రంగానికి చెందిన వ్యక్తులతోనైన ఇంటర్వ్యూ నిర్వహించవచ్చు. ప్రముఖులను వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని ఇంటర్వ్యూ చేయడం, ఆయా రంగాల్లో వారి అనుభవాలను, ఆలోచనలను, విశ్లేషణలను ప్రజల అవగాహన కోసం పత్రికాముఖంగా అందజేయడం కూడా నేడు వార్తా సేకరణలో భాగమే అవుతుంది. కొన్ని కొన్ని సందర్భాల్లో ప్రముఖుడైన ఒక వ్యక్తి అభిప్రాయాలను వార్తా రూపంలో చదివిన దానికంటే ఆ వ్యక్తి మాటల్లో వినడం లేదా చదవడం పాఠకులను ఎక్కువ

చదివిన దానికంటే ఆ వ్యక్తి మాటల్లో వినడం లేదా చదవడం పాఠకులను ఎక్కువ ప్రభావితం చేస్తుంది. అందువలన జర్నలిజంలో ఇంటర్వ్యూ పద్ధతి రోజు రోజుకి అభివృద్ధి చెందుతూ అధిక పాఠకాదరణ పొందుతుంది. నిర్దిష్టమైన ఒక వ్యక్తి నుండి సమాచారం రాబట్టే ఈ ప్రక్రియలో పత్రిక, రేడియో, టీ.వీ. వేరు వేరు విధానాలను అవలంభించిన లక్ష్యం ఒకటే.

### 2.11.4.2. ఇంటర్వ్యూ–నిర్వచనాలు

"ప్రశ్నించడం ద్వారా సమాచారం రాబట్టేందుకు సాగే అంతరంగ శోధనను ఇంటర్వ్యూ అంటాం. ప్రశ్నను బట్టి సమాధానం ఉంటుంది గనుక ప్రశ్నించే విధానంలోనూ, సమాధానాన్ని బట్టి మళ్ళీ ప్రశ్నించడంలోనూ నైపుణ్యం ప్రదర్శించాలి. అందుకే ఇంటర్వ్యూ ఒక కళ" (భావనారాయణ, తోట.2005.పుట.285).

"ప్రసార మాధ్యమాల్లో వార్తలతోపాటు అనేకమైన ప్రక్రియలలో సమాచారం వెలువడుతుంది. ఇటువంటి ప్రక్రియల్లో ఇంటర్వ్యూ ఒకటి. రాజకీయ నాయకులు, రాజనీతిజ్ఞులు, శాస్త్రవేత్తలు, వివిధ రంగాల్లో ప్రముఖులు, క్రీడాకారులు, ఉన్నతస్థాయి ప్రభుత్వాధికారులు మొదలైన వారి నుండి కొన్ని ప్రత్యేక సందర్భాల్లో కొన్ని కొత్త విషయాలను ప్రజలకు అందించవచ్చు. ఇంటర్వ్యూలు ఇందుకు అవకాశం ఇస్తాయి. వార్తలు, వార్తాంశాలు ఇంకా వివిధ ప్రక్రియల్లో చెప్పలేకపోయిన, రాయలేకపోయిన అంశాలపై అవగాహనను ఇతోధికం చేయవచ్చు" (2016. పుట.83) అంటూ పమ్మి పవన్ కుమార్ వారి 'ప్రసార మాధ్యమాలు భాషా నైపుణ్యాలు' అనే గ్రంథంలో ఇంటర్వ్యూని నిర్వచించి, ఇంటర్వ్యూ సందర్భంలో గుర్తుంచుకోవాల్సిన అంశాలను తెలిపారు.

నేడు దినపత్రికలు సాహిత్య పుటల్లో కూడా ఇంటర్వ్యూ పద్ధతిలో సమాచారాన్ని పాఠకులకు అందిస్తున్నాయి. కవుల జయంతి లేదా పురస్కారాలు, సన్మాన సత్కారాలు అందుకున్నప్పుడు కవుల జీవిత విషయాలను వారి రచనా ప్రత్యేకతలను తెలుపుతూ ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా సాహిత్య విషయాలను ప్రచురిస్తున్నారు. కవుల జీవితంలోని ముఖ్య ఘట్టాలు లేదా సాహిత్యంలోని ప్రత్యేక సందర్భాలను పురస్కరించుకొని సాహిత్య సంబంధ ఇంటర్వ్యూలు వెలువడుతున్నాయి. వీటిలో కవి జీవితం, అభిరుచి, ధోరణి, ఆయన కవితా దృక్పథం, కవితా ప్రత్యేకతలు, కవి పై చూపిన ప్రభావాలు, కవికి లభించిన సన్మాన సత్కార తాలూకు వివరాలు, సమాజం సాహిత్యంపై కవి అభిప్రాయం, స్పందన భావి తరాలకు కవులు ఇచ్చే సలహాలు, సూచనలు ఇలా అనేకమైన అంశాలు ఈ ఇంటర్వ్యూలలో చర్చిస్తున్నారు. ఇవన్నీ కవి జీవిత పరిశీలన, కవి స్వభావాన్ని చిత్రించే

ప్రశ్నలుగా కనబడుతున్నాయి. కావున దీనిని కవి జీవిత విమర్శ పద్ధతిగా చెప్పవచ్చు. సాహిత్య పుటల్లో కవి జీవిత విమర్శ సంబంధ ఇంటర్వ్యూలు సాక్షి, నమస్తే తెలంగాణ వంటి రెండు పత్రికల్లోను కనిపిస్తున్నాయి.

## 2.11.4.3. సాహిత్యమంటే జీవితమే

ఇది తెలుగు విశ్వవిద్యాలయం నందిని సిధారెడ్డికి 'విశిష్ట సాహిత్య పురస్కారం' ప్రకటించిన సందర్భంగా సిధారెడ్డి సాహిత్య జీవిత విషయాలను తెలుపుతూ చెలిమె పుటలో ఆత్మీయ సంభాషణ పేరుతో ప్రచురించిన ఇంటర్వ్యూ. ఈ ఇంటర్వ్యూ నవంబర్ 11, 2016న నమస్తే తెలంగాణ చెలిమె సాహిత్య పుటలో వెలువడింది. ఇంటర్వ్యూ నిర్వహించిన వ్యక్తి ఎస్. మల్లారెడ్డి.

దీనిలో నందిని సిధారెడ్డి తన జీవితమే తన సాహిత్యానికి నేపథ్యమని వివరించారు. "నా జీవితమే నా సాహిత్యం. నా కష్టాలు, కన్నీళ్లే నా కవిత్వం, కథ పాట వీటికి పునాదిగా వున్న ,మా అవ్వ కార్చిన కన్నీరు, దుఃఖంలో మునిగినప్పుడు బాపు పాడిన బూర పాట, ధిక్కార స్వరం, ఎల్లీ ఎల్లని సంసారంలో తన్లాటలూ... నేపథ్యం" అంటూ తన సాహిత్యం జీవితంతో పెనవేసుకున్న వైనాన్ని చిత్రిస్తూ తన జీవితం నుండి ఆవిర్భవించిన సాహిత్యాన్ని గురించి వివరించారు. చిన్ననాటి తన జీవితం నుంచి నేటివరకు గల పరిస్థితులను, తన కుటుంబ ఆర్థిక, సామాజిక స్థితిగతులను తెలంగాణ ప్రాంతీయ భాషలో చెప్తూ వాస్తవిక జీవితాన్ని వివరించారు.

తన కవితా ప్రస్థానం గురించి చెప్తూ "కరుణ శ్రీ 'బీదపూజ' పాఠం అమితంగా ప్రభావితం చేసింది. ఎలాగైన పద్యాలు రాయాలనే పట్టుదల పెరిగింది. ఉత్పలమాల, చంపకమాల పద్యాల వరుసలోని అక్షరాలను లెక్కపెట్టి అన్నే అక్షరాలతో నేనూ పద్యాలు రాయడం మొదలుపెట్టిన" అని తన సాహిత్యానికి, కవిత్వానికి ప్రారంభ దశను వివరించారు. కవి జీవిత విషయాలు, కవులపై చూపిన ప్రభావాల ప్రస్తావన ఉన్నందున ఇది కవి జీవిత విమర్శ అవుతుంది. తన రచనలకు వారి కుటుంబ బాధామయ జీవితమే నేపథ్యమని వివరించారు. "మా అవ్వ, బాపుల జీవితాన్ని, నా జీవితాన్ని తెలంగాణ జీవితానికి, విడిగా చూడలేం. మా బాధామయ జీవితాల్లోంచే నాగేటి చాల్లల్ల పాట రాసిన 'పుల్లర', 'కులకష్పి' కథలు రాసిన. నేను సాహిత్యంలోంచి, కవిత్వంలోంచి ప్రాపంచిక దృక్పథాన్ని ఏర్పర్చుకున్న ఉద్యమాలను చూసిన. వాటిలో భాగమైన ఉద్యమాల నుంచి కవిత్వంలోకి పోలేదు. కవిత్వం నుంచే ఉద్యమాలను చూసిన. అందుకే నాది సాహిత్య జీవితం. కవిత్వమే సర్వస్వం" అంటూ వారి జీవితాన్ని ఆవిష్కరించారు.

ఆయనకు విశిష్ట సాహిత్య పురస్కారం లభించిన సందర్భంగా కవుల పురస్కారాల గురించి మాట్లాడుతూ "కవికి పురస్కారాలతో కొత్తగా వచ్చేదేమి లేదు కవిత్వానికి అది తోడ్పడేదీ కాదు. కాని పురస్కారాలతో కవి మరింతగా ప్రజలకు తెలుస్తడు. తద్వారా ఆ కవి రాసిన రచనలు ప్రజల్లోకి పోతయి. అంతకు మించిన ప్రయోజనం పురస్కారాలకు ఉన్నదని, ఉంటుందని అనుకోవడం లేదు" అని అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. వారికి ప్రకటించిన 'తెలుగు యూనివర్సిటీ పురస్కారం' "తెలంగాణ జన జీవితానికి ఇచ్చిన గౌరవంగా, వచ్చిన పురస్కారంగా భావిస్తున్న" అని అన్నారు.
ఈ ఇంటర్వ్యూ ద్వారా కవి జీవిత విషయాలు, సాహిత్యానికి జీవితమే ఆధారమయిన విధానం, తెలంగాణ ప్రాంత జీవన స్థితిగతులు అవగతమవుతున్నాయి. కవి జీవితమునకు, కావ్య రచనకు గల సంబంధాన్ని తెలిపేది కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ. దీనిలో నందిని సిధారెడ్డి తన జీవిత పరిస్థితులే తన సాహిత్య భూమికలని వివరించారు కావున ఇది కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ అవుతుంది.

### 2.11.4.4. జానపద పాట... ఉద్యమ పాట... ధూంధాం

తన పాటతో జన ప్రభంజనాన్ని సృష్టించిన రసమయి బాలకిషన్‌తో చెలిమె పుట ఆత్మీయ సంభాషణ. ఈ ఇంటర్వ్యూ ఫిబ్రవరి 27, 2017న ప్రచురితమయింది. ఇంటర్వ్యూ నిర్వహించిన వ్యక్తి ఎస్. మల్లారెడ్డి.

పాటే జీవితంగా సాగిన రసమయి బాలకిషన్ పాట లేకుంటే తనకు బ్రతుకే లేదంటాడు. "పాటంటూ లేకుంటే చెప్పుకోవడానికి ఏమి లేని బతుకు నాది" అంటూ తన జీవిత విషయాలను ప్రస్తావించారు. కూలి జీవితం నుండి నేడు ప్రజా ప్రతినిధిగా మారిన సంఘటనలను వివరించారు. బాల్యం, పేదరికం, విద్యాభ్యాసం, వివాహం, జైలు జీవితం, ఉద్యోగం, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ధూం ధాం నిర్వహించిన పాత్ర ఇలా ఎన్నో తన జీవితంలోని ప్రధాన ఘట్టాలను ఈ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. ధుంధాంని ఒక మైలురాయిగా వర్ణించారు. "ప్రపంచ చరిత్రలో ఒక సాంస్కృతిక ప్రదర్శన పాట ఆ సమాజాన్ని ముందుండి నడిపించిన దాఖలాలు లేవు. కానీ తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో 'ధూంధాం' తెలంగాణ పాట ప్రజలను చైతన్యపరిచి ముందుకు నడిపించడంలో నిర్వహించిన పాత్ర చరిత్రకే ఒక మేళవింపు – సమకాలీన చరిత్రకు ఒక మార్గం".
ఊరుగాని ఊరు, ప్రాంతం కాని ప్రాంతంలో నన్ను కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు అంటూ, బాల్యం నుండి ఎమ్మెల్యేగా ఎదిగిన తన జీవిత విషయాలను పాఠకులతో పంచుకొని చివరగా ప్రజాసేవయే తన జీవిత లక్ష్యంగా తెలిపారు.

"జీతగానిగ దొర సేవలతో మొదలైన నా జీవితం ఇవ్వాళ ఎమ్మెల్యేగా ప్రజా ప్రతినిధిగా, ప్రజలకు సేవకుడిగా ప్రజలు నన్ను చేసుకున్నారు. నేను ఇప్పుడు ప్రజలకు సేవ చేస్తా, వారు చూపిన ప్రేమకు రుణం తీర్చుకుంటా" అని తన ఆశయాలను వివరించారు. ఈ ఇంటర్వ్యూ ద్వారా కవి జీవితం, దృక్పథం, సామాజికాంశాలు, చారిత్రక విషయాలను మనకు అందజేసారు. ఈ ఇంటర్వ్యూ కవి జీవిత పరిశీలనల వలన కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ అవుతుంది.

### 2.11.4.5. భావాలను భౌతిక శక్తిగా మార్చిన సాంస్కృతిక సైనికుడు

భావాలను భౌతిక శక్తిగా మార్చిన సాంస్కృతిక సైనికుడు అనే పేరుతో ప్రజాకవి గద్దర్‌తో ఎస్.మల్లారెడ్డి ఆత్మీయ సంభాషణను ప్రచురించారు. ఇది జనవరి 01, 2017న నమస్తే తెలంగాణ చెలిమె పుటలో వెలువడింది.

పరిచయం అక్కరలేని పాట కవి గద్దర్. ఆ పదానికి వివరణ అక్కరలేదు. ఆయనకు పరిచయం అక్కరలేదు. గద్దర్... తెలుగు నేలలోనే కాదు, దేశం నలుమూలలా పరిచయం, వివరణ అక్కరలేని నామవాచకం జానపద పల్లెగానం చైతన్యం నిండిన గీతంగా పరిణామం చెంది రగల్ జెండాగా రెపరెపలాడుతున్న విప్లవ గీతానికి పర్యాయపదం గద్దర్. తల్లి కడుపులోంచి బయటపడ్డ మరు క్షణం చిలకరించిన నీటి తుంపరులతో కెవ్వున వేసిన కేక... డెబ్బై ఏండ్లుగా ఇప్పటికే ఆగలేదు, బుర్రకథ విఠల్ రావు... విస్తరించి, వికసించి... ప్రజాయుద్ధ నౌకగా... సాంస్కృతిక సైనికునిగా జనసామాన్యానికి బతుకుబాట చూపుతూ, విముక్తి బాటలు వేస్తూ... పాటకు పల్లకి కట్టి సామాజిక, విప్లవోద్యమాలకు పాటను పతాకగా చేసిన... గద్దర్‌తో ఎస్. మల్లారెడ్డి చేసిన ఆత్మీయ సంభాషణ ఇది. పాటే ఊపిరిగా తన జీవితం కొనసాగిందని గద్దర్ చిన్ననాటి నుండి నేటి వరకు ఎదిగిన క్రమాన్ని వివరించారు. మలిదశ తెలంగాణోద్యమానికి జీవం పోసింది ఉద్యమ సంఘాలే అంటూ, ప్రజల ఆకాంక్షల తెలంగాణ ఆవిష్కరించబడలేదని ఆవేదనను వ్యక్తం చేసారు. రాష్ట్ర సాధన కోసం త్యాగాలతో పని చేసిన విప్లవ, ప్రజా సంఘాలు... సాధించిన తెలంగాణ ఫలాలు అనుభవించడంలో చివరి బంతిలో కూడా లేవు. దానికి ఎవరినో నిందించాల్సిన పనిలేదు. ఉద్యమ సంఘాల భవిష్యద్దర్శన, వ్యూహం, ఎత్తుగడల లోపమే అని వివరించారు.

తన డెబ్బై ఏళ్ళ జీవితంలో 60 ఏళ్లుగా పాటే జీవితంగా ఉన్న ఒక సాంస్కృతిక సైనికుడిగా ప్రకటించుకున్నారు. రాష్ట్ర సాధన అనంతరం పల్లెలు ఎలా ఉన్నాయో పల్లె ప్రజల మనసు తెలుసుకోవడం కోసం పల్లె దర్శనం చేస్తున్న వరంగల్, మెదక్ జిల్లాల్లోని కొన్ని పల్లెలు దర్శించి ప్రజల మనోభావాల్ని తెలుసుకున్న అంటూ తన చిన్ననాటి జీవితం నుండి నేటి సమాజంలో జరిగిన

అనేక రాజకీయ విషయాలు, ఉద్యమ చరిత్ర, ప్రజాపాలన వంటి అంశాలను వివరించారు. ఈ ఇంటర్వ్యూలో గద్దర్ ఇప్పటి వరకు 600 పాటలు రాసానని, ఎన్నో లక్షలాది ప్రదర్శనలిచ్చానని చెప్తూ తన ప్రయాణం కొనసాగుతూనే ఉంటుందని ఆగదని తనది ధిక్కార స్వరం అంటూ "ధిక్కార స్వర దిక్సూచిలైన పోతన, పాల్కురికి సోమన, వేమన, రామదాసు వలె ఎప్పటికీ నాది ధిక్కార స్వరం, నాది అధికార పక్షం కాదు. ప్రతిపక్షం కాదు. ప్రజల ఆకాంక్షలకు తావులేని అధికారం, ప్రతిపక్షాల గొడవలు నాకనవసరం. నాది ప్రజాపక్షం. ప్రజల ఆకాంక్షలు, ఆశలే నా గొంతుక. వారి కోసమే నా ఆటా పాటా" అని తెలిపారు.

ఈ ఇంటర్వ్యూ మొత్తం వాస్తవికాంశాలపై ఆధారపడి జరిగింది. అధికారుల తీరు ప్రజల సమస్యల గురించి ఎక్కువగా విశ్లేషించారు. ఈ ఇంటర్వ్యూ ద్వారా గద్దర్ జీవితం ఆయన అభిరుచులు,దృక్పథం , ఆలోచనా విధానం వ్యక్తమవుతుంది. ఇది కవి జీవితం, అతనిపై గల ప్రభావాలు, ధోరణులు, అభిరుచుల ప్రస్తావనతో కొనసాగింది కావున 'కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ అవుతుంది'. చెలిమె పుటలో ఇంటర్వ్యూ వ్యాసాల్లో ప్రశ్నలు కనబడవు. ఇది ఆత్మీయ సంభాషణ పేరుతో కవి తన ఆత్మకథ చెప్పుకుంటున్న విధంగా సాగుతుంది. ప్రశ్న, సమాధాన రూపం మనకు దీనిలో కనబడదు

## 2.11.4.6. కవుల సంబంధ ఇంటర్వ్యూల పట్టిక

ఈ విధంగా నమస్తే తెలంగాణ చెలిమె పుటలో కవి జీవిత విమర్శ పద్ధతిలో కవుల ఇంటర్వ్యూలు మనకు ఇంకా చాలా కనిపిస్తున్నాయి. వాటి వివరాలను కింది పట్టికలో తెలుపుతున్నాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | ఇంటర్వ్యూ చేయబడిన వ్యక్తి | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | ఆ కనుల కాంతులే తొవ్వ జూపినై | దేశపతి శ్రీనివాస్ | డిసెంబర్ 26, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | కన్నీరు పోత పోసిన కవి | నాళేశ్వరం శంకరం | డిసెంబర్ 12, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 3) | తెలంగాణ మాగాణమే కాన్వాస్... జీవితమే కళాఖండం... | బి.నర్సింగరావు | ఫిబ్రవరి 06, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 4) | ★ప్రపంచ మహాసభలు పెద్దన్నతెలియాలి సోమన్నమరుగున పడొద్దు | దేశపతి శ్రీనివాస్ | డిసెంబర్ 04, 2017 | సాక్షి – సాహిత్యం |
| 5) | యాస భాషల అలయ్ బలయ్ | సుద్దాల అశోక్‌తేజ | డిసెంబర్ 11, 2017 | సాక్షి – సాహిత్యం |

| | | | | |
|---|---|---|---|---|
| 6 | సాహిత్య భావుకుడు దిలావర్ | దిలావర్ | సెప్టెంబర్ 12, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |

పట్టిక –7

## 2.12. కవిత్వ సంబంధ వ్యాసాలు–ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ

తెలంగాణ ప్రాంత పత్రికగా వెలువడిన నమస్తే తెలంగాణ చెలిమె పుటలో ప్రాంతీయ చరిత్ర, సంస్కృతి, సాహిత్యాన్ని తెలుపుతూ ప్రాంతీయ ఆస్తిత్వవాద విమర్శ వ్యాసాలు వెలువడుతున్నాయి. చెలిమె పుటలో తెలంగాణ ప్రాంత అస్తిత్వాన్ని తెలిపే కవిత్వ వ్యాసాలు మనకు కనిపిస్తాయి. ఇంతకాలం వలస పాలనలో మగ్గిపోతూ తమ సాహిత్యానికి జరిగిన అన్యాయాన్ని తెలుపుతూ, నేడు ప్రత్యేక రాష్ట్ర అవతరణ తర్వాత తమ ప్రాంత సాహిత్య విశిష్టతను తెలియజేస్తూ సాహిత్య అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందని, మిగతా ప్రాంత సాహిత్యాలకు తెలంగాణ ప్రాంత సాహిత్యం, చరిత్ర ఏ మాత్రం తీసిపోదని తెలియజేసే ప్రాంతీయ అస్తిత్వవాద ధోరణిలో కవిత్వ వ్యాసాలు ప్రచురితమవుతున్నాయి. వీటిలో రూప చర్చ కన్నా, వస్తు చర్చకే అధిక ప్రాధాన్యత ఉంటుంది.

## 2.12.1. ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ–పరిచయం, నిర్వచనాలు

"స్త్రీ, దళిత మైనార్టీ వాదాలది గుర్తింపు సమస్య అయితే ప్రాంతీయ అస్తిత్వ వాదానికి గుర్తింపు, విస్మృతి అన్నవి ప్రధాన సమస్యలు. ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ మిగతా అస్తిత్వవాదలకు భిన్నంగా క్రింది అంశాలను వెలుగులోకి తెచ్చింది. సాహిత్య పరిశీలనలో ఒకే రకపు సాహిత్య/సామాజిక ప్రమాణాలు పనికి రావు. ప్రాంత భౌగోళిక పరిస్థితులు, సాంస్కృతిక నేపథ్యం, వనరులు, అభివ్యక్తి మార్గాలు పరిగణలోకి తీసుకొని సాహిత్య విశ్లేషణ జరగాలి. భాష విషయంలో స్త్రీవాదం, అభివ్యక్తి విషయంలో దళితవాదం ఈ విషయాన్ని ముందుకు తెచ్చాయి (లక్ష్మణ చక్రవర్తి, సి.ఎచ్. సంపా. 2016. పుట.124).

"ప్రాంతీయ ఆస్తిత్వవాద విమర్శలో కనిపించే విషయాల్లో ప్రధానమైనది ఇక్కడి ప్రాంతంలో(తెలంగాణ) కవిత్వం లేదు, కథ లేదు అన్నప్పుడు దానికి సంబంధించిన విషయాలపై ప్రతిస్పందన రూపంగా తెలుగులో ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ వెలువడింది. 1934లో సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ కవుల సంచిక, 1970 ఏళ్ల తర్వాతే తెలంగాణ కథ అన్న అభిప్రాయం మీద వచ్చిన ప్రతిస్పందన రూప విమర్శ వ్యాసాలు ఇందుకు ఉదాహరణలు" (లక్ష్మణ చక్రవర్తి, సి.ఎచ్.సంపా.2016.పుట.124).

"స్త్రీ, దళిత, మైనార్టీ వాదాలు అస్తిత్వ దృష్టికి ఏర్పరచిన పునాదిని కేంద్రంగా చేసుకొని తమ ప్రాంతం విస్మృతికి గురైందని భావించి ఆ సాహిత్యాన్ని నలుగురికి తెలియపరచాలన్న దృక్పథంతో తమ ప్రాంత సాహిత్య వైశిష్ట్యాన్ని చెప్పాలనుకోవడం ప్రాంతీయ చైతన్యం. ఇందులో తమ ప్రాంత సాహిత్యమూలాలను, సాహితీకారుల సృజన నేపథ్యం, అభివ్యక్తిలో కనిపించే భేదం వంటివి ప్రధాన పాత్ర వహిస్తాయి. ప్రాంతీయ చైతన్యం విమర్శలో కంటే పరిశోధనలో ఎక్కువగా అవగాహనలోకి వస్తుంది. ఇందులో మరో ప్రాంతం కంటే తమ ప్రాంతం ఒక భావనలో, అవగాహనలో ఏ విధంగా ముందడుగు వేసి ఉందో చెప్పడం కనిపిస్తుంది" (లక్ష్మణ చక్రవర్తి, సి.ఎచ్.సంపా. 2016. పుట.125).

ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ వెలుగులోకి తెచ్చిన మరో అంశం ఒక ప్రాంత సాహిత్యం విస్మృతికి గురికావటాన్ని ప్రశ్నిస్తూ వివిధ కవితా, కథాసంకలనాలలో ప్రాధాన్యం లేకపోవడాన్ని, ఆయా ప్రాంతాల్లో సృజన ఉన్నదన్న విషయాన్ని అంగీకరించకపోవడాన్ని ఈ వాద విమర్శ చర్చకు పెట్టింది.

"ప్రాంతీయ అస్తిత్వవాదం జాతీయత/దేశీయత/స్థానికత/ప్రాంతీయత అన్న మాటల పరిధిని, విస్తృతిని అవగాహనలోకి తెచ్చుకుని ఆయా సాహిత్యాంశాలను విశ్లేషిస్తున్నది. స్థానిక చరిత్రను, సంస్కృతిని, సాహిత్యాన్ని పరిరక్షించుకోవాలన్న దృష్టి పెరిగి పద్యం/గేయం/పాట/ గద్యంతోపాటు ఏదైనా లిఖిత రూపంలోకి తెచ్చి దాచాలని, లిఖిత రూపంలో ఉన్నదాన్ని ఈ సందర్భంలో పునర్వివేచన చేయాలని ఈ వాద విమర్శ భావిస్తుంది (లక్ష్మణ చక్రవర్తి, సి.ఎచ్. 2016.పుట.125).

"ప్రాంతీయవాద పరిధి చాలా పెద్దది. ప్రాంతీయవాదంలో తమను ఇతర ప్రాంతాల వారు అణిచివేస్తున్నారని ఆధిపత్య వర్గాలపై ఆగ్రహం అడుగున కనిపిస్తుంది. పాలకులు, వలసవాదులు చూపిస్తున్న వివక్షపై నిరసన ఉంటుంది. తమ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలపై ఆత్మ గౌరవంతో కూడిన అభిమానం ఉంటుంది"(2011.పుట.643) వెలమల సిమ్మన్న తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథంలో తెలిపారు.

"సాధారణంగా ప్రాంతీయవాదాన్ని ఒక ప్రత్యేక ప్రాంత ప్రజల అస్తిత్వంగా పేర్కొంటారు. ఒక ప్రాంతంలోని ప్రజలు ఏదో కొన్ని కారణాల రీత్యా తనకంటూ ఒక ప్రత్యేక అస్తిత్వాన్ని, గుర్తింపుని కోరుకుంటే అటువంటి ఆకాంక్షను ప్రాంతీయవాదం అంటారు. ఒక జన సమూహం లేదా సముదాయం ప్రత్యేకత చాటుకోవడానికి కారణాలు ఏవైనా కావచ్చు. భూభాగం, మతం,

భాష, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, అభివృద్ధి ధోరణులు ఇలా అనేక కారణాలు ప్రాంతీయవాదాన్ని ప్రేరేపిస్తాయి"(2005.పుట.7)అని దార్ల రవికుమార్ వారి పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథంలో నిర్వచించారు.

పై నిర్వచనాల ఆధారంగా ఒక ప్రాంత అణచివేతల నుండి ఆవిర్భవించింది ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ అని అర్థమవుతుంది. దీనిలో ఒక ప్రాంతానికి గుర్తింపు లేకపోవడం లేదా విస్మృతికి గురికావడం అనేవి ప్రధాన అంశాలుగా కనిపిస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇంతకాలం వలస పాలనలో జరిగిన తెలంగాణ ప్రాంత అణచివేతను, విస్మృతిని గుర్తు చేస్తూ తెలంగాణ ప్రాంత సాహిత్య గొప్పతనాన్ని, తెలంగాణ కవిత్వ గొప్పతనాన్ని తెలిపే వ్యాసాలు నమస్తే తెలంగాణ దినపత్రిక చెలిమె సాహిత్య పుటలో వెలువడుతున్నాయి.

### 2.12.2. సాహిత్యంలో తొలి రచనలు

ద్వా.నా. శాస్త్రి రాసిన 'సాహిత్యంలో తొలి రచనలు' అనే వ్యాసం నమస్తే తెలంగాణ దినపత్రిక చెలిమె సాహిత్య పుటలో మే 02, 2016 న ప్రచురితమయింది.

తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత తెలంగాణ సాహిత్యాన్ని పునర్నిర్మించుకోవలసిన అవసరం ఉంది. దీనిలో భాగంగా తెలంగాణ సాహిత్యాన్ని విభిన్న కోణాల్లో పరిశీలించాల్సిన అవసరం ఉంది. దానిలో ఒక కోణం తొలి రచనలు. తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలకు తెలంగాణ ప్రాంతమే పుట్టినిల్లు అని తెలంగాణ ప్రాంత గొప్పతనాన్ని తెలుపుతూ, తెలంగాణ ప్రాంత కవులను స్మరిస్తూ, తెలంగాణ ప్రాంతంలో పుట్టిన సాహిత్య ప్రక్రియలను పరిచయం చేస్తూ వ్యాసాన్ని రాసారు. దీనిలో ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ ధోరణి కనిపిస్తుంది.

మిగతా ప్రాంత సాహిత్యాల చేత తమ సాహిత్యం అణచివేతకు గురవుతుందనే భావన, లేదా సరైన స్థానాన్ని కల్పించడం లేదు అన్న సందర్భం, ఒక ప్రాంతానికి అసలు సాహిత్యమే లేదు వెనకబడినది అన్నసందర్భంలో, ఆ ప్రాంత వైశిష్ట్యాన్ని సాహిత్య విలువలను తెలియజెప్పడానికే ఏర్పడినది ఈ ప్రాంతీయ అస్తిత్వవాదం.

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలకు తెలంగాణ ప్రాంతం పుట్టినిల్లు అని వ్యాస ప్రారంభంలోనే ప్రాంతీయత ధోరణి కనిపిస్తుంది. "ఏ భాషా సాహిత్యానికైనా ప్రక్రియా వైవిధ్యం, రచనా వైవిధ్యం అనేవి దిక్సూచికలు. ఒక సాహిత్యాభివృద్ధిగానీ వైశిష్ట్యం గానీ తొలి రచనలపై ఆధారపడి ఉంటుంది. తెలుగు సాహిత్య చరిత్ర మొత్తం పరిశీలిస్తే తెలంగాణ సాహిత్యం వెనుకబడి

లేదని అనేకమైన 'తొలి రచనలతో' ప్రత్యేకతను నిలబెట్టుకుందనీ తెలుస్తుంది. తొలి రచన అంటే మూలం. దాన్ని అనుసరించే రచనల పరంపర కొనసాగుతుంది. తెలంగాణ సాహిత్య చరిత్ర వేర్వేరు కోణాల నుంచి పరిశీలించవలసి ఉంటుంది. వాటిలో ఒక కోణం 'తొలి రచనలు' అంటూ ప్రాంతీయత అస్తిత్వవాద ధోరణిలో వ్యాసాన్ని ప్రారంభించారు.

దీనిలో వ్యాసకర్త తెలుగు సాహిత్య ప్రక్రియలను ప్రస్తావిస్తూ తెలంగాణ సాహిత్యంలో తొలి రచనల వీరునిగా 'పాల్కురికి సోమన'ను పేర్కొంటూ ప్రక్రియా వైవిధ్యానికి సోమన మారుపేరుగా తెలిపారు. తనదైన ఒక ప్రత్యేక మార్గాన్ని దేశిమార్గాన్ని ఎంచుకొని తొలి దేశి కవిగా నిలిచారు. అనేక ప్రక్రియలకు ఆద్యుడుగా నిలిచారు. తొలి ద్విపద, తొలి శతకం, ప్రథమాంధ్ర దేశి పురాణం, రగడ, మణి ప్రవాళశైలి ఉదాహరణలు. ఇలా ఎన్నో తొలి రచనలకు ఆద్యుడిగా నిలిచారు.

తొలి తెలుగు రామాయణం కర్త గోన బుద్ధారెడ్డి తెలంగాణ ప్రాంతీయుడే. తొలి తెలుగు ఛందో గ్రంథం కవిజనాశ్రయం కర్త మల్లియ రేచన, అప్పకవీయం కర్త కాకునూరి అప్పకవి, భాగవత కర్త పోతన, మార్కండేయ పురాణ కర్త మారన, తొలి అచ్చ తెనుగు కావ్యం యాయతి చరిత్ర కర్త పొన్నగంటి తెలగన. తెలుగు, సంస్కృత వ్యాఖ్యాత మల్లినాథ సూరి, తొలి తెలుగు యక్షగాన రచయిత్రి బాలపాపాంబ, తొలి రాజనీతి శాస్త్రం పురుషార్థ సారం కర్త శివదేవయ్య. ఇలా ఎందరో కవులను కన్న నేల తెలంగాణ అంటూ అనేక తొలి రచనలు తెలంగాణ నేలపై ఆవిర్భవించాయని చెప్తూ ఆయా గ్రంథాలను, కవుల గురించి పరిచయం చేసారు.

ప్రాచీన సాహిత్యమే కాకుండా ఎన్నో ఆధునిక ప్రక్రియలకు తెలంగాణ పుట్టినిల్లని తెలుపుతూ తొలి తెలుగు కథారచయిత్రి బండారు అచ్చమాంబని పేర్కొన్నారు. ఉర్దూ కవితలైన రుబాయి, గజళ్లు తెలుగులోకి అనువదించినవారు తెలంగాణ ప్రాంతీయులేనంటూ ప్రస్తుతం వెలువడుతున్న నానీల కర్త ఎన్. గోపి, దీర్ఘకావ్యాల కర్త జూలూరి గౌరీశంకర్ మొదలైన వారిని ప్రస్తావిస్తూ ఇంకా ఇలా పరిశోధన చేస్తూపోతే తెలంగాణ తొలి రచనల మాగాణం అని తెలంగాణ గొప్పతనాన్ని సాహిత్య విశిష్టతను వివరించారు.

ఈ విధంగా తెలుగు సాహిత్యంలో తెలంగాణ సాహిత్యానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని నిరూపిస్తూ ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ ధోరణిలో ఈ వ్యాసం సాగింది. ఇలాంటి వ్యాసాల వలన ఆ ప్రాంత చరిత్ర, దాని సాహిత్య వైశిష్ట్యాన్ని సులభంగా అవగతం చేసుకోవచ్చు. ఇంతకాలం వలస పాలనలో మరుగునపడిన మాణిక్యాలను వెలికి తీసి పాఠకులకు తెలియజేయడానికి ఈ వ్యాసం ఉపయోగపడుతుంది. తమ ప్రాంతం దేనిలోనూ తక్కువ కాదనే ఆత్మవిశ్వాన్ని పాఠకుడిలో కల్పిస్తూ

వాటిని వెలికితీసి తెలంగాణ సాహిత్య పునర్నిర్మాణానికి పూనుకోవాల్సిన బాధ్యతను ఈ వ్యాసం ద్వారా తెలియజేస్తున్నారు. నూతనంగా ఏర్పడిన ఈ ప్రాంతానికి ఇలాంటి వ్యాసాలు ఎంతగానో ఉపకరిస్తాయి.

### 2.12.3. సాహిత్యంలో స్వాభిమాన ప్రకటన

"సాహిత్యంలో స్వాభిమాన ప్రకటన" వ్యాసాన్ని కోవెల సుప్రసన్నాచార్య రాశారు. ఇది ఆగస్టు 08, 2016న నమస్తే తెలంగాణ చెలిమె పుటలో ప్రచురితమయింది.

తెలంగాణ సాహిత్యం గురించి కవుల గురించి ప్రాంతీయ అస్తిత్వవాద ధోరణిలో ఈ వ్యాసాన్ని రాసారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 05, 2016న రవీంద్ర భారతిలో 'పద్య తెలంగాణం' అన్న కవి సమ్మేళనం జరిగింది. ఒక్కొక్క జిల్లా నుంచి పది, పన్నెండు మంది కవుల చొప్పున పద్యకవులను పిలిచి ఈ సభను నిర్వహించారు. అనుకున్నది నూట పదహారు మంది అయినా ఇంకో 20, 30 మంది కవులు అధికంగా చేరారు. ఈ సందర్భంగా ఆ సభ నిర్వాహకుడు వ్యాసకర్తతో చెప్పిన విషయాలను ఈ వ్యాస రచనకు ప్రధాన భూమిక అయిందని తెలిపారు. "ఒక నిర్వాహకుడు నాతో మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో ఒకరు తనతో 'ఇప్పుడు మీ తెలంగాణలో పద్యం రాసేవారు ఎవరున్నారు? అని ఆక్షేపించారు. అది కారణంగా ప్రతీకాత్మకంగా అతి కొద్ది మందిని పిలిచి ఈ సమావేశం ఏర్పాటు చేశామ'ని చెప్పారు. ఈ సన్నివేశం సరిగ్గా 1930 ప్రాంతాలలో 'తెలంగాణమున కవుల సంఖ్య పూజ్యం' అని ఒకరు వ్యాఖ్యానించడం, దానికి సమాధానంగా 1932లో సుమారు 350 మంది కవుల పద్యాలతో 'గోలకొండ కవుల సంచిక'ను వెలువరించి ఇక్కడి సత్తాను చాటిన శ్రీ సురవరం ప్రతాపరెడ్డి ఆత్మాభిమాన ప్రకటన గుర్తుకు తెస్తుంది. తెలంగాణ విషయంలో కోస్తాంధ్ర, రాయలసీమలోనూ ఈ 'తెలియమి' ఇంకా వ్యాపించే ఉన్నది అని అంటూ ఇక్కడి పద్య సాహిత్య వైభవాన్ని ప్రాంతీయ అస్తిత్వవాద ధోరణిలో తెలుపుతూ ఈ వ్యాసం కొనసాగింది.

ఆధునిక కవిత్వానికి మూలపురుషులైన రాయప్రోలు సుబ్బారావు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేసిన వారి సాహిత్య ముద్ర ఇక్కడ దాదాపు పడలేదనే చెప్పవచ్చు అని చెపుతూ తెలంగాణ సాహిత్యం ఉద్యమ రూపాన్ని దాల్చడానికి దోహదపడిన అంశాలను, నిజాం వ్యతిరేక పోరాట సంబంధ చారిత్రకాంశాలను వివరించారు. ఆంధ్ర ప్రాంతంలోని సాహిత్యం తెలంగాణ సాహిత్యంతో సంయోజన పొందినపుడు తెలంగాణ సాహిత్యంలోని నూతన, అపూర్వ, సౌందర్య అభివ్యక్తులు, ప్రతీకలు, బింబాలు మొత్తం తెలుగు

సాహిత్యానికి నూతన మార్గాన్ని చూపించాయి. అంతకు పూర్వం భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం ఇలా విభజించుకొని ఎవరికి వారుగా సాగుతున్న సాహిత్య ధోరణులు ఈ మార్పు వల్ల తమ స్వరూపాన్ని మార్చుకోక తప్పలేదు అంటూ సాహిత్య స్వాభిమానాన్ని వ్యక్తపరిచారు. తెలంగాణ నూతన సరస్వతీ ఆవిష్కారం దాశరథితోనే జరిగిందంటూ దాశరథి, వానమామలై, పల్లా దుర్గయ్య, లక్ష్మణ శాస్త్రి, సినారె వంటి అనేక మంది తెలంగాణ కవుల గొప్పతనాన్ని వారి రచనల వైశిష్ట్యతను చాటి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ, నవ్య సాహితీ సమితి, తెలంగాణ రచయితల సంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్ ఏర్పాటు వంటి అనేక చారిత్రక సంబంధ విషయాలను ప్రస్తావిస్తూ తెలంగాణ సాహిత్య వైభవాన్ని ప్రాంతీయ అస్తిత్వవాద ధోరణిలో వివరించారు.

### 2.12.4. ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ సంబంధ వ్యాసాల పట్టిక

ఇలాంటి ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ సంబంధ వ్యాసాలు తెలంగాణ ప్రాంత పత్రికగా ప్రారంభమైన నమస్తే తెలంగాణ చెలిమె పుటలో మరికొన్ని కనిపిస్తున్నాయి. వాటి వివరాలను కింది పట్టికలో తెలియజేసారు.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక పేరు |
|---|---|---|---|---|
| 1) | ఒక పాలకుర్తి, ఒక బమ్మెర | అనుమాండ్ల భూమయ్య | ఫిబ్రవరి29, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | దేశి పుట్టినిల్లు... | డా॥ గంఢ్ర లక్ష్మణరావు | ఫిబ్రవరి 13, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 3) | ఇది మన స్వేచ్ఛా నర్తనం... | శ్రీరామోజు హరగోపాల్ | జూలై 04, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక – 8**

## 2.13. కవిత్వ సంబంధ నివేదిక వ్యాసాలు

ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా అభివృద్ధి చెందిన తర్వాత రోజువారి వార్తలను ఎప్పటికప్పుడు ప్రజలకందించే ప్రచార సాధనంగా దినపత్రికలు ఆవిర్భవించాయి. ఈ దినపత్రికల్లో వెలువడే సాహిత్య పుటలు కూడా సాహితీ జగత్తులోని పరిణామ వికాసాలను ఎప్పటికప్పుడు త్వరతగతిలో పాఠక లోకానికి అందించే ప్రయత్నం చేస్తున్నాయి. వాటిలో భాగంగానే సందర్భానుసారమైన సాహితీ వ్యాసాలను పాఠకులకు అందిస్తున్నాయి. దినపత్రికల సాహిత్య ప్రచురణల్లో సందర్భం అనేది ప్రముఖ పాత్ర పోషిస్తుంది. సాహిత్య రంగానికి సంబంధించిన ఏదైనా

ఒక మంచి సందర్భాన్ని గానీ లేదా సాహితీ సదస్సులు, సమావేశాలు, అలాగే కవులకు మరియు సాహితీ రంగానికి లభించిన పురస్కారాలు, సన్మానాలు, అవార్డులు, నూతన పుస్తకావిష్కరణలు, పాత పుస్తకాల పునర్ముద్రణల వంటి అనేక రకాల అంశాలను ఎప్పటికప్పుడు సాహిత్య పుటలు పాఠకులకు అందిస్తున్నాయి. వీటికి సంబంధించిన సమాచారాన్ని వ్యాసాల రూపంలో ప్రచురిస్తున్నారు. ఇవి పాఠకుడికి సాహితీ జగత్తులోని పరిణామాలను నూతన ఆవిష్కరణ సమాచారాన్ని తెలుసుకోవడానికి ఎంతగానో సహకరిస్తున్నాయి. ఇటువంటి వ్యాసాలు సాహితీ నివేదికల రూపంలో సాహిత్య పుటల్లో మనకు కనిపిస్తున్నాయి. సాహిత్య నివేదిక వ్యాసాలను ప్రచురించడంలో సాక్షి, నమస్తే తెలంగాణ రెండు పత్రికలు కూడా తమదైన ప్రత్యేకతను చాటుతున్నాయి. 2016, 2017 సంవత్సరాలలో ఈ రెండు పత్రికల్లో వెలువడిన వ్యాసాలను కింది విధంగా విభజించవచ్చు.

1) సదస్సు/సమావేశాలకు సంబంధించిన వ్యాసాలు.

2) పురస్కారాలు/సన్మానాలకు సంబంధించిన వ్యాసాలు.

3) పుస్తకావిష్కరణ/పునర్ముద్రణకు సంబంధించిన వ్యాసాలు.

### 2.13.1. సదస్సు/సమావేశ సంబంధ వ్యాసాలు

జాతీయ సదస్సులు, సమావేశాలు జరిగినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను అలాగే సమావేశ సదస్సు పత్రాలలో చర్చించిన విషయాలను సంక్షిప్తీకరించి వ్యాసాలుగా పత్రికల్లో ప్రచురిస్తున్నారు. వీటి ద్వారా సాహిత్య కార్యక్రమాల వివరాలను పాఠకులకు అందిస్తున్నారు. వీటిని మనం సదస్సు/సమావేశాలకు సంబంధించిన నివేదికా వ్యాసాలుగా గుర్తించవచ్చు. దీని ద్వారా సదస్సు సంబంధ సమాచారం మరియు అవగాహన పాఠకులకు కలుగుతుంది. సాక్షి, నమస్తే తెలంగాణ సాహిత్య పుటల్లో సదస్సు/సమావేశాల నివేదిక వ్యాసాలు కింది విధంగా ఉన్నాయి.

#### 2.13.1.1. ఉద్యమానికి ఊపిరి సాహిత్యం

తన్నీరు సురేష్ రాసిన 'ఉద్యమానికి ఊపిరి సాహిత్యం' అనే వ్యాసం నమస్తే తెలంగాణ దినపత్రిక చెలిమె సాహిత్య పుటలో జనవరి 18, 2016న వెలువడింది.

తెలంగాణ ఉద్యమ సాహిత్యానికి ఒక రూపం తీసుకురావాలన్న ఆలోచనతో "తెలంగాణ ఉద్యమ సాహిత్యం–సమాలోచన" పేరిట బాసర ట్రిపుల్ ఐ.టి.లో జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు వివరాలను, అలాగే సదస్సులో సమర్పించబడిన పత్ర విశేషాలను దీనిలో పేర్కొన్నారు. ఒక సాంకేతిక విశ్వవిద్యాలయంలో తెలుగు సాహిత్య సదస్సు జరగడం సాహిత్య అభిమానులకు

గర్వకారణమైన విషయమంటూ సదస్సు సంబంధ వివరాలను ప్రస్తావించారు. ఈ సదస్సుకు బి. విజయ్ కుమార్ సంచాలకులుగా వ్యవహరించారు. అల్లం నారాయణ వంటి మేధావులు, జయధీర్ తిరుమలరావు, అంపశయ్య నవీన్, జూపాక సుభద్ర వంటి సాహిత్యకారులు, గోరెటి వెంకన్న లాంటి వాగ్గేయకారులు పాల్గొన్నారని తెలియజేశారు.

స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మన చరిత్రను, మన సాహిత్యాన్ని వెతుక్కునే ఈ సమయంలో మనకు మన సాహిత్యానికి చరిత్రకు జరిగిన ద్రోహం బయటపడుతుందని వలస పాలనలో తెలంగాణ చరిత్ర మరుగున పడిందంటూ దానిని వెలికితీయాల్సిన అవసరాన్ని గుర్తు చేసారు. వలస పాలనలో లిఖిత సాహిత్యంతోపాటు ప్రజా సాహిత్యంగా పేరొందిన మౌఖిక సాహిత్యం గుర్తింపు పొందలేదని గద్దర్, గోరెటి వెంకన్న, అందెశ్రీ వంటి వాగ్గేయకారులకు, వారి పాటలకు ప్రభుత్వపరంగా సరైన న్యాయం జరగలేదని, బండి యాదగిరి, సుద్దాల హనుమంతు వంటి గాయకుల పాటలు తెలుగు సాహిత్యంలో ఉమ్మడి రాష్ట్రమంతా ప్రచారం కాలేదని అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అలాగే వాటిని ఇప్పుడు మనం మన పిల్లలకు చెప్పాలి. పాఠ్య పుస్తకాల్లో చేర్చి వాటిని లిఖితబద్ధం చేయాల్సిన బాధ్యతను గుర్తు చేసారు.

“ఉద్యమం ఎప్పుడైనా సాహిత్యాన్ని ప్రజల వద్దకు తెస్తుంది. అందుకే తెలంగాణ ఉద్యమ కవిత్వం నిరసనకారుల చేతుల్లో పట్టుకొనే ప్లకార్డులలోకి, వీపుల పైకి, నుదురు, నెత్తుల మీదికి ఎక్కింది. ‘ధూం ధాం’ ప్రదర్శనల్లో పాట ప్రజల ఉత్సాహాన్ని ఉద్యమోన్ముఖం చేసింది. ఇది ఉద్యమ కాలంలో వచ్చిన నవ్య సాహిత్య కళారూపంగా గుర్తింపు పొందింది” అంటూ తెలంగాణ ఉద్యమ కాలంలో పాట కవిత్వ స్థానాన్ని తెలిపారు. అలాగే ఈ సదస్సులో చర్చించిన కథా, నవల వంటి అనేక విషయాలను పరిచయం చేస్తూ ఇలాంటి సదస్సులు మరెన్నో జరగాలని ఇంత గొప్ప సాహిత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని సూచించారు. దీనిలో వ్యాసకర్త జాతీయ సదస్సు సమాచారాన్ని తెలపడమే కాకుండా, పాట కవిత్వ గొప్పతనాన్ని, ఉద్యమ కాల సాహిత్య పరిచయం చేస్తూ దాన్ని ప్రాముఖ్యతను వివరించారు. సాహిత్య నివేదిక రూపంలో సాగిన ఈ వ్యాసం అనేక సామాజిక, రాజకీయ విషయాలను చర్చిస్తూ సాగింది. ఇలాంటి వ్యాసాల వలన సదస్సు వివరాలతోపాటు సాహిత్యాన్ని, చరిత్రను తెలుసుకోవాలనే ప్రేరణ కలిగిస్తుంది. వాటిని కాపాడుకోవాలనే బాధ్యతను గుర్తు చేస్తుంది.

### 2.13.1.2. స్వతంత్ర మేధావి హృదయ సంస్కర్త

ఎ. కె. ప్రభాకర్ రాసిన "స్వతంత్ర మేధావి హృదయ సంస్కర్త" వ్యాసం నవంబర్ 20, 2017న సాక్షి సాహిత్యం పుటలో వెలువడింది.

1917 నవంబర్ 20న జన్మించిన మహాకవి పొట్లపల్లి రామారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా నవంబర్ 20, 2017న ఉదయం 10 గంటలకు ప్రొ॥ జి. రామిరెడ్డి దూర విద్యా కేంద్రం ఆడిటోరియంలో జాతీయ సదస్సు జరుగనున్నదని తెలుపుతూ ఈ సందర్భంగా రామారావు జీవితం, రచనా దృక్పథం, రచనల ప్రాముఖ్యతను వివరించారు. ఇది రచయిత జీవిత వివరాలను తెలుపుతూ కవి జీవిత విమర్శ పద్ధతిలో కొనసాగింది అలాగే సదస్సు సంబంధ వివరాలను తెలియజేస్తూ నివేదికా వ్యాసంగా కూడా పేర్కొనవచ్చు. వ్యాసకర్త "పొట్లపల్లి రామారావు స్వభావ రీత్యా రాజకీయజీవి కాదు. రాజకీయ ప్రమేయం ఉన్న అనుబంధ సాహిత్య సంస్థల్లో ఆయనకి ప్రత్యక్ష భాగస్వామ్యం లేదు. అయితే ప్రజోపయోగకరమైన రాజకీయాల గురించి, సంక్షేమ రాజ్యం గురించి పొట్లపల్లికి స్పష్టమైన వైఖరి ఉందని చెప్పడానికి ఆయన జీవించిన జీవితం, సృజించిన సాహిత్యమే ప్రబలమైన సాక్ష్యాలు" అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. కవి జీవిత విషయాలతోపాటు సదస్సు సంబంధ వివరాలను దీని ద్వారా పాఠకులకు అందించారు. కావున దీనిని కవి జీవిత విమర్శ పద్ధతిలో రాసిన నివేదికా వ్యాసంగా చెప్పవచ్చు.

### 2.13.1.3. సంఘటనల వెంట సమకాలీన కవి

నామాడి శ్రీధర్ రాసిన 'సంఘటనల వెంట సమకాలీన కవి' వ్యాసం మే 23, 2016న సాక్షి సాహిత్యం పుటలో ప్రచురితమయింది.

విజయవాడలో 'కవిత్వంతో ఒక సాయంకాలం' మే డే సభలో సమకాలీన కవిత్వం తీరుపై ప్రసంగం జరిగింది. ఆ ప్రసంగం యొక్క సంక్షిప్త రూపాన్ని ఈ వ్యాసంగా మనకు అందించారు. ప్రసంగంలో చర్చించిన విషయాలను సంక్షిప్తంగా పాఠకులకు తెలియజేసారు. దీనిలో సమకాలీన కవిత్వ తీరుతెన్నులు, కవిత్వ ఆదరణ ప్రస్తుత కాలంలో ఏ విధంగా ఉంది? మొదలైన అంశాలను ప్రస్తావించారు. ఒక ప్రసంగ సంక్షిప్త పాఠం ద్వారా ప్రసంగం తాలుకు వివరాలు అలాగే అందులో చర్చించిన విషయాలపై అవగాహన పాఠకుడికి అందుతుంది. కావున దీనిని మనం సాహిత్య నివేదికగా పేర్కొనవచ్చు.

### 2.13.2. పురస్కార/సన్మాన సంబంధ వ్యాసాలు

కవులకు లేదా వారి రచనలకు ఏదైనా సన్మానం, పురస్కారం, అవార్డులు లభించిన ప్రత్యేక సందర్భాలలో వాటికి సంబంధించిన సమాచారాన్ని కవుల గొప్పతనాన్ని వారి రచనల గొప్పతనాన్ని తెలుపుతూ సాహిత్య పుటల్లో వ్యాసాలను ప్రచురిస్తున్నారు. వీటిని కూడా మనం నివేదికా వ్యాసాలుగా గుర్తించవచ్చు.

### 2.13.2.1. పచ్చనాకుపై వెచ్చని రాత

కవి యాకూబ్ రాసిన 'పచ్చనాకుపై వెచ్చని రాత' వ్యాసం నవంబర్ 13, 2017న చెలిమె పుటలో వెలువడింది.

దీనిలో వ్యాసకర్త మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన 'కబీర్ సమ్మాన్ అవార్డు' ఈ సంవత్సరం తెలుగు సాహిత్యంలో ప్రముఖ రచయిత అయిన కె. శివారెడ్డికి లభించిందని తెలిపారు. కబీర్ సమ్మాన్ అవార్డు పొందిన మొట్ట మొదటి తెలుగు కవి కె. శివారెడ్డి కావడం విశేషం అని తెలుపుతూ నవంబర్ 10వ తేదీన భోపాల్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదగా ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఒక తెలుగు కవికి సంబంధించిన అత్యుత్తమ పురస్కారాన్ని తెలుపుతూ ప్రశంసాత్మకంగా రాసిన వ్యాసం ఇది. దీనిలో వ్యాసకర్త కబీర్ సమ్మాన్ అవార్డు, దాని ప్రత్యేకత గురించి వివరిస్తూ అవార్డు గ్రహీతయైన కె.శివారెడ్డి జీవిత విశేషాలు, కవితా విశేషాలను, ఆయనకు లభించిన పురస్కారాలను కవి జీవిత విమర్శ పద్ధతిలో తెలిపారు. గత 50 సంవత్సరాలుగా కవిత్వమే జీవితంగా జీవిస్తున్న కె. శివారెడ్డికి ఈ అవార్డు లభించినదని ప్రశంసించారు.

ఈ వ్యాసం ద్వారా 'కబీర్ సమ్మాన్ అవార్డు 'తాలుకు సమాచారం మరియు కె. శివారెడ్డి జీవితం, రచనలకు సంబంధించి అనేక విషయాలు అలాగే ఆయన రచనా దృక్పథం అవగతమవుతుంది. కవితా వస్తువుకు ప్రాధాన్యతనిస్తూ, కవి జీవిత విమర్శ పద్ధతిలో వ్యాసం కొనసాగింది. దీనిని ప్రశంసాత్మకంగా, అభినందనాత్మకంగా రాసారు.

"సంత్ కబీర్ దాస్ భక్తి ఉద్యమాలకు సంతకమైన కవి. ఆయన రాసిన దోహాలు జగద్విఖ్యాతి పొందాయి. అలాంటి సంత్ కబీర్ దాస్ పేరు మీదగా ఇస్తున్న అవార్డు కబీర్ సమ్మాన్ అవార్డు. దీనిని 1986–1987లో స్థాపించారు. భారత కవిత్వంలో అత్యున్నత స్థాయి ప్రతిభ కనబరిచిన వారికి ఈ అవార్డు ప్రధానం చేస్తారు. భారతీయ భాషల్లో ఏ భాషా కవికైన ఈ అవార్డు ఇస్తారు. ఇది లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వంటిది. 2016వ సంవత్సరానికి గాను తెలుగులో

ప్రసిద్ధ కవి కె. శివారెడ్డి పేరు ఈ అవార్డుకు గాను ప్రకటించారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సాహిత్య సృజనాత్మక రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఈ అవార్డును అందజేస్తుంది. ఇలాంటి జాతీయ ప్రతిష్ఠాత్మకమైన కబీర్ సమ్మాన్ అవార్డు మన తెలుగు కవికి రావడం ఇదే మొదటిసారి అని ఇది తెలుగు ప్రజలందరికి గర్వకారణమంటూ తెలిపారు.

తన జీవితమే కవిత్వంగా శివారెడ్డి బతికారని చెపుతూ "నా జీవితానికి పర్యాయపదం నా కవిత్వం, నేను జీవించే కాలానికి పర్యాయపదం నా జీవితం" అన్న శివారెడ్డి మాటలను ప్రస్తావిస్తూ శివారెడ్డికి కవిత్వమే తల్లి, తండ్రి, స్నేహితుడు, కరవాలము, మూడో నేత్రము అంటూ శివారెడ్డి మాటలను పేర్కొన్నారు. డెబ్బై ఏండ్ల జీవితంలో యాభై యేండ్లు కవిత్వమే ఊపిరిగా జీవించారని స్వతంత్రానికి ముందు పుట్టినా స్వేచ్ఛా భారతంలో జనజీవన కల్లోలాన్ని కవిత్వంలో పలికించాడని వివరిస్తూ ఆయన జీవిత విశేషాలను, జననం, విద్యాభ్యాసం, ఉద్యోగం కవిత్వ రచన వంటి అనేక విషయాలను ఈ వ్యాసంలో పొందుపరిచారు. కవిత్వం, ఉద్యమం రెండూ ఆయనకు రెండు కళ్లుగా మారిన తీరును వివరించారు. ఆయన పుట్టింది ఆంధ్రాలో అయిన కవిగా తెలంగాణలో పుట్టానంటారని, తెలంగాణ దత్తకవి అన్న నందిని సిధారెడ్డి మాటలను పేర్కొన్నారు. అందువల్లనే ఆయన కవిత్వంలో తెలంగాణ పల్లెలు, తెలంగాణ జీవితం ఎక్కువగా కనిపిస్తుందని శివారెడ్డి కవితా వస్తువును పరిచయం చేసారు. శివారెడ్డికి 1990 'మోహనా ఓ మోహనా' కవిత్వ సంపుటి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1974లో ఫ్రీవర్సు ఫ్రంట్ అవార్డు లభించందంటూ అనేక చారిత్రకాంశాలను తెలిపారు. ఎన్నో అవార్డులు సత్కారాలు పొందిన కవిత్వాన్ని శాసిస్తున్న కె. శివారెడ్డికి 'కబీర్ సమ్మాన్ అవార్డు' రావడం గర్వించదగిన విషయంగా పేర్కొన్నారు.

ఈ వ్యాసంలో వ్యాసకర్త కె. శివారెడ్డి జీవిత విషయాలను చారిత్రక విషయాలను, కవితా వస్తువుని వివరించారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని తెలుపుతూ రాయడం వలన ఈ వ్యాసం కమ్యూనిస్టు దృక్పథంతో, కవి జీవిత విమర్శ పద్ధతిలో రాసిన వ్యాసంగా చెప్పవచ్చు. ఇది ఒక ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకొన్న సందర్భంలో రాయబడింది. దీని ద్వారా మనకు కవుల గొప్పతనం వారి రచనల విశిష్టత. అలాగే ప్రతిష్ఠాత్మకమైన పురస్కార సంబంధ వివరాలు తెలుస్తున్నాయి.

### 2.13.2.2. సాహిత్య శిల్పులకు కబీర్ సమ్మాన్

రామతీర్థ రాసిన 'సాహిత్య శిల్పులకు కబీర్ సమ్మాన్' అనే వ్యాసం సాక్షి 'సాహిత్యం' పుటలో నవంబర్ 13, 2017న ప్రచురితమయింది.

కె. శివారెడ్డికి కబీర్ సమ్మాన్ అవార్డు లభించిన సందర్భంగా ఈ వ్యాసాన్ని ప్రచురించారు. నమస్తే తెలంగాణ చెలిమె పుటలో వ్యాసానికి ఈ వ్యాసానికి కొంత వైవిధ్యం కనిపిస్తుంది. దీనిలో వ్యాసకర్త కబీర్ సమ్మాన్ అవార్డు గురించి తెలుపుతూ 2013 నుండి 2016 వరకు ఏయే భాషా కవులకు ఈ అవార్డు లభించినదో తెలిపి వారి కవిత్వంలోని ప్రత్యేకతలను ఇందులో వివరించారు. కేవలం ఒక తెలుగు కవి గురించే కాకుండా అంతకు ముందు ఈ అవార్డు పొందిన ఇతర భాషా కవుల ప్రస్తావన ఇందులో మనకు కనబడుతుంది. చెలిమె పుటలో కేవలం కె. శివారెడ్డి సంబంధ విషయాలుంటే, ఈ వ్యాసం మాత్రం ఇతర భాషా కవులను వారి రచనా విశిష్టతను పాఠకులకు తెలియజేసారు.

దీనిలో వ్యాసకర్త సంస్కృతం, ఒడియా, మలయాళం, తెలుగు భాషల సాహిత్యవేత్తలకు 2013 నుండి 2016 వరకు ప్రకటించబడిన కబీర్ సమ్మాన్ పురస్కారాల గురించి వివరించారు. 2013లో సంస్కృత సాహిత్యంలో రేవా ప్రసాద్ త్రివేది, 2014లో ఒడియా భాషలో ప్రతిభా శతపతి, 2015లో మలయాళ కవి అత్తూర్ రవి వర్మకి, 2016లో తెలుగు భాషలో కె. శివారెడ్డికి ఈ అవార్డు లభించిందని తెలుపుతూ ఆయా భాషల్లో వారు చేసిన కృషిని వివరించారు.

'కబీర్ సమ్మాన్ అవార్డు'లను ప్రధానం చేసేది మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం. మూడు దశాబ్దాల క్రితం 1986–1987లో కన్నడ రచయిత గోపాలకృష్ణ అడిగకు ప్రధానం చేయడంతో ప్రారంభమైన ఈ సన్మాన పరంపర నేటికి నలుగురు దక్షిణాది సాహిత్యవేత్తలను వరించిందని తెలుపుతూ ఈ దశాబ్దంలో తొలి తెలుగు కవి కె. శివారెడ్డి అని పేర్కొన్నారు. ఈ నలుగురి రచనల్లోనూ సామాజిక సంఘటనపై నిష్ఠ, జాతీయ, అంతర్జాతీయ పరిణామాల పట్ల మెలకువ, సాహిత్య సంప్రదాయం పట్ల సృజనాత్మక ఆసక్తితో కూడిన నవీనత వీరి రచనల్లో చూస్తామని చెప్తూ వ్యాసకర్త ఈ నలుగురు కవుల జీవితాన్ని పరిచయం చేసి వారి రచనా విశేషాలను వివరించారు.

కె. శివారెడ్డి గురించి చెప్తూ 20వ శతాబ్దపు తెలుగు కవిత్వంలో విస్తృత ప్రజాసంబంధాల శిల్పి. ప్రజలే నా గురువులు, ప్రజలే నా శిష్యులు, ప్రజల కంటిలోని కన్నీటి బొట్టు, నా కలంలోని సిరా చుక్క అన్న కవియోద్ధ శివారెడ్డి అని వివరించారు. కె. శివారెడ్డి ప్రజల కొరకే పాటుపడుతూ కవిత్వమే జీవితంగా బ్రతికిన కవిగా వర్ణించారు. కబీర్ సమ్మాన్ అవార్డు పొందిన నలుగురు మొక్కవోని వ్యక్తిత్వాలకు చిరునామా కావడం ఈ పురస్కారానికి మరింత సమగ్రత తెచ్చిందని తెలిపారు.

ఈ వ్యాసం కవి జీవిత విషయాలను, చారిత్రకాంశాలను తెలుపుతూ ప్రశంసాత్మకంగా కవి జీవిత విమర్శ పద్ధతిలో సాగింది. నమస్తే తెలంగాణ చెలిమె పుట వ్యాసంలో కేవలం కె. శివారెడ్డికి సంబంధించిన సమాచారం మాత్రమే కలదు. ఒకే సందర్భంలో వెలువడిన ఈ రెండు పత్రికల వ్యాసాలు విషయపరంగా ఒకటే అయిన అభివ్యక్తిలో తేడాలున్నాయి. సాధారణంగా సాక్షి పత్రికలో అన్ని రకాల భాషా సాహిత్యాలకు ప్రాధాన్యతనిస్తుంది. ఇక్కడ కూడా కేవలం తెలుగు సాహిత్యానికి పరిమితం కాకుండా దక్షిణాది భాషల ప్రస్తావనతో మరింత అధిక సమాచారాన్ని పాఠకుడికి అందిస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో కేవలం తెలుగు సాహిత్యానికి కాకుండా ప్రపంచ భాషల సాహిత్యాలను వాటి ప్రత్యేకతలను పాఠకులకు అందజేయాలనే ఉద్దేశంతో సాక్షి పత్రిక వ్యాసాలను ప్రచురిస్తుందని చెప్పవచ్చు. అందువలనే తెలుగుతోపాటు ఇతర భాషలకు సంబంధించిన విషయాలను ప్రచురించడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఇలాంటి ప్రత్యేకత సాక్షిలో ఎక్కువగా కనిపిస్తుంది. పుస్తక సమీక్ష, వ్యాసాలు, కవితలు, సన్మానాలు, సమావేశాలు మొదలైన విషయాలు ఏవైనా కేవలం తెలుగు సాహిత్యానికే పరిమితం కాకుండా ఆయా సందర్భానుకూలంగా ఇతర భాషా సాహిత్యాలకు కూడా సాక్షి సాహిత్యం పుటలో ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తూ ప్రపంచ సాహిత్యాన్ని పాఠకుడికి పరిచయం చేస్తుంది.

### 2.13.2.3. సన్మాన/పురస్కార సంబంధ వ్యాసాల పట్టిక

ఈ వ్యాసాలతోపాటు సాక్షి నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య పుటల్లో పురస్కార సన్మాన సంబంధ నివేదిక వ్యాసాలు మరికొన్ని ప్రచురితమయ్యాయి. వాటి వివరాలను కింది పట్టికలో తెలుపుతున్నాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | బాబ్‌డిలాన్ – జానపద పునరుజ్జీవనం | కందుకూరి రమేశ్‌బాబు | అక్టోబర్ 17, 2016 | నమస్తే తెలంగాణ – 'చెలిమె' |
| 2) | ★పురస్కారం సామాన్య మానవుల అసామాన్య కవి | ఓల్గా | అక్టోబర్ 17, 2016 | సాక్షి – సాహిత్యం |
| 3) | మట్టి సుగంధాల కవి సిధారెడ్డి | డా॥ వాణీ దేవులపల్లి | జూన్ 12, 2017 | నమస్తే తెలంగాణ – 'చెలిమె' |
| 4) | ★మార్చి 26న స్ఫూర్తి పురస్కార ప్రధానం సందర్భంగా ఓ కవి స్వీయగానం | డా॥ యన్. గోపి | మార్చి 20, 2017 | సాక్షి – సాహిత్యం |
| 5) | యుద్ధం చేస్తూ శాంతిని కోరే కవి | ఓల్గా | డిసెంబర్ 25, 2017 | సాక్షి – సాహిత్యం |

| | | | | |
|---|---|---|---|---|
| 6) | *పురస్కారం<br>సృజన మహాదృఢం, అతి మృదులం | దర్భాశయనం<br>శ్రీనివాసాచార్య | డిసెంబర్ 26, 2016 | సాక్షి – సాహిత్యం |

**పట్టిక – 9**

## 2.13.3. పుస్తకావిష్కరణ/పునర్ముద్రణ సంబంధ వ్యాసాలు

నూతన పుస్తకాల ఆవిష్కరణ సందర్భంగా లేదా పాత పుస్తకాలను పునర్ముద్రించిన సందర్భంగా ఆయా పుస్తకాల వివరాలను తెలుపుతూ సాహిత్య పుటల్లో వ్యాసాలను ప్రచురిస్తున్నారు. దీని ద్వారా పాఠకుడికి నూతన పుస్తకాల పరిచయం అలాగే వాటి వివరాలు తెలుస్తున్నాయి. పుస్తక పఠన ప్రేరణ కూడా ఈ వ్యాసాల ద్వారా పాఠకుడిలో కలుగుతుంది. పుస్తకావిష్కరణ వివరాలను తెలుపుతూ వచ్చే ఈ వ్యాసాలను సాహిత్య నివేదికలుగా పేర్కొనవచ్చు. సాక్షి, నమస్తే తెలంగాణ సాహిత్య పుటల్లో ఇటువంటి వ్యాసాలు మనకు కనిపిస్తాయి.

### 2.13.3.1. 50 ఏళ్ళ తర్వాత బాణుడి కాదంబరి

“50 ఏళ్ళ తర్వాత బాణుడి కాదంబరి” అనే వ్యాసం సాక్షి సాహిత్యం పుటలో డిసెంబర్ 19, 2016న ప్రచురితమయింది. బాణుడు సంస్కృతంలో రాసిన ‘కాదంబరి’ని విద్వాన్ విశ్వం తేలికైన మాటలతో తెలుగు పాఠకులకు అందించే ప్రయత్నం చేసారు. అది 1962లో పుస్తకంగా వచ్చింది. భారతీయ సాహిత్యానికి తొలి నవలగా పిలిచే ఆ నాలుగు వందల పేజీల గ్రంథాన్ని యాభై ఏళ్ళ తర్వాత మళ్ళీ కవిత పబ్లికేషన్స్ ప్రొద్దుటూరు వారు పునర్ముద్రించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వచ్చిన వ్యాసం ఇది. కాదంబరి కావ్యానికి విద్వాన్ విశ్వం రాసిన పీఠికలో నుండి కొంత భాగాన్ని ఈ వ్యాసంగా ప్రచురించారు.

ఏవైన పుస్తక ఆవిష్కరణలు లేదా పునర్ముద్రణలు జరిగినపుడు, వాటిని సాహితీ నివేదికలుగా ప్రచురించడం పత్రికారంగంలో ప్రస్తుతం వస్తున్న సంప్రదాయం. దీనిలో భాగంగా ఆ గ్రంథం ముందు మాటలను వ్యాసాలుగా ప్రచురించడం ఆధునికంగా వచ్చిన సంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని సాక్షి, నమస్తే తెలంగాణ రెండు పత్రికలు పాటిస్తున్నాయి. వీటి ద్వారా సాహిత్య సంబంధ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పాఠకులకు అందజేస్తున్నారు.

ఈ వ్యాసంలో విద్వాన్ విశ్వం బాణుడు ప్రతిభను ఆయన రచనా విధానాన్ని ప్రశంసిస్తూ కాదంబరి కావ్య విశేషాలను తెలిపాడు. అనువాద ప్రక్రియలో తాను ఎదుర్కొన్న సమస్యలను వివరిస్తూ కాదంబరి వంటి మహా ప్రౌఢ ప్రబంధం చదివి అర్థం చేసుకోవడమే కష్టతరమయినది. ఇంకా దాని అనువాదం అతి పెద్ద సాహసమేనని అయినా కూడా రాయవలెననే కుతూహలమే ఈ

అనువాదానికి కారణమయిందని వారి అనువాద ప్రక్రియను వివరించారు. ఇలాంటి వ్యాసాల ద్వారా మూల గ్రంథాన్ని చదవాలనే ప్రేరణ, పఠనాసక్తి పాఠకుల్లో కలుగుతుంది.

### 2.13.3.2. పుస్తకావిష్కరణ/పునర్ముద్రణ సంబంధ వ్యాసాల పట్టిక

ఇలాంటి పుస్తకావిష్కరణ/పునర్ముద్రణకు సంబంధించిన వ్యాసాలు మరికొన్ని ఈ రెండు పత్రికల్లో వెలువడ్డాయి. వాటి వివరాలు కింది విధంగా ఉన్నాయి.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | *రాబోవు పుస్తకం పోయేది తక్కువ పొందేది ఎక్కువ | ముకుంద రామారావు | ఫిబ్రవరి 8, 2016 | సాక్షి – సాహిత్యం |
| 2) | *కొత్త అనువాదం నీట రాసిన పేరొకటి కాలగతిని మార్చింది | ఆచార్య గంగిశెట్టి లక్ష్మీ నారాయణ | ఫిబ్రవరి 22, 2016 | సాక్షి – సాహిత్యం |

**పట్టిక –10**

## 2.14. పాశ్చాత్య కవిత్వ సంబంధ వ్యాసాలు

సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య పుటల్లో కేవలం తెలుగు సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలే కాకుండా పాశ్చాత్య సాహిత్య సంబంధ వ్యాసాలు కూడా ప్రచురిస్తున్నారు. పాశ్చాత్య కవిత్వ సంబంధ వ్యాసాలు కూడా మనకు ఈ రెండు సాహిత్య పుటల్లో కనిపిస్తున్నారు. పాఠకులకు కేవలం తెలుగు సాహిత్యం గురించే కాకుండా ప్రపంచ దేశాల సాహిత్య అవగాహన కలగాలనే ఉద్దేశ్యంతో సాహిత్య పుటల్లో పాశ్చాత్య సాహిత్య ప్రచురణ ఆయా సందర్భానుసారంగా జరుగుతుంది. పాశ్చాత్య కవులకు ఏదైన సత్కారాలు లభించిన సందర్భంలో కూడా ఇలాంటి వ్యాసాలు మనకు కనిపిస్తున్నాయి.

### 2.14.1. కవిత్వమే మతం అయిన సందర్భం

రోచిష్మాన్ రాసిన వ్యాసం 'కవిత్వమే మతం అయిన సందర్భం' ఆగస్టు 07, 2017న సాక్షి సాహిత్యం పుటలో వెలువడింది. కవిత్వం, తత్త్వం అయి మతం అయింది. చైనా కవి లావ్‌ట్సూ (Lao–Tzu) కర్తృత్వంలో అంటూ ఆయన రాసిన 81 కవితలు టౌఇజం (Taoism) అన్న మతానికి ప్రాతిపదిక అయినాయని వివరిస్తూ రాసిన వ్యాసం ఇది.

"ప్రపంచంలోని మహోన్నతమైన కవులలో చైనా దేశపు కవి లావ్‌ట్సూ ఒకరు. లావ్‌ట్సూ జననం జీవితం మరణంపై సరైన వివరాలు లేవు. ఆయన క్రీ.పూ.6వ శతాబ్దం వారని విశ్వసిస్తున్నారు. అందులోనూ సందిగ్ధతే. క్రీ.పూ.604–517 కాలం వారనీ, క్రీ.పూ.551–479

పురాతన దస్తావేజు సంరక్షకులుగా ఆయన పనిచేసేవారనీ, ఒక దశలో అక్కడి పరిస్థితులు నచ్చక ఊరు వదిలి వెళ్లిపోతూండగా ఊరి పొలిమేరలో కాపలాదారులు పట్టుకున్నారనీ, ఆ పట్టుకున్న కాపలాదారులలో ఒకతనికి ఆయన తన జ్ఞానాన్ని కొన్ని కవితలలో చెప్పారని, అందుకు బదులుగా ఆ కాపలాదారు ఆయన్ను వదిలేశాడనీ, ఆయన ఎద్దునెక్కి ఎటో వెళ్లిపోయారనీ కథనం. లావ్‌ట్సూ ఎద్దుపై కూర్చుని ఉన్న చిత్రం ప్రచారంలో ఉంది. ఆయన పొలిమేర దాటుతుండగా పట్టుకున్న కాపలాదారులలో ఒకతను ఆయన స్నేహితుడనీ, అతని పేరు యిన్–హ్సి అనీ, ఆ 81 కవితలూ అతని కోసం రాసిచ్చారని మరో కథనం" అంటూ లావ్‌ట్సూ జీవిత కథనాలను తెలిపి వారి రచనల్లో వస్తువును వివరించారు.

మతం నుంచి కవిత్వం రావడం, మతం కోసం కవితా రచన జరగడం ఉన్నదే. కానీ కవిత్వం మతంగా పరిణమించడం ఒక్క లావ్‌ట్సూ ద్వారానే జరిగింది. ఒక టౌఇజం విషయంలోనే జరిగిందంటారు వ్యాసకర్త. ప్రపంచంలోని మహోన్నత కవులలో ఒకరైన చైనా దేశపు కవి లావ్‌ట్సూ. ఆయన రాసిన 81 కవితలు టౌజా–టీ–చింగ్ అయినాయి.అదే టాఔఇజం అన్న మతానికి ఆధారం అయిందంటూ లావ్‌ట్సూ కవి జీవితం జనన, మరణ సంబంధ విషయాలను వాటి వెనుకనున్న కథలను వివరించారు. అలాగే ఆయన రాసిన 81 కవితలు గురించి వాటిలోని వస్తువు గురించి దీనిలో వివరించారు.

### 2.14.2. సామాన్య మానవుల అసామాన్య కవి

ఓల్గా రాసిన 'సామాన్య మానవుల అసామాన్య కవి' వ్యాసం సాక్షి సాహిత్యం పుటలో అక్టోబర్ 17, 2016న ప్రచురితమయింది. అమెరికన్ కవి గాయకుడు బాబ్‌డిలాన్‌కు నోబెల్ పురస్కారం లభించిన సందర్భంగా రాసిన వ్యాసం ఇది.

దీనిలో కవి తాలూకు జనన సంబంధ వివరాలు కాకుండా కవి భావజాలాన్ని ఎక్కువగా చర్చించారు. కవిని తను అర్థం చేసుకున్న విధానాన్ని వివరించారు. బాబ్‌డిలాన్‌ను వ్యాసకర్త సామాన్య మానవుల అసామాన్య కవి గాయకుడిగా పేర్కొంటూ బాబ్‌డిలాన్ జీవిత సంఘటనలను కవిపై చూపిన ప్రభావాలను తెలుపుతూ వారి కవితలను వివరించారు.

"బాబ్‌డిలాన్ 1941లో పుట్టాడు. ఫలానా చోట వీళ్లను పెళ్లాడాడు. ఇన్ని అవార్డులు వచ్చాయి అనే వివరాలు ఇంటర్‌నెట్‌లో చాలా దొరుకుతాయి. ఇది నేను డిలాన్‌ని అర్థం చేసుకున్న తీరు. ప్రేమించిన తీరు. ఇప్పటికీ ఆ కవిత్వం చదువుకుంటూ ప్రేరణ పొందాలని ఈ తరానికి చెప్పదల్చిన మాటలు. నోబెల్ బహుమతి ఆ మాటలు చెప్పడానికి ఒక సందర్భం అయినందుకు

సంతోషంగా ఉందంటూ” వ్యాసకర్త అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఈ విధంగా తెలుగు సాహిత్యానికే కాకుండా పాశ్చాత్య సాహిత్య సంబంధ విషయాలు సాహిత్య పుటల్లో ప్రచురిస్తున్నారు.

### 2.14.3. పాశ్చాత్య కవిత్వ సంబంధ వ్యాసాల పట్టిక

పాశ్చాత్య కవిత్వ సంబంధ వ్యాసాలు ఈ రెండు పత్రికల్లో మరికొన్ని వ్యాసాలు వెలువడ్డాయి. వాటి వివరాలను కింది పట్టికలో పొందుపరిచాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | బాబ్‌డిలాన్ – జానపద పునరుజ్జీవనం | కందుకూరి రమేశ్ | అక్టోబర్ 17, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | గురజాడ కార్పెంటర్ దృష్టిలో స్త్రీ | కాళిదాసు పురుషోత్తం | అక్టోబర్ 10, 2016 | సాక్షి – సాహిత్యం |
| 3) | Fusion శాయరీ – ఒక అవలోకనం! | మామిడి హరికృష్ణ | అక్టోబర్ 23, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 4) | ఇకో కవితా ఉద్యమాలు | వి. అరుణ | జూలై 25, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక – 11**

**ఈ అధ్యాయంలోని ముఖ్యాంశాలు**

- ఆలంకారికుల, ఆధునికుల కవిత్వ నిర్వచనాలు తెలుపబడ్డాయి.
- కవితాప్రక్రియను పరిచయం చేస్తూ, వివిధ కవితా రూపాల లక్షణాలను వివరిస్తూ వాటి సంబంధిత వ్యాసాలు విశ్లేషించబడ్డాయి.
- పద, ప్రబంధ, గేయ, స్త్రీవాద, హైకు, గజల్ వంటి కవిత్వాలకు సంబంధించిన పరిచయం చేస్తూ, వాటి సంబంధిత వ్యాసాలను విమర్శనాత్మక దృష్టిలో చూడడమైంది.
- కవి జీవిత కావ్య విమర్శ పద్ధతిని వివరిస్తూ, సంబంధిత వ్యాసాలను సమన్వయం చేయడమైంది. అందులో భాగంగా కవుల జయంతి, వర్ధంతి సంబంధిత వ్యాసాలు వివరించబడ్డాయి.
- అస్తిత్వవాద విమర్శ, తులనాత్మక విమర్శ, నైతిక విమర్శ వంటి పద్ధతులు కవిత్వపరంగా పరిశీలించబడ్డాయి.
- పాశ్చాత్య కవుల కవిత్వ పరిచయం చేయబడింది.
- సమీక్ష, విమర్శ సంబంధిత పరిచయం చేస్తూ, వాటి వ్యాసాల విశ్లేషణ జరిగింది.

- సాహిత్య నివేదిక వ్యాసాల్లోని భేదాలు తెలుపబడ్డాయి.
- సాక్షి, నమస్తే తెలంగాణ పత్రికల్లోని సాహిత్య పుటల్లో పరిశీలించిన అంశాలను తెలియజేస్తూ, సాక్షిలో అన్ని రకాల కవిత్వానికి ప్రాధాన్యం కన్పిస్తుందని తెలుపబడింది. నమస్తే తెలంగాణలో ప్రాంతీయ అస్తిత్వవాద ధోరణిలో భాగంగా తెలంగాణ సాహిత్యం కవులను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తుందని చెప్పబడింది.
- ఇలా ఈ రెండు పత్రికల్లో కవిత్వవిమర్శ భేదాలను తెలిపాను. మూడవ అధ్యాయంలో కథానిక విమర్శను పరిశీలిస్తాను.

★★★

# మూడవ అధ్యాయం

## సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు–కథానిక విమర్శ

# అధ్యాయం–3

# సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు–కథానిక విమర్శ

## 3.0. పరిచయం

తెలుగు వచన సాహిత్య ప్రక్రియల్లో కథ ఒకటి. కథ అనగానే ప్రతి ఒక్కరికి చిన్ననాడు నేర్చుకున్న 'అనగా అనగా ఒకరోజు...' కథ స్ఫురిస్తుంది. కథ చెప్పడం అనేది మనకు ప్రాచీన కాలం నుండి కనిపిస్తుంది. కానీ ప్రస్తుతం మనం చెప్పుకుంటున్న ఈ ఆధునిక కథానిక ప్రక్రియ పాశ్చాత్య సాహిత్య ప్రభావం వలన తెలుగులోకి వచ్చిందని పండితులు భావిస్తున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన విప్లవాత్మకమైన మార్పుల వలన ప్రపంచాభివృద్ధి మరింత వేగవంతమయింది. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, పారిశ్రామిక, వ్యవసాయక రంగాల్లో విపరీతమైన మార్పులు వచ్చాయి. దీని ద్వారా మనిషికి గల విశ్రాంతి పరిమితం చేయబడింది. తీరిగ్గా కూర్చొని చదివి అర్థం చేసుకునే అవకాశాలు తక్కువ. పత్రికల అభివృద్ధి జరిగి పాఠకుల సంఖ్య పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో కథానిక విశేష జనాదరణ పొందింది. పత్రికల ద్వారా, పుస్తకాల ద్వారా, రేడియోల ద్వారా ప్రపంచంలోని పాఠకులకు బాగా పరిచయం అయింది. ఆధునిక కల్పనాసాహిత్యంతో కథానిక విశిష్ట స్థానాన్ని అలంకరించింది. తెలుగు సాహిత్యంలో మొదటి కథానికకు ఆద్యుడుగా గురజాడ అప్పారావును పండితులు భావిస్తున్నారు. బండారు అచ్చమాంబ, ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ వంటి వారు గురజాడకు ముందే తెలుగు కథలను రాశారు. అయినా కూడా అన్ని కథా లక్షణాలు గల మొదటి కథగా గురజాడ 'దిద్దుబాటు'ను పేర్కొంటున్నారు.

పాఠకులకు అతి తక్కువ సమయంలో అత్యంత అనుభూతిని కలిగించగల ఈ కథల కథానికలు తెలుగు సాహిత్యంలో మణిపూసలు. ఈనాటికి ఎందరెందరో రచయితలు కథలు, కథానికలు రాసి పాఠకలోకానికి అందిస్తున్నారు. కథా సంకలనాలను ప్రచురిస్తున్నారు. ఇటీవల కాలంలో వారపత్రికలు కథల ప్రచురణకు పూనుకోవడం, కథారచన పోటీలను నిర్వహించి బహుమతులివ్వడం కథల యొక్క రాశిని పెంచుతున్నాయి. పత్రికలతోపాటు తెలుగు కథా సంకలనాలు, నూరేళ్ళ తెలుగు కథ మొదలైనవి ప్రచురించి పాఠకులకు పలు ప్రచురణ సంస్థలు అందుబాటులోకి తెస్తున్నాయి. సాక్షి, నమస్తే తెలంగాణ సాహిత్య పుటల్లో కథా సంబంధ వ్యాస ప్రచురణ అనేక రకాలుగా జరుగుతూ కథా సంబంధ వ్యాసాల ప్రచురణలో వైవిధ్యం కనిపిస్తుంది. కథా వస్తు సంబంధ వ్యాసాలు, శిల్ప సంబంధ వ్యాసాలు, సమీక్ష సంబంధ వ్యాసాలు, నివేదిక

రూప వ్యాసాలు, ముందు మాటల సంక్షిప్త రూప వ్యాసాలు, స్మృతి వ్యాసాలు, కథా నేపథ్య సంబంధ వ్యాసాలు ఇలా అనేక రకాలుగా కథా సంబంధ వ్యాస ప్రచురణలో వైవిధ్యం కనిపిస్తుంది. కావున వీటిని ఉపవిభాగాలుగా చేసుకొని ఈ అధ్యాయంలో విమర్శనాత్మక పద్ధతిలో విశ్లేషించాను.

## 3.1. కథానిక నిర్వచనం–లక్షణాలు

ఆంగ్ల భాషా సాహిత్య ప్రభావంతో తెలుగులోకి వచ్చిన వచన సాహిత్య ప్రక్రియ కథ. సంస్కృతంలోని 'కథ్' అను ధాతువునకు 'సంభాషించు', 'చెప్పుట' అనే అర్థాలున్నాయి. కథ్ ధాతువు నుండి పుట్టినదే కథాశబ్దం. దానికి తెలుగులో తత్సమ రూపం కథ, తద్భవ రూపం 'కత' అని పండితుల అభిప్రాయం. సంస్కృతములో "ఇతివృత్త భేదమును బట్టి 'కథా, ఆఖ్యాయికా, ఖండకథా, పరికథా' అను గద్యప్రబంధ భేదములన్నట్లు కావ్యాదర్శ వ్యాఖ్యాత జీవానంద విద్యాసాగర భట్టాచార్యులు తెలిపారు. కానీ వీటి లక్షణాలను తెలుపలేదు. ఆనందవర్ధనుడు ధ్వన్యాలోకములో గద్యకావ్య విభాగములకు చెప్పిన లక్షణాలను బట్టి ఉచ్ఛ్వాసాది విభాగములతో మధ్య మధ్య ఇతరుల పద్యములున్న గద్య ప్రబంధమును ఆఖ్యాయిక అని "అవాంతర విభాగములు లేకయుఁ బద్యములు లేకయు నున్న గద్య ప్రబంధము" కథా అని చెప్పవచ్చు. దండి–కథా, ఆఖ్యాయికలకు భేదములేదని "తత్కథాఽఖ్యాయికే త్యేషా ఏకా సంజ్ఞా ద్వయాంకితా" అని చెప్పెను. 'శివతత్త్వ రత్నాకరము'న కథా కల్పిత వృత్తాంతా సత్యార్థాఽఖ్యాయికా మాతా" కల్పిత వృత్తాంతము గలది కథ. సత్యవృత్తాంతము గలది ఆఖ్యాయిక" (2008. పుట.275–276). అని శివతత్త్వ రత్నాకరుని నిర్వచనాన్ని సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి వారి కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్యానంలో పేర్కొన్నారు

"భారతీయ సాహిత్యానికి విజ్ఞాన సర్వస్వాలయిన పురాణాలు అద్భుత విషయ భాండాగారాలు. వాటిలో ఒకటైన అగ్నిపురాణంలో కథాసంబంధ చర్చ కనిపిస్తుంది.

**"ఆఖ్యాయికా కథా ఖండకథా పరికథా తథా**
**కథాని కేతి మన్యంతే గద్యకావ్యం చ పరిచథా"**

అగ్నిపురాణం 337 అధ్యాయపు కావ్యాది లక్షణ నిరూపణ సందర్భంలో గద్యకావ్య విభాగం గురించి ఇట్లా ఉంది. ఆఖ్యాయిక, కథ, ఖండ కథ, పరి కథ, కథానిక అని గద్యకావ్యాలు అయిదు రకాలు. ఇందులో కథానికే మన చిన్నకథ. ఈ గద్యకావ్య విభాగాలు ప్రాచీన సంస్కృత ప్రాకృత గద్యకావ్యాలకు సరిపోతాయి. బృహత్కథను 'ఆఖ్యాయిక'గా చెప్పవచ్చు. కథాసరిత్సాగరము 'కథ' విభాగానికి చేరుతుంది. వాసవదత్త ఖండ కథ, కాదంబరి పరికథ. ఇక మిగిలిన 'కథానిక'కు లక్ష్య

భూతాలైన సంస్కృత రచనలేవీ కనిపించవు. కాని విక్రమార్క చరిత్ర, హితోపదేశము మొదలైన కథల పుస్తకాలలోని ఒక్కొక్క కథ ఇంచుమించు కథానికాప్రాయముగా ఉంటుందని ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 'కథానిక' వ్యాసంలో వారి అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు" (రాంబాబు, వేదగిరి. (సంక.).2000.పుట.17).

నేడు 'కథ', 'కథానిక' అనేవి పర్యాయపదాలుగా వాడుతున్నారు. ఆంగ్లంలోని Short Story అనే పదానికి సమానార్థకంగా తెలుగులో 'కథానిక' అనే పదాన్ని వాడుతున్నారు. ఆధునిక కథానిక దాదాపు ఒకే కాలంలో జర్మనీ, అమెరికా, ఫ్రాన్స్, రష్యా వంటి పాశ్చాత్య దేశాలలో ఉద్భవించినది. ఆయా దేశాల కథలలోని వస్తువులోను, శిల్పములోను వైవిధ్యమున్న ప్రపంచ రచయితలందరు కథను సమర్థవంతమైన జనరంజకమైన సాహిత్య ప్రక్రియగా గుర్తించారు. కథా, కథానికకు సంబంధించి పలువురు పండితులు, కవులు వారి వారి అభిప్రాయాలను నిర్వచనాలను కింది విధంగా తెలిపారు.

### 3.1.1. కథానిక–నిర్వచనాలు

కథ అనగా "ఇంచుక సత్యమైన కల్పిత ప్రబంధం" అని శబ్దరత్నాకరం నిర్వచిస్తుంది (సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2012. పుట.170).

"ఒక నిర్దిష్ట సాహిత్య ప్రక్రియగా రూపొందిన ఆధునిక వచన రచనావిశేషం కథానిక". మామూలు కథ కంటే ఇది సునిశితం, సూక్ష్మతరం. ప్రతి కథానికా కథే. కాని ప్రతి కథా కథానిక కాదు. కథ విషయ ప్రధానమైతే కథానిక శిల్ప ప్రధానం. రచయిత ఏం చెప్పాడన్నది రెండింటికీ వర్తిస్తుంది. కాని ఎలా చెప్పాడన్నది 'కథానికకే' వర్తిస్తుంది. కథ ముడి వజ్రం; కథానిక సానబెట్టిన వజ్రం. దీని అందం దానికి లేదు. దీని పనితనం దాంట్లో లేదు (దక్షిణామూర్తి, పోరంకి. 2009. పుట.103).

"ప్రస్తుత కాలంలో కథానికకున్నంత ప్రాచుర్యం మరే సాహిత్య ప్రక్రియకు లేదంటే అతిశయోక్తి కాదు. కథానిక అంటే చిన్న కథ. ఇది ఆంగ్లంలో Short Story అనే పదానికి సమానార్థకం. నేడు కథానిక చిన్న కథలను కథ అనే వ్యవహరిస్తున్నారు. ఇది వేద బ్రాహ్మణుల నుంచి పరంపరంగా అభివృద్ధికి వచ్చిన కథాకావ్యాల నుంచి ఎన్నెన్నో కొత్త అందాలను సంతరించుకుని ప్రత్యేక రచనగా ఏర్పడింది. అంతేకాని పాశ్యాత్యుల నుంచి ఇది సరాసరి రాలేదు. మన పూర్వులే కథా ప్రవృత్తిని ప్రసరించి చిన్నకథను లక్షణాలతో నిర్వచించారు. దీనికి మన

సాహిత్య శాస్త్రంలో కథానిక అనే పేరు స్థిరపడిందని ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 'కథానిక' వ్యాసంలో పేర్కొన్నారు" (రాంబాబు, వేదగిరి. (సంక.). 2000. పుట.17).

"క్లుప్తంగా నొక యుజ్వల సౌందర్యమునో, భయంకర దృశ్యమునో కరుణాద్భుత సన్నివేశమునో ఆధారముగా చేసికొని ఒకే యొక ఉద్దేశంతో ఒక తారాజువ్వవలె ఎగసి పువ్వులు రాల్చి ఊరుకొనునది చిన్నకథ" (1961. పుట.743). అని వావిలాల సోమయాజులు నిర్వచించారు.

"ఒక రకమైన ఎత్తుగడ, ఒకానొక నడక తీరు, ఒకే రీతిగల ముగింపు కొన్ని పాత్రలు, పాత్ర పోషణా విధానము, వస్తు విన్యాస వైశిష్ట్యము, ఏదేని ఒక జీవిత పద్యః ప్రతిపాదనము, అన్నింటిని మించి వస్త్వైక్యము అను కొన్ని లక్షణములు కలిగి వినోద, విజ్ఞాన, వికాసాది సాధకమైన చిన్న కథను లోకములో కథానిక అని వ్యవహరించబడుతున్నది. సాధారణముగా నాతి విస్తృత క్షేత్రము కలిగి ఒకానొక స్వయం సంపూర్ణమై దానిలోని భిన్న తత్త్వములను ఏకోన్ముఖములుగా చూపు ఇతివృత్తాత్మక గద్య కవితా శిల్ప ఖండమును కథానిక అని నిర్వచించవచ్చును" (కుటుంబ రాయశర్మ, బొడ్డపాటి. 1961. పుట.609).

**"ఏకాంశవ్యగ్రమై స్వయం సమగ్రమైన**
**కథాత్మక వచన ప్రక్రియ కథానిక"**

**(దక్షిణామూర్తి, పోరంకి. 2009. పుట.149)**

"సాధారణంగా ఒకే ఒక సంఘటనను గానీ, అంతకంటే ఎక్కువ సంఘటనలతో ఒకే ప్రయోజనాన్ని, ఒకే ఆదర్శాన్ని దృష్టిలో పెట్టుకొని చిత్రించడాన్ని 'చిన్నకథ' అని గానీ, కథానిక అని గానీ అంటారు. సూక్ష్మంగా చూసే రచయిత యొక్క వ్యక్తిత్వపు ప్రకటనే చిన్న కథ" (శార్వరి (సంక.). 1992.పుట.82). అని తాళ్లూరు నాగేశ్వరరావు 'కథాకన్యకు ముస్తాబు' అనే వ్యాసంలో వివరించారు.

"మనిషికి ఇంకొక మనిషితో, సంఘంతో, రాజ్యంతో, మతంతో గల సంబంధం అనేక సంఘటనలకీ, పరిస్థితులకీ, అనుభవాలకీ దారి తీయవచ్చు. జీవితంలోని ఒక అంశాన్ని వివరించడానికి కథ సాధనం. ఒక్క అవస్థని గానీ, ఒక అనుభవాన్ని గానీ, ఒక వైచిత్ర్యాన్ని గానీ, ఒక మనస్తత్వాన్ని గాని చిత్రించేది కథ" (శార్వరి (సంక.). 1992. పుట.95). అని హితశ్రీ 'కథాలక్షణాలు' అనే వ్యాసంలో నిర్వచించారు.

### 3.1.2 . కథానిక–లక్షణాలు

"మౌలికత, ఏకత, క్లుప్తత, శైలీ రమ్యత, క్రియాశీలత, రూపం, వస్తువు వీలుంటే కల్పన అన్న లక్షణాలు ఎనిమిదీ కథానికా ప్రక్రియ ప్రత్యేకతను నిరూపిస్తాయి (దక్షిణామూర్తి, పోరంకి. 2009. పుట.149).

"మంచి కథకు ఉండవలసిన లక్షణాలు క్లుప్తత, అనుభూతి, ఐక్యత, సంఘర్షణ, నిర్మాణ సౌష్టవం" (1995. పుట.11). అని వల్లంపాటి వెంకట సుబ్బయ్య కథానిక లక్షణాలను తెలిపారు.

ఈ విధంగా పలువురు కవులు, విమర్శకులు కథానికను నిర్వచించి వాటి లక్షణాలను తెలియజేసారు. పై నిర్వచనాలన్నింటిని పరిశీలిస్తే సమాజంలోని లేదా మానవుని జీవితంలోని భిన్న పార్శ్వాలను వాస్తవిక చిత్రణ కావించే వచన ప్రక్రియ కథానిక అని అర్థమవుతుంది.

ఇంత గొప్పనైన కథా సాహిత్యానికి వార్త పత్రిక సాహిత్య పుటల్లో చోటు కల్పిస్తుంది. దినపత్రికల సాహిత్య పుటల్లో కథా సంబంధ వ్యాస ప్రచురణ అనేక రకాలుగా కనిపిస్తుంది. కేవలం కథల పుస్తక పరిచయాలు, కథావస్తువు పరిచయమే కాకుండా కథాశిల్పానికి సంబంధించినవి, కథా పుస్తక ముందుమాట సంక్షిప్త రూపాలు, కథకులను స్మరిస్తూ రాసే స్మృతి వ్యాసాలు, నివేదన వ్యాసాలు, కథా పుస్తక నేపథ్య సంబంధ వ్యాసాలు, చర్చాపరమైన కథా వ్యాసాలు ఇలా అనేక రకాలుగా దినపత్రికల్లో కథా సాహిత్య సంబంధ వ్యాసాలు ప్రచురితమవుతున్నాయి. సాక్షి, నమస్తే తెలంగాణ పత్రికల సాహిత్య పుటల్లో కూడా ఈ రకమైన వ్యాస ప్రచురణ వైవిధ్యాలు కనిపిస్తున్నాయి. కావున వీటిని ఉపవిభాగాలు చేసుకొని కింద విధంగా విశ్లేషించారు. ఒక్కొక్క ఉపవిభాగానికి ఒకటి లేదా రెండు వ్యాసాలను స్వీకరించి విశ్లేషించాను. మిగతా వ్యాస వివరాలను పట్టికల రూపంలో పొందుపరిచాను.

### 3.2. కథానిక ఉపోద్ఘాతాలు

దినపత్రికల్లో కవిత్వం తర్వాత ఎక్కువగా ప్రచురితమవుతున్న సాహిత్య ప్రక్రియ కథానిక. సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రిక సాహిత్య పుటలలో కథానిక సంబంధ వ్యాస ప్రచురణ వివిధ రకాలుగా కనబడుతుంది. వాటిలో ముందు మాటలను సంక్షిప్తం చేసి వ్యాసాలుగా ప్రచురించడం ఒక రకం. సాహిత్య పుటల్లోని వైవిధ్యభరితమైన కథానికా సంబంధ వ్యాస ప్రచురణలో చెప్పుకోదగినది ముందు మాటలను సంక్షిప్తం చేసి వ్యాసాలుగా వేయడం. నూతన పుస్తక ఆవిష్కరణ, కవుల జయంతి, వర్ధంతి, వంటి ప్రత్యేక సందర్భాలలో విషయ ప్రాధాన్యం గల ముందు మాటలను వ్యాసాలుగా ప్రచురిస్తున్నారు. వీటిలో కొన్ని సందర్భాలలో నూతన సిద్ధాంతాలను

ప్రతిపాదించే ముందు మాటలను సూత్ర విమర్శ పద్ధతిలో వ్యాసాలుగా ప్రచురిస్తున్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ప్రజలకు అందించే ప్రచార సాధనం దినపత్రిక. కావున సాహిత్యరంగంలోని విషయాలను, నూతన పుస్తక వివరాలను, నూతన సిద్ధాంతాలను పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రధానంగా దినపత్రికల సాహిత్య పుటలపై ఉంది. ఈ రెండు పత్రికలు కూడా సాహిత్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నాయి.

### 3.2.1. ముందుమాట

Foreword అని ఆంగ్ల పదానికి సమానార్థకంగా తెలుగులో ముందు మాటను వ్యవహరిస్తున్నారు. ముందుమాటకు పర్యాయపదాలుగా పీఠిక, ప్రస్తావన, ఆముఖం, తొలి పలుకు, పరిచయం, మున్నుడి మొదలైనవి వ్యవహారంలో ఉన్నాయి. ప్రాచీన కాలంలో తెలుగు సాహిత్య చరిత్రలో పీఠికలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ప్రాచీన కాలంలో కావ్యవతారికలు పీఠికలే అనే అభిప్రాయం పండితుల్లో కలదు. కావ్యవతారికలు కవులు స్వయంగా రాసేవారు కానీ ముందు మాటలను రచయిత లేదా కవుల రచనలపై ఇతరులు రాసే అభిప్రాయ వాక్యాలుగా చెప్పబడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రచయిత స్వయంగా ముందుమాటలు రాసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఎవరు రాసిన ఏ పేరుతో రాసిన ఒక గ్రంథానికి పీఠిక ఉండడమనేది సర్వసామాన్యం ఈ పీఠిక వచన రూపంలో గానీ పద్య రూపంలో గానీ చంపూ పద్ధతిలో గాని ఉండవచ్చు.

### 3.2.2. ముందుమాట–నిర్వచనాలు

పీఠిక అనగా "గ్రంథము మొదట వ్రాసెడు దాని పుట్టుపూర్వోత్తరములు" ( 2012. పుట. 587) అని శబ్ద రత్నాకరం నిర్వచిస్తుంది.

"పీఠ ఇవ పీఠికా, భూమి రివ భూమికా: పీఠికయు, భూమికయు(అంతస్తు) ఉన్నత ప్రదేశములు కదా! వాని నధిష్టించిన వానికి క్రింది వస్తువులు విస్పష్టముగా గోచరించు విధమున పీఠికా, భూమికలు చదివినచో గ్రంథస్థ విషయము గోచరించును. ఇవి కావ్యారంభక గ్రంథములు"(సూర్యనారాయణ శాస్త్రి, సన్నిధానం. 2013. పుట.283)

"ఒక గ్రంథానికి ముందు ఆధారాలు, చరిత్ర, పరిధి, ప్రణాళిక పద్ధతి, ప్రయోజనం, లక్ష్యం మొదలైన వాటిని వివరిస్తూ సహకరించిన వారికి కృతజ్ఞతలు చెబుతూ ఆ గ్రంథాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమయ్యే అధిక సమాచారాన్ని అందించే ప్రత్యేక వ్యక్తిత్వం కలిగిన రచన పీఠిక. ఇది వచన రూపంలో గానీ పద్య రూపంలో గాని ఉండవచ్చును. దీనిని గ్రంథకర్త గాని,

ఇతరులు గాని రాయవచ్చు"(1990. పుట. 33)అని డి చంద్రశేఖర్ రెడ్డి తెలుగు పీఠిక అనే గ్రంథంలో నిర్వచించారు.

"పుస్తకాన్ని పరిచయం చేస్తూ రాసిన పరిచయ వాక్యాలు. మామూలుగా ముందుమాటలను రచయిత కాకుండా ఇతరులు– ప్రముఖ రచయితలో,ప్రచురణ కర్తలో, సంపాదకులో రాస్తారు. అయితే ఒక్కో సందర్భంలో రచయితే స్వయంగా రాసుకోవడం అనేది కనిపిస్తుంది"(నళిని,ఎస్. ఎస్. 2009. పుట.144)

"పీఠిక హఠాత్తుగా ఆధునిక సాహిత్యంలో బయటపడింది కాదు ప్రాచీన కావ్య నాటకాల అవతారికల్లో ప్రస్తావనలలో ప్రోలాగులలో ఆధునిక పీఠిక లక్షణాలు గోచరించడం వల్ల ఆధునిక పీఠిక శతాబ్దాల పరిణామ క్రమంలో రూపుదిద్దుకున్నదే తప్ప ప్రత్యేకంగా ఎవరి సృష్టి కాదు అన్న విషయం స్పష్టం అవుతుంది" (1990 పుట. 34) అని డి చంద్రశేఖర్ రెడ్డి తెలుగు పీఠిక గ్రంథంలో తెలిపారు.

పైన నిర్వచనాల ఆధారంగా ముందు మాటలు గ్రంథం యొక్క పుట్టుపూర్వోత్తరాలను గ్రంథస్థంశాలను తెలిపేదని చెప్పవచ్చు. గ్రంథ రచన సంవిధానాన్ని తెలుపుట, గ్రంథానికి వ్యాఖ్యానప్రాయముగా ఉండడం, రచయిత ఉద్దేశం వ్యక్తీకరించడం, ప్రజలకు గ్రంథ పరిధిని పరిచయం చేయడం, గ్రంథకర్తృత్వం, రచన కాలము, గ్రంథ నిర్ణయం, నిర్మాణం, ప్రయోజనాలను ప్రస్తావించడం, గ్రంథస్తంశాన్ని పాఠకుడికి సులభంగా అవగతం చేయడానికి తోడ్పడమనేవి ముందు మాటల్లో ప్రధాన లక్షణాలుగా కనబడుతున్నాయి.

ఒక గ్రంథాన్ని పరిచయం చేస్తూ రచయిత లేదా మరొక రచయిత రాసిన పరిచయ వాక్యాలు ముందుమాటలుగా చెప్పవచ్చు. గ్రంథ రచయిత స్వయంగా రాసిన ముందుమాటలో గ్రంథ నేపథ్యం, గ్రంథ రచనకు గల ప్రేరణ, గ్రంథ స్థూల పరిచయం, విషయ ప్రస్తావనకు ఎంపిక చేసుకున్న రచన రీతి, గ్రంథంలోని కొన్ని అంశాలకు తనదైన వ్యాఖ్యానం, తన వ్యక్తిగత జీవిత విశేషాలు చోటు చేసుకుంటాయి. ఇక ఇతరులు రాసిన పీఠికలో గ్రంథ చారిత్రక నేపథ్యం, విషయపరిచయం, రచన లక్ష్యం, రచయిత కాలం, వ్యక్తిత్వం, జీవిత విశేషాలు, రచన శైలి, రచనల ప్రత్యేకతలు, గ్రంధాన్ని పరిష్కరించిన తీరు, కొన్ని సందర్భాల్లో అవసరమైతే ప్రశంసలు చోటుచేసుకుంటాయి. ఇతను రాసిన ముందుమాటలు ఒక విధంగా సమీక్ష వ్యాసాలుగా కనిపిస్తాయి వీటిలో గుణదోష విచారణ రచయిత ఇతర రచనలకు ప్రస్తుత రచనకున్న భేద సాదృశ్యాలు, ఇతర రచయితలతో వీరి రచనలు గల భేద సాదృశ్యాల చర్చ

కనబడతాయి. గ్రంథకర్త రాసిన పీఠికలో గుణదోష విచారణకు వీలుపడదు. ఒకవేళ చేసిన తన గురించి తాను చెప్పుకున్నట్లు అవుతుంది. వారి రచనల్లోని దోషాలు వారికి దోషాలుగా కనిపించకుండా పోవచ్చును. ఇతరులు రాసిన ముందుమాటల్లో గుణ దోష విచారణకు అవకాశం అనేది ఉంటుంది.

ఈ విధంగా నన్నయ అవతారిక రూపంలో వేసిన బీజం నేడు విస్తృతమై పరిశోధనకు సైతం పట్టుబడక పీఠిక అనే మహా వృక్షమే అనేక పేర్లతో సహా విస్తరించింది. ఆధునిక కాలంలో విస్తృతమైన పరిధి కలిగి ఎక్కువ వినిపిస్తున్న మాట పీఠిక. నేటి కాలంలో ఏ గ్రంధానికైనా పీఠిక లేదా ముందుమాట సర్వసాధారణమైంది. ఇటువంటి ముందు మాటల ప్రచురణ అనేది నేడు దినపత్రికల సాహిత్య పుటల్లో కూడా మనకి కనబడుతుంది. విలువైనటువంటి ముందు మాటలని సంక్షిప్తం చేసి వ్యాసాలుగా వేస్తున్నారు.

సాక్షి నమస్తే తెలంగాణ దినపత్రికల్లో నూతన సిద్ధాంతాలను, ధోరణులను పరిచయం చేస్తూ వ్యాసాలను ప్రచురిస్తున్నారు. వాటిలో ముందు మాటలను సంక్షిప్తం చేసి వ్యాసాలుగా ప్రచురిస్తున్నారు. సైద్ధాంతిక రచయితలను, కొత్త సిద్ధాంతాలను పరిచయం చేయాలనుకున్నప్పుడు ముందు మాటలను వేస్తారు. అవి నూతన సిద్ధాంతాలు, ధోరణులు అయినప్పుడు ఒక వ్యక్తికీ సంబంధించింది కాదు అని భావించినప్పుడు విషయం నైపుణ్యం ఉన్న ముందుమాటలను పత్రికల్లో ప్రచురిస్తున్నారు. దీనిని సూత్ర విమర్శగా చెప్పవచ్చు.

### 3.2.3. సూత్ర విమర్శ (Theoretical Criticism)

"ఇది కూడ సాహిత్య రచనకు సంబంధించిన సూత్రములను ప్రతిపాదించునదే అయినను, లక్షణ విమర్శ పేర్కొను శాశ్వత ప్రమాణముల కంటె ప్రక్రియానుగుణమైన సాపేక్ష సిద్ధాంతములను నిర్దేశించును. స్వతంత్రబుద్ధి గల కవులు చేయు కావ్యమీమాంసలో ఇట్టి సూత్రములు గోచరించును. ప్రాచీనాంధ్ర కవుల కావ్యావతారికలు, ఆశ్వాసాంత గద్యలు మొదలగునవి సూత్రవిమర్శకు నెలవులు. నన్నయ, నాచన సోమనాది కవులు తమ కావ్యానుశీలన కనువైన సాపేక్ష ప్రమాణ సూత్రములను పేర్కొనిరి. కావున కవులకే కాక విమర్శకులకును సూత్రవిమర్శ మార్గదర్శక మగుచున్నది. కవులైన పలువురాంగ్ల విమర్శకులు కూడ ఈ విమర్శ మార్గము నవలంబించిరి" (2007.పుట.10) అని ఎస్.వి. రామారావు తెలుగులో సాహిత్య విమర్శ గ్రంథంలో నిర్వచించారు.

పై నిర్వచనమాధారంగా నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించే కావ్య అవతారికలు సూత్ర విమర్శగా చెప్పబడుతుంది. కావున సైద్ధాంతిక రచయితలను, నూతన సిద్ధాంతాలను పరిచయం చేస్తూ దినపత్రికల్లో ప్రచురించే కథ సంబంధ ముందుమాటలను సూత్ర విమర్శగా పేర్కొనవచ్చు. ప్రాచీన కాలంలోని కావ్యవతారికలు పీఠికలే అనే అభిప్రాయం పండితుల్లో కలదు. ఇలాంటి సూత్ర విమర్శ పద్ధతి వ్యాసాలు మనకి ఈ రెండు పత్రికల్లోనూ కనిపిస్తున్నాయి. వీటి ద్వారా మంచి విషయాలను పాఠకులకు అందించాలనే కుతూహలం పత్రికల్లో కనిపిస్తుంది.

### 3.2.4. సామాజిక వాస్తవ చిత్రాలు

ఈ వ్యాసం '2015 ప్రాతినిధ్య కథ' సంకలనానికి రచయిత దార్ల వెంకటేశ్వర రావు రాసిన ముందు మాటలోని కొన్ని భాగాలు. ఇది నమస్తే తెలంగాణ దినపత్రిక చెలిమె సాహిత్యపుటలో సెప్టెంబర్ 26 2016 న ప్రచురితమైంది. దీనిలో ప్రాతినిధ్య గురించి చెపుతూ రచయిత 'ప్రాతినిధ్య' తీసుకొస్తున్న ఈ కథలన్నీ సమాజంలోని అట్టడుగు పొరల్లో కనిపించే వేదనల్నిదృష్టీకరించిన సామాజిక వాస్తవిక చిత్రాలుగా అభివర్ణించవచ్చు. దీనిలో భిన్న వర్గాలకు, భిన్న కులాలకు, భిన్న మతాలకు, భిన్నజెండర్స్ కి, తెలుగు భాషలోని భిన్న మాండలికాలకు ప్రాతినిధ్యం లభించింది' అని తెలిపారు. ఈ వ్యాసం ప్రక్రియ విమర్శలో భాగంగా వస్తుంది. కానీ దీనిలో విశ్లేషణ ప్రధానంగా ఉంది. రచయిత కథల వరుసను బట్టి కాకుండా వయోపరిమితిని బట్టి కథలను విశ్లేషించారు. భిన్న ధోరణులను డయాస్పోరా, ట్రాన్స్ నేషనలిజం వంటి వాటిని చెప్పడం వల్ల ఇది సైద్ధాంతిక విమర్శ అవుతుంది. నూతన ధోరణులను పరిచయం చేసే విమర్శనా వ్యాసాలను ప్రచురిస్తున్నందుకు ఈ పత్రికను అభినందించవచ్చు. దీని వలన కొత్త పాఠకులు కూడా తయారవుతారు. పండితులు కూడా దీనికి ఆకర్షితులవుతారు. లేకపోతే సామాన్యులు మాత్రమే ఉంటారు.

### 3.2.5. పాతికేళ్ల కథ ప్రయాణం

పాతికేళ్ల కథ ప్రయాణం అనే వ్యాసం సాక్షి సాహిత్యం పుటలో జనవరి 18, 2016 న ప్రచురియితమయింది. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకులుగా కథా సాహిత్య ఆధ్వర్యంలో వచ్చిన 155 గురు కథకుల 336 కథలతో 1300 + 1300 పేజీలతో రెండు బృహత్ సంకలనాలను మనసు ఫౌండేషన్ ప్రచురిస్తుంది. వీటి ఆవిష్కరణ జనవరి 24న ఎన్టీఆర్ కళామందిరం, తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాదులో ఉదయం 10 గంటల 30 నిమిషాల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు భిన్న కార్యక్రమాల మధ్యన జరుగుతుంది. ఈ సందర్భంగా ఈ కథ సంకలనాలకు రాసిన సంపాదకీయ వ్యాసంలోని కొంత భాగం ప్రస్తుతం వ్యాసం.

దీనిలో వ్యాసకర్త కథ జీవితమంతా గొప్పది. సమాజమంతా విశాలమైంది అంటూ 25 సంవత్సరాలల్లో వచ్చిన కథలను వాటిని నేపథ్యలను పరిచయం చేశారు. పాతికేళ్ల కాలంలో సమాజంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయని ఈ మార్పులు అన్ని కథల్లోకి తర్జుమా చేయబడిందని పేర్కొన్నారు. ఈ పాతికేళ్ల కాలంలో మొదటి ఐదు సంవత్సరాలు మినహాయిస్తే తర్వాత కాలంలో వచ్చిన కథలో ప్రధానంగా ఇతివృత్తాలు రెండు. ఒకటి గ్లోబలైజేషన్ కారణంగా మానవ సంబంధాల్లో వచ్చిన మార్పులు. రెండోది సమాజంలో వివిధ వర్గాల అస్తిత్వవేదనలు ఇవి స్త్రీవాదం నుండి ప్రాంతీయత వరకు విస్తరించాయంటూ సామాజిక, రాజకీయ మార్పులు కథలో ప్రతిఫలించిన విధానాన్ని తెలిపారు. ప్రపంచీకరణ, అస్తిత్వవాద ధోరణి, డయాస్పోరా వంటి నూతన సిద్ధాంతాలను పరిచయం చేస్తూ వాటిని ప్రతిబింపజేసిన కథల విశిష్టతను తెలియజేశారు. సమాజంలో వచ్చిన సకల మార్పులు ఈ సంకలనంలోని కథల్లో ప్రతిబింబిస్తాయి. సామాజిక చరిత్రకు దర్పనమీ సంకలనం అంటూ నూతన సిద్ధాంతాలను తెలియజేస్తూ కథ సాహిత్య గొప్పతనాన్ని అలాగే నూతన గ్రంథ ఆవిష్కరణ వివరాలను పాఠకులకు అందిస్తూ రాసిన ఈ వ్యాసాన్ని సైద్ధాంతిక విమర్శగా చెప్పవచ్చు.

### 3.2.6. తెలుగులో మామ్ కథలు

తెలుగులో మామ్ కథలు అనే వ్యాసం సాక్షి సాహిత్యం పుటలో జూలై 04, 2016న ప్రచురితమయింది.

ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షల మంది పాఠకుల హృదయాలను రంజింపచేసిన, తెలుగు కథకులెందరికో మార్గదర్శకుడైన మామ్ కథను ఎలనాగ "సోమర్‌సెట్ మామ్ కథలు" అనే పేరుతో తెలుగులోకి అనువదించారు. ఈ పుస్తకం విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ద్వారా ప్రచురితమయింది. ఈ గ్రంథానికి అంపశయ్య నవీన్ ముందుమాట రాశారు. మామ్ కథల గొప్పతనాన్ని వివరిస్తూ అంపశయ్య నవీన్ రాసిన ముందుమాటలోని కొంత భాగమే ప్రస్తుత వ్యాసం.

దీనిలో రచయిత మామ్ కథల వైశిష్ట్యాన్ని అలాగే తెలుగు కథకులపై వారి ప్రభావాన్ని వివరించారు. తెలుగు కథకుల్లో మామ్‌తో గాఢంగా ప్రభావితుడైన కథకుడిగా బుచ్చిబాబును ఉదహరించారు. "ఆయన కథలన్నింటిలోనూ ఒక క్రమం అంటే ఒక మంచి ప్రారంభం, ఒక మంచి మధ్యస్థం, ఒక మంచి ముగింపు ఉంటాయి. ఏ కథలో కూడా అనవసరమైన వర్ణనలు గానీ, సంఘటనలు గానీ, పాత్రలు గానీ ఉండవు. ఒక సంఘటన చుట్టూ తిరిగేదే మంచి కథ అంటాడు మామ్ అలాగే ఆయన రాసిన ఏ కథను కూడా అర్ధాంతరంగా ముగించడు" అని మామ్ రచనా

విధానాన్ని వివరిస్తూ కథావస్తువును పరిచయం చేశారు. మామ్ కథలు ఒక కాలానికి ఒక దేశానికి చెందినవి కావని దేశకాల పరిస్థితులు ఎన్ని మారినా వారి కథలకున్న ఆదరణ తరగదని వివరించారు. "మామ్ కథలు రాసినప్పటి స్థితిగతులు ఇప్పుడు లేవు. చాలా మారిపోయాయి. ఆ మార్పులవల్ల కథ విలువ తగ్గిందనుకోను. ఏ ఒక్క తత్త్వానికి, రాజకీయానికి, జాతి సిద్ధాంతానికీ, జాతి మతాలతో ముడిపడ్డ దృక్పథానికి కట్టుబడిపోక, కేవలం మానవ ప్రకృతిని విశదపరచే కథలవడం వల్ల అవి చారిత్రక మార్పులతో వెనుకబడిపోవు".

ఆయనకు స్వదేశీయులైన ఆంగ్లేయుల పట్ల ప్రత్యేకమైన అభిమానం లేదు. ప్రపంచమంతా రెండు మూడు సార్లు చుట్టిరావడం వల్ల మానవ ప్రకృతిలోని ప్రధాన లక్షణాలను నిశితంగా పరిశీలించి అవగాహన చేసుకొని అన్ని రకాల వారికీ నచ్చే కథావస్తువును ఎన్నుకో గలిగాడు. అదొక అంతర్జాతీయ దృక్పథం అనను నేను, మానవ వ్యవస్థ వ్యక్తీకరణ అని బుచ్చిబాబు పేర్కొన్న అభిప్రాయాన్ని రచయిత ఇక్కడ ప్రస్తావిస్తూ మామ్ కథావస్తువును, ఆయన రచానా దృక్పథాన్ని వ్యక్తిత్వాన్ని వివరించారు.

రచయిత విద్యార్థి దశ నుండే మామ్ కథలకు ఆకర్షితులయ్యారని చెప్తూ నేడు ఆయన కథలను చాలా కాలం తర్వాత ఇలా తెలుగులో చదవడం పట్ల మరింత ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఎలనాగ కేవలం 15 కథలను మాత్రమే అనువదించారని ఇంకా ఎన్నో అద్భుత కథలు ఉన్నాయని వాటిని అనువదించలేకపోయారని ఒకింత అసంతృప్తిని వ్యక్తపరుస్తూనే సూక్ష్మంలో మోక్షంలాగా ఈ కథలు చదివి మామ్ కథారచన ప్రత్యేకతను అవగతం చేసుకోవడానికి ఇదొక మంచి అవకాశంగా పేర్కొన్నారు.

మామ్ కథల్లో వస్తువు, రచనా దృక్పథంతోపాటు ఆయన శిల్ప నైపుణ్యాన్ని గురించి కూడా వివరించారు. మామ్ చాలా కథల్లో 'నేనూ' అంటూ ఉత్తమ పురుషలో చెప్పడం ఆయన శిల్పానికి సంబంధించిన ప్రత్యేకత అంటూ వారి 'ఫస్ట్ పర్శియన్ సింగులర్' అనే గ్రంథాన్ని గురించి ప్రస్తావించారు. ప్రస్తుతం ఎలనాగ అనువాదంలో కూడా 'నేను' అనేది కనిపిస్తుందని వివరించారు.

ఈ విధంగా ఒక ప్రాంతాన్ని, ఒక వ్యక్తికి పరిమితం కానీ ఎన్నో ప్రపంచ మానవ ప్రకృతిని వివరించే కథలు రాసిన మామ్ ప్రపంచ చరిత్రలోనే ఒక గొప్ప కథకుడిలా మిగిలిపోయారు. ఒక తత్త్వానికి కట్టుబడిన కవి కాదు కనుక ఎన్నో సార్వకాలీన నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించిన కథల గురించి రాసిన ముందుమాట సంక్షిప్త రూపం కావున దీనిని సూత్రవిమర్శగా చెప్పవచ్చు. ఈ ముందుమాట ద్వారా మామ్ కథల గొప్పతనం, అలాగే కవి రచనా మూలగ్రంథాన్ని చదవాలనే

ప్రేరణ కలుగుతుంది. ముందుమాటల సంక్షిప్త రూపం కావున ఇది సూత్ర విమర్శ పద్ధతి వ్యాసం. ఇది ఒక వ్యక్తికి, ఒక ధోరణికి, తత్త్వానికి, మనస్తత్వాలను చిత్రిస్తూ రాసిన మామ్ వంటి గొప్ప కథకులు మరొక్కసారి మనందరికి పరిచయం చేయబడ్డారు. అలాగే నూతన అనువాద గ్రంథ వివరాలు పాఠకుడికి అందించారు. ఎలనాగ అనువాదం చక్కటి ధారవలె సాగిపోతుందని వివరించారు.

### 3.2.7. కథానిక ఉపోద్ఘాత వ్యాసాల పట్టిక

ఈ విధంగా ఈ రెండు సాహిత్య పుటల్లో వెలువడిన మరి కొన్ని కథానిక ఉపోద్ఘాతాల వివరాలు కింద పట్టికలో పేర్కొన్నాను

| క్ర. సం. | వ్యాసం పేరు | వ్యాస కర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1 | మన కథలు.. మన వెతలు.. | నందిని సిధారెడ్డి | ఫిబ్రవరి 15, 2016 | నమస్తే తెలంగాణ– చెలిమె |
| 2. | జీవనోత్సాహాన్ని తెలిపే కథలు | ఓల్గా | ఏప్రిల్ 25,2016 | నమస్తే తెలంగాణ– చెలిమె |
| 3. | కతల వెతల రణస్థలి | ఏ. కె. ప్రభాకర్ | జూన్05, 2017 | సాక్షి, సాహిత్యం |
| 4. | కాలం కత్తిపై నడుచుకుంటూ | డా. వి. చంద్ర శేఖర్ రెడ్డి | జూలై 10, 2017 | నమస్తే తెలంగాణ– చెలిమె |

**పట్టిక – 12**

### 3.3. కథానిక వ్యాసాలు–వస్తువైవిధ్యం

దినపత్రికల సాహిత్య పుటల్లో కథావస్తు వైవిధ్యం కనబడుతుంది. విభిన్న వస్తువులకు సంబంధించిన కథా వ్యాసాలను ప్రచురిస్తున్నారు. "కాదేది కవితకనర్హం" అన్నట్టుగా స్పందించే హృదయముండాలే గాని ప్రకృతిలోని ప్రతీది కవితా వస్తువుగా మారుతుంది. అది కవిత్వానికైనా, కథకైన వస్తువు అనంతం. కవి భావనయే వస్తువు. కథకుడి అభిరుచియే కథా వస్తువుకు కారణం. కథకుడు ఎంపిక చేసుకున్న ఇతివృత్తమే వస్తువు. కథా వస్తువు అనేక రకాలుగా ఉంటుంది. సామాజికం, రాజకీయం, ఆర్థికం, స్త్రీవాదం, దళితవాదం, మైనార్టీవాదం, కుటుంబ సంబంధ, ప్రాంతీయం ఇలా కథావస్తువులో వైవిధ్యాన్ని మనం గమనించవచ్చు. ఆయా వస్తువును బట్టి కథల్లో వైవిధ్యం ఏర్పడుతుంది. కావున కథా వైవిధ్యానికి కారణమయిన వస్తువు గురించి మొదట తెలుసుకోవలసిన అవసరం ఉంది.

### 3.3.1. వస్తువు–నిర్వచనాలు

వస్తువుని ఆంగ్లంలో "Content" అని వ్యవహరిస్తున్నారు. వస్తువు గురించి కొంత మంది నిర్వచనాలు ఇచ్చి దీన్నే కొంత మంది 'ఇతివృత్తం' అని కూడా పిలుస్తున్నారు. "ఒకానొక దృగ్విషయంలో ప్రత్యేకంగా నియమబద్ధంగా ఉన్న మూలకాల, క్రమ విధానాల మొత్తమే వస్తువు.

మనిషి, మానవ సంబంధాలు, సామాజిక జీవితం, దానిలోని సమస్త వైవిధ్యాలు, వీటన్నింటి యొక్క కళాత్మక ప్రతిఫలం సాహిత్యంలో వస్తువు అవుతుంది" (లక్ష్మీకాంతం, పింగళి. 1986. సాహిత్య శిల్ప సమీక్ష. పుట.39).

"సాహిత్యం మానవీయమైన ఒక చైతన్య రూపం. ఉత్పత్తి సాధనాల మీద వాటిని ఉపయోగించే సామూహిక శ్రమ మీదా మనిషి అనుభూతితో కూడిన సంబంధం పెట్టుకున్నవప్పుడు సాహిత్య రూపాలు ఏర్పడ్డాయి. ఆత్మరక్షణ, ఆహార సంపాదనల నుంచీ ఆరంభమైన సాంఘిక జీవన క్రమం సాహిత్యంలో వస్తువైంది" (శివశంకర్, పాపినేని. 1996. సాహిత్యం మౌలిక భావనలు. పుట.78).

"సాహిత్య రచన గురించి చర్చించేటప్పుడు రెండు అంశాలు ప్రధానంగా ముందుకు వస్తాయి. ఈ రచన ఏం చెబుతోంది దానిని వ్యక్తీకరించడానికి అనుసరించిన పద్ధతి ఏమిటి అనేవి. రచన ఏం చెబుతుందీ అనేదీ ఆ రచన వస్తువు అవుతుంది. రచనలో ఉండే ప్రధాన కథా స్వభావం ఆ రచన వస్తువు" (నళినీ, యస్.యస్. 2009. పుట.153).

"వార్తకి వాతావరణాన్ని జోడిస్తే వస్తువు తయారవుతుంది. వార్తకు పూర్వాపరాలే వస్తువు. రచయిత శిల్పి అయితే వస్తువు బండరాయి. లోకంలో బండరాళ్ళకు ఎలా కొరత లేదో అలాగే వస్తువుకి కూడా కొరత లేదు. అయితే ప్రతి శిలాఖండమూ ఎలా శిల్పకళాఖండం కాలేదో అలాగే మనిషి జీవితంలోని ప్రతి సంఘటన కథకు వస్తువు కాలేదు" (వీర్రాజు, శీలా. 1999. పుట.51) అని శీలా వీర్రాజు కథావస్తువు గురించి తన అభిప్రాయాన్ని తెలిపారు.

"కథానిక రచనకు ఉపకరించే వస్తువును స్ఫురింపజేసేది బీజం. ఆకర్షకరమైన ఒక సంఘటనగాని, అద్భుతమైన సన్నివేశం గాని, అందమైన దృశ్యం గాని, చిత్రమై వ్యక్తిత్వం గాని, చమత్కరమైన మాటగాని, అపురూపమైన అనుభూతిగాని హృదయంలో స్పందన కలిగించి, ఆలోచనను రేకెత్తించి, ఊహను ఉద్దీపనం కావించినపుడు కలిగే ప్రేరణే రచనయిత మనస్సులో కథా బీజంగా నాటుకుంటుంది. ఇది మనస్సులో నాని నాని చిన్నగా మొలక వేసినప్పుడు వస్తువుగా భాసిస్తుంది. కాబట్టి వస్తు స్ఫోరకతే కథాబీజ లక్షణమని చెప్పవచ్చు" (దక్షిణామూర్తి, పోరంకి. 2009. పుట.181) అని కథావస్తువుకు, కథాబీజానికి మధ్య భేదాన్ని వివరించారు. కొందరు ఇతివృత్తాన్ని కథావస్తువుని సమానార్థకాలుగా వాడుతున్నారు. కానీ వాటిలో కూడా స్వల్ప భేదము ఉందంటారు పోరంకి దక్షిణామూర్తి.

"సారె మీద కుమ్మరి పెట్టిన ముద్ద కథావస్తువు. ఆ మట్టిముద్ద నొక ముచ్చటగొలిపే పాత్రగా తీర్చిదిద్దడానికి ఆ కళాకారుడి చేతిలో భాసించే కల్పనా శిల్పమే ఇతివృత్తం. ఆ మృత్తికా ఖండానికీ ఈ మృణ్మయ పాత్రకూ ఉండే భేదమే కథావస్తువుకూ, ఇతివృత్తానికీ ఉండే భేదం (దక్షిణామూర్తి, పోరంకి. 2009. పుట.199).

"కథా వస్తువు ఊహించినదే కావచ్చు లేదా జరిగినదే కావచ్చు. ప్రేమ, ద్వేషం, ఈర్ష్య, సహనం, ధర్మం, త్యాగం మొదలైన జీవితాన్ని బహుళంగా కదిలించే బలీయమైన ప్రేరణలు అన్నీ కథావస్తువులే. అవి ఎప్పటికీ మానవ హృదయాన్ని ఆకర్షిస్తాయి. దేశభాష, నాగరికత మార్పులేవి వాటికి సోకవు. అవికాక జీవితాన్ని సంక్షోభింపచేసే అవస్థలు ఎన్నో మనిషికి తారసిల్లుతాయి. ఒక్కొక్కప్పుడు మానసికంగా ఎన్నో సంఘర్షణలు తటస్థిస్తాయి. ఎక్కడో ఒకచోట జీవిత పథంలో చీలు బాటల వద్ద చూస్తూ నిలబడవలసి వస్తుంది. "ఏకతో గురువచనం అన్యతోదయిత దర్శన సుఖమితి" అంటూ విధికీ ప్రేమకీ మధ్యనూ, పేరు ప్రతిష్టలకి దయాదాక్షిణ్యాలకీ మధ్యనూ ఎన్నో నిర్ణయించుకోవలసిన పరిస్థితులు ఏర్పడతవి. అటువంటి అవస్థలు రచయితకి సంప్రాప్తించి ఉండవచ్చు లేదా ఒకరికి ఆ పరిస్థితు లేర్పడడం తాను చూచి యుండవచ్చు లేదా ఊహించి యుండవచ్చు. సగం ఘట్టం జరిగినదీ, సగం ఘట్టం ఊహించినదీ అయి ఉండవచ్చు" (శార్వరీ (సంక).1992. పుట.12). అని కథావస్తు సంబంధ అభిప్రాయాన్ని కల్యాణ సుందరీ జగన్నాథ్ వారి కథలు రాయడం ఎలా అనే వ్యాసంలో తెలిపారు

"కథా వస్తువు దీన్నే "ఇతివృత్తం" అని కూడా అంటారు. ఇదే కథకు ఆయువుపట్టు. జీవికి ప్రాణం ఎల్లాంటిదో చిన్నకథకు ఇతివృత్తం అల్లాంటిది. కథ వ్రాసే ముందు మనస్సులో కథా వస్తువు బాగా నలిగి నుజ్జునుజ్జయి కట్టడానికి కాంక్రిటుకు మల్లే గట్టి పడాలి. పునాది బలమైనదైతేనేగా భవనం కలకాలం నిలిచేది. కథావస్తువును ఎన్నుకొనెటప్పుడు రచయిత తగు జాగ్రత్తలు తీసికోవాలి. కథావస్తువు నిత్యనూతనమై ఉండాలి అది అంతకుముందే మరొకళ్ళ కథకు ఇతివృత్తమై ఉండరాదు" (శార్వరి (సంక). 1992. పుట.85). అని తాళ్ళూరు నాగేశ్వరరావు 'కథా కన్యకు ముస్తాబు' అనే వ్యాసంలో పేర్కొన్నారు అలాగే కథా వస్తువును ఎలా ఎంపిక చేసుకోవాలో కూడా వారు ఈ వ్యాసంలో వివరించారు.

"నిత్యమూ మనం చూసే సంఘటనలూ, పొందే అనుభూతులూ, జరిగే వింతలూ, సామాజిక సమస్యలూ, పరిణామాలూ, ప్రకృతి దృశ్యాలూ, ఆర్థిక అసమానత్వపు ఫలితాలూ, రాజకీయపుటెత్తులు, రాగద్వేషాల దాగిలిమూతలూ, మానవ స్వభావపు లోతులు, నాగరికపు

నాజూకులు, శారీరక ఉన్మత్తతలూ, అపరాధ పరిశోధనలు, హాస్యరస ఘట్టాలు మంచికీ, చెడుకీ మధ్య సంఘర్షణలూ, పత్రికల్లో పడే వార్తలూ, విన్నవీ, కన్నవీ మొదలైనవెన్నో కథావస్తువులుగా తీసుకోవచ్చు. కాని జ్ఞాపకం పెట్టుకోవాల్సిన విషయమేమిటంటే ప్రతి సంఘటననూ, సమస్యనూ, సత్యాన్నీ, అనుభూతినీ, పరిణామాన్నీ, ఫలితాన్నీ నిశితమైన విమర్శనా దృష్టితో చూడాలి. పాఠకుడిని బలంగా ఆకర్షించి, సులభంగా జ్ఞాపకం పెట్టుకోగల ఇతివృత్తాన్నే తీసికోవాలి" (శార్వరి (సంక). 1992. పుట.86).

"కథావస్తువు రచయిత జీవితంలో నుంచి కానీ లేదా రచయితకు తెలిసిన ఇతరుల జీవితంలో నుంచి కానీ పుట్టవచ్చు. కథకు జీవితం ముడి సరుకు అని చాలా మంది అంటూ ఉంటారు..." (వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 1995. పుట.21 & 23). "కథలో కేంద్ర బిందువు కథాంశం. కథాంశానికీ, రచయితకూ మధ్య ఉన్న సంబంధం ఉద్దేశం. కథా, కథాంశమూ, ఉద్దేశమూ వస్తువుకు సంబంధించినవి".

ఈ విధంగా పలువురు వస్తువును గురించి వారి అభిప్రాయాలను తెలిపారు. సుప్రసిద్ధ కథకులు ఎందరో తమ కథన నైపుణ్యంతో వాస్తవ సంఘటనలను కథలుగా మలిచారు. వస్తు విషయంలో కథకులందరు తమ పరిసరాల్ని, సమకాలీన సమాజాన్ని నాటి నాగరికతను పూర్తిగా ఉపయోగించుకున్నట్లు తెలుస్తుంది. సమకాలీన సమాజంలో జీవించే వారి వైయక్తికమైన ఆశా నిరాశలు, సుఖ దుఃఖాలు, సాఫల్య వైఫల్యాలు మొదలైనవి కథా వస్తువులుగా రూపొందాయి. కుటుంబ జీవనంలో రాజకీయ ప్రభావాల్లో, సామాజిక రంగంలో, వృత్తి ఉద్యోగాల్లో, సంస్కృతి సంప్రదాయాల్లో ఎదురయ్యే అనేక అంశాలు వాటికి తోడయ్యాయి. ఈ విధంగా కథావస్తువు ఎంతో వైవిధ్యతను సంతరించుకుంది.

నేడు వెలువడుతున్న దినపత్రికల సాహిత్య పుటల్లో వైవిధ్యభరితమైన కథావస్తువు సంబంధ వ్యాసాలు కనిపిస్తున్నాయి. వస్తువుకు ప్రాధాన్యతనిస్తూ వ్యాసాలను ప్రచురిస్తున్నారు. ఈ విధమైన వ్యాసాలు మనకు సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లో కూడా కనిపిస్తున్నాయి. నా పరిశోధన పరిధియైన 2016, 2107 ఈ రెండు సంవత్సరాల్లో వచ్చిన కథా వ్యాసాలు పరిశీలిస్తే వీటిలో అధికంగా ప్రాంతీయత మరియు ముస్లిం ప్రజల జీవితచిత్రణ అనేవి ప్రధాన వస్తువులుగా కనిపిస్తున్నాయి. కావున వాటిని 1) ప్రాంతీయవాద కథా వ్యాసాలు, 2) మైనార్టీవాద కథా సంబంధ వ్యాసాలు అనే ఉప విభాగాల కింద విభజించి విశ్లేషించాను.

### 3.3.2. కథానిక వ్యాసాలు–ప్రాంతీయత

నమస్తే తెలంగాణ దినపత్రిక తెలంగాణ ప్రాంత ఆత్మగౌరవంగా ప్రారంభమయింది. కావున పత్రిక ప్రారంభం నుండి ఇది తెలంగాణ ప్రాంతానికి తెలంగాణ ప్రజల జీవిత చిత్రణ, సంస్కృతి వంటి విషయాలను అధిక ప్రాధాన్యతనిస్తుంది. కథా సంబంధ వ్యాస ప్రచురణలో కూడా ఈ లక్షణం కనబడుతుంది. తెలంగాణ ప్రాంతీయతను, ప్రజల జీవన విధానాన్ని, సంస్కృతిని ప్రతిబింబింపజేసిన కథా వస్తువులను పరిచయం చేస్తూ వ్యాసాలను ప్రచురిస్తున్నారు. ప్రాంతీయ అస్తిత్వవాద ధోరణిలో కథా సంబంధ వ్యాసాలను ప్రచురిస్తున్నారు. ఇంతకాలం వలస పాలన తెలంగాణ సంస్కృతి, నాగరికత, జీవిత చిత్రణలకు సాహిత్యంలో చోటు లభించకపోవడంతో తమ ప్రాంత ఔన్నత్యాన్ని తెలిపే తెలంగాణ సాహిత్యాన్ని పాఠకులకు అందించే దిశగా చెలిమె సాహిత్య పుట కృషి చేస్తుంది. అందుకుగాను ప్రాంతీయత నేపథ్యంలో వచ్చిన కథా సంబంధ వ్యాస ప్రచురణతో తెలంగాణ ప్రాంత గొప్పతనాన్ని ఇంతకాలం మరుగుపడిన కవుల వైశిష్ట్యాన్ని లోకానికి చాటి చెపుతున్నారు. ఒక ప్రాంతం అణచివేతకు గురికావడం లేదా ఆ ప్రాంతంలో సాహిత్యమే లేదనే వాదన వినిపించినప్పుడు ఆ ప్రాంత ఔన్నత్యాన్ని చాటిచెప్పే లక్ష్యంగా ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ ప్రారంభమయింది. దీనికి సంబంధించిన వివరణ రెండవ అధ్యాయంలో తెలియజేసాను. కావున దానిని ప్రస్తావించడం లేదు. ఇలాంటి ప్రాంతీయత భావంతో వెలువడిన కథా వ్యాసాలు మనకు సాక్షి పత్రికలో కూడా అప్పుడప్పుడు కనిపిస్తున్నాయి. కానీ చాలా అరుదనే చెప్పవచ్చు. నమస్తే తెలంగాణ దినపత్రికలోనే ప్రాంతీయ వస్తు సంబంధ వ్యాసాలు అధికంగా కనబడుతున్నాయి.

#### 3.3.2.1. ఆధునిక జీవన 'నిశ్శబ్ద వేదన'

వాణీ దేవులపల్లి రాసిన "ఆధునిక జీవన నిశ్శబ్ద వేదన" అనే వ్యాసం నమస్తే తెలంగాణ చెలిమె పుటలో జూన్ 27, 2016న వెలువడింది.

దీనిలో వ్యాసకర్త ముదిగంటి సుజాతరెడ్డి కథల్లోని వస్తువును తెలుపుతూ తెలంగాణ ప్రాంత ప్రజల వాస్తవిక జీవన కథలుగా మలిచిన విధానాన్ని వివరించారు.

సామాజిక వాస్తవికత సాహిత్య సృజనకు పట్టుకొమ్మ తెలంగాణ కథ. ఇక్కడ ప్రజల సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులనే గాక ఆయా పరిస్థితుల్లో ప్రజల జీవితాలను, కష్టాలను, కన్నీళ్ళనూ చిత్రించింది అని చెప్తూ తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ పోరాట నేపథ్యంలో వాస్తవిక

జీవిత చిత్రణ చేసిన కథకురాలు ముదిగంటి సుజాతారెడ్డి అని తెలుపుతూ వారు రాసిన కథా సంపుటాలను పరిచయం చేశారు.

"ఆమె కథలు విభిన్న కథా వస్తువులతో తెలంగాణ భాషలో అందమైన నుడికారంతో ఆకట్టుకుంటాయి. ఆమె కథల్లో ముఖ్యంగా గ్రామీణ పేదరికం, కనుమరుగవుతున్న పల్లెలు, ఉపాధి వలసలు, మృగ్యమైపోతున్న మానవ సంబంధాలు, అదృశ్యమైపోతున్న మానవీయ విలువలు, స్త్రీల జీవితంలోని సంక్లిష్టత, సంఘర్షణలు అడుగడుగునా కన్పిస్తాయి. ఈ కథలు మానవ జీవితంలోని వివిధ పార్శ్వాలను స్పృశించి, ఒక తాత్త్విక సంవేదనను వ్యక్తం చేస్తాయి" అంటూ వారి కథావస్తువును వివరించారు.

సుజాతారెడ్డి మొదటి కథాసంపుటి 'విసుర్రాయి'ని పరిచయం చేస్తూ స్త్రీ శ్రమ శక్తికి ప్రతిరూపాలు విసుర్రాయి! ఈ సంపుటిలోని అన్ను కథలూ తెలంగాణ సామాజిక సంక్షుభిత స్థితికి అద్దంపట్టి, స్త్రీల జీవితాల్లోని సంఘర్షణను ఎత్తి చూపుతాయి. తెలంగాణ భాషలో, యాసలో చక్కని శిల్పంతో, వివిధ సామాజిక కోణాల్ని ప్రతిబింబిస్తాయని చెప్తూ నిజానికివి కథలు కావు. ఛిద్రమైన తెలంగాణ బతుకు చిత్రాలు అన్న బి.యస్. రాములు మాటలను ఉదహరించారు.

ప్రపంచీకరణ దుష్ఫలితాల గురించి రాసిన అద్భుతమైన కథలు 'మింగుతున్న పట్నం' సంపుటి అంటూ అందులో 17 కథలు ఉన్నాయని దీనిలో చివరి కథ 'నిశ్శబ్దం నిశ్శబ్దం!'. దీనిలో కథనం ప్రపంచీకరణను, దాని పర్యవసానాలను మాత్రమేగాక, పురుషస్వామ్య సమాజంలోని లొసుగులను ప్రస్ఫుటిస్తుందని చెప్తూ కథా వస్తువును, నేపథ్యాన్ని వివరించారు.

తరాలు మారినా స్త్రీ, పురుషుల్లో అంతరాలు, అసమానతలు, మారని సమాజ దుస్థితిని, తిరోగమన దశనూ ఈ కథ చిత్రిస్తుంది. సుజాతారెడ్డిగారి కథలు స్త్రీ దృక్కోణంతో రాసినా ముగింపు ఆశావహంగా ఉండకపోవడం నిరాశ పరుస్తుందనే విమర్శ కూడా ఉంది. అయితే పరిష్కార మార్గాన్ని పాఠకులకు వదిలేసి సమాజంలోని వాస్తవ స్థితిని చూపడం రచయిత్రి ముఖ్యోద్దేశంగా కనిపిస్తుందనే అభిప్రాయాన్ని వ్యాసకర్త వ్యక్తపరిచారు. ఈ విధంగా తెలంగాణ ప్రాంత ప్రజల జీవితాన్ని వస్తువుగా తీసుకొని వాస్తవిక జీవన చిత్రణను కథలుగా మలిచారు. కావున ఇది ప్రాంతీయ, వస్తు సంబంధ వ్యాసం అవుతుంది.

### 3.3.2.2. ప్రాంతీయ కథానిక వ్యాసాల పట్టిక

ప్రాంతీయతను చిత్రించే కథానిక వ్యాసాలు మనకు చెలిమె పుటలో మరి కొన్ని కనిపిస్తున్నాయి. వాటి వివరాలను కింది పట్టికలో పొందుపరిచాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | ప్రాంతీయత పరిపోషించే కథలు | విరించి | నవంబర్ 14, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | కథల్లో ప్రాంతోచిత భాష | డా॥ బి.వి.ఎన్. స్వామి | జనవరి 25, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 3) | ఎచ్చమ్మ చెప్పిన మిఠాయి రాములు కథ | అనిశెట్టి రజిత | అక్టోబర్ 02, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 4) | హోలుదు తెలంగాణ అల్లుడు | సంగనభట్ల నరసయ్య | డిసెంబర్ 25, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక – 13**

### 3.3.3. కథానిక వ్యాసాలు–మైనారిటీ సాహిత్యం

తెలుగు సాహిత్యంలో ఎన్నో ఉద్యమాలు ఎన్నో వాదాలు పుట్టి పెరిగాయి. వాటిలో ముస్లిం వాదం ఒకటి. దీనినే మైనార్టీ వాదమనే వ్యవహారమూ కలదు. ముస్లిం ప్రత్యేక వేదనయే తెలుగు సాహిత్యంలో మైనార్టీవాదానికి ఆధారమైంది. మొదట దళితవాదంలో భాగమైన ఈ ముస్లింవాదం బాబ్రీ మసీదు విధ్వంసం జరిగిననాటి నుండి ఓ స్వతంత్రవాదంగా రూపొందింది. ముస్లింల ఆత్మగౌరవం, మత దృక్పథం మొదలైనవి వీరి కవితా వస్తువులయ్యాయి.

ముస్లిం సమాజంలో పేరుకొనిపోయిన రుగ్మతలను, ఈనాటి సమాజం అంగీకరించిన సంప్రదాయాలను ప్రశ్నించిన ముస్లిం కవులూ ఉన్నారు. స్త్రీ స్వేచ్ఛను ఆటంకపరిచే బురఖా వ్యవస్థను నిర్భయంగా విమర్శించిన షాజహాన్ లాంటివారు ఉన్నారు. ముస్లిం రచయితల్లో దిలావర్, యాకూబ్, అఫ్సర్, రజియా, కరీముల్లా వంటి ఎందరో కవులు ఎన్నో కవితా సంకలనాలను, కథానికలను, నవలలను రాసి ముస్లింవాద సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ముస్లిం ప్రజల జీవితాన్ని చిత్రించే కథా సంబంధ వ్యాసాలు మనకు ఈ రెండు పత్రికల సాహిత్య పుటల్లో కనిపిస్తున్నాయి.

#### 3.3.3.1. నవాబుల సంస్కృతికి ప్రతిరూపాలు–'చార్మినార్' కథలు

ద్వా.నా. శాస్త్రి రాసిన నవాబుల సంస్కృతికి ప్రతిరూపాలు 'చార్మినార్' కథలు అనే వ్యాసం నమస్తే తెలంగాణ చెలిమె సాహిత్యపుటలో జూన్ 06, 2016న ప్రచురితమయ్యింది.

తెలంగాణ ప్రాంత ప్రముఖ కథకులు నెల్లూరి కేశవస్వామి రాసిన 'చార్మినార్' కథల సంపుటిలో చార్మినార్ చుట్టూ ఉన్న ముస్లిం సంస్కృతి, జీవితాలను చిత్రించిన విధానాన్ని ఈ వ్యాసంలో తెలిపారు.

1951 గోల్కొండ నవాబు మహమ్మద్ ఖులీ ఖుతుబ్‌షా చార్మినార్‌ని నిర్మించాడు. పాతబస్తీ అని పిలువబడే ఈ ప్రాంతము ఒకప్పటి ఫ్యూడల్ సంస్కృతికి, ఆధునిక సంస్కృతికి మంచిచెడుల సాహిత్యరూపమే ఈ కథలు. ప్రతి కథలోను ముస్లిం పాత్రల ప్రాధాన్యత కనిపిస్తుంది. 1975–80 మధ్యకాలంలో రాయబడిన చార్మినార్ కథలు ముస్లింవాద కథలుగా కనబడతాయని వ్యాసకర్త తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. నేటి ముస్లింవాదంలో తీవ్ర నిరసన, ఆక్రోశం, ఆవేశం కనబడతాయి. కానీ కేశవ స్వామి రాసిన కథల్లో ఇవేమి కనిపించవు. సంయమనం, సభ్యత, నిశ్శబ్ద విప్లవం ప్రధానంగా సాగిన కథలివి. అసలైన అభ్యుదయ ముస్లిం కథలుగా వీటిని వ్యాసకర్త అభివర్ణించారు. ఈ కథలు ఇంత సహజంగా వెలువడటానికి కారణం కేశవస్వామి ముస్లిం మిత్రులతో, వారి ఆచారాలతో గాఢమైన అనుబంధాన్ని కలిగి ఉండటమే.

ముస్లిం దైనందిన జీవిత విధానాలను బాగా ఆకలింపు చేసుకొని అత్యంత సహజంగా రాయబడిన కథలు ఇవి. వాతావరణ కల్పనలోనూ, సన్నివేశ కల్పనలోనూ, సంభాషణాల్ని వడిగా నడిపించటంలోను, కథ ముగింపులోను కేశవస్వామి అందె వేసిన చేయి అంటూ చార్మినార్ కథల సంపుటిలో కథల వస్తువు వివరించి వాటి విశిష్టతను, రచయిత రచనా నైపుణ్యాన్ని వివరించారు. దీనిలో నవాబుల సంస్కృతిని, ముస్లిం వృధార్ధ జీవిత యథార్థ దృశ్యాన్ని కథలుగా మలిచిన విధానాన్ని తెలుపుతూ మొదటి కథ అయిన 'విముక్తి', 'కన్నెరికం', 'రూహీ ఆపా', 'షరీఫా' వంటి కథలను అలాగే మతం, వివాహం, పంతాలు, ఆచారాల మధ్య గల సంఘర్షణను చిత్రించే 'కేవలం మనుషులం' వంటి కథావస్తువు, కథా సంగ్రహాన్ని తెలిపారు.

చార్మినార్‌లోని కథలన్ని మానవత్వానికి కేంద్ర బిందువుగా రాయబడినవే. దురాచారాలనూ, ఆధిపత్యాలూ, తీవ్ర వ్యసనాలు... ఇవే మానవత్వానికి మాయని మచ్చలని చాటి చెప్పిన మంచి కథకులు నెల్లూరి కేశవస్వామి. ఈ కథల్లో ఉర్దూ పదాలకు రచయిత బ్రాకెట్లో అర్థాలివ్వడం చెప్పుకోదగిన విషయం అంటూ ఇది పాఠకులకు సౌకర్యంగా ఉంటుందని ప్రస్తుతం ప్రాంతీయ భాషల్లో కథలు, కవితలు వెలువడుతున్నాయి. వీటిలో కూడా తమ ప్రాంతపు ప్రత్యేక పదాలను వాడుతున్నప్పుడు బ్రాకెట్లో అర్థాలివ్వటం సముచితంగా ఉంటుందని వ్యాసకర్త తన అభిప్రాయాన్ని తెలిపారు.

ముస్లిం ప్రజల వాస్తవిక జీవితాన్ని కథలుగా మలిచి వారి జీవితాన్ని కళ్లముందుంచిన మహా కథకులు నెల్లూరి కేశవస్వామి. కానీ ఇంత కాలం మరుగున దాగిన గొప్ప రచయితని చెలిమె పటు పాఠకులకు మరొక్కసారి ఆయన గొప్పతనాన్ని, రచనా నైపుణ్యాన్ని పరిచయం చేసింది.

### 3.3.3.2. మైనారిటీ కథానిక వ్యాసాలు పట్టిక

ముస్లిం ప్రజల జీవిత చిత్రణ గల మైనార్టీ కథావస్తు సంబంధ వ్యాసాలు మనకు చెలిమె పుటలో మరికొన్ని కనిపిస్తున్నాయి. వాటి వివరాలను కింద పట్టికలో పొందుపరిచాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | జీవనోత్సాహాన్ని తెలిపే కథలు | ఓల్గా | ఏప్రిల్ 25, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | అస్తిత్వ భావాల కథాహారం | డా॥ కె.ఎన్. మల్లీశ్వరి | మే 01, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 3) | చిన్న కథ – పెద్ద ప్రపంచం | అఫ్సర్ | మే 15, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 4) | తెలుగు కథకు చార్మినార్ నెల్లూరి | డా॥ దేవరాజు మహారాజు | ఆగస్టు 21, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక –14**

## 3.4. కథాశిల్ప సంబంధ వ్యాసాలు

సాహిత్య పుటల్లో కథాసంబంధ వ్యాసాల్లో కనిపించే మరొక వైవిధ్యం కథా శిల్ప సంబంధ వ్యాసాలు. కథా రచనలోని మెలకువలను తెలుపుతూ కథా రచన పద్ధతులను వివరిస్తూ శిల్ప కథ సంబంధ వ్యాసాలను ప్రచురిస్తున్నారు. కేవలం వస్తు సంబంధ వ్యాసాలే కాకుండా శిల్ప చర్చ సంబంధ వ్యాసాలు మనకు సాహిత్య పుటల్లో కనిపిస్తున్నాయి. సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య పుటలు కూడా ఈ రకమైన కథా శిల్ప వ్యాసాలను ప్రచురిస్తున్నారు. ఈ వ్యాసాల ద్వారా నూతన కథకులకు కథా సంబంధ రచనలపై అవగాహనతోపాటు కథాశిల్ప పద్ధతులు తెలుసుకునే అవకాశం కలుగుతుంది. కథా శిల్ప సంబంధ వ్యాసాలను విశ్లేషించే ముందు అసలు శిల్పం అంటే ఏమిటో చర్చించుకోవాలి.

### 3.4.1. శిల్పం–నిర్వచనాలు

'శిల్పం' విషయంలో కవులూ, విమర్శకులూ ఎన్నో నిర్వచనాలను చేశారు. ఆంగ్లంలోని 'Technique' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో శిల్పం అనే పదాన్ని వాడుతున్నారు.

'వస్తువు ఏ రూపంలో అభివ్యక్తం అవుతుందో ఆ రూపాన్ని 'శిల్పం' అంటారు. ప్రక్రియ భావ ప్రతిమలు, భాష శిల్పంలో ముఖ్యమైన అంగాలు. ఈ మూడు అంశాలన్ని కలిపే 'శిల్పం' అంటారు" (శివశంకర్, పాపినేని. 1996. పుట.79).

"వస్తువుని నలుగురు నాలుగు విధాల దర్శించవచ్చు. దర్శనంలో ఇలా భిన్నత్వం ఉండడం వల్ల వస్తువూ, శిల్పమూ అనే విచక్షణ కలుగుతోంది ఇది భ్రమ. వస్తువుకి ఆకృతి లేదు. రచయిత దర్శనమే వస్తువుకి ఆకృతి కల్పిస్తుంది" (మధుసూదనరావు, త్రిపురనేని. 1987. పుట.13). ఈ విధంగా శిల్పాన్ని గురించి భిన్న నిర్వచనాలు కనిపిస్తున్నాయి. శిల్ప నిర్వచనాల ఆధారంగా శిల్పానికుండే లక్షణాలను ఎస్. శరత్ జ్యోత్స్నరాణి వారి స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత వస్తువు, రూపం, శిల్పం గ్రంథంలో కింది విధంగా పేర్కొన్నారు. వాటి లక్షణాలు.

1) కవి సృజన శీలతలో గల గొప్పతనాన్ని బట్టి అభివ్యక్తం కావడం.
2) శిల్పాన్ని 'కళ' అని కూడా వ్యవహరించడం.
3) వస్తువు, రూపం సరైన రీతిలో అభివ్యక్తం అయ్యేటప్పుడు దానిలో ఏదో ఒక శిల్ప పద్ధతి తప్పకుండా ఉండడం.
4) శిల్పంలో భాష, అలంకారాలు, శైలీ, సంవిధానాలు ఇమిడిపోతాయి. కొన్నిసార్లు వాటి ద్వారా కూడా 'శిల్పం' శోభిస్తుంది.
5) కవితలోని వస్తువు, రూపం ఎన్నుకోవటాన్ని బట్టి కూడా శిల్పం ఆధారపడుతుంది. సరైన 'శిల్పాన్ని' ఎన్నుకుంటే ఔచిత్యవంతంగా పాఠకునికి చేరి, కవి ప్రయోజనం నెరవేరటంలో సహకరించడం.
6) వస్తువు, రూపాలపైనే 'శిల్పం' ఆధారపడుతుంది. అవి శిల్పంపై ఆధారపడే సందర్భాలు కూడా కనిపిస్తుంటాయి.

(శరత్ జ్యోత్స్నరాణి, ఎస్. 2003. పుట.27–28)

కథా శిల్పాన్ని వివరిస్తూ పలువురు కవులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. బుచ్చిబాబు"కథలు వ్రాయడం ఎలా?" అనే వ్యాసంలో కథా శిల్ప సంబంధ అభిప్రాయాన్ని తెలిపారు. "ఖండ కావ్యానికి అవసరమైన దీక్ష, నిశ్చల మనస్తత్వము కథానికా రచనకుండాలి. నిత్య వ్యవహారంలో ప్రయోగించే ఉత్తమాటలు పోగుచేసి వ్రాసెయ్యడం సులభమే, కాని అందులో సరియైన పదాలని వెదికి కూర్చడం, పొదగడం, చెప్పదలచుకున్న దాని తీక్షణంగా చెప్పడం – ఇదే

శిల్పం. దీని వెనక ఊహాబలం, ఆలోచన, పరిశీలన, అంతరంగ జగత్తులో తపస్సు – ఇన్ని జరిగితే గాని, ఆ శిల్పానికి ప్రాణం రాదు". (శార్వరి (సంక.). 1992. పుట.33)

"వస్తువును మలిచే విధానం శిల్పం (Mechanism). దీనినే రచనా సంవిధానం (Treatment) అనవచ్చు. ఏ విధంగా వివిధ పాత్రలతో సన్నివేశాలు అల్లి సంఘటనలతో ఉత్కర్ష కల్పించి ఎక్కడ అంతం చేస్తే పఠితకి రసానుభవం కలుగుతుందో కథకుడు భావన చేసి వస్తువుకి రూపకల్పన ఇస్తాడు" అని హితశ్రీ "కథా లక్షణాలు" అనే వ్యాసంలో నిర్వచించారు (శార్వరి (సంక.). 1992. పుట.97). దీని కొనసాగింపుగా శిల్పాన్ని వివరిస్తూ "శిల్పం కథకుడి మంత్రదండం, రచయిత ఉపజ్ఞ కథా కథన శిల్పంలో వ్యక్తమవుతుంది. శిల్ప సౌందర్యం పఠితని మంత్రముగ్ధుణ్ణి చేస్తుంది. ఆ ఆనందంలో కథలో ఏమైనా దోషాలున్నప్పటికీ అతడికి తోచవు. ఆకాశం చుక్కలతో తళుక్కుమంటే సంతోషంతో పరవశిస్తాము. ఏమూలో నల్లని మబ్బులున్నా చూసేదెవరు? కథ ఎత్తుకోవడంలో, నడపడంలో, ముగించటంలో శిల్ప విన్యాసం ద్యోతకమవుతుంది. కనిపించీ కనిపించని అందంలా, వినిపించో వినిపించని రాగంలా సహృదయుడి మనసులో మెదుల్తూ అతని ఊహని కవ్విస్తూ, ఉత్కంఠని రేకెతిస్తూ, రసభావాలు ధ్వనిస్తూ శిల్పసహాయంతో సవిలాసంగా కథ నదీ సుందరిలా ముందుకి సాగిపోతుంది. అందులో తీర్థమాడినవాడు ధన్యుడు" (శార్వరి (సంక.). 1992. పుట.99).

1) "కథ, కథాంశమూ, ఉద్దేశమూ వస్తువుకు సంబంధించిన అంశాలైతే కథాసంవిధానము (Plot), పాత్రలూ (Characters), నేపథ్యమూ (Setting), దృష్టికోణమూ (Point of view), కథనమూ (Mode of Narration) శిల్పానికి సంబంధించిన అంశాలు".

2) "కథా వస్తువు గమ్యమే ఉద్దేశం. ఉద్దేశాన్ని కళగా మార్చే పరుసవేది శిల్పం లేదా రూపం" (వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 1992. పుట.23).

ఈ విధంగా కవులు, విమర్శకులు శిల్పాన్ని గురించి వివరించారు. పై నిర్వచనాల ఆధారంగా శిల్పమంటే పాఠకుడిని ఆకర్షించే విధంగా కథా వస్తువును మలిచే విధానమే శిల్పమని అర్థమవుతుంది. ఇలాంటి కథా శిల్పం యొక్క ప్రత్యేకతను కథా శిల్ప పద్ధతులను తెలియజేస్తూ వచ్చిన కథా శిల్ప సంబంధ వ్యాసాలు మనకు సాక్షి, నమస్తే తెలంగాణ రెండు పత్రికల్లోను కనిపిస్తున్నాయి. ఈ వ్యాసాల ద్వారా రచయితలు, పండితులు, కథకులు కథను రాసే పద్ధతులను, శిల్ప సంబంధ చర్చను చేస్తూ పాఠకులకు తెలియజేసారు. ఈ వ్యాసాలను విశ్లేషించుకున్నట్లయితే ఈ విషయం మనకు అవగతమవుతుంది.

### 3.4.2. నా కథారచనలోని రహస్యాలు

'నా కథారచనలోని రహస్యాలు' అనే వ్యాసం సాక్షి సాహిత్యం పుటలో జూన్ 13, 2016న వెలువడింది. బుచ్చిబాబు 'కథలు వ్రాయడం ఎలా' అనే సంకలనం కోసం రాసిన వ్యాసానికి ఈ వ్యాసం సంక్షిప్త రూపం. బుచ్చిబాబు (జూన్ 4న) శత జయంతి సందర్భంగా ఈ వ్యాసాన్ని ప్రచురించారు.

దీనిలో రచయిత కథారచన పద్ధతుల గురించి చెప్తూ కథలు ఎల్లా వ్రాయాలో చెప్పడం నేను కథలు ఎల్లా వ్రాస్తానో చెప్పడమే అవుతుంది. ప్రతి రచయిత తాను వ్రాసే పద్ధతిని సమర్థిస్తూ, అందులోంచి కొన్ని సూత్రాలను ప్రతిపాదించి ఒక వీలునామా దిగవిడిచే ప్రమాదం ఉంది. గనుక, కథలు ఎల్లా వ్రాయాలో చెప్పడం కంటె నేనెల్లా వ్రాస్తానో చెప్పడం సముచితం అనుకుంటా"నని రచయిత తన కథా రచనా పద్ధతిని ఆధారంగా చేసుకొని కథారచన పద్ధతులను వివరించారు.

జీవితంలో ఎదుర్కొన్న యథార్థాన్ని సాహిత్యంలో ఎదుర్కొంటే హర్షించడు పాఠకుడు. అతనికి కావాల్సింది కళానుగుణమైన సత్యం, నగ్న సత్యం కాదని చెప్తూ నిత్య జీవితంలో సంఘటనకీ, కథలో సంఘటనకీ ఇట్లాంటి తేడా ఉండి తీరాలనే పాఠకుడిని రచయిత గౌరవిస్తానంటారు. వ్రాతలో ఆవేశానికి, ఉద్రేకానికి లొంగిపోవటం తనకిష్టమే అయినా, పూర్తిగా అందులో మమేకం అయి, జిజ్ఞాస పోగొట్టుకోవడం తన కిష్టంలేదని చెప్తారు. కథలో వ్యక్తులు ఎంతైనా ఉద్రేకం చూపొచ్చు. వస్తు వ్యాప్తంలో ఎంతైనా రసం ఉబకొచ్చు కానీ రచయిత నిబ్బరంగా ఉండి, పైనుంచి వాటి మార్గం, చిక్కదనం, సంచలనం శాసించే అధికారం పోగొట్టుకోకూడదని వివరించారు.

చెప్పదలచుకున్న విషయం ఉన్నవాడు శైలిని గురించి పట్టించుకోడు అన్న అభిప్రాయాన్ని గుర్తుచేస్తూ దాన్ని రచయిత పూర్తిగా అంగీకరించను అంటారు. "కేవలం ఒక యజ్ఞంగా శైలిని గురించి పట్టించుకోనక్కర లేదు నిజమే, కాని శైలి అంటూ ఒకటుంది. రచయిత వ్యక్తిత్వం అంటూ ఒకటుంది. విషయం చెప్పడంలో కూడా మెలకువలు, చమత్కృతి, వయ్యారం, నాజూకు శక్తి ఉన్నాయి. పాఠకుణ్ణి తనవైపుకు లాక్కొని లొంగదీసుకొని రచయిత అంతరంగ జగత్తులోకి ప్రవేశింప చెయ్యడం శైలి లక్ష్యం. ఆ నడక, ఆ పోకడ పాఠకుడికి నచ్చితే అసలు **ఆ అంతరంగ** జగత్తులోంచి పొమ్మన్నా పోడు. అంత మాత్రం చేత కొట్టొచ్చేటట్లుండగూడదు శైలి. అది వస్తువులో కలిసిపోయి విడదీయదడానికి వీల్లేకుండా అల్లిక జరగాలంటూ కథా శిల్ప సంబంధ మెలకువలను పాఠకులకు అందించారు. నిత్య వ్యవహారంలో ప్రయోగించే ఉత్తమాటలు పోగుచేసి వ్రాసెయ్యడం

సులభమే. కాని అందులో సరియైన పదాలని వెదికి కూర్చడం, పొదగడం, చెప్పదలుచున్న దాన్ని తీక్షణంగా చెప్పడం, ఇదే శిల్పం అని వివరించారు.

### 3.4.3. కథాశిల్ప సంబంధ వ్యాసాల పట్టిక

ఈ విధంగా కథాశిల్పానికి సంబంధించిన వ్యాసాలు మరికొన్ని వ్యాసాలు ప్రచురితమయ్యాయి. వాటి వివరాలను కింద పట్టికలో తెలిపాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | *పాత బంగారం ఆధునిక కథ ఎలా ఉండాలి? | డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి | ఫిబ్రవరి 15, 2016 | సాక్షి – సాహిత్యం |
| 2) | కథ తెలుస్తూనే ఉంటుంది... | మహమ్మద్ ఖదీర్‌బాబు | మార్చి 28, 2016 | సాక్షి – సాహిత్యం |
| 3) | కథల్లో ప్రాంతోచిత భాష | డా. బి.వి.ఎన్. స్వామి | జనవరి 25, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 4) | *అనువాదం కాల్పనికం నుండి యథార్థందాకా... | కవిని ఆలూరి | ఫిబ్రవరి 13, 2017 | సాక్షి – సాహిత్యం |
| 5) | శిల్పం–కథ | పి. రామకృష్ణ | డిసెంబర్ 05, 2016 | సాక్షి–సాహిత్యం |

**పట్టిక – 15**

### 3.5. కథానిక వ్యాసాలు–వాద ప్రతివాదాలు

దినపత్రికల సాహిత్య పుటల్లో చర్చా సంబంధ వ్యాసాలు కనిపిస్తున్నాయి. ఏదైనా ఒక ప్రత్యేక సందర్భంగాని, సన్నివేశాన్ని, సంఘటనను స్వీకరించి వాటి వివరాలను చర్చా పద్ధతిలో వ్యాసాలుగా ప్రచురిస్తున్నారు. దీనిలో వ్యాసకర్త ఆయా అంశాలకు సంబంధించిన పూర్వాపరాలను పరిశీలిస్తూ వాటిలోని గుణదోష విచారణతో ఆ విషయ తాలూకు సమాచారాన్ని విశ్లేషిస్తూ పాఠకులకు అందిస్తున్నారు. చర్చ ద్వారా విభిన్న వాదాలు ప్రతిపాదితమవుతాయి. ఒకరు ఒక వాదాన్ని చెప్పినప్పుడు మరొకరు ఇంకొక వాదాన్ని ప్రతిపాదిస్తారు. ఇలా ఒక అంశంపై చర్చల వలన పరిశోధకనాత్మక వాస్తవికాంశాలు వెలుగులోకి వస్తాయి. సాహిత్యంలో వాస్తవికాంశాలు తెలుసుకోవడానికి ఇవి ఎంతగానో ఉపకరిస్తాయి. ఇలాంటి కథా సంబంధ వాద ప్రతి వాద విమర్శ వ్యాసాలు మనకు ఈ రెండు పత్రికల్లోను కనిపిస్తున్నాయి. ఒక సిద్ధాంతాన్ని లేదా వాదాన్ని ఒక రచయిత వ్యాస రూపంలో ప్రతిపాదించినపుడు దానిని ఖండిస్తూనో, లేదా చెప్పని విషయాన్ని

వివరిస్తూనో, వ్యాసాలు కనిపిస్తున్నాయి. వీటిని ప్రతివిమర్శ వ్యాసాలుగా వాదప్రతివాద విమర్శ వ్యాసాలుగా చెప్పవచ్చు. వాద ప్రతివాద విమర్శ నిర్వచనాలు.

"ఒక రచన గురించి రెండు పక్షాలకు (రచయిత లేదా అతని సమర్థకులు ఒక వైపు, విమర్శకుడు లేదా అతని సమర్థకులు ఇంకోవైపు) మధ్య జరిగే చర్చలు, రచనపై విమర్శకుడి నిర్ణయం, రచన మీద చేసే వాదానికి ముందుగానే ప్రతివాదాన్ని ఊహించి చెప్పే సమాధానం, రచనలోని పాత్రచిత్రణ, కథాంశాల పరిశీలన, ఔచిత్య పరిశీలన వంటి అంశాల విశదీకరణ, రచనలోనే ఉన్న దోషాలను, అప్రయోజకతను తెల్పడం అనే అంశాలన్నీ 'వాదం'లో కన్పిస్తాయి".

వాదం ఎప్పుడూ ఉదాహరణలపై ఆధారపడి ఉండాలి. ఉదాహరణల ద్వారానే విషయాన్ని నిరూపించాలి. నిరూపణ తర్వాతనే ఒక నిర్ణయానికి రావాలి. వాదన బలం పాండిత్యం మీదా, సత్యాన్వేషణ మీదా, నిజాయితీ మీదా, తార్కికత మీదా, నిరూపణ మీదా ఆధారపడి ఉంటుంది.

"ప్రతివాదం అంటే అర్థం ప్రతివిమర్శ. ప్రతివాద విమర్శలు వివిధ సందర్భాల్లో తలెత్తుతాయి. విమర్శకు ఆధారమైన సిద్ధాంతం మరొకరికి అంగీకారం కానప్పుడు, ఈర్ష్య వల్లనో, సిద్ధాంత గుణం మీద ఆక్షేపణ కల్గినప్పుడో, సిద్ధాంతం అసమగ్రమని భావించినప్పుడో, చేసిన సమన్వయంలో లోపమున్నప్పుడో, అభిరుచికి భంగం కలిగినప్పుడో, వ్యక్తిగత రాగద్వేషాలకు లోనైనప్పుడో, కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నప్పుడో – ఇలా వివిధ సందర్భాలలో ప్రతివాద విమర్శలకు అవకాశం ఉంటుంది" (నళిని, యస్.యస్.2009.పుట.155).

"సృజనాత్మక రచనలోని అంతస్తత్వపు ముడులు విప్పి, ఆనందాన్ని పఠిత చేత ఆస్వాదింపచేసి, ఆ రచనను అభినవ దృక్పథంతో అనుశీలించి కొత్త సమన్వయాన్ని సాధించే విశిష్ట సాహితీ (ప్రక్రియ విమర్శ, విమర్శకుడు రచనను సమిష్టిగా కాని, రచనలోని ఒక అంశాన్ని వ్యష్టిగా గానీ దర్శించడం ద్వారా అనుభూతిని పొందుతాడు. ఆ అనుభూతికి ప్రేరకాలను గురించి పర్యాలోచించి, ఆ రచనలోని దోషాలను వివేచిస్తూ సాహిత్య విమర్శనం వెలయిస్తాడు. అలా ఆవిష్కరింపబడిన కవితాతత్త్వాన్ని, విమర్శకుని ప్రతిభను సూక్ష్మేక్షికతో సమీక్షించి విమర్శకుడు చెప్పిన విషయాన్ని ఖండిస్తూనో, చెప్పని విషయాన్ని వివరిస్తూనో నూతన దర్శనాన్ని ప్రదర్శిస్తూనో మరల విమర్శను వెలయించడం జరుగుతుంది. అలా వెలువడిన విమర్శే 'ప్రతి విమర్శ' " (అచ్యుతశర్మ, సి.యస్వీ.1990.పుట.1).

"విమర్శలో వాద ప్రతివాదల ద్వారా నడిచే చర్చ ఒక ముఖ్య భాగం. వాద ప్రతివాదాలు సరిగా ఉంటే చర్చ విమర్శ విద్యకు పుష్టిని కల్గిస్తుంది. సరిగా చేసిన చర్చ రచన గుణాన్ని ఇంకా

ఎక్కువగా తెలుసుకోవడానికి తోడ్పడుతుంది. రచన మీద చర్చ వద్దనుకోవడం సరియైన పద్ధతి కాదు. ఒక రచన చర్చనీయాంశం కాదనప్పుడు కూడా చర్చ జరుగుతూనే ఉంటుంది. ఒక రచనను చదివాక విమర్శకుడు తన స్పందనకు మూలమైన అందులోని అంశాన్ని విశదం చేయడానికి ఏ పద్ధతిలో 'వాదం' సిద్ధం చేసుకోవాలో నిర్ణయించుకోవాలి. అనవసర విషయాల్ని వాదంలోకి తేవద్దు. అవి వాదాన్ని బలహీన పరుస్తాయి. పాఠకుడు విమర్శకుని వల్ల ప్రయోజనం పొందాలంటే ప్రతి ఉక్తి (స్టేట్‌మెంట్), ప్రతి నిర్ణయం వెనుకన ఒక ఉదాహరణ. దాని మీద ఒక వ్యాఖ్యానం ఉండాలి. వీటిని ప్రతిపాదించడానికి సరియైన తర్కంతో, వాదం అవసరం వస్తే దాన్ని జాగ్రత్తగా సిద్ధం చేయాలి. వాదం అవసరం లేని విమర్శలు కూడా ఉంటాయి. కాని సాధారణంగా 'నిర్ణయం' ఉన్న విమర్శలో 'వాదం' కూడా కనిపిస్తుంది. వాదంలో వ్యక్తిగత అంశాలకు ప్రాధాన్యం ఉండకూడదు" (ముదిగొండ, వీరభద్రయ్య. 2012.పుట.154). ఈ రెండు పత్రికల్లో వచ్చిన వాద ప్రతివాద విమర్శ వ్యాసాలు కింది విధంగా ఉన్నాయి.

### 3.5.1. శిల్పం–కథ

పి. రామకృష్ణ రాసిన వ్యాసం 'శిల్పం–కథ'. ఇది సాక్షి సాహిత్యం పుటలో డిసెంబర్ 05, 2016న వెలువడింది. చర్చాపద్ధతిలో రాసిన వ్యాసం ఇది.

ఇది కథాశిల్పం గురించి వ్యాసకర్త అభిప్రాయాలను తెలుపుతూ రాసిన వ్యాసం. అర్ధ శతాబ్దం క్రిందటి వరకు కథ రాయడానికి కథాశిల్పం తెలిసి ఉండాలి అనే మాట గట్టిగా వినిపించేది. ఆ శిల్పం తెలుసుకున్న వారిని 'కథాశిల్పి' అని ప్రశంసించేవారు. ఆ మాట వింటేనే ఆయన ఒక చేత్తో ఉలీ, ఇంకో చేత్తో సుత్తీ పట్టుకున్నట్లు కనిపించి కొంత భయమేసేది. దాంతో కథ రాయాలన్న, రాసిందాన్ని బయటపెట్టాలన్నా సంకోచంగా ఉండేదంటూ చెపూ అసలు శిల్పం ఎవరి కోసం? అని ప్రశ్నిస్తున్నారు. అసలు శిల్పం ఎవరి కోసం? శిల్పానికి ఏ మాత్రం భంగం కలగకుండా రాసినా, పాఠకుడి చేత చదివించేటట్టు లేకపోతే, శిల్పం ఏం చేస్తుంది? కళ కళ కోసమే అన్నట్టు శిల్పం శిల్పం కోసమే అంటుందా? శిల్పం జవాబు చెప్పలేదని వారి అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

ప్రస్తుత కాలంలో శిల్పాన్ని గురించి ఇప్పుడెవరూ మాట్లాడడం లేదని, ఎవరన్నా మాట్లాడినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అన్ని వర్గాల నుంచీ కులాల నుంచి కథలు వస్తున్నాయి. ఇప్పుడు కథకూ, పాఠకుడికి స్వేచ్ఛ దొరికిందని శిల్ప సంబంధంపై వారి అభిప్రాయాన్ని తెలిపారు. దీన్ని చర్చా సంబంధ వ్యాసంగా కూడా చెప్పవచ్చు.

శిల్పం–కథ అనే వ్యాసానికి ప్రతి విమర్శగా పాలగిరి విశ్వప్రసాద్ 'విస్తృతిని శిల్పం నియంత్రించదు' అనే వ్యాసాన్ని రాశారు. ఇది డిసెంబర్ 12, 2016న సాక్షి సాహిత్యం పుటలో వెలువడింది.

పాఠకుడి హృదయం మీద గాఢమైన అనుభూతి వేయడానికి ఎన్నుకునే లేదా సాధించే పద్ధతినే 'కథానికా శిల్పం' అంటున్నారు. దీన్నే పి. రామకృష్ణగారు శిల్పం–కథ (డిసెంబర్ 05, 2016) వ్యాసంలో చెప్పినట్లు 'చెప్పే తీరు' అనొచ్చు. దీనితో ఎటువంటి బాధలేదని చెప్తూ వారు కొన్ని అభిప్రాయాలను ఖండించారు. "శిల్పానికి ఏ మాత్రం భంగం కలగకుండా రాసినా, పాఠకుడి చేత చదివించేట్టు లేకపోతే అప్పుడు శిల్పం ఏం చేస్తుంది? అన్న ప్రశ్నకు ఒకింత వింతగా ఉందంటూ" పాఠకుడి చేత ఆసాంతం చదివించలేకపోతే అది 'చెప్పే తీరు' (శిల్పం) బాగా లేనిదనే కథాఅర్థం? 'శిల్పం లేని కథనే పాఠకుడు ఇష్టపడితే శిల్పం అప్పుడేం చేస్తుంది?' అని మరో ప్రశ్న చదివించినంత మాత్రాన (శిల్పమున్నంత మాత్రాన) దాన్ని అన్ని రకాల పాఠకులు ఇష్టపడాలని నియమం లేదు. ఇష్టపడరు కూడా. కథానికను ఒక పాఠకుడు ఇష్టపడటానికీ, ఇష్టపడకపోవడానికీ ఆ కథానికాంశం (వస్తువు) కారణమవుతుంది. ఇష్టాయిష్టాలకు శిల్పం బాధ్యత వహించదు. కథానికలోని వస్తువును పాఠకుడు ఇష్టపడకపోవడాన్ని శిల్పం మీదికి తోసేస్తే ఎలా? అని వారి అభిప్రాయాన్ని ఖండించారు.

ఎవరు బడితే వాళ్లు రాయకూడదనే వెనుకటి వాళ్ళు 'శిల్పం' గురించి చెప్పినారు అనే అర్థంలో ఒక అభాండం వేయడం అసమంజసంగా ఉందని వారి అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

ఈ విధంగా ఈ రెండు వ్యాసాలు విభిన్న వాదాలతో శిల్పం గురించి చర్చిస్తూ శిల్పపరమైన విషయాలను అనేక కోణాల్లో పాఠకులకు అందించారు. ఇలాంటి చర్చా వ్యాసాల వలన వాస్తవికాంశాలు, విషయంపై అవగాహన పాఠకులకు అందుతుంది.

### 3.5.2. ఇంత మొహమాటం అవసరమా?

బి.ఎస్. రాములు రాసిన 'ఇంత మొహమాటం అవసరమా?' అనే వ్యాసం నమస్తే తెలంగాణ చెలిమె పుటలో ఫిబ్రవరి 01, 2016న ప్రచురితమయింది.

ఇటీవల జనవరి 25న తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో పాతికేళ్ళ కథ 1990–2014 కథా సాహితీ' కథల సంకలనం వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో మనసు ఫౌండేషన్ తరపున ప్రచురించిన రెండు సంపుటాలు ఆవిష్కరించబడ్డాయి. వీటిలో రెండు కలిపి 2600 పేజీలు. 155 మంది రాసిన 336 కథలు ఇందులో చేర్చబడ్డాయి. ప్రతి సంవత్సరం

సంపాదకులు ఎంపిక చేసి, తమకు నచ్చిన కథలు ఇవి అని... యేటా 'కథ 90', 'కథ 91' అలా వరుసగా 'కథ 2014'గా... 25 సంకలనాలు ప్రచురించారు. వాటన్నింటిని పాతికేళ్ల కథాసంపుటిలో రెండు సంకలనాలుగా ప్రచురించారు. ఇందులో కథల వివరాలు, కథకుల వివరాలు, కథకుల అకారాది సూచికలో రచయిత పేరు, కథ పేరు, ప్రచురించిన పత్రిక, సంవత్సరం వగైరా వివరాలు పొందుపరిచారని చెప్తూ వాటిలో తెలంగాణ కథ, కథకులకు లభించిన చోటు గురించి చర్చిస్తూ రాసిన వ్యాసం ఇది. సాహిత్య రంగంలో చేయాల్సిన వర్గ పోరాటంలో, తెలంగాణ అస్తిత్వ పోరాటంలో మరీ ఇంత మొహమాటం అవసరమా? ఇచ్చిన వేదికపై వచ్చిన అవకాశాన్ని నిలదీయకపోతే కనీసం సున్నితంగానైనా చేసుకపోతే ఎలా? ఒకరు కాదు, ఇద్దరూ కాదు ఎంతో మంది తెలంగాణ సాహితీవేత్తలు వేదికను అలంకరించిన సభలో తెలంగాణ సాహిత్యానికి అన్యాయం చేసిన తీరు గురించి చెప్పకపోతే ఇక చెప్పేది ఎప్పుడంటూ "తెలంగాణ కథకు, కథకులకు జరిగిన అన్యాయాన్ని ఈ వ్యాసంలో చర్చించారు. సంపాదకులు 25 ఏళ్ళలో ఎంపిక చేసి ప్రచురించిన మొత్తం 336 కథల్లో సుమారు 45, 46 మాత్రమే తెలంగాణ కథలు. 25 ఏళ్ళ తెలంగాణ సామాజిక పరిణామాలకు 46 కథల ద్వారా అవకాశం కల్పించబడ్డాయి. 336 కథల్లో తెలంగాణ 46 అనుకున్న 290 కథలు తెలంగాణేతర సీమాంధ్ర కథలకు, ప్రవాసాంధ్ర కథలకు ప్రాతినిధ్యం లభించింది. నిష్పత్తిలో చూస్తే 1:7 గా చెప్పవచ్చు. తెలంగాణ కథలు ఈ సంపుటంలో 11 శాతం లోపే. 155 మంది కథకుల్లో తెలంగాణ కథకులు 26 మాత్రమే. అనగా 156 తెలంగాణ కథకులు. ఇది తరతరాలుగా తెలంగాణ సాహిత్యానికి జరుగుతున్న అన్యాయాన్ని యథాతథంగా ప్రతిఫలిస్తుంది" అని వివరించారు.

దీనిలో వ్యాసకర్త గతంలో కూడా ఈ విధంగానే తెలంగాణ కథకు జరిగిన అన్యాయాన్ని గురించి వాటిపై జరిపిన చర్చల గురించి ప్రస్తావించారు. వాటి ద్వారా తెలంగాణ కథకు లభించిన చోటును తెలిపారు. "ప్రత్యక్షంగా, పరోక్షంగా సీమాంధ్ర సాహితీవేత్తలు, సంపాదకులు, తెలంగాణ కథను ప్రచురించడంలో వివక్షను నేటికీ కొనసాగిస్తున్నార"ని అభిప్రాయపడ్డారు. ఇలాంటి వివక్షను, అసమానతలను, అన్యాయాలను సరిచేయడానికి తెలంగాణవారు పూనుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఇందుకు నేషనల్ బుక్ ట్రస్ట్ వలె తెలంగాణ రాష్ట్ర బుక్ ట్రస్ట్ ఏర్పాటుచేసి ఇతోధికంగా తెలంగాణ సాహిత్య ప్రక్రియలను సంకలనాలుగా ప్రచురించడంతోపాటు భారతీయ భాషల్లోకి, ప్రపంచ భాషల్లోకి అనువదింపజేసి ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ చేసే వ్యవస్థను నెలకొల్పడం అవసరమని తెలిపారు.

“రాయుడు వంటివారు ఎమెస్కో విజయ్ కుమార్, వాసిరెడ్డి నవీన్ వంటివారు ఇంతదాక జరిగిన అన్యాయాన్ని, విక్షను, అసమానతలను పరిష్కరించడానికి ప్రత్యేకమైన కృషి చేయడం అవసరం. ఇందుకు తెలంగాణ సాహితీవేత్తలతో సంపాదక మండలిని ఏర్పాటు చేయడం ఉపయోగం. అంతే కాకుండా, తెలంగాణ సాహితీవేత్తలు గత 25 ఏళ్ళలో ప్రతి యేటా వచ్చిన తెలంగాణ కథల నుంచి మంచి కథలను గుర్తించి వాటి పరిచయం, విశ్లేషణ చేయాలి. ఆ క్రమంలో కథల ఎంపిక సులువవుతుంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం, తెలంగాణ విప్లవోద్యమం, దళితవాద, ముస్లింవాద, బీ.సీ.వాద, ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ కథలు, తెలంగాణ ఆదివాసీ, గిరిజన జీవితాలు, సంస్కృతి కథలు వాటి ప్రాతినిధ్యం, నిష్పత్తిని గుర్తిస్తూ ఎంపిక చేసినప్పుడే సామాజిక పరిణామాలను, మలుపులను తెలంగాణ కథా సాహిత్యం పట్టుకున్న తీరును తెలిపే కథలు వెలుగులోకి వస్తాయని వివరించారు.

ఈ విధంగా తెలంగాణ కథా సాహిత్యాన్ని గురించి, దానిపై గల వివక్షలను గురించి చర్చిస్తూ అనేక వాస్తవికాంశాలను పాఠకులకు అందించారు.

### 3.5.3. కథాసాహిత్యంలో స్తబ్దత

కథాసాహిత్యంలో స్తబ్దత అనే వ్యాసాన్ని బి.ఎస్. రాములు రాశారు. ఇది నమస్తే తెలంగాణ చెలిమె పుటలో ఆగస్టు 29, 2016న వెలువడింది.

కథాసాహిత్యంలో ప్రస్తుతం కనిపిస్తున్న స్తబ్దత గురించి చర్చిస్తూ రాసిన వ్యాసం ఇది. కథా సాహిత్యంలో క్రమంగా స్తబ్దత నెలకొందా? అవుననే అనిపిస్తుందని వ్యాసకర్త అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

రెండు దశాబ్దాలుగా తెలంగాణలో స్వరాష్ట్ర ఉద్యమం ఎంతో గొప్ప సాహిత్యాన్ని, చైతన్యాన్ని సృష్టించింది. కోట్లాది మంది తెలంగాణ కోసం ముందుకు కదిలారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో దశాబ్దాలుగా జరిగిన అన్యాయం, అణచివేత, వివక్ష గురించి వందలాది పాటలు, వ్యాసాలు, వేలాది ప్రసంగాలు, కవితలు వెలువడ్డాయి. జీవితాన్ని ప్రతిఫలించే కథల్లో, నవలల్లో ఈ రెండు దశాబ్దాల పరిణామాలు పెద్ద ఎత్తున ఎందుకు రికార్డు కాలేదు? అంటూ కారణాలను చర్చించారు.

“దిన, వార, మాస పత్రికలు విధించే స్థల పరిమితి, ఒకమేరకు, తెలంగాణ భాషలో రాస్తే వేయకపోవడం, వివక్ష చూపడం ఒకమేరకు వాస్తవమే. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ ఎడిషన్లు ప్రారంభమై కొనసాగుతున్నప్పటికీ ఈ స్తబ్దత ఎందుకు కోనసాగుతున్నది? అని

ప్రశ్నించారు. సాహిత్యపుటల్లో కవిత్వం, సాహిత్య వ్యాసాలు అచ్చు వేస్తున్నారు. కానీ కథలను అచ్చు వేయడం లేదు అని ప్రశ్నిస్తూ కథా సాహిత్య గొప్పతనాన్ని వివరించారు. రెండు దశాబ్దాలు గడిచినా తెలంగాణ ఉద్యమంపై రావాల్సినన్ని కథలు, నవలలు ప్రోత్సాహం లేక రాలేదా? రచయితల శక్తి, సామర్థ్యాలు, నైపుణ్యం చాలక రాలేదా? చర్చించాలి. కథా, నవలా సాహిత్యాంలో కొనసాగుతున్న ఈ స్తబ్దతను బద్దలు కొట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఇలాంటి చర్చా సంబంధ వ్యాసాలు పాఠకుడిని ఆలోచింపజేస్తూ వాస్తవికాంశాలను అవగతం చేసుకోవడానికి ఉపకరిస్తాయి.

### 3.5.4. వాద ప్రతివాద విమర్శ కథానిక వ్యాసాల పట్టిక

వాద ప్రతివాద విమర్శ కథానిక వ్యాసాలు మరికొన్ని కథా వ్యాసాలు ఈ రెండు పత్రికల్లో మనకు కనిపిస్తున్నాయి. వాటి వివరాలను కింద పట్టికలో గమనించగలరు.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | 2015 కథలు ఎలా ఉన్నాయి | స్వాతి శ్రీపాద | జనవరి 04, 2016 | సాక్షి – సాహిత్యం |
| 2) | ఆధిపత్యంపై ధిక్కార స్వరం | గోపగాని రవీందర్ | నవంబర్ 21, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక – 16**

### 3.6. కథానిక గ్రంథ నేపథ్యాలు

సాహత్య పుటల్లో కథా సంబంధ వ్యాస ప్రచురణలో కనబడే మరొక వైవిధ్యం కథా నేపథ్య సంబంధ వ్యాసాలు. గ్రంథ రచనా నేపథ్యాన్ని, రచనకు గల కారణాలను రచనా పద్ధతి, సామాజిక పరిస్థితులు వంటి అంశాలను వివరిస్తూ గ్రంథకర్త రాసే నేపథ్య సంబంధ వ్యాసాలు మనకు సాహిత్య పుటల్లో కనిపిస్తున్నాయి. నూతన పుస్తకావిష్కరణ సందర్భాల్లో విలువైన ముందు మాటలను వ్యాసాలుగా ప్రచురించడం ఒక విధానమయితే అసలు ఆ గ్రంథ రచనకు గల కారణాలను, నేపథ్యాన్ని పాఠకులకు వివరిస్తూ గ్రంథకర్తనే వ్యాసాలు రాయడం మరొక పద్ధతి. దీని ద్వారా గ్రంథ పరిచయం, రచనకు గల కారణాలు, రచనా కాలంనాటి సామాజిక పరిస్థితులు అలాగే రచయిత అభిరుచి వంటి అంశాలు పాఠకులకు అందజేస్తున్నారు. ఇలాంటి నేపథ్య సంబంధ వ్యాసాలు మనకు రెండు పత్రికల్లోను కనబడుతున్నాయి. కథా నేపథ్య సంబంధ వ్యాసాలు కింది విధంగా కనిపిస్తున్నాయి.

### 3.6.1. కథ కథా వాన వాన

మహ్మద్ ఖదీర్ బాబు రాసిన 'కథ కథా వాన వాన' అనే వ్యాసం సాక్షి సాహిత్యం పుటలో అక్టోబర్ 16, 2017న ప్రచురితమయింది. వ్యాసకర్త సంపాదకుడిగా తెలుగు సాహిత్యంలో వాన

నేపథ్యంగా వచ్చినటువంటి కథలను క్రోడీకరించి "ఉత్తమ తెలుగు వాన కథలు" పేరుతో 20 కథల సంకలనాన్ని వెలువరించారు. ఈ సందర్భంగా వాన కథలపై రచయితకు గల అభిమానం, గ్రంథ రచనకు గల కారణాలు, రచనా నేపథ్యం, గ్రంథ రచనకు ప్రోత్సహించిన వ్యక్తులు, ఎంపిక చేసుకున్న వాన కథల వస్తు పరిచయం, వాటి ప్రాముఖ్యత వంటి అంశాలను ఈ వ్యాసంలో వివరించారు.

వాన కథలపై వ్యాసకర్త తనకు గల అభిమానాన్ని తెలుపుతూ, తనపై ప్రభావం చూపిన పాలగుమ్మి పద్మరాజు 'గాలివాన', రావిశాస్త్రి 'వర్షం' కథ, అద్దేపల్లి ప్రభు 'అతడు పేరు మనిషి' వంటి కథలను పేర్కొన్నారు. వీటన్నింటిని చదివిన తర్వాత వాటిని ఎలాగైనా పుస్తక రూపంలోకి తేవాలనే తన కోరికని వివరించారు. "ఇవన్నీ మనసులో ఉండిపోయాయి. వీటిని పుస్తకంగా తెస్తే బాగుండుననే కోరిక ఉండిపోయింది. తిరుపతిలో తెలుగు మహాసభలు జరుగుతున్నప్పుడు అక్కడకు వచ్చిన తానా జంపాల చౌదరిగారికి ఈ విషయం చెప్పాను. ఆయన చెవిన వేసుకోలేదు. నా వాన కురువనే లేదు. తుదకు ఛాయా సంస్థ కృష్ణమోహన్ చెప్పిందే తడవు తడవడానికి సిద్ధమవడంతో ఈ కథల వాన ఇలా సాధ్యం కాగలిగింద"ని తన కోరిక నెరవేరిన విధానాన్ని వివరించారు. తెలుగులో వాన కథలు సమృద్ధిగా ఉన్నాయంటూ చెప్పి ఏ సంకలనానికైనా ఒక పరిధి ఉంటుంది. నా సంకలనం 20 వాన కథలను భరించగల్గిదంటూ గ్రంథ రచన పరిధిని తెలిపారు. ఈ కథల్లో కళింగాంధ్ర, ఉత్తరాంధ్ర, తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర వంటి విభిన్న ప్రాంతాలను తడిపిన వాన కథలుండటం అదృష్టంగా భావిస్తూ ఆయా ప్రాంత కథల మధ్యగల బేధసాదృశ్యాలను, వస్తువును వివరించారు. "తెలంగాణ కథలను వెతుకుతున్నప్పుడు అక్కడ కురిసిన వాన వెట్టి చాకిరితో కలిసి భోరున విలపించడం బి.యస్. రాములు 'పాలు' కథలో, ఎ.ఎం. అయోధ్యారెడ్డి రాసిన 'గాలివాన' కథలో గమనించాను... కానీ దుఃఖమంతా మాత్రం రాయలసీమదే. వద్దురా తండ్రీ ఎన్ని కథలు చదివినా అక్కడి కథకులందరిది ఒకటే కల. వాన కల అందరూ కలలో వానను చూసినవారే తప్ప నిజంగా వాన చూసినవారు లేరు" అంటూ ఆనాటి సామాజిక పరిస్థితులను ప్రతిబింబింపచేసిన వాన కథల్లోని ప్రాంతాలవారిగా భేదాలను వివరించారు.

వాన కథల్లో దాదాపు మొదటి కథ శారద (నాటరాజన్) రాసిన 'అదృష్టహీనుడు' (1950) దొరకడం, ప్రియ కథకుడు తిలక్ 'ఊరి చివరి ఇల్లు'తో ఈ సంకలనానికి నాలుగు పదున్ల వానను జతపరచడం మరేమిటి? పుస్తకం ధన్యమైంది అంటూ తన కోరిక ఫలించిన సంతృప్తిని వ్యక్తపరిచారు. కానీ ఇంకా తెలుగు సాహిత్యంలో అనేక వాన కథలు మిగిలిపోయాయంటూ కొత్త

కథకులు ఈ వానదారుల్లో నడవాలని మరెన్నో సంకలనాలు వస్తాయని ఆశావహ ధోరణిలో ముగించారు.

ఇలాంటి వ్యాసాల ద్వారా గ్రంథ రచన నేపథ్యం, కవి దృక్పథం, అభిరుచులు, రచనలోని ప్రత్యేకతలు తెలియడంతోపాటు నూతన పుస్తక పరిచయం కలుగుతుంది. మూల గ్రంథాన్ని చదవాలనే ప్రేరణ పఠనాసక్తి పెంపొందుతాయి. నూతన కథకులకు ప్రేరణనిస్తాయి. కొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయి. ఇతరులు రాసిన వ్యాసాలకన్న కొన్ని సందర్భాల్లో గ్రంథకర్తయే స్వయంగా తన రచనా నేపథ్యాన్ని తెలపడం వలన పాఠకులు మరింత ఆకర్షితులవుతారు.

### 3.6.2. ఊరు చరిత్ర మీద పాదముద్ర

రాజేందర్ జింబో రాసిన "ఊరు చరిత్ర మీద పాదముద్ర" వ్యాసం నమస్తే తెలంగాణ చెలిమె సాహిత్య పుటలో నవంబర్ 14, 2016న వెలువడింది. వ్యాసకర్త "మా వేములవాడ కథలు" పేరుతో కథా సంపుటాన్ని వెలువరించారు. ఈ సందర్భంగా గ్రంథ నేపథ్యాన్ని, రచనా శిల్పాన్ని, కథా వస్తువును, గ్రంథ రచనకు గల కారణాలను తెలుపుతూ రాసిన వ్యాసం ఇది. ప్రాంతీయ, అస్తిత్వవాద విమర్శ ధోరణిలో ఈ వ్యాసం కనిపిస్తుంది.

"ఏవైనా అట్లాగే ఉండాలనుకోవడం ఎంత అసహజమో, పోయింది అని బాధపడటమూ అంతే సహజం" ఈ వాక్యంతో ముగిసే 'పెట్టలర్ర కథ మా వేములవాడ కథలకు నేపథ్యం" అని పేర్కొన్నారు. ఈ కథలను రాయడానికి గల కారణాలను దీనిలో వివరించారు. "ప్రతి దసరాకు మా వేములవాడ వెళ్ళడం తప్పనిసరి. ఓసారి దసరాకి వెళ్ళినప్పుడు 'పెట్టెలర్ర' నన్ను కలవరపెట్టింది. అంతే! వేములవాడ కథలు రాసేశాను. కథావస్తువు గురించి చెప్తూ ఇవి కేవలం వేములవాడకు చెందిన కథలు మాత్రమే కావు మొత్తం తెలంగాణ ప్రజల జీవితాన్ని చిత్రించే అందరి కథలని తెలిపారు. కథావస్తువు గురించి చెప్తూ తెలంగాణ ప్రాంత జీవితాన్ని, మారుతున్న వైనాన్ని ఈ కథల్లో వ్యక్తీకరించాను. ఇవి మావూరి కథలు మాత్రమే కాదు, అందరి ఊరు కథలు. ఇది నా బాల్యమే కాదు. చాలామంది బాల్యం".

'మిడ్ మానేరు డ్యాం' కథతో మొదలై 'సుబ్రహ్మణ్యం దవాఖాన' కథతో ముగిసే ఈ కథాసంపుటిలో 23 కథలున్నాయి అని కథాసంపుటి పరిధిని, కథల్లోని వస్తువును వివరించారు. "మా వేములవాడ కథలు మా ఊరి చరిత్రపై నా పాదముద్ర. తెలంగాణ అస్తిత్వ ప్రతీక అంటూ ప్రాంతీయ అస్తిత్వవాద ధోరణిలో ప్రాంతీయ అభిమానాన్ని వ్యక్తపరిచారు. తమ ప్రాంతం అణచివేతకు గురైందని భావిస్తూ అణచివేతను చిత్రిస్తూ చెప్పిన ప్రాంతీయ అస్తిత్వవాద ధోరణి

వాక్యాలు ఈ వ్యాసంలో మనకు చాలా చోట్ల కనిపిస్తాయి. "చిన్నప్పుడు చదువుకున్న పుస్తకాల్లో ఎక్కడా మా వేములవాడ కన్పించలేదు. ఒక హైదరాబాద్ పేరు తప్ప. తెలంగాణలోని ఏ ఊరు పేరు కనిపించకపోయేది. ఏనుగెక్కి ఏలూరెందుకు వెళ్ళాలో, సైకిలెక్కి సాలూరు ఎందుకు వెళ్ళాలో అర్థం కాకపోయేది".

కథలు చెప్పడం చాలా తేలిక, కాని కథలు రాయడం, కథలు చెప్పినంత సులువు కాదు. అందులో ఒక ఊరిని కథలుగా మలచడం కష్టం కాదు కానీ ఇష్టమని మాత్రం చెప్పగలను. ఊరు పేరుతో తెలుగులో చాలా కథలు వచ్చాయి. నేను రాసాను. ఊరును నేపథ్యం చేసుకొని కథ రాయాలంటే ఆ ఊరు పట్ల భావావేశం ఉండాలి. హృదయ వేదన ఉండాలి. ఈ అనుభూతుల వల్లే "మా వేములవాడ కథలు రాయగలిగాను. అందుకు ఒకింత సంతోషం, మరికొంత గర్వం రెండూ ఎప్పుడూ కలుగుతాయంటూ" వ్యాసకర్త తన రచనా నేపథ్యాన్ని తన ప్రాంతీయ అభిమానాన్ని తెలియజేసారు. ఈ వ్యాసం ద్వారా కథా పుస్తక పరిచయం, ప్రాంతీయ అస్తిత్వవాదం, రచయిత దృక్పథం, అభిరుచులు, రచనా నేపథ్యం, వస్తువు, రచనకు ప్రేరేపించిన అంశాలు వంటి అనేక విషయాలు పాఠకుడికి అందించబడుతున్నాయి. ప్రాంతీయ అభిమానాన్ని తెలుపుతూ రాసిన వ్యాసం కావున ఇది ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ వ్యాసం అవుతుంది.

ఈ విధంగా గ్రంథకర్తలే స్వయంగా తన రచనా నేపథ్యాన్ని, రచన ప్రత్యేకతలను తెలుపుతూ రాసిన నేపథ్య సంబంధ కథా వ్యాసాలు కథా సంబంధ నేపథ్య వ్యాసాలు మరికొన్ని ఈ సాహిత్య పుటల్లో కలవు. వాటి వివరాలను కింది పట్టికలో పొందుపరిచాను.

సాహిత్యం మీద అభిరుచి ఏర్పడిన తర్వాత కథలూ, కవిత్వం, నవలలూ లెక్కలేనన్ని చదివాను అదేం దురదృష్టమో కానీ తెలంగాణలోని ఏ ఊరు పేరు కన్పించకపోయేది. ఒకే ఒక నవల్లో ఓ పాత్ర మా ఊరు వాగు దాటి గుడికి వెళ్తుంది. అది చూసి ఆరోజు ఎంత ఆనందపడ్డానో చెప్పడానికి వీల్లేదు. ఊరు పేరు కనిపిస్తేనే అంత సంతోషం ఉంటే మరింత సంతోషం ఉంటుందన్పించి 'మా వేములవాడ కథల'ని ఈ కథలకు పేరు పెట్టాను అంటూ నామౌచిత్యాన్ని తెలిపారు.

### 3.6.3. జీవించు... నేర్చుకో... అందించు...

సాక్షి సాహిత్యం పుటలో జీవించు... నేర్చుకో... అందించు... అనే వ్యాసం సెప్టెంబర్ 26, 2016 ప్రచురించబడింది. దీనిని తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసారు. వ్యాసకర్త తాజాగా 'ఆధునిక తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి స్వతంత్ర కొటేషన్స్' అంటూ "జీవించు... నేర్చుకో...

అందించు...!" గ్రంథాన్ని వెలువరించారు. ఇది ఆయన పూర్వ కొటేషన్స్ సంకలనాలను కూడా కలుపుకొని వెలువడిన సమగ్ర సంకలనం. దీనికి డాక్టర్ డి. చంద్రశేఖర రెడ్డి సంపాదకులు. ఈ గ్రంథాన్ని వెలువరించిన సందర్భంగా గ్రంథ రచన రాయడానికి గల నేపథ్యాన్ని వివరిస్తూ ఈ వ్యాసం రాసారు. వ్యాసకర్త రెండవ తరగతి చదువుకునే వయస్సులో తమ ఇంటి దూలంపై రాయబడిన "శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అనే కొటేషన్స్ తనను చిన్ననాటి నుండి ఎంతో ప్రభావితం చేసిందని సాహిత్యం పట్ల ఆసక్తి కూడా దానివలనే కలిగిందని తెలిపారు. ఈ కొటేషన్స్ వలన ఉపయోగాన్ని వివరిస్తూ "కొత్త తరానికి... వారి ఉరుకుల పరుగుల జీవితానికి ఈ ఏక వాక్య ప్రక్రియ బాగా ఉపయోగపడుతుందని అనుకున్నాను. కొత్త తరాన్నే కాదు, నా తరాన్నే కాదు, నాకంటే ముందు తరాన్ని కూడా మనసులో నిలుపుకుని – మూడు తరాల మధ్య ఏర్పడ్డ అఖాతాన్ని కొటేషన్ల వంతెనతో అధిగమించాలనుకున్నాను అని తన ఆశయాన్ని వ్యక్తపరిచారు. ఈ కొటేషన్స్ గ్రంథాన్ని రాయడానికి తన మానసిక పరిస్థితులు కూడా కారణమని వివరించారు. అపుడు నా మానసిక స్థితి – మా బాపు మరణం (2009), మాబాబు దూరదేశంలో ఉండిపోవడం, మనుషులతో పడకపోవడం, కోపం, ఆగ్రహం కలగలిసి ఒంటరినై... 'ఉదాత్తంగా బతకడమే, ఉత్తమ ప్రతీకారం' అన్నట్టుగా, నా బతుకేదో నేను బతకాలని నిర్ణయించుకున్న స్థితి కూడా, కొటేషన్స్ రాయడానికి నన్ను ముందుకు తోసిందని నేను అనుకుంటున్నాను" అని ఇలా గ్రంథ రచనకు గల కారణాలను, నేపథ్యాన్ని వివరించారు.

### 3.7. కథానిక గ్రంథ సమీక్షలు

మానవ యాంత్రిక జీవితంలో ఒక పుస్తకాన్ని పూర్తిగా చదివి అర్థం చేసుకునే తీరిక లేనప్పుడు ఈ సమీక్షలు ఎంతగానో ఉపకరిస్తాయి. సమీక్ష ఒక సాహిత్య ప్రక్రియ. పుస్తక వివరాలను, కథాసంగ్రహాన్ని, రచయిత దృక్పథాన్ని తెలుపుతూ రాసే సమీక్షా వ్యాసాలు రచయితకు పాఠకుడి మధ్యన వారధివలే నిలుస్తాయి. సమీక్షలు పాఠకుడిలో ఒక అభిరుచిని, అభిప్రాయాన్ని కలిగిస్తాయి. గ్రంథ పఠనా ప్రేరణను కలిగిస్తాయి. ఇలాంటి కథాసంబంధ పుస్తక సమీక్షా వ్యాసాలు మనకు ఈ రెండు పత్రికల్లో కనిపిస్తున్నాయి.

### 3.7.1. మూలాల్ని ముట్టిన కథలు

బి.వి.ఎన్. స్వామి రాసిన 'మూలాల్ని ముట్టిన కథలు' అనే వ్యాసం జనవరి 30, 2017న నమస్తే తెలంగాణ చెలిమె పుటలో వెలువడింది.

తెలంగాణ ప్రముఖ కవి నందిని సిధారెడ్డి రాసిన 'చిత్రకన్ను' కథల సంపుటిని గురించి తెలుపుతూ రాసిన సమీక్షా వ్యాసమిది. అందరికి కవిగా సుపరిచితులైన నందిని సిధారెడ్డి ఉత్తమ కథకులు అనే విషయం నేడు తెలుస్తుందని చెప్తూ వ్యాసకర్త సిధారెడ్డి రాసిన పదిహేడు కథల సంపుటి 'చిత్రకన్ను' గురించి తెలిపారు. భూస్వాముల దాష్టీకం, ప్రజల చైతన్యం, సాయుధ పోరాటం, పరాయీకరణకు గురి కావడం, కులవృత్తుల ధ్వంసం, విచ్ఛిన్నమైన మానవత్వం, స్త్రీలపై జరిగే మోసం, స్వేచ్ఛ కోసం ఆరాటం, ఆశయానికి బలవడం మధ్య తరగతి మందహాసం, కింది తరగతి ఆయాసం, పల్లెల్లోని మార్పులు, లంపెన్ సంస్కృతి, మేరమీరిన హిపోక్రసీ... మొదలగు వాటిని దగ్గరగా చూసి పరిశీలించి తానే సర్వ సాక్షియై రాసిన కథలివి అంటూ కథావస్తువును పరిచయం చేసారు.

ఈ సంపుటంలో గల చిత్రకన్ను, కులకశ్చి, హృదయం, ఎలర్జీ, పుల్లర, షావుకారు కుక్క వంటి మొదలైన కథలను పేర్కొంటూ వాటిలోని కథావస్తువును పరిచయం చేశారు.

సిధారెడ్డిది కవి హృదయం. అందుకే కథల్లో కవిత్వం పండింది. వచన కవిత్వమై ప్రవహించింది. ఒక్కో కథ వచన పద్యమై దీర్ఘ కవితను తలపిస్తుంది. రెండు వాక్యాల్లో విలోమార్థాలను పొదిగి కథను నడపడం, అన్యపదార్థ ప్రధానం చేస్తూ సాగే వాక్యాలను పేర్చుతూ కథకు బిగింపు కూర్చడం భాషాపాటవాన్ని తెలుపుతుందని వివరించారు.

### 3.7.2. కథానిక సమీక్ష సంబంధ వ్యాసాల పట్టిక

ఈ విధంగా రచయిత దృక్పథాన్ని గ్రంథ పరిచయాన్ని, కథా వస్తు పరిచయాన్ని చేస్తూ సాగే కథానిక సమీక్షా రూప వ్యాసాలు మరికొన్ని ఈ పుటల్లో కనిపిస్తున్నాయి. వాటి వివరాలు కింద పట్టికలో పేర్కొన్నాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | కథ తెలుస్తూనే ఉంటుంది | మహమ్మద్ ఖదీర్‌బాబు | మార్చి 28, 2016 | సాక్షి – సాహిత్యం |
| 2) | *పుస్తక సమీక్ష<br>నైతిక జీవనానికి అద్దం పట్టిన జాతక కథలు | డా॥ ఈమని శివనాగిరెడ్డి | ఫిబ్రవరి 06, 2017 | సాక్షి – సాహిత్యం |
| 3) | చిన్నకథ – పెద్ద ప్రపంచం | అఫ్సర్ | మే 15, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక – 17**

### 3.8. కథానిక సంబంధ స్మరణ వ్యాసాలు

కథా రచయితల వర్ధంతి సందర్భంగా లేదా కథకుల మరణ వార్త విన్న సందర్భంలో వారి సాహిత్య కృషిని, జీవిత విశేషాలను తెలుపుతూ కవి జీవిత విమర్శ పద్ధతి వ్యాసాలు దినపత్రికల సాహిత్య పుటల్లో కనిపిస్తున్నాయి. ఇలాంటి **స్మరణ** సంబంధ కథా వ్యాసాలు మనకు ఈ రెండు పత్రికల్లో కనబడుతున్నాయి. మహా కవులను వారి సేవలను స్మరిస్తూ నివాళిగా వ్యాసాలను ప్రచురిస్తున్నారు. దీనిలో కవి జీవిత సంబంధ విషయాలు, రచనా సంబంధ ప్రత్యేకతలను తెలుపుతూ కవి జీవిత విమర్శ పద్ధతిలో వ్యాసాలను వెలువరిస్తున్నారు. కవి జీవిత విమర్శ పద్ధతి గురించి ఇదివరకే రెండవ అధ్యాయంలో వివరించాను. **స్మరణ** సంబంధ కథా వ్యాసాలు (కథా సంబంధ **స్మరణ** వ్యాసాలు) కింది విధంగా ఉన్నాయి.

#### 3.8.1. అదృశ్యమైన నిప్పుపిట్ట, ఎర్ర కుందేలు

కాట్రు దయానంద్ రాసిన అదృశ్యమైన నిప్పుపిట్ట, ఎర్రకుందేలు అనే వ్యాసం జూలై 10, 2017న సాక్షి–సాహిత్యం పుటలో వెలువడింది. ప్రముఖ కథకుడు డాక్టర్ వి. చంద్రశేఖర రావు జూలై 08, 2017న మరణించిన సందర్భంగా రచయిత జీవిత విషయాలను, వ్యాసకర్తకు రచయితతో గల స్నేహాన్ని స్మరిస్తూ ఎలిజీ రూపంలో రాసిన వ్యాసం. దీనిని కవి జీవిత కావ్య సమన్వయ విమర్శగా చెప్పవచ్చు.

దీనిలో మొదట వ్యాసకర్త వారి మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారిరువురి స్నేహాన్ని స్మరిస్తూ ఎలిజీగా రాశారు. "నల్ల మిరియం పటం ఆశల్ని ఆకు పచ్చని దేశంలో వెదజల్లి అదృశ్యమైపోయింది నిప్పు పిట్ట. ఆప్తుల్ని, ఆత్మీయుల్ని, నమ్ముకున్న తెలుగు కథనీ, నవలనీ రెండు మూడు రోజులలో కోలుకొని గుంటూరొచ్చి కలుస్తానని నమ్మబలికి అదే సమయానికి అదృశ్యమైపోయింది ఎర్రకుందేలు. అనారోగ్యంతో యుద్ధం చేసి చేసి మహాయోధుడై తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయాడు డాక్టర్ వి. చంద్రశేఖర రావు. హితుడా! నేస్తుడా! మహాకథకుడా! మోహనా! కన్నీటితో ఎలిజీలు రాయడం ఎంత కష్టమో నీకు తెలియదా! మాకందరికీ ఎంత శిక్షని విధించి వెళ్ళిపోయెవు! నువ్విక కనబడవని గుంటూరు వెక్కి వెక్కి ఏడుస్తోంది. మహాకథవై తిరిగిరా!" అంటూ కథకుడి మరణ వార్తకి చలించిపోయి తీవ్ర దుఃఖంతో ఎలిజీ రూప వ్యాసాన్ని రాశారు. దీనిలో వ్యాసకర్తకు కథకుడితో గల సాన్నిహిత్యాన్ని, వారి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రచయిత వ్యక్తిత్వాన్ని, జీవిత విషయాలను, రచనల ప్రత్యేకతలను పాఠకులకు అందించారు. డాక్టర్. చంద్రశేఖర రావు 120కి పైగా కథలు రాసి తెలుగు కథకు తనదైన రాతని

రుచి చూపించి తనదంటూ ఒక కథాభాషను సృష్టించుకున్నాడు. ఉద్యమాల పట్ల గాఢ అనురక్తి ప్రగతిశీలవాదుల పట్ల ప్రేమ, ఉద్యమ విద్రోహుల పట్ల ప్రచండమైన ఆగ్రహం ప్రకటించాడు. తెలుగు కథకు మార్మిక సొబగును అలంకరించడంటూ వారి వ్యక్తిత్వాన్ని, రచనా దృక్పథాన్ని వివరించారు.

కవిత్వానికే కాదు, కథకు కూడా స్పాంటేనిటీ (spontaneity) ఉంటుందనీ, సమకాలీన సమస్యలకు తక్షణ స్పందన కథకుడి బాధ్యత అనీ గుర్తు చేసేడు. కథను వర్తమాన చరిత్రకు చిరునామా చేసిన ఏకైక కథకుడిగా వ్యాసకర్త వర్ణించారు.

వారి ఉద్యోగ జీవితం, రచనా జీవితం గురించి వివరించి, వారు ఎదుర్కొన్న అనేక అనారోగ్య సమస్యలు మృత్యువుతో పోరాడిన వైనాన్ని ఈ వ్యాసం వివరించారు. అలాగే రచయిత ఆశయాల్ని, ఆశలను గుర్తుచేస్తూ వాటిని పూర్తి చేయకుండానే వెళ్ళిపోయారనే బాధను వ్యక్తపరిచారు. "ఎన్నో పర్యాయాలు తెలుగు కథ కోసం ఒక పత్రిక తీసుకురావాలన్న కోరికను వెలిబుచ్చేవాడు. ప్రత్యేకంగా కథల పత్రిక. కథకుడు ముఖచిత్రంగా గల పత్రిక. అదీ రంగులతో తేవాలన్నది ఆయన స్వప్నం".

మృత్యువుతో పోరాడుతూ కూడా చివరి కలాన్ని వదలని మహాకథకుడు అంటూ సాహిత్యం పట్ల ఆయనకు గల అభిమానాన్ని వివరించారు. తెలుగు కథ ఉన్నంత వరకూ డాక్టర్ చంద్రశేఖర రావు అజరామరుడు. ఆ మహాకథకుడికి, మంచి మనిషికి నా కన్నీటి వీడ్కోలు అంటూ వారి పై గల అభిమానాన్ని తెలుపుతూ వారి జీవితం, రచనల గురించి పరిచయం చేస్తూ తీవ్ర సంతాపంతో రాసిన ఎలిజీ వ్యాసం ఇది. దీనిలో కవి జీవిత తాలూకు వివరాలు ఉండడం వలన ఇది కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ అవుతుంది. అదే విధంగా స్మరణ సంబంధ వ్యాసం/ఎలిజీ వ్యాసం.

### 3.8.2. అస్తమించిన ప్రతిభామూర్తి

అమ్మంగి వేణుగోపాల్ రాసిన "అస్తమించిన ప్రతిభామూర్తి" వ్యాసం సెప్టెంబర్ 18, 2017న నమస్తే తెలంగాణ చెలిమె పుటలో ప్రచురితమయింది. తెలంగాణకు చెందిన ప్రముఖ కథారచయిత, కవి, అనువాదకుడు, సంపాదకుడు, పరిశోధకుడు డాక్టర్ వల్లపురెడ్డి బుచ్చారెడ్డి సెప్టెంబర్ 18, 2017న మరణించిన సందర్భంగా రాసిన స్మృతి వ్యాసం ఇది.

దీనిలో వ్యాసకర్త రచయిత సాహిత్య ఉద్యోగ జీవితాలు పాలమూరు కేంద్రంగా సాగుతూ వచ్చాయని తెలుపుతూ వారి కథల ప్రత్యేకతలను వివరించారు. వారి జీవిత విషయాలను తెలుపుతూ వారి జీవిత విషయాలనే కొన్ని సందర్భాల్లో కథావస్తువులుగా స్వీకరించిన సందర్భాన్ని వివరించారు. "కథా రచనకు సంబంధించి బుచ్చారెడ్డి విస్తృతమైన అనుభవం ప్రతిబింబించే కథలు

గొప్పవి అన్నది వారు తొలి దశలోనే తెలుసుకున్న సత్యం. వారు రచించిన 'పరాజితులు' కథానిక తమ సొంత అన్న ఆత్మహత్యను వస్తువుగా చేసుకొని రాశారు. గ్రామీణ ప్రాంతానికి అదీ వ్యవసాయ కుటుంబానికి సంబంధించి కథ. ఇలాంటి ఎన్నో వాస్తవిక ప్రపంచాన్ని కథారూపాల్లో అందించారని చెప్తూ వారి కథా వస్తువులను, వాటి ప్రత్యేకతలను తెలిపారు.

బుచ్చిరెడ్డి 'విద్యుల్లత', 'ఉదయభాను', 'పురోగామి' వంటి పత్రికలకు సంపాదకత్వం వహించారు. వీరి మొదటి కథ 'ఇద్దరు ఖైదీలు' 17/12/1954 నాటి తెలుగు స్వతంత్ర పత్రికలో వెలుగు చూసింది. దాదాపు 35 కథలు ఆంధ్ర పత్రిక, ఆంధ్రప్రభ, భారతి, స్రవంతి, శారద వంటి అనేక పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఈ కథలతో 'వల్లపురెడ్డి కథలు' (2014) అన్న మొదటి సంపుటి వెలువడింది. అలాగే బుచ్చారెడ్డి బహుముఖీన ప్రజ్ఞకు నిదర్శనం వారి 'మధుగీత' (2015) అన్న రెండవ సంపుటం అని చెప్తూ ఈ రెండు సంపుటాలే కాక ఇంకా వారి సాహిత్యం ఎన్నో సంపుటాలుగా ప్రచురణకు నోచుకోవాలసిన అవసరాన్ని తెలిపారు. ఇంత కాలం మరుగున దాగిన ఎందరో కవులను వెలికే తీసే దిశగా చెలిమె పుట కృషి చేస్తుంది. ఈ విధంగా రచయిత వర్ధంతి సందర్భంగా వారి రచనల ప్రత్యేకతలను తెలుపుతూ కవి జీవిత విమర్శ పద్ధతిలో రాయబడిన స్మృతి సంబంధ వ్యాసమిది.

### 3.8.3. కథానిక సంబంధ స్మరణ వ్యాసాల పట్టిక

కథానిక సంబంధ స్మరణ వ్యాసాలు మరికొన్ని చెలిమె పుటలో కింది విధంగా కనిపిస్తున్నాయి

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | ఉదార సామ్యవాదం తెలంగాణ హృదయం | అమ్మంగి వేణుగోపాల్ | మార్చి 03, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | ఎచ్చమ్మ చెప్పిన మిఠాయి రాములు కథ | అనిశెట్టి రజిత | అక్టోబర్ 2, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక – 18**

### 3.9. కథానిక సంబంధ నివేదికా వ్యాసాలు

కథా సాహిత్యానికి సంబంధించిన సదస్సులు, సమావేశాలు, వర్క్‌షాపులు జరిగినప్పుడు ఆ సందర్భాన్ని పురస్కరించుకొని వాటి వివరాలను, సదస్సుల్లో చర్చించిన అంశాలను సంక్షిప్తంగా పాఠకులకు అందిస్తున్నారు. సాహిత్య పుటల్లో ప్రస్తుతం కనిపిస్తున్న వ్యాసం. ప్రచురణల్లో ఇదొక రకం. ఇలాంటి వ్యాసాల వలన సాహిత్య సంబంధ వివరాలు ఎప్పటికప్పుడు పాఠకుడికి

అందుతాయి. అలాగే సదస్సులో చర్చించిన మౌలికాంశాలు పాఠకుడికి తెలుస్తున్నాయి. ఇటువంటి కథా సంబంధ నివేదికా వ్యాసాలు మనకు సాక్షి – సాహిత్యం పుటలో కింది విధంగా కనిపిస్తున్నాయి.

### 3.9.1. కొత్త సందర్భంలో రాయలసీమ కథ

బండి నారాయణ స్వామి రాసిన "కొత్త సందర్భంలో రాయలసీమ కథ" అనే వ్యాసం మార్చి 14, 2016న సాక్షి–సాహిత్యం పుటలో వెలువడింది. వ్యాసకర్త జనవరి 23, 24 తేదీలలో రాయలసీమ మహాసభ, రాయలసీమ అస్తిత్వ రచయితల వర్క్‌షాపులో ప్రస్తావించిన అంశాలను ఈ వ్యాసం ద్వారా వివరించారు. "రెండు రోజులు నాలుగు పెడలుగా (విభాగాలుగా) జరిగిన ఈ వర్క్‌షాపులో సమైక్యాంధ్ర ఉద్యమ సందర్భంలో వచ్చిన రాయలసీమ సాహిత్యం గురించి విశ్లేషించినారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో బైటపడిన రాయలసీమ ఆకాంక్షలు, కథ, కవిత్వం, పాట, వ్యాసం అనే ఈ నాలుగు ప్రక్రియలలోకి కొత్త వస్తువుల్ని ఎట్లా ప్రవేశపెట్టగలిగాయా పరిశీలించినారు. ఈ వర్క్‌షాపునకు తెలంగాణ నుండి గోరంటి వెంకన్న, అంబటి సురేంద్ర రాజు, సిద్ధార్థ వంటి ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరు కావడం విశేషమంటూ" వర్క్‌షాపు వివరాలను అందించారు.

సమాజంలో మునుపెన్నడూ లేని విధంగా ఒక కొత్త సందర్భంలో రాయలసీమ కథ అలాగే రాయలసీమ సాహిత్యాన్ని తీసుకొస్తున్న విధానాన్ని వివరించారు. "ఏ సామాజిక సందర్భంలో పుట్టిన సాహిత్యం ఆ సామాజిక ఉద్యమానికే వెన్నుదన్నుగా నిలిచిన క్రమమే మనకు తెలుసు. కానీ, సమైక్యాంధ్ర ఉద్యమ నేపథ్యంలో పుట్టిన రాయలసీమ సాహిత్యం, అదే సమైక్యాంధ్ర వాదాన్ని వ్యతిరేకిస్తూ సాగడం మన సమాజంలోనే ఒక కొత్త సందర్భం! కాదేదీ ఒక స్థిర బిందువు అని బాలగంగాధర తిలక్ అన్నట్లు – కాలంతోపాటు ప్రాంతీయ అస్తిత్వాలూ, వాటి పరిధులూ మార్పుకు లోనవుతుంటాయి. ఈ చారిత్రక అవగాహన వల్లే రాయలసీమ రచయితలూ, మేధావులూ ప్రత్యేక తెలంగాణను సమర్థించినారు అని సాహిత్యంలో వస్తున్న మార్పును సామాజిక స్పృహతో వివరించారు.

సుగాలీ కుటుంబం, ఇరువురు యాత్రికులు, భగీరథ ప్రయత్నం వంటి కథలతో 95 ఏండ్లుగా కొనసాగుతూ వస్తున్న రాయలసీమ ప్రాదేశిక కథలో వెనుకబాటుతనం ప్రధానాంశం అయితే, రాయలసీమ కొత్త సందర్భం కథలో ఆ వెనుకబాటుతనానికి వెనకాల పనిచేసిన రాజకీయ కారణాలు ప్రధానాంశం అంటూ ఈ కొత్త కోణానికి గల కారణాలను తెలిపారు. ఇలాంటి కొత్త

సందర్భంలో వచ్చిన డా. కె. సుభాషిణి 'దృతరాష్ట్రుని కౌగిలి, కథ, జి. వెంకటకృష్ణ కథ "పోగొట్టుకున్నది", డా. ఎం. హరికిషన్ కథ "జై తెలంగాణ", జి. ఉమా మహేశ్వర్ "జలపాతం" వంటి కథలను వాటి వస్తువును పరిచయం చేసారు. అలాగే ఇటువంటి కొత్త సందర్భంలో పాటలు, కవితలు, వ్యాసాలు రాస్తున్న ఎందరో కవులను ప్రస్తావిస్తూ వారందరికి రాయలసీమ మహాసభ అక్షర జేజేలు పలుకుతుందని ప్రశంసించారు. వీరు కాలపు మాళిగలో ఇరుక్కున రాయలసీమ చరిత్రనీ, సంస్కృతినీ తవ్వి తీస్తున్నారని తెలిపారు.

వర్క్‌షాపు సంబంధ వివరాలను తెలుపుతూ ఒక సాహిత్య సంబంధ నివేదికా వ్యాసంలా మొదలైన ఈ వర్క్‌షాపు సందర్భంగా వ్యాసకర్త ఎన్నో చారిత్రక వాస్తవికాంశాలను చర్చించారు. అలాగే ఇంత కాలం ఉన్న సాహిత్యానికి నేడు వస్తున్న రాయలసీమ సాహిత్యానికి చాలా వ్యత్యాసం ఉందంటూ ఇదొక కొత్త సందర్భం అని నూతన రాయలసీమ సాహిత్యంలో అదే విధంగా కథా సాహిత్యంలోని నూతన కోణాన్ని, సందర్భాన్ని విశ్లేషించారు. సదస్సు సంబంధ వివరాలుండటం వలన దీనిని కథా సంబంధ నివేదికా వ్యాసంగా చెప్పవచ్చు. అలాగే ఒక ప్రాంత అణచివేతను, ఉనికి, హక్కులు వంటి అంశాలను వస్తువుగా మలిచిన కథల ప్రస్తావనతో సాగింది కావున దీనిని ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ పద్ధతి వ్యాసంగా కూడా చెప్పవచ్చు.

### 3.9.2. సూర్యలంకలో కథాసరిత్సాగరం

కోడూరి విజయ్ కుమార్ రాసిన 'సూర్యలంకలో కథాసరిత్సాగరం' అనే వ్యాసం నవంబర్ 07, 2016న సాక్షి–సాహిత్యం పుటలో వెలువడింది.

బాపట్ల దగ్గరి సూర్యలంకలో అక్టోబర్ 22, 23 తేదీల్లో జరిగిన కథాసమావేశ సంబంధ వివరాలను తెలుపుతూ రాసిన నివేదిక వ్యాసం ఇది.

రోజువారీ ఉరుకుల పరుగులకు దూరంగా ఏ అడవిలోనో, ఏ చెరువు గట్టునో ఒక రెండు రోజులు కథ గురించి సావకాశంగా మాట్లాడుకోవడం ఏ రచయితకైనా కమ్మటికల! దాదాపు రెండు దశాబ్దాలుగా, ఏడాదికి ఒకసారి, కుదరకపోతే రెండేళ్ల కోసారైనా అట్లాంటి కలను నిజం చేస్తున్నారు ఖదీర్–సురేశ్ మిత్ర బృందం అంటూ బాపట్ల దగ్గర సూర్యలంకలో జరిగిన కథా సమావేశ వివరాలను మనకందించారు. సీనియర్ రచయిత దాదా హయత్ నుండి కొత్తగా రాస్తున్న శిరీష వరకూ సుమారు పాతిక మంది ఇందులో పాల్గొన్నారు. ఇటీవల మరణించిన చిలుకూరి దేవపుత్రను స్మరించుకుంటూ మొదలైన ఈ సమావేశంలో కథా రచనలో ఎదుర్కొనే సవాళ్లు, కొందరు విరివిగా రాయడం, కొందరు అలా రాయలేకపోవడం, విరివిగా రాసే రచయితల్లో క్వాలిటీ

ఉండదనే అపోహ, కథారచనలో ప్రయోగాల అవసరం, నిడివి ఎక్కువగా ఉన్న కథల ప్రచురణలోని ఇబ్బందులు సజీవ భాషను వాడటంలోని పరిమితులు, సాహిత్యం – సినిమా నడుమ సంబంధాలు, సామాజిక, రాజకీయ అంశాలను కథలుగా మలిచేటప్పుడు ఒక రచయితకు అవగాహన వంటి అనేకాంశాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చాయని, కథా సమావేశ వివరాలను, కథకుల ప్రసంగాల్లోన్ని విలువైన అంశాలను ప్రస్తావిస్తూ కథా సంబంధ నివేదికా వ్యాసంగా దీన్ని రాసారు. ఇలాంటి వ్యాసాల వలన సాహిత్య జగత్తులోని సమాచారాలు త్వరితగతిలో పాఠకులకు అందుతాయి. అలాగే విలువైన విషయాలను అవగతం చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది. ఇది సాహిత్యాంశానికి సంబంధించిన వ్యాసమే అయిన వార్తా వ్యాసంలాగా లీడ్ సూత్రాన్ని (5W+1H) ప్రయోగిస్తూ సాహిత్య సమాచారాన్ని ఇలా నివేదికల రూపంగా దినపత్రికల సాహిత్యపుటలు ప్రచురిస్తున్నారు. ఎప్పటికప్పుడు త్వరితగతిలో దైనందిన సమాచారాన్ని అందించే దినపత్రిక ఇలాంటి నివేదిక వ్యాస రూపంలో సాహిత్య విషయాలను కూడా వార్తల వలే ఎప్పటికప్పుడు పాఠకులకు అందిస్తున్నాయి.

### 3.9.3. ఈ సమాజం రచయితకి, కళాకారులకి స్వర్గం

"ఈ సమాజం రచయితకి, కళాకారులకి స్వర్గం" అనే ఈ వ్యాసం అక్టోబర్ 03, 2016న సాక్షి–సాహిత్యం పుటలో ప్రచురితమయింది. సెప్టెంబర్ 25న జరిగిన 'ప్రాతినిధ్య–2015' ఆవిష్కరణ సభలో దర్శకుడు గౌతమ్ ఘోష్ చేసిన ప్రసంగ భాగమే ఈ వ్యాసం. పుస్తక ఆవిష్కరణ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ తనకు తెలుగు సాహిత్యము పట్ల గల అభిమానాన్ని అలాగే ప్రాతినిధ్య కథల సంకలనం విశిష్టతను పేర్కొన్నారు. "ఈ ప్రాతినిధ్య సంకలనంలో మహిళలు, దళితుల, ముస్లింల కథలు ఎక్కువగా ఉండటం సంతోషకరమైన విషయం. ఈ దేశ సబ్బండ వర్ణాల అస్తిత్వం ఘనమైనది. అది ఇంకా ఎక్కువగా సాహిత్యంలో ప్రతిఫలించాల్సిన అవసరం ఉన్నది. ప్రస్తుత అభివృద్ధి నమూనాలో ఎక్కువగా బాధితులు కూడా ఈ వర్గాలే. అది కూడా సాహిత్యంలో ఇంకా ఎక్కువగా రావాలని అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఇలా ఒక కథాసంకలన ఆవిష్కరణ వివరాలను తెలుపుతూ వచ్చిన కథా సంబంధ నివేదికా వ్యాసం ఇది.

## 3.10. పాశ్చాత్య కథాసంబంధ వ్యాసాలు

ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచ సాహిత్యాన్ని పాఠకులకు అందించాలనే లక్ష్యంగా తెలుగుతోపాటు పాశ్చాత్య సాహిత్య ప్రచురణలు సాహిత్యపుటల్లో చోటు చేసుకుంటున్నాయి. పాశ్చాత్య కవులను, వారి వ్యక్తిత్వాలను రచనల గొప్పతనాన్ని పరిచయం చేస్తూ పాశ్చాత్య సాహిత్య

వ్యాసాలు వెలువడుతున్నాయి. పాశ్చాత్య కథా సాహిత్య సంబంధ వ్యాసాలు కూడా మనకు ఈ రెండు పత్రికల్లో కనిపిస్తున్నాయి. వీటి ద్వారా ప్రపంచ సాహిత్యం, కవుల గురించి అవగాహన కలుగుతుంది.

### 3.10.1. కామూ, సార్త్రే స్నేహపూర్వక శత్రుత్వం

సాకం నాగరాజు రాసిన 'కామూ, సార్త్రే స్నేహపూర్వక శత్రుత్వం' అనే వ్యాసం నవంబర్ 28, 2016న సాక్షి–సాహిత్యం పుటలో వెలువడింది.

వ్యాసకర్త అల్బర్ట్ కామూ, జీన్‌పాల్ సార్త్రే ఇద్దరు రచయితల వ్యక్తిత్వాలను తెలుపుతూ రాసిన వ్యాసమిది.

మొదటినుంచీ ఆల్బర్ట్ కామూ, జీన్‌పాల్ సార్త్రే ఇద్దరు కూడా ఒకరి తోవలో ఒకరు తారసపడుతూనే వచ్చారు. వాళ్ళిద్దరూ కథకులు, నాటక రచయితలూ, వ్యాసకర్తలు, విమర్శకులు, తత్త్వవేత్తలు, సంపాదకులు. ఇద్దరికీ ఒకరే ప్రచురణకర్త కూడా. నోబెల్ బహుమతిని ప్రకటించినప్పుడు కామూ సంతోషంతో స్వీకరించాడు. కానీ సార్త్రే తనకన్నా కామూకి ముందే నోబెల్ రావడం వల్ల దాన్ని తిరిస్కరించాడు (అది ఒక కారణం:1964లో) అని ఇద్దరు కవుల వ్యక్తిత్వాలను వివరించారు. ఇద్దరి భావాలు కూడా ఒకటే అంటూ తెలిపారు. స్త్రీ సాహచర్యం మీద మాత్రం ఆశ్చర్యకరంగా ఇద్దరివీ ఒకే భావాలు. కామూ తన డైరీలో 1951లో ఇలా రాసుకుంటాడు "ఎందుకు స్త్రీ?" అతని సమాధానం – "పురుషుల సాహచర్యాన్ని నేను భరించలేను. వారు మనిషిని తూకాలు వేస్తారు లేదా పొగుడుతారు. ఆ రెండింటిని కూడా నేను సహించలేను". "పురుషుల సాహచర్యం నాకు భయంకరమైన విసుగు తెప్పిస్తుంది. కానీ, నన్ను ఆనందపరచని స్త్రీల సాహచర్యం చాలా అరుదు" అని 1940లో సార్త్రే కూడా తన డైరీలో కామూ లాగే రాసుకున్నారని చెప్తూ వారి భావాలలో సామ్యాన్ని తెలిపారు.

వాళ్ళిద్దరూ చాలా కాలం మిత్రులుగానూ ఉన్నారు, శత్రువులుగానూ ఉన్నారని వివరించారు. "మేథోగతమైన" పోటీ వల్ల ఇద్దరి మిత్రుత్వం కాస్త శత్రుత్వం బారిన పడింది. అయినప్పటికీ ఆ సమయానికి వారిద్దరి స్వరం స్నేహపూర్వకంగానే ఉండేది. 1945లో సార్త్రే 'ఫ్రాన్స్'లో ఆవిష్కృతమైన వర్తమాన సాహిత్యం గురించి మాట్లాడ్డానికి అమెరికా వెళ్లినప్పుడు ఈ వర్తమాన సాహిత్యం తిరుగుబాటు ఉద్యమాల వల్ల, యుద్ధం వల్ల పుట్టిందనీ ఆ సాహిత్యానికి ఉత్తమోత్తమ ప్రతినిధి 30 ఏళ్ల ఆల్బర్ట్ కామూ అని అంటాడు.

ఈ విధంగా వ్యాసకర్త ఇద్దరూ రచయితల జీవిత వ్యక్తిత్వాలను తెలుపుతూ కవి జీవిత విమర్శ పద్ధతిలో ఈ వ్యాసాన్ని రాశారు.

**ఈ అధ్యాయంలోని ముఖ్యాంశాలు**

- శిల్ప సంబంధ విషయాలు వివరించడం జరిగింది.
- వస్తు సంబంధ విషయాల్లో ప్రాంతీయత, మైనార్టీ ప్రజల జీవిత చిత్రణ వంటి విభిన్న కథావస్తువుల గూర్చి తెలుపబడింది.
- అనువాద కథల గూర్చి పరిచయం జరిగింది.
- ముందుమాట, నివేదికలకు ప్రాధాన్యమిస్తూ ప్రచురించిన వ్యాసాల సంబంధిత విషయాలు చర్చించబడ్డాయి.
- వాద ప్రతి వాద విమర్శ పద్ధతిని పరిచయం చేసి, ఆ విమర్శ ప్రయోజనం వివరించబడింది.
- పాశ్చాత్య కథాసాహిత్య సంబంధ విషయాలు వివరించబడ్డాయి.

ఈ విధంగా కథానిక ప్రక్రియ పరిచయం, కథానిక విమర్శ భేదాలు తెలుపుతూ సాక్షి, నమస్తే తెలంగాణ పత్రికల్లోని సాహిత్య వ్యాసాల్లో సమన్వయం చూపడం జరిగింది. ఇక నవల విమర్శ భేదాలను రానున్న నాల్గవ అధ్యాయంలో పరిశీలిస్తాను.

★★★

# నాల్గవ అధ్యాయం

## సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య

## వ్యాసాలు–నవలా విమర్శ

# అధ్యాయం–4

# సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు–నవలా విమర్శ

## 4.0. పరిచయం

సాక్షి, నమస్తే తెలంగాణ సాహిత్యపుటల్లో వచ్చిన అనేక రకాల కథానిక వ్యాసాలను గత అధ్యాయంలో విశ్లేషించుకున్నాము. నేడు దినపత్రికల సాహిత్య పుటల్లో అనేక రకాల నవలా సంబంధ వ్యాసాలు ప్రచురితమవుతున్నాయి. సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్యపుటల్లో కూడా ఈ రకమైన వ్యాసాలు కనిపిస్తున్నాయి. మనోవైజ్ఞానిక నవల, అనువాద నవల, గిరిజన నవల వంటి వివిధ రకాల నవల సంబంధ వ్యాసాలు ఈ రెండు పత్రికల్లోనూ వెలువడుతున్నాయి. కావున నా పరిశోధన పరిధి అయిన ఈ రెండు సంవత్సరాల(2016, 2017) కాలంలో ఎటువంటి నవలా సంబంధ వ్యాసాలను ప్రచురించారనే విషయాన్ని తెలుపుతూ, వాటిని ఈ అధ్యాయం ద్వారా విమర్శనాత్మక పద్ధతిలో విశ్లేషించడం జరుగుతుంది. నవలా సంబంధ వ్యాసాలను విశ్లేషించుకునే ముందు అసలు నవల అంటే ఏమిటి దాని నిర్వచనం, లక్షణాలు, నవల వికాసం వంటి అంశాలను గుర్తుచేసుకోవాలి.

## 4.1. నవల నిర్వచనం–లక్షణాలు

తెలుగు సాహిత్య చరిత్రలో అనేక ప్రక్రియలు వచ్చాయి. ప్రాచీన, ఆధునిక సాహిత్యంగా వాటి విభజన కూడా జరిగింది. ఆధునిక సాహిత్యంలో వచ్చిన ప్రక్రియల్లో ముఖ్యంగా పేర్కొనదగినవి నవల, కథ, స్వీయచరిత్ర, వ్యాఖ్యానం, విమర్శ, జీవిత చరిత్ర, వ్యాసం ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కకు మిక్కిలిగానే ఉన్నాయి. కానీ కొన్ని ప్రక్రియలు మాత్రమే అచిరకాలంగా వాటి అస్థిత్వాన్ని నిలుపుకున్నాయి. అందులో 'నవల' చాలా ప్రముఖమైందిగా చెప్పవచ్చు. నవల అనేది గద్య రచన "గద్యం కవీనాం నికషం వదన్తి" అనేది ఆర్యోక్తి – నిజమే గద్యం రాయడం కష్టసాధ్యమైన పని. రచయిత ఎంతో శక్తిమంతుడయితేనే తప్ప వచనంలో పాఠకుల్ని మెప్పించలేడనేది సత్యం. ఈ కారణం చేతనో, మరే కారణాల చేతనో, సర్వ సాధారణంగా గద్యానికి ముందు ప్రతి భాషలోనూ పద్యమే అవతరిస్తూ ఉంటుంది" (శ్రీరామమూర్తి, కోడూరి. 1979. పుట.1).

ప్రాచీన తెలుగు సాహిత్యంలో కాలక్రమంగా చాలా సాహిత్య ప్రక్రియలు వచ్చినట్లే ఆధునికంలో కూడా వచ్చాయి. రాజుల వనవిహారం, వేద, పురాణ సారాలు, పౌరాణిక కథలు కావ్యాలుగా మలిచారు. క్రీ.శ.19వ శతాబ్దం నాటికి ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల

తెలుగు సాహిత్యంలో ఎన్నో ప్రక్రియలు ఉద్భవించాయి. అలా వచ్చిన ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో ఎంతోమందిని ప్రభావితం చేసింది నవల.

"నవలా ప్రక్రియ మొట్టమొదట ఇటలీ దేశంలో ఉద్భవించింది. ప్రముఖ ఇటలీ సాహితీవేత్త (Bocaccio) బొకోషియో జివానీ క్రీ.శ.1350 డెకామెరన్ (Decameron) అనే పేరుతో నూరు ప్రేమ కథలను ఒక సంపుటంగా రాశాడు. దీనికి ఇటాలీయన్ భాషలో 'Novella Storia' అనే పేరు పెట్టాడు. ఈ మాటకు అర్థం ఏమిటంటే 'క్రొత్త కథ' అని వచనంలో, 'కథ' మాదిరిగా ఉంటూ, కథకు భిన్నమైన ఒక విలక్షణత కలిగిన సాహిత్య ప్రక్రియను బొకేషియో Novellaగా పేర్కొన్నాడు" (శ్రీరామమూర్తి, కోడూరి.1979.పుట.1).

ఇంగ్లీషులో నవలా సాహిత్య ప్రక్రియకు నాంది పలికిన గద్యరచన 1579లో వచ్చిందని చెప్తారు. దీని రచయిత జాన్‌లీలి. ఆంగ్లంలో దీని మూలాలు కన్పిస్తున్నాయని చెప్పవచ్చు. తెలుగులో కూడా కాదంబరి లాంటిది ఎన్నో సంవత్సరాల నుండే ఉంది. ఇంగ్లీషు నవల 16వ శతాబ్దంలో ఆవిర్భవించినప్పటికీ గొప్ప ఆంగ్ల నవలలు రావడం సర్ వాల్టర్ స్కాట్‌తోనే ప్రారంభం అయ్యిందని చెప్తారు.

### 4.1.1. నవల–ప్రారంభం

ఆంగ్లంలో 'Novel' అనే పదం నుండి వచ్చిందని చెప్తారు. భారతీయ భాషలలో నవలా రచన క్రీ.శ.19వ శతాబ్దం నుండి కన్పిస్తుంది. 1865లో బంకించంద్ర ఛటర్జీ రచించిన బెంగాలీ నవల దుర్గేశనందిని భారతీయ భాషల్లో వచ్చిన మొదటి నవలగా చెప్తారు. దుర్గేశ నందిని వచ్చిన కొద్ది సంవత్సరాలకే క్రీ.శ.1872లో తొలి తెలుగు నవల వెలువడింది.

" 'శ్రీరంగరాజచరిత్ర' తెలుగులో వచ్చిన మొదటి నవల. కొక్కొండ వేంకట రత్నంగారి మహాశ్వేత క్రీ.శ.1867ను తెలుగులో తొలి నవలగా కొందరు పరిశోధకులు తలచారు గాని ఆ వచన రచన బాణ మహాకవి 'కాదంబరి'లోని 'మహాశ్వేత' వృత్తాంతానికి అనుసరణమే. ఇది స్వతంత్ర రచన కాదు. రచయిత సొంతంగా చేసిన కల్పనలేవీ ఇందులో లేవు. ఆధునిక నవల లక్షణాలు ఇందులో లేవు. వైస్‌రాయ్ లార్డుమేయో బెంగాలీ భాషలో నవలారచనను ప్రోత్సహించే తలపుతో "బంగాళుల యాచారంబులు తెలుపు ప్రబంధంబు గావించువానికి బహుమానము" నివ్వదలచినట్లు గెజెట్‌లో ప్రకటించారు" (రామమోహనరాయ్, కడియాల.2012. పుట. 2). అప్పుడు ప్రబంధం అనే పదం నవలకు వాడారు. గోపాలకృష్ణమసెట్టి నవల అని కాకుండా నవీన ప్రబంధం అన్నాడు. నవలను, నవీన ప్రబంధం, వచన ప్రబంధం అని చివరకు 'నవల' అనే పేరు

స్థిరంగా ఉందని 'వివేక చంద్రిక' అనే నామాంతరం గల 'రాజశేఖర చరిత్రము' పై విమర్శ చేసిన కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి తెలుగులో కొత్తగా వచ్చిన వచన ప్రబంధాన్ని 'నవల' అనటం సమంజసంగా ఉంటుందన్నారు. ఆంగ్లేయ భాషలో నావల్ (Novel) అను పదము కొత్త యను నర్థముగల 'నవ్' అను పదము నుండి పుట్టినది. ఈ 'నవ్' అను దానికిని 'నవ'యను సంస్కృత పదమునకును గల సంబంధము తేటతెల్లంబె కదా? కావున నవల యనగా "నవాన్ విశేషాన్ లాతిగృహ్ణాతీతి నవలా" అనగా క్రొత్త విశేషములు గలదని యర్థము వచ్చుచున్నది. వచన భాషయందును నీ మాటకిదియే యర్థమగుటచే నవలను పదమునకు సరియైన వేరొక సంస్కృత పదమునకయి ప్రయత్నము చేయక 'నవల' యని యీ పదము నేనిట వాడుచున్నాను" (2012.పుట.5) అని కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి అన్నట్లు కడియాల రామమోహనరాయ్ తెలిపారు.

### 4.1.2. నవల ఆధునిక–సంప్రదాయం

"ఆధునికత కేవలం కాలానికి సంబంధించింది కాదు. ఆధునిక కాలంలో రాసిన రచనలన్నీ "ఆధునికత" ఉన్నవి కావు. ఆధునికతను వివక్షించటానికి కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి" (ఆనందరామం,సి.1994.పుట.1). నవల ఆధునిక ప్రాచీన విషయాలను చర్చించడమైంది. నవలలోని వస్తువును బట్టి అది ఆధునికమా? ప్రాచీనమా? అనేది నిర్ణయించబడుతుంది. మానవుడు సృష్టికి కేంద్ర బిందువు అనే భావనను బలపరిచేది ఆధునికత. మానవున్ని దేవుడు సృష్టించలేదు. దేవుడినే మానవుడు సృష్టించుకున్నాడని తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఆనందరామం ఆధునికత సంబంధ విషయాలను 'నవలావిమర్శ' అనే గ్రంథంలో చర్చించారు.

- "ఈ జగత్తు కార్యకారణ సంబంధాత్మకం అంటే హేతుబద్ధం. 'భగవదిచ్ఛయే సకల సృష్టికి మూల కారణం. సృష్టిలో జరిగే అస్తవ్యస్తాలకు కారణం ఊహించలేము' అనేది సాంప్రదాయ భావన. "హేతుబద్ధమైన ఆలోచనకు అందని విషయం ఉండదు. శాస్త్రీయ విజ్ఞానంతో పరిశోధనాత్మకంగా ఆలోచించినపుడు మనం సృష్టిలోని అన్ని అస్తవ్యస్తతలకూ మూలకారణం గ్రహించగలము అని ప్రతిపాదించేది ఆధునికత".
- "స్వర్గనరకాలు నిజంగా ఉన్నాయని నమ్మేది సంప్రదాయ భావన. స్వర్గ నరకాలు – మొదలైనవన్నీ మానవుడు తన సామాజిక అనుభవాల ఆధారంగా ఏర్పరచుకున్న ఊహారూపాలే" అని ప్రతిపాదించేది ఆధునికత".
- "వ్యక్తి సంఘపు కట్టుబాట్లకూ, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలకూ మత నియమాలకూ కట్టుబడి ఉండాలనేది సంప్రదాయ భావన. వ్యక్తి తన అంతరంగ ప్రబోధానికి తప్ప మరిదేనికీ

బద్ధుడు కానక్కరలేదని, తరతరాల ఆచార సాంప్రదాయ శృంఖలాల నుండి విముక్తుడైనప్పుడే సహజంగా, ఉన్నతంగా ఆలోచించగలడని – ప్రతిపాదించేది ఆధునికత" (1994.పుట.1) అంటూ ఆనందరామం నవల ఆధునికతను, మానవుని ఆలోచనను, అతని స్థానాన్ని వివరిస్తూ, ఆధునికతలో మానవుడే కీలకమని తెలియజెప్పారు.

- ఇక నవలలో సంప్రదాయం ఏది అవుతుందనే విషయాన్ని కూడా చెప్తూ ఆధునికాన్ని నిర్వచించడమే కాకుండా సంప్రదాయ నవల విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ ఆధునిక పరిణామ క్రమాన్ని తెలియజేస్తారు.
- "మానవుని జీవిత విధానం విధి లిఖితం మీద ఆధారపడి ఉంటుంది అనుకోవటం సంప్రదాయ భావన. మానవుడు చారిత్రక వ్యక్తి. ఏ కాలంలో అయినా ఏ సమాజంలో అయినా మానవ చరిత్ర పరిణామక్రమాన్ని అనుసరించే అతని జీవిత విధానం రూపొందుతుందని ప్రతిపాదించేది ఆధునికత. మానవ చరిత్ర పరిణామం రాజకీయ, ఆర్థిక పరిణామాల నేపథ్యం మీద ఆధారపడి ఉంటుందని వేరుగా చెప్పక్కరలేదు. అలాగే మానవ సమాజంలోని సంక్షోభాలు రాజకీయ పరిణామాలకు దారి తీస్తాయనేది కూడా అనుభవైకవేద్యమే" (ఆనందరామం,సి.1994.పుట.2).

భారత కాలంలో ఉన్న కథలలో సంఘర్షణాత్మకమైన మానవుని జీవిత చిత్రణ ఉంది కాబట్టి అది పద్యరూపంలో ఉన్న ఆధునిక నవలగా చెప్పవచ్చని, కుంతి సూర్యుని వరంవల్ల కర్ణునికి జన్మనిచ్చిందంటే పురాతన కథ. అదే కన్నె మోసపోయి కన్యగానే తల్లిగా మారిందంటే ఆ ఇతివృత్తం నవల అవుతుందని ఆనందరామం చెప్పుకు వచ్చారు. ఇలా ప్రాచీన భారతంలోని ఆధునిక ప్రతిరూపాలు నేటి నవలల్లో కన్పిస్తాయి. నవల అనేది సామాజిక ప్రగతిశీల దర్శనంతో ఉన్న దృక్పథాన్ని, మానవుని సమస్యల పరిష్కారాన్ని, పరిస్థితులను వర్ణించేది ఆధునికత అని చెప్పవచ్చని వారి మాటల ద్వారా అవగతమయ్యింది.,

"కథాశ్రయమైనది నవల – అని అభిప్రాయం ఉంది. దీనిలో అవ్యాప్తి దోషం ఉంది. భారతీయ సాహిత్యంలో కథాశ్రయాలైన కాదంబరి, కళాపూర్ణోదయము మొదలైనవాటిని నవలలుగా వ్యవహరించలేము. తెలుగు సాహిత్యంలో నవలాప్రక్రియ నిర్ద్వంద్వంగా ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల ఆవిర్భవించింది" (ఆనందరామం,సి.1994.పుట.3).

నవలను వివిధ భాషల్లో వివిధ పేర్లతో పిలిచారు. కన్నడంలో కాదంబరి అని గుజరాతీ, మరాఠి భాషల్లో నావల్ కథా అని, హిందీ, బెంగాలీలో ఉపన్యాస్ అని తెలుగులో నవల అని అన్నారు.

వీటన్నింటిలో ఎక్కువగా కొత్తది అనే అర్థం ఉంది. సంప్రదాయానికి భిన్నంగా సమాజాన్ని సాహిత్యంతో అనుసంధానం చేయడమే ఆధునికతగా గుర్తించాలి.

### 4.1.3. నవల–నిర్వచనాలు

ఆధునిక నవల పాశ్చాత్య ప్రభావంతో మొదలైందని ముందే చెప్పుకున్నాం. పాశ్చాత్యుల్లో మొపాసా, సోమర్‌సెట్ మామ్, డి.హెచ్. లారెన్స్, జోసఫ్ సిప్లే, విలియం హెన్రీ హడ్సన్, హెచ్.జి. వేల్స్, జె.బి. ప్రీస్ట్‌లీ, మెరిడిత్, కేథరిన్ లీవర్ మొదలైనవాళ్ళు ఇంగ్లీషులో వారి వారి నిర్వచనాలను తెలిపారు. తెలుగులో కూడా రచయితలు వారి పరిశీలనా దృష్టికి అనుగుణంగా, నవల చదివిన అనుభూతి దృష్ట్యా వారు నిర్వచనాలను తెలిపారు. అందులో బొడ్డపాటి వెంకటసుబ్బయ్య, మొదటి నాగభూషణ శర్మ, పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు, కొలకలూరి ఇనాక్ మొదలైన వాళ్ళు నవలా నిర్వచనాలను పేర్కొన్నారు. కొందరి అభిప్రాయాలను ఇక్కడ పేర్కొంటున్నాను.

1) “బొట్టపాటి వెంకట కుటుంబరావు – ఆంధ్ర నవలా పరిణామము: రచనా కాలము నందలి వాస్తవికాలను జీవితాచార వ్యవహారములను చిత్రించునది నవల.
2) మొదలి నాగభూషణ శర్మ – తెలుగు నవలా వికాసము: ‘సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ, జనుల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్య ప్రబంధం నవల’.
3) పుల్లా బొట్ల వెంకటేశ్వర్లు – తెలుగు నవలా సాహిత్య వికాసము: ‘యథార్థ జీవితముల వాస్తవిక చిత్రణముగల గద్యరూపక కథా సాహిత్యము నవల’.
4) కొలకలూరి ఇనాక్: ‘ఒక దశ నుంచి మరొక దశకు, ఒక స్థితి నుంచి మరియొక స్థితికి మనుజుడు, వ్యవస్థ, దేశము పొందుతున్న పరిణామం తీసుకెళ్తుంది భవిష్యత్తుపై చిత్రింపగల ముద్ర సాకల్యంగా చర్చించి రచింపగల సాహితీప్రక్రియ నవల’.
5) ఆర్.ఎస్. సుదర్శనం: ‘వ్యక్తుల జీవితాన్ని ప్రధానంగా చిత్రిస్తూ సామాజిక జీవితాన్ని సంస్కృతి తాలూకు పోకడల్ని స్ఫురింపజేసే సాహిత్య ప్రక్రియ నవల’.
6) కె.వి.ఆర్. నరసింహం – సాహిత్య దర్శనం: ‘నవల శబ్దము వ్యుత్పత్తిని బట్టి నవ్య కథా అని చెప్పవచ్చు’.
7) కొడవటిగంటి కుటుంబరావు: ‘నవలలో జీవితం తాలూకు వాతావరణం ఉంటుంది. మానవుల ఆశయాలు ఆశయసిద్ధికి వారు చేసే కృషి, ఆ కృషికి ఏర్పడే అవాంతరాలు. జీవిత సంఘర్షణ నవలల్లో విపులంగా చిత్రించడానికి వీలుంటుంది’.

8) గొ(్రె)పాటి వెంకట సుబ్బయ్య: 'వాస్తవిక మార్గాన్ని అనుసరించి దైనందిన జీవితంలో కలిగే మానవ ప్రకృతులను, సంఘటనలను ప్రతిబింబిస్తూ, రాయబడిన కల్పిత గాథ నవల' " (సిమ్మన్న, వెలమల.2021.పుట.330, 331).

### 4.1.4. నవల–లక్షణాలు

నవల అనేది ఒక ప్రక్రియ. మరి దీనికి కూడా కొన్ని నిర్ధిష్టమైన లక్షణాలున్నాయని కృషి చేసినవారు తెలిపారు. నవల అనేది ఒక గద్య కావ్యం. ఇది ఎలా ఉండాలనే విషయాన్ని, దాని లక్షణాల్ని కొలకలూరి ఇనాక్ నిర్వచించినట్లు వెలమల సిమ్మన్న 'తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు' అనే గ్రంథంలో పేర్కొన్నారు. అందులో కొన్నింటిని పరిశీలిద్దాం.

- "నవల గద్యకావ్యం (ఇది గ్రాంథికంలోనైనా, వ్యవహారికంలోనైనా ఉంటూ వచన రూపంలో ఉండాలి).
- యుగ చిత్రణ నవల ప్రథమ ధ్యేయం, అంటే సమకాలీన సమాజ జీవిత చిత్రణ నవల పరమ లక్ష్యం.
- సహజమైన, స్వాభావికమైన శైలి నవలకు ప్రాణం.
- సర్వజీవిత విధానానికి వ్యాపకమైన, విస్తృతమైన విధానం నవలలో ఉంటుంది.
- నవల ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, వ్యాఖ్యానం చేయడానికి రచయితకు అవకాశం ఇస్తుంది.
- కాల్పనిక సాహిత్యానికి, సరళమైన స్వాభావికమైన రూపం నవల.
- నవలా ప్రక్రియలో నాటకం, కావ్యం, అధిక్షేప కావ్యంలాంటి అన్ని ప్రక్రియల విధానాల్ని ఉపయుక్తం చేసే అవకాశం ఉంటుంది.
- మనోరంజనంతోపాటు విజ్ఞాన సముపార్జన కూడా నవలలో సాధ్యం అవుతుంది.
- యథార్థ జీవితంలో సత్యం కంటె, నవలలోని సత్యం గాఢం అయింది. యథార్థ జీవితంలోనివన్నీ జరిగిన సత్యాలు, కానీ, నవలలో సంభవం కాగల సత్యాలకు కూడా స్థానం ఉంటుంది.
- వేదన, భావుకత ఈ రెండూ నవలకు ప్రేరణ శక్తులు.
- ఒక వ్యక్తి జీవితాన్ని గురించి గాని, జీవితంలోని ఒక ముఖ్య భాగాన్ని గురించి గాని నవల చిత్రించడానికి ప్రయత్నిస్తుంది.

- రచయితే కథను నడిపించవచ్చు లేదా పాత్రల చేత కథ నడిపిస్తూ అక్కడక్కడ జీవిత వ్యాఖ్యానాలు చేస్తూ, పాత్రల్ని ముందుకు తీసుకెళ్ళవచ్చు. ఆ పాత్రల ద్వారా పాఠకులకు హితోపదేశం చేయడానికి అవకాశం ఉంటుంది.,
- విమర్శనాత్మకం, వ్యాఖ్యానాత్మకం నాటకీయం లాంటి శైలులలో ఏ ఒక్క శైలినిగానీ, అన్నింటినీ గానీ నవలలో ప్రయత్నించే అవకాశం ఉంది.
- జాగ్రత్ సుషుప్తి అవస్థల్లోని సర్వ విషయాల్ని ఉద్వేగాల్ని వెలికి తెచ్చి వర్ణించడానికి తగిన సాధనం నవల.
- వాస్తవ సమాజాన్ని, సమకాలీన సమాజాన్ని మనముందుంచ కల్గినది నవల.
- జీవిత వాస్తవాల్ని విశదీకరించడానికి, లోతుగా చిత్రించడానికి అనువైంది నవల.
- జీవిత వాస్తవాల్ని విశదీకరించడానికి, లోతుగా చిత్రించడానికి అనువైంది నవల. చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, నైతిక, తాత్త్విక విషయాలతోపాటు, మానవ మనస్తత్వాన్ని కూడా చిత్రించగలిగి, విశిష్టతను సంతరించుకొన్న ఆధునిక సాహిత్య ప్రక్రియ నవల.
- ఇతర సాహిత్య ప్రక్రియల స్వరూప స్వభావాలు ఈ నవలా ప్రక్రియలో ఇమిడిపోయాయి" (సిమ్మన్న, వెలమల.2021.పుట.331,332).

ఇవి నవలకు ఉండాల్సిన లక్షణాలుగా చెప్పబడ్డాయి.

### 4.1.5. నవలా విమర్శ

కల్పన సాహిత్యంలో అధికంగా విస్తృతి కలిగింది నవలగా చెప్పవచ్చు. వాస్తవ జీవితాన్ని, కాల్పనికతను సమపాళ్ళలో రంగరించి ఇచ్చేది నవల. "సాహిత్యాన్ని సమాజంతో అనుసంధించే సాహితీ ప్రక్రియ నవల. ఆధునిక సాహిత్య ప్రక్రియలన్నీ తెలుగులో ఆంగ్ల సాహిత్య ప్రభావంతో వికసించినవే. ఆంగ్ల సాహిత్య విమర్శ సూత్రాలనే ఆధునిక తెలుగు సాహితీ ప్రక్రియల విమర్శకు ప్రమాణంగా గ్రహిస్తున్నాం. సాహిత్య జీవితానికి వ్యాఖ్యానం. ఇది అన్ని సాహితీ ప్రక్రియలకు సమానమే అయినా, కవిత్వంలోనూ, నవలలోనూ ప్రతిఫలించే జీవిత చిత్రణలో కొన్ని భేదాలున్నాయి. మానవుడు తన అనుభవమూ, జీవిత దర్శనమూ ఆధారంగా తాను గ్రహించిన పరమార్థం ప్రస్ఫుటమయ్యేలాగ జీవితాన్ని లేదా సమాజాన్ని పునర్నిర్మించటమే 'సృజన' అని విమర్శకులందరూ అంగీకరించారు" (ఆనందరామం, సి.1994.పుట.4).

"నవలలో కనిపించే కళాత్మక జీవిత చిత్రణకూ సమకాలీన సమాజ స్వరూపానికీ గల సంబంధాన్ని ఆశ్రయించుకొని ఉంటుంది, నవలా విమర్శ ఇ.యం. ఫారెస్టర్ ప్రభృతులు విశ్లేషించిన

"Round and Flat Characters" (ఏకోన్ముఖ వికసన పాత్రలు – బహుముఖ వికసన పాత్రలు) –"Point of View" (దృక్కోణం) (1994.పుట.) మొదలైన విమర్శనాంశాలన్నీ పై పరిశీలనలోనే అంతర్లీనమవుతాయంటూ నవలా విమర్శను నిర్వచించారు ఆనందరామం. కాలక్రమంగా వచ్చే మార్పులను బట్టి కూడా ఒక్కో దశాబ్దంలో కొన్ని ప్రాధాన్యతలతో రచించడం జరిగింది. దీనికి దేశకాల పరిస్థితులు కారణం. 1960లో ఎక్కువగా ప్రణయ నవలలు, కుటుంబ నవలలు వస్తే 1980లో థ్రిల్లర్ నవలలు వచ్చాయి. 1990 తర్వాత స్త్రీవాద, దళితవాద నవలలు వచ్చాయి. ఏ ఉద్యమానికి సంబంధించినదైన, భావజాలానికి సంబంధించినదైనా కవిత్వం, కథలు వచ్చినంతగా నవల రాలేదు. వాటిపై విమర్శలు కూడా రాలేదు.

"నవలా రచన 1872లో ప్రారంభమైనా నవలావిమర్శ సమగ్ర రూపం దాల్చడానికి చాలా కాలం పట్టింది. అయితే బహుశా 1896లో నవలా పోటీలను ప్రకటిస్తూ పెట్టిన నిబంధనలు ఈ ప్రక్రియకు సంబంధించి చేసిన తొలి వివేచనగా చెప్పవచ్చు. ఈ పోటీల ద్వారా నవలల నుంచి పాఠకులు ఆశించవలసింది ఏమిటనే స్పష్టతను ప్రచురణ కర్తలు ఇవ్వడానికి ప్రయత్నించారు. ఈ ప్రకటనలో నిబంధనలు రూపొందించింది కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి. వీరినే తొలి తెలుగు నవలా విమర్శకులుగా చెప్పవచ్చు" (లక్ష్మణచక్రవర్తి, సి.ఎచ్.(సంపా). 2016.పుట.196).

కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి వీరేశలింగం పంతులు రాజశేఖర చరిత్ర నవలను ప్రణాళికతో 'వివేకచంద్రిక' విమర్శనం పేరుతో విమర్శ చేశారు. వివేక చంద్రిక 'వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్' అనే ఆంగ్ల నవల మూల ప్రేరణ. ఈ నవల విమర్శ చేస్తూ ప్రణాళికలో ఏడు భాగాలు చేసుకొని విభజించారు. అవి 1) కథామూలము, 2) ఇతివృత్తము, 3) పాత్రములు, 4) రసము, 5) వర్ణనలు, 6) అలంకారములు, 7) నీతులు – ఆచార వ్యవహారములు. తొలి కాలంలో నవల విమర్శ ఆధునికంగా కాక కావ్యవిమర్శ ధోరణిలో కన్పిస్తుంది.

నవలా విమర్శలో కొన్నింటిని పరిగణనలోనికి తీసుకోవలసి ఉంటుంది. "1) వస్తువు, 2) ఇతివృత్తం (కథానిర్మాణం), 3) పాత్రలు, 4) వాతావరణ, దేశకాల పరిస్థితులు, 5) సన్నివేశాలు, 6) శైలి, 7) రచయిత దృక్పథం, 8) రచయిత కంఠస్వరం, 9) ప్రారంభం, ముగింపు, నిర్వహణ. అంటే నవల ఏమి చెబుతున్నదన్న దానితోపాటు, ఎలా చెబుతున్నది, చెబుతున్న విషయం వెనక ఉన్న రచయిత ప్రాపంచిక దృక్పథం ఏమిటి అనే విషయాలను నవలా విమర్శ పరామర్శిస్తుంది. నవలను చదువుతున్న పాఠకుడు ఈ విషయాలన్నింటినీ ప్రత్యేకంగా చూస్తాడని కాదు. కానీ ఇవన్నీ సక్రమంగా నిర్వహింపబడినప్పుడే రచయిత తన రచన ద్వారా అందించదలచుకున్నది సంపూర్ణంగా

అందించగలుగుతాడు. ఈ చెప్పినవాటన్నిటితోపాటు, నవల ఏ విభాగానికి చెందుతుంది అన్నది కూడ పరిగణనలోనికి తీసుకోవాలి" (లక్ష్మణ చక్రవర్తి, సి.ఎచ్.(సంపా). 2016.పుట.198).

నవలావిమర్శ అనేది రకరకాల రూపాల్లో కన్పిస్తుంది. విశ్వవిద్యాలయాల్లో పరిశోధన రూపం, ధోరణుల మీద, రచయితల మీద వచ్చిన వ్యాసాల రూపంలో, వ్యాస సంకలన, సంపుటాల్లో, రచయితకు సంబంధించిన రచనల్లో చూడవచ్చు.

"తెలుగు నవలా విమర్శ ప్రధానంగా ప్రక్రియ స్వరూప స్వభావాలను సోదాహరణంగా చిత్రించడం జరిగింది. ఈ నేపథ్యంలో చూసినపుడు, సిద్ధాంత గ్రంథాల్లో బహుళ ప్రచారం పొంది, అనంతర పరిశోధకులకు, విమర్శకులకు మార్గదర్శకంగా నిలిచినవి కొన్ని ఉన్నాయి. అవి స్వభావ స్వరూపాలను బట్టి చూస్తే సిద్ధాంత గ్రంథాలలో నవలాప్రక్రియ ఆవిర్భావం, స్వరూప స్వభావాలను సవివరంగాను, విభిన్న కోణాల నుంచి చర్చించిన వాటిలో బొడ్డపాటి కుటుంబరాయశర్మ "ఆంధ్ర నవలా పరిణామము (1963), పి. సంజీవమ్మ (1982) తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం, ఎం.వసుంధర తెలుగు చారిత్రక నవలాలోకనం (1982), సి. మృణాళిని 'సాంఘిక నవలల్లో కథాకథనశిల్పం (1986), కె. విఠలాచార్య తెలుగులో గొలుసుకట్టు నవలలు (1980), టి. రాజేశ్వరి 'స్వాతంత్ర్యానంతర తెలుగు నవలావికాసం' (1987), నళిని తెలుగులో హాస్య నవలలు (1990), తెలుగు నవలల్లో వాస్తవికత, తెలుగు నవలల్లో నవ్య మానవతావాదం మొదలైనవి చెప్పుకోవచ్చు".

"వీటిలో ఒక ప్రక్రియగా నవలా వికాసం, అందులోని విభిన్న పార్శ్వాలు తడమడం కనిపిస్తుంది. నవలపై తొలి సిద్ధాంత గ్రంథమైన కుటుంబరాయశర్మ గ్రంథంలో నవలాప్రక్రియ అర్వాచీనమైనదేమీ కాదనీ, భారతాది ఇతిహాసాల్లో నవలా లక్షణాలున్నాయనీ ప్రతిపాదించారు. అయితే తదనంతరం వచ్చిన సిద్ధాంత వ్యాసాలన్నీ నవలాప్రక్రియ పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో వచ్చినదేననీ, ఇతిహాసాల్లో ఉన్న కథాకథనం నవలలోని కథాకథనం కంటే భిన్నమైనదనీ చెప్పడం జరిగింది" (లక్ష్మణచక్రవర్తి,సి.ఎచ్.(సంపా).2016.పుట.200) ఇలా నవలావిమర్శ రకరకాలుగా వచ్చిందని చెప్పవచ్చు. నవలపై కూడా ప్రత్యేక గ్రంథాలు వచ్చాయి. ముదిగొండ వీరభద్రయ్య 'నవల–నవలావిమర్శకులు', ముదిగంటి సుజాతారెడ్డి 'తెలుగు నవలానుశీలనం' అనేవి నవల స్వరూప, స్వభావాల చర్చ చేశాయి. వీరభద్రయ్య 'శిల్ప' సంబంధం విషయాలను తెలిపాడు. మనోవైజ్ఞానిక విమర్శ, ప్రాగ్రూప విమర్శ గూర్చి కోడూరి శ్రీరామమూర్తి, నవీన్, రామకృష్ణరావు, విద్వేశ్వరీ, ఆనందరామం తెలియజేశారు. వామపక్ష విమర్శ, వరవరరావు, రాచపాళెం,

వేణుగోపాల్ చేశారు. తాత్త్విక విమర్శ – ఆర్.ఎస్. సుదర్శనం, వాసిలి వసంతకుమార్ చేశారు. సామాజిక విమర్శ – పి. సంజీవమ్మ ఇలా రకరకాల విమర్శల్లో కృషి చేశారు.

"తెలుగు నవలా విమర్శలో ఇంకా విశ్లేషించదగిన అంశాలు చర్చించవలసిన కోణాలు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు 'నవలకాలం' (Time), 'నవలలో కథకుడు', 'నవలలో ఐరనీ' తెలుగు నవల తులనాత్మక పరిశీలన మొదలైన అంశాలపై ఇంకా విమర్శ రావలసి ఉంది. నవలా విమర్శ ఎదగడానికి అవసరమైన వైవిధ్యాలతో నవలా సృజన జరగడం లేదన్నమాట కూడా వాస్తవమే అయినప్పటికీ ఉన్న నవలల గురించే ఇంకా లోతుగా కొత్త కోణాల నుంచి విమర్శ రావలసి ఉంది" (లక్ష్మణ చక్రవర్తి, సి.ఎచ్.(సంపా).2016. పుట.208) అని ఈ విధంగా నవల సంబంధ విమర్శ మనకు కనిపిస్తుంది. ఇకపై సాక్షి, నమస్తే తెలంగాణ దిన పత్రికల్లో వచ్చిన వివిధ రకాల నవలా సంబంధ వ్యాసాలను ఉప విభాగాలుగా కింద విభజించి విశ్లేషణ జరుగుతుంది.

### 4.2. అనువాద నవలా వ్యాసాలు

సాహిత్యంలో సృజన, అనువాదం రెండు కళ్ళలాంటివని చెప్తారు. అనువాదంలోనే భాష వృద్ధి చెందుతుంది. రకరకాల సంస్కృతులతో మిళితమైన మన దేశంలో అనువాదం వలన సమైక్యత ఏర్పడుతుంది. పురాణ కాలంలో కూడా సంస్కృత భాష నుండి వచ్చిన కావ్యాలే తెలుగులో అనువాదం చేయబడ్డవి. అనువాదం ప్రాధాన్యత గొప్పనైనది.

అనువాదం అంటే ఏమిటో వివరిస్తూ రాచమల్లు రామచంద్రారెడ్డి తన అనువాద సమస్యలు పుస్తకంలో ఇలా వివరించారు. "ఒక భాషలో ఉన్న విషయాన్ని మరొక భాషలోకి మార్చడం. మార్చడమంటే మరొక భాషలో చెప్పడమూ కావచ్చు, రాయడమూ కావచ్చు. అనువాదాన్ని తర్జుమా అనీ, భాషాంతరీకరణం అనీ కూడా అంటారు. అనువాదకున్ని ఇంగ్లీషులో 'Translator' అంటారు గదా. చిత్రమేమిటంటే, రాతలో అనువాదం చేసేవానికే సాధారణంగా ఆ ఇంగ్లీషు మాట వాడుతారు. ఒకరి భాష ఒకరికి తెలియని ఇద్దరి మధ్య చర్చలు జరగాలన్నా, సంభాషణ సాగాలన్నా రెండు భాషలూ తెలిసిన అనువాదకుడు అవసరం గదా. అలా నోటి మాటలను నోటితోనే అనువాదం చేసే మనిషిని ఇంగ్లీషులో ట్రాన్స్‌లేటర్ అనరు, Interpreter అంటారు. తెలుగులో మనకాభేదం లేదు – నోటి మాటలతో అనువదించినా అనువాదకుడే. ఇతర భాష నుండి తెలుగులోకీ అనువదించడాన్ని తెలుగీకరణం, ఆంధ్రీకరణం అని కూడా అనవచ్చు. అలాగే ఆంగ్లం (ఇంగ్లీషు) లోకి అనువదించడాన్ని ఆంగ్లీకరణం అనవచ్చు (1987.పుట.48). అనువాదమంటే ఒక భాషలో ఉన్న విషయాన్ని మరొక భాషలో చెప్పడం అను భావించాలి. మొదటి భాషను మూల

భాష అని రెండవ భాషను లక్ష్య భాషని అంటారు. ఆంగ్లం నుండి ఒక గ్రంథాన్ని అనువదించాలని అనుకున్నప్పుడు ఇంగ్లీషు మూల భాష తెలుగు లక్ష్యభాష అవుతుంది. ఇంగ్లీషులో మూలభాషని Source Language అని లక్ష్యభాషని Target Language అని అంటారు.

మూలభాషలో ఉన్న విషయాన్ని ఉన్నది ఉన్నట్లు పూర్తిగా లక్ష్యభాషలో చెప్పాలి అనుకున్నప్పుడే మొదట సమస్య ఏర్పడుతుంది. ప్రపంచ భాషలన్నింటికి ఒకటే స్వభావం ఉండదు కనుక అది సాధ్యపడదు. దేని స్వభావం, సంప్రదాయం దానిదే. ఒక భాష స్వభావాన్ని ఆ ప్రాంతపు భౌగోళిక పరిస్థితులు ప్రభావితం చేస్తాయి. అలాగే ఆ ప్రాంతంలోని మనుషుల మతం, ఆచారం, విశ్వాసం అన్ని విషయాల ప్రభావం ఉంటుంది.

భాష స్వరూప స్వభావాలు వేరు కాబట్టి సమస్య ఏర్పడే అవకాశం ఉంటుంది. అన్ని భాషల స్వరూప, స్వభావం ఒకటయితే అనువాదం సులభమవుతుంది. అనువాదం విషయంలో రెండు భిన్న అభిప్రాయాలున్నాయి.

1) "అనువాదకుడు మూల రచన యొక్క అర్థాన్నీ, తాత్పర్యాన్నీ శ్రద్ధగా గమనించి, తద్వారా మూల రచయిత భావాలను నిర్దుష్టంగా, సమగ్రంగా గ్రహించి, ఆ భావాలను అత్యుత్తమంగా వ్యక్తం చేయగల పదాల్లో వెల్లడించాలి. ఇది ఒక అభిప్రాయం".

2) "అనువాదం శ్రేష్ఠంగా ఉండాలంటే, మూల రచయిత యొక్క భావాలనూ, అనుభూతులనూ వ్యక్తం చేయడమే కాక, అతని శైలినీ, రచనా విధానాన్నీ కూడా వ్యక్తం చేయాలి. ఆ పని చేయాలంటే అతని వాక్యాల పొందికనూ, వాక్యాల నిర్మాణాన్నీ కూడా అనువాదకుడు శ్రద్ధగా గమనించాలి. ఇది రెండవ అభిప్రాయం".

మొదటి అభిప్రాయాన్ని అనుసరిస్తే, మూల రచన కంటె మరింత బాగా ఉండేటట్లు అనువాదాన్ని తీర్చిదిద్దడానికీ, దానికి మెరుగులు పెట్టడానికీ అనువాదకునికి అధికారం ఉంటుంది. రెండవ అభిప్రాయం ప్రకారం మూలరచనను అణుమాత్రం కూడా మార్చే అధికారం అనువాదకునికి లేదు. కనుక మూలంలో యేవైనా లోపాలో, దోషాలో ఉంటే అవి కూడా అనువాదంలో వెల్లడి కావాలి. అంతే కాక, మూలంలోని ప్రతి స్వల్ప అర్థచ్ఛాయా, ప్రతి స్వల్ప శైలీ విన్యాసమూ అనువాదంలో వ్యక్తం కావాలంటే, అనువాదం సరళంగా, సాఫీగా ఉండదు. కొంతైనా కరకుగా ఉంటుంది" (రామచంద్రారెడ్డి, రాచమల్లు.1987.పుట.71). మూలభాషలో ఉన్న సారాంశం లక్ష్యభాషలో ఎంత స్పష్టంగా అర్థమైతే అది అంత మంచి అనువాదం అవుతుందని అర్థం.

రాచమల్లు రామచంద్రారెడ్డి అనువాదానికి సంబంధించిన కొన్ని నియమాలను చెప్తూ ఇలా ఉండాలి అని అన్నారు వాటిని పరిశీలిద్దాం.

"1) అనువాదం మూల రచనలోని భావాలను సంపూర్ణంగా వ్యక్తం చేయాలి.

2) శైలీ, రచానావిధానమూ మూలంలో ఉన్నట్లే అనువాదంలో కూడా ఉండాలి.

3) మూల రచన యెంత సాఫీగా ఉందో అంత సాఫీగా అనువాదం కూడా ఉండాలి (అంటే మూలం ఆ భాష చదివే వానికి యెంత స్పష్టంగా సుబోధకంగా ఉందో, అనువాదం ఈ భాష చదివే వానికి అంత స్పష్టంగా, సుబోధకంగానూ ఉండాలి).

పై నియమాలు ఆచరణలోకి రావాలంటే అనువాదకుడు దృష్టిలో పెట్టుకోవలసిన సూత్రాలు కొన్ని ఉన్నాయి. అనువాదకునికి మూల భాష చాలా బాగా తెలిసి ఉండాలి. అతను మూలభాషలో రచనలు చేయలేకపోయినా, ఆ భాషతో ప్రగాఢమైన పరిచయం అతనికి ఉండాలి. అతను అనువాదం చేసేది తన మాతృభాషలోకి గనుక, ఆ మాతృభాష మీద అతనికి పరిపూర్ణమైన అధికారం ఉండాలని చెప్పనక్కరలేదు" (1987.పుట.71,72).

### 4.2.1. అనువాద సమస్యలు

అనువాదం చేసేటపుడు చాలా సమస్యలు ఏర్పడుతాయి. వాటిని రెండు రకాలుగా వర్గీకరించారు. 1) వాక్య నిర్మాణ సమస్యలు, 2) పదసంబంధ సమస్యలు. పదాలంటే జాతీయాలు, ఇతర పదబంధాలని అర్థం చేసుకోవాలి.

ఉదా: ఇంగ్లీషు, తెలుగు భాషలను తీసుకున్నప్పుడు కర్త, కర్మ, క్రియ మొదలైన సమస్యలు ఏర్పడుతాయి.

ఉపవాక్యాలు అనువదించడంలో సమస్య ఉంటుంది. ఇలా రకరకాల సమస్యలు ఉంటాయి. వీటిని వీలైనంతగా లేకుండా చూసుకోవాలి.

### నవలా అనువాదం

నవల ఆవిర్భావం నుండి వికాసం పొందే పరిణామ క్రమాన్ని ఆ కాలాన్ని యుగాలుగా విభజించారు.

1) ప్రారంభయుగం (క్రీ.శ.1872–1900).

2) అనువాదయుగం (క్రీ.శ.1900–1920).

3) వికాసయుగం (క్రీ.శ.1920–1942).

4) మనోవైజ్ఞానికయుగం (క్రీ.శ.1942–1960).

5) సమకాలీనయుగం (క్రీ.శ.1960 నుండి ఇప్పటివరకు).

### 4.2.2. అనువాదయుగం (క్రీ.శ.1900–1920)

తెలుగులో ఎన్నో నవలలు వచ్చాయి. అలా అనువాద నవలలు కన్పిస్తాయి. పాశ్చాత్య నాగరికత ప్రభావం వీటిపైఉంది.

"తెలుగులోని మొదటి అనువాదము జి.వి.యస్. దొర సామయ్య రచించిన 'కపాలకుండల' (1899). వీరు 1907లో 'ఆనంద మఠం' అను బెంగాలీ నవలను కూడా అనువదించినాడు. కనకవల్లి భాస్కరరావు 'ప్రఫుల్లముఖి' (1909), చిల్లరిగె శ్రీనివాసరావు 'కృష్ణకాంతుని మరణ శాసనం' (1910), తల్లాప్రగడ సూర్యనారాయణ 'శైవలినీ చంద్రశేఖరము' (1910), వెంకట పార్వతీశ్వర కవుల 'రాజసింహ' (1912), అక్కిరాజు ఉమాకాంతం గారి 'టిప్పు సుల్తాను' (1913), చిలకమర్తి లక్ష్మీనరసింహము గారి 'దాసీ కన్య' (1915), తెన్నేటి సూరిగారి 'రెండు మహానగరాలు' మొదలయినవి చారిత్రక నవలా ప్రారంభదశలో వెలువడిన అనువాద, అనుకరణ చారిత్రక నవలలు" (నాగయ్య, జి.(ద్వి.సం). 2021.పుట.813).

బెంగాలీ భాష నుండి అపరాధ పరిశోధక నవలలను వెంకట పార్వతీశ్వర కవులు అనువాదం చేశారు. అలా చాలా అనువాద నవలలు వచ్చాయి. అనువాద నవలలు ఎక్కువగా చారిత్రకములు కావటంతో దీనిని చారిత్రక నవలా యుగం అని కూడా అన్నారు.

### 4.2.3. అనువాదం–పత్రికల పాత్ర

దేశంలో భాష ఏది రాజభాషయినా పత్రికలు మాత్రం ప్రజలకు తెలిసిన భాషలోనే సమాచారాన్ని అందించడానికి కృషి చేసాయి. ఆ విషయంలో పత్రికల కృషి విస్మరించలేనిది. "తెలుగు పత్రికలు ఈ దిశగా గణనీయమైన సేవ చేశాయి. దినపత్రికలతోపాటు వార, పక్ష, మాస, త్రైమాస పత్రికల పాత్ర కూడా శ్లాఘనీయం. విద్యావ్యాప్తి, సంఘ సంస్కరణ, భాషాసాహిత్య సేవా రంగాలలో చిన్న పత్రికలు ప్రత్యేక కృషి చేసేవి. ఒక విశేషమేమిటంటే వివిధ విషయాలకు సంబంధించి ప్రత్యేక పత్రికలున్నా సర్వసాధారణంగా ప్రతి పత్రికను బహు విషయభరితంగా ప్రచురించే ప్రయత్నం జరిగేది. ఇలా చేయడంలో పత్రికలు ఎక్కువగా అనువాద ప్రక్రియను ఆశ్రయించేవి" (రామకృష్ణారావు, గోవిందరాజు.2007.పుట.17).

పాతకాలంలో 'వర్తమాన తరంగిణి'లో ఫోర్ట్ సెంయిట్ జార్జి గెజిట్ నుంచి ముఖ్యమైన అంశాలను తెలుగులోకి అనువదించేవారు. అలాగే పురుషార్థప్రదాయిని, వివేక వర్ధిని మొదలైన పత్రికల్లో అనువాదాలు ప్రచురించటంతోపాటు, భాష, శైలి పదజాలం విషయంలో బాగా కృషి

చేసాయి. వ్యవహారిక భాషను తీర్చిదిద్దడంలో కూడా పత్రికలు సహకరించాయి. ఇప్పటికి వచ్చే దినపత్రికల్లో కూడా అనువాద సంబంధింత వ్యాసాలు, కథ, నవల, కవిత్వం మొదలైన విషయాలను అందిస్తూ పాఠకులకు జ్ఞానాన్ని అందిస్తున్నాయి.

### 4.2.4. విపుల ప్రపంచంలోకి వేయి పడగలు

గండ్ర లక్ష్మణరావు రాసిన 'విపుల ప్రపంచంలోకి వేయి పడగలు' అనే వ్యాసం సాక్షి సాహిత్యం పుటలో జనవరి 11, 2016న ప్రచురితమయింది.

కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రాసిన వేయి పడగలు నవల ఇంగ్లీషులోకి "థౌజండ్ హుడ్స్" పేరుతో అనువాదమయిన సందర్భంగా వేయి పడగలు నవల గొప్పతనాన్ని అనువాద విధానాన్ని వివరిస్తూ రాసిన వ్యాసం ఇది.

వేయి పడగలు ఒక వేదనామయమైన జాతీయ నవల. తెలుగులో తొలి జ్ఞానపీఠ పురస్కారం పొంది కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఎనభై ఏళ్ళ కింద తన ముప్పయి తొమ్మిదవ ఏట 1934లో రచించిన నవల బృహన్నల. ఈ నవల వెలువడిన నాటినుండి అనేకానేక చర్చలు, విమర్శలు, పరిశోధనలు జరిగాయి. ఇప్పటికీ చర్చకు వస్తుంది. ఇంత పెద్ద నవల అయినా అనేకానేక ముద్రణలు పొంది ఈ తరం పాఠకులకు కూడా చదివింపజేస్తుంది. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక, విద్య మొదలైన పలు రంగాలలో బహుముఖాలుగా విస్తరించిన ఈ నవలను హిందీలోకి మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు 'సహస్రఫణ్' పేరుతో అనువదించి ఉత్తర భారతీయులకు పరిచయం చేశారు. తరువాత గుజరాతిలోకి అనువదించబడింది. అయినా ఇంకా ఎన్నో భాషలలోకి రావలసిన అవసరం ఉండేది కాని ఇప్పుడు ఆ కొరత తీరిందని వేయి పడగలు నవల ఆంగ్లానువాదం గురించి పేర్కొన్నారు.

విశ్వనాథ సాహిత్య పీఠం నెలకొల్పి ఎనలేని సాహితీ సేవలందజేస్తున్న వెల్చాల కొండలరావు పూనుకోవడం వలన ఈ ఆంగ్లానువాదం సాధ్యపడిందని తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు భాషలవలో నిష్ణాతులు, రచయితలు, విమర్శకులు అయిన కె. అరుణ వ్యాస్, వైదేహి శశిధర్, చేవూరి సుబ్బారావు, ఉప్పులూరి ఆత్రేయ శర్మ, ఎస్. నారాయణ స్వామి అను ఈ ఐదుగురు ఈ నవలను అనువదించారు. ఎవరు ఏ అధ్యాయాలు అనువదించారో పీఠికలో వివరించారని చెప్తూ ఐదుగురి అనువాదం ఒకే తీరులో ఉండి చదువరులకు అంత భేదం కనిపించక పోవడం విశేషం అంటూ అనువాదకుల ప్రతిభను కొనియాడారు. తమ భాషా సంపదలను, వ్యక్తీకరణలను వాక్య

నిర్మాణాలను తమ శైలిలో కాక మూల రచయితకు అనుగుణంగా మలచుకున్న తీరును అద్భుతం అంటూ ప్రశంసించారు.

వేయి పడగలు ఒక ఇతిహాసం. సుబ్బన్న పేరు దేశంలోని ప్రతి పల్లెటూరుకు ప్రతినిధి తాత్వికంగా ఇది భారతదేశం యొక్క వేల ఏండ్ల చరిత్ర, సంస్కృతి, ఋషుల తపః ఫలమైన ఆధ్యాత్మిక ప్రపంచం. తెలుగువారి జీవన విధానం, ఆంగ్లేయుల రాకతో జరిగిన విపరీతమైన మార్పులు, వాటికి తట్టుకోలేక చలించిపోయిన జాతి అంతా ఇందులో ప్రతిబింబిస్తుందని నవలా వస్తువుతో వివరించారు.

రచనా విధానంలో వ్యావహారికత, పలుకుబడులు, సామెతలు, జాతీయాలు, సంభాషణా చాతుర్యాలు, చమత్కారాలూ, పాత్రోచితమైన హావభావ ప్రకటనలు, తెలుగు భాషా సౌకుమార్యమంతా కుప్పపోశారని రచన పద్ధతిలో విశ్లేషించారు.

అదే విధంగా విశ్వనాథ నవలను రాయడానికి గల కారణాలను, నవల రచన వెనుకగల కనిపించని నేపథ్యాన్ని గురించి తెలిపారు. జీవ సంపద అంతా ఆంగ్లేయుల రాకతో విచ్ఛిన్నం కావడం, ఆ ధాటికి జాతి యావత్తు చలించిపోవడం చూసి ఒక మహా దుఃఖాన్ని అనుభవించారు విశ్వనాథ. అదే జీవుని వేదన అయింది. అదే వేయి పడగలు రాయడానికి రామాయణ కల్పవృక్షం రాయడానికి పునాది అయింది అంటూ వారి అభిప్రాయాన్ని తెలిపారు. జాతీయవాదం, స్వాతంత్ర్య పోరాటం జరగడం, ఝాన్సీరాణి మొదలుకొని గాంధీ వరకు జరిగిన పోరాట చరిత్రలు విశ్వనాథ మనస్సును ఆవరించి ఉండటం ఈ నవల వెనుక కనిపించని నేపథ్యంగా వివరించారు.

నవలా అనువాద విధానం గురించి చెప్తూ మూల విధేయంగా అనువాదాన్ని సాగించారని వివరించారు. అనువాదకులు అయిదుగురు దోసిలి నిండా పట్టిన ధాన్యంలో నుండి ఒక్క గింజ కూడా జారిపోనంత పదిలంగా ప్రతి పదాన్ని, వాక్యాన్ని ఇంగ్లీషులోకి దించారు. కవిత్రయం మహాభారతాన్ని అనువదించడానికి స్వేచ్ఛను తీసుకున్నారు. కానీ ఈ అనువాదకులు విశ్వనాథే ముందు కూర్చుని ఉంటే ఎంత జాగ్రత్తగా ఉంటారో అంత మూల విధేయంగా అనువదించారు. పి.వి. నరసింహారావు చివరి మూడు అధ్యాయాలు అక్కరలేదని వదిలేశారు కానీ ఆ చొరవ ఈ అనువాదకులు తీసుకోలేదని వివరించారు.

వేయి పడగలు నిన్నటి నవల కాదు. అది నేటికీ సందర్భమే అంటూ ఒక ప్రజా జీవన వ్యవస్థ ఎట్లా ఉంటుంది? ఒక విద్యా సంస్థ, ఒక వర్ణ వ్యవస్థ, ఒక మత సిద్ధాంతం, ఒక ప్రకృతి జీవనం ఇలా పదమూడు అంశాలతో అనేక ప్రశ్నలకు సముచితవాదంగా వెల్చాల కొండలరావు 'ఇన్

డిఫెన్స్ ఆన్ వేయి పడగలు' పేరుతో రాసిన పీఠికను పరిచయం చేశారు. ఈ నవలలోని పాత్రలు వ్యక్తిత్వ పరిధికి మించినవి. రామేశ్వర శాస్త్రి పూర్వీకుల నుండి ఇప్పటిదాకా సాగిన ఈ కథ ఒక జాతి అని పేర్కొన్నారు. ఈ వ్యాసం ద్వారా నవల ప్రత్యేకతను, ఆనాటి కాల పరిస్థితులను, వాస్తవికాంశాలను, నవలా వస్తువును పరిచయం చేస్తూ అనువాద వివరాలను అనువాద విధానాన్ని పాఠకులకు అందించారు. ఇలాంటి వ్యాసాల ద్వారా మన సాహిత్య ఔన్నత్యం అవగతమవుతుంది. నూతన గ్రంథ పరిచయం జరుగుతుంది. అనువాదాల వలన సాహిత్యం మరింత విస్తృతమవుతుంది. ఇలాంటి రచనల వలన తెలుగు సాహిత్య విశిష్టత ప్రపంచ దేశాలకు తెలుస్తుంది.

### 4.2.5. ఒక కళాకారుడి జీవన లాలస

పి. మోహన్ రాసిన 'ఒక కళాకారుడి జీవన లాలస' అనే వ్యాసం సాక్షి – సాహిత్యం పుటలో జనవరి 25, 2016న ప్రచురితమయింది.

జీవిత చరిత్ర నవలలు రాయడంలో ప్రసిద్ధి చెందిన అమెరికన్ రచయిత ఇర్వింగ్ స్టోన్. ఆయన రాసిన లాస్ట్ ఫర్ లైఫ్ (Lost for Life) అనే జీవిత చరిత్ర నవలను తెలుగులోకి అనువాదం చేసి కళాసాహితీ బ్లాగు స్పాట్ ద్వారా వ్యాసకర్త పి. మోహన్ మనకు అందిస్తున్నారు. ఈ సందర్భంగా జీవిత చరిత్ర నవల గొప్పతనాన్ని వివరిస్తూ రచయిత తన అనువాదంలోని కొంత భాగాన్ని ఈ వ్యాసం ద్వారా మనకందించారు.

'లాస్ట్ ఫర్ లైఫ్' (1934) అనేది ఒక డచ్ చిత్రకారుడు విన్సెంట్ వ్యాన్గో జీవితం మరియు అతని కష్టాల గురించి తెలుపుతూ ఇర్వింగ్ స్టోన్ రాసిన జీవిత చరిత్ర నవల. ఇది ఇర్వింగ్ స్టోన్ యొక్క మొట్టమొదటి ప్రధాన ప్రచురణ అలాగే ఇది విన్సెంట్ వ్యాన్గో మరియు అతని తమ్ముడ ఆర్టా డీలర్ థియోవ్యాన్గో మధ్య లేఖల సేకరణపై ఆధారపడి ఉంది.

జీవితాన్ని ఊపిరాడనంత మోహంతో కౌగిలించుకున్న ఒక వెర్రి డచ్చివాడు. విన్సెంట్ వ్యాన్గో అంటూ వారి జీవిత విశేషాలను తెలుపుతూ అనువాదానికి గల కారణాలను వ్యాసకర్త వివరించారు. ఈ నవల కలిగించిన అనుభూతులను పాఠకులకు తెలియజెప్పారు.

రంగులే శ్వాసగా బతికినవాడు. కళ్లు చెదిరే మాస్టర్ పీస్‌లతో జనం కంటికి కొత్త రంగుల భాషను నేర్పిన గ్రేట్ మాస్టర్. అంతేనా! తమ్ముడికి రాసిన వందలాది లేఖల్లో తన అంతర్ బహిర్ రణఘోషను ఉద్వేగభరితంగా బొమ్మ కట్టిన అపురూప లేఖా సాహిత్యకారుడు విన్సెంట్ వ్యాన్గో అని చెప్తూ కళతోపాటు జీవితంలోనూ అలుపెరగకుండా పోరాడిన ఆ కళాయోధుడి జీవితాన్ని వర్ణ

కావ్యంలా పరిచయం చేస్తుంది 'లాస్ట్ ఫర్ లైఫ్' నవలలో. జీవిత చరిత్ర నవలల్లో కాకలు తీరిన రచయిత ఇర్వింగ్ స్టోన్ రాసిన ఈ నవల ఎనభయ్యేళ్ల కిందట వెలువడిన ఈ తీరని జీవన లాలస నేటికీ వన్నె తగ్గని పెయింటింగులా పాఠకులను, కళాప్రియులనూ ఆకర్షించి వ్యాన్గో రసోన్మాద జగత్తులోకి లాక్కెళ్తుందంటూ నవలా విశిష్టతను తెలిపారు. ఇర్వింగ్ స్టోన్ రచనా విధానాన్ని, నవలా వస్తువును విశ్లేషించారు.

బొమ్మలు వేయడం తప్ప తన బతుక్కి మరో అర్థం లేదని చాటిన వ్యాన్గో నడిచిన పూలబాటల్లో, ముళ్ల బాటల్లో స్టోన్ మనల్ని వేలుపటుకు నడిపిస్తాడు. ఆ వర్ణకారుడికి ఫలించని తొలిప్రేమ, బెల్జియం బొగ్గు గనుల్లో మతబోధన, చేతికి చిక్కినట్టే చిక్కి జారిపోయే రంగులతో అనుదిన పోరాటం ఆత్మను అరగదీసే సంశయాలు, సాటి మనిషి కష్టానికి చేరువయ్యే గుండె, సంఘ బహిష్కారం... అన్నింటిని జీవం తొణికిసలాడే చిత్రాల్లో పరిచయం చేస్తూ వెళ్తాడు. పోరాటంలో మనోదేహాలు ఛిద్రం చేసిందని, తను చేయాల్సింది చేశానన్న తృప్తితో హాయిగా నవ్వుతూ ముప్పై ఏడేళ్ళకే ప్రాణాన్ని తూటాకి అర్పించుకున్న ఆ అమర కళావేత్త బలిదానాన్ని కళ్ల ముందు పరచి గుండెను తడిచేశాడంటూ ఇర్విన్ స్టోన్ రచనా విధానాన్ని కొనియాడారు.

ఈ నవలను వ్యాసకర్త అనువదించడానికి గల కారణాలను కూడా దీనిలో వివరించారు. ఈ నవలను పదమూడేళ్ల కిందట తొలిసారి చదివినప్పుడు కదిలిపోయాను. అప్పట్నుంచి వ్యాన్గో కళాజీవితాలను మరింత తెలుసుకోవాలనే ఆరాటం ఆరని జ్వాలలా ఎగసిపడుతూనే ఉంది. దాని వెలుగును ఇంకొందరికి పంచుదామని అనువాదం మొదలుపెట్టాను. కళాసాహితి <http://kalasahiti.blogspot.in> అనే బ్లాగు ద్వారా దీన్ని అందిస్తున్నారని వాటి వివరాలను తెలియజేశారు. అదే విధంగా వారి అనువాదంలోని కొంత భాగాన్ని ఈ వ్యాసంలో పొందుపరిచారు.

ఈ విధంగా ఒక అమెరికన్ రచయిత రచన తెలుగులోకి అనువదింపబడిన విధానాన్ని తెలుపుతూ రచయిత పఠనాభవం, అనువాద పద్ధతి జీవితచరిత్ర నవలల ప్రత్యేకత వంటి అనేక అంశాలను తెలుపుతూ ఈ వ్యాసం, అనువాదం గురించి చెప్తూ అనువాదంలోని కొంత భాగాన్ని ప్రచురించడం వలన మూలాన్ని చదవాలనే ప్రేరణ పాఠకులకు అందిస్తున్నారు. అలాగే సాహిత్యాన్ని విస్తృతం చేసే అనువాదాల ప్రత్యేకతను పాఠకులకు తెలియజేస్తున్నారు.

### 4.2.6. అనువాద నవలా వ్యాసాల పట్టిక

ఇలాంటి అనువాద నవలా వ్యాసాలు మనకు ఈ రెండు పత్రికల్లో ఇంకా కొన్ని కనిపిస్తున్నాయి. కానీ తెలుగు నుండి ఇతర భాషల్లోకి అనువాదమైన నవలల కన్నా ఇతర భాషల నుండి తెలుగులోకి అనువాదమయినవే ఎక్కువ. తెలుగు రచనలపై కూడా ఈ అనువాద ప్రక్రియ మరింత విస్తృతమవ్వాల్సిన అవసరం ఉంది. మన సాహిత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పాల్సిన అవసరం ఉంది. మిగతా అనువాద నవలల వివరాలను కింద పట్టికలో పొందుపరిచాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | ఆంగ్ల భాషలోకి 'వేయి పడగలు' | ప్రొఫెసర్ ఎస్వీ. రామారావు | జనవరి 18, 20167 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | ★కొత్త అనువాదం ఎవరితను?: పుట్టనే లేదు, మళ్లీ బతికొచ్చాడు! | కె.బి. గోపాలం | ఆగస్టు 29, 2016 | సాక్షి – సాహిత్యం |
| 3) | శాలింజర్ నవల మీద | టామ్ సాయర్ | మే 16, 2016 | సాక్షి – సాహిత్యం |
| 4) | ★రాబోవు పుస్తకం చైనాపై జపాన్ దురాక్రమణ డ్రాగన్ సీడ్ | టి. షణ్ముఖరావు | జనవరి 09, 2017 | సాక్షి – సాహిత్యం |
| 5) | టాల్‌స్టాయ్ చెప్పిన చరిత్ర: యుద్ధము – శాంతి | బి. అజయ్ ప్రసాద్ | జూలై 17, 2017 | సాక్షి – సాహిత్యం |
| 6) | నన్ను అనువాదకుడిని చేసింది చైనా | డా॥ డి.ఎస్. రావు | అక్టోబర్ 23, 2017 | సాక్షి – సాహిత్యం |

**పట్టిక – 19**

### 4.3. మనోవైజ్ఞానిక నవలా వ్యాసాలు

మనోవైజ్ఞాన శాస్త్రం అనేది మనిషి ప్రవర్తనను తెలుపుతుంది. మానవుని ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి, దానికి సంబంధించిన విషయాలను తెలుసుకోవడానికి, వీలైతే మార్చడానికి ఈ శాస్త్రం ఉపయోగపడుతుంది. రకరకాల వ్యక్తులు తమ చుట్టూ ఉన్న పరిస్థితులకు, ప్రభావానికి లోనయ్యి ఎలా బదులు పలుకుతారో చెప్పే శాస్త్రాన్నే మనోవిజ్ఞానశాస్త్రం అనవచ్చు. చుట్టూ ఉన్న పరిస్థితులకు అందరూ ఒకేలా స్పందించరు. ఒకే రకంగా సమాధానం కూడా ఇవ్వరు. ఎవరి మానసిక స్థితి వాళ్ళది. ఒకే రకమైన పరిస్థితులు కొందరిని బాధకు గురిచేస్తే, ఇంకొందరిని తట్టుకుని నిలబడేలా చేస్తాయి. అందుకే మనస్తత్వ శాస్త్రవేత్తలు వ్యక్తుల బాహ్యప్రవర్తనను పరిశీలిస్తే కొంత మంది అంతర సంఘర్షణలను గమనిస్తారు. కొందరు (Conscious) చేతనను పరిశీలిస్తే

మరికొందరేమో అచేతన (Unconscious)లోని లోతులను వెతుకుతారు. మనస్తత్వశాస్త్రంలో అనేక సిద్ధాంత దృక్పథాలు ఉన్నాయి. Structuralism, Behaviourism, Gestalt Psychology, Psycho Analysis అత్యంత ముఖ్యమైందని అంటారు. ఇది మానసిక వ్యాధిని కుదర్చడానికి అవలంబించే పద్ధతి.

సైకో అనాలసిస్ విధానానికి ఆద్యుడు వియన్నాకు చెందిన మనస్తత్వ శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ (1856–1939) 20వ శతాబ్దంలో వివిధ రంగాలకు చెందిన ఆలోచనపరుల్ని ప్రభావితం చేశాడు ఫ్రాయిడ్. ఇతని మానసిక సిద్ధాంతాలు ఎంతో మంది మానసిక రుగ్మతను నయం చేశాయి.

"ఫ్రాయిడ్ సిద్ధాంతం ప్రకారం 'సైకో ఎనాలిసిస్' మూల స్థంభాలు నాలుగు. 1) అచేతన మనస్తత్వ స్థితి అనేది ఒకటి ఉందని గ్రహించడం, 2) అణచివేత, ప్రతిఘటన, సిద్ధాంతాల ప్రాధాన్యతను గుర్తించడం, 3) లైంగిక ప్రవృత్తి ప్రాముఖ్యతను అంగీకరించడం, 4) ఈడిపస్ కాంప్లెక్స్‌ను గుర్తించగలగడం – వీటిపైనే ఈ సిద్ధాంతం యావత్తూ ఆధారపడి ఉంది" (శ్రీరామమూర్తి, కోడూరి.1979.పుట.22).

"సైకో ఎనాలిసిస్' గురించి చెప్పేటప్పుడు, ముందుగా ప్రస్తావించవలసిన విషయం – ఈ సిద్ధాంతంలో 'అచేతన'కు గల ప్రాధాన్యత. 'చేతన' కంటే 'అచేతన' గురించే ఈ సిద్ధాంతం అధికంగా పరిశీలిస్తుంది కాబట్టి దీనిని Depth Psychology అని కూడా అంటారు. 'ఈచేతన', 'అచేతన'లను సముద్రం మీద తేలుతూ ఉండే 'ఐస్‌బెర్గ్'తో పోల్చి చెబుతారు. 'ఐస్‌బెర్గ్' సముద్రంలో తేలుతూ ఉన్నప్పుడు పదింట ఒక వంతు మాత్రమే పైకి కనబడుతుంది. మిగతా తొమ్మది వంతులు కనబడకుండా నీటిలో ఉంటుంది. అదే విధంగా చేతన (Conscious)ను బట్టి మనకు తెలిసేది మనిషి మనస్తత్వంలోని అతి స్వల్పమైన భాగం మాత్రమే – మిగిలిన చాలా భాగం అచేతన (Unconscious)లో ఉండిపోయి మనిషికి అంతు చిక్కకుండా ఉండిపోతుంది. అచేతన యొక్క స్వరూపాన్ని పూర్తిగా అవగతం చేసుకున్నప్పుడే మనిషికి వచ్చే అనేక మానసిక రుగ్మతలను సరిచేయడం జరుగుతుందని ఫ్రాయిడ్ అన్నాడు" (శ్రీరామమూర్తి, కోడూరి.1979.పుట.21). మానసిక సమస్యలు ఉన్న వ్యక్తుల్లో సంఘర్షణ విపరీతంగా ఉంటుంది. మనిషిలో ఉండే unconscious irrational forces ని అర్థం చేసుకుంటే వాటి ప్రభావాన్ని తగ్గిస్తాం అని ఫ్రాయిడ్ అభిప్రాయం.

మనిషి అంతరంగంలో తార్కిక, నైతిక శక్తులు ఉంటాయని తార్కిక, తార్కికాతీత, నైతిక, నైతికాతీత శక్తుల మధ్య జరిగే సంఘర్షణను వివరిస్తూ ఫ్రాయిడ్ దానిని Id, Ego, Super Ego అను వివరించాడు. సైకో ఎనాలిసిస్ ప్రకారం మనిషిలో ఈ మూడు ఉంటాయని తెలిపాడు.

"Id ఆదిమ కాలపు భావాలకు చెందింది. జంతు ప్రవృత్తి ఇందులో చోటు చేసుకొని ఉంటుంది. Libido ను సంతృప్తి పరచడానికి Id కృషి చేస్తూ ఉంటుంది. ఇక – Ego తార్కిక భావాలకు ప్రతీక. Idలో నుంచి పైకి పెల్లుబికి వచ్చే నైతికాతీత భావాలను Ego అణచివేస్తూ ఉంటుంది. Ego లోనే రెండు భాగాలున్నాయి. వాటిని Ego, Super Egoలుగా ఫ్రాయిడ్ పేర్కొన్నాడు. Super Egoకు Ego మీద యాజమాన్యం ఉంటుంది. Super Ego లో సామాజిక నీతినియమాలు, కట్టుబాట్లు ప్రాతినిధ్యం వహించి ఉంటాయి. తనకు పూర్తి వ్యతిరేక ప్రవృత్తిగల Idను అదమాయించి, అణచివేసే పనిని Ego ద్వారా Super Ego చేయిస్తుంది. అంటే Id Ego ల మధ్య జరిగే సంఘర్షణ Super Ego ఆదేశాల ప్రకారం జరుగుతూ ఉంటుంది. ఈ రకమైన సంఘర్షణ ప్రతీ వ్యక్తి విషయంలోనూ ప్రతిరోజూ జరుగుతూనే ఉంటుంది. అయితే – మామూలు వ్యక్తుల విషయంలో Id పై జరిగే అణచివేత ధోరణి చాలా వరకు విజయం అవుతుంది. మానసిక రుగ్మతలు ఉన్న వాళ్ళ విషయంలో మాత్రం ఇలాంటి సత్ఫలితం రాదు" (శ్రీరామమూర్తి, కోడూరి.1979.పుట.22).

**ఆడ్లర్**

ఫ్రాయిడ్ 'సైకో అనాలిసిస్' ఇలా చేస్తే అతని తర్వాత వచ్చిన ఆల్‌ఫ్రెడ్ ఆడ్లర్ మనోవిశ్లేషణను కొంత తేడాతో వ్యక్తీకరించాడు. మరికొన్ని మానవుని చిత్తప్రవృత్తులు ఇతని పరిశోధనలో వెలువడ్డాయి. ఆడ్లర్ సిద్ధాంతంలో వ్యక్తికీ, వ్యక్తికి మధ్య తేడాలుంటాయని చెప్పి, వారి బాల్యంలో, పుట్టి పెరిగిన వాతావరణంలో తేడాలు ఉండటమే అని తేల్చాడు. అందుకే ఆడ్లర్ సిద్ధాంతాన్ని 'Individual Psychology' అని వ్యవహరించడం జరిగింది.

"ఆడ్లర్ అభిప్రాయం ప్రకారం – శైశవ దశ నుండి ప్రతీ వ్యక్తి విషయంలోనూ ఆధిక్యత కోసమై పోరాటం ప్రారంభం శైశవదశలో అంకురార్పణ జరగడమే. పుట్టిన ప్రతి శిశువూ తనచుట్టూ ఉన్నవారు పెద్దవాళ్ళు అనీ, బలవంతులనీ, వాళ్ళపై తాను ఆధారపడి ఉన్నాననీ, వాళ్ళు చెప్పినట్టు తాను నడచుకోవడం తప్ప మరో మార్గం లేదు అనే ఒక విధమైన ఆత్మన్యూనతా భావానికి లోనవుతుంది. తన బలహీనత తన పాలిట శాపం అనుకుంటుంది. ఈ విధంగా

విచిత్రమైన రీతిలో Inferiority Complex శైశవ దశలో వ్యక్తిని పలుకరిస్తుంది" (శ్రీరామమూర్తి, కోదూరి.1979.పుట.31).

"ఈ inferiority complexను గమనించి తన ఆధిక్యతను నిలబెట్టుకోవడం కోసం, శైశవ దశ నుండి వ్యక్తి ప్రయత్నం చేస్తాడు. పెద్దలు ఎంత అదమాయించినా వినకుండా పిల్లలు చేసే అల్లరికి మూల కారణం ఇదేనంటారు ఆడ్లర్. తనలోని inferiority complex ను superiority complexగా మార్చుకొనేందుకు శైశవదశ నుండి వ్యక్తి చేసే ప్రయత్నాలు ఒక్కొక్కరి విషయంలో ఒక్కో రూపాన్ని తీసుకుంటూ ఉంటాయి. దీనిని ఆడ్లర్ "Style of Life" అని అన్నాడు. స్థూలంగా చెప్పాలంటే తనలో ఉన్న శక్తి సామర్థ్యాలను వ్యక్తి ఏ విధంగా వ్యక్తీకరించదలుచుకున్నాడో దానిని Style of Life అని అనవచ్చును" (శ్రీరామమూర్తి, కోదూరి.1979.పుట.32). ఇలా ఆడ్లర్ Style of Life ముఖ్య స్థానం ఇచ్చి ఫ్రాయిడ్ చెప్పిన వాటితోపాటుగా inferior, superior complexను తెలియజేశాడు.

**యూంగ్**

'సైకో ఎనాలిసిస్' సిద్ధాంతానికి సంబంధించిన మరొక ముఖ్యమైన మనస్తత్వ శాస్త్రవేత్త కార్ల్‌గుస్టావ్ యూంగ్ (1875–1961). ఇతను స్విట్జర్లాండ్‌కి చెందిన వ్యక్తి. ఫ్రాయిడ్, ఆడ్లర్ వలన 'వియన్నా' ఎలా ప్రసిద్ధి చెందిందో, ఇతని వల్లన 'జూరిచ్' అలా ప్రసిద్ధి చెందింది. ఇతడు ఫ్రాయిడ్ సిద్ధాంతంలో లోపాలను చూపాడు. యూంగ్ సిద్ధాంతాన్ని "Analytical Psychology" (విశ్లేషణాత్మక మనోవిజ్ఞానం) అని అంటారు. ఫ్రాయిడ్ సిద్ధాంతాల్లో కనిపించని రీతిలో యూంగ్ సిద్ధాంతంలో మతం, ఇతిహాసాల విషయాలుంటాయి. ఫ్రాయిడ్ సిద్ధాంతంలోని లిబిడోకి యూంగ్ లిబిడోకి తేడా ఉంటుంది.

"యూంగ్ సిద్ధాంతంలోని ఒక ప్రత్యేకత 'అచేతన'ను క్రొత్త కోణంలోంచి చూడడు అని ఇదివరకే వ్రాశాను. ఫ్రాయిడ్ సిద్ధాంతంలో చెప్పబడినట్టుగా అచేతనలో ఉండేది కేవలం అవినీతికరమైన భావాలు, పశుప్రవృత్తికి సంబంధించిన భావాలు కూడా చోటుచేసుకొని ఉంటాయన్నాడు యూంగ్. 'అచేతన'ను యూంగ్ ఇలా విడదీశాడు. 1) వైయక్తిక అచేతన, 2) సామూహిక అచేతన. 'వైయక్తిక అచేతన' విషయంలో ఫ్రాయిడ్ చెప్పిన భావాలు కొంతవరకూ వర్తిస్తాయి. మనిషి 'చేతన' అంగీకరించలేని భావాలన్నీ ఇందులో ఉంటాయి. ఇది ప్రతి వ్యక్తి విషయంలోనూ మారిపోతుంది. అంటే ఒక్కొక్కరి విషయంలో ఒక్కొక్క మాదిరిగా ఉంటుంది" (శ్రీరామమూర్తి, కోదూరి.1979.పుట.39).

ఈ రకంగా ఫ్రాయిడ్, ఆడ్లర్, యూంగ్ 'సైకో ఎనాలిసిస్' చేశారు. మనిషి అంతరంగాన్ని విశ్లేషించి ప్రవర్తన భేదాల్ని తెలియజేశారు. వీరి సిద్ధాంతాల్ని అంగీకరించినవాళ్ళు, వ్యతిరేకించినవాళ్ళు, అనుసరిస్తూ మార్పులు చేసిన వాళ్ళూ ఉన్నారు. ఎన్నెన్నో మనోవిశ్లేషణ శాస్త్రాలు వెలువడ్డాయి. సాహిత్యం మీద వాటి ప్రభావం కూడా కనిపిస్తుంది. రచయితలు కూడా మనిషిని, మనిషి ఆలోచనలనూ అనేక కోణాల్లో పరిశీలిస్తారనే విషయం అందరికీ తెలిసిందే. పుట్టిన నాటి చనిపోయే వరకు మనిషి రకరకాల భావనలకు సంఘర్షణలకు గురవుతాడు. వాటిని తెలిపేదే మనోవైజ్ఞానిక శాస్త్రం. ఈ సైకో ఎనాలిసిస్ తెలుగు నవలల్లో ఎలా ప్రభావం చూపిందో పరిశీలిద్దాం.

### 4.3.1. మనోవైజ్ఞానిక నవలలు

20వ శతాబ్దంలో నవల రచన కొత్త పోకడలు పోయింది. మనోవైజ్ఞానిక నవలలు కూడా వచ్చాయి. "వీటిలో మనస్తత్వ నవలల (Psychological Novels) ఆవిర్భావం ఒకటి. అయితే ఇది కేవలం ఇటీవలి పరిణామమేననీ, అంతకు ముందు వెలువడిన నవలలకు మనిషి మనస్తత్వంతో సంబంధంలేదనీ, అర్థం కాదు. అదే విధంగా – మనస్తత్వశాస్త్రంలో కొన్ని సిద్ధాంతాలు ఇటీవలి పరిణామమే కాబట్టి, పూర్వకాలపు నవలాకారులకు మనిషి అంతరంగాన్ని ఇంతగా అవగాహన చేసుకొనెందుకు అవకాశం లేదని కూడా అనుకొనకూడదు. మనస్తత్వశాస్త్రపరంగా సిద్ధాంతాలు ఎలా ఉన్నప్పటికీ, వాటిని ఎవరూ రూపొందించినప్పటికీ, మానవ ప్రవర్తన ఎల్లప్పుడూ ఒక్కటే. ఆ ప్రవర్తనలోని వైచిత్రి మేధావంతులయిన నవలాకారులను ఎప్పుడూ ఆకర్షిస్తూనే ఉంటుంది. దీనికి సిద్ధాంతాలతో సంబంధం లేదు" (శ్రీరామమూర్తి, కోడూరి.1979.పుట.45).

ఆంగ్లంలో ఈ నేపథ్యంలో చాలా నవలలు వచ్చాయి. "ఆంగ్లంలో యులిసిస్ వ్రాసిన జేమ్స్‌జాయిస్ మనోవైజ్ఞానిక రచనావిధానం ప్రభావం ప్రపంచమంతటా ఉంది. వర్జీనియా వుల్ఫ్, విలయం ఫాకనర్ నవలా సాహిత్యం, మనోవైజ్ఞానిక రంగంలో మరింత ముందడుగు వేసింది. ఈ శాస్త్రంతో ఈ సాహిత్యంలో పరిచయం ఏర్పడ్డ ఆంధ్రులు మనోవైజ్ఞానిక నవలా సాహిత్యం తెలుగులో రూపొందించారు. ఈ రంగంలో ఆంగ్లంలో సాహిత్యం సృష్టిస్తూ వచ్చిన లారెన్సు, ఆల్డస్ హక్సలీ, సామ్యూల్ బకెట్ మనోవైజ్ఞానిక రంగం మరింత పరిపుష్టం కావించారు" (ఇనాక్, కొలకలూరి.2013.పుట.90).

### 4.3.2. తెలుగులో మనోవైజ్ఞానిక యుగం (1942 నుండి 1960 వరకు)

మనస్సులోని భావాలను, మానసిక సంఘర్షణలను ఉన్నది ఉన్నట్లుగా చిత్రిస్తూ వచ్చిన నవలలు ఉండటమే ఈ యుగం ప్రత్యేకత. తెలుగు నవలా సాహిత్యంలో మొదట్లో అంత ఎక్కువగా మనోవైజ్ఞానిక లక్షణాలున్న నవలలు కనిపించలేదు. "రాజశేఖర చరిత్రలో, రామచంద్ర విజయంలో, గణపతిలో ప్రాథమిక దశలో మనోవైజ్ఞానిక లక్షణాలు గుర్తించవచ్చు. మొదట ప్రపంచ యుద్ధానంతరం తెలుగులో వచ్చిన నవలల్లో ఈ లక్షణాలు ఇంకా విస్పష్టంగా గమనింపవచ్చు. నారాయణరావులో అత్యల్పంగా ఉన్నప్పటికీ 'తుఫాను'లో అధికంగా ఈ లక్షణాలు పరిశీలింపవచ్చు. సైకో ఎనాలిసిస్‌లోని సబ్లిమేషన్ ఈ నవలా నాయకుడు శ్రీనాథమూర్తిలో కనిపిస్తుంది. శ్రీపాద నవల ఆత్మబలిలో గోవిందమ్మ పాత్ర సృష్టిలో ఈ స్థితి ఉంది. జి.వి. కృష్ణారావు కీలుబొమ్మలు నవలలో ప్రధాన పాత్రలు పుల్లయ్య చంద్రశేఖరం పాత్రగతంగా అహం ప్రవృత్తి ఉంది. శారద–నటరాజన్ నవల 'మంచి చెడూ'లో కమల పాత్రగతంగా 'మాలపల్లి'లో మనోవైజ్ఞానిక లక్షణాలు ఉన్నాయి" (ఇనాక్, కొలకలూరి.2013.పుట.90).

ఇలా చెప్పుకుంటూ పోతే నవలల్లో అక్కడక్కడ మనోవైజ్ఞానికం కనిపిస్తుంది. కానీ మనస్తత్వ విధానానికి ప్రాధాన్యత ఇచ్చి నవలలు రాసిన వాళ్ళల్లో బుచ్చిబాబు, గోపిచంద్, జి.వి. కృష్ణారావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి మొదలైనవారు ప్రముఖులుగా చెప్పవచ్చు. వీళ్ళ కన్నా ముందు ఉన్న కొడవటిగంటి కుటుంబరావు కూడా 'చదువు', 'అనుభవం' నవలల్లో ఆర్థిక మానసిక సంక్షోభాన్ని చిత్రించాడు.

"మనోవైజ్ఞానిక లక్షణాలు బాగా చూడదగ్గ నవలలు బుచ్చిబాబు–చివరకు మిగిలేది, గోపిచంద్ – అసమర్థుని జీవయాత్ర, రావిశాస్త్రి – అల్పజీవి. ఈ నవలల్లో దయానిధి సీతారామారావు, సుబ్బయ్య క్రమంగా అధీర నాయకులుగా కనిపిస్తారు. ఇలా కనిపించటానికి కారణం వాళ్ళలోని మనోవైజ్ఞానిక లక్షణమే".

"బుచ్చిబాబు నవల చివరకు మిగిలేదిలో ఫ్రాయిడ్ సిద్ధాంతాలలో ఒకటైన ఈడిపస్ కాంప్లెక్స్ ఉంది. ఇది మదర్ ఫిక్షేషన్‌గా రూపం దిద్దుకుంది. 'దయానిధి చేతన' (Psyche)లోను ప్రతిష్ఠితమైన తల్లి మూర్తి అతని సమస్యకు కారణం. ఒకవైపు ప్రేమకు ఆమె ప్రతీక. తల్లిని ఆరాధ్య దైవంగా భావించే వ్యక్తి లోకంలో అందరిలోనూ ఆమె మూర్తినే అన్వేషిస్తాడనేది ఒక సత్యం – అజాతమైన ప్రేరణ" (ఇనాక్, కొలకలూరి.2013.పుట.91).

ఈ నవల చైతన్య స్రవంతి ధోరణిలో కొనసాగింది. ఈ నవలలో వ్యక్తి మానసిక సంఘర్షణ, సాంఘిక సంఘర్షణను పొందుతాడు. ఇందులోని పాత్ర దయానిధి మానవతావాదానికి ప్రతినిధి. ఆత్మవిమర్శ, అనుభవం, జ్ఞాపకాలతో ఇది నవల కొనసాగుతుంది. ఇలా తెలుగులో మనోవిజ్ఞానికతను భాగం చేసుకున్న నవలలు ఉన్నాయి. పత్రికల్లో కూడా ఇలాంటి నవలా వ్యాసాలు వచ్చాయి పరిశీలిద్దాం.

### 4.3.3. తొలి తెలుగు మనోవైజ్ఞానిక నవలకు 70!

అంపశయ్య నవీన్ రాసిన వ్యాసం "తొలి తెలుగు మనోవైజ్ఞానిక నవలకు 70! ఇది సాక్షి సాహిత్యం పుటలో నవంబర్ 07, 2016న ప్రచురితమయింది.

1946లో త్రిపురనేని గోపిచంద్ రాసిన మనోవైజ్ఞానిక నవల "అసమర్థుని జీవయాత్ర" డెభ్బై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నవల ప్రత్యేకతలను, రచయిత దృక్పథాన్ని వివరిస్తూ రాసిన వ్యాసమిది.

దీనిలో వ్యాసకర్త అసమర్థుని జీవయాత్రను తెలుగులో వెలువడిన మొట్టమొదటి మనోవైజ్ఞానిక నవలగా పేర్కొంటూ నవలా పరిణామ క్రమాన్ని మనోవైజ్ఞానిక నవలల ఆవిర్భావాన్ని వివరించారు.

తెలుగు నవలా సాహిత్యంలో ఆధునిక యుగం పందొమ్మిది వందల నలభైలలో ప్రారంభమయ్యిందని విమర్శకులు నిర్ణయించారు. 1946లో వెలువడిన త్రిపురనేని గోపిచంద్ 'అసమర్థుని జీవయాత్ర'తో ఈ ఆధునిక యుగం మొదలైందన్నారు. దీనికి ముందు వెలువడిన నవలల్లో సంఘ సంస్కరణయే ప్రధాన దృష్టిగా కనిపించేది. మానవుని కష్టసుఖాలకు సంఘమే ప్రధాన కారణమని సంఘం మారితే తప్ప మానవులు సుఖంగా జీవించలేరని ఆనాటి నవలాకారులు భావించారు. కానీ మానవుని కష్టసుఖాలకు ఆయా వ్యక్తుల మనస్తత్వమే కారణమవుతుందని గోపిచంద్ 'అసమర్థుని జీవయాత్ర', బుచ్చిబాబు 'చివరకు మిగిలేది'లలో ప్రతిపాదించారు.

సిస్మండ్ ఫ్రాయిడ్, యూంగ్, ఆడ్లర్ మొదలైన మనస్తత్వ శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన మనోవిశ్లేషణ సూత్రాల ప్రభావంతో పందొమ్మిది వందల ఇరవైలలో పాశ్చాత్య సాహిత్యంలో డి.హెచ్. లారెన్స్, జెమ్స్ జాయిస్, వర్జీనియా వుల్ఫ్ మొదలైన వారు నవలలు రచించారు. ఈ తరహా మనస్తత్వ నవలలను 'మనోవైజ్ఞానిక నవలలు' అసమర్థుని జీవయాత్ర అని తెలిపారు.

ఈ నవలలోని వస్తువు గురించి చెప్తూ సీతారామారావులోని మానసిక సంఘర్షణను చిత్రించటమే నవలా వస్తువుగా పేర్కొన్నారు. సీతారామారావు మీద అతని తండ్రి ప్రభావం బలంగా ఉంది. సీతారామారావులో రచయిత గోపీచంద్ కనిపిస్తాడు. ఒక రకంగా గోపీచంద్ 'ఆత్మకథాత్మక' నవలగా చెప్పవచ్చునని అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

గోపీచంద్ తండ్రి త్రిపురనేని రామస్వామి చౌదరి హేతువాదాన్ని ప్రచారం చేశాడు. ఈ హేతువాద ప్రభావం బాల్యంలోనే గోపీచంద్ మీద పడింది. జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటనకు కారణాలను వెతకడం హేతువాదుల ప్రధాన లక్షణం. అయితే ఎవరి జీవితం కూడా హేతువాదం ప్రకారం జరగదు. "తండ్రి ప్రభావంతో హేతువాదాన్ని వంట పట్టించుకున్న గోపీచంద్ తన జీవితాన్ని హేతువాదం ప్రకారం మలుచుకోబోయి ఎదురుదెబ్బలు తిన్నాడు అంటూ నవలా వస్తువును వివరిస్తూ ఈ నవలపై ఆర్.ఎస్. సుదర్శనం అభిప్రాయాలను ఇక్కడ ఉదహరించారు. "తెలుగుదేశంలో హేతువాదాన్ని ప్రచారంలోకి తెచ్చిన తండ్రి రామస్వామి, రామస్వామి చౌదరి మరణించాక గోపీచంద్ అనుభవించిన మనోవైకల్యానికి ప్రతిబింబమే ఈ నవల. ఈ మనోవైకల్యం సామాన్యమైనది కాదు. మృత్యువుతో హుటాహుటి పోరాటం. నవలలో నాయకుడైన సీతారామారావు మృత్యువు చేతిలో ఓడిపోయాడు. కానీ ఈ నవల రాయడం ద్వారా తనలోని సీతారామారావు మృతి చెందడం ద్వారా గోపీచంద్ వ్యక్తిగతంగా పునర్జన్మ వంటి అనుభూతిని పొంది, కొత్త దృక్పథంతో కొత్త జీవితాన్ని ప్రారంభించాడు".

సీతారామరావు ఎదుర్కొన్న తీవ్ర విషాదానికి కారణం అతడు జయించలేని మానసిక శక్తులే అంటూ ఆయన మనస్తత్వాన్ని, సంఘర్షణను తెలియజేసే నవలలోని కొన్ని సన్నివేశాలను దీనిలో ఉదహరించారు. తన పతనానికి కారణం తండ్రే అయినా తండ్రి నేర్పిన పాఠాలను తన జీవితానుభవాల ద్వారా మార్చుకోలేకపోయిన తన అసమర్థతే తన పతనానికి కారణమనే జ్ఞానోదయం కల్గటంతో తన పట్ల తనకే విపరీతమైన ద్వేషం, కసి జనించి తనను తాను నిర్దాక్షిణ్యంగా హతమార్చుకోవటంతో 'అసమర్థుని జీవయాత్ర' పరిసమాప్తమవుతుందని నవల ఇతివృత్తాన్ని వివరిస్తూ నవల నేపథ్యాన్ని, రచయిత మనస్తత్వం, రచనలో ప్రతిఫలించిన రచయిత జీవితం, వాస్తవికాంశాలు వంటి అనేక విషయాలను ఈ వ్యాసంలో చర్చించారు.

వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా కాక, ఒక సిద్ధాంతానికి కట్టుబడాలని ప్రయత్నించే వాళ్ళ జీవితాలు ఎలా ఛిద్రమైపోతాయో ఈ నవల మనకు చెబుతుంది. జీవితం జీవించడం కోసమే

తప్పు సిద్ధాంతాల కోసం కాదన్న ఒక ప్రాథమిక సత్యాన్ని ఈ నవల మనలో ఆవిష్కరిస్తుందని నవల ప్రయోజనాన్ని సందేశాన్ని వివరించారు.

తొలి తెలుగు మనోవిజ్ఞానిక నవల 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ నవల గొప్పతనాన్ని, రచయిత రచనా విధానాన్ని తెలుపుతూ నవలలోని అనేకాంశాలను ఈ వ్యాసం ద్వారా పాఠకులకు అందించారు. మానవ జీవనాన్ని నవలగా చిత్రించిన విధానాన్ని మానసిక స్థితిగతులు మనిషి జీవితంపై చూపే ప్రభావాన్ని నవలాధారంగా విశ్లేషించారు. దీని ద్వారా మనోవైజ్ఞానిక నవలలపై అవగాహన, చదవాలనే స్ఫూర్తి పాఠకులకు అందించారు.

**4.3.4. అంతరంగమే ఆయన కథనరంగం**

అంతరంగమే ఆయన కథనరంగం అనే వ్యాసాన్ని అంపశయ్య నవీన్ రాశారు. ఇది జూన్ 12, 2017న సాక్షి సాహిత్యం పుటలో ప్రచురితమయింది.

జూన్ 14న ప్రముఖ నవలా రచయిత బుచ్చిబాబు జయంతి సందర్భంగా రచయిత రచనల ప్రత్యేకతలను, రచయిత దృక్పథాన్ని వివరిస్తూ రాసిన వ్యాసమిది.

దీనిలో వ్యాసకర్త బుచ్చిబాబును ఆధునిక తెలుగు వచన సాహిత్యంలో అతి నవీన మార్గం తొక్కిన రచయితగా పేర్కొన్నారు. కథ, నవలని కళాప్రక్రియగా తీర్చిదిద్దిన ప్రారంభ ఆధునిక రచయితల్లో బుచ్చిబాబు ఒకరని తెలిపారు. బుచ్చిబాబు తన కథల ద్వారా, నవల ద్వారా ఏదో ఒక భావాన్ని ప్రచారం చేయడం  ఆశయంగా పెట్టుకోలేదు. మానవ జీవితంలోని ఒకానొక అంశాన్ని చిత్రించే కళాస్వరూపాలుగా వాటిని స్వీకరించాడు. ఇది కాల్పనికోద్యమం తర్వాత తెలుగులో వచ్చిన ఆధునిక మార్గం. కాల్పనికోద్యమం నుండి తెలుగు సాహిత్యం ఎక్కిన మరో మెట్టుగా అభివర్ణించారు.

ఇదివరకు రచయితలు తమ పాత్రల బాహ్య జీవితంపై దృష్టి ఎక్కువగా కేంద్రీకరించారు. కాని ఆధునిక రచయితలకు వ్యక్తి బాహ్య జీవితం చేష్టలు ప్రధానం కాదని తెలుపుతూ ఒక వ్యక్తి బాహ్య జీవితాన్ని అతని ఆంతరంగిక జగత్తు – ఆ జగత్తులోని విభిన్న శక్తులకు కుదిరిన సమన్వయం నిర్ణయిస్తుంది. ఆ సమన్వయం సాధించే వరకు తనతో తానూ, బాహ్య ప్రపంచంతోనూ ఏదో రకంగా సంఘర్షణ పడ్తూనే ఉంటాడు. ఈ సంఘర్షణని చిత్రించే ప్రయత్నం చేస్తారు ఆధునిక రచయితలని వివరించారు.

ఈ ఆధునికోద్యమం 1914 తర్వాత ఆంగ్లంలో ప్రవేశించిందని చెప్తూ జేమ్స్ జాయిస్, వర్జీనియా వుల్ఫ్ వంటి రచయితలను పేర్కొన్నారు. వారు ఈ ఉద్యమాన్ని 1940 తర్వాత తెలుగులో

ప్రవేశపెట్టిన రచయితల్లో ప్రముఖుడు బుచ్చిబాబు అని వారి మనోవైజ్ఞానిక నవల 'చివరకు మిగిలేది' ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయిగా వర్ణించారు. బుచ్చిబాబు రాసిన ఏకైక నవల 'చివరకు మిగిలేది' పరవళ్ళు తొక్కే గొప్ప భావోద్వేగంతో రాయబడిన నవల అని చెప్తూ రచయిత చెప్పిన నవల రాయడానికి గల కారణాలను ఇక్కడ ప్రస్తావించారు.

"తనని కలవరపెట్టిన కొన్ని సమస్యల నుండి విముక్తి పొందడానికి ఇది వ్రాసానని రచయిత చెప్పుకున్నాడు. చివరకు మిగిలేది వ్రాసి పది సంవత్సరాలు వట్టిపోయాను అన్నాడు. తన ఊహాశక్తిని, సృజనాత్మక శక్తిని, భావనాజగత్తుని సంపూర్ణంగా 'చివరకు మిగిలేది'కి సమర్పించుకున్నాడు.

చివరకు మిగిలేది 1946లో వ్రాయబడినా పుస్తక రూపంలో 1952లో వచ్చింది. నాటి నుండి నేటివరకు ఎంతో మంది యువ రచయితల్ని, విమర్శకుల్ని ప్రభావితం చేసింది. ఎన్ని సార్లు చదివినా క్రొత్త అర్థాల్ని, క్రొత్త ధ్వనుల్ని స్ఫురింపజేసే నవల ఇది అంటూ నవలా విశిష్టతను తెలియజేశారు.

ఇంకా బుచ్చిబాబు ఒక నవల, కొన్ని నాటకాలు, కొన్ని వ్యాసాలు రాసిన ఆయన ప్రధానంగా కథకుడు 80కి పైగా కథలు రాశారని వారి రచనలను పరిచయం చేశారు. ఈ విధంగా నవలను, కథను ఒక కళాప్రక్రియగా తీర్చిదిద్దిన ప్రారంభ ఆధునిక రచయితల్లో బుచ్చిబాబు ప్రముఖుడుగా ఈ వ్యాసంలో ఆవిష్కరించారు. ఈ వ్యాసం ద్వారా ఆధునిక రచయితల దృక్పథం, లక్షణాలు బుచ్చిబాబు రచనల ప్రత్యేకతలు, ఆయన రచనావిధానం మొదలగు అంశాలపై అవగాహనను కల్పించారు.

### 4.3.5. మనోవైజ్ఞానిక నవలా సంబంధ వ్యాసాల పట్టిక

మనోవైజ్ఞానిక సిద్ధాంతాలతో వచ్చిన నవలా సంబంధ వ్యాసాలు మనకు రెండు పుటల్లో మరికొన్ని కనిపిస్తున్నాయి. వాటి వివరాలను కింద పట్టికలో తెలిపాను

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | సాహిత్య విమర్శకుడిగా నవీన్ | డా॥ శంకరమంచి శ్యాంప్రసాద్ | ఆగస్టు 22, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | ఆధునికత మీద సాధికారత | డా॥ శంకరమంచి శ్యాంప్రసాద్ | నవంబర్ 21, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక – 20**

### 4.4. గిరిజన నవలా వ్యాసాలు

గిరిజనులను రకరకాల పేర్లతో నేడు పిలుస్తున్నారు. ఆదివాసులు, ఆటవికులు, అనాగరికులు, కొండజాతివాళ్ళు, అడవి మనుషులు ఇలా పేర్లు కన్పిస్తాయి. గిరిజనులు అంటే కొండ లేదా పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజలని అర్థం. హిందీలో 'ఆదివాసీ' 'జన్‌జాతి' అని పిలవడం కన్పిస్తుంది. ఆది అంటే మొదట అనే అర్థం వస్తుంది. 'వాసీ' అంటే వాసులు, ప్రజలు, జనాలు, నివాసం చేసే నివాసులు అనే అర్థం వాడబడుతుంది. అలాగే ట్రైబ్ అనే ఇంగ్లీషు పదాన్ని కూడా వాడటం జరుగుతుంది. దీనికి తెగ సంచార సమూహం అని అర్థం. ఎందుకంటే వీరు వారి జీవనం కోసం ఒక ప్రాంతం నుండి వేరే ప్రాంతానికి వలస వెళుతూ ఉంటారు. అందుకే సంచార జాతి అంటారు.

గిరిజనులు అంటే ఎవరంటే షెడ్యూల్డ్ ట్రైబ్స్ అన్న పదం భారత రాజ్యాంగంలో మొదటిసారిగా కన్పిస్తుంది. "రాజ్యాంగంలో ఆర్టికల్ 366 (25) షెడ్యూల్డ్ తెగలను ఈ విధంగా తెలియజేస్తుంది. ఒకే విధమైన తెగలు లేదా గిరిజన సముదాయాలు లేదా సముదాయాలలోని భాగాలు లేదా సమూహాలు లేదా గిరిజన సమూదాయాలన్నింటిని రాజ్యాంగంలో 342 ఆర్టికల్ కింద చేర్చడం జరిగింది. కొంత కాలానికి గిరిజన తెగ నిర్వచనం, భావం స్థిరపడ్డాయి అనే విషయాన్ని నదీం హస్‌నైన్ భారతీయ గిరిజనుల గ్రంథంలో ఇలా పేర్కొన్నారు. ఒకే విధమైన తెగలు లేదా గిరిజన సముదాయాలు, అంతేగాక రాజ్యాంగం ఎస్.టి. నిర్ధారణకు ఎటువంటి ప్రామాణికాలను స్పష్టం చేయలేదు. రాజ్యాంగ అధికరణ 240 కింద ఏర్పాటైన వెనుకబడిన తరగతుల తొలి కమీషన్ సిఫార్సుల ప్రకారం కొండ ప్రాంతాల్లో, మైదాన ప్రాంతాల్లో నివసిస్తూ ప్రధాన జనజీవన స్రవంతిలో కలువకుండా నివసించేవారిని ఎస్.టి.లుగా పరిగణించవలసి ఉంటుంది. వారు ఏ మతానికైనా చెందవచ్చనీ పల్ల త్రినాథ్‌రావు ఆదివాసీల నిరాశ్రయత గ్రంథంలో పేర్కొన్నారు. తెగ, ఆటవిక, ఆదిమ ప్రజల సమూహం, వారు తమకు ఆదిమ పురుషుడు ఒక్కడే అని భావిస్తారు. ఒక నాయకుని అధికారాన్ని వారు అంగీకరిస్తారు. తెగ, ప్రాంతీయ అనుబంధం ఉన్న సామాజిక బృందం, అంతర్వివాహం వారిలో సామాన్య లక్షణం, పని విభజన కన్పించదు. తెలుగు నాయకులే వారిని పరిపాలిస్తున్నారు" (వెంకటేశ్, ముడావత్.2018.పుట.25).

గిరిజనుల సమాజాలు చిన్నగా ఉంటాయి. అవసరాలు, ఆలోచనలు పరిమితంగా ఉంటాయి. సామాజిక, న్యాయ, రాజకీయ సంబంధాలు కూడా చాలా తక్కువగా ఉంటాయి. కొందరు కుటుంబాలన్నీ కలిసి ఒకే పేరుతో ఉండటం, ఒకే ఆహార నియమాలను పాటించడం

'తెగ' అంటారు. "తెగవారు ఒక ఖచ్చితమైన ప్రదేశంలో కలిగిన మాండలికాన్ని మాట్లాడుతూ సజాతీయంగా, సాంస్కృతికంగా ఐక్యపరిచే సాంఘిక వ్యవస్థను కలిగి అట్లే ఉపతెగలతో పూర్వీకుల ఆరాధనలతో ప్రత్యేక మత సంస్కృతిని కలిగి ఉంటారని కమలాదేవి ఛటోపాధ్యాయగారు నిర్వచించారు" (వెంకటేశ్, ముడావత్.2018.పుట.26).

గిరిజనుల గూర్చి తెలుసుకోవడానికి చరిత్ర బాగా ఉపయోగపడుతుంది. వారు ఏకాంత జీవితం గడపలేదన్న విషయం కూడా వెల్లడి అవుతుంది. పురాణ, ఇతిహాస కథలను గమనిస్తే తెలుస్తుంది. గిరిజనులు ప్రత్యేక భాషతో, ప్రత్యేక వస్త్రాభరణాలతో కన్పిస్తారు.

"ఒక జాతికి ఒక భాష ఉంటుంది. గిరిజనులు సాధారణంగా నాగరికతకు దూరంగా జీవిస్తారు. ఒక నిర్ణీత ప్రాంతంలో దట్టమైన అడవులు మరియు కొండల మధ్య జీవిస్తారు. మూఢవిశ్వాసాలను, నమ్మకాలను కలిగి ఉండటం జరుగుతుంది. నృత్యగానప్రియులై ఒక ప్రత్యేక సంస్కృతి, సాంప్రదాయాలను కలిగి ఉంటారు. ప్రత్యేక రాజకీయ, ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంటారు. తమ పూర్వ వారసత్వాన్ని కాపాడుకుంటారు. ప్రత్యేక జీవన విధానం కలిగి ఉంటారు. ఒక్కో జాతికి ఒక్కో రకమైన శారీరక లక్షణాలు కనిపిస్తాయి. ఆహార నియమాలలో కూడా తేడాలు గమనించవచ్చు. తమ పూర్వ వారసత్వాన్ని కాపాడుకుంటూ ఉంటారు" (వెంకటేశ్, ముడావత్.2018.పుట.27).

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లో గిరిజనులు ఉన్నారు. వాళ్ళు రెండు రకాలుగా ఉంటారు. 1) ఏజెన్సీ ప్రాంత గిరిజనులు, 2) మైదాన ప్రాంత గిరిజనులు. ఏజెన్సీ ప్రాంత గిరిజనులు విజయనగరం, విశాఖపట్నం, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ ప్రాంతాల్లో కన్పిస్తారు. మైదాన ప్రాంతం వాళ్ళు హైదరాబాద్, కరీంనగర్, గుంటూర్ మొదలగు ప్రాంతాల్లో కన్పిస్తారు. గిరిజనుల్లో చెంచులు, గదబలు, గోండులు, గౌడులు, కమ్మరులు, అందులు, భగతలు, భిల్లులు, ఖోండులు, కోలాయులు, కొండ దొరలు, కొండరెడ్లు, కోయ, మాలీలు, మన్నెందొరలు, వాల్మీకి, నాయకపోడులు, రెడ్డి దొరలు, మూక దొరలు, కట్టు నాయకులు, సుగాలీలు, ఎరుకల, యానాదులు మొదలైన వాళ్ళు గిరిజన తెగలకు చెందినవాళ్ళు. ప్రస్తుతం తెలంగాణలో పూజిస్తున్న సమ్మక్క, సారక్కలు కూడా సామంత తెగవాళ్ళే.

### 4.4.1. గిరిజన నవలలు–పరిచయం

తెలుగు ప్రక్రియల్లో నవల ప్రముఖమైందని చెప్పుకున్నాం. వస్తువును బట్టి నవలా రకాలను చెప్పుకున్నాం. గిరిజన జీవనానికి సంబంధించిన కథలు వారి అనుభవాలు, అలవాట్లు, ఆచారాలు,

ఆహార పదార్థాలు మొదలైన అంశాలను చిత్రించే విధంగా ఉండే నవలలు కూడా తెలుగులో కన్పిస్తాయి. గిరిజన జీవితాల్లోని మోసం, కపటం, శ్రమదోపిడీ అశాంతిని సాహిత్యంగా మలిచిన రచయితలున్నారు. కవిత్వం, కథలు, నవలలు రాశారు. "ముఖ్యంగా ఇరవయ్యో శతాబ్దంలో గిరిజనుల జీవితాలను ఇతివృత్తాలుగా గ్రహించి నవలలు రాయడం జరిగింది. 1982లో సాహు, అల్లం రాజయ్యలు ఉమ్మడిగా రాసిన 'కొమురం భీం' నవల మొదలు, 2004లో జయశ్రీమోహన్ రాజ్, ఎస్. మోహన్ రాజ్‌లు రాసిన 'తాండా' నవల వరకు గిరిజన నవలలు ఎక్కువ సంఖ్యలో వెలువడ్డాయి. ఫలితంగా తెలుగు సాహిత్యంలో గిరిజన సాహిత్యం ఒక పాయగా ఏర్పడి సొంత అస్థిత్వాన్ని నిలబెట్టుకుంది" (వెంకటేశ్, ముడావత్.2018.పుట.241).

గిరిజన నవల దేనిని అంటారంటే గిరిజన నవలల్లో వస్తువు, ఇతివృత్తం గిరిజన జీవితాల్ని ఆశ్రయించి ఉంటుందనేది సమాధానంగా చెప్పవచ్చు. నవలలో ప్రధానంగా గిరిజనాంశం లేకున్నా కథ జరుగుతున్న ప్రాంతం, కానీ అందులోని పాత్రలుగానీ గిరిజనులై ఉండవచ్చు. ఆధునిక నవలా లక్షణాలతో ఏర్పడ్డ తొలి గిరిజన నవలగా 1972లో వచ్చిన కొర్రపాటి గంగాధరరావు రాసిన 'లంబాడోళ్ళ రామదాసు'గా చెప్తారు. ఈ నవల లంబాడీల జీవితంలోని లోతుల్ని చూపింది. జీవన విధానం వారి తిట్లు, మాటలు, పిలుపులు, ఆచార వ్యవహారాలను తెలిపింది. ఆ తర్వాత తెలుగు నవలా సాహిత్యంలో రచయితల దృష్టి 'గిరిజన' వస్తువుపై మళ్ళింది. 'లంబాడోళ్ళ రామదాసు' నవల తర్వాత తెలుగు సాహిత్యంలో కొమురం భీం, అడవి, ఎన్నెల నవ్వు, సంఘం, తాండా, వనవాసి, వసంతగీతం, ఎల్లి, రాగో, బషాయితుడు, అతడు అడవిని జయించాడు, అడవితల్లి, పునరావసం, ఎవరిది అడవి, సరిహద్దు, ఊరు మొదలగు నవలలు వచ్చాయి. ఈ నవలల్లో గిరిజనుల పుట్టుక, బాల్యం, వివాహం, ఆచారాలు, దేవుళ్ళు, నమ్మకాలు, ఆటలు, పాటలు, పోరాటాలు, విశ్వాసాలు, సామాజిక జీవన విధానం, ఆర్థిక దోపిడీ, శ్రమ దోపిడీ మొదలైన అంశాలు చెప్పబడ్డాయి.

ఇలాంటి గిరిజన జీవన విధానానికి సంబంధించిన నవలా సాహిత్యం గూర్చి పత్రికలలో కూడా కన్పిస్తుంది. ఈ గిరిజన సాహిత్య వ్యాసాలు చదవటం వలన ఆ సాహిత్యం వారి జీవన విధానం పాఠకులకు అవగతమవుతుంది. ఒక రకంగా పత్రిక సాహిత్యం రకరకాల సాహిత్యం తెలుసుకోవడానికి వాటి పట్ల అవగాహనను పెంచుకోవడానికి తోడ్పడుతుందని చెప్పవచ్చు.

### 4.4.2. అడవి మీద విరిసిన అక్షరం

గోపరాజు నారాయణరావు రాసిన అడవి మీద విరిసిన అక్షరం అనే వ్యాసం సాక్షి సాహిత్యం పుటలో ఆగస్ట్ 01, 2016న ప్రచురితమయింది.

గిరిజన జీవితాన్ని నవలా వస్తువులుగా మలచుకున్న మహాశ్వేతాదేవి జూలై 28, 2016న మరణించిన సందర్భంగా వారి రచనల్లో ప్రత్యేకతలు, గిరిజన జీవిత చిత్రణను వివరిస్తూ రాసిన వ్యాసమిది.

రచన, ఇతివృత్తం, రూపం – ఈ మూడు అంశాల మీద మహాశ్వేతకు నిశ్చితమైన అభిప్రాయాలున్నాయని చెప్తూ ఆధునిక భారతీయ సాహిత్యాన్ని అడవి ఆత్మకు పునః పరిచయం చేసిన మహాశ్వేతాదేవిని ఆధునిక భారతీయ సాహిత్య నిర్మాతల్లో ఒకరిగా పేర్కొన్నారు. మహాశ్వేతాదేవి రాసిన అన్ని రచనల్లో కేవలం ఒక పది శాతం తప్ప మిగిలిన రచనలన్ని గిరిజన జీవిత సంక్షోభాన్ని ఆవిష్కరించేవే అని చెప్తూ వారి రచనల్లో చిత్రించిన గిరిజన జీవన విధానాన్ని వివరించారు.

జూన్ 9, 1900 సంవత్సరం రాంచీ జైలు, ఉదయం యెనిమిది గంటలప్పుడు బీర్సా రక్తం కక్కి స్పృహ తప్పిపోయాడు., బీర్సా అడవిలో నివసించే ఆదివాసి. ముండా తెగలో ముఖ్యుడు...' ఇలా మొదలవుతుంది 'ఎవరిదీ అడవి' అనే నవల అంటూ నవల వస్తువు విశ్లేషించారు. 'ఎవరిదీ అడవి' 1899–1900లో చోటా నాగ్‌పూర్, రాంచీ ప్రాంతంలో జరిగిన గిరిజనోద్యమం ఆధారంగా రాసిన నవల. దీనినే ఉల్‌గులాన్ అని పిలుస్తారు. బీర్సా ముండా దీని నాయకుడు. ఇది తెలుగు వారు కూడా విశేషంగా చదివిన నవల అంటూ దాని వస్తువును వివరించారు.

మహాశ్వేతా ఒక్కొక్క కథ గిరిజన జీవితంలోని ఒక విషాద పరిణామాన్ని వివరిస్తుందంటూ 'శనిచరి' కథను పరిచయం చేశారు. శనిచరి కథలో వ్యభిచార కూపాలలోకి బలవంతంగా కూరుకుపోతున్న వంగ ప్రాంత అటవీ బాలికల విషాదం గురించి రాశారు. ఇటుక బట్టీలలో పని పేరుతో తీసుకెళ్లి ఆ అమాయకురాళ్ల చేత వ్యభిచారం చేయిస్తారు దళారులు. అది భరించలేక చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటూ ఉంటారు. శనిచరి మాత్రం తన కడుపున పుట్టిన బిడ్డతో సహా తిరిగి గ్రామంలోకి వస్తుంది. 'తప్పు' చెల్లిస్తుంది. అయినా గిరిజన సమాజం ఆదరించదు. రైలు పట్టాలపై బొగ్గు ముక్కలు ఏరుకుంటూ బతుకీడుస్తుంది. ఆ బొగ్గు ముక్కలే నిప్పురవ్వల్లాంటి ప్రశ్నలను సంధిస్తాయని గిరిజన జీవితాన్ని పరిచయం చేశారు.

బెంగాల్‌లోని మారుమూల ప్రాంతంలో 'రుడాలి' ఒక వృత్తి. రుడాలి అంటే జమీందారులు చనిపోతే కిరాయికి వెళ్ళి గుండెలు బాదుకుంటూ ఏడ్చే మహిళ. ఈ వృత్తి పూర్తిగా నిమ్న వర్గాలదే. రుడాలి ఇతివృత్తం పూర్తిగా అసాధారణమైన అంటూ దానిని విశ్లేషించారు. అలాగే గిరిజన సంప్రదాయాన్ని 1975 నాటి అత్యవసర పరిస్థితిలో జరిగిన బలవంతపు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు ఎలా సంక్షుభితం చేశాయో వర్ణించే కథ 'మకరసవర' విధానాన్ని వారి రచన ప్రత్యేకతలను, రచయిత్రి రచనా విధానాన్ని దీనిలో వివరించారు.

రుడాలి జమీందారులు చనిపోతే కుండలకొద్ది ఏడ్చేది కాని తన సొంత కొడుకు శవం దగ్గర ఒక్క కన్నీటి బొట్టు కూడా కార్చని ఒక అసాధారణమైన ఇతివృత్తం రుడాలి అని వస్తువును విశ్లేషించారు.

### 4.4.3. ...చాలా పెద్దమ్మ!

చాలా పెద్దమ్మ! శీర్షికతో ఆగస్టు 1న 2016లో మహాశ్వేతాదేవి అనే రచయిత్రి మీద వ్యాసం వచ్చింది. వ్యాసాన్ని అంబటి సురేంద్రరాజు రాశారు.

మహాశ్వేతాదేవి గిరిజనులు, ఆదిమవాసులకు సంబంధించిన కొండ కోనల్లోని ప్రజలకు సంబంధించిన వ్యాసంగాన్ని చేశారు. ఆమె బెంగాల్ ప్రాంతానికి చెందిన రచయిత్రి. 'కలకత్తా కాళిక నాలిక' అని టారు ఆమెను. తమ రచనలను అందరూ మధ్య తరగతి కుటుంబాలకు సంబంధించినవి రాస్తే ఆమె మాత్రం అడవుల్లో మధ్య తరగతికి వెలుపల ఉన్న ఊరికి దూరంగా వాడలలో జీవిస్తున్న ఆదీవాసులుకు అథోజగత్ సహోదరులకు అంకితం చేశారు. ఉత్తమ సాహితీ సృజనకు స్వీయానుభవం అవసరం లేదని నిరూపించారు. మహాశ్వేతాదేవి, కేశవరెడ్డి లాంటివారు గొప్పవాళ్ళు గిరిజన సాహిత్యం పట్ల కృషిచేశారని ఈ వ్యాసంలో రచయిత తెలియజేశాడుర. విద్యాధిక, అగ్రకుల, పట్టణ/నగర మధ్యతరగతి సాహితీ జగత్తు నుంచి మెడ పట్టి గెంటేసిన ఖ్యాతి వీళ్ళకు దక్కుతుందని అణగారిన జాతుల పట్ల వీరు చేసిన వ్యాసంగాన్ని పరిచయం చేశాడు రచయిత. ఈమె రాకాసి కోర, ఎవరిదీ అడవి?, ఒక తల్లి, బషాయితుడు, ద్రౌపది, ఝాన్సీరాణి, విత్తనాలు వంటి నవలలు కథానిక సంకలనాలతో తెలుగు పాఠకలోకాన్ని లోతుగా పరిచయం చేసి ఆకట్టుకున్న రచయిత్రి అంటూ ఆమె కృషి కొనియాడబడింది.

మహాశ్వేతా దేవి నలభై ఐదు నవలలు, పదిహేను కథా సంపుటాలు, బాలలపై పది పుస్తకాలను, ఒక నాటికను రాసారని చెప్పబడ్డది. మహాశ్వేతా దేవి పరిచయం, రచనలు చెప్పటం ఇక్కడ ఉద్దేశ్యం కాదు. ఆమె గిరిజనుల పట్ల చూపిన శ్రద్ధ, వారికి వారి జీవన విధానానికి

ఇచ్చినటువంటి ప్రాధాన్యత తెలుస్తుంది. అలాగే కొండ కోనల్లోని ప్రజలను కూడా సమాజానికి వెలుపల ఉండకుండా, జనస్రవంతిలో కలవడానికి ఆమె కృషి చేసిందని, కేశవరెడ్డి రచనలు కూడా గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా చెప్పేవని వ్యాసకర్త తెలుపుతున్నాడు.

ఇక్కడ ఈ వ్యాసం వల్ల కలిగిన లాభం శ్వేతాదేవి పరిచయం, ఆమె కృషి, కఠినత్వం, కేశవరెడ్డి రచనల ప్రాధాన్యత, అలాగే కొండ జాతి ప్రజల జీవన విధానం, వారి నివాస స్థానాలు, అన్నీ చదివిన వారికి అవగతమవుతాయి. అది ఈ వ్యాసం వలన చేకూరిన అవగాహన. పాఠకులకు అందిన సమాచారం. ఇలాంటి వ్యాసాల వల్ల ప్రజలకు సానుభూతి, గిరిజనుల పట్ల ఒక దృక్పథం ఏర్పడుతాయి. ఒక రచయిత గానీ రచయిత్రి గానీ తన రచనల ద్వారా ముఖ్యంగా సమాజానికి దూరంగా ఉన్నవారిని గూర్చి రాస్తే వారి రచనలు నిరుపయోగం కావు. ఉపయోగపడుతాయని అర్థమవుతుంది. అలాంటి రచనలే సమాజానికి అవసరమని బోధపడుతుంది.

### 4.4.4. అపనమ్మకం ఆగిపోయే సందర్భం

'అపనమ్మకం ఆగిపోయే సందర్భం' శీర్షికతో సాక్షి దినపత్రికలోని 'సాహిత్యం' పుటలో హెచ్చార్కె అనే వ్యాసకర్త సెప్టెంబర్ 11వ తేదీ 2017లో వ్యాసాన్ని రాశారు.

ఇది వి. చంద్రశేఖర రావు రాసిన 'ఆకుపచ్చని దేశం' అనే నవల సంబంధిత వ్యాసం. ఇందులో చెంచులు ఓ అరవై మంది అడివిని వదిలేసి అడివి సరిహద్దుల్లోని మైదానంలో బతకాలని రాజకీయులు శాసిస్తారు. గిరిజనులు వినరు. అలాగని వినకుండా తెగించరు. అడవిలో లోతట్టుకు అక్కడి నుండి వెళ్ళి పోమంటే ఇంకా లోతట్టుకు పయనమైపోతారు. ఎక్కడా ఆగరు. దొరికిన కందమూలాలు తినుకుంటూ వెళతారు. ఇందులోని కథ ఇది. ఇక్కడ గిరిజనులను అడవి వదిలి పొమ్మని స్థానిక రాజకీయ నాయకులు చేసిన పనిని గిరిజనుల దీనావస్థను వర్ణించాడు. అలాగే వారు తిరుగబడరు అలాగని ఊరుకోరు అని చెప్పడం. మనుషుల్లోని చైతన్యాన్ని కోరుకోవడానికి ప్రతీక. అలాగే సానుభూతి వ్యక్తం చేయడం ఇక్కడి గిరిజనుల పరిస్థితి వర్ణితం. చంద్రశేఖరరావు రచయిత మిగిలిన నవలలు కథల్లోనూ ఉండే ఒక రకం కవిత్వ శైలి, 'దుఃఖపాట', 'ఏడుపుపాట' అనే పదాలు ఆవృత్తమైనా విసుగు కలగదని అంటాడు వ్యాసకర్త. అంటే నవలావస్తువు అంతా గొప్పగా ఉంది. శిల్ప సంబంధం విషయాన్ని కూడా పక్కన పెట్టేంతా ప్రాధాన్యత దానికి ఉందని అర్థం చేసుకోవాలి.

ఇక్కడ నవలలోని ప్రాంతం అడవి కావటంవల్ల పాటకు చేరువైన గిరిజనులు వస్తువు కావటం వల్ల నవల ఒక పాటలాగా సాగిపోతుందని అంటాడు వ్యాసకర్త. కథలో బతుకు

కలిపినట్లుంటుంది. ఈ నవలలో నిజం ఉంది. ప్రయోజనం ఉంది. అరవైమంది గిరిజనుల కథ. వారి జీవితం, వారి కష్టాలు సమాజంలో వారిపై గల పీడన, అమాయకత్వం అన్నీ ఇక్కడ చూపబడ్డాయి. ఈ వ్యాసం ద్వారా రచయిత దృక్పథం చెంచుల పరిస్థితి, రాజకీయ నాయకుల అధికారం, వారి జీవన విధానం వెల్లడి అయ్యాయి. అలాగే నవలలోని గొప్పతనం, నవలాశిల్పం, సంభాషణ, ఆవృత్త పదాలున్నా వస్తువు గట్టిదనం, ప్రాధాన్యత తెలిసాయి. అసలే ఈ నవల చదవని వారికి నవల పట్ల అవగాహన, కథపట్ల అంచనా, రచయిత దృక్పథం, విషయ జ్ఞానం అందుతాయి. పాఠకులకు ఈ నవల పరిచయం, స్థూల సారాంశం అందుతుంది. తెలియని విషయాన్ని వ్యాసకర్త లోకానికి పరిచయం చేసినట్లయ్యింది. ఇది కూడా నవలా విమర్శలో భాగం. గిరిజన సంబంధిత నవలగా దీనికి పేర్కొనవచ్చు.

## 4.5. నవలా సంబంధ స్మరణ వ్యాసాలు

రచయితల వర్ధంతి సందర్భంగా వారి జీవిత విషయాలను, వారు చేసిన సాహిత్య సేవను, రచనల ప్రత్యేకతలను స్మరిస్తూ వ్యాసాలు ప్రచురించడం అనేది మనకు దినపత్రికల్లో కనిపిస్తుంది. వీటిని స్మృతి లేదా స్మరణ వ్యాసాలు అంటారు. ఇలాంటి వర్ధంతి సందర్భ నవలా వ్యాసాలు ఈ రెండు పత్రికల సాహిత్య పుటల్లో మనకు కనిపిస్తున్నాయి.

### 4.5.1. అస్తమయం–నలుపు మందరాల మాన్యం చెల్క

పున్నా కృష్ణమూర్తి రాసిన వ్యాసం 'నలుపు మందరాల మాన్యం చెల్క'. ఇది సాక్షి సాహిత్యం పుటలో మే 09, 2016న ప్రచురితమయింది.

దళిత సాహిత్య స్ఫూర్తి ప్రధాతగా చెప్పబడే తెలంగాణ ప్రముఖ రచయిత జోయ జహయ్య మే 07, 2016న పక్షవాత కారణంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. ఆయన మరణం సందర్భంగా వారి రచనల ప్రత్యేకతలను వారి జీవిత విషయాలను తెలుపుతూ కవి జీవిత విమర్శ పద్ధతిలో రాసిన వ్యాసం ఇది.

అట్టడుగు వర్గాల నుంచి వచ్చే వారు తమ జీవిత సత్యాలను చిత్రించడం ప్రారంభిస్తారు. అప్పుడు ఈనాడు మనం చూసి మురిసే సాహిత్యం, పేలపిండిలా గాలిలో కలిసిపోతుంది అన్న కొడవటిగంటి కుటుంబరావు వ్యాఖ్యను తదనంతర కాలంతో నిలువుట్టందలా నిలిచిన వ్యక్తి బోయ జంగయ్య అంటూ వారి జీవితాన్ని రచనలను పరిచయం చేశారు. జంగయ్య 'జాతర' నవల తెలుగు విశ్వవిద్యాలయం నుంచి అత్యున్నత నవలగా పురస్కారం పొందింది. కేంద్ర దళిత సాహిత్య

అకాడమీ డా॥ అంబేద్కర్ సాహితీ ఫెలోషిప్ పొందారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో రచయితల సంఘాలకు బాధ్యులుగా పనిచేశారు.

నల్గొండలోని ఆయన ఇంటిపేరు 'మాన్యం చెల్క'. ఆ సాహితీ క్షేత్రం నుంచి బోయ జంగయ్య పండించిన పంటలు, ఎలుతురు, పావురాలు అనే కవితా సంపుటాలు, గొర్రెలు, ఎచ్చరిక, దున్న, రంగులు, చీమలు అనే కథాసంపుటాలు అని వారి జీవిత విషయాలను, రచనా విషయాలను పరిచయం చేశారు.

వీరి రచనల్లో గ్రామీణ తెలంగాణ కనిపిస్తుంది. పూర్వపు పాలన అవశేషాలు తెలంగాణ పల్లెలను ఎలా పీడిస్తున్నవో వివరించడం కనిపిస్తుంది. ఆధునిక అస్తిత్వ ఉద్యమాలకు పూర్వమే అణగారిన వర్గాల గురించి, ముఖ్యంగా వృత్తికారులు, స్త్రీలు, దళితుల గురించి స్వీయానుభవాల ఆధారంగా రచనలు చేసిన వారిలో బోయ జంగయ్య ముందు వరుసలో ఉంటారని వారి రచనా వస్తువును వివరించారు. గ్రామాల్లో మూఢనమ్మకాల వెనకగల రాజకీయాలు, పరస్పర శత్రుత్వాలు హత్యలకు దారితీసే ఉదంతాలు జంగయ్య రచనల్లో విస్మయం గొలిపే సహజరీతిలో ఉంటాయని చెప్తూ గిరిజన సంప్రదాయాలు పూర్తిగా అంతరించని గ్రామీణ స్వభావాలను తన కథల్లో ప్రతిభావంతంగా చిత్రించిన తీరును కొనియాడారు.

జంగయ్య తన పుస్తకాల ముఖచిత్రాలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారని చెప్తూ ఎలుతురు కవితా సంపుటికి హండ్‌మేడ్ పేపర్‌పై దాసి సుదర్శన్‌తో ముఖచిత్రం వేయించారని వారి కథా సారాంశాన్ని తెలిపే ముఖ చిత్రాల ప్రత్యేకతలను తెలిపారు.

జంగయ్య మాన్యం చెల్కలో మాండలికాల పంట ఉంది. ప్రచార సాధనాల వలన మనుషులు మాట్లాడే మాటల్లో ఒకానొక కృత్రిమ భాష వ్యవహారంలోకి వస్తోన్న వాతావరణంలో జంగయ్య రచనలు ప్రాధాన్యత సంతరించుకుంటాయని చెప్తూ పల్లెల్లో వివిధ సమూహాలకు, సామాజిక వర్గాలకు చెందిన మనుషులు మాట్లాడే మాండలికాలను బోయ జంగయ్య తన రచనలలో వాడారంటూ జాల–దవ్వు–గాడ్పు–కొట్టిండు వంటి గ్రామీణ పదాలను పేర్కొన్నారు.
ఈ విధంగా కవి జీవిత విషయాల కన్న వారి రచన విశిష్టతలకు అధిక ప్రాధన్యమిస్తూ రచనలో ప్రత్యేకతలను, రచయిత వ్యక్తిత్వాన్ని తెలుపుతూ కవి జీవిత విమర్శ పద్ధతిలో రాసిన స్మరణ వ్యాసం ఇది.

### 4.5.2. నివాళి–అడవి మీద విరిసిన అక్షరం

గోపరాజు నారాయణరావు రాసిన వ్యాసం 'అడవి మీద విరిసిన అక్షరం'. ఇది సాక్షి సాహిత్యం పుటలో ఆగస్టు 01, 2016న ప్రచురితమయింది.

ఆధునిక భారతీయ సాహిత్యాన్ని అడవి ఆత్మకు పునః పరిచయం చేసిన రచయిత్రి మహాశ్వేతాదేవి జూలై 28, 2016న మరణించిన సందర్భం ఆమె జీవిత విషయాలను, రచనా విషయాలను, వారి వ్యక్తిత్వాన్ని, రచయిత్రి దృక్పథాన్ని రచనల ప్రత్యేకతలను వివరిస్తూ కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ పద్ధతిలో రాసిన స్మృతి వ్యాసం ఇది.

వ్యాసకర్త మహాశ్వేతాదేవిని ఆధునిక భారత సాహిత్య నిర్మాతలలో ఒకరిగా పేర్కొన్నారు. కుటుంబ నేపథ్యం వల్ల కావచ్చు, రచనా ప్రవృత్తి మహాశ్వేతాదేవికి సహజంగా అచ్చిందంటూ చెప్తూ పదమూడు సంవత్సరాల వయస్సులో ఆమె రాసిన 'రవీంద్రుని బాల్యం' వ్యాసం రంగ్ మషాల్ అనే పత్రికలో వెలువడింది. 'ఝూన్సీరాణి' నవలను 1956లో చారిత్రకాధారాలతో రచించారు. అప్పటి నుండి చిరకాలం వ్యాసం, నవల, కథ, నాటకం, బాల సాహిత్యం వంటి ప్రక్రియల్లో విశేష సాహిత్య సృష్టి చేశారంటూ వారి రచనలను పరిచయం చేశారు.

రచన, ఇతివృత్తం, రూపం – ఈ మూడు అంశాల మీద మహాశ్వేతకు నిశ్చితమైన అభిప్రాయాలున్నాయని చెప్తూ వారి పది శాతం రచనలు తప్ప మిగిలినవన్నీ గిరిజనుల జీవిత సంక్షోభాన్ని ఆవిష్కరించినవేనని నవలా వస్తువు గురించి వివరించారు. వారు రాసిన నవలలను, కథలను సహవాసి, నిర్మలానంద వంటివారు అనువదించారు. హెచ్.బీట్, జన సాహితీ వంటి సంస్థలు పుస్తకాలుగా వెలువరించాయి. 'ఝూన్సీరాణి', అరణ్యే అధికార్ (ఎవరిదీ అడవి), హజార్ చురాషిర్ మా (ఒకతల్లి), 'రుడాలి' వంటి వాటిని కూడా పలువురు తెనిగించారని మహాశ్వేతదేవి రచనల అనువాద వివరాలను తెలిపారు.

మహాశ్వేతాదేవి రచనలలో వస్తువు గాంభీర్యంతోపాటు గొప్ప సరళత కనిపిస్తుంది. వాక్యాలు అతి సాధారణంగా మొదలవుతాయని చెప్తూ వారు రాసిన 'ఎవరిదీ అడవి' నవలా వస్తువును పరిచయం చేశారు. ఎవరిదీ అడవి 1899–1900లో చోటా నాగ్‌పూర్, రాంచీ ప్రాంతంలో జరిగిన గిరిజనోద్యమం ఆధారంగా రాసిన నవల అంటూ దాని వస్తువును విశ్లేషించారు.

మహాశ్వేతాదేవి ఒక్కొక్క కథ గిరిజన జీవితంలోని ఒక విషాద పరిణామాన్ని వివరిస్తుందని చెప్తూ 'శనిచరి', 'రుడాలి' కథలను పరిచయం చేశారు.

విశాఖ మన్యంలో గొప్ప ఉద్యమం నడిపిన అల్లూరి జీవితం ఆధారంగా నవల రాస్తానని ఆమె 1997లో విశాఖపట్నం వచ్చినప్పుడు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అల్లూరి శతజయంతికి వచ్చిన మహాశ్వేత, విజయనగరం జిల్లాలోని మూల వలస గిరిజన గ్రామాన్ని చూశారు. అక్కడే ఈ మేరకు ప్రమాణం చేశారు. ఆ ప్రమాణం నెరవేరి ఉంటే తెలుగు ప్రాంత గిరిజనోద్యమానికి గొప్ప వెలుగు వచ్చి ఉండేది. ఆ పని ఈతరం చేయగలిగితే అదే మహాశ్వేతకు నిజమైన నివాళి అవుతుందని వ్యాసకర్త ఈ సందర్భంగా పేర్కొన్నారు.

దీనిలో మహాశ్వేత రచనలు, రచన దృక్పథం, వాస్తవిక సంఘటనలను నవలా వస్తువుగా స్వీకరించి గిరిజన జీవుల జీవన చిత్రణ కావించిన విధానాన్ని విశ్లేషిస్తూ రచయిత్రి గొప్పతనాన్ని రచనల ప్రత్యేకతలను కవి జీవిత విమర్శ పద్ధతిలో విశ్లేషించారు. దీని ద్వారా రచయిత్రి దృక్పథం, వారి రచనల సంబంధ విషయాలు పాఠకులకు తెలుస్తుంది.

### 4.5.3. నవలా సంబంధ స్మరణ వ్యాసాల పట్టిక

స్మరణ సంబంధ నవలా వ్యాసాలు ఈ రెండు పత్రికల్లో మనకు మరికొన్ని కనిపిస్తున్నాయి. వాటి వివరాలు కింది పట్టికలో కలవు.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | *నివాళి బోయకొట్టములు పంద్రెండు రచయిత నిశ్శబ్ద నిష్క్రమణ | మాడా చంద్రమోహన్ | జనవరి 18, 2016 | సాక్షి – సాహిత్యం |
| 2) | ... చాల పెద్దమ్మ! | అంబటి సురేంద్రరాజు | ఆగస్టు 01, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక – 21**

## 4.6. నవలా సంబంధ నివేదిక వ్యాసాలు

నవలా సంబంధ సమావేశాలు, జాతీయ సదస్సులు జరిగినపుడు సదస్సు వివరాలను తెలియబరుస్తూ నివేదిక రూపంలో వ్యాసాలు కనబడుతున్నాయి. అలాగే నవలా రచయితలకు ఏవైన సన్మానాలు, సత్కారాలు, వారి రచనలకు ఏదైన అవార్డులు లభించిన సందర్భంలో వాటిని తెలియపరుస్తూ కూడా నవలా సంబంధ నివేదికా వ్యాసాలు మనకు ఈ రెండు పత్రికల్లో కనిపిస్తున్నాయి.

### 4.6.1. బ్రిటన్ దేహంలో జపాన్ ఆత్మ

ముకుంద రామారావు రాసిన 'బ్రిటన్ దేహంలో జపాన్ ఆత్మ' అనే వ్యాసం సాక్షి సాహిత్యం పుటలో అక్టోబర్ 09, 2017న ప్రచురితమయింది.

హరూకొ మురకామీ (జపాన్), గూగీ వాథియోంగ్ (కెన్యా) లాంటి వారిని వెనక్కు నెట్టి జపాన్ మూలాలున్న బ్రిటన్ రచయిత కజువో ఇషిగురోకి 2017 నోబెల్ సాహిత్య పురస్కారం లభించింది. ఈ సందర్భం రచయిత జీవిత విషయాలను, పురస్కార సంబంధ వివరాలను తెలుపుతూ నివేదికా రూపంలో కవి జీవిత విమర్శ పద్ధతిలో రాసిన వ్యాసం ఇది.

1986, 1989, 2000, 2005లలో నాలుగు సార్లు బుకర్ ప్రైజ్ గెలుచుకున్న 62 ఏళ్ల కజువో ఇషిగురో ప్రపంచంలో మొట్టమొదటి అణుబాంబు బాధిత నగరమైన జపాన్‌లోని నాగసాకి (నవంబర్ 08, 1954)లో జన్మించారు. ఇషిగురో అంటే శిల లేదా నలుపు అని అర్థం. ఆయన తండ్రి షిజువో ఇషిగురో సముద్ర విజ్ఞానంలో ప్రవీణుడు. అణుబాంబు విధ్వంసాన్ని యుక్త వయస్సులో తట్టుకొని బ్రతికింది తల్లి షిజుకో. తన ప్రావీణ్యత మీద నమ్మకంతో ఇషిగురో తండ్రి జపాన్ వదిలి, మరో ఇద్దరు కుమార్తెలతోపాటు, 5 ఏండ్ల కజువోను వెంట బెట్టుకొని 1960లో దక్షిణ ఇంగ్లాండులో ఒక చిన్న పట్టణమైన గిల్డ్‌ఫోర్డ్ సర్రేకు వలస వచ్చాడు అంటూ వారి జీవిత విషయాలను మనకు అందించారు.

9 – 10 ఏళ్ల వయస్సులో స్థానిక గ్రంథాలయాల్లో ఇష్టంగా చదువుకున్న షెర్లాక్ హోమ్ పుస్తకాలే కజువోకు సాహిత్య అభిరుచికి కారణాలుగా తెలిపారు. కజువో రాసిన తొలి నవల 'ది పేల్ వ్యూ ఆఫ్ హిల్స్' అని చెప్తూ దానిలోని వస్తువును వివరించారు. 27 సంవత్సరాల వయస్సులో ప్రచురించబడిన ఈ మొదట వచ్చిన ఆదరణ ఫలితంగా గ్రాంటా సంస్థ 1983లో అప్పటి యువ బ్రిటీష్ రచయితలతో తెచ్చిన ప్రత్యేక కథల సంకలనంలో కజువో కూడా చేరారంటూ చారిత్రాకాంశాలను ప్రస్తావించారు. దాని తర్వాత ఆయన రాసిన రెండవ నవల 1986లో వచ్చిన 'ఏన్ ఆర్టిస్ట్ ఆఫ్ ద ఫ్లోటింగ్ వరల్డ్' గురించి చెప్తూ దాని ఇతివృత్తాన్ని వివరించారు. అలాగే ఇషికురోకు అత్యంత పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టిన నవల 'ద రిమైన్స్ ఆఫ్ ద డే' అంటూ దీనిని 32 ఏళ్ల వయస్సులో కేవలం నాలుగు వారాల్లో పూర్తి చేశారు. దీనికి బుకర్ ప్రైజ్ కూడా లభించిందని వారి రచన జీవితాన్ని, రచనల ప్రత్యేకతలను వివరించారు.

ఇషిగురోకి సంగీత ప్రావీణ్యం కూడా ఉందని చెప్తూ సినిమాలకు, టీవీకి స్క్రిప్ట్ రచయిత కూడా అంటూ వారి ప్రతిభను కొనియాడారు. అలాగే అస్సామీ చాయ్ అంటే ఇషిగురోకి

అమితమైన ఇష్టం అంటూ రచయిత జీవిత విషయాలను, రచనల ప్రత్యేకతలను వారి అభిరుచులను కవి జీవిత విమర్శ పద్ధతిలో పాఠకులకు అందించారు.

### 4.6.2. నవలా సంబంధ నివేదికా వ్యాసాల పట్టిక

నవలా సంబంధ నివేదికా వ్యాసాలు మరికొన్ని ఈ రెండు పత్రికల్లో కనిపిస్తున్నాయి. వాటి వివరాలు కింద పట్టికలో తెలియజేశాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | మానవ సంవేదనా శకలం | మామిడి హరికృష్ణ | అక్టోబర్ 09, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | ★ఆవిష్కరణ<br>ఒక పికారస్క్ నవల | మధురాంతకం నరేంద్ర | ఏప్రిల్ 10, 2017 | సాక్షి – సాహిత్యం |
| 3) | ★పురస్కారం<br>చితికిన నవ్వుకు బుకర్ | ఎ.వి. రమణమూర్తి | జూన్ 19, 2017 | సాక్షి – సాహిత్యం |

**పట్టిక – 22**

**ఈ అధ్యాయంలోని ముఖ్యాంశాలు**

- నవల ప్రక్రియను పరిచయం చేస్తూ, దాని నిర్వచనాలు, లక్షణాలు వివరించబడ్డాయి.
- నవలావిమర్శను వివరించి, అందులోని భేదాలు తెల్పబడ్డాయి.
- అనువాద విమర్శ పరిచయం, లక్షణాలు, తత్సంబంధ వ్యాసాల విమర్శనాత్మక పరిశీల తెలుపబడింది.
- మనోవైజ్ఞానిక విమర్శను పరిచయం చేసే క్రమంలో మనోవైజ్ఞానిక శాస్త్ర చర్చ చేయబడింది. మనోవైజ్ఞానిక విమర్శ పద్ధతి, సాహిత్యంలో దాని ప్రభావాలు వివరించబడ్డాయి.
- మనోవైజ్ఞానిక విమర్శకు సంబంధించిన వ్యాసాలను పరిచయం చేసి, అందులోని విమర్శ భేదాలను గుర్తించడమైంది.
- ఈ విధంగా సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలను నవలా విమర్శ దృష్టితో పరిశీలించాను. రాబోయే ఐదవ అధ్యాయంలో సాంస్కృతిక, భాషా అధ్యయనం సంబంధ విషయాలను పరిశీలిస్తాను.

★★★

# ఐదవ అధ్యాయం

## సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు–భాషా సాంస్కృతిక అధ్యయనం

# అధ్యాయం–5

# సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు–భాషాసాంస్కృతిక అధ్యయనం

## 5.0. పరిచయం

పత్రికలు ప్రారంభ కాలం నుండి భాషా, సాంస్కృతికాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నాయి. భాషా, సాంస్కృతిక సంబంధ విషయాలకు పత్రికల్లో చోటు కల్పిస్తూ వాటి యొక్క అవసరాన్ని, ఆవశ్యకతను పాఠకులకు అందిస్తున్నాయి. ఇటువంటి సాంస్కృతిక సంబంధ ప్రచురణ నేటికి మనకు దిన పత్రికల సాహిత్యపుటల్లో కనిపిస్తుంది. ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబించే భాషా, సాంస్కృతిక, సామాజిక, చారిత్రకాంశాలను చిత్రించే వ్యాసాలు ఈ రెండు పత్రికల సాహిత్య పుటల్లో మనకు కనిపిస్తాయి.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగిన తర్వాత ప్రస్తుతం తెలంగాణ చరిత్ర, సంస్కృతి పునర్నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. ఇంతకాలం వలస పాలనలో అణచివేయబడిన వివక్షకు గురైన తెలంగాణ సంస్కృతిని, దాని ప్రత్యేకతలను లోకానికి చాటి చెప్తూ కనుమరుగై పోతున్న ఎన్నో కళారూపాలను, మరుగునపడిన ఎందరో కళాకారులను, తెలంగాణ జీవన విధానాన్ని, సాహిత్యాన్ని, చరిత్రను ప్రజలకు అందించవలసిన బాధ్యత ప్రధానంగా పత్రికలపైన ఉంది. కావున తెలంగాణ ప్రాంత ఆత్మ గౌరవంగా ప్రారంభమైన నమస్తే తెలంగాణ పత్రిక ఈ దిశగా ప్రయత్నిస్తుందని చెప్పవచ్చు. తెలంగాణ ప్రాంతీయ పత్రికగా ఏర్పడిన నమస్తే తెలంగాణ చెలిమె సాహిత్య పుట మరుగునపడిన, ఇంతకాలం అణచివేయబడిన తెలంగాణ సాహిత్యాన్ని, చరిత్రను, సంస్కృతిని పాఠకులకు అందిస్తూ తెలంగాణ సాహిత్య సాంస్కృతికాభివృద్ధికి విశేష కృషి చేస్తుంది.

తెలంగాణ రాష్ట్రావిర్భావం తర్వాత తెలంగాణ చరిత్రను పునర్నిర్మించుకుంటున్న ఈ దశలో తెలంగాణ చరిత్ర, సంస్కృతిని ప్రతిబింబింపజేస్తూ వచ్చిన వ్యాసాలను ఈ అధ్యాయంలో విశ్లేషించాను. పరిశోధన సౌలభ్యం కొరకు కొన్ని ఉపవిభాగాలుగా విభజించి ఈ రెండు పత్రికల్లో వచ్చిన తెలంగాణ ప్రాంత సాంస్కృతిక, చారిత్రక సంబంధ వ్యాసాలను విశ్లేషించాను. ఈ అధ్యయనం ద్వారా భాషా, సాంస్కృతికాంశాల విశ్లేషణ జరుగుతుంది

## 5.1. భాషా సంబంధ వ్యాసాలు

భాష్యతే ఇతిభాషా, భాషా వ్యక్తాయాం వాచీ. మాట్లాడేది భాష భావ ప్రకటనకు ఉపయోగపడేది భాష. మానవుడు సంఘజీవి. సమాజంలోని తోటి వ్యక్తులకు తన మనోభావాలను వ్యక్తపరచడానికి భాషను సాధనంగా వినియోగించుకుంటాడు. భాష ద్వారా తన మనోభావాలను

ఇతరులకు తెలియజేస్తాడు. ఇలా ఒక వ్యక్తి నుండి సమాచారం అనేది మరొక వ్యక్తికి అందించబడుతుంది. దీన్నే సమాచార వినిమయంగా పరిగణిస్తున్నాము. మనిషికి ఉన్న అద్భుతమైన శక్తి మాట్లాడడం. మానవున్ని జంతువు నుండి వేరుచేసి, అతని మేథస్సును పెంపొందిచేది భాష. విశ్వసృష్టిలో మాట్లాడగల శక్తి ఉన్న ఏకైక ప్రాణి మానవుడు. భావ వ్యక్తీకరణయే భాష ఆశయం. మానవుడు తన మనస్సులోని అభిప్రాయాల్ని, ఆలోచనల్ని, బహిర్గతం చేయడానికి ముఖావయంతో చేసే అర్థవంతమైన ధ్వనుల సముదాయం భాష. 'భాష్' అనే సంస్కృత ధాతువు నుండి వచ్చిన 'భాష' అనే పదానికి మాట్లాడబడేది అని అర్థం. భాష లేని మానవ మనుగడ లేదు. భాషా సాహిత్యాలు సంస్కృతి భాగం. ఇటువంటి భాషాభివృద్ధికి పత్రికలు ప్రారంభ కాలం నుండి ఎంతో కృషి చేస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి జరిగిన ప్రస్తుత కాలంలో భాషాభివృద్ధికి పత్రికలు ఎంతగానో తోడ్పడుతున్నాయి.

దినపత్రికల సాహిత్యపుటల్లో భాష సంబంధ విషయాలు ప్రచురిస్తూ భాషాభివృద్ధికి కృషి చేస్తున్నాయి. ఈ రకమైన భాషాసంబంధ వ్యాసాలు మనకు ఈ రెండు పత్రికల్లో కనపిస్తున్నాయి. కానీ రెండు పత్రికల్లోని భాషాసంబంధ వ్యాసాల్లో తేడాలున్నాయి. నమస్తే తెలంగాణ పత్రిక తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఇంత కాలం తెలంగాణ భాషకు జరిగిన అన్యాయాన్ని చాటి చెప్తూ తెలంగాణ భాష తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంగా చిత్రిస్తూ ప్రాంతీయ అస్తిత్వవాద పద్ధతిలో భాషావ్యాసాలు కనిపిస్తున్నాయి. దీనిలో భాష ఆత్మగౌరవంగా భావిస్తూ వ్యాసాలను ప్రచురిస్తున్నారు. సాక్షి పత్రికలో ఒక ప్రాంతానికి సంబంధ లేకుండా తెలుగు భాషకు సంబంధించిన అన్ని రకాల విషయాలను ప్రస్తావిస్తూ వ్యాసాలు కనిపిస్తున్నాయి. ఈ విధంగా రెండు పత్రికల్లో మనకు భేదాలు కనిపిస్తున్నాయి. కావున ఈ రెండు పత్రికల్లో వచ్చిన భాషా సంబంధ వ్యాసాలను ఈ అధ్యాయంలో విశ్లేషించి వాటి మధ్య గల భేద సాదృశ్యాలను తెలియజేశాను.

### 5.1.1. భాష

'భాష్యతీతి భాష' భాషించేది భాష అని, 'భాషావ్యక్తయాం వాచి' భావాలను వ్యక్తం చేసేది భాష అని ఆర్యోక్తులు. భాష అనే పదం 'భాష్' అనే సంస్కృత ధాతువు నుండి వచ్చిందని చెప్తారు. మనిషికి ఉన్న గొప్ప వరం మాట్లాడటం. మానవుని మేధోశక్తిని పెంపొందించేది కూడా భాషనే భావ వ్యక్తీకరణ చేయడమే భాష యొక్క ఆశయం. మనిషి తన మనస్సులోని అభిప్రాయాలను బహిర్గతం చేయడానికి నోటి ద్వారా చేసే ధ్వనులే భాష.

ఇలా వాక్కు గొప్పదనాన్ని ఋగ్వేదంలో చెప్పబడింది.

"సక్తుమివ తితునా పునంతో
యత్రధీరా మనసా వాచ మక్రత
అత్రాసఖాయః సఖ్యాని జానతే
భద్రైషాం లక్ష్మీర్నిహితాధి వాచి"

(ఋగ్వేదం.మండలం.10.సూక్తం.71.ఋక్కు.2)

"విద్వాంసులు పిండిని జల్లెడతో జల్లించి శుభ్రం చేసినట్లు మనస్సుతో వాక్కును సృష్టించారు. అటువంటి జ్ఞానవంతులు వాక్కుకు సంబంధించిన జ్ఞానాన్ని తెలుసుకొని ఉంటారు. వారి వాక్కులో కల్యాణప్రదమైన లక్ష్మి ఉంటుంది" (సుబ్రహ్మణ్యం, పి.ఎస్.2019.పుట.15).

ఇలా భాష గూర్చి భాష గొప్పతనం గూర్చి ప్రాచీన కాలంలోనే చెప్పబడ్డది.

"పరస్పర భావ వ్యక్తీకరణకు సామాజికులు వాగ్రూపంలో వెలువరించే సంకేతాల నియత నిర్మాణమే భాష. సమాజం దీన్ని సమిష్టిగా సృష్టించుకొన్నది. సమిష్టి సాధనంగా వాడుకొంటున్నది. కాలగతిలో కొన్ని శతాబ్దాలు సహస్రాబ్దాలు గడవగా వాగ్రూపానికి లిఖిత రూపం ఏర్పడింది. వాగ్రూపం మౌలికం, శ్రవణమాత్ర బోధకం. రెండోది దానికి విధేయం, పఠనమాత్ర బోధకం" (దక్షిణామూర్తి, పోరంకి.1992.పుట.1).

ప్రపంచంలో ఎన్ని భాషలున్నాయో ఎవరూ చెప్పలేరు. భాషకు వాగ్రూపమే మౌలికం. ఎందుకంటే కొన్ని వేల సంవత్సరాలుగా భావప్రకటనా వ్యాపారం కొనసాగుతున్న మానవ సమాజంలో కొన్ని భాషలకు ఇప్పటికి లిఖిత రూపం లేకపోవటమే కారణం అన్నారు పోరంకి దక్షిణామూర్తి.

భాష జీవనది లాంటిది కాలానుగుణంగా, పరిస్థితులను, అవసరాన్ని బట్టి మారుతూ ఉంటుంది. అది సమాజాన్ని ఆశ్రయించుకొని ఉంటుంది. "అన్ని సాంఘిక వ్యవస్థల మాదిరిగానే భాష కూడా మార్పులకూ, చేర్పులకూ లోనవుతూ ఉంటుంది. అందుకే జీవద్భాషను ప్రవాహిని (నది)తో పోల్చటం జరిగింది. ప్రపంచంలో ఏ భాషా మార్పులకు లోను కాకుండా ఉండదు. అయితే ఆ మారుపాటు ఎంత నిదానంగా జరుగుతుందంటే ఏ వ్యక్తీ తన జీవిత కాలంలో స్పష్టంగా గమనించ జాలనంత నిదానంగా జరుగుతుంది" (దక్షిణామూర్తి, పోరంకి.1992.పుట.3).

### 5.1.2. భాష–స్వరూప స్వభావాలు

మనిషి తన భావాలను ఇతరులకు తెలియజేయడానికి రకరకాల మార్గాలను అన్వేషిస్తాడు. ధ్వనిరూపం, లిఖితరూపం, ముద్రితరూపం ఇలా ఇవే సైగలు, సంజ్ఞలు, సంకేతాలు. ఇవన్నీ భాష అనటం లేదు. అర్థవంతమైన ధ్వనుల సముదాయాన్ని భాష అంటున్నాం.

"భాష వల్ల ప్రధానంగా రెండు ప్రయోజనాలు ఉన్నాయి. అవి: 1) భాషా వ్యవహర్తల మధ్య భావప్రసారం, 2) భావప్రసారంతో పాటు హృదయాహ్లాదం. ఇందులో మొదటిది ప్రాథమికం, రెండవది గౌణం. ఈ ప్రయోజనాల కోసం వాడే భాషను వరుసగా 'శాస్త్ర భాష' అని 'సాహిత్య భాష' అని పిలుస్తాం. విషయాన్ని సహజంగా వివరిస్తే శాస్త్రభాష అవుతుంది. అలా కాకుండా సృజనాత్మకం (ఆలంకారికం, కళాత్మకం, కవితాత్మకం)గా అభివర్ణిస్తే సాహిత్యభాష అవుతుంది. ఆయా సందర్భాలను బట్టి శాస్త్ర భాషను, సాహిత్య భాషను వాడతారు" (చంద్రశేఖర్, పగడాల.2011.పుట.1).

ప్రతి భాషలో దాని నిర్మాణంలో రెండు విభాగాలుంటాయి. 1) బాహ్య నిర్మాణం, 2) ఆంతరంగిక నిర్మాణం. బాహ్య నిర్మాణంలో వర్ణాలు, పదాలు కన్పిస్తాయి. అంతర నిర్మాణంలో పదపదానికి మధ్య గల సంబంధం, వాక్యరచన ఉంటుంది.

### 5.1.3. భాష–సంస్కృతి

భాషావృద్ధికి సంస్కృతి మూలం అవుతుందని చెప్పవచ్చు. సాంస్కృతిక, చారిత్రక, సామాజిక పునాదుల మీద భాషా సౌధం నిర్మించబడుతుంది. భాషను వ్యవహరించేవారు నిర్మిస్తారు. వారే ఉపయోగిస్తారు. భాషకు, సంస్కృతికి అవినాభావ సంబంధం ఉంటుంది. "సంస్కృతి అంతరాల వల్ల భాషల్లో వైవిధ్యాలున్నాయి. ధ్వనులు, పద నిర్మాణం, శబ్దార్థ సంబంధం మొదలైన భాషాంశాల్లో అంతరం కనబడుతున్నది. ఆయా భాషా సమాజాల భౌగోళిక (నైసర్గిక) స్వరూపం, భౌతిక వస్తు సముదాయం, (మత) ఆచార వ్యవహారాలు, ఆధ్యాత్మిక చింతన, సాంఘిక జీవనం, భాషా ప్రయోగాలు, నిషేధాలు (Taboo) వంటి అంశాలవల్ల భిన్న భావాభివ్యక్తులు (పదాలు) ఉండటానికి, లేకపోవడానికి హేతువులవుతాయి. దీనికి ఆ భాషా వ్యవహర్తల సామాజిక, ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానికాది రంగాల ప్రగతులు, వారి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు దోహదపడతాయి" (చంద్రశేఖర్, పగడాల.2011.పుట.3).

మన దేశ్య సంస్కృతిని తెలుసుకునే పదాలు భాషలో ఉంటాయి. కానీ అన్యదేశ పదాలను వాడేటప్పుడు ఆ భావాలను వ్యక్తం చేయడానికి పదాలుండవు. అప్పుడు పద సృష్టి అవసరం

అవుతుంది. ఇలా సంస్కృతితో భాషకు విడదీయలేని సంబంధం ఉంటుంది. భాష సంస్కృతిని కాపాడే దిశగా కూడా ప్రయత్నం చేస్తుంది. భాష కేవలం సంస్కృతితోనే కాదు, మతం, భౌగోళిక పరిస్థితులు, సాంఘిక జీవనం, అభివ్యక్తి మొదలైన వాటితో కూడా పరస్పర సంబంధాన్ని కలిగి ఉంటుంది.

### 5.1.4. భాష–మార్పు వికాసం

భాషలో మార్పు అనేది సర్వసాధారణం. కాలక్రమంగా జరుగుతుంది. దీనిని ఆపడం ఎవరికీ సాధ్యం కాదు. భాషలో ఏకరూపత, స్థిరరూపం ఉండటం అసాధ్యం. "భాష దేశకాల వ్యవహారాయత్తము. దేశకాల వ్యవహారములు అనుగుణంగా సకలము మారుట ప్రకృతి ధర్మము. అనవసరమైన మార్పులు అసహజము. అసహజ నిర్మాణములు నిరుపయోగము. అనుపయోగ విషయ వినాశనం ప్రకృతి ధర్మము. సజీవ భాషలు ఈ నియమబద్ధమే. ఆ నియమానుసారంగా భాషలకు పరివర్తనమే సంసిద్ధము అని ఆంధ్ర పత్రిక సంవత్సరాది పత్రిక (1914.పుట.10)" (చంద్రశేఖర్, పగడాల.2011.పుట.6). ప్రపంచంలో ప్రతీ వ్యవస్థ మారుతుంది అలాగే భాష కూడా మారుతుంది. నన్నయ కాలం నాటికి, తర్వాత కవుల కాలం నాటికి భేదం కన్పిస్తుంది. అలాగే చిన్నయసూరి, కందుకూరి, గురజాడ కాలాల్లో భాష వచన రచనల్లో శైలీ భేదాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఇలా భాష మార్పు చెందుతూ వస్తుంది.

ఇక వికాసం విషయానికి వస్తే భాశలో జరిగే ప్రతీ మార్పు వికాసంగా చెప్పవచ్చు. వికాసం (Development) అనే పదానికి విస్తృతార్థం ఉంది. భాషా స్రవంతిలో చేరే ప్రతి అంశాన్ని వికాసాంశంగా గుర్తించవచ్చు. భాషా వికాసానికి ఆధునీకరణ ఒక మార్గం మాత్రమే. కాలాంతరాల్లో కలిగిన మార్పు. ఆధునీకరణలను భాషావికాసంగా భావించవచ్చు. భాషా వికాసం ఒక రాత్రిలో జరిగినది కాదు. జరిగేది కాదు. కాల ప్రవాహంలో కొనసాగుతున్న కార్యం. ప్రపంచంలో ఏ భాష ప్రాధాన్యం గడించిన పాశ్చాత్య భాషల నిరంతర విస్తృతి కూడా ఆయా భాషా వ్యవహర్తల సాంకేతిక, వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాల ప్రగతులకు అనుగుణంగా జరుగుతున్నది. నిఘంటువులు, వ్యాకరణ సూత్రాలు, భాషాప్రయోగ కరపత్రాల ద్వారా పాశ్చాత్య భాషలు నిరంతరం క్రోడీకరణ చెందుతున్నాయి. ఆ భాషల విస్తృతికి అమిత కృషి జరుగుతున్నది. తరచు జరిగే విస్తృతి, క్రోడీకరణ ఫలితంగా లిపి, వర్ణ, పద వ్యాకరణాంశాల్లో విస్తృతి, వైవిధ్యం కనబడుతున్నది. అందువల్ల భాషా వికాసం సంఘటనాత్మకం కాదు. పలుమార్లు వ్యవహార విస్తృతి, క్రోడీకరణల ఫలితంగా సాధ్యమవుతుంది" (చంద్రశేఖర్, పగడాల.2011.పుట.11).

ఇలా భాష మార్పు, వికాసం అనేవి చాలా అంశాల మీద ఆధారపడి ఉంటాయి. వాటన్నింటికి సంబంధించిన విషయాలకు అద్దం పడుతూ పత్రికలు కూడా కృషి చేస్తున్నాయి. పత్రికల్లోని వ్యాసాలను పరిశీలిస్తే ఇవన్నీ అర్థమవుతాయి.

### 5.1.5. వార్తాపత్రికలు–భాష

ప్రతీ రోజూ ఇంటికి వచ్చే వార్తాపత్రికను చూడని వారుండరు. అందులో భాష చదివిన వారికి అర్థమయ్యేలా ఉంటుంది. అలాంటి భాషను రూపొందించుకొని పని చేస్తుంది పత్రిక. వాఙ్మయంలో ఎన్నో ప్రక్రియలు ఉన్నాయి. పత్రిక రచన కూడా ఒక ప్రక్రియగా రూపొందుతుంది. "ప్రతి ప్రక్రియకు శైలి (భాషా) ఉంటుంది. అదే విధంగా పత్రికారచనకు శైలి రూపొందుతున్నది. వార్తాకథన రచనలో ప్రత్యేక పదప్రయోగం ఉంది. పదకల్పన, సమాస నిర్మాణం, వ్యాకరణ కార్యాలు, వాక్య నిర్మాణంలో కూడా కొంత ప్రత్యేకత కనబడుతున్నది. వార్తల ఎత్తుగడ, విషయ వివరణ, ముగింపు వంటి అంశాలు ఇతర ప్రక్రియల కంటే భిన్నంగా ఉన్నాయి. అన్యప్రక్రియలతో కొంత విభేదిస్తున్నాయి" (చంద్రశేఖర్, పగడాల.2011.పుట.17).

వార్తను రచనారీతిని పరిశీలిస్తే అర్థమవుతుంది. పాత్రికేయుని భాషాపాటవం, సృజన మొదలైనవి. అభివ్యక్తి విధానం, రచనాశిల్పం అన్ని తెలుస్తాయి. పత్రికాపఠనానికి అన్ని స్థాయిల ప్రజలు ఆధారపడుతున్నారు. కాబట్టి అందరికీ అర్థమయ్యే రీతిలో రచన ఉండాలి. సులభ భాషను వాడాలి. స్పష్టంగా, క్లుప్తంగా కూడా ఉండాలి. ఒకప్పుడు గ్రాంథిక భాషను వాడేవారు. గ్రాంథికం అంటే "నన్నయ నుండి చిన్నయ వరకు కావ్య రచనలో ఉపయుక్త భాషాభేదమే గ్రాంథికమని పండితులు భావించారు. కావ్యభాష వ్యవహారం వల్ల రూఢమై గ్రాంథికభాషగా స్థిరపడింది" (రాధాకృష్ణ, బూదరాజు.1992.పుట.2). కానీ ఇప్పుడు గ్రాంథిక భాషలో పెద్ద మార్పు వచ్చి అధిక సంఖ్యాకంగా వ్యవహారికం వాడుతున్నారు.

ఒకప్పుడు వ్యవహారికం అనే పదాన్ని గ్రాంథికం కానిది అని వాడారు. "వ్యవహారికం అనేది కూడా అంత మంచిమాట కాదు. జీవద్భాష ఏ రూపంలో ఉన్నా వ్యవహారంలో ఉన్నట్లే. శిష్ట వ్యవహారంలో అందులోనూ వాగ్వ్యవహారంలో ఉండి కావ్య వ్యవహారంలో – ప్రముఖంగా లిఖిత వ్యవహారంలో లేని భాషా రూపాన్ని పూర్వులు వ్యావహారికమన్నారు. వాగ్రూపంలో శిష్టవ్యవహారంలో ఉన్నా అదే శిష్టుల రచనల్లో స్థానం సంపాదించుకోలేకపోయిన భాషా విశేషమే వారు వ్యావహారిక భాష అని పిలిచింది. మారిన పరిస్థితులను బట్టి దాని ఇప్పటి అర్థమెంత మారినా, శిష్ట వ్యావహారికమనే పదానికి దాన్ని సంక్షిప్త రూ పంగా పరిగణించడానికి అభ్యంతరం

లేదు. అయితే వాగ్వ్యవహార, లిఖిత వ్యవహారాలు రెంటిలోనూ బహుళ వ్యాప్తిలో ఆధునిక కాలంలో ఉపయోగపడుతున్న భాషావిశేషం ఇదేనని గుర్తించాలి" (రాధాకృష్ణ, బూదరాజు.1992.పుట.2).

ప్రస్తుత కాలంలో వ్యవహారికం అంటే అందరికీ అర్థమ్యయే రీతిలో ఉన్న లిఖిత, మౌఖిక రూపంగా భావించాలి. పత్రికలు విషయాన్ని సూటిగా అర్థమయ్యేలా చెప్తున్నాయి. వీటికి ముడూ సూత్రాలున్నాయి. "1) నిత్యనూతనత్వం, 2) నిర్దిష్ట పాఠకులను దృష్టిలో ఉంచుకోవడం, 3) అర్థమయ్యేటట్లుగా రాయడం కంటే అర్థం కానట్లుగా రాయకుండటం" (చంద్రశేఖర్, పగడాల. 2011.పుట.18). ఇలా పత్రికలు సరళంగా రాస్తూ భాషను కాపాడుతూ పాఠకులకు అందిస్తున్నారు. భాషా సంబంధిత కృషి చేస్తూ మాతృభాష సంబంధిత వ్యాసాలను కూడా ప్రచురిస్తూ చేస్తూ మాతృభాషశ సంబంధిత వ్యాసాలను కూడా ప్రచురిస్తూ భాష ఔన్నత్యానికి తోడ్పడుతున్నారు.

## 5.2. నమస్తే తెలంగాణ దినపత్రికలోని భాషా సంబంధ వ్యాసాలు

'మన రాష్ట్రం – మన ఆత్మగౌరవం' అనే నినాదంతో ఉద్యమ నేపథ్యంతో వెలువడిన తెలంగాణ ప్రాంతీయ పత్రిక నమస్తే తెలంగాణ. ఈ పత్రిక చెలిమె సాహిత్య పుటలో సాహిత్య సంబంధ విషయాలతోపాటు భాషా సంబంధ విషయాలను ప్రచురిస్తున్నారు. తెలంగాణ ఆత్మగౌరవంగా ఆవిర్భవించిన నమస్తే తెలంగాణ పత్రిక ప్రారంభం నుండి చెలిమె సాహిత్య పుట ద్వారా తెలంగాణ ప్రాంత భాషా సాహిత్యాలను అధిక ప్రాధాన్యతనిస్తూ తెలంగాణ భాషా సాహిత్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుంది. ఇంత కాలం వలస పాలనలో అణచివేయబడిన అనాదరణకు గురైన తెలంగాణ ప్రాంత భాషా, సాహిత్య సాంస్కృతిక ఔన్నత్యాన్ని ప్రజలకు తెలియజేసే దిశగా పయనిస్తుందని చెప్పవచ్చు. దీనిలో భాగంగానే తెలంగాణ భాష గొప్పతనాన్ని తెలుపుతూ ఇంతకాలం చులకనగా చూడబడిన తెలంగాణ భాష విశిష్టతను, ప్రాచీనతను తెలుపుతూ వ్యాసాలను ప్రచురిస్తున్నారు. తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాద ఉద్యమాల్లో తెలంగాణ భాషాపరమైన అణచివేత ప్రధాన కారణంగా కనిపిస్తుందని నందిని సిధారెడ్డి అభిప్రాయాన్ని తెలిపారు. సుమారు 42 సంవత్సరాల సమైక్య జీవనం తర్వాత తెలంగాణ భాష, సంస్కృతులు అస్తిత్వం కోసం, ఉనికి కోసం పోరాడుతున్నాయి. ప్రాంతాలు వేరైనా భాష ఒకటని ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్ని కలిపి ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేసినప్పటికీ పొరపొచ్చులు పోలేదు. పైగా అవి పెరిగిపోయాయి. ఆనాడు భిన్న చారిత్రక నేపథ్యాలు, నాగరిక పరిస్థఇతులు కలిగిన రెండు

ప్రాంతాలు కలిపేటందుకు ఒక భాషగా చెప్పబడిన ఏ తెలుగు భాషయితే ప్రధాన సూత్రమైందో ఆ భాషే ఈరోజు వేర్పాటుకు ముఖ్య సమస్యగా ముందుకొస్తున్నది.

రెండు ప్రాంతాల వ్యవస్థలు, రెండు విభిన్న చారిత్రక నేపథ్యాల నుంచి రూపొందినాయి. రెండు ప్రాంతాల ప్రజలు భిన్న రాజకీయార్థిక జీవనం వల్ల సాంస్కృతిక దశల్ని కలిగి ఉన్నారు. వాళ్ళ అనుభవాలు కూడా వేర్వేరుగా ఉన్నాయి.

"ఒక జాతి ప్రజల జీవనస్థితిని అర్థం చేసుకోవడానికి భాష ముఖ్య ఆధారంగా ఉంటుంది. ప్రజలు ఏ స్థితిలో ఉన్నారనేది వాళ్ళ భాష ఏ స్థితిలో ఉందో పరిశీలించటం ద్వారా తెలిసిపోతుంది. అందుకే చైతన్యాన్ని అణచే పాలకులెప్పుడూ ప్రజల భాషను అణచి ఉంచేందుకే ప్రయత్నిస్తరు" (సుజాతారెడ్డి, ముదిగంటి.(సంపా.).2005.పుట.62) అంటూ అస్తిత్వ ఉద్యమంలో తెలంగాణ భాష ప్రధాన పాత్రగా పేర్కొన్నారు.

అలాగే తెలంగాణ భాష ఆధిపత్య భాషలతో అణచివేయబడిన విధానాన్ని ఈ విధంగా వివరించారు. "తెలంగాణ భాషలో జిగిలేదని, శబ్దజాలం లేదని, మోటుగ ఉంటదని, సున్నితత్వం ఉండదని, మర్యాదకరంగా నాజుగ్గా ఉండదని ఈసడింపులను, అవహేళనలను ఎదుర్కొంటున్నది. సినిమాలల్ల, టీవీ సీరియల్స్‌ల రౌడీలకు, విలన్లకు, హాస్యపాత్రలకు తెలంగాణ రాయలసీమ భాషలు పెట్టి దారుణంగా అవహేళన చేస్తున్నారు. వెనుకబడిన ప్రజల భాషలు ఎదుర్కొనే అనేక సమస్యలకు అభివృద్ధి చెందిన భాషల ఆధిపత్య భావనే మూలమైనది (సుజాతారెడ్డి, ముదిగంటి.2005.పుట.63).

"తెలంగాణ భాషలో ఉర్దూ పదాలు ఎక్కువగా ఉంటాయని మరో ఆరోపణ. భాషా వికాసాన్ని శాస్త్రీయ దృష్టితోని పరిశీలించినపుడు ఏ భాష శుద్ధంగా ఉండదని అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. ఒక భాష ఎదుగుతున్న క్రమంలో ఎన్నో ఇతర భాషా సమూహాల పదాలు కలుపుకుంటూ సాగిపోతది. తెలుగులో ఎప్పుడూ పాలనా భాషాపదాలు 50 శాతం పైగా ఉంటూ వచ్చాయని పరిశోధకులు చెబుతున్నారు. సంస్కృత, ప్రాకృతాల కాలంలో అరబ్బీ, పారసీల ప్రాబల్యంతో ఇంగ్లీషు, పోర్చుగీసు కాలంలో ఎన్నో అన్యదేశాలు అన్ని ప్రాంతీయ భాషల్లో చోటు చేసుకున్నయి. తెలుగు కూడా అట్లానే తెలంగాణ ప్రాంతంలో ఉర్దూ పాలన భాషగా ఉండటం వల్ల, ఆ భాషాపదాలు తెలంగాణలో చాలా వరకు వచ్చి చేరాయి. తెలంగాణ తెలుగులో ఉన్న ఉర్దూ పదాలు హేళన గుర్తులుగా, ఆంధ్ర తెలుగులో ఉన్న ఇంగ్లీషు పదాలు గొప్పతనానికి గుర్తులుగా

భావించడం జరుగుతున్నది. తెలంగాణ భాషకు తౌరక్యాంధ్ర అని పేరు పెట్టిన పండితులు కూడా కోస్తాంధ్ర భాషకు 'ఇంగ్లీషాంధ్ర' అని పేరు పెట్టలేకపోయార".

"తెలుగులో గ్రాంథిక భాష మీద వ్యవహార భాష సాధించిన విజయం చాలా ప్రగతిశీలమైనదే. అయితే తెలంగాణ భాషను అణచివేయడంలో ఆంధ్ర ప్రాంత వ్యవహార భాష పాత్ర కూడా గుర్తించాలె" (సుజాతారెడ్డి, ముదిగంటి.2005.పుట.64) అని మొదటి నుంచి భాషాపరమైన అస్తిత్వం కోసం కవులు రచయితలు ఎందరో వారి గళాన్ని వినిపించారు. భాష అణచివేతను వ్యతిరేకించిన వ్యాసాలు మనకు కనిపిస్తున్నాయి.

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇంతకాలం అణచివేయబడిన తెలంగాణ భాషకు పట్టం కడుతూ దాని ఔన్నత్యాన్ని, విశిష్టతను తెలుపుతూ ప్రామాణిక భాషకు తెలంగాణ భాష ఏ మాత్రం తీసిపోదని నిరూపిస్తూ తెలంగాణ ప్రాంతీయ భాష తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంగా భాషా సంబంధ వ్యాసాల చెలిమె పుటలో కనిపిస్తున్నాయి. వీటిలో తెలంగాణ భాష ప్రాచీనతను, చరిత్రను, విశిష్టతను తెలుపుతూ వ్యాసాలుగా వెలువడుతున్నాయి. ఈ భాషా సంబంధ వ్యాసాలను విశ్లేషించుకున్నట్లయితే తెలంగాణ భాష ఔన్నత్యం మనకు అవగతమవుతుంది.

### 5.2.1. భాష: ప్రామాణికం, తెలంగాణం

నలిమెల భాస్కర్ రాసిన 'భాష: ప్రామాణికం, తెలంగాణం' అనే వ్యాసం నమస్తే తెలంగాణ చెలిమె పుటలో ఫిబ్రవరి 08, 2016న వెలువడింది.

తెలంగాణ భాష ప్రామాణిక భాష కన్న ఏ మాత్రం తీసిపోదంటూ తెలంగాణ భాష గొప్పతనాన్ని వివరించారు. ప్రామాణిక భాష, తెలంగాణ భాష ఒక్కటి తక్కువ, మరొక్కటి ఎక్కువా కాదు. ఆంధ్రుల వలస పాలనలో తెలంగాణలోని భాష వివక్షకు లోను అయిందన్నది విజ్ఞులు వెల్లడించిన విషయం. ప్రామాణిక భాషకు ఏ మాత్రం తీసిపోనటువంటి భాష తెలంగాణలో వ్యవహృతం అవుతుందన్నదే ఈ వ్యాస ఉద్దేశంగా పేర్కొన్నారు.

దీని వ్యాసకర్త తెలంగాణ భాష ప్రామాణిక భాషకు ఏ మాత్రం తీసిపోనిది. కొన్ని సందర్భాల్లోనైతే తెలంగాణ ప్రాంతంలో వ్యవహరించబడుతున్న భాష ప్రామాణిక భాషతో సరిసమానంగా తులతూగుతున్నది. అంతే కాదు, మరికొన్ని సమావేశాల్లో ఈ ఆధునిక ప్రమాణ భాషను మించిన అభివ్యక్తీకరణ సామర్థ్యం తెలంగాణ భాషలోని పదాలకూ, పదబంధాలకూ, సామెతలకూ ఉంటున్నదని చెప్తూ దీనికి అనేక వ్యావహారిక పదాలను, వాక్యాలను ఉదహరించారు.

కాల్పనిక సాహిత్యంలో మనం తరుచుగా చదివే వాక్యం 'అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు' అని ఇది వ్యవహారిక భాషలోనిదని దీన్ని వివరిస్తూ తెలంగాణ భాషా వాక్యాన్ని విశ్లేషించారు. పచార్లు అనే పదం బెంగాలీ 'పాయ్‌చారి' నుంచి వచ్చింది. అంటే పాదచారం అన్నమాట. అటూ ఇటూ నడుస్తున్నాడు అని అర్థం.

తెలంగాణ ప్రాంతంలో 'అడికి ఈడికి తిరుగుతున్నడు' అని అంటున్నాం. అర్థభేదం లేదు. 'కోపం నషాళానికి అంటింది' అనేదానికి తెలంగాణలో 'అరికాలి మంట నెత్తికి ఎక్కింది' అని అంటున్నారు. 'నషాళం' అన్నదానికి శబ్ద రత్నాకరంలోనూ అర్థం ఇవ్వలేదు. సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవడమే ఇక్కడున్న మార్గం అంటూ వివరించారు.

అలాగే 'ఆత్మ గౌరవ సమస్య' అనే మాటకు తెలంగాణలో 'ఇజ్జత్ కా సవాల్' అనే ఉర్దూ పలుకును ఉదహరించారు. ప్రామాణిక భాషలోని 'ఆత్మ గౌరవ' సమస్యలో ఉన్న మూడు పదాలు సంస్కృతం నుంచి వస్తే, 'ఇజ్జత్ కా సవాల్'లోని మూడు పదాలు ఉర్దూ నుంచి వచ్చాయంటూ ఈ విధంగా రెండు ప్రాంతాల మాట తీరు తెలుగు భాషకు సంబంధించినది కాదని పేర్కొన్నారు.

అక్కడ ప్రమాదాలు 'వెంట్రుకవాసిలో తప్పితే' ఇక్కడ 'ఎంటికంతల/ఎంటికె మందంల తప్పింది' అంటున్నారు. వ్యావహారిక భాషలో 'చాలు భారతం', 'తెలంగాణ భాషలో బల్లిపూస రామాయణం అనే రూపంలో ఉంది. ఆ భాషలో దంపతులు 'చిలకాగోరింకల్లా' ఉంటే ఈ భాషలో 'పిట్టకు పిట్ట సోపతోలె' ఉంటారు. చిలకాగోరింకల్ని ఆదర్శ దంపతులకు ఉదాహరణగా తీసుకుంటాం. కానీ సైంటిఫిక్‌గా చూసినపుడు చిలకది ఒక జాతి, గోరింకది వేరొక జాతి. ఈ రెండు కలిసి ఉండే అవకాశం లేదు. తెలంగాణలోని 'పిట్టకు పిట్ట సోపతోలె' సహజత్వానికీ, వాస్తవానికి దగ్గరైన జాతీయం అంటూ వివరిస్తూ ప్రామాణిక భాషతో సరితూగే తెలంగాణ భాషాపదాలను, వాక్యాలను ఉదహరిస్తూ తెలంగాణ భాష ప్రామాణిక భాషకు ఏ మాత్రం తీసిపోదని ప్రామాణిక భాషకు తీసిపోనటువంటి భాష తెలంగాణలో వ్యవహృతం అవుతుందన్న విషయాన్ని ఈ వ్యాసం ద్వారా పాఠకులకు అందించారు.

ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి అనే వాక్యం తెలంగాణలో 'నోరు దగ్గర పెట్టుకొని మాట్లాడాలె' అని ఉంది. మాట్లాడేది నోరే గనుక దాన్ని అదుపులో పెట్టుకొని మాట్లాడ్డమే సరైంది కదా! అంటూ ఇలా అనేక పదాలను, వాక్యాలను వివరించారు.

### 5.2.2. సమగ్ర నిఘంటువు అవసరం

పులికొండ సుబ్బాచారి రాసిన వ్యాసం 'సమగ్ర నిఘంటువు అవసరం'. ఇది నమస్తే తెలంగాణ చెలిమె పుటలో ఆగస్టు 28, 2017న ప్రచురితమయింది.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాష్ట్రాభివృద్ధి సంబంధ అవసరాల్లో వాఙ్మయ రంగ అవసరాలు ప్రధానమైనవి. తెలంగాణ భాష కోల్పోయిన ఆత్మగౌరవాన్ని తిరిగి తీసుకురావాలని చెప్తూ తెలంగాణ భాషాభివృద్ధి తెలంగాణ సమగ్ర నిఘంటవు తయారీ అనేది తక్షణావసరముగా పేర్కొన్నారు. సమగ్ర నిఘంటువు అవసరాన్ని, దాన్ని ఏ విధంగా ఏర్పాటు చేయాలి వంటి విషయాలను చర్చిస్తూ రాసిన వ్యాసం ఇది.

మొదట దీనితో ప్రామాణిక భాష ఏర్పడిన విధానాన్ని వివరించారు. స్వాతంత్ర్యానంతరం రేడియో పత్రికల వ్యాప్తి బాగా పెరిగింది. దీనివల్ల ప్రసార మాధ్యమాలకు ఒక భాష అవసరమైంది. ప్రసార మాధ్యమాల్లో తెలుగు వస్తున్న దశలో గోదావరి మండలంలో వ్యవరహించే భాష ప్రసార మాధ్యమాల్లోకి ఎక్కింది. ఈ భాష ప్రసార మాధ్యమాల్లో నిలదొక్కుకున్న తర్వాత ఇది శిష్ట వ్యవహార భాషగా, తెలుగు ప్రమాణ భాషగా అంగీకరించబడుతూ వచ్చింది. దీని తర్వాత దశలో పాఠ్య పుస్తకాల్లో ఇతరత్రా గ్రంథ రచనల్లో కూడా ఇదే భాష. శిష్ట వ్యవహార భాషగా అంగీకరించబడి ప్రచారంలోకి వచ్చింది. దీని కారణంగా తెలుగులోని మిగతా మండలాల భాషలు మాండలిక భాషగా వ్యవహారానికి గురయ్యాయి. ముఖ్యంగా తెలంగాణ ప్రాంత యాసలు వైముఖ్యానికి గురయ్యాయంటూ ప్రామాణిక భాష చేత తెలంగాణ ప్రాంత భాష అణచివేతను వివరించారు.

ప్రస్తుతం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణలో ప్రవర్థిల్లే భాష పాలనా భాషగా అధికారంగా అన్ని స్థాయిల్లో చేయవలసిన అవసరాన్ని తెలుపుతూ దాని మొదట అవసరం అయ్యేది తెలంగాణ సమగ్ర నిఘంటువు అని తెలిపారు. ప్రసార మాధ్యమాల్లో కూడా తెలంగాణ ఏర్పడక ముందు ఉన్న భాషనే ఉపయోగిస్తున్నారని చెప్తూ ఏవో కొన్ని పత్రికలు, ఛానళ్ల మధ్య మధ్యలో తెలంగాణ భాషను, పదాలను వాడుతున్నారు తప్ప పూర్తిస్థాయి వినియోగం జరగడం లేదు దీనికి కూడా ప్రత్యక్ష కారణాలున్నాయి. వాటిలో నిఘంటువు లేకపోవడం ఒకటి అని వారి అభిప్రాయాన్ని తెలిపారు.

ఇంకా తెలుగు భాషలో ఇప్పటివరకు అనేక నిఘంటువులు ఉన్నాయని వాటి చరిత్ర పెద్దది అంటూ వివిధ అవసరాల కోసం ప్రయోజనాల కోసం తయారుచేసినవి దాదాపు 130 నిఘంటువులున్నాయని చెప్తూ వాటిలో కొన్ని నిఘంటువుల్లో తెలంగాణ పదాలు చోటు

చేసుకున్నాయని లంకసాని చక్రధరరావు నేతృత్వంలో వచ్చిన తెలుగు వ్యుత్పత్తి కోశాన్ని పేర్కొన్నారు. అలాగే తెలుగు అకాడమీ తయారుచేసిన వృత్తి పదకోశాలు, మాండలిక పదకోశాలు రాసిన రవ్వా శ్రీహరి, నలిమెల భాస్కర్, కపిలవాయి లింగమూర్తి వంటి వారిని ప్రస్తావించారు.

ప్రస్తుతం తెలంగాణ ప్రాంతం మొత్తంలో వ్యవహారంలో ఉన్న అన్ని రకాల భాషాపదాలను సేకరించి ఒక సమగ్ర తెలంగాణ నిఘంటువు రూపకల్పన జరగాల్సిన అవసరాన్ని సూచించారు. ఈ నిఘంటువులో తెలంగాణలోనే చాలా ప్రాచీనమైన అచ్చ తెనుగు పదాలు, ప్రాచీన కావ్యాల్లో ప్రస్తావించిన పదాల వంటి అనేక పదాలతో ఈ నిఘంటువు నిర్మాణం జరగాలని తెలియజేశారు. ఈ విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలని ఈ వ్యాసం ద్వారా పేర్కొన్నారు.

### 5.2.3. తేట తెనుగు పదాల తోట

నలిమెల భాస్కర్ రాసిన 'తేట తెనుగు పదాల తోట' అనే వ్యాసం నమస్తే తెలంగాణ చెలిమె పుటలో నవంబర్ 06, 2017న ప్రచురితమయింది.

కమనీయ పద సంపద కాణాచి తెలంగాణ అని చెప్తూ తెలంగాణ నిరక్షరకుక్షులు నోట పెద్ద పెద్ద తెలుగు నిఘంటువుల్లో ఉన్న మాటల మూటలు ఎన్నో దొరుకుతాయంటూ ఉదాహరణలతో తెలంగాణ భాష ప్రత్యేకత వివరించారు.

'కాపాయం' ఇది ఒక తెలంగాణ పదం. దీన్ని 'పొదుపు' అనే అర్థంలో వాడతారు. 'అబ్బో వాడా? మస్తు కాపాయం మనిషి' అంటూ తరుచూ మనం వాక్యాలను ఉదహరిస్తూ కాపాయము పదాన్ని దాని మాతృకను విశ్లేషించారు. కాపాయం పదానికి మాతృక 'కాపేయము' అనే మాట. అది బహుజనపల్లి సీతారామాచార్యుల శబ్దరత్నాకరంలో ఉంది. అందులో వారు 'కృపణత' అనే అర్థం చెప్పారంటే లోభత్వం పిసినిగొట్టుతనం. పిసినారి గుణం కృపణత్వం. కాపాయం అనే మాటకు అర్థం పొదుపు ఎక్కువ అయినప్పుడు ఫలితంగా వచ్చేది లోభత్వమే కదా అంటూ ఆ నైఘంటిక పదం నిరాఘాటంగా తెలంగాణ ప్రజల నోట పలుకబడుతున్నదని వివరించారు.

అలాగే మరొక పదము 'కారడ్డం', 'కారెడ్డం'ను వివరించారు. ఈ కారడ్డం మాట విడిగా కన్నా 'కారడ్డం మాటలు' అని సమాసగతంగా కనిపిస్తుంది. ఇంతకీ ఈ పదాలేమిటి? అంటూ వాటి వివరణ తెలిపారు. నిజానికి ఈ కారెడ్డ పదానికి ఆధార శబ్దం 'కారొడ్డెము' అంటే పరుషోక్తి. కఠిన వాక్కు. 'వాడు అన్ని కారడ్డం మాటలే మాట్లాడుతాడు' అని వ్యవహారంలో ఉంది. కానీ పోనీ కటువైన మాటలు ఇవి. అందులో ఆంధ్ర భాషార్ణవం 'కఱుకు కరుసు కాదు కాఱెడ్డెము పరుసు

పరుసన యనగ నిష్ఠురము వెలయు' అని పర్యాయాలు చూపింది. ఈ కారెడ్డము పదం తెలంగాణలో ఏ అడ్డూ లేకాండ కారొడ్డముగా మారిందంటూ విశ్లేషించారు.

చిన్నపిల్లలకు అనేక వ్యాధులు సోకుతుంటాయి. వాటిలో ఒకటి 'కిసరు'. దీనికి శబ్దరత్నాకరంలో అంటు సోకడం వల్ల కలిగే దోషం అని ఉంది. అట్లాగే 'కిస్మిస్'లు అనే పదాన్ని గురించి చెప్తూ ఎండు ద్రాక్షలే కిసుమిసులు. ఇది తెలుగు మాటగా, దేశ్యపదంగా నిఘంటువుల్లో కనిపిస్తుంది. కొందరు ఈ పదాన్ని ఉర్దూ శబ్దంగా సంభావిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కడుపు శూల వ్యాధిని కడుపంత 'కుట్టు' పట్టినట్లున్నది అని అంటారు. అంటే ఒక రకమైన కడుపు నొప్పి రోగం అన్న మాట అని చెప్తూ ఇవన్నీ నిఖార్సైన తెలుగు పదాలు ఎన్నింటినో ఉదహరించారు.

ఈ విధంగా అనేకానేకమైన తేట తెనుగు పదాల కూడలి తెలంగాణ మాతృభాషలోని నిజమైన తల్లినుడుల కడలి తెలంగాణ. తెలంగాణలోని మారుమూల పల్లెలూ, తోటులూ తెలుగుతనానికి, ఆలవాలమైన మాటల మూటలు అంటూ తెలంగాణ భాషలో గల ఎన్నో తెలుగు పదాలను వాటి సొగసులను విశ్లేషించి చూపారు. తెలంగాణ తెలుగు ఇంత కాలం ఆదరణ లేక అణచి వేయబడింది. కానీ ప్రామాణిక తెలుగు, కావ్య గ్రంథాల్లో, నిఘంటువుల్లో ఎన్నో ప్రామాణిక పదాలు తెలంగాణ భాష అలవోకగా ఇమిడిపోయిన విధానాన్ని ఈ వ్యాసం ద్వారా వివరించారు. తెలంగాణ ప్రాంత భాష ఔన్నత్యాన్ని, ప్రత్యేకతను పాఠకులకు తెలియబరిచారు.

### 5.2.4. నమస్తే తెలంగాణ పత్రికలోని భాషా సంబంధ వ్యాసాల పట్టిక

తెలంగాణ ప్రాంత భాష గొప్పతనాన్ని, చరిత్రను, ప్రామాణికతను తెలిపే మరికొన్ని వ్యాసాలు మనకు చెలిమె పుటలో కనిపిస్తున్నాయి. తెలంగాణ భాషను తెలంగాణ ప్రాంత ఆత్మగౌరవంగా భావిస్తూ విశ్లేషించే ఈ భాషా సంబంధ వ్యాసాల వివరాలను కింద పట్టికలో గమనించగలరు.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేది |
|---|---|---|---|
| 1) | తెలంగాణ తెలుగు ప్రామాణికత | డా. గంద్ర లక్ష్మణరావు | మార్చి 14, 2016 |
| 2) | మాండలిక పదాలను వాడుదాం | డా. మట్టా సంపత్కుమార్ రెడ్డి | జనవరి 11, 2016 |
| 3) | కథల్లో ప్రాంతోచిత భాష | డా.బి.వి.ఎన్. స్వామి | జనవరి 25, 2016 |
| 4) | కఠోర పరిశ్రమలో సానదేలిన వజ్రం | అమ్మంగి వేణుగోపాల్ | జనవరి 09, 2017 |
| 5) | పత్రికల్లో భాషా స్వరూపం | డా.నమిలకొండ సునీత | మార్చి 06, 2017 |
| 6) | భాషాభివృద్ధికి సాహిత్య అకాడమీ ఆవశ్యం | డా. సంగనభట్ల నరసయ్య | మార్చి 27, 2017 |
| 7) | తెలుగుకు పుట్టినిల్లు తెలంగాణం | డా. సంగనభట్ల నరసయ్య | జూన్ 05, 2017 |
| 8) | సంగమంతోనే భాషా వికాసం | దోరవేటి | జూలై 31, 2017 |

| | | | |
|---|---|---|---|
| 9) | తెలంగాణ – తెలుగు భాష | డా. ఆచార్య ఫణీంద్ర | డిసెంబర్ 18, 2017 |

**పట్టిక – 23**

## 5.3. సాక్షి దినపత్రికలోని భాషా సంబంధ వ్యాసాలు

సాక్షి సాహిత్యం పుటలో సాహిత్యంతోపాటు భాషా సంబంధ వ్యాసాలను ప్రచురిస్తూ తెలుగు భాషాభివృద్ధికి తన వంతు కృషి చేస్తుంది. అయితే నమస్తే తెలంగాణ పత్రిక వలె సాక్షిలో ఒక ప్రాంతానికి సంబంధించిన భాష కాకుండా అన్ని ప్రాంతాలకు సంబంధించిన తెలుగు భాష గురించి అన్ని రకాల భాషా సంబంధ వ్యాసాలు మనకు కనిపిస్తున్నాయి. కవిత్వంలో కథలో భాష గురించి ప్రస్తావిస్తూ అలాగే భాషాదినోత్సవం వంటి ప్రత్యేక సందర్భాల్లో భాష గొప్పతనాన్ని తెలుపుతూ ఈ వ్యాసాలు ప్రచురితమవుతున్నాయి.

### 5.3.1. అన్నమయ్య అచ్చ తెలుగు

'అన్నమయ్య అచ్చ తెలుగు' అనే వ్యాసాన్ని ఆచార్య రవ్వా శ్రీహరి రాశారు. ఇది అన్నమయ్య వర్ధంతి సందర్భంగా ఏప్రిల్ 04, 2016న సాక్షి–సాహిత్యం పుటలో ప్రచురితమయింది.

పదకవితా పితామహుడుగా పేరు పొందిన తాళ్ళపాక అన్నమాచార్యులు భాషా ప్రయోగాల గురించి వాటి ప్రత్యేకతలను వివరిస్తూ రాసిన వ్యాసమిది. దీనిలో వ్యాసకర్త అన్నమయ్య కృతుల్లో దేశీ పద ప్రయోగాలను గురించి ప్రస్తావిస్తూ అన్నమయ్య అనేక దేశీపద ప్రయోగాలు చేశారని ఆయన దేశ్యపదాభిమానం ఎంతటిదంటే బాగా ప్రసిద్ధమైన సంస్కృత పదాలకు కూడా వారు అచ్చమైన దేశ్యపదాలనే వాడుకోవడం చెప్పుకోదగిన విషయం అంటూ అన్నమయ్య దేశీపద ప్రయోగాలను ఉదహరిస్తూ దేశీపదాల గొప్పతనాన్ని విశ్లేషించారు. వ్యాసకర్త పేర్కొన్న అన్నమయ్య దేశీపద ప్రయోగాలు కింది విధంగా ఉన్నాయి.

**పాము పడకవాడు:** శేషశయనుడు అనే పదానికి తెలుగు రూపం ఇది.

> **"పాము పడకవాడ పట్టుకురా ఆ**
> **పామువంటి యారు నీకు బాయదు గదే"**

**పూసగొండి:** కలహశీలుడనే అర్థంలో వాడబడ్డ పదం ఇది తమిళంలో పూశల్ అంటే కలహమని అర్థం.

> **"పుక్కట వలపుతోడి పూసగొండితనమేల**
> **పక్కన మొఱగితేను పగలు రేయౌనా"**

**పసిడి చీరవాడు:** పీతాంబరుడన్న ప్రసిద్ధ సంస్కృత పదానికి దేశ్యీకరణ. చీర పదం అంబర పర్యాయం.

"పసిడి చీరవాడవు పాలు దబ్బితివిగాన
పసిడి బోలినది చేపట్టెను నీ కరము"

ఇంకా మధురవాణి పదానికి అచ్చతెనుగు పదం 'చక్కెర మాటలాడి' అధరామృతానికి తెనుగు సేతలు 'మోవితేనె' పుష్పశయ్యకు అనువాదం 'పూబరుపు'. దీపావళి పండుగకు దేశ్య వ్యవహారం దివ్వెల పండుగ, దివ్వెల పండుగోయనన్ అని కొరవి గోపరాజు ప్రయోగం అని చెప్తూ తెలంగాణంలో దివ్వెల పండుగకు వికృతి రూపమైన 'దీలి పండుగ' వాడుకలో ఉందని తెలియజేశారు.

మకరకుండలాలకు తెలుగు భావానువాదం 'మొసలి మొకము సొమ్ములు'.

"మొసలి మొకము సొమ్ములు సెవులనుబెట్టి
విసవిస నవ్వీని వీడు గదమ్మా"

అంటూ ఇలా అనేక ప్రసిద్ధ సంస్కృత పదాలకు తెలుగు పదానువాదాలను భావానువాదాలను వాడుతూ దేశ్యపదాభిమానాన్ని చాటుకున్నారని అన్నమయ్య పరసాహిత్యం ద్వారా తెలుగు భాషకు చేసిన సేవను దేశీ పదాల గొప్పతనాన్ని తెలియజేశారు. దీని ద్వారా అన్నమయ్య పద ప్రయోగాల విశిష్టతతోపాటు ఇప్పటి వరకు తెలియని ఎన్నో సంస్కృత పదాలకున్న దేశీపదాలు పాఠకులకు ఈ వ్యాసం ద్వారా తెలియజేశారు.

### 5.3.2. తెలుగు భాషకు చిరునామాలు గ్రామాలు

నలిమెల భాస్కర్ రాసిన 'తెలుగు భాషకు చిరునామాలు గ్రామాలు' అనే వ్యాసం సాక్షి–సాహిత్యం పుటలో నవంబర్ 06, 2017న ప్రచురితమయింది.

దీని వ్యాసకర్త అచ్చమైన దేశీయ తెలుగు పదాలకు చిరునామాలు గ్రామాలు అంటూ గ్రామీణ ప్రజలు నిత్యం వ్యవహరించే దేశీపదాల గొప్పతనాన్ని సోదాహరణంగా వివరించారు.

ఒక భాషకు సంబంధించిన స్వీయ అస్తిత్వం ఆ భాషకు చెందిన దేశీ పదాల్లో వ్యక్తమవుతూ ఉంటుంది. తెలుగులోనికి వచ్చి చేరిన సంస్కృతాంగ్ల ఉర్దూ మొదలైన భాషా పదాలతో తెలుగు సుసంపన్నం అయితే కావచ్చు గాక , కానీ ఆ పదాల్లో తెలుగుదనం ఉండదు. తల్లి, తండ్రి, ఊరు, పేరు, రాయి, రప్ప వంటి దేశీ శబ్దాలు తెలుగు భాషా స్వరూప స్వభావాన్ని వెల్లడించే పదాలు. ఈ అసలు సిసలు తెలుగు పదాలు తెలంగాణ గ్రామీణ ప్రాంత భాషా వ్యవహారంతో అత్యంత సహజంగా అల్లుకుపోయాయి. ఎక్కడో నిఘంటువుల్లో చోటు చేసుకొని ఉన్న ఈ తెలుగు మాటలు

నిసర్గ సుందరంగా పల్లీయుల నాల్కలపై నర్తిస్తాయంటూ అలాంటి కొన్ని దేశీ పదాలను ఈ వ్యాసంలో పేర్కొన్నారు. వ్యాసకర్త వివరించిన దేశీపదాలు కింది విధంగా కనిపిస్తున్నాయి.

వెనుకట వేసవి వచ్చిందంటే చాలు వీధి బాగోతాలు వేసేవారు "అండ్ల నీది ఏమేషంరా? ఉత్తేషమా మేటేషమా?" అని అడిగేవారు. మేటేషం అంటే మేటి వేషం. మేటి ఎంత చక్కటి తెలుగు మాట. ప్రధాన పాత్రధారుణ్ణి 'మేటేషకాడు' అనేవారు.

ఎండు చేపల్ని తెలంగాణలో 'వట్టి చాపలు'గా వ్యవహరిస్తారు. ఇవి 'వట్టు' చేపలు. వట్టు అంటే ఇంకు, కృశించు అని. అంటే ఎండిపోయిన అని అర్థాన్ని వివరించారు.

'మొగులు' ఎంత మంచి తెలుగు! తెలంగాణలో మేఘాలు కమ్ముకుంటున్న సందర్భాన్ని 'మొగులైంది' అంటారు. ఇక్కడ మొగులు అంటే మేఘం అనే అర్థం అంటూ ఇలా ఎన్నో దేశీ తెలుగు పదాలు నిఘంటువుల్లో ఉన్నా, ఈ తెలుగు మాటలు పల్లె జనాలు నాలుకలపై నోళ్ళలో నిత్యం నానుతూ ఉంటాయని ఎన్నో దేశీ పదాలను ఉదహరిస్తూ మనకు వాటి అర్థాలను వివరించారు. తెలంగాణ ప్రాంతంలోని యువతకు, జనాలకు ఆ పదాలు తెలిసిన వాటి అర్థాలు తెలియక పోవచ్చు. ఇలాంటి వ్యాసాల ద్వారా తన ప్రాంత భాష గొప్పతనం దేశీపదాల అర్థాలు వాటి ప్రయోగంలోని మాధుర్యం అర్థమవుతుంది. ఇలాంటి ఎన్నో అద్భుతమైన భాషా చరిత్ర, భాషాపద ప్రయోగాల భాషా గౌరవ సంబంధ వ్యాసాలను ప్రచురిస్తూ తెలుగు పత్రికలు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నాయని చెప్పవచ్చు. ఈ విధంగా సాక్షి పత్రికలో అన్ని రకాల, అన్ని ప్రాంతాలకు సంబంధించిన భాషా సంబంధ వ్యాసాలు మనకు కనిపిస్తున్నాయి.

### 5.3.3. ఇంగ్లీష్ కన్నా వందేళ్ల ముందే తెలుగులో తిసారెస్

రామతీర్థ రాసిన 'ఇంగ్లీష్ కన్నా వందేళ్ల ముందే తెలుగు తిసారెస్' అనే వ్యాసం సాక్షి – సాహిత్యం పుటలో జూన్ 26, 2017న ప్రచురితమయింది.

దీనిలో వ్యాసకర్త ఇంగ్లీషు భాషలో కన్నా ఒక శతాబ్దం ముందే తెలుగు మాటల తిసారెస్ (నామకోశం) వెలువడిందంటూ ఇది తెలుగు భాషా గౌరవాన్ని తెలుపుతుందని చెప్తూ ఆంధ్ర నామ సంగ్రహము యొక్క ప్రత్యేకతను వివరించారు.

పద్నాలుగో శతాబ్దానికి ఇంకా చెదురుముదురుగా ఉండి 1343లో చాసర్ మహాకవి జననానికి ఇంగ్లాండ్‌లో సాహిత్యం ఎదరుచూస్తుంది. ఇంకా రెండు వందల ఏళ్ళ తర్వాత కాని షేక్స్పియర్ ఆంగ్ల సాంస్కృతిక సమాజంలో ప్రభవించడు. చాసర్ కాలానికే తెలుగులో భారత అనువాదం పూర్తయి పాల్కురికి సోమన, నన్నెచోడుల రచనాధార తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం

చేస్తోందని ఇంగ్లీష్ కన్నా ముందే తెలుగు సాహిత్య వైభవాన్ని తెలిపారు. దేశీ మాటల వాడుక పెరిగి సంస్కృతి అంతా దేశీపదాల్లో విస్తరిస్తున్న సమాజం అది. భాష, అభివృద్ధి వల్లనే ఏ భాషలోనైనా పర్యాయపదాలు, నానార్థాలు ఏర్పడతాయి. ఈ పర్యాయ పదాలను ఒకచోట చేర్చడం నామకోశం అని మన దేశంలోనూ, తిసారెస్ అని ఆంగ్లంలోనూ వాడుక.

సంస్కృత భాషలో 'నామలింగానుశాసనం' పేరిట క్రీస్తు శకం నాలుగు శతాబ్దానికే అమరసింహుని అమరకోశం సంస్కృత పదాలకు సూచిగా పద్యరూపంలో ఏర్పడింది. ఇదే పీటర్ మార్క్ రోజెట్ తయారీ చేసిన ఇంగ్లీష్ తిసారెస్‌కు మూల ప్రేరణ అని ఆంగ్ల పండితుడు డా. జాక్ లింబ్ అభిప్రాయపడ్డారు. రోజెట్ నామకోశం 1805 ప్రాంతాల నుంచీ తయారీ అని చెప్పిన ఒక కొలిక్కి వచ్చి అచ్చులోకి వచ్చింది 1852లో కానీ మన తెలుగు భాషా నిర్మాతలు ఆంగ్ల తిసారెస్ కన్నా ఒక శతాబ్దం ముందరే తెలుగు తిసారెస్‌ను తేవడం గమనించదగిన విషయం. దీన్ని భాషకు సంబంధించి తొలి వేకువగా అభివర్ణించారు.

ఈ గణనీయమైన కృషి చేసినది పైడిపాటి లక్ష్మణకవి అంటూ వారు 1750 ప్రాంతంలో రాసిన 'ఆంధ్రనామ సంగ్రహము'ను పేర్కొన్నారు. వీరి కాల నిర్ణయానికి ఖచ్చితమైన ఆధారాలు లేవు కానీ ఈ నామ సంగ్రహానికి ఇంకొన్ని జోడింపులు జరిగితే కాని సంపూర్ణం కాదని, ఆ పని చేసింది మాత్రం విజయనగర సంస్థాన ఆస్థానకవి అడిదం సూరకవి. ఈయన 1780 వరకు జీవించారు. వీరు జతకూర్చిన మాటలతో 'ఆంధ్రనామశేషము' అని దానికి అనుబంధంగా వెలువరించి ఆంధ్రనామ సంగ్రహకర్తల్లో ఒకరిగా నిలిచారంటూ తెలుగు తిసారెస్ ప్రత్యేకతను గ్రంథకర్తల గొప్పతనాన్ని వివరించారు.

ఇంగ్లీషు వారికి మనవంటి పద్యం లేదు కనుక వారి తిసారెస్ వచనంలోనే జరిగింది తెలుపుతూ ఇలా తెలుగు వచన పర్యాయపద నిఘంటువు మనకు జి.ఎన్. రెడ్డి రాసిన తెలుగు పర్యాయపద నిఘంటువు వచ్చేంత వరకు రాలేదని చెప్తూ భాషాభివృద్ధిని సూచించే ఒక సూచి పదకోశాన్ని ఇంగ్లీషు కన్నా వందేళ్ల ముందే తెలుగులోకి తీసుకొచ్చి, తెలుగుకు ఒక సమున్నత గుర్తింపు కలిగించిన కారకులు పైడిపాటి లక్ష్మణకవి, అడిదం సూరకవిని మనం నిత్యం స్మరించుకోవాలంటూ వారి కృషి తెలుగు భాషా గౌరవాన్ని ఇందులో పేర్కొన్నారు.

### 5.3.4. సాక్షి పత్రికలోని భాషా సంబంధ వ్యాసాల పట్టిక

ఈ విధంగా తెలుగు భాషా ఔన్నత్యాన్ని చాటి చెప్తూ తెలుగు భాషా సంబంధ వ్యాసాలు మనకు సాక్షి సాహిత్యం పుటలో మరికొన్ని కనిపిస్తున్నాయి. వాటి వివరాలను కింద పట్టికలో తెలియబరిచాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ |
|---|---|---|---|
| 1) | *రేపుఅంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం సవర సాహిత్య పరామర్శ | డా. అల్లంసెట్టి చంద్రశేఖరరావు | ఫిబ్రవరి 20, 2017 |
| 2) | *రాబోవు పుస్తకం తెలుగు భాషకు చిరునామాలు గ్రామాలు | డా. నలిమెల భాస్కర్ | నవంబర్ 06, 2017 |
| 3) | అమ్మ భాషను ఆశీర్వదిద్దాం దీర్ఘాయుష్మాన్ భవ! | సురేష్ కొనిబాల | డిసెంబర్ 11, 2017 |
| 4) | ఎన్ని తీర్లుగ మాట్లాడిన తెలుగు తెలుగే | నందిని సిధారెడ్డి | నవంబర్ 11, 2017 |

**పట్టిక – 24**

### 5.4. చారిత్రక విషయ సంబంధ వ్యాసాలు

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ చరిత్రను పునర్నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. ఇంత కాలం ఉన్న చారిత్రక గ్రంథాల తెలంగాణ ప్రాంతానికి సరైన చోటు లభించకపోవడం వలన లోకానికి తెలియని మరుగున దాగిన ఎంతో విలువైన తెలంగాణ ప్రాంత చరిత్రను వెలుగులోకి తెస్తూ నూతన పుస్తకాలను రాస్తూ రచయితలు, చరిత్రకారులు తెలంగాణ చారిత్రకాభివృద్ధికి కృషి చేస్తున్నాయి. కావున ఈ సమయంలో తెలంగాణ చరిత్రను, సంస్కృతిని తెలిపే గ్రంథాలు ఎన్నో వస్తున్నాయి. వాటి వివరాలను తెలుపుతూ నూతన చరిత్ర గ్రంథాలను వ్యాసాల రూపంలో పాఠకులకు చెలిమె సాహిత్యపుట పరిచయం చేస్తుంది. అలాగే చారిత్రకాంశాలను తెలిపే వ్యాసాలు కూడా మనకు సాహిత్యపుటలో కనిపిస్తున్నాయి. తెలంగాణ ప్రాంత గొప్పతనం, తెలంగాణ ప్రజల నైపుణ్యాలను, చరిత్ర, సంస్కృతి వంటి అనేక విషయాలను తెలుపుతూ చారిత్రక సంబంధ వ్యాసాలు సాహిత్యపుటల్లో వెలువడుతున్నాయి. తెలంగాణ సంస్కృతి, సాహిత్యం, చరిత్ర ఔన్నత్యాన్ని అవగతం చేసుకోవడానికి ఉపకరిస్తున్నాయ. ఇంత కాలం మరుగున దాగిన తెలంగాణ వైభవాన్ని ఈ చారిత్రక వ్యాసాల ద్వారా పాఠకులకు తెలియజేస్తున్నారు.

### 5.4.1. చారిత్రక గ్రంథ సంబంధ వ్యాసాలు

చరిత్ర ఔన్నత్యాన్ని తెలుపుతూ రాసిన నూతన చారిత్రక గ్రంథాలను పరిచయం చేస్తూ పుస్తక తాలూకు వివరాలను వ్యాసాల రూపంలో చెలిమె పుట పాఠకులకు అందిస్తుంది. నూతన చరిత్ర

సంబంధ పుస్తకాలు, గ్రంథాలు వెలువడినపుడు వాటి వివరాలను తెలుపుతూ వ్యాసాలను ప్రచురిస్తున్నారు. గ్రంథ వివరాలను తెలుపుతూ సమీక్షా రూపంలో వ్యాసాలు వెలువడుతున్నాయి.

### 5.4.2. తెలంగాణ చరిత్రపై మొదటి సమగ్ర రచన

టంకశాల అశోక్ రాసిన 'తెలంగాణ చరిత్రపై మొదటి సమగ్ర రచన' అనే వ్యాసం జనవరి 04, 2016న నమస్తే తెలంగాణ చెలిమె పుటలో వెలువడింది.

వ్యాసకర్త తెలంగాణ చరిత్ర, సంస్కృతిపై అడపా సత్యనారాయణ, ద్యావనపల్లి సత్యనారాయణ కలిసి రాసిన "తెలంగాణ చరిత్ర, సంస్కృతి రాష్ట్ర అవతరణ ఉద్యమాలు (చరిత్ర పూర్వ యుగం నుండి రాష్ట్ర అవతరణ వరకు) అనే తెలంగాణ చారిత్రక గ్రంథాన్ని గురించి వివరిస్తూ ఈ వ్యాసాన్ని రాశారు.

తెలంగాణ ఉద్యమ కాలంలో ఈ ప్రాంత చరిత్ర, సంస్కృతి, రాష్ట్రోద్యమాల గురించి పుస్తకాలు, వ్యాసాలు ఎన్నో వెలువడ్డాయి. కాని వాటిలో అత్యధికంగా కొన్ని నిర్దిష్ట అంశాలకు పరిమితమై రాసినవే ఉన్నాయంటూ తెలంగాణ ఉద్యమకారులు రాయడం, తగిన పరిశోధన లేకపోవడం వలన వాటిలో పొరపాట్లు కూడా దొర్లాయని చెప్తూ లోపాలు లేకుండా వచ్చినవి కూడా 1969 ఉద్యమం, నిజాం కాలపు ముల్కీ సమస్య లేదా వివిధ రంగాలలో తెలంగాణ వెనుకబాటుతనం వంటి ఏదైన ఏదోక ప్రత్యేక నిర్దిష్ట కాలానికి లేదా స్థితికి సంబంధించినవిగానే ఉన్నాయి తప్ప సమగ్ర తెలంగాణ చరిత్ర గ్రంథాల కోసం ఇంకా పరిశోధనలు జరగాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్రం ఏర్పడక ముందు వరకు పరిశోధకులకు, రచయితలకు రికార్డుల లభ్యత నుంచి మొదలుకొని ప్రభుత్వం నుండి యూనివర్శిటీల వంటి అకాడమిక్ సంస్థల ప్రోత్సహం వరకు అన్ని కోరతలుగానే ఉండేవి. కాని ఇప్పుడా పరిస్థితులు మారిపోయిన తరుణంలో తెలంగాణ చరిత్రను పునర్నిర్మించుకోవలసిన అవసరాన్ని వివరించారు.

ప్రస్తుత కాలంలో పోటీ పరీక్షల కోసం తెలంగాణ చరిత్ర, భూగోళం, ఆర్థికం, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ గ్రంథాలు ఎన్నో వెలువడుతున్నాయి. కానీ వాటిలో ప్రామాణికత లేకపోవడమే కాక వాస్తవాలకు సంబంధించిన తప్పులు అనేకం ఉన్నాయని అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

గతంలో వెలువడ్డ చరిత్రలు అనేకం తెలంగాణ వ్యతిరేకులు రాసినవే అయినందున వాటిలో వాస్తవాల కంటే వక్రీకరణలే ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలుపుతూ ఇలాంటి స్థితిలో వెలువడిన అడపా సత్యనారాయణ, ద్యావనపల్లి సత్యనారాయణల ఈ రచన ఆహ్వానించదగినదిగా చెప్తూ

చరిత్ర పూర్వయుగం నుండి రాష్ట్ర అవతరణ వరకు దాదాపు మూడు లక్షల సంవత్సరాల తెలంగాణ చరిత్రను అంతా ఒకే సంపుటిలో స్పృశించిన మొదటి రచన ఇది అని పుస్తక ప్రత్యేకతలను తెలిపారు. ఇంత విస్తారమైన కాలాన్ని తీసుకున్నందుకు ఇది సహజంగానే విహంగవీక్షణ రచన అయిందంటూ అదే సమయంలో ప్రధానమైన విషయాలు తగినంత వివరంగానూ ఉన్నాయని గ్రంథ వైశిష్ట్యాన్ని కొనియాడారు.

నిజానికి తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత తెలంగాణ చరిత్రను సమగ్రంగా తెలుపుతూ అనేక సంపుటాల ఉద్గ్రంథాలు వెలువడాల్సిన అవసరాన్ని గుర్తుజేశారు. ఇంకా విస్తృతమైన పరిశోధనలు జరగాల్సిన అంశాలెన్నో ఉన్నాయని వాటికి ప్రస్తుతం వెలువడుతున్న ఈ గ్రంథాలు ప్రాథమిక దశగా పేర్కొన్నారు.

ఈ విధంగా తెలంగాణ చరిత్రకు సంబంధించిన గ్రంథ పరిచయాన్ని చేస్తూనే తెలంగాణ చరిత్ర, సంస్కృతిని పునర్నిర్మించుకోవాల్సిన అవసరాన్ని వాటి ఆవశ్యకతను వివరించారు.

### 5.4.3. తెలంగాణ సమగ్ర చరిత్ర

వి. ప్రకాశ్ రాసిన 'తెలంగాణ సమగ్ర చరిత్ర' అనే వ్యాసం నమస్తే తెలంగాణ చెలిమె పుటలో జనవరి 11, 2016న ప్రచురితమయింది.

వ్యాసకర్త సామాజిక శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సామాజిక ఉద్యమకారుడు బి.ఎస్. రాములు రాసిన 'తెలంగాణ సామాజిక చరిత్ర, సంస్కృతి, ఉద్యమాలు' అనే గ్రంథ ప్రత్యేకతలను వివరిస్తూ రాసిన చారిత్రక గ్రంథ పరిచయ వ్యాసమిది.

ఈ గ్రంథ పోటీ పరీక్షల కొరకు ప్రత్యేకంగా ఉపయోగపడటంతోపాటు ఇందులోని అంశాలు ఉద్యమకారులను, విద్యార్థులను, పరిశోధకులను, ప్రజలను వివిధ అంశాలపై చైతన్యవంతులను చేసే విధంగా ఉన్నాయని గ్రంథము యొక్క ప్రత్యేకతలను వివరించారు. సమాజం పట్ల నిరంతర తపన, బాధ్యత ఉన్నవారి వల్లనే చరిత్రలో సామాజిక, శాస్త్రీయ, వైజ్ఞానిక వికాసం జరిగిందని తెలుపుతూ బి.ఎస్. రాములు తెలంగాణ సామాజిక శాస్త్రవేత్తగా పేర్కొన్నారు. ఆయనకు సమాజం పట్ల ఉన్న నిరంతర తపన, బాధ్యత వారి రచనలను చదివిన వారందరికి అర్థమవుతుందంటూ కొనియాడారు. వీరు తెలంగాణ సామాజిక చరిత్ర, సంస్కృతి, ఉద్యమాలను సాధికారంగా వివరించి, విశ్లేషించటంతోపాటు బంగారు తెలంగాణ కోసం ప్రజలు ఏం చేయాల్సి ఉంటుందో, పరిపాలకులు ఏం చేయాలో కూడా వివరించారు. ఇది తెలంగాణ సమకాలీన

సంస్కృతి, చరిత్ర, పరిణామాలతోపాటు సమస్యలపై విశ్లేషణ, బంగారు తెలంగాణ భవిష్యత్తుకు తొవ్వ కూడా అని వివరించారు.

బి.ఎస్. రాములు తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్రను పోషిస్తూ తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పరిరక్షణకై పాటుపడిన విధానాన్ని వివరించారు. తెలంగాణ ఉద్యమం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటున్న సమయంలో వారి కలానికి పదునుపెట్టి తెలంగాణ తల్లి మీద అనే వ్యాసాలు రాసి ప్రజల్లో తెలంగాణపై ప్రత్యేక అభిమానాన్ని రగిలించడానికి కృషి చేశారు. తెలంగాణ తల్లి రూపాన్ని కె.సి.ఆర్. ప్రజల ముందుకు తీసుకొని వచ్చాడు. బి.ఎస్.రాములు ఆలోచనల ప్రకారం ఆయన మార్గదర్శకత్వంలో పనిచేస్తూ 'తెలంగాణ తల్లి చిత్రపటం' రూపమిచ్చింది. జె.ఎన్.టి.యూ. అసిస్టెంట్ ప్రొఫెసర్ టి. గంగాధర్ తొలి నమూనా మినీ విగ్రహం బి.వి.ఆర్. చారి ఊరూరా వెలసిన తెలంగాణ తల్లి విగ్రహాలను రూపొందింది పసునూరి దయాకర్ అంటూ తెలంగాణ సంస్కృతికి, ఉద్యమానికి బి.ఎస్. రాములు చేసిన కృషిని విశ్లేషించారు.

1990లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వం నక్సలైట్లు జనజీవన స్రవంతిలోకి రావాలని కల్పించిన వెసులుబాటును ఉపయోగించుకొని విప్లవోద్యమం నుంచి వెలుపలికి వచ్చి సామాజిక ఉద్యమాల నిర్మాణంపై దృష్టి సారించారు. రెండున్నర దశాబ్దాల్లో 86 పుస్తకాలు ప్రచురించి లెక్కలేనన్ని వ్యాసాలు రాసి నిరంతరం ప్రజా చైతన్యమే ధ్యేయంగా సాగుతున్న సామాజిక తత్త్వవేత్త బి.ఎస్. రాములు అని ఆయన జీవితం, వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారు. వారు రాసిన ఈ గ్రంథంలో తెలంగాణ చరిత్ర, సమస్యలపై విశ్లేషణ ఉంది. సమాజ గమనాన్ని తెలంగాణ సామాజిక చరిత్రను, సంస్కృతిని, ఉద్యమాలను, వాటిలోని మలుపులను, వాటి వెనుక గల కారణాలను మొదలైన ఎన్నో అంశాలను అవగతం చేసుకోవాలనుకునేవారు తప్పక చదువ వలసిన గ్రంథమంటూ తెలంగాణ చరిత్ర, సంస్కృతికి ప్రతిబింబించే ఈ గ్రంథ పరిచయాన్ని చేస్తూనే, గ్రంథ రచయిత జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కవి జీవిత పద్ధతిని వివరించారు. ఇది ఒక రకంగా గ్రంథ సమీక్ష వ్యాసంగా కనిపిస్తున్నా, చారిత్రక వాస్తవికాంశాల చర్చ అధికంగా కనిపిస్తుంది. ఇటువంటి వ్యాసాల వలన తెలంగాణ చరిత్ర, సంస్కృతి సంబంధ గ్రంథ పరిచయమే కాక వాటిని గురించి చదవాలనే ప్రేరణ కలుగుతుంది. వాస్తవికాంశాలు పాఠకులకు అవగతమవుతాయి. ఇలాంటి వ్యాస ప్రచురణతో చెలిమె పుట తెలంగాణ సాంస్కృతికాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుందని చెప్పవచ్చు.

### 5.4.4. చరిత్ర సంబంధ వ్యాసాల పట్టిక

తెలంగాణ చరిత్ర, సంస్కృతిని గురించి తెలిపే చారిత్రక సంబంధ వ్యాసాలు చెలిమె పుటలో మరికొన్ని వెలువడ్డాయి. వాటి వివరాలను కింది పట్టికలో తెలిపాను.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేది | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | విలీననేపథ్యం, పూర్వాపరాలు | కె. జితేంద్రబాబు | ఏప్రిల్ 04, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | సాహిత్యంలోనూ దిట్ట | డా. గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి | ఫిబ్రవరి 22, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 3) | సాహిత్య చరిత్రను పరిశోదిద్దాం | తంగెళ్ల వకుళారాణి | ఏప్రిల్ 03, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 4) | ముంబై నిర్మాణంలో మనవాళ్లు | మచ్చ ప్రభాకర్ | అక్టోబర్ 10, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 5) | ఒక పాలకుర్తి, ఒక బమ్మెర | అనుమాండ్ల భూమయ్య | ఫిబ్రవరి 29, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 6) | బుద్ధుడు తెలంగాణకు వచ్చాడా? | డా. సంగనభట్ల నరసయ్య | ఏప్రిల్ 17, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 7) | వందేళ్ల చలన సుగంధాలు | డా. నాళేశ్వరం శంకరం | ఏప్రిల్ 24, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 8) | హాలుడు తెలంగాణకు అల్లుడు | డా. సంగనభట్ల నరసయ్య | డిసెంబర్ 25, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 9) | ఓరుగల్లు వైభవోత్సవాలు | కొలనుపాక కుమారస్వామి | మే 29, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 10) | తొలి తెలుగు గ్రంథం కవిజనాశ్రయం | డా. గుంటి గోపి | ఆగస్టు 08, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక – 25**

### 5.5. సాంస్కృతిక సంబంధ వ్యాసాలు

"ఈనాడు భారతదేశములో సంస్కృతియను పదము అత్యంత విశాలమైన అర్థంలో ప్రయోగించబడుతున్నది. ఇది ఈనాడు ఉపయోగింపబడుచున్నంత భావ వైశాల్యము ప్రాచీన కాలమున లేదు. నేడు సంస్కృతియనగా సర్వజీవ, నిర్జీవ పదార్థములకు, మానవులకు, కళలకు చెందిన ఒకానొక సంప్రదాయ వైశిష్ట్యముగా కొందరు నిర్వచించుచున్నారు. సమ్యక్ కృతియే సంస్కృతి అది ఒక ఉత్తమమైన ఆచరణము. సంస్కృతి సహజముగా జీవగతము, భావగతము ఈ

జీవ, భావగతమైన ఒక ప్రేరణ ఒక క్లిష్ట సమయమున, ఒక పరీక్షవేళ విశిష్ట ప్రవర్తనకు కారణభూతమై, ఆ ప్రవర్తనము విద్వాంసులచే ప్రశంసితమైనప్పుడు అది ధర్మమనిపించుకొనును. మానవ శ్రేయస్సును ధరించునది ధర్మమైనచో ఆ మానవుని ఉదాత్తాచరణమే సంస్కృతి" (ప్రసాదరాయ కులపతి.1983.పుట.1).

'సంస్కృతి' అనే పదాన్ని వినగానే సామాన్యంగా స్ఫురించే మాటలు ఒక విధమైన జీవన విధానం (A way of life), ఉత్తమ స్థాయి (Excellence), సంస్కారం (Refinement) పొందింది. అందువల్ల నాగరికత మానవుని దేహసుఖ ప్రమాణం అనీ, సంస్కృతి మానవ సంస్కారం ప్రమాణం అని స్థూలంగా అభిప్రాయపడవచ్చు.

డి.డి. కోశాంబి మొదలైన కొందరూ చరిత్రకారులు 'సంస్కృతి' అనే పదాన్ని మతం, వేదాంతం, న్యాయ విధానాలు, సారస్వతం, కళలు, సంగీతం మొదలుగాగల మేథా సంబంధమైన లేక ఆధ్యాత్మికమైన విలువలకు మాత్రమే పరిమితం చేసి నిర్వచించడాన్ని ఆమోదించలేదు. ఈ విషయాలకే పరిమితమైన 'సంస్కృతి'ని చరిత్రకు ప్రధాన ఆధారంగా తీసుకోవడంలో ఇబ్బందులున్నాయని భావించారు.

సంస్కృతి ఉన్నత వర్గాల కాణాచిగా ఉండిన ఆధ్యాత్మిక విషయాలకు పరిమితం కాదు. ఒక జాతి ప్రజల మౌలిక జీవన విధానాన్ని తెలిపేదిగా వారు దానిని నిర్వచించారు. సంస్కృతి యొక్క నిర్వచనానికి అనుగుణంగా వారు చరిత్రను, ఉత్పత్తి సాధనాలలో వాటి ద్వారా సామాజిక సంబంధాలలో ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చిన మార్పులను కాలక్రమంలో చెప్పడమని నిర్వచించారు ( విశ్వనాథ రెడ్డి, కేతు. (సంపా.).2005.పుట.1&2).

"సంఘమునకు వెలిగా మానవుడెట్లు బ్రతుక నేరడో, సంస్కృతిని పొందని మానవుడును అట్లుండలేడు. మానవుడు సంస్కృతికిని శిశువే. సంస్కృతిని భిన్న వర్గములకు భిన్న కాలమునకును చెందిన రకరకముల యాచారముల యొక్కయు, నడవడికల యొక్కయు, 'నమూనా'లను (Patterns) సంతరించుకున్న సమాహార స్వరూపముగా నిర్ణయింపవచ్చును. ఇట్టి నమూనాలలో కొన్ని వాని ననుసరించు సంఘమున కొకప్పుడు సజాతీయములను, మరియొకప్పుడు విజాతీయములును కావచ్చును. ఒక జాతి యొక్క సంస్కృతి నవగతము చేసికొనుట యనగా నా జాతికి చెందిన మనుష్యుల యొక్క వివిధ కాలములలోని, వివిధావస్థల యందలి, సంఘజీవనము పరిశీలించుట" (కృష్ణకుమారి, నాయని.2014.పుట.6).

"సంస్కృతి అంటే సంఘంలో ఒక సభ్యుడుగా మానవుడు ఆ సంఘంలో అలవాట్లను, ఆచార వ్యవహారాలను, కళాస్వరూపాలను గ్రహించడమని అర్థం. అలాంటి మానవ సంఘ సంస్కృతిని అధ్యయనం చేయటమే జానపద విజ్ఞానం. ఒక్క మాటలో చెప్పాలంటే మానవ సంస్కృతినీ, జీవన విధానాన్ని, ప్రాచీన సంస్కృతిని ప్రతిబింబించే దర్పణం వంటిది జానపద విజ్ఞానం (మోహన్, జి.ఎస్.2010.పుట.22)

మానవుడు జన్మించింది మొదలు క్రమంగా పెరిగి పెద్దవాడై తనదైన ఒక జీవన విధానంలో కొన్ని నియమాలు, కట్టుబాట్లు, ఆచారాలు, సంప్రదాయాలు ఏర్పరచుకుంటాడు. అతడు ఏర్పరచుకున్న జీవన పద్ధతులు, నియమాలు, ఆచార సంప్రదాయాల సమాహార స్వరూపమే 'సంస్కృతి' అని చెప్పవచ్చు. ఈ సంస్కృతి వ్యక్తి అంతర్గత జీవితాన్ని, అతని కార్యచరణ పద్ధతిని తెలుపుతుంది" (విష్ణుమూర్తి, తాటికొండ.1994.పుట.183).

పై నిర్వచనాల ఆధారంగా మానవజాతి పుట్టినప్పటి నుండి దాని మనుగడకు అవలంభించిన విధానాలు సంస్కృతి సంప్రదాయాలుగా చెప్పవచ్చు. సంస్కృతికి సంఘముతో విడదీయరాని బంధము కలదని అర్థమవుతుంది. ఈ సంస్కృతికి ముందు తరాల వారు ఆచరించడం వల్ల అది సంప్రదాయంగా మారిపోతుంది. పరిసరాల ప్రభావమే కాక సమాజంలో కొత్త అవసరాలు ఏర్పడడం వల్ల మానవ జీవితంలో మార్పులు సంభవిస్తాయి. ఈ మార్పులకు అనుగుణంగా అతని జీవన పద్ధతులు, ఆచార సంప్రదాయాలు మారి సంస్కృతిలో కూడా మార్పులు వస్తాయి. మానవుని పురోభివృద్ధికి దోహదం చేసే సంస్కృతి భావితరాలకు సంప్రదాయంగా మిగులుతుంది.

ఇటువంటి సంస్కృతి, సాహిత్యాభివృద్ధికి పత్రికలు మొదటి నుండి ఎంతో కృషి చేస్తున్నాయి. ఇంతకాలం మరుగున దాగిన తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని, తెలంగాణ చరిత్ర, సంస్కృతులను పాఠకులకు అందిస్తూ వాటి ప్రత్యేకతలను తెలుపుతూ నమస్తే తెలంగాణ పత్రిక చెలిమె పుట సాంస్కృతికాభివృద్ధికి తన వంతు కృషి చేస్తుంది. గొప్పనైన తెలంగాణ ప్రాంత సాహిత్య సాంస్కృతిక సంబంధ వ్యాసాలు మనకు చెలిమె పుటలో కనిపిస్తున్నాయి. తెలంగాణ సాంస్కృతిక జీవనాన్ని ప్రతిబింబిస్తూ వ్యాసాలను ప్రచురిస్తున్నారు. ఇటువంటి తెలంగాణ సాంస్కృతిక సంబంధ వ్యాసాలు అప్పుడప్పుడు సాక్షి పత్రికలో కూడా కనిపిస్తున్నాయి. కానీ చాలా అరుదు. ఈ సాంస్కృతిక సంబంధ వ్యాసాలను విశ్లేషించుకున్నట్లయితే ఇంతకాలం వెలుగులోకి రాని తెలంగాణ చరిత్ర, సాంస్కృతిక ప్రత్యేకతలు వాటి ఔన్నత్యం మనకు విశదమవుతుంది.

### 5.5.1. జానపద విజ్ఞానం–తెలంగాణ సంస్కృతి

ప్రాచీన కాలం నాటి విభిన్న సాంస్కృతిక సమూహాల సంస్కృతీ వికాసాలను గుర్తించడానికి, వారి ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, సంప్రదాయాలు, కళలు, సాహిత్యాది విషయాలను గమనించడానికి మనకు ద్వివిధాలైన సామగ్రి లభిస్తుంది. ఒకటి తరతరాలుగా గ్రంథస్థం కాక కేవలం మౌఖిక సంప్రదాయంలో (Oral Tradition) నిలిచిపోయిన విజ్ఞానం. మరొకటి నాగరికతా ప్రవాహానికి లోనై గ్రంథస్థ రూపం పొందిన విజ్ఞానం. మొదటిది సాంప్రదాయిక విజ్ఞానం. దీన్నే జానపద విజ్ఞానమని (Folklore) అంటాం. రెండోది గ్రాంథిక విజ్ఞానం (Booklore). ప్రాచీన మానవ సంస్కృతిని పరిశీలించడానికి జానపద–విజ్ఞానాధ్యయనం (Folklore Study) అత్యంతావశ్యకమైంది" (మోహన్, జి.ఎస్.2010.పుట.22).

దినపత్రికల సాహిత్య పుటల్లో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక సంబంధ విషయాలను వ్యాసాలుగా ప్రచురిస్తున్నారు. వీటిలో భాగంగా తెలంగాణ ప్రాంత సంస్కృతి మరియు జీవన విధానాన్ని తెలిపే పండుగలు, ఉత్సవాలు, జాతరలు, కళారూపాలు, ఆచారాలు, సామెతలు వంటి అనేక అంశాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంతకాలం అనాదరణకు గురైన తెలంగాణ సంస్కృతి, కళారూపాలకు ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తూ చెలిమె పుట తెలంగాణ సాంస్కృతికాభివృద్ధికి కృషి చేస్తుంది. ఈ వ్యాసాల ద్వారా తెలంగాణ ప్రాంత సాంస్కృతిక ప్రత్యేకతలను, ప్రజల జవీన విధానాన్ని పాఠకులకు అందిస్తుంది. చెలిమె పుటలో సాంస్కృతిక సంబంధమైన సంస్కృతిలో భాగమైన పండుగలు, కళారూపాలు, సామెతల వంటి జానపద సాహిత్య సంబంధ వ్యాసాలు ఎన్నో మనకు కనిపిస్తున్నాయి. వాటిని విశ్లేషించుకుంటే తెలంగాణ ప్రాంత సాంస్కృతిక ప్రత్యేకతలు అవగతమవుతాయి.

"జనపదమనగా పల్లెటూరు. 'ఆర్యవర్తః పుణ్యభూమిర్మధ్యం విన్ధ్య హిమగయోః నీవృజ్జనపదౌ దేశవిషయౌ తూపవర్తనమ్' " అని అమరము, జనపదములందుండువారు జానపదులు. వారు పాడుకొనెడు పాటలు లేదా గేయాలు జానపద గేయాలనబడును. వీటినే ఇంగ్లీషులో Folk Songs అందురు. ఈ పదము Volkslied అను జర్మన్ భాషాపదమునకు అనువాదము. Folk Songs జానపద గేయములు, Folk Literature జానపద సాహిత్యము, Folklore జానపద విజ్ఞానము అను మాటలన్నియు నా శబ్దభవములే. ఔత్తరాహులగు భారతీయులు కూడా నీ విషయమును తెలుపుటకే 'లోక సాహిత్య', 'లోకగీత్' శబ్దములను వాడుచున్నారు. జానపదులనగా మోటువారు, పల్లెటూరివారు, అనాగరికులు, పామరులు,

ప్రాకృతులు, అజ్ఞానులను నర్థము స్ఫురించునని కాబోలు కొందరు ఆంధ్రా పండితులు ఈ గేయములను ఈ సాహిత్యమును తమ యిష్టానుసారముగా వేరు వేరు పేర్లతో పిలిచిరి. శ్రీఖండవల్లి లక్ష్మీరంజనంగారు ఇట్టి వాఙ్మయమును ప్రజావాఙ్మయమనిరి. ప్రజలనగా పల్లెటూరివారు కావచ్చును. పట్టణవాసులును కావచ్చును. విశేషించి పామరత్వ దోషము తొలగిపోవునని వారు అభిప్రాయపడియుందురు (రామరాజు, బిరుదరాజు.1990.పుట.01).

Folklore అనేది సమస్త పదం. Folk మరియు Lore అనే పదాల సమ్మేళనం. Thoms అర్థంలో 'Folk' అంటే unlettered peasantry. అంటే నిరక్షరకుక్షులైన కర్షకులు. వాళ్ళు నిరక్షరకుక్షులైన కర్షకులనడం కంటే ప్రాచీన సంప్రదాయాన్ని తరతరాలుగా నిలుపుకొంటూ వస్తున్న ప్రజా సమూహమనడం సమంజసమనిస్తుంది. 'Lore' అంటే పాండిత్యం లేక విజ్ఞానం (మోహన్, జి.ఎస్.2010.పుట.23).

నేడు మనం Folklore అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా 'జానపద విజ్ఞానము' అనే పదాన్ని వాడుతున్నాము. ఈ 'జానపదము' అనే పదం 'ఒక దేశ విభాగము, 'గ్రామము' అనే అర్థంలో వాడబడుతోంది. జనపద, జానపద శబ్దాలు రెండింటికీ సమానమైన అర్థం అందని విశ్వ నిఘంటువులోని 'భవేజ్జనపదో జానపదోపి జనదేశయోః' అను శ్లోక పాదాన్ని పేర్కొన్నారు శ్రీ ఓగేటి అచ్యుతరామ శాస్త్రిగారు. అంటే జనులకు, దేశానికి రెండింటికి జనపద, జానపద శబ్దాలు రెండూ అన్వయించబడతాయి (మోహన్, జి.ఎస్.2010.పుట.24).

"జాపద విజ్ఞానమనగా Folklore. Folklore శబ్దకల్పనము William Thoms అను నాతనిచే క్రీ.శ.1846 ప్రాంతమున జరిగినదట. అతడు The Athenaeum అను పత్రికకు ఒక జాబు వ్రాయుచు అందులో Popular Antiquities and Popular Literature అను మాటలకు మారుగా Folklore మాటలను వాడవలసినదని సూచించెను" (రామరాజు, బిరుదరాజు.1990.పుట.8, 9). జానపద విజ్ఞానాన్ని పలువురు పండితులు పలురకాలుగా నిర్వచించారు. జానపద విజ్ఞాన కోశంలో దీనికి 21 నిర్వచనాలు ఇవ్వబడ్డాయి.

William R. Bascom జానపద విజ్ఞానాన్ని 'శాబ్దిక కళ' లేదా 'వాగ్రూప కళ' (Verbal Art) అని పేర్కొని 'మానవశాస్త్ర పరిభాషలో జానపద విజ్ఞానమంటే మౌఖిక ప్రచారంలో ఉన్న పుక్కిటి పురాణాలు, ఐతిహ్యాలు, జానపద కథలు, సామెతలు, పొడుపు కథలు, కవిత్వం మరియు కళాత్మక వ్యక్తీకరణం ఉన్న అనేక ఇతర ప్రక్రియలు అని తెలియబరచాడు.

B.A. Botkin అభిప్రాయంలో 'శుద్ధమయిన వాగ్రూపమయిన సంస్కృతిలో ఏదయినా జానపద విజ్ఞానమే' గిరిజన సమాజంలో ఈ విషయం నేటికి సత్యమే.

Aurelio M. Espinosa – 'జానపద విజ్ఞానము లేదా జనప్రియ విజ్ఞానం (Popular Knowledge) మానవుడు తరతరాలుగా సంపాదించిన, అనుభవించిన సాంప్రదాయక నిధి. ఇది విజ్ఞాన శాస్త్రం (Scientific Knowledge) కంటె భిన్నమైందని నిర్వచించాడు.

Richard M. Dorson 'Volkkunde' అనే పదాన్ని విపులీకరిస్తూ 'Volksunde embraces the total rural life, including the physical objects produced by household artisans' అన్నాడు.

పై నిర్వచనాలను బట్టి చూస్తే W.J. Thoms 'Folklore' అనే పదాన్ని సృష్టించడానికి మునుపే, Volkskunde అన్న పదం యొక్క అర్థ విస్తృతిని దృష్టియందుంచుకొన్నట్లుగా గ్రహించవచ్చు. 'విద్యాగంధం లేని సామాన్య జనులలో అనేక రూపాలలో వాగ్రూపంలోను, ఉదాహరణ పూర్వకంగానూ ప్రవహిస్తున్న సంప్రదాయబద్ధమైన సాంస్కృతిక విజ్ఞానమే జానపద విజ్ఞానం' అని నిర్వచించవచ్చు. ఇది ప్రజల యొక్క, ప్రజల చేత, ప్రజల కొరకు వ్యక్తీకరింపబడిన సామూహిక విజ్ఞానం ( మోహన్, జి.ఎస్.2010.పుట.25, 26).

ప్రాచీన మానవుల లేదా నేటి గ్రామీణ ఆచారవ్యవహారాలు, పండుగలు, పబ్బాలు, పద్ధతులు, అలవాట్లు, ఉత్సవాలు, వేడుకలు నేటి నాగరిక సమాజాల్లో కూడా నిలిచి ఉండటాన్ని గమనిస్తే నాగరికులు కూడా ఇలాంటి జానపద సంప్రదాయాన్ని అనుసరిస్తుండటం కనపిస్తుంది. కావున 'జానపదం' అనే పదాన్ని కేవలం ఒక నిర్దిష్టమైన సమాజానికి ముడి పెట్టడం కంటె ప్రజల మానసిక స్థితిగతులను సూచించే సంఘంగా పేర్కొనటం ఉత్తమం. ఇక్కడ జానపదుని కంటె జానపదత్వానికి ప్రాధాన్యమీయాలి.

It is not the 'Folk but the folkishness that matters' (Dr. P.R. Subramanian, An Introduction to the Study of Indian Folklore, p.7) తెలిపారు (మోహన్, జి.ఎస్.2010.పుట.28).

ఇంత విస్తృతమైన జానపద విజ్ఞానమును (Verbal Folklore) వాగ్రూపముగా నున్నదానిని, (Non-verbal Folklore) వాగ్రూపేతరముగా నున్నదానిని Richard M. Dorson పండితుడు తాను సంపాదించిన Folklore and Folklife అను వ్యాస సంపుటికి వ్రాసిన పరిచయములో నాలుగు శీర్షికల క్రింద వింగడించాడు.

### 1) మౌఖిక సారస్వతము (Oral Literature)

ముఖోద్గతముగా వెలువడు పాట, మాట, పలుకు మున్నగునవి. ఇందులో తీరు తీరుల కథాగేయములు లేదా గాథలు, కథా విరహితమైన పెక్కు తీరుల చిన్న పాటలు గద్యరూపమున లేదా వచన రూపమున నుండు కథలు, సామెతలు, పొడుపు కథలు, మారుమూల పదములు, మాండలికములు, యాసలు, నుడికారములు, తిట్లు, ఒట్లు మున్నగునవి చేరును.

### 2) వస్తు సంస్కృతి లేదా భౌతిక సంస్కృతి (Material Culture)

దీంట్లో జానపదుల చేతి పనులు (Folk Crafts), జానపద కళ (Folk Art), జానపద వాస్తు శిల్పం (Folk Architecture), జానపద వస్త్రధారణ (Folk Culture) జానపద పాక కళ అనేవి చేరతాయి.

### 3) సాంఘిక జానపదాచారం (Social Folk Custom)

దీంట్లో పండుగలు మరియు ఉత్సవాలు (Festivals and Celebrations), వినోదాలు మరియు ఆటలు (Recreations and Games), జానపద వైద్యం (Folk Medicine), జానపద మతం (Folk Religion) అనేవి చేరతాయి.

### 4) జానపద కళలు (Folk Arts)

ఇందులో జానపద నాటకం (Folk Drama), జానపద సంగీతం (Folk Music), జానపద నృత్యం (Folk Dance) అనేవి చేరుతాయి (డా. మోహన్, జి.ఎస్.2010.పుట.28, 29).

విస్తృత జానపద విజ్ఞానంలో భాగమైన సామెతలు, జానపద కళారూపాలు, పండుగలు వంటి అనేక సాంస్కృతిక సంబంధ వ్యాసాలు మనకు చెలిమె పుటలో కనిపిస్తున్నాయి. తెలంగాణ ప్రాంత జీవనాన్ని ప్రతిబింబించే జానపద సాహిత్య సంబంధం వ్యాసాలను పరిశీలిస్తే మనకు తెలంగాణ ప్రాంత సాంస్కృతిక ఔన్నత్యం అర్థమవుతుంది.

### 5.5.2. తెలంగాణ ప్రాంత జానపద కళారూపాలు

జానపద విజ్ఞానంలో జానపద కళలకు ప్రత్యేక స్థానం ఉంది. 'Human life without art is incomplete and is barren' అని చైనీయుల ఆర్యోక్తి. అందువల్లే జానపద కళల్ని, కళారూపాల్ని ప్రజా సంస్కృతి యొక్క అనుభవాల ప్రతీకలుగా మనం నిర్ణయించవచ్చు (మోహన్, జి.ఎస్.2010.పుట.299). వినోదం లేనిది జీవితం లేదు. ఆహార పానీయాలు మన దేహానికి ఆనందానిస్తే, వినోదం మనస్సుకు ఉల్లాసాన్నిస్తుంది. అలా వినోదంగా ఉన్న కళారూపాలకి కొరత

లేదు. మతాచరచణ సందర్భాల్లో కానీ, సాంఘికాచరణ సందర్భాల్లో కానీ, సాధారణంగా జానపద కళలు ఆవిర్భవిస్తాయి. ప్రకృతి ఈ కళల ఆవిర్భావానికి దోహదం చేస్తుంది.

జానపదులు తమ శారీరక శ్రమను మరచిపోవడానికి తమ జీవితాలనే వస్తువులుగా మలచుకొని కళారూపాలుగా ప్రదర్శించారు. ఇలా జానపదులు చేసే నృత్యాన్ని జానపద నృత్యం అని అంటారు. తెలుగువారికి అపూర్వమైన జానపద కళా వారసత్వం ఉంది. తరతరాలుగా సంప్రదాయబద్ధంగా మనకు అందింపబడుతున్న ఈ కళారూపాలను ప్రస్తుతం సరైన ఆదరణ లభించడం లేదు. ఇలాంటి సంస్కృతి వారసత్వాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత. జానపద ప్రదర్శన కళలకు తెలుగు భూమి పండిన పంట పొలం జాపద కళా సాహిత్యము ద్వారా జాతి సంస్కృతి తెలుస్తుంది.

ఒక జాతి నిర్మాణానికి కావలసిన ఆకరాలను జానపద కళలు అందిస్తాయనడంలో అతిశయోక్తి లేదు. ఎన్నో రకాల జానపద ప్రదర్శన కళలు తెలుగు నేలను సుసంపన్నం చేసాయి. శతాబ్దాలుగా ప్రజలకు వినోదాన్ని విజ్ఞానాన్ని అందించినవి జానపద ప్రదర్శన కళలే. ప్రాచీన సమాజంలో వినోదం కోసం ప్రజలకు జానపద కళామాధ్యమం తప్ప మరొక మాధ్యమం లేదు. శిష్టుల కళారూపాలు సామాన్య ప్రజల దాకా వచ్చేవికావు. అవి ప్రభువుల కొలువులకు రాజరిక నగరాలకు పరిమితం అయ్యేవి. జన సామాన్యానికి అందుబాటులో ఉండి వారి శ్రామిక జీవితాల్లోని కష్టసుఖాలనే వస్తువుగా మలచుకొని ఆడిన ఆటలే ఈ జానపద కళారూపాలు. మన పురాణ ఇతిహాసాలనెన్నింటినో దృశ్యరూపంలో ప్రజలకు అందించి ప్రజలకు పురాణ జ్ఞానాన్ని కలిగించినవి కూడా ప్రజా కళలే. ఇలాంటి మహోన్నత చరిత్ర కలిగిన జానపద ప్రదర్శన కళారూపాలెన్నో తెలంగాణ ప్రాంతంలో నేటికి సజీవంగా ఉన్నాయి.

తెలంగాణ ప్రథమ కవిగా చెప్పబడుతున్న పాల్కురికి సోమన దేశికవితకు పట్టం కట్టి వారి రచనల్లో ఎన్నో జానపద కళారూపాలను కథలో భాగంగా వర్ణించారు. తెలంగాణ ప్రాంతానికే స్వంతమయిన పేరిణి నృత్యం వంటి ఎన్నో అద్భుత ప్రదర్శన కళలు తెలంగాణ నేలపై ఇంకా సజీవంగా ఉన్నాయి. ఇంతకాలం వలస పాలనలో మరుగున దాగిన తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని లోకానికి చాటి చెప్పాలని చెలిమె పుట కృషి చేస్తుంది. తెలంగాణ ప్రాంత కళారూపాలను కాపాడుకోవల్సిన అవసరాన్ని తెలుపుతూ వాటి ప్రత్యేకతలను వివరిస్తూ సాంస్కృతిక సంబంధ వ్యాసాలను పాఠకులకు అందిస్తున్నారు.

### 5.5.2.1. ఇది మన స్వేచ్ఛానర్తనం

శ్రీరామోజు హరగోపాల్ రాసిన 'ఇది మన స్వేచ్ఛా నర్తనం' అనే వ్యాసం జూలై 04, 2016న నమస్తే తెలంగాణ చెలిమె సాహిత్య పుటలో ప్రచురితమయింది.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ వారు ఆవిర్భావోత్సవాల్లో భాగంగా జూన్ 02, 2016న తెలంగాణకే ప్రత్యేకమైన 'పేరిణి' నృత్యాన్ని పబ్లిక్ గార్డెన్‌లోని లలిత కళాతోరణ వేదిక మీద 256 మంది కళాకారులతో ప్రదర్శన చేయించారు. ఇలాంటిది ఒకటి ఉంటుందని ఎవరు ఊహించని సందర్భం ఇది. ఈ సందర్భంగా వ్యాసకర్త పేరిణి నృత్యం గురించి తెలంగాణ ప్రాంత సంస్కృతిని ప్రశంసిస్తూ ప్రాంతీయ అస్తిత్వవాద ధోరణిలో ఈ వ్యాసాన్ని రాసారు.

ఈ వ్యాసం ప్రారంభంలోనే ప్రాంతీయ అస్తిత్వవాద ధోరణి కనిపిస్తుంది. "తెలంగాణ సర్వకళా సంపన్నమైంది. తెలంగాణకే ప్రత్యేకమైన కళలు కొన్ని, ఉత్సవాలు కొన్ని, ఆటపాటలు కొన్ని, ఎన్ని గొప్పతనాలున్నా అప్పుడేలుతున్న 'ఏలినవారి' చిత్తానుసారం ఇక్కడి కళలకు ఆదరణ తగ్గింది. వివక్ష పెరిగింది. తెలంగాణ కళలు, కళాకారుల పట్ల న్యూనతాభావం కొనసాగింది. తమ ఇంట్లోనే తాము పరాయితనాన్ని అనుభవించిండ్రు. వేదనల్ని మేసిండ్రు. ఇప్పుడా కాలం కాదు. ఇప్పుడా ఏలికలు లేరు. మన తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డది. మన ఆట, మన పాటలకు మంచి కాలం వచ్చింది. ఒకనాడు పట్నంల (హైదరాబాద్) రవీంద్ర భారతి మెట్లెక్కుడు మన కళాకారులకు తెలవదు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక మన కళలకు, కళాకారులకు మర్యాద పెరిగింది. భాషా, సాంస్కృతిక శాఖ అధికారిగా మామిడి హరికృష్ణ రవీంద్రభారతిని సబ్బండ కళాకారులకు వేదిక చేసిండ్రు. తీరొక్క తెలంగాణ కళలకు పండుగ దినాలొచ్చినట్లయిందని, తెలంగాణ ప్రాంతం ఒకనాటి అణచివేతను గుర్తు చేస్తూ ఈనాటి రాష్ట్ర ఆవిర్భావంతో స్వేచ్ఛ లభించినదని తమ సంస్కృతి, సాహిత్యాలకు పట్టంగట్టే రోజు వచ్చిందని ప్రాంతీయ ధోరణిల తెలంగాణ ప్రాంతీయ పదాలను వాడుతూ ఈ వ్యాసాన్ని రాసారు.

దీనిలో తెలంగాణకే ప్రత్యేకమైన 'పేరిణి' నాట్య ప్రాశస్త్యాన్ని అలాగే ప్రాచీన సాహిత్య గ్రంథాల్లో పేరిణి నృత్య ప్రస్తావనను వివరించారు. పేరిణి పురాతన నాట్యం అని నృత్యంలో దేశి, మార్గ, భేదాలున్నాయంటూ పేరిణి దేశినృత్య భేదముగా తెలిపారు. ప్రేరణము, పేరణ, పేరిణిలుగా నాట్యశాస్త్రాల్లో, కావ్యాల్లో దీని ప్రస్తావన కలదని పేర్కొన్నారు. జాయపసేనాని నృత్యరత్నావళిలో పేరిణి దేశి నాట్యబేధంగా చెప్పబడింది. తిక్కన భారతం, నాచన సోమన హరివంశం, శ్రీనాథుడి

భీమఖండం వంటి గ్రంథాల్లో దీని ప్రస్తావన ఉందని పేరిణి నృత్య చరిత్రను తెలియజేసారు. కాకతీయుల కాలం నాటి చారిత్రక విషయాలను ప్రస్తావించారు. "వీరులను యుద్ధాలకు పురిగొలిపేటందుకు చేసిన ఆహవ తాండవ నృత్యమే పేరిణి అని, దీన్ని పురుషులే చేయ్యాలని అంటారు. కానీ చెంగళ్వ కాళకవి 'రాజగోపాల విలాసం'లో వర్ణించిన ముద్దు చంద్రరేఖను పేరిణి కళాకారిణిగా వర్ణించారని వివరిస్తూ స్త్రీలు కూడా పేరిణి నృత్యం చేస్తారని నిషేధం లేదని వివరించారు.

ఇంతటి గొప్ప చరిత్రగల తెలంగాణ నాట్యాన్ని ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 256 మందితో ప్రదర్శన చేయించడం వలన నటరాజ రామకృష్ణగారి కల. తెలంగాణ నాట్యకళ గొప్పగా ఆవిష్కారమైందని ప్రశంసాత్మకంగా ప్రాంతూయ అస్తిత్వవాద ధోరణిలో తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని తెలుపుతూ వ్యాసాన్ని రాసారు.

ఇటువంటి వ్యాసాల వలన ఆ ప్రాంత సంస్కృతీ, సాహిత్యం పట్ల గౌరవం ఆదరణ కలుగుతుంది. అలాగే ఎన్నో పురాతన చరిత్ర గల సాంస్కృతిక కళారూపాలను పాఠకులకు అందిస్తున్నారు. చరిత్ర, సంస్కృతిని కాపాడే పత్రికలు కృషి చేస్తున్నాయి. వ్యాసంలో తెలంగాణ ప్రాంత ప్రత్యేక సంస్కృతిని తెలుపుతూ ప్రాంతీయ భాషను వాడడం మరింత పాఠక హృదయాలకు చేరువ చేస్తుంది.

### 5.5.2.2. తెలంగాణ సంస్కృతి జానపద కళారూపాలు

పోలవల్లి శ్రీకాంత్ మేరు రాసిన 'తెలంగాణ సంస్కృతి జానపద కళారూపాలు' అనే వ్యాసం నమస్తే తెలంగాణ చెలిమె పుటలో అక్టోబర్ 24, 2016న వెలువడింది.

దీనిలో వ్యాసకర్త తెలంగాణ ప్రాంత సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళారూపాలను పరిచయం చేశారు. కళారూపాలకు సంబంధించిన వివరాలను తెలుపుతూ వాటిని ప్రదర్శఇంచే తెగల జాతుల వివరాలను కళారూపాల ప్రత్యేకతలను ఈ వ్యాసంలో చర్చించారు. ప్రస్తుతం యువతకు తెలియని ఎన్నో తెలంగాణ ప్రత్యేక కళారూపాలను వాటి వైశిష్ట్యాన్ని ఈ వ్యాసంలో పొందుపరిచారు.

కళ అనంతమైనది, విశ్వజనీనమైనది పండిత పామరులను సైతం పరవశింపజేసేది. మానవ సంస్కృతిని పరవశింపజేసేవి కళలు. ప్రాచీన కాలం నుండి మనకు కళల ప్రస్తావన కనిపిస్తుంది. భరతుడు నాట్యశాస్త్రంలో, వాత్యాయనుడు కామ సూత్రాల్లోనూ చతుష్షష్టి కళల ప్రస్తావన కలది చెప్తూ తెలంగాణలో అధిక ప్రాశస్త్యం గల జానపద కళారూపాలను వివరించారు.

కళారూపాలను కులవృత్తులుగా చేసుకొని జీవనాన్ని సాగిస్తున్న ప్రజలు ఎంతో మంది కలరు. జానపద కళలకు తెలంగాణ పుట్టినిల్లుగా తెలుపుతూ తెలంగాణ ప్రాంత ప్రత్యేకమైన కళారూపాలను వీధి భాగోతం, చిందుభాగవతం, ఒగ్గు కథ, కోలాటాలు, భజనలు, బుడగ జంగాల వంటి మొదలైన వాటిని వివరించారు. తెలంగాణలో విశేషంగా ఆకర్షించబడుతున్న జానపద కళ యక్షగానం. దీనిని కుర్మ కులానికి చెందినవారు ప్రదర్శిస్తారు. శివుని వాద్యమైన ఢమరుకానికి ఒగ్గు కళాకారులు 'ఒగ్గు'గా పిలుస్తారు.

'వీధి భాగవతం' దీన్నే 'తెలంగాణ వీధి భాగోతం'గా పిలుస్తారు. ఈ కళారూపాల్ని తెలుగులో వీధి నాటకం/వీధి భాగవతం/చెంచు నాటకం/యక్షగానం అని పిలుస్తారు. ఇవి ప్రాంతీయ విశిష్టతలతో కూడి సామాన్య ప్రజలను రంజింపజేసే అద్భుత జానపద కళారూపాలుగా పేర్కొన్నారు.

పిచ్చకుంట్ల/పిచ్చుకగూళ్లు మరియు బహురూపులవారు తెలంగాణ ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తారని వారి వివరాలను తెలిపారు. బహురూపుల వారు పగటి పూటనే చిత్ర విచిత్ర వేషాలు ధరించి ఇల్లిల్లు తిరుగుతూ జీవనాన్ని సాగిస్తారు. పిచ్చుకగూళ్లు వారు తెలంగాణలో కామమ్మ, బాలనాగమ్మ, హరిశ్చంద్రుడు కథలను గానం చేస్తుంటారని ఆయా జాతుల వివరాలను వారి జీవన విధానాన్ని వివరించారు.

తెలంగాణ ప్రాంతంలో ఆదరణ ఉన్న మరో ముఖ్యమైన జానపద కళారూపం పిట్టలదొర. ఆ వేషాన్నే లత్కోర్ సాబ్, బుడ్డర్ఖాన్, తుపాకీ రాముడుగా పిలుస్తారని ఇది పగటి వేషాలతో ఒక రకంగా వివరించారు. మరణించిన వారి గురించి కీర్తిస్తూ పాటలు పాడుతూ యాచించే జాతి కాటికాపరులు వీరు దహన కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ స్మశానంలో అన్ని ఏర్పాట్లు చేస్తారని ఇలా తెలంగాణ సంస్కృతి, జనజీవనాన్ని ప్రతిబింబించే కళలు, కళారూపాలను వాటిపై ఆధారపడిన ప్రజల జీవితాలను ఈ వ్యాసంలో పరిచయం చేశారు. ఇవే కాకుండా ఇంకా వీరముష్టివారు, ఆసాదులు, బుడగజంగాలు, శారదాకాండ్రు, బుడబుక్కలవారు, సాధనాశూరులు, మొదలైన వారి గూర్చి ప్రస్తావిస్తూ పరిచయం చేశారు. దీని ద్వారా ప్రస్తుతం అంతరించిపోతున్న జానపద కళల వైశిష్ట్యం అర్థమవుతుంది. తెలంగాణ ప్రాంత సంస్కృతి, కళారూపాల ప్రత్యేకతలు వాటి స్వరూపం పాఠకులకు తెలుస్తుంది. ఇటువంటి వ్యాసాల ద్వారా తెలంగాణ ప్రాంత సాంస్కృతిక ఔన్నత్యం లోకానికి తెలుస్తుంది. వీటిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది.

### 5.5.2.3. మల్లన్న పురాణం—వృత్తి సాహిత్యం

బి. మురళి రాసిన 'మల్లన్న పురాణం వృత్తి సాహిత్యం' అనే వ్యాసం నమస్తే తెలంగాణ చెలిమె పుటలో మే 16, 2016న ప్రచురితమయింది.

దీనిలో వ్యాసకర్త కులపురాణాల ప్రత్యేకతలను తెలుపుతూ ఒగ్గు కళాకారులు చెప్పే మల్లన్న కులపురాణ విశిష్టతను ఒగ్గు కళారూపాన్ని వివరించారు. కులపురాణాలు కులాల సాంఘిక మతాచారాలకు, ఆచార సంప్రదాయాలకు ఆయువుపట్టు. కులాల ఆచారాలకు సాంఘిక జీవనానికి పురాణాలు ఆకరాలుగా నిర్వచించారు. కులాల సాంఘిక జీవనాన్ని ఇవి గాఢంగా ప్రభావితం చేయడమే కాకుండా, ఆచారాలు అదృశ్యం కాకుండా నిరంతరం కొనసాగేలా కులపురాణాలు చేస్తున్నాయి అని వాటి విశిష్టతను తెలిపారు.

ప్రతి కులంలోను కొన్ని నమ్మకాలుంటాయి. దాని కోసం ఆ కులం ఆచరించే క్రతువులు కొన్ని ఉంటాయి. కులాలు సజీవంగా ఉండటం వల్ల కులాల ఆచారాలపై పురాణ కథ ప్రభావం గాఢంగా పడి, కుల పురాణాలు వాటిని నియంత్రించే స్థితిని చూడవచ్చు అంటూ గొల్ల కురుమల వారికి మల్లన్న కథ కుల పురాణంగా పేర్కొన్నారు. ఒగ్గు కళాకారులు, గొల్లలు, కురుమలు వారికి చెప్పే ఒగ్గు కథ తెలంగాణలో బాగా జనాదరణ పొందింది. ఈ ప్రక్రియలో చెప్పే మల్లన్న, బీరప్ప కథలో కథేతి వృత్తంలో మిళితమైన వీరి వృత్తి, దాని గొప్పతనం, సంస్కృతి అంతా హృద్యంగా వర్ణితమౌతుందని చెప్తూ మల్లన్న కథను, దాని వైశిష్ట్యాన్ని వివరించారు.

తెలంగాణలో కొమిరెల్లి మల్లన్న జాతర తలమానికమైంది. మల్లన్న పూజ చెయ్యడం, గొర్రెలను బలి ఇవ్వడం చివరగా కళ్యాణం చెయ్యడం జరుగుతుంది. పార్వతీదేవి చెప్పినట్లు చెప్పే నియమ నిబంధనలు మందల దగ్గర ఇప్పటికీ పాటిస్తారని చెప్తూ జానపద నమ్మకాలు, జాతరల ప్రస్తావనతో తెలంగాణ సంస్కృతిని ఆవిష్కరిస్తూ వ్యాసాన్ని రాశారు.

యాదవులలో నైతిక విలువలను పెంపొందించుకోవడానికి, ముందు తరాలకు తమ కులం గొప్పతనం తెల్పడానికి కుల పురాణం ఎంతో దోహదపడుతుందని చెప్తూ యాదవులపై ఆధారపడి జీవించే గొల్లసుద్దుల వారు, కొమ్ములవారు, పొడపోతులవారు, మందెచ్చులవారు, జైకానివారు మొదలైన అనేక ఆశ్రిత కులాల వారి ప్రస్తావనతో వారి జీవన విధానాన్ని పరిచయం చేస్తూ ఈ వ్యాసం సాగింది. ఈ విధంగా తెలంగాణ సంస్కృతి, ప్రజల జీవన విధానానికి అద్దం పడుతూ వ్యాసాల ద్వారా తెలంగాణ ప్రత్యేక కళారూపాల గొప్పతనాన్ని పాఠకులకు అందిస్తున్నారు.

### 5.5.2.4. మన మాగాణంలో యక్షగాన ఘనకీర్తి

జె. విజయ్‌కుమార్‌జీ రాసిన 'మన మాగాణంలో యక్షగాన ఘనకీర్తి' వ్యాసం డిసెంబర్ 11, 2017న నమస్తే తెలంగాణ చెలిమె పుటలో ప్రచురితమయింది.

డిసెంబర్ 15–19 వరకు హైదరాబాద్‌లో జరగనున్న ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలంగాణలో ఎందరో దేశీకవులు సృష్టించిన యక్షాగానాలు తెలంగాణ పూర్వ వైభవానికి ప్రతీకగా నిలుస్తాయి. తరతరాలుగా మనకు దిశానిర్దేశం చేసిన ఈ ప్రాచీన సాహిత్యానికి తెలుగు మహాసభలు పట్టం కట్టాలంటూ తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని, యక్షాగానాల విశిష్టతను తెలుపుతూ రాసిన వ్యాసం ఇది.

తెలంగాణ భాషా సాహిత్యం పునరుజ్జీవనం వైపు అడుగులు వేస్తున్న తరుణం ఇది. తెలంగాణ ఆకాంక్షలతో ఏర్పడిన ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలతో తెలంగాణ మాగాణంపై చరిత్రకెక్కని చరితార్థులను, విస్మృత సాహిత్య సంపదను వెలుగులోకి తెస్తున్నది. తెలుగు సాహిత్యంలో వచన సాహిత్యం, కవిత్వం, కథ నవలకు పూర్వమే యక్షగాన వాఙ్మయం వర్ధిల్లింది. మార్గ సాహిత్యం పండితులను ఆకర్షిస్తే ప్రజల మధ్య పుట్టిన దేశీ సాహిత్యం పండిత పామరులను అలరించింది. శతాబ్దాల పూర్వం వాగ్రూపమైన యక్షగానాలు కాల ప్రవాహంలో అక్షరబద్ధమై వాఙ్మయరూపం దాల్చాయని చెప్తూ యక్షగానాన్ని దేశీ వాఙ్మయ శాఖకు చెందిన సాహిత్య ప్రక్రియగా తెలిపారు.

శతాబ్దాల పూర్వం యక్షగానం తెలుగు భాషావ్యాప్తికి, ఉన్నతికి ఎనలేని కృషి చేసిందని తెలిపారు. ఈ బలమైన ప్రక్రియ 700 ఏండ్ల పూర్వమే తెలంగాణలో బలమైన పునాదులను నిర్మించిందంటూ ప్రాచీన సాహిత్యంలో పాల్కురికి సోమన, పండితారాధ్య చరిత్ర, క్రీడాభిరామం, సారంగధర చరిత్రలో యక్షగానాల ప్రస్తావనను దాని పరిణామ క్రమాన్ని వివరించారు. యక్షగాన వికాసాన్ని విశ్లేషించారు. అలాగే తెలంగాణ యక్షగాన సృష్టిలో విశేష కృషి చేసిన చెర్విరాల భాగయ్య గురించి పరిచయం చేస్తూ వారి యక్షగానాల ఘనతను తెలిపారు. ఈ విధంగా ప్రాచీన కాలం నుండి ఎంతో ఘనత వహించిన యక్షగానాలు తెలంగాణ ప్రాంత వైభవానికి ప్రతీకగా పేర్కొంటూ ఇంకా వెలుగు చూడని ఎన్నో వాగ్రూపమైన యక్షగానాలను గ్రంథస్థం చెయ్యాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ వ్యాసంలో తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ఆవిష్కరిస్తూనే, యక్షగానాల ప్రత్యేకతను, యక్షగాన కవులను వారి ప్రత్యేకతలను తెలియజేశారు. ఇంతకాలం ఆదరణ లభించని ఎందరో తెలంగాణ మహనీయుల గొప్పతనాన్ని లోకానికి చాటి చెప్పారు.

### 5.5.2.5. సాంస్కృతిక సంబంధ వ్యాసాల పట్టిక

ఈ విధంగా తెలంగాణ ప్రాంత జీవితాన్ని, సంస్కృతిని ప్రతిబింబింపజేసే సాంస్కృతిక సంబంధ వ్యాసాలు మనకు మరికొన్ని కనిపిస్తున్నాయి. వాటి వివరాలను కింది పట్టికలో గమనించగలరు.

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | జానపదంతోనే జాతి వెలుగులు | డా. హెచ్. అనిత | ఆగస్టు 21, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 2) | ప్రచారాస్త్రాలుగా జానపదాలు | బోనాల ప్రకాశ్ | మే 22, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 3) | సకల కళల ఖజానా – తెలంగాణ | మామిడి హరికృష్ణ | నవంబర్ 27, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 4) | తెలంగాణ జానపద జావళీలు | వెల్దండి శ్రీధర్ | సెప్టెంబర్ 11, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 5) | జన జీవన హాస్య గేయాలు | డా. సందినేని రవీందర్ | అక్టోబర్ 16, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 6) | మన కథలు మన దృశ్యాలు | హుమాయున్ సంఘీర్ | ఆగస్టు 22, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 7) | తెలంగాణలో సాయుధ పోరాటం – గేయ కవిత్వం | డా. సందినేని రవీందర్ | సెప్టెంబర్ 19, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 8) | జానపద పాట... ఉద్యమ ఆట... ధూం ధాం... | ఎస్. మల్లారెడ్డి | ఫిబ్రవరి 27, 2017 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 9) | ఊరు చరిత్ర మీద పాదముద్ర | రాజేందర్ జింబో | నవంబర్ 14, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |
| 10) | సురాసుర పూజితుడు – రాజరాజేశ్వరుడు! | డా. వద్దేపల్లి కృష్ణ | మార్చి 03, 2016 | నమస్తే తెలంగాణ – చెలిమె |

**పట్టిక – 26**

### 5.6. సామెతలు

సామెతలు అనేవి ఆ భాష మాట్లాడే ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. అందుకే తెలుగులో "సామెత లేని మాట ఆమెత లేని ఇల్లు" అని అంటారు. అక్షరజ్ఞానం ఉన్నవారు కానీ, లేనివారు గానీ తమ మాటల్లో ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక విధంగా చమత్కారయుతమైన నానుడిని ప్రయోగిస్తూ ఉంటారు. 'సామ్య' శబ్దానికి 'సామ్యత' అనే అసాధారణ రూపం ఏర్పడి

'సామెత'గా రూపొంది ప్రచారంలో ఉందన్న డా. చిలుకూరి నారాయణరావు అభిప్రాయం సమంజసమైంది. "కన్నడంలో కూడా సామెతకు సమానమైన పదం 'సామతి'. ఈ సామతి కూడా 'సామ్యతె' నుండి ఆవిర్భవించింది. తెలుగులో కూడా 'సామ్యత' నుండే సామెత ఉద్భవించింది అనడంలో సత్యాంశం కన్పిస్తుంది" ( మోహన్, జి.యస్.2010.పుట.115). సామెతను ఆంగ్లంలో 'Proverb' అని అంటారు. A general or common saying అని దీని అర్థం. హిందీ భాషలో 'కహోవత్' అనీ, కన్నడ, తుళు భాషల్లో 'గాదె' అనీ, తమిళంలో 'పళమొళి' అని, మలయాళంలో 'పళించొల్' అని సామెతను వ్యవహరిస్తున్నారు.

'నానుడి', 'లోకోక్తి', 'శాస్త్రం', 'జనశ్రుతి' అనేవి సామెతకు పర్యాయ పదాలుగా చెప్పబడుతున్నాయి. మానవుడు తన జీవితంలో సుఖదుఃఖాలను రెండింటిని సమానంగా అనుభవిస్తాడు. తన అనుభవాన్ని ఇతరులకు ఉపదేశాత్మకంగా, సందేశ రూపంలో చిన్ని వాక్యంగా సామ్యత చూపిస్తూ సామెతగా రూపొందిస్తాడు అలాంటి అనుభవాల సంగమంతో జనించిందే సామెత. కేవలం అనుభవాల నుంచే కాక కథలలోని నీతుల నుంచి కూడా ఏర్పడిన సామెతలెన్నో ఉన్నాయి. ఉదాహరణకి 'పోరు నష్టం పొందు లాభం', 'ఇద్దరు పోట్లాడితే మూడోవాడికి లాభం' ఇత్యాదులు.

సామెతలు అనుభవాల నుండి పుట్టాయని అనుకున్నప్పుడు, ఆ అనుభవం కేవలం ఒక్కనిదే కాదు. జన సామాన్యులందరిది కూడా. సామెత కూర్పు మాత్రం ఒక్కడిదే కావచ్చు. కాని అది పలువురి అనుభవం మీద ఆధారపడి ఉంటుంది. Earl Russell సామెతలు గురించి చెప్తూ 'The wisdom of many and the wit of one?' అని పేర్కొన్నాడు (డా. మోహన్, జి.ఎస్.2010.పుట.103).

సామెతల్లో భాషా సౌందర్యం, అనుభవసారం, నీతిసూచన, హాస్యం అనేవి కనిపిస్తాయి. ఏ ఒక్కరిని రచయితగా చెప్పలేము. ప్రజల అనుభవాల నుండే సామెతలు పుట్టుకొస్తాయి.

సామెతలు ప్రసంగానికి దీపాల్లాంటివి. అవి సంభాషణకు కాంతినిస్తాయి. సామెతల్లో ధ్వని ఉంటుంది. ఇది ఒక జాతి సంస్కృతిని చెప్పకనే చెబుతాయి. ఒక సూక్తిని కట్టినంత మాత్రాన అది సామెత అనిపించుకోదు. అది ప్రజామోదాన్ని పొంది జనజీవితంలో చలామణి అయితీరాలి. దీన్నే Archer Taylor 'Both the invention and the acceptance are essential to make a proverb' అని అన్నాడు. ఈ విషయాన్నే Eiselein 'A proverb is a sentence

coined with the public stamp, current, and of acknowledged value among the people' అన్నాడు (డా.మోహన్, జి.ఎస్.2010.పుట.103).

పూర్వుల అనుభవసారాన్ని తెలిపే ఈ సామెతలు దేశీయ పద సమ్మిళితములై ప్రజల ఆచారాలను, సంస్కృతులను, నాగరికతలను, మనోభావాలను ప్రకటిస్తాయి. వీటిని చదివినా, విన్నా గానీ నీతిని బోధిస్తూ ప్రాపంచిక జ్ఞానాన్ని వృద్ధి చేస్తుంది. ఇటువంటి సామెతల గురించి అనేకులు వారి అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

తొల్కాప్పియమ్ వ్రాసిన తొల్కాప్పియర్ సామెతను గురించి చెప్తూ "A proverb is a sentence meant for conveying particular idea. It should be based on a reason, or it must have the characteristics of point, brevity, wisdom and simplicity" అని పేర్కొన్నారు.

శ్రీమతి దుర్గాభాగవత్ 'సంగ్రహంగా ఒక అప్రియమైన సత్యాన్ని చెప్పే సారభూతమైన వాక్యం సామెత'గా పరిగణించారు. 'సత్యాన్ని చెప్పడం మాత్రం అసంపూర్ణం, అది అతిశయోక్తిగా, అలంకారికంగా చెప్పబడుతుంది' అని ఆమె అభిప్రాయపడ్డారు.

ఈ అభిప్రాయాల ఆధారంగా జి.ఎస్. మోహన్ సామెతను ఇలా నిర్వచించారు.

"అనుభవయుక్తం, నీతిబోధాత్మకం, ఉపదేశాత్మకం, సూత్రబద్ధంగా ఉండి సంక్షిప్త వాక్యరూపంలో ఉండే లోకుల చమత్కారోక్తియే సామెత". ఒకే సామెతలో ఈ నియమాలన్ని ఉండి తీరాల్సిన అవసరం లేదని చెప్పారు (డా. మోహన్, జి.ఎస్.2010.పుట.104).

సమాజం, ప్రజాజీవనం మాత్రమే సామెతలోని వస్తువని తెలుపుతూ సామెతకు ఉండవలసిన కొన్ని లక్షణాలు జి.ఎస్. మోహన్ కింది విధంగా పేర్కొన్నారు.

1) సంక్షిప్తత.
2) వాక్యరూపంలో ఉండటం.
3) అనుభవ రూపంలో ఉండటం.
4) తీక్ష్ణత.
5) వివేకవంతమైన అంశాన్ని కలిగి ఉండటం.
6) సార్వజనీనత.
7) ఉపదేశాత్మకత,

8) వాచ్యార్థం కంటె వ్యంగ్యార్థానికే ప్రాధాన్యం ఇవ్వడం

(2010.పుట.105).

ప్రజా జీవితాన్ని, సంస్కృతిని ప్రతిబింబించే ఈ సామెతలు వస్తువు ఆధారంగా అనేక రకాలుగా కనిపిస్తున్నాయి. సాంఘికాచార వ్యవహారాలకు సంబంధించినవి, పౌరాణిక సామెతలు, వ్యక్తిగత సామెతలు, హాస్యపు సామెతలు, వ్యవసాయ సంబంధ సామెతలు ఇలా అనేక రకాలుగా సామెతలు మానవ జీవితంలో మమేకమైపోయాయి.

ఇటువంటి సంస్కృతి సంప్రదాయాల్లో భాగమైన సామెతల గొప్పతనాన్ని తెలుపుతూ వాటి ఆవశ్యకతను వివరిస్తూ దినపత్రికల సాహిత్యపుటల్లో వ్యాసాలు కనిపిస్తున్నాయి. వాటి ద్వారా సామెతల గొప్పతనాన్ని, జన జీవన చిత్రణను పాఠకులకు అందిస్తున్నాయి.

### 5.6.1. సామెతలు సాహిత్యానికి సొబగులు

'సామెతలు సాహిత్యానికి సొబగులు' అనే వ్యాసాన్ని పరవస్తు లోకేశ్వర్ రాశారు. ఇది ఆగస్టు 07, 2017న నమస్తే తెలంగాణ చెలిమె పుటలో ప్రచురితమయింది.

సామెతలు సాహిత్యానికి సొబగులంటూ సామెతల గొప్పతనాన్ని ఇందులో వివరించారు. హైదరాబాద్ దక్కనీ ఉర్దూ భాషా సాహిత్యాల్లో సామెతలకు ప్రత్యేక స్థానముంది. భాషా సాహిత్యంలోనూ, వాడుకలోనూ సమయానుకూలంగా, సందర్భానుసారంగా ఉపయోగించే సామెతలు ఆ సాహిత్యానికి అదనపు సొబగులు అద్దాయి అంటూ, దక్కనీ జన జీవితంలో ఉన్న ఉర్దూ సామెతల సమాహారమే ఉర్దూ భాషా సౌందర్యానికి ప్రతీకగా తెలిపారు. హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే ఉర్దూ సామెతల గొప్పతనాన్ని తెలుపుతూ వాటిని ఈ వ్యాసంలో పరిచయం చేశారు.

వివిధ సందర్భాల్లో ఉపయోగించే ఉర్దూ సామెతలను పరిచయం చేస్తూ వాటికి వివరణనిచ్చారు. అలాగే అవి ఉపయోగించే సందర్భాలను తెలిపి తెలుగులో వాటికి గల సమానార్థక సామెతలను అలాగే వాటి అర్థానికి దగ్గరగా ఉన్న తెలుగు సామెతలను ఈ వ్యాసంలో పేర్కొన్నారు. జన జీవన చిత్రణ, అనుభవాల సారమే సామెతలంటూ ఎన్నో జీవితానుభవాల నుండి పుట్టుకొచ్చిన, సందర్భానుసారమైన సామెతలను వివరించారు.

**'లోహె కా చనే చబానా'**

ఇనుప గుగ్గిళ్లను అనవసరంగా నమలవద్దు. పళ్లు ఊడిపోతాయని ఇదొక హెచ్చరిక. తగని పనులు తలనొప్పులు తెస్తాయని జీవితానుభవాన్ని తెలిపే సామెత ఇది.

**‘అప్నీ ఇజ్జత్ అప్నే హాత్ మే’**

మన మాటల, చేతలతోనే మన గౌరవం ఉంటుందని మన ప్రవర్తన వలననే మనకు గౌరవం లభిస్తుందని దీని అర్థం.

ఉర్దూ సామెతలకు సమానార్థకంగా ఉన్న తెలుగు సామెతలను దీనిలో పేర్కొన్నారు.

| | | |
|---|---|---|
| ‘ఏక్ మియాన్ మేదో తల్వార్’ | – | ఒక కొరలో రెండు కత్తులు ఇమడవు; |
| ‘ఆప్ బలేతో జగ్ బలా’ | – | నోరు మంచిదైతే ఊరు మంచిది; |
| ‘జైసీ రాజా వైసీ ప్రజా’ | – | యథా రాజా తథా ప్రజా; |
| ‘జల్తీ పర్ నమక్ చిడ్‌ఖానా’ | – | పుండు మీద కారం చల్లినట్లు లేదా అగ్నికి ఆజ్యం పోసినట్లు; |
| ‘హాత్ కీ కంగన్ కో అయినా క్యోం’ | – | ముంజేతి కంకణానికి అద్దం అవసరమా? |

ఇలా తెలుగు సామెతలకు సమానార్థకాలుగా ఉన్న ఉర్దూ సామెతలను తెలిపారు.

ఈ విధంగా మన సంస్కృతిని, జీవన విధానాన్ని చిత్రించే ఎన్నో ఉర్దూ సామెతలను తెలిపి వాటి ప్రత్యేకతను వాటి వివరాలను పాఠకులకు అందించారు.

‘బేఖూఫ్ దోస్త్ సే అకల్‌మంద్ దుష్మన్ అచ్ఛాహై’ – తెలివి తక్కువ స్నేహితుడి కన్నా తెలివైన శత్రువు మనకు ఉపయోగం. శత్రువులకు, విమర్శకులకు మనం ఎల్లప్పుడు కృతజ్ఞులమై ఉండాలి. వారి వలనే మనం అభివృద్ధి చెందుతామనే జీవిత సత్యాన్ని తెలుపుతుంది. ఇలాంటి ఎన్నో అనుభవాల సారమే సామెతలు అంటూ తెలిపారు.

### 5.6.2. సామెతల్లో జీవన చిత్రణ

సయ్యద్ ఆఫ్రిన్ బేగం రాసిన ‘సామెతల్లో జీవన చిత్రణ’ అనే వ్యాసం మే 02, 2016న నమస్తే తెలంగాణ చెలిమె పుటలో వెలువడింది.

జాతి సంస్కృతిని ప్రతిబింబించే సామెతల గురించి తెలుపుతూ సామెత నిర్వచనాలను, సామెతల్లో రకాలను, వాటి ప్రత్యేకతలను దీనిలో పరిచయం చేశారు.

ఒక జాతి, సంస్కృతి, నాగరికతలు, ఆచార వ్యవహారాలు మొదలైనవి ఆ జాతి మాట్లాడే భాషపై, ఆ భాషలోని సాహిత్యంపై ఆధారపడి ఉంటాయి. జానపద సాహిత్యంలో భాగమైన పొడుపు కథలు, సామెతలు, భాషా వైశిష్ట్యానికి మచ్చుతునకలు. భాష సజీవమైనది కాబట్టి ‘సామెత’లు భాషకు జీవనాడి వంటివని తెలిపారు.

సామెతల్లో వ్యక్తుల స్వీయానుభవాల నుంచి, సంఘ జీవితంలో అనుభవం చేత గోచరమయ్యే సత్యాలు, మూర్తిభవించి ఉంటాయని తెలుపుతూ సామెతల స్వరూపాన్ని వివరించారు. మనిషి అనుభవాలే సామెతలకు మూలమంటూ సామెతల్లో రకాలను తెలిపారు. ఎన్ని శాస్త్రాలు చదివినా అనుభవం కలవాడితో సమానుడు కాలేడని 'చిన్నవాడి చదువు కన్నా గొప్పది పెద్దవాడి అనుభవం'. అనుభవమే శాస్త్రం, మాటలే మంత్రాలు అనే సామెత అనుభవాన్ని మించిన శాస్త్రం ఉండదంటుంది. వీటిని బట్టి చూస్తే జీవితానుభవాలే సామెతల పుట్టుకకు కారణమయ్యాయని తెలుస్తుంది.

కొన్ని సామెతలు అనుభవాల నుండి కాకుండా కథా సరిత్సాగరము, పంచతంత్ర కథల్లోని నీతుల నుంచి పుట్టినాయంటూ సామెతల రకాలను తెలిపారు. పురాణాలు, ఇతిహాసాలైన భారత, రామాయణాలను ఆధారం చేసుకొని పుట్టిన సామెతలున్నాయి. 'తనకు మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరము', 'వింటే భారతం వినాలి, తింటే గారెలు తినాలి' లాంటి కొన్ని సామెతలు స్థల పురాణాలకు సంబంధించేవిగా ఉన్నాయి. 'తిరుపతి క్షౌరం', 'రామేశ్వరం పోయిన శనేశ్వరం వదలదు', 'కాశీకి పోయినవాడు కాటికి పోయినవాడు ఒక్కటే', 'హంపికి పోయేదాని కన్న కొంపలో ఉండేది మేలు' లాంటివి పౌరాణిక సామెతలుగా పరిగణింపబడుతున్నాయని సామెతల రకాలను వివరించారు.

సామెతల్లో కుటుంబ జీవిత చిత్రణయే కాక సమగ్రమైన సాంఘిక జీవన చిత్రణ కూడా ప్రతిఫలిస్తుంది. సామెతలు ప్రజల జాతీయ, సాహిత్య, సాంస్కృతిక స్వరూపాల్ని తెలుపుతాయి. ఇవి సాంఘిక చరిత్ర నిర్మాణానికి ఆధారాలు, ప్రాచీన సంస్కృతికి నిలువుటద్దాలు. మనిషికి వ్యక్తిత్వం చాలా ముఖ్యమైంది. మనిషి స్వభావాన్ని ప్రవర్తనను బట్టి సమాజంలో మనిషి చేసే పనులను, గుణగణాలను బట్టి విమర్శించే, హెచ్చరించే విధంగా ఎన్నో సామెతలున్నాయని వాటిని వివరించారు.

ఉదా: 'అబద్ధం చెప్పితే అన్నం పుట్టదు', 'నిధానమే ప్రధానం', 'ఆలస్యం అమృతం విషం'.

ప్రజల్లో విశ్వాసాలు గమనిస్తే శకునాలు, అదృష్టం, దురదృష్టం, స్వప్నాల వంటి ఎన్నో కనిపిస్తాయి. ఇవన్నీ సంస్కృతిలో భాగాలే వీటిని ప్రతిబింబించే సామెతలు అనేకం ఉన్నాయని వాటిని వివరించారు.

ఉదా: 'ఉంటే ఉగాది లేకుంటే ఏకాసి'.

'గతికితే అతకదు', ఇది సమాజంలో ఉన్న ఒక విశ్వాసాన్ని చెపుతుంది. వివాహ ప్రయత్నం చేస్తున్నప్పుడు వియ్యంకులు భోజనం చేయరు ఒకవేళ చేస్తే, ఆ సంబంధం అతకదని వారి

విశ్వాసాన్ని తెలియజేసే సామెత. ఇవే కాక వ్యవసాయ సంబంధ పండుగలు, వివాహం, కుటుంబ సంబంధం వంటి అనేక రకాల సామెతలు మనకు మన జీవితాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇలా నిత్య జీవితానుభవాలే సామెతలుగా నడిపిస్తున్న విధానాన్ని తెలుపుతూ సామెతను నిర్వచించి, సామెతల రకాలను పరిచయం చేశారు. ఒక సంస్కృతికి, సమాజ జీవన విధానానికి సామెతలు ప్రతిబింబాలుగా పేర్కొన్నారు. దీని ద్వారా మన సంస్కృతి గొప్పతనం అలాగే సామెతల ప్రత్యేకత అవగతమవుతుంది. సామెతలు మానవ జీవితానికి ఆధారమని తెలుపుతుంది.

**5.7. సాహిత్య ఉత్సవాలు**

ఉత్సవాలు, పండుగలు సంస్కృతిలో ప్రధాన పాత్ర పోషిస్తాయి/వహిస్తాయి. సాధారణంగా ప్రజలు జరుపుకునే దేవతా సంబంధ ఉత్సవాలు, జాతరలే కాకుండా సాహిత్య సంబంధం ఉత్సవాలు కూడా సంస్కృతిలో భాగంగా చెప్పవచ్చు. సాహిత్యానికి, సంస్కృతికి అవినాభావ సంబంధం కలదు. కావున ప్రజల సంస్కృతిని ప్రతిబింబింపజేసే సాహిత్య సంబంధ ఉత్సవాలు కూడా సాంస్కృతిక సంబంధ విషయాలుగా చెప్పవచ్చు. తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక జీవనానికి పట్టం కడుతూ సాగిన ఉత్సవ సంబంధ వ్యాసాలు మనకు సాహిత్య పుటల్లో కనిపిస్తున్నాయి. సాహిత్య సంబంధ ఉత్సవాల ప్రత్యేకతలను, వాటి వివరాలను తెలుపుతూ సాహిత్య ఉత్సవ సంబంధ వ్యాసాలను ప్రచురిస్తున్నారు.

**5.7.1. ఎన్ని తీర్లుగ మాట్లాడిన తెలుగు తెలుగే**

ప్రపంచ తెలుగు మహాసభలు డిసెంబర్ 15, 2017 నుండి డిసెంబర్ 19, 2017 వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్, మహాసభల కోర్ కమిటీ అధ్యక్షులు నందిని సిధారెడ్డితో సాక్షి – సాహిత్య ప్రతినిధి జరిపిన ప్రత్యేక సంభాషణ ఇది. నవంబర్ 27, 2017న ప్రచురితమయింది.

తెలుగు సాహిత్య చరిత్రలో తెలంగాణ స్థానాన్ని సుస్థిరం చేయడం ఇప్పటి తరాన్ని తెలుగు భాష పట్ల ఆకర్షితులను చేయడమనే రెండు ప్రధాన లక్ష్యాలు ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా నెరవేరగలవని సిధారెడ్డి వివరించారు. అలాగే మహాసభల గురించి వివరాలు, ప్రాతిపదికల, సభల ఏర్పాటు సంబంధ విషయాలను చర్చించారు. 1975లో మొదటి ప్రపంచ మహాసభలు హైదరాబాద్‌లో జరిగిన 40 సంవత్సరాల తర్వాత మళ్ళీ ఇప్పుడు జరుగుతున్న ఈ సభలు దాని కొనసాగింపు కాదని వీటిని ప్రత్యేకంగా చూడాలంటూ ఇవి తెలంగాణలో జరుగుతున్న తొలి మహాసభలుగా చూడాలని తెలిపారు. "తెలుగు భాషా సాహిత్య సాంస్కృతిక వికాసానికి తెలంగాణ

వైపు నుంచి కూడా గణించదగిన కృషి జరిగింది. తెలుగులో తొలి ప్రాతిపదిక, భూమిక తెలంగాణ నుంచి వచ్చాయన్న విషయాన్ని తెలుగు సాహిత్య చరిత్రలో నమోదు చేయడమనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం సంకల్పించిన మహాసభలివి అని వివరించారు. సభల సందర్భంగా తెలుగు అకాడమీ మరుగునపడిన తెలంగాణ వైతాళికుల మీద 70 మోనోగ్రాఫ్‌లు ప్రచురిస్తోందని ప్రచురణ సంబంధ వివరాలను తెలిపారు. ఈ ఇంటర్వ్యూ ద్వారా ప్రపంచ మహాసభల లక్ష్యం, ప్రాతిపదిక, సభల ఏర్పాట్లు, సంబంధ వివరాలు, జరగబోయే విధానం, ప్రచురణ సంబంధ వివరాలు వంటి అనేక విషయాల గురించి అవగాహన లభిస్తుంది. సామాన్య ప్రజల సందేహాల నివృత్తికి అలాగే సాహిత్య వైభవాన్ని తెలిపే ఉత్సవ తాలూకు వివరాలకు ఈ ఇంటర్వ్యూ ఉపయోగపడుతుంది.

### 5.7.2. యాస భాషల అలయ్ బలయ్

సాక్షి సాహిత్యం పుటలో డిసెంబర్ 11, 2017న 'యాస భాషల అలయ్ బలయ్' పేరుతో సుద్దాల అశోక్ తేజ ఇంటర్వ్యూ ప్రచురితమయింది. ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి సి.హెచ్.ఎమ్. నాయుడు.

డిసెంబర్ 15–19వరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత మొదటిసారిగా నిర్వహించబడుతున్న ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు భాషా స్థితిగతుల గురించి అశోక్ తేజ వారి అభిప్రాయాలు దీనిలో వ్యక్తపరిచారు. కారణాలు ఏమైనా తెలంగాణ భాష, సంస్కృతులు మరుగున పడిపోయాయి లేదా చీకట్లోకి నెట్టి వేయబడ్డాయి. ఆ చీకటి పొరలను, దుమ్మూ ధూళిని తొలగించి వెలుగులోకి తెచ్చే సందర్భమే ఈ మహాసభలని వివరించారు. నేటి తరానికి మన సంస్కృతీ సంప్రదాయాలను, మన భాషా సౌందర్యాన్ని తెలపడానికి ఇదే అదను ఇది మహానుభావులకు దక్కుతున్న గౌరవంగా పేర్కొన్నారు. హాలుడు, పోతన, పాల్కురికి సోమన, పంప కవి, సుద్దాల హనుమంతు, భాగ్యరెడ్డి వర్మ, రుద్రమదేవి వంటి ఎందరో మహనీయుల పేరిట తోరణాలు వెలియడం అద్భుతం. అది ఎనలేని సారస్వత సంపదను వారసత్వంగా అందించిన మహానుభావులకు దక్కుతున్న గౌరవంగా తెలుపుతూ మహాసభల విశిష్టతను వివరించారు.

తెలుగు భాష పరభాష–యాసల వల్ల పలుచనైపోలేదు. తనలో పరభాషా పదాలను కలుపుకొని ఇంకా సుసంపన్నమవుతుందని వివరించారు. తెలంగాణ సంస్కృతి ఔన్నత్యాన్ని తెలుపుతూ "బువ్వదినే ఏళయితే ఎవ్వరొచ్చినాసరే, తిందాం రా" అనేటోడే తెలంగాణవాడు. తురక, తెలుగు అనే అరమరిక లేక తన పిల్లలను 'బేటా' అని పిలిచేటోడు తెలంగాణవాడు. జమ్మి చేతులుంటే చాలు జన్మశత్రువు ఎదురొచ్చినా 'అలయ్ బలయ్' ఇచ్చేటోడు తెలంగాణవాడు.

కొవ్వెక్కిన మదం కాదు పువ్వోసంటి మనసుతోని 'నువ్వు' అని పిలిచేటోడు తెలంగాణవాడు అని తెలంగాణ సంస్కృతి, గొప్పతనాన్ని కొనియాడారు/పేర్కొన్నారు.

### 5.7.3. సాహిత్య ఉత్సవ సంబంధ వ్యాసాల పట్టిక

ఇలాంటి సాహిత్య ఉత్సవ సంబంధ వ్యాసాలు దినపత్రికల సాహిత్య పుటలో మరికొన్ని కనిపిస్తున్నాయి. వాటి వివరాలు కింది పట్టికలో తెలియజేశాను

| క్రమ సంఖ్య | వ్యాసం పేరు | వ్యాసకర్త | ప్రచురించిన తేదీ | పత్రిక |
|---|---|---|---|---|
| 1) | పెద్దన్న తెలియని సోమన్న మరుగున పడోద్దు | దేశపతి శ్రీనివాస్ | డిసెంబర్ 04, 2017 | సాక్షి – సాహిత్యం |
| 2) | రెండు సాహిత్య ఉత్సవాలు | ఓల్గా | ఫిబ్రవరి 06, 2017 | సాక్షి – సాహిత్యం |

**పట్టిక – 27**

### 5.8. పత్రికలు–సాంస్కృతిక కృషి

తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాల్లో పత్రికలు గణనీయమైన పాత్రను పోషించాయి. 19వ శతాబ్ది ఉత్తరార్థంలో అవిభక్త మద్రాసు రాష్ట్రంలో ముద్రణా యంత్రాల స్థాపన వల్ల తెలుగు పత్రికలు చాలా వరకు అక్కడి నుంచే కొనసాగేవి. తెలంగాణ సంస్థానాల్లో కొన్ని ముద్రణా యంత్రాలు నెలకొని ఉన్నా ఆర్థికపరమైన ఇబ్బందులు, నిజాం ప్రభుత్వ ఆంక్షల కారణంగా ఇక్కడ పత్రికారంగం అభివృద్ధి చెందలేదు. అయినప్పటికీ తెలంగాణ భాషా సాంస్కృతిక చైతన్య వికాసానికి పత్రికలు ఎంతగానో కృషిచేసాయి. హైదరాబాదు రాష్ట్రంలో ఉర్దూ, ఇంగ్లీషు పత్రికలతో సమానంగా తెలుగు పత్రికలు ప్రారంభమైనాయి. 1913లో హితబోధిని మొదలుకొని అనేక మాస, వార, దినపత్రికలు వెలువడ్డాయి. బ్రిటీషాంధ్రలో క్రైస్తవ మత ప్రచారం కొరకు పత్రికల ప్రాదుర్భావం జరిగినా, నిజాం రాజ్యంలో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పత్రికలు కొనసాగాయి. తెలంగాణ సంపాదకులు నిరంకుశ ప్రభుత్వాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పత్రికలను నడిపారు. సాహిత్య సాంస్కృతికాభివృద్ధికి కృషి చేసిన పత్రికల గొప్పతనాన్ని తెలుపే వ్యాసాలు మనకు సాహిత్యపుటల్లో కనిపిస్తున్నాయి.

### 5.8.1. ఓరుగల్లు పత్రికలు... ఉద్యమ వేదికలు

నమిలకొండ సునీత రాసిన "ఓరుగల్లు పత్రికలు... ఉద్యమ వేదికలు" అనే ఈ వ్యాసం నమస్తే తెలంగాణ 'చెలిమె' పుటలో మే 30, 2016న వెలువడింది.

నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరిస్తూ, ప్రజా సంక్షేమం కోసం పోరాడి తెలంగాణ సాహిత్య సాంస్కృతిక ఉద్యమాల్లో క్రియాశీల పాత్రను పోషించిన ఓరుగల్లు పత్రికలు 'ఉద్యమ వేదికలంటూ' వ్యాసకర్త ఓరుగల్లు పత్రికల కనీస పరిచయం చేస్తూ రాసిన వ్యాసమిది.

వ్యాసకర్త ఓరుగల్లు పత్రికల ఆవిర్భావం, ఆశయాలు సాధించిన విజయాలు, వాటి సాహిత్య, సాంస్కృతిక సేవ గురించి పరిచయాత్మకంగా రాసిన వ్యాసం ఇది. వరంగల్ జిల్లా నుండి వెలువడిన తెనుగు, ఆంధ్రాభ్యుదయం శోభ, కాకతీయ, వెలుగు, జనధర్మ వంటి పత్రికల గురంచి పరిచయం చేశారు.

వరంగల్ జిల్లా వివిధ ఉద్యమాలకు ఊపిరిలూదిందీ. అలాగే వరంగల్ జిల్లాలోని పత్రికారంగం ఉద్యమాలెన్నింటికో వేదికగా నిలిచింది. నిజాం వ్యతిరేకోద్యమం, తెలంగాణోద్యమం వంటి ప్రజాస్వామిక ఉద్యమాలెన్నింటికో వరంగల్ జిల్లాలోని పత్రికలు ఊతమిచ్చాయి అంటూ వాని ప్రత్యేకతలను పరిచయం చేశారు.

వరంగల్ జిల్లా పత్రికారంగానికి పురుడు పోసిన పత్రిక 'తెనుగు' ఇది 1922 ఆగస్టు 27న మారుమూల ప్రాంతమైన 'ఇనుగుర్తి' గ్రామం నుండి వెలువడింది. దీనికి ఒద్దిరాజు సోదరులు సంపాదకులు. తెనుగు పత్రిక నిజాం దమన నీతిని పత్రికాముఖంగా వెలువరించడంలో చూపిన చొరవ, తెగువ మిగతా పత్రికలకు మార్గదర్శకమైనది. తెలంగాణ సాంస్కృతిక వికాసానికి పట్టుగొమ్మగా నిలిచిన పత్రిక తెనుగు అని వివరించారు.

సాహితీ నేపథ్యంతో వెలువరించబడిన మాస పత్రిక ఆంధ్రాభ్యుదయం. దీనిని కోకల సీతారామ శర్మగారు 1923 సంవత్సరం జూన్‌లో వెలువరించారు. దేశాభిమానం, ఆంధ్రాభిమానం సమానంగా కలిగిన పత్రిక ఆంధ్రాభ్యుదయం. ఈ పత్రికకు తెలంగాణ పట్ల గల సాహిత్య, సాంస్కృతిక అభిమానాన్ని వివరిస్తూ పత్రికా సంపాదకుని మాటలను పేర్కొన్నారు. 'ఘనత వహించిన ఆ నిజాము రాష్ట్రం నిర్జీవ క్షేత్రం కాదు. ఆంధ్రుల పవిత్ర రక్తధారలు ప్రవహించిన సకర్మక్షేత్రం. ఆంధ్ర పరాక్రమ జ్యోతి వెలిగించిన దివ్యక్షేత్రం. ఈ పవిత్ర భూమి నవతరించిన మహాకవుల జీవితము నాంధ్ర దేశీయులకు వెల్లడించుటయు, జీర్ణములై కాలప్రవాహమున లీనముగానున్న యుత్తమ (తాళపత్ర) రాజ గ్రంథములను, చారిత్రక సంబంధ విషయములగు తామ్ర, శిలా శాసనములను, దాన పత్రము లర్జించుట నిజాం రాష్ట్రవాసులపైన మన ఆంధ్రుల విధి' అంటూ తెలంగాణ పౌరులకు కర్తవ్యబోధ చేసిన విధానాన్ని వివరించారు. తెలంగాణ సాంస్కృతిక

వారసత్వం, ఇక్కడి ఘనమైన సారస్వత చరిత్ర పట్ల 'ఆంధ్రాభ్యుదయం' పత్రిక అపారమైన ఆదరాన్ని ప్రకటించిన తీరును వివరించారు.

తెలంగాణ ప్రాంత ప్రజలు తెలుగులో మాట్లాడుకోలేని దుస్థితి కొనసాగుతున్న కాలంలో నిజాం పాలనలో ఉర్దూ ముసుగు వేసిన తెలంగాణ తల్లిని విముక్తి చేయాలనే దృఢ సంకల్పంతో దేవులపల్లి రామానుజారావు 1947లో వరంగల్ నుండి శోభ మాస పత్రికను స్థాపించారు. ఈ పత్రిక ఘాటైన సంపాదకీయంతో నిజాం పాలనను వ్యతిరేకిస్తూ ప్రజలను చైతన్యపరిచింది.

వాస్తవాలను నిర్భయంగా ప్రచురిస్తూ నిజాం ప్రభువుల గుండెల్లో గుబులు పుట్టించిన పత్రిక కాకతీయ పత్రిక 1948 అక్టోబర్‌లో జాతీయ వారపత్రికగా వరంగల్ నుండి పాములపర్తి సదాశివరావు, పి.వి. నరసింహారావు అధ్వర్యంలో రాజకీయ నేపథ్యంలో వెలువడి ఎన్నో సామాజిక వాస్తవికాంశాలను బయటపెట్టిన విధానాన్ని వివరించారు. అలాగే రాజకీయ నేపథ్యంలో వచ్చిన మరో పత్రిక 'వెలుగు'. ఇది జనగామ కేంద్రంగా 1952లో మండవ మధుసూదనరావు, చౌడవరావు విశ్వనాథం గార్ల నిర్వహణలో వచ్చిందంటూ తెలిపి ఇవే కాక అనేక ఉద్యమాల్లో కీలక పాత్రను పోషించిన జనధర్మ, జై తెలంగాణ, ప్రజాతరంగం, సృజన, అదృష్టం, మానుకోట, ఏకశిల, అగ్రగామి వంటి ఎన్నో పత్రికలు వరంగల్ ప్రాంతం నుండి ఆవిర్భవించాయని వాటిని పరిచయం చేశారు. ఓరుగల్లు పత్రికలు ఉద్యమ వేదికలుగా నిలిచి మరెన్నో ఆచరణయోగ్యంగా మారిన తీరును వివరించారు. ఆనాటి నుండి నేటి వరకు ఓరుగల్లు పత్రిక తెలంగాణ సాహిత్య, సాంస్కృతికాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ వ్యాసం సాంస్కృతికాభివృద్ధిలో పత్రికల కృషిని వివరించారు. ఈ వ్యాసం ద్వారా ఉద్యమ చరిత్రలో పత్రిక స్థానము ఎంత గొప్పదో అవగతమవుతుంది.

### 5.8.2. తెలంగాణలో తొలి తెలుగు పత్రిక 'శేద్యచంద్రిక'

తోట భావనారాయణ రాసిన తెలంగాణలో తొలి తెలుగు పత్రిక 'శేద్యచంద్రిక' అనే వ్యాసం డిసెంబర్ 18, 2017న సాక్షి–సాహిత్యం పుటలో వెలువడింది.

తెలంగాణ ప్రాంతంలో వెలువడిన మొదటి పత్రిక 'శేద్య చంద్రిక' అని చాలా కాలం తొలి పత్రికగా ప్రచారంలో ఉన్న 'హితబోధిని' కన్న మూడు దశాబ్దాల ముందే ఉర్దూ పత్రికకు అనువాదంగా వెలువడిందని దాని వివరాలను తెలుపుతూ రాసిన వ్యాసమిది.

దీనిలో వ్యాసకర్త శేద్య చంద్రిక పత్రిక వివరాలను తెలుపుతూ మహబూబ్‌నగర్ నుండి 1913లో వెలువడిన 'హితబోధిని' తొలి తెలంగాణ పత్రికగా చాలాకాలం వరకూ ప్రచారంలో

ఉండేది. అయితే అంతకు మూడు దశాబ్దాల కిందటే ఉర్దూ మాతృకకు అనువాదంగా వెలువడిన 'శేద్య చంద్రిక' గురించి చాలా వరకు చరిత్రకు అందలేదంటూ వివరించారు. మద్రాసు విశ్వవిద్యాలయం ఆవరణలోని ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ (ప్రాచ్యలిఖిత గ్రంథాలయం)లో దీని ప్రతి దొరికిందని వాటి వివరాలను ఈ వ్యాసం ద్వారా తెలిపారు.

శేద్య చంద్రిక పత్రిక వివరాలు తెలిపి వ్యాసకర్త మద్రాసు వెళ్ళి శోధించిన విధానాన్ని వివరించారు. అక్కడి లైబ్రరీ రికార్డుల ప్రకారం 1975 నాటి మొదటి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రదర్శనలో శేద్య చంద్రికను కూడా ప్రదర్శించారని తెలుస్తుంది. బహుశా ఎవరి దృష్టిలోనూ పడి ఉండకపోవచ్చునని అభిప్రాయపడ్డారు.

పత్రిక సంపాదకీయాన్ని బట్టి ఇది ఉర్దూలో వెలువరించిన 'ఫునూన్' అనే పత్రికకు అనువాదమని అర్థమవుతుంది. అప్పట్లో జనం మాట్లాడే భాషలో ఉర్దూ పదాలు ఉండేవి అనడానికి అనువాదంలోని అనేక ఉర్దూ పదాలు నిదర్శనంగా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖపత్రం గమనిస్తే నిజాం ఆదేశాలకు అనుగుణంగా రైతుల క్షేమం కోసం ప్రచురించినట్టు చెప్పుకోవడం కనిపిస్తుంది. పబ్లిషర్‌గా మున్షీ మహమ్మద్ ముష్తాక్ అహ్మద్ పేరు చెబుతూ ఫునూన్ పేరు ప్రస్తావించారు. హైదరాబాద్ పత్తర్ ఘట్టిలోని ప్రింటింగ్ ప్రెస్ (చాప్‌ఖానా)లో ముద్రణ జరిగిన కూడా స్పష్టంగా పేర్కొన్నారని దాని ముద్రణ, ప్రచురణ తాలూకు వివరాలను తెలియజేశారు.

6వ నిజాం నవాబు మీర్ మహబూబ్ అలీ పాలనలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రచురించిన పత్రిక ఇది. 6వ నిజాం కాలంలో అనేక ఉర్దూ పత్రికలు వెలువడినాయి. వాటిలో ఒకటి 'ఫునూన్'. దీన్ని రైతుల కోసమే 'శేద్య చంద్రిక' అనే తెలుగు అనువాద పత్రికను అందిస్తున్నట్లు సంపాదకీయంలో పేర్కొన్న విషయాలను ఇక్కడ ప్రస్తావించారు.

"...ఈ విషయంలో ఆత్మ సంతోషకరమైన అభిప్రాయాలను తెల్యజేసి ఉండిరి కదా – రిసాలా ఫునూను తరజుమా దేశ భాషలో ఛాపాయించవలెను – ఆ రీతి చేసినట్టయితే రచయితలకు చాలా ఫాయిదా కాగలదు. కాబట్టి మేము మొదలు ప్రస్తుతం తెన్గు భాషలో రిసాలా చేసి ఉన్నాము. రయిత్లు యిందు్లు గవురవం చేశినట్లయితే హాకంలు యిందుపైన మతవఝా అయినట్టయితె తిర్గి మహారాష్ట్రం భాషలో కూడా ఛపాయించుటం కాగలదు".

శేద్య చంద్రిక లభించే ఆదరణను బట్టి నిజాం ఏలుబడిలో ఉన్న ప్రాంతీయ భాషల్లో కూడా ప్రచురించాలనే ఆలోచనతో ఉన్నట్టు ఈ వాక్యాల వల్ల తెలుస్తుందని పేర్కొన్నారు. రైతులకు

వ్యవసాయ మెలకువల గురించి ఆధునిక పద్ధతుల గురించి తెలపడమే ఈ పత్రిక ప్రధాన ఉద్దేశ్యంతో తెలుగు మాత్రమే తెలిసిన రైతుల కోసం చేసిన ప్రయత్నమిది అని వివరించారు.

ఈ విధంగా వ్యాసకర్త అనేక వాస్తవికాంశాలను చర్చిస్తూ, తన పరిశీలనలో అవగతమయిన అనేక విషయాలను పాఠకులకు అందించారు. ఇంకా శేద్యచంద్రిక గురించి తెలియాల్సిన విషయాలెన్నో ఉన్నాయంటూ వాటి గురించి నిర్దిష్టమైన పరిశోధన జరగాలని వివరించారు. వాస్తవిక అంశాల వివరణతో ఈ వ్యాసం కొనసాగింది.

**ఈ అధ్యాయంలోని ముఖ్యాంశాలు**

- భాషా నిర్వచనాలు తెలియజేయబడ్డాయి.
- భాషా విషయాలను చర్చిస్తూ, దాని స్వరూప స్వభావాలను తెలపడం జరిగింది. గ్రాంథిక భాష, వ్యవహారిక భాషలను పరిచయం చేయడమైంది.
- భాషా ప్రాధాన్యతను తెల్పుతూ, పత్రికా భాషను గూర్చి చర్చించబడింది.
- సాక్షిలో వచ్చిన భాషా సంబంధ వ్యాసాలను పరిశీలించడమైంది.
- తెలంగాణ భాష ప్రాముఖ్యతను తెల్పుతూ, అస్తిత్వాన్ని తెలియజేయబడింది. తెలంగాణలోని చారిత్రక గ్రంథాల పరిచయం చేయబడింది.
- తెలంగాణ భాషలోని ప్రాంతీయ అస్తిత్వవాద వ్యాసాలను పరిశీలించడమైంది. తెలంగాణ భాషలో ఉన్నట్టి దేశీపద ప్రయోగాల పరిచయం చేయబడింది.
- సంస్కృతి పరిచయం, నిర్వచనాలు తెల్పబడ్డాయి.
- జానపద కళారూపాల పరిచయం, పరిశీలన జరిగింది.
- జానపద పండుగలు, ఆచారాల ప్రస్తావన చేయబడింది.
- సంస్కృతిలో భాగంగా వచ్చిన సామెతలను చర్చించడమైంది.
- ఈ విధంగా సాక్షి, నమస్తే తెలంగాణ పత్రికల్లో ఉన్న భాషా, సాంస్కృతిక సంబంధ వ్యాసాల పరిచయం, విమర్శనాత్మక దృష్టితో పరిశీలన చేయబడింది.

★★★

## ఉపసంహారం

'సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – విమర్శనాత్మక అధ్యయనం (2016, 2017)' అనే ఈ సిద్ధాంత గ్రంథాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించుకొని విశ్లేషించాను. దీనిలో సాక్షి, నమస్తే తెలంగాణ సాహిత్యపుటల్లో 2016, 2017 సంవత్సరాల్లో వచ్చిన సాహిత్య వ్యాసాలను మాత్రమే నా పరిశోధన పరిధిగా ఎంచుకున్నాను. కావున సాహిత్య పుటల్లో వచ్చే కవిత్వం, సాహిత్య సమాచార సంబంధ విషయాల వంటి అంశాలను నేను స్వీకరించలేదు. దీనిలో ప్రస్తావించలేదు.

సాక్షి, నమస్తే తెలంగాణ  దినపత్రికల సాహిత్య వ్యాసాలపై జరిపిన ఈ పరిశోధనలో నేను పరిశోధించి, పరిశీలించిన అంశాలను  ఉపసంహారం లో తెలియజేస్తున్నాను.

**మొదటి అధ్యాయం: సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య అనుబంధాలు**

ఈ అధ్యాయంలో దినపత్రికల సాహిత్య పుటల నిర్మాణాన్ని తెలిపి, సాహిత్య సంబంధ ప్రచురణల గురించి వివరించాను. ప్రస్తుతం దినపత్రికలు, రాజకీయ, ఆర్థిక, సామాజికాంశాలతోపాటు సాహిత్యానికి కూడా ఒక ప్రత్యేక పుటను కేటాయించి సాహిత్య సంబంధ విషయాలను పాఠకులకు అందిస్తున్నారు. సాహిత్యాభివృద్ధికి పత్రికలు తమ వంతు కృషి చేస్తున్నాయని చెప్తూ, పత్రికల ఆవిర్భావం గురించి పరిచయం చేశాను. పత్రికల ఆవిర్భావానికి ప్రధాన కారణమైన ముద్రణాయంత్రాల ఆవిర్భావం, వాటి వికాసం, భారతీయ పత్రికల ఆవిర్భావం, వికాసం, తెలుగు పత్రికల ఆవిర్భావం, అలాగే తెలుగు దినపత్రికల ఆవిర్భావం, వికాసం, దినపత్రికల నిర్మాణం వంటి అంశాలను స్థూలంగా పరిచయం చేశాను. ప్రస్తుతం వెలువడుతున్న ప్రముఖ దినపత్రికలైన సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల ఆవిర్భావ వికాసాలను  కూడా వివరించాను. ఈ రెండు పత్రికల లక్ష్యాలను, వాటి అనుబంధ పత్రికల వివరాలను, నిర్మాణపరమైన వైవిధ్యాలను, లభించిన అవార్డుల వంటి పురస్కార సంబంధ విషయాలను తెలియజేశాను. పత్రికల్లో సాహిత్య ప్రచురణ ప్రారంభ కాలం నుండి కనిపిస్తుందని, కేవలం సారస్వత విషయాలకే పరిమితమైన సుజనరంజని మొదలుకొని నేటివరకు పత్రికల్లో సాహిత్య ప్రచురణ కొనసాగుతుందని తెలుపుతూ, సాక్షి 'సాహిత్యం' పుట, నమస్తే తెలంగాణ 'చెలిమె' పుట నిర్మాణాలను వాటి ప్రత్యేకతలను వివరించాను.

**రెండవ అధ్యాయం: సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – కవిత్వ విమర్శ**

ఈ అధ్యాయంలో ఈ రెండు పత్రికల్లో ముద్రితమైన కవిత్వ సంబంధ వ్యాసాలను విశ్లేషణ పద్ధతిలో వివరించాను. కవిత్వ సంబంధ వ్యాసాల విశ్లేషణకు ముందు కవిత్వ ప్రక్రియను పరిచయం చేసి కవిత్వం గురించిన ఆలంకారికుల నిర్వచనాలు, ఆధునికుల నిర్వచనాలను తెలియజేశాను. ఈ రెండు పత్రికల్లో కవిత్వ సంబంధ వ్యాసాలు అనేక రకాలుగా వెలువడ్డాయి. కవితా ప్రక్రియలకు సంబంధించిన వ్యాసాలు, కవులకు సంబంధించిన వ్యాసాలు, కవుల ఇంటర్వ్యూలు, కవిత్వ సంబంధ నివేదికలు వంటి మొదలైన రూపాల్లో కవిత్వ సంబంధ వ్యాసాలు వెలువడ్డాయి. కావున వాటి లక్షణాల ఆధారంగా పదకవిత్వ సంబంధ వ్యాసాలు, ప్రబంధ కవిత్వ సంబంధ వ్యాసాలు, గేయ కవిత్వ సంబంధ వ్యాసాలు, స్త్రీవాద కవిత్వ సంబంధ వ్యాసాలు, హైకూ కవిత్వ సంబంధ వ్యాసాలు, గజల్ కవిత్వ సంబంధ వ్యాసాలు, కవిత్వ సంబంధ విమర్శా వ్యాసాలు, కవిత్వ సంబంధ గ్రంథ సమీక్షలు, కవిత్వ సంబంధ వ్యాసాలు, కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ, కవిత్వ సంబంధ నివేదికా వ్యాసాలు, పాశ్చాత్య కవిత్వ సంబంధ వ్యాసాలు అనే ఉపవిభాగాలుగా చేసుకొని వాటిని విమర్శనాత్మక పద్ధతిలో విశ్లేషించాను. నా పరిశోధన పరిధి కాలంలో ఈ రెండు పత్రికల్లో 85 కవిత్వ సంబంధ వ్యాసాలు వెలువడ్డాయి. వాటన్నింటిని పరిశీలించి పైన పేర్కొన్న ఉపవిభాగాలుగా విభజించుకొన్నాను. ఒక్కొక్క విభాగానికి రెండు లేదా మూడు వ్యాసాలను విశ్లేషించి వివరించాను. మిగిలిన కవితా సంబంధ వ్యాసాల వివరాలను ఆయా ఉపవిభాగాల చివరన పట్టికల రూపంలో పేర్కొన్నాను. ఈ అధ్యాయంలో కవిత్వ వ్యాసాలను, కవిజీవిత విమర్శ, ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ, తులనాత్మక విమర్శ, నైతిక విమర్శ, చారిత్రక విమర్శ వంటి విమర్శ పద్ధతుల్లో విశ్లేషించి వివరించాను.

**మూడవ అధ్యాయం: సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు–కథానిక విమర్శ**

ఈ అధ్యాయంలో మొదట కథానిక ప్రక్రియను పరిచయం చేసి కథానిక నిర్వచనాలు, లక్షణాలను తెలిపాను. ఈ రెండు సాహిత్య పుటల్లో వెలువడిన వివిధ రకాల కథానిక వ్యాసాలను కథానిక ఉపోద్ఘాతాలు, కథానిక వ్యాసాలు, వస్తు వైవిధ్యం, కథాశిల్ప సంబంధ వ్యాసాలు, కథానిక వ్యాసాలు, వాదప్రతివాదాలు, కథానిక గ్రంథ నేపథ్యాలు, కథానిక గ్రంథ సమీక్షలు, కథానిక సంబంధ స్మరణ వ్యాసాలు, కథానిక సంబంధ నివేదిక వ్యాసాలు, పాశ్చాత్య కథా సంబంధ వ్యాసాలుగా విభజించుకొని వాటిని విమర్శనాత్మక పద్ధతిలో విశ్లేషించాను. ఒక్కొక ఉపవిభాగానికి రెండు లేదా మూడు వ్యాసాల చొప్పున విశ్లేషించి గ్రంథ స్థలాభావాన్ని దృష్టిలో ఉంచుకొని మిగతా

వ్యాసాలను ఉపవిభాగాల చివరన పట్టిక రూపంలో తెలియజేశాను. దీనిలో కవిజీవిత విమర్శ, చారిత్రక విమర్శ, వాదప్రతివాద విమర్శ పద్ధతుల్లో వ్యాసాల విశ్లేషణ చేయడం జరిగింది.

**నాల్గవ అధ్యాయం: సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – నవలావిమర్శ**

ఈ అధ్యాయంలో నవలాప్రక్రియను పరిచయం చేసి నవలా నిర్వచనాలు, లక్షణాలను తెలిపాను. వివిధ సందర్భాల్లో ఈ రెండు సాహిత్య పుటల్లో వచ్చిన నవలా సంబంధ వ్యాసాలను మనోవైజ్ఞానిక నవలా వ్యాసాలు, అనువాద నవలా వ్యాసాలు, గిరిజన నవలా వ్యాసాలు, నవలా సంబంధ నివేదిక వ్యాసాలు, స్మరణ సంబంధ నవలా వ్యాసాలుగా విభజించుకొని విమర్శనాత్మక పద్ధతుల్లో విశ్లేషించాను. ఒక్కో నవలా ఉపవిభాగానికి రెండు లేదా మూడు వ్యాసాలను విశ్లేషించి మిగతా వాటిని పట్టికల్లో తెలియజేశాను. దీనిలో కవిజీవిత విమర్శ, మనోవైజ్ఞానిక విమర్శ పద్ధతుల్లో విశ్లేషణ జరిగింది.

**ఐదవ అధ్యాయం: సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాలు – భాషా సాంస్కృతిక అధ్యయనం**

ఈ అధ్యాయంలో భాష, సంస్కృతుల నిర్వచనాలు తెలియజేశాను. భాషా సాంస్కృతికాభివృద్ధికి పత్రికలు చేస్తున్న కృషిని తెలుపుతూ రాష్ట్ర అవతరణ తర్వాత ఇంత కాలం మరుగునపడిన తెలంగాణ సంస్కృతి, చరిత్ర, భాషా సాహిత్యాల ఔన్నత్యాన్ని ప్రజలకు తెలియబరుస్తూ, తెలంగాణ భాషా సాంస్కృతికాభివృద్ధికి తెలంగాణ ప్రాంతీయ పత్రికగా ఆవిర్భవించిన నమస్తే తెలంగాణ పత్రిక నిర్వహిస్తున్న కృషిని తెలియజేశాను. ఈ రెండు పత్రికల్లో వెలువడిన భాషా సాంస్కృతిక, చారిత్రక సంబంధ వ్యాసాలను సాక్షి దినపత్రిక భాషా సంబంధ వ్యాసాలు, నమస్తే తెలంగాణ దినపత్రిక భాష సంబంధ వ్యాసాలు, చారిత్రక సంబంధ వ్యాసాలు, సాంస్కృతిక సంబంధ వ్యాసాలుగా విభజించుకొని విశ్లేషించాను. సాంస్కృతిక సంబంధ వ్యాసాల్లో జానపద కళారూపాలు, సామెతలు, పత్రికలు, సాహిత్య ఉత్సవాల వంటి విభాగాల కింద విభజించి విశ్లేషించాను. విభాగానికి రెండు లేదా మూడు వ్యాసాలను విశ్లేషించి మిగతావి పట్టికల్లో తెలిపాను.

ఈ విధంగా నా పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించి అందులో వివిధ రకాల వ్యాసాలను పరిశీలించి విమర్శనాత్మక పద్ధతిలో విశ్లేషించాను.

★★★

## ఫలితాంశాలు

1) సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికలు సాహిత్యపుటల ద్వారా సమకాలీన సాహిత్యాన్ని, సమాజాన్ని ప్రతిబింబిస్తూ తెలుగు భాషా సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తున్నాయి.

2) సృజనాత్మక సాహిత్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి.

3) విమర్శనాత్మక సాహిత్యానికి వేదికగా నిలబడుతున్నాయి.

4) కవిత్వం, వ్యాసం, పుస్తక సమీక్ష వంటి ప్రక్రియలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. 2016, 2017 సంవత్సరాలలో వెలువడిన ఈ సాహిత్య పుటల్లోని వ్యాసాలను విమర్శనాత్మకంగా పరిశీలించిన తర్వాత నా పరిశోధనలో గుర్తించిన ఫలితాంశాలు కింది విధంగా ఉన్నాయి.

➢ **సాహిత్యపుటల్లో కవిత్వానికే అగ్రస్థానం**

కవిత్వానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. నా పరిశోధన పరిధిలోని రెండు వందల నాలుగు వ్యాసాలను పరిశీలించగా అందులో 90 వ్యాసాలు కవిత్వానికి సంబంధించినవి కావడం దీనికి తార్కాణం. కవిత్వ వ్యాసాలే కాకుండా ఇంకా ప్రత్యేకించి కవిత్వం ఒకటి లేదా రెండు కవితలు ప్రతి వారం సాహిత్య పుటల్లో మనకు కనిపిస్తున్నాయి. దీన్నిబట్టి కూడా ఈ విషయం చెప్పవచ్చు. ఇంకా కవిత్వ విషయానికి వస్తే అభ్యుదయ, పోరాట సంబంధ కవులకు, కవితలకు అధిక ప్రాధాన్యత కనిపిస్తుంది. కవిత్వ వ్యాసాల శీర్షికల్లో కూడా ఉద్యమ పదాలను వాడుతూ పోరాట సంబంధ కవిత్వాన్ని పరిచయం చేస్తున్నారు. సంచలనాన్ని సృష్టించిన కవులకు అధిక ప్రాధాన్యత కనిపిస్తుంది. ఎందుకంటే సంచలనం పత్రికల ప్రధాన లక్షణం కావున పత్రిక సాహిత్యపుటల్లో కూడా ఈ సంచలనాన్ని సృష్టించిన కవుల వ్యాసాల శీర్షికల్లో పోరాట పదాలు కనిపిస్తున్నాయి.

ఉదా॥ కవిత్వ అగ్నిధార దాశరథి(18/07/2016, నమస్తే తెలంగాణ 'చెలిమె')

ధిక్కార స్వర ఆదిగురువు(05/09/2016, నమస్తే తెలంగాణ 'చెలిమె')

ఉద్యమానికి ఊపిరి సాహిత్యం( 18/01/2016, నమస్తే తెలంగాణ 'చెలిమె')

➢ **సాహిత్య పుటల్లో కూడా పత్రికల లాగే సందర్భానికి అధిక ప్రాధాన్యత ఉంటుంది**

దినపత్రికలు రోజువారి సమాచారాన్ని పాఠకులకు ఎప్పటికప్పుడు అందించే సమాచార వాహిని. కావున సందర్భం అనేది పత్రికల్లో ప్రముఖ పాత్ర వహిస్తుంది. పత్రికల సాహిత్య పుటల్లో

కూడా ఈ సందర్భానికి అధిక ప్రాధాన్యత కనిపిస్తుంది. కవుల జయంతి, వర్ధంతి, సన్మాన, సత్కారాలు లభించిన సందర్భాల్లో కవులను వారి జీవిత వివరాలను తెలుపుతూ స్మరణ సంబంధ వ్యాసాలు, ప్రశంసా సంబంధ వ్యాసాలు అధికంగా కనిపిస్తున్నాయి.

ఉదా॥ జ్ఞానపీఠం జ్ఞాపకాల దొంతర(24/07/2017 నమస్తే తెలంగాణ 'చెలిమె')

పచ్చనాకుపై వెచ్చని రాత(13/11/2017, నమస్తే తెలంగాణ 'చెలిమె')

సాహిత్య శిల్పులకు కబీర్ సమ్మాన్(13/11/2017 సాక్షి- సాహిత్యం)

➢ **సాహిత్య నివేదికలకు ప్రాధాన్యత కనిపిస్తుంది**

పుస్తకావిష్కరణ, పునర్ముద్రణ, జాతీయ సదస్సులు, సమావేశాలు జరిగినప్పుడు వాటి వివరాలను తెలుపుతూ నివేదికా రూప వ్యాసాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆవిష్కరణలు జరిగినప్పుడు వాటి వివరాలను తెలపడం ఒక సంప్రదాయం దానిని ఈ రెండు సాహిత్య పుటలు పాటిస్తున్నాయి.

ఉదా॥ *పునర్ముద్రణ

50 ఏళ్ల బాణుడి కాదంబరి(19/12/2016 సాక్షి- సాహిత్యం)

స్వతంత్ర మేధావి హృదయ సంస్కర్త(20/11/2017 సాక్షి - సాహిత్యం)

➢ **అనువాదాలకు అధిక ప్రాధాన్యత**

సాహిత్య పుటల్లో అనువాద సంబంధ వ్యాసాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కవిత్వం, కథా, నవలా ఇలా వివిధ ప్రక్రియలకు సంబంధించిన అనువాద వ్యాసాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇతర భాషల నుండి తెలుగులోకి వచ్చిన తెలుగు నుండి ఇతర భాషల్లోకి వెళ్ళిన అనువాద కథలు, నవలలు, కవిత్వం వంటి వాటిని పరిచయం చేస్తూ వ్యాసాలను ప్రచురిస్తున్నారు.

ఉదా॥ తెలుగులో మామ్ కథలు(04/07/2016, సాక్షి-సాహిత్యం)

➢ **ప్రాంతీయ అస్తిత్వవాద సాహిత్యానికి అధిక ప్రాధాన్యత**

నమస్తే తెలంగాణ పత్రిక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇంతకాలం మరుగున దాగిన తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సాహిత్యాల ఔన్నత్యాన్ని తెలుపుతూ ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ ధోరణితో వ్యాసాలను ప్రచురిస్తుంది. ఇది నమస్తే తెలంగాణ పత్రికలో ఎక్కువగా కనిపిస్తుంది. తెలంగాణ ప్రాంత పత్రికగా స్థాపించబడిన దీనిలో ప్రాంతీయ సాహిత్యానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తుంది.

ఉదా॥ ఇది మన స్వేచ్ఛానర్తనం(04/07/2016, నమస్తే తెలంగాణ 'చెలిమె')

భాష: ప్రామాణికం, తెలంగాణం. (08/02/2016, నమస్తే తెలంగాణ 'చెలిమె')

- కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ ఎక్కువగా కనిపిస్తుంది.
- చారిత్రక విషయాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు.
- పాశ్చాత్య సాహిత్యానికి కూడా సాహిత్య పుటల్లో చోటు కల్పిస్తున్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో కేవలం తెలుగు సాహిత్యానికే కాకుండా ప్రపంచ భాషల సాహిత్య విషయాలను ఆయా సందర్భానుసారంగా సాహిత్యపుటల్లో ప్రచురిస్తున్నారు.

ఉదా॥ బాబ్‌డిలాన్ జానపద పునర్జీవనం(17/10/2016, నమస్తే తెలంగాణ 'చెలిమె')

కాము, సార్త్రే స్నేహపూర్వక శత్రుత్వం(28/11/2016, సాక్షి-సాహిత్యం)

- సాహిత్యా వ్యాసాల్లో కూడా లీడ్ సూత్రం ప్రాధాన్యత కనిపిస్తుంది.

పత్రికల్లో వ్యాసానికి లీడ్ సూత్రం ప్రధానంగా ఉంటుంది. 5'W' 1H అనే లీడ్ సూత్రం పత్రిక వ్యాసానికి ప్రధానం. సాహిత్యపుటల్లో వస్తున్న సాహిత్య వ్యాసాల్లో కూడా ఈ లీడ్ సూత్రం కనిపిస్తుంది. సాహిత్య వ్యాసాలు కూడా మళ్ళీ వార్తా వ్యాసాల్లాగే ఉంటున్నాయి.

ఉదా॥ సూర్యలంకలో కథాసరిత్సాగరం.(07/11/2016, సాక్షి-సాహిత్యం)

సాహిత్య వ్యాసాలు కూడా మళ్లీ వార్తా దృష్టితో మలచినటువంటి వ్యాసాలుగా ఉంటున్నాయి.

- సాహిత్య విమర్శ అత్యంత ముఖ్యమయింది. సాహిత్యమంటే ఏమిటి? శిల్పం, అభివ్యక్తి ఎలా ఉంది? వీటన్నింటిపై చర్చ ఉండాలి. కాని వార్తా పత్రికల్లో వ్యాసాల నిడివి తక్కువ కాబట్టి వీటన్నింటిని చర్చించే అవకాశం ఉండదు. అలాగే వీటన్నింటిని చెప్తే పాఠకులు చదువరు కాబట్టి సాహిత్య వ్యాసాన్ని కూడా మళ్లీ ఒక వార్తా దృష్టితో మలచిన వ్యాసాలుగానే ఎక్కువగా ప్రచురితమవుతున్నాయి. వీటిని మరింత అవగతం చేసుకోవడానికి నేను అనుబంధం—4 లో పొందుపరిచిన వ్యాసాలను గమనించగలరు.
- కవిత్వంలో అభివ్యక్తి కన్నా వస్తువుకు ప్రాధాన్యాన్నిస్తున్నారు.
- పత్రికల్లో రాసే వ్యాసాల్లో సాధారణంగా పూర్తి వివరాలుండవు.

- ఏదైనా కోటేషన్స్ కోడ్ చేసేటప్పుడు అది ఎవరు, ఎక్కడ అన్నారో చెప్పడం లేదు. పత్రికా వ్యాస పరిధి రీత్యా ఇది సాధ్యపడదు. ఇది పత్రికా వ్యాస లక్షణం. ఇది పరిశోధన వ్యాస లక్షణం కాదు.
- పత్రికల్లో రాసే వ్యాసాల్లో కోటేషన్స్ ఉపయోగించినపుడు వాటి పూర్తి వివరాలు కనిపించవు. ఎందుకంటే పత్రిక నిడివి దృష్ట్యా పేర్కొనడం సాధ్యపడదు. ఉదాహరణకు అనుబంధం–4 లోని వ్యాసాలను గమనించగలరు.
- పత్రికల్లో వ్యాసాలను ప్రచురించేటప్పుడు ఈ మధ్య కొత్తగా వచ్చిన సంప్రదాయం వ్యాసకర్త ఫోటో వేయడం, వారి ఫోన్ నెంబరు, ఇ–మెయిల్ అడ్రస్ కూడా ఇవ్వడం జరుగుతుంది. వీటి వలన వ్యాసకర్తను ప్రత్యక్షంగా కలుసుకునే అవకాశం కలుగుతుంది. అయితే అదే సమయంలో వ్యాసకర్తకు కొన్ని ఇబ్బందులు కూడా కలుగుతాయి. ఈ విధమైన పద్ధతి ఈ రెండు సాహిత్యపుటల్లో కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో వ్యాసకర్త ఫోటో రావడం లేదు.
- ముందుమాటలను సంక్షిప్తం చేసి వ్యాసాలుగా ప్రచురించినపుడు ముందు మాటలోని కొంత భాగమని తెలియజేస్తున్నారు. ఇలా చెప్పడం వలన మూలాన్ని చూడాలనే భావన పత్రికల వాళ్ళు పాటిస్తున్నారు. దీని వలన మూల రచయితను అపార్థం చేసుకోకుండా ఉంటారు. ఇది పత్రికకు సంబంధించిన నైతిక విలువ. దీన్ని ఈ రెండు పత్రికలు భావిస్తున్నాయి.
- ప్రధాన వ్యాసాల్లో చెప్పదలచుకున్న ముఖ్యాంశాలను పెద్ద పెద్ద అక్షరాలతో డిఫరెంట్ ఫాంట్‌లో, డిఫరెంట్ కలర్‌లో ప్రచురిస్తున్నారు. దీని వల్ల వ్యాసం చదవాలనే ఆసక్తి కలుగుతుంది.
- ప్రధాన శీర్షిక మీద ఉపశీర్షికల్లో వ్యాస సంబంధ విషయాన్ని, సందర్భాన్ని తెలుపుతున్నారు. ఇది సాక్షి పత్రిక ప్రత్యేకత. ఈ విషయాన్ని అనుబంధం–2 లో ఉన్న సాక్షి వ్యాస పట్టికలో గుర్తించగలరు.
- ప్రధాన వ్యాసాల్లో ముఖ చిత్రాలను, రేఖాచిత్రాలను వేయడం వలన కళ్ళకు ఒత్తిడి తగ్గుతుంది. వీటి ద్వారా అది దేనికి సంబంధించిన వ్యాసమో మనకు తెలిసిపోతుంది. ఇదిపత్రికల మెలకువ. ఆ విలువలను కూడా రెండు సాహిత్యపుటలు పాటిస్తున్నాయి.

- సమీక్షా వ్యాసాలు ప్రచురించేటప్పుడు పుస్తక సంబంధ వివరాలను, ప్రచురణ, లభించు చోటు లాంటి విషయాలను వ్యాసం చివర ఇస్తున్నారు. ఈ పద్ధతి మనకు సాక్షి–సాహిత్యం పుటలో కనిపిస్తుంది.
- కవి జీవిత విషయాలను కవి జీవిత కావ్య విమర్శ పద్ధతిలో పరిచయం చేస్తున్నారు.
- ప్రాంతీయ, స్థానిక చరిత్రలను, సంస్కృతి గొప్పతనాన్ని తెల్పడం, ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ పద్ధతిలో కనిపిస్తున్నాయి. ఇది నమస్తే తెలంగాణ 'చెలిమె' పుటలో ఎక్కువగా కనిపిస్తుంది.
- తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక సంబంధ విషయాలను ఎక్కువగా ప్రచురిస్తున్నారు. నమస్తే తెలంగాణ చెలిమె పుటలో ఎక్కువ.
- తెలంగాణ భాషను ఆత్మగౌరవంగా చెప్తున్నా తెలంగాణ భాష గొప్పతనాన్ని చాటి చెప్తున్నప్పటికీ సాహిత్య పుటల్లో తెలంగాణ ప్రాంత భాష వాడకం చాలా తక్కువ.
- ఇంటర్వ్యూలు ప్రచురించేటప్పుడు చెలిమె పుటలో ఇంటర్వ్యూ అని కాక ఆత్మీయ సంభాషణ అనే పేరుతో వస్తుంది. దీనిలో ప్రశ్నోత్తరాలుండవు. కవి ఆత్మకథ వలె తనకు తానే చెప్పుకుంటారు. సాక్షి సాహిత్యంలో ప్రశ్నోత్తరాలు కనిపిస్తున్నాయి.

## భవిష్యత్తు పరిశోధనలు

దినపత్రికలు ఎప్పటికప్పుడు అనేక మార్పులకు గురవుతూ నిత్యనూతనంగా విలసిల్లుతున్నవి కావున వీటిపై పరిశోధనకు అధిక ఆవశ్యకత ఉంటుంది. ఇప్పటివరకు పత్రికా సాహిత్యంపై పరిశోధనలు ఎన్ని జరిగిన ఇంకా చేయవల్సినవి ఎన్నో ఉన్నాయి. నా పరిశోధన అందులో ఒక భాగం మాత్రమే. నా అభిప్రాయం ప్రకారం ఇంకా వీటిపై పరిశోధనలు చేయవచ్చు.

1) పత్రికల సాహిత్యపుటల్లో కవిత్వంపై విస్తృతంగా పరిశోధన చేయవచ్చు.
2) కవి జీవిత కావ్యవిమర్శ పద్ధతి వ్యాసాలపై విస్తృత పరిశోధన చేయవచ్చు.
3) అనువాద సాహిత్యంపై పరిశోధన చేయవచ్చు.
4) కల్పనా సాహిత్యం, నవల, కథానిక వ్యాసాలపై పరిశోధన చేయవచ్చు.
5) ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ సంబంధ వ్యాసాలపై విస్తృతంగా పరిశోధన చేయవచ్చు.

6) నా ఈ పరిశోధనలో ఎక్కడ కూడా భాషాపరమైన వ్యాకరణ అంశాల పరిశీలన చేయలేదు. కావున సాహిత్య వ్యాసాల్లో భాషా పరిశీలన వంటి అంశాలపై చేయవచ్చు.

7) సామెతలు, నుడికారాలు, జాతీయాలు, సంధి పదాలపై పరిశోధన చేయవచ్చు.

8) పత్రిక శీర్షికలపై పరిశోధన చేయవచ్చు.

9) తులనాత్మక సాహిత్య విమర్శపై పరిశోధన చేయవచ్చు.

***

# ఉపయుక్త గ్రంథసూచి

# (Bibliography)

## పరిశోధనా వ్యాసాలు/సిద్ధాంత గ్రంథాలు


1. ఉమేశ్, బడిగె. (2014). **రాళ్ళపల్లి పీఠికలు – పరిశీలన.** డా. దార్ల వెంకటేశ్వర రావు గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన యం. ఫిల్. పరిశోధనా వ్యాసం. హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
2. చిరంజీవి, జోగు.(2019). **నమస్తే తెలంగాణ దినపత్రిక సాహిత్య పుటలు: పరిశీలన (2014–2015).** డా॥ డి. విజయకుమారి గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పి.హెచ్‌డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
3. ఝాన్సీరాణి, ఎన్. (1992). **Biographical Criticism in Telugu.** డా. ముదిగొండ వీరభద్రయ్య గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన యం. ఫిల్ పరిశోధనా వ్యాసం.హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
4. దుర్గా రావు, మజ్జి. (2013). **తెలుగులో సౌందర్య శాస్త్ర విమర్శ– ఒక అధ్యయనం**. డా. దార్ల వెంకటేశ్వర రావు గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పి.హెచ్‌డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
5. ధర్మారావు, గొనిపాటి. (2015). **ఆధునిక తెలుగు కవిత్వ పరిణామం**. డా. పమ్మి పవన్ కుమార్‌గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పి.హెచ్‌డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
6. రవికుమార్, దార్ల. (2005). **ఆధునిక తెలుగు కథల్లో ప్రాంతీయ చైతన్యం**. ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పి. హెచ్డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
7. లావణ్య, కె. (2019). **ఆంధ్రజ్యోతి సాహిత్య పుటలు: విమర్శనాత్మక పరిశీలన (2015–2017).** డా. పమ్మి పవన్ కుమార్ గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పి.హెచ్‌డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
8. విజయ కుమార్, బందారు.(2010). **తెలుగు కథ నిర్మాణ శిల్పం**. ఆచార్య జి. అరుణ కుమారి గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పి.హెచ్‌డి. సిద్ధాంత గ్రంథం.

9. వెంకటేశ్, ముడావత్. (2018 ). **ఆధునిక తెలుగు సాహిత్యం గిరిజన జీవన చిత్రణ**. ఆచార్య పిల్లలమర్రి రాములు గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పి. హెచ్డి సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

10. శేఖర్ రెడ్డి, వూట్కూరి. (1990-91). **తెలుగులో కావ్యాల పీఠికలు – విమర్శ మౌలిక అంశాలు.** డా. ముదిగొండ వీరభద్రయ్య గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన యం. ఫిల్. పరిశోధనా వ్యాసం. హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

11. సురేష్, టి. (2010). **ఆధునిక తెలుగు లఘు కవితలు, నిర్మాణం, వస్తువు**. ఆచార్య శరత్ జ్యోత్స్నరాణి గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పి. హెచ్డి సిద్ధాంత గ్రంథం. హైదరాబాద్. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

**ముద్రిత గ్రంథాలు**

12. అచ్యుత శర్మ, సి. యస్వి. (1990). **తెలుగులో ప్రతి విమర్శ – పరామర్శ**. కొమ్ముచిక్కాల. కాంతి దుర్గా పబ్లికేషన్స్.

13. అఫ్సర్. (1993). **ఆధునికత అత్యాధునికత**. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

14. ఆనందభాస్కర్, రాపోలు. (1988). **జర్నలిజం చరిత్ర–వ్యవస్థ.** హైదరాబాద్: ఉద్యమ పబ్లికేషన్స్.

15. ఆనందరామం, సి. (1994). **నవలా విమర్శ**. హైదరాబాద్. పద్మావతి ఆర్ట్స్ ప్రింటర్స్

16. ఇనాక్, కొలకలూరి. (1996). **ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం.** హైదరాబాద్: పద్మావతీ ఆర్ట్స్ ప్రింటర్స్.

17. ఇనాక్, కొలకలూరి. (2010). **జానపదుల సాహిత్య విమర్శ** (సిద్ధాంత గ్రంథం). హైదరాబాద్: జ్యోతి గ్రంథమాల.

18. ఇనాక్, కొలకలూరి. (2010). **నవలా సాహిత్యం – సమాజ సందర్భం**. హైదరాబాద్: జ్యోతి గ్రంథమాల.

19. ఇనాక్, కొలకలూరి. (2013 ). **తెలుగు నవల**. హైదరాబాద్. జ్యోతి గ్రంథమాల.

20. ఉదయ, మారంరాజు. (1999). **తెలుగు నవలల్లో తెలంగాణ జనజీవనం.** హైదరాబాద్: శ్రీబాలాజీ ఆర్ట్ ప్రింటర్స్.

21. కాత్యాయనీ విద్మహే. (1987). **చివరకు మిగిలేది మానసిక సామాజిక జీవన స్రవంతి నవలా విమర్శ.** వరంగల్: కృష్ణ ప్రింటర్స్.

22. కాత్యాయనీ విద్మహే. (1995). **తెలుగు నవలా కథానికా విమర్శన పరిణామం.** హైదరాబాద్: చరిత ప్రచురణలు.

23. కాశీం. (2015). **తెలంగాణ సాహిత్యం.** హైదరాబాద్: స్నేహ ప్రచురణ.

24. కృష్ణకుమారి, నాయని. (2013). **విమర్శ విద్యాసార్వభౌమం** (భూమయ్య విమర్శ వీక్షణం). వరంగల్: శ్రీమనస్వినీ ప్రచురణలు.

25. కృష్ణకుమారి, నాయని. (2014). **తెలుగు జానపద గేయ గాథలు.** హైదరాబాద్: తెలుగు అకాడమీ.

26. కృష్ణమూర్తి, భద్రిరాజు. (2012). **భాషా సమాజం సంస్కృతి.** హైదరాబాద్: నీల్ కమల్ పబ్లికేషన్స్.

27. గంగప్ప, ఎస్. (1983). **తెలుగులో పదకవిత.** గుంటూరు: స్వీయ ప్రచురణ.

28. గౌరీశంకర్, జూలూరి & శివరామకృష్ణ, పెన్నా. (2009). **తెలంగాణ సంస్కృతి.** హైదరాబాద్: స్పృహ సంస్థ.

29. గౌరీశంకర్, జూలూరి. (2007). **తెలంగాణ తల్లి.** హైదరాబాద్: తెలంగాణ రచయితల వేదిక.

30. చంద్రశేఖర రెడ్డి, డి. (1990). **తెలుగు పీఠిక.** హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు.

31. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం (2000). **కథాంశం.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

32. చంద్రశేఖర్, ఎస్.జి.డి. (1987). **సమాచారల చేరవేత మరియు పాత్రికేయత్వం.** ఏలూరు: ఎస్జీడి పబ్లికేషన్స్.

33. చంద్రశేఖర్, పగడాల. (2011). **తెలుగు దినపత్రికల భాష ఆధునీకరణ.** సికింద్రాబాద్: పగడాల పబ్లికేషన్స్.

34. చక్రధర్, గోవిందరాజు. (2014). **మీడియా సంగతులు.** హైదరాబాద్: మీడియా హౌస్ పబ్లికేషన్స్.

35. చెంచయ్య, విధిపాణి. (2013). **విరసం సాహిత్య విమర్శ.** హైదరాబాద్: దిశ పుస్తక కేంద్రం.

36. చెన్నయ్య, జె. (2003). **తెలుగు దినపత్రికలు భాషా సాహిత్య స్వరూపం.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

37. చెన్నయ్య, జె. (2010). **పత్రికలు ప్రసార మాధ్యమాలు తెలుగు.** హైదరాబాద్: విశాలాంధ్ర బుక్ హౌస్.

38. చెన్నయ్య, జె. (2016). **తెలుగు పత్రికలు ప్రసారమాధ్యమాల భాషా స్వరూపం.** హైదరాబాద్: తెలంగాణ సారస్వత పరిషత్.

39. జాషువ. (2012). **జాషువా రచనలు.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

40. తిరుమలరావు, సర్దేశాయి. (2002). **విమర్శ–ప్రతివిమర్శ.** హైదరాబాద్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

41. దక్షిణామూర్తి, పోరంకి. (1975). **కథానికా వాఙ్మయం.** హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

42. దక్షిణామూర్తి, పోరంకి. (1992 ) **భాష ఆధునిక దృక్పథం** (వ్యాస సంపుటం). హైదరాబాద్

43. దక్షిణామూర్తి, పోరంకి. (2009). **కథానిక–స్వరూప స్వభావాలు.** హైదరాబాద్: విప్ల కంప్యూటర్ సర్వీసెస్.

44. దయానంద్, సి.హెచ్, మనోహర్, సి.హెచ్. (1996). **ఆధునిక జర్నలిజం.** హైదరాబాద్: స్ఫూర్తి ఆర్ట్స్ థియేటర్.

45. ద్వా.నా. శాస్త్రి. (2011). **విమర్శాదర్శం**. హైదరాబాద్: కిన్నెర పబ్లికేషన్స్.

46. నరసయ్య, సంగనభట్ల. (2009). **తెలుగులో దేశిచ్ఛందస్సు ప్రారంభ వికాస దశలు.** ధర్మపురి, కరీంనగర్: ఆనందవర్ధన ప్రచురణలు.

47. నాగయ్య, జి.(2021). **తెలుగు సాహిత్య సమీక్ష(ద్వితీయ సంపుటం).** హైదరాబాద్. నవ్య పరిశోధక ప్రచురణలు.

48. నాగరాజు, ఎమ్. (1991). **ఆధునిక సాహిత్య విమర్శ, అభిరుచి ధోరణి.** హైదరాబాద్: యువభారతి రజతోత్సవ సాహితీ.

49. నారాయణరావు, వెల్చేరు. (2008). **తెలుగులో కవితా విప్లవాల స్వరూపం.** విజయవాడ: నవోదయ పబ్లికేషన్స్.

50. నారాయణరెడ్డి, సి. (2011). **ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు: ప్రయోగాలు.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

51. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. (2011). **తెలంగాణ చరిత్ర (క్రీ.పూ. నుంచి 1948 వరకు).** సికింద్రాబాద్: తెలంగాణ ప్రచురణలు.
52. నిత్యానంద రావు, వెలుదండ.(2013). **విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన**. హైదరాబాద్. నవోదయ బుక్ హౌస్.
53. పవన్ కుమార్, పమ్మి. (2016). **ప్రసార మాధ్యమాలు – భాష నైపుణ్యాలు.** విజయవాడ: శ్రీరాఘవేంద్ర పబ్లికేషన్స్.
54. ప్రతాపరెడ్డి, కాసుల(సంపా.). (2013). **తెలంగాణ తోవలు.** హైదరాబాద్: తెలంగాణ సాంస్కృతిక వేదిక.
55. ప్రసాదరాయ కులపతి. (1983). **సంస్కృతి**. సికింద్రాబాద్: యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ.
56. ప్రసాద్, జి.కె.డి. (2012). **దళిత జర్నలిజం.** హైదరాబాద్: ఎమెస్కో.
57. బాల శ్రీనివాసమూర్తి, జి. (2004). **తెలంగాణ పత్రికలు.** హైదరాబాద్: రచన జర్నలిజం కళాశాల.
58. భావనారాయణ, తోట. (2005). **టెలివిజన్ జర్నలిజం.** హైదరాబాద్: కర్షక ఆర్ట్స్ ప్రింటర్స్.
59. మందేశ్వరరావు, వడలి. (1996). **విమర్శ నాటి నుండి నేటికి.** హైదరాబాద్: నవోదయ బుక్ హౌస్.
60. మందేశ్వరరావు, వడలి.(1984). **సాహిత్యం–విమర్శ.** హైదరాబాద్: సమదర్శిని సాహిత్య సమాఖ్య.
61. మందేశ్వరరావు, వడలి.(1994). **పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర–సిద్ధాంతాలు**. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
62. మధుసూదనరావు, త్రిపురనేని. (1987). **సాహిత్యంలో వస్తు శిల్పాలు.** హైదరాబాద్: పర్స్పెక్టివ్స్.
63. మల్లయ్య, కాలువ. (2016). **గుమ్మి.** హైదరాబాద్: ఫెయిర్ మీడియా.
64. మోహన్, జి.ఎస్. (2010). **జానపద విజ్ఞానాధ్యయనం.** కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం.
65. మోహన్, జి.యస్. (1983). **సామెతలలో సాంఘిక జీవితం.** అనంతపురం: శ్రీనివాస పబ్లికేషన్స్.

66. యాకూబ్. (2018). **ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ**. హైదరాబాద్. నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్.
67. యాకూబ్(1991). **తెలుగు సాహిత్యం విమర్శలో రా. రా మార్గం**. హైదరాబాద్. శీలలోలిత ప్రచురణలు.
68. రంగనాథాచార్యులు, కె. కె. (2000). **తెలుగు సాహిత్య వికాసం (1900–1947 సంవత్సరాల మధ్య).** హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్.
69. రంగాచార్యులు, మాడభూషి. (2001). **తెలుగు కథానిక–బుచ్చిబాబు** (యం.ఫిల్. సిద్ధాంత గ్రంథం). హైదరాబాద్: శ్రీ బాలాజీ ఆర్ట్ ప్రింటర్స్.
70. రాంబాబు, వేదగిరి(సంక.). (2000). **కథానికా లక్ష్యము–లక్షణాలు.** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
71. రాంబాబు, వేదగిరి. (2000). **వెలుగుదారిలో తెలుగు పత్రికలు.** హైదరాబాద్: శ్రీవేదగిరి కమ్యూనికేషన్స్.
72. రాజు, మునిపల్లె. (2006). **జర్నలిజంలో సృజనరాగాలు**. హైదరాబాద్: నవోదయ బుక్ హౌస్.
73. రాధాకృష్ణ బూదరాజు. (1992). **వ్యావహారిక భాషా వికాసం.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
74. రామకృష్ణా రావు, గోవిందరాజు. (2007). **అనువాదం. కుప్పం**. ద్రావిడ విశ్వవిద్యాలయం.
75. రామకోటి శాస్త్రి, కేతవరపు. (1997). **అభ్యుదయవాద సాహిత్య విమర్శన దృక్పథం.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
76. రామకోటి శాస్త్రి, కేతవరపు. (2013). **శాస్త్రీయ సమీక్షలు – ముందుమాటలు.** హైదరాబాద్: జిజ్ఞాస ప్రచురణలు.
77. రామచంద్ర రెడ్డి, రాచమల్లు. (1987). **అనువాద సమస్యలు**. హైదరాబాద్. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
78. రామచంద్ర, తిరుమల.(1992). **తెలుగు పత్రికల సాహిత్యసేవ**. హైదరాబాద్: విశాలాంధ్ర బుక్ హౌస్.
79. రామచంద్రమూర్తి, కె. (2004). **వార్తారచన**. హైదరాబాద్: ప్రజాశక్తి బుక్ హౌస్.

80. రామమోహన రాయ్. (1982). **తెలుగు కవితా వికాసం**. హైదరాబాద్. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి కళా భవన్.

81. రామమోహనరావు, నండూరి. (1991). **తెలుగు పత్రికలలో కొత్త ప్రయోగాలు–పరిణామాలు** (ప్రసంగ వ్యాస సంకలనం). హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం

82. రామమోహన్ రాయ్, కడియాల.(2012). **మన తెలుగు నవలలు**.(నూరు నవలల విశ్లేషణ). హైదరాబాద్. అజో–విభో–కందాలం ఫౌండేషన్.

83. రామరాజు, బి. (1990). **తెలుగు జానపద గేయ సాహిత్యము.** హైదరాబాద్: జానపద విజ్ఞాన ప్రచురణలు.

84. రామారావు, ఎస్వీ. (2007). **తెలుగులో సాహిత్య విమర్శ అవతరణ–వికాసము.** హైదరాబాద్: పసిడి ప్రచురణలు. శ్రీకళా ప్రింటర్స్.

85. రాసాని, వి.ఆర్. (సంపా.). (2012). **తెలుగు కథ–దళిత, మైనారిటీ, గిరిజన, బహుజన జీవితం** (వ్యాస సంకలనం).

86. లక్ష్మణ చక్రవర్తి, సి. హెచ్. (సంపా.). (2008). **ఆధునిక సాహిత్య విమర్శకులు – ప్రస్థానాలు.** హైదరాబాద్: ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగు శాఖ.

87. లక్ష్మణ చక్రవర్తి, సి.హెచ్. (సంపా.) (2016). **తెలుగు సాహిత్య విమర్శ దర్శనం.** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

88. లక్ష్మణ చక్రవర్తి, సి.హెచ్. (సంపా.). (2004). **ఆధునిక సాహిత్య విమర్శ రీతులు.** హైదరాబాద్: ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగు శాఖ.

89. లక్ష్మణరెడ్డి, వి. (2002). **తెలుగు జర్నలిజం అవతరణ–వికాసం.** హైదరాబాద్: రచన జర్నలిజం కళాశాల

90. లక్ష్మీకాంతం, పింగళి. (2005). **ఆంధ్ర సాహిత్య చరిత్ర.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

91. లక్ష్మీకాంతం, పింగళి. (2012). **సాహిత్య శిల్పసమీక్ష.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

92. విజయ్ కుమార్, గుబ్బం. (2003). **తెలుగులో గేయకవిత్వం–సాముచిక చైతన్యం.** హైదరాబాద్: నవోదయ పబ్లికేషన్స్ (బుక్ హౌస్).

93. విశ్వనాథరెడ్డి, కేతు. (2005). **తెలుగు చరిత్ర, సంస్కృతి.** హైదరాబాద్: తెలుగు అకాడమీ.

94. విశ్వేశ్వరరావు, నామాల. (2001). **పత్రికారచన**. హైదరాబాద్: ప్రోగ్రెసివ్ కమ్యూనికేషన్స్.

95. విష్ణుమూర్తి, తాటికొండ. (1994). **బతుకమ్మ పండుగ పాటలు (సంస్కృతీ సంప్రదాయాలు).** హైదరాబాద్: పద్మావతీ ఆర్ట్స్ ప్రింటర్స్.

96. వీరభద్రయ్య, ముదిగొండ. (2012). **విమర్శ, కళాతత్త్వ శాస్త్రాలు**. హైదరాబాద్. తెలుగు అకాడమీ.

97. వెంకట రామనరసింహం, కాకర్ల. (1985). **సాహిత్య దర్శనం**. విజయవాడ: గంగాధర పబ్లికేషన్స్.

98. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. (1994). **నవలా శిల్పం.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

99. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. (1995). **కథాశిల్పం.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

100. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి.(1985). **అనుశీలన** (సాహిత్య వ్యాసాలు). హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

101. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి.(2002). **విమర్శా శిల్పం**. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

102. వెంకటావధాని, దివాకర్ల. (1981). **సాహిత్యసోపానాలు.** హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్.

103. వెంకటేశ్వరరావు, కొల్లు. (2010). **విమర్శకుడిగా కె.వి. రమణారెడ్డి.** హైదరాబాద్: విశాలాంధ్ర బుక్ హౌస్.

104. వెంకటేశ్వర్లు, పంతంగి.(2014). **తెలంగాణ తెలుగు నవల**. వరంగల్. కాకతీయ విశ్వవిద్యాలయం.

105. వేంకట కుటుంబరావు, బొడ్డపాటి. (1977). **ఆంధ్ర నవలా పరిణామం.** హైదరాబాద్: గాయత్రీ ప్రచురణము.

106. శరత్ జ్యోత్స్నారాణి, ఎస్. (2003). **స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత:వస్తువు, రూపం, శిల్పం.** హైదరాబాద్: జ్యోత్స్నా కళాపీఠ ప్రచురణలు.

107. శరత్ జ్యోత్స్నరాణి, ఎస్. (2007). **తెలుగు కథాసాహిత్యం–ఆధునిక దృక్పథాలు.** హైదరాబాద్: కర్షక ఆర్ట్స్ ప్రింటర్స్.

108. శరత్ జ్యోత్స్నరాణి, ఎస్. (2017). **ఆధునిక తెలుగు విమర్శకులు–విమర్శనా పద్ధతులు.** హైదరాబాద్: జ్యోత్స్న కళాపీఠం ప్రచురణలు.

109. శార్వరి (సంక.). (1992). **కథలెలా రాస్తారు?** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

110. శివప్రసాద్, ముదిగొండ. (2003). **భారతీయ మూలంకనము** (సాహిత్య విమర్శ). హైదరాబాద్: జాతీయ సాహిత్య పరిషత్.

111. శివశంకర్, పాపినేని. (1996). **సాహిత్యం – మౌలిక భావనలు**. గుంటూరు. పాపినేని ప్రచురణలు.

112. శ్రీదేవి, కిన్నెర. (2009). **దశాబ్ది కథానికలు (1956–65)–సామాజిక విశ్లేషణ.** బెంగళూర్: ఐ.ఎల్.ఎ. ముద్రణ.

113. శ్రీనివాస్. (2013). **మార్క్సిస్టు సాహిత్య విమర్శ: సిద్ధాంత రాజకీయ సమస్యలు.** హైదరాబాద్: వందన ప్రచురణలు.

114. శ్రీరామ చంద్రుడు, పుల్లెల. (2002). **అలంకార శాస్త్ర చరిత్ర**. హైదరాబాద్:ఆర్. కె . ప్రింటర్స్ అండ్ గ్రాఫిక్స్.

115. శ్రీరామమూర్తి, కోడూరి. (1979). **తెలుగు నవల సాహిత్యంలో మనోవిశ్లేషణ.** బొబ్బిలి.

116. శ్రీరామమూర్తి, కోడూరి. (2009). **తెలుగు కథానిక 1925–1980 పరిశీలన.** హైదరాబాద్: డా॥ మాడభూషి రంగాచార్య స్మారక సంఘం.

117. సంపత్కుమారాచార్య, కోవెల. (1981). **ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ: సంప్రదాయాక రీతి.** హైదరాబాద్: దక్షిణ భారత ప్రెస్.

118. సత్యనారాయణ, అడపా & సత్యనారాయణ, ద్యావనపల్లి. (2016). **తెలంగాణ చరిత్ర – సంస్కృతి రాష్ట్ర అవతరణ ఉద్యమాలు.** సంగం బుక్స్ ప్రైవేట్ లిమిటెడ్.

119. సత్యనారాయణ, కంభంపాటి. (1984). **ఆంధ్రుల సంస్కృతి–చరిత్ర – 1**. హైదరాబాద్. హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

120. సాంబమూర్తి, దాహగాం. (2015). **తెలుగు భాషా సాహిత్య దర్పణం.** హైదరాబాద్: నీల్ కమల్ పబ్లికేషన్స్.

121. సిమ్మన్న, వెలమల. (2011). **తెలుగు సాహిత్య చరిత్ర.** విశాఖపట్నం: దళిత సాహిత్య పీఠం.

122. సిమ్మన్న, వెలమల. (2021). **తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు**. విజయవాడ: విశాలాంధ్ర పబ్లికేషన్స్.

123. సుజాత, అడువాల. (2008). **డా॥ పి. యశోదారెడ్డి కథలు సమగ్ర పరిశీలన.** కరీంనగర్: తెలంగాణ రచయితల వేదిక.

124. సుజాతారెడ్డి, ముదిగంటి(సంపా.). (2005). **ముద్దెర.** హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్.

125. సుబ్రహ్మణ్యం, జి.వి. (1983). **ఆంధ్ర సాహిత్య విమర్శ–ఆంగ్ల ప్రభావం.** హైదరాబాద్: ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం షష్టిపూర్తి ప్రచురణలు.

126. సుబ్రహ్మణ్యం, జి.వి. (1996). **ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం.** హైదరాబాద్: జి.వి. సుబ్రహ్మణ్యం షష్టిపూర్తి ప్రచురణలు.

127. సుబ్రహ్మణ్యం, జి.వి. (1999). **20వ శతాబ్ది విశ్వసాహిత్యవిమర్శ**. హైదరాబాద్: జివియస్ సాహితీ కళాపీఠం.

128. సుబ్రహ్మణ్యం, జి.వి. (2012). **సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు.** హైదరాబాద్: తెలుగు అకాడమీ.

129. సుబ్రహ్మణ్యం, పి. యస్.(2019). **ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు**. హైదరాబాద్. పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం.

130. సుభాషిణి, యర్రదొడ్డి. (2011). **అన్నమాచార్య సంకీర్తనలు–వ్యాజస్తుతి, వ్యాజనింద అలంకార పరిశీలన.** పీలేరు: చందన ప్రచురణలు.

131. సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం(వ్యాఖ్య.). (2013). **కావ్యాలంకార సంగ్రహం.** హైదరాబాద్: ఎమెస్కో.

132. సౌభాగ్యమ్మ, హెచ్.ఎస్. (1989). **మనం–మన పాత్రికేయులు.** తిరుపతి: ఎస్.హెచ్. ప్రచురణలు.

133. సౌభాగ్యమ్మ, హెచ్.ఎస్. (1992). **తెలుగులో సాహిత్య పత్రికలు** (పి.హెచ్‌డి. సిద్ధాంత గ్రంథం). తిరుపతి: ఎస్జీడి పబ్లికేషన్స్.

134. హరికృష్ణ, మామిడి. (సంపా.). (2021). **తెలంగాణ బోనాలు.** హైదరాబాద్: భాషా సాంస్కృతిక శాఖ.

**నిఘంటువులు**

135. కుటుంబరాయ శర్మ, బొడ్డపాటి.(1961).**విశ్వసాహితి తెలుగు విజ్ఞాన సర్వస్వం**.(సంపుటి-6). మద్రాసు. తెలుగు భాష సమితి.

136. నళినీ, ఎస్.ఎస్. (2009). **సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ.** హైదరాబాద్: చరితా ఇంప్రెషన్స్.

137. బ్రౌన్, సి. పి. (1990). **బ్రౌణ్య ఇంగ్లీష్–తెలుగు నిఘంటువు**. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

138. సీతారామాచార్యులు, బహుజనపల్లి. (2012). **శబ్ద రత్నాకరము**. విజయవాడ. శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో.

139. సూర్యామోహన్, పరకాల (2001). **జర్నలిస్టుల పదకోశం.** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

140. సోమయాజులు, వావిలాల.(1961). **తెలుగు విజ్ఞాన సర్వస్వం (సంపుటి–3)**. మద్రాసు తెలుగు భాషా సమితి.

★★★

## అనుబంధం – 1

## ఇంటర్వ్యూ

ప్రశ్నావళి–1

కె. రామచంద్రమూర్తిగారి అభిప్రాయాలు: (జూలై 17, 2018)

1) **సాక్షి పత్రిక ప్రారంభానికి పూర్వం తెలుగులో అనేక పత్రికలున్నాయి. అయినప్పటికీ ఈ పత్రిక రావడానికి గల ప్రధాన కారణం, లక్ష్యం ఏమిటి?**

జ: సాక్షి పత్రిక తీసుకురావడానికి ప్రధాన కారణం, లక్ష్యం రెండూ ఉన్నాయి. ఇది కేవలం వార్తా సమాచార వాహినిగా వచ్చిన పత్రిక కాదు. దీనికొక రాజకీయ నేపథ్యం ఉంది. ముఖ్యంగా Y.S. రాజశేఖర్ రెడ్డిగారు కాంగ్రెస్ నాయకుడిగా ఉన్నప్పుడు గానీ, ఆయన MLAగా ఉన్నప్పుడు గానీ, PCC ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు గానీ, 2004లో ముఖ్యమంత్రిగా ఎన్నిక అయినప్పుడు గానీ రెండు పత్రికలు పని గట్టుకొని తన గురించి వ్యతిరేకంగా రాస్తున్నాయని రాజశేఖరరెడ్డిగారు నమ్మారు. 2003లో పాదయాత్ర చేసినపుడు కూడా ఆ విషాయన్ని పత్రికలు అంతగా ప్రచురించలేదు. అది ఈనాడు, ఆంధ్రజ్యోతి అని పేరు పెట్టే ఆ రెండు పత్రికల గూర్చి బహిరంగంగా చెప్పేవారు. నా గురించి వ్యతిరేకంగా రాస్తున్నారు దీనికి విరుగుడు ఏమిటని ఆలోచించి, తన గూర్చి ప్రజలకు తెలియబరచాలని, మనకు కూడా ఒక మీడియా వ్యవస్థ ఉంటే బాగుంటుందని తన కొడుకు Y.S. జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షుడిగా జగతి సంస్థ ఏర్పాటుచేసి దాని తరపున సాక్షి పత్రికను తీసుకువచ్చారు. అలాగే 'ఇందిరా' టెలివిజన్ అనే సంస్థ ఏర్పాటు చేసి 'సాక్షి' TVని కూడా తీసుకువచ్చారు. 2008లో ఈ పత్రిక ప్రారంభం అయింది.

2) **సాక్షి బాధ్యతలు ఎవరు నిర్వర్తిస్తున్నారు?**

జ: Y.S. జగన్ గారు బాధ్యతలను నిర్వర్తించారు. రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత ఈ మీడియా బాధ్యతల నుండి తప్పుకొని జగన్ గారు తన భార్య Y.S. భారతిని దీనికి చైర్‌పర్సన్ చేసి ఆయన పార్టీ కార్యక్రమాల్లో లీనమయ్యారు.

3) **సాక్షి పత్రిక మొదటి ఎడిటర్ ఎవరు?**

జ: దీనికి మొదటి ఎడిటర్ K.NY. పతంజలి. అప్పటి ఎడిటోరియల్ డైరెక్టర్ సజ్జల రామకృష్ణారెడ్డి.

**4) సాక్షి మీడియా పెట్టడానికి గల కారణం ఏమిటి?**

జ: సాక్షి పత్రిక 2008లో వచ్చింది. 2009లో సాక్షి మీడియా ఏర్పడింది. ఇది కూడా రాజకీయ కారణాల వలననే ఏర్పాటు చేశారు. Other side of the storyని చూపించడానికి దీన్ని పెట్టామని దీని ప్రారంభంలో కూడా Y.S. రాజశేఖర్ రెడ్డిగారు పేర్కొన్నారు.

**5) సాక్షి పత్రిక తీసుకురావాలనే మొదట ఆలోచన ఎవరిది?**

జ: ఈ పత్రిక స్థాపనా ఆలోచన మొదట Y.S. రాజశేఖర్ రెడ్డిగారిదే. దీన్ని స్థాపించడానికి కూడా ఆయనకు ఎక్కువ సమయం కూడా పట్టలేదు.

**6) సాక్షి పత్రిక మొదటి ముద్రణ ఎక్కడ జరిగింది. ఎక్కడ మొదట ప్రారంభమైంది?**

జ: మొదటి ముద్రణ హైదరాబాద్‌లో జరిగింది. ప్రపంచంలోనే మొదటిసారిగా 22 ప్లేసెస్ నుండి ఒకేసారి 22 ఎడిషన్లుగా వచ్చిన మొదటి పత్రిక సాక్షి. అన్ని పేజీలు రంగుల్లో ముద్రించబడ్డ ఏకైక పత్రిక సాక్షి.

**7) ఈ త్రిక రూపకల్పన ఎవరు చేశారు? పేరు ఎవరు పెట్టారు?**

జ: ఈ పత్రికకు రూపకల్పన లండన్‌కి చెందిన మారియోగార్సియో చేశారు. 'సాక్షి' అనే పేరు Y.S.R. పెట్టారు.

**8) సాక్షి పత్రిక సర్క్యులేషన్ ఎంత? ఏ ప్రాంతంలో ఎక్కువగా ఉంది?**

జ: పదకొండు లక్షల సర్క్యులేషన్ ఇప్పటి వరకు ఉంది. 23 జిల్లాల నుండి 22 ఎడిషన్లు వచ్చింది. ఎక్కువ సర్క్యులేషన్ ఉన్న ప్రాంతం హైదరాబాద్ మొదటి స్థానంలో ఉంటుంది. గుంటూరు 2వ స్థానంలో ఉంది. తక్కువ సర్క్యులేషన్ అదిలాబాద్‌లో ఉంది.

**9) ఈ పత్రికలో ఏదైనా ప్రాంతానికి ప్రాధాన్యతను ఇస్తారా?**

జ: ఈ పత్రికలో వార్తా ప్రచురణకు ప్రజాహితమే గీటురాయి. ప్రజల క్షేమాన్ని కలిగించే వాస్తవికమైన అంశాలన్నింటిని వీరు ప్రచురిస్తారు. కొన్ని ప్రజలకు తెలియాల్సిన విమర్శలున్నాయని అనుకున్నప్పుడు వాటిని కూడా ప్రచురిస్తారు. ఏదైనా ప్రాంతానికి ప్రాధాన్యత ఉంటుందా అంటే అది పాఠకుల అభిరుచిపై ఆధారపడి ఉంటుంది. ఆ ప్రాంత ఎడిషన్‌లలో ఏ రకమైన పాఠకులు ఎక్కువగా ఉంటారో వారిని ఆధారంగా చేసుకొని సంబంధిత విషయాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

**10) ఈ పత్రికలో ఎటువంటి భాషను వాడుతున్నారు?**

**జ:** పత్రికలో భాష ప్రామాణిక భాషనే వాడుతున్నారు. డిస్ట్రిక్ట్ స్పెషల్‌లో మాత్రం ఆయా ప్రాంత మాండలిక భాష ఉంటుంది. మెయిన్ పేపర్‌లో మాత్రం మాండలికానికి అంత ప్రాధాన్యత ఉండదు.

**11) సాక్షి పత్రిక మొదటి పేజీలో Y.S.R. ఫోటో కింద ఒక కొటేషన్ కన్పిస్తుంది. ఏమిటది? ఎక్కడి నుండి తీసుకున్నారు?**

**జ:** Y.S.R. చెప్పిన మాటలు, వివిధ సందర్భాల్లో సభల్లో చెప్పిన ఉపన్యాసాల్లోని కొటేషన్స్ తీసుకొని ఇలా ప్రతీరోజు ప్రచురిస్తారు.

**12) సాక్షి పత్రికల్లో ఎన్ని రకాలున్నాయి?**

**జ:** సాక్షి పత్రిక ఒకటి. సాక్షి స్కూల్ ఎడిషన్ అని స్కూలు పిల్లలకు సంబంధించినది రెండవది.

**13) సాక్షిలో సాహిత్యాంశాలను ఎప్పటి నుండి ప్రచురిస్తున్నారు?**

**జ:** ఈ పత్రికలో సాహిత్య పేజీ పత్రిక ప్రారంభం నుండి కన్పిస్తుంది. సాహిత్య వ్యాసాలే కాకుండా సంపాదకీయాల్లో సాహిత్య వ్యాసాలు మనకు కనబడుతాయి. కాని వీటి సంఖ్య తక్కువ. సాహిత్య పేజీ మొదటి నుండి ఉంది.

**14) సాహిత్య పేజీని పెట్టడానికి గల కారణం?**

**జ:** సాహిత్యమంటే సంస్కృతి ప్రతిబింబం. ప్రజల్లో ఒక సుసంస్కారవంతమయిన జీవితానికి అవసరమైన పద్ధతులను పెట్టడానికి, సమాజంలో ఉన్న రకరకాల సమస్యలను కొత్త కోణాల్లో ఆవిష్కరించడానికి, ఏ విధంగానైనా కావచ్చు. ప్రధానంగా సమకాలీన సాహిత్యానికి అద్దం పడుతూ ఈ పేజీ ఉపయోగపడుతుంది.

**15) సాక్షి సాహిత్యంలో ఎక్కువగా పాశ్చాత్య సాహిత్యం ఎందుకు ప్రచురిస్తున్నారు?**

**జ:** ఇంతకు ముందు ప్రాచీన సాహిత్యానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చేవారు. ఇప్పుడు ఆధునిక సాహిత్యాన్ని ఎక్కువగా ప్రచురిస్తూ అమెరికా, యూరోపియన్ ఇలా గ్లోబలైజేషన్ దృష్ట్యా ప్రపంచ సాహిత్య చరిత్ర ఎలా ఉందని చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. **అనుబంధం – 2**

# అనుబంధం–2

## సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాల పట్టిక (2016, 2017)

## సాక్షి, నమస్తే దినపత్రికల్లో వెలువడిన వ్యాసాల కాలక్రమణానుసార పట్టిక

## సాక్షి దినపత్రికలోని సాహిత్య వ్యాసాల పట్టిక (2016)

| క్రమ సంఖ్య | తేది | వ్యాసం పేరు | వ్యాసకర్త |
|---|---|---|---|
| 1 | జనవరి 4, 2016 | విహంగ వీక్షణం<br>2015 కథలు ఎలాగున్నాయి | స్వాతి శ్రీపాద |
| 2 | జనవరి 11, 2016 | సందర్భం<br>విపుల ప్రపంచంలోకి వేయి పడగలు | గంద్ర లక్ష్మణరావు |
| 3 | జనవరి 18, 2016 | ఆవిష్కరణ<br>పాతికేళ్ళ కథ ప్రయాణం | వాసిరెడ్డి నవీన్ |
| 4 | జనవరి 25, 2016 | బ్లాగు కాచిన వెన్నెల<br>ఒక కళాకారుడి జీవన లాలాస అనుకోకుండా అలా | పి . మోహన్ |
| 5 | ఫిబ్రవరి 01, 2016 | పరిశోధన<br>అన్నమయ్య వేమన్న పదాలు | యానాద్రి |
| 6 | ఫిబ్రవరి 08, 2016 | రాబోవు పుస్తకం<br>పోయేది తక్కువ పొందేది ఎక్కువ | ముకుంద రామారావు |
| 7 | ఫిబ్రవరి 15, 2016 | పాత బంగారం<br>ఆధునిక కథ ఎలా ఉండాలి | డా . అప్పిరెడ్డి హరినాథ రెడ్డి |
| 8 | ఫిబ్రవరి 22, 2016 | కొత్త అనువాదం<br>నీట రాసిన పేరొక్కటి కాలగతిని మార్చింది | ఆచార్య గంగిశెట్టి లక్ష్మి నారాయణ |
| 9 | ఫిబ్రవరి 29, 2016 | పుస్తకంలోంచి<br>కవిత్వంతో తొలి ములాఖాత్ | ఎన్. వేణుగోపాల్ |
| 10 | మార్చి07, 2016 | మార్చి 8 న మహిళా దినోత్సవం<br>స్త్రీ స్వేచ్ఛ అంటే ? | రంగనాయకమ్మ |
| 11 | మార్చి 14, 2016 | నివేదన<br>కొత్త సందర్భంలో రాయలసీమ కథ | బండి నారాయణ స్వామి |
| 12 | మార్చి 21, 2016 | సదస్సు పత్రాలు<br>పరిశోధన: నాడు, నేడు,రేపు | వి. ఎ. కె. రంగారావు |

| | | | |
|---|---|---|---|
| 13 | మార్చి 28, 2016 | పాతకుడితో సంభాషణ<br>కథ తెలుస్తూనే ఉంటుంది | మహమ్మద్ ఖదీర్ బాబు |
| 14 | ఏప్రిల్ 04, 2016 | అన్నమయ్య వర్ధంతి / ఉగాది<br>అన్నమయ్య అచ్చ తెలుగు | ఆచార్య రవ్వా శ్రీహరి |
| 15 | ఏప్రిల్ 11, 2016 | విశ్లేషణ<br>రేపటి గతాన్ని హెచ్చరిస్తున్న గేదె మీది పిట్ట | నండూరి రాజగోపాల్ |
| 16 | ఏప్రిల్ 18, 2016 | పుస్తక సమీక్ష<br>తెలంగాణ వికాసోద్యమ ప్రాతినిధ్య గ్రంథం | డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి |
| 17 | ఏప్రిల్ 25, 2016 | లేఖా సాహిత్యం<br>నన్నెవరూ, నువ్వెవరు అని అడగవద్దు! | శివలెంక రాజేశ్వరి దేవి |
| 18 | మే 02, 2016 | విమర్శ<br>మంచి నవలలో పంటి కింద రాళ్లు | రామతీర్థ |
| 19 | మే 05, 2016 | అస్తమయం<br>నలుపు మందారాల మాన్యం చెల్క | పున్నా కృష్ణమూర్తి |
| 20 | మే 16, 2016 | అనువాద సాహిత్యం<br>దర్పన దర్శనం | కవిని ఆలూరి |
| 21 | మే 23, 2016 | ప్రసంగం<br>సంగటనల వెంట సమకాలీన కవి | నామాడి శ్రీధర్ |
| 22 | మే 30, 2016 | స్మరణ<br>గురజాడ తమ్ముడే బతికివుంటే... | డా. కాళిదాస పురుషోత్తం |
| 23 | జూన్ 06, 2016 | కొత్త అనువాదం<br>ఓ చిన్నారి డైరీ | మాడభూషి కృష్ణప్రసాద్ |
| 24 | జూన్ 13, 2016 | బుచ్చిబాబు శత జయంతి<br>నా కథా రచనలోని రహస్యాలు | బుచ్చిబాబు |
| 25 | జూన్ 20, 2016 | నేడు కేశవదాసు 140 వ జయంతి<br>తొలి తెలుగు సినీకవి | పైడిపాల |
| 26 | జూన్ 27, 2016 | పుస్తకంలోంచి...<br>ఎలాంటి రచన కాలానికి నిలబడుతుంది ? | అన్నపరెడ్డి వేంకటేశ్వర రెడ్డి |
| 27 | జులై 04, 2016 | ముందుమాట<br>తెలుగులో మామ్ కథలు | అంపశయ్య నవీన్ |
| 28 | జులై 11, 2016 | 40 వసంతాల సారసత్వ వివేచన<br>రా.రా. దృష్టిలో సాహిత్య ప్రయోజనం | టి . హజరత్తయ్య |

| | | | |
|---|---|---|---|
| 29 | జులై 18, 2016 | ఆత్మకథ<br>బాపు ఇచ్చిన ఏక జవాబు | బాలి |
| 30 | జులై 25, 2016 | జులై 29 న సినారె జన్మదినం<br>లలితమైన భాష రమ్యమైన భావం | డా. ఎ. రాధాకృష్ణ రాజు |
| 31 | ఆగస్టు 01, 2016 | నివాళి<br>అడవి మీద విరిసిన అక్షరం | డా.గోపరాజు నారాయణరావు |
| 32 | ఆగస్టు 08, 2016 | సమీక్షా వ్యాసం<br>శిష్ట్లాకి దీరగమిస్తే శ్రీ శ్రీ | నామిని |
| 33 | ఆగస్టు 22, 2016 | ఆగస్టు 25 న చిత్రకారుడు చంద్ర<br>70 వ జన్మదినం<br>అసాధారణ చిత్రాల చంద్రుడు | పన్నాల సుబ్రహ్మణ్య భట్టు |
| 34 | ఆగస్టు 29, 2016 | కొత్త అనువాదం<br>ఎవరితను ?పుట్టనే లేదు ,మళ్లీ బతికొచ్చాడు! | కె . బి . గోపాలం |
| 35 | సెప్టెంబర్ 05, 2016 | నేడు ఉపాధ్యాయ దినోత్సవం<br>నవతరం సంపాదకోపాధ్యాయుడు | పిన్నమనేని మృత్యుంజయులు |
| 36 | సెప్టెంబర్ 05, 2016 | సెప్టెంబర్ 9 న కాళోజీ జయంతి<br>కాళోజీ జీవితంలోని రెండు ఉదంతాలు | అమ్మంగి వేణుగోపాల్ |
| 37 | సెప్టెంబర్ 12, 2016 | అభిప్రాయం<br>ఫెమినిజం కాదు ఆస్తిత్వవాదం ! | ఫెమినిస్ట్ ప్రసాద్ |
| 38 | సెప్టెంబర్ 19, 2016 | అస్తమయం<br>గుడి ,జైలు ... బందించడానికే రెండు! | బొజ్జా తారకం |
| 39 | సెప్టెంబర్ 26, 2016 | నేపథ్యం<br>జీవించు ... నేర్చుకో ... అందించు ! | తుమ్మేటి రఘోత్తమరెడ్డి |
| 40 | అక్టోబర్ 03, 2016 | అనువాదం<br>జీవితకాలం స్వల్పమేమి కాదు ! | జి. లక్ష్మీ |
| 41 | అక్టోబర్ 10, 2016 | పండుగ మాట<br>గురజాడ కార్పెంటర్ దృష్టిలో స్త్రీ | డా. కాళిదాసు కృష్ణమూర్తి |
| 42 | అక్టోబర్ 17, 2016 | పురస్కారం<br>సామాన్య మానవుల అసామాన్య కవి | ఓల్గా |
| 43 | అక్టోబర్ 24, 2016 | నివాళి<br>దళిత బహుజన కలల రేడు | బండి నారాయణ స్వామి |
| 44 | నవంబర్ 07, 2016 | అసమర్థుని జీవనయాత్రకు 70 ఏళ్లు<br>తొలి తెలుగు మనోవైజ్ఞానిక నవలకు 70 ! | అంపశయ్య నవీన్ |

| | | | |
|---|---|---|---|
| 45 | నవంబర్ 14, 2016 | తెలుగు గజల్ కు 50 ఏళ్లు<br>వలపునై నీ హృదయ సీమల నిలువవలేనని ఉన్నది | రోచిష్మాన్ |
| 46 | నవంబర్ 21, 2016 | వ్యాసం<br>కథల్లో అంతరార్ధం | ఎలనాగ |
| 47 | నవంబర్ 28, 2016 | వ్యక్తిత్వం<br>కామూ, సార్త్రే స్నేహపూర్వక శత్రుత్వం | సాకం నాగరాజు |
| 48 | డిసెంబర్ 05, 2016 | అభిప్రాయం<br>శిల్పం –కథ | పి. రామకృష్ణ |
| 49 | డిసెంబర్ 12, 2016 | బుక్ ఫెయిర్<br>నచ్చిన పది పుస్తకాల జాబితా | పూదూరి రాజిరెడ్డి |
| 50 | డిసెంబర్ 19, 2016 | పునర్ముద్రణ<br>50 ఏళ్ళ తర్వాత బాణుడి కాదంబరి | విద్వాన్ విశ్వం |
| 51 | డిసెంబర్ 26, 2016 | పురస్కారం<br>సృజన మహాదృఢం, అతి మృదులం | దర్భశయనం శ్రీనివాసాచార్య |

# నమస్తే తెలంగాణ దినపత్రికలోని సాహిత్య వ్యాసాల పట్టిక (2016)

| క్రమ సంఖ్య | తేది | వ్యాసం పేరు | వ్యాసకర్త |
|---|---|---|---|
| 1. | జనవరి 4, 2016 | తెలంగాణ చరిత్ర పై మొదటి సమగ్ర రచన | టంకశాల అశోక్ |
| 2. | జనవరి 11, 2016 | మాండలిక పదాలను వాడుదాం | డా. మట్ట సంపత్కుమార్ రెడ్డి |
| 3. | జనవరి 18, 2016 | ఉద్యమానికి ఊపిరి సాహిత్యం | డా. తన్నీరు సురేశ్ |
| 4. | జనవరి 25, 2016 | కథల్లో ప్రాంతోచిత భాష | డా. బి. వి. ఎన్ స్వామి |
| 5. | ఫిబ్రవరి 01, 2016 | ఇంత మొహమాటం అవసరమా | బి. యస్ రాములు |
| 6. | ఫిబ్రవరి 08, 2016 | భాష: ప్రామాణికం, తెలంగాణ | డా. నలిమెల భాస్కర్ |
| 7. | ఫిబ్రవరి 15, 2016 | మన కథలు – మన వెతలు | నందిని సిధారెడ్డి |
| 8. | ఫిబ్రవరి 22, 2016 | సాహిత్యంలోను దిట్ట | డా. గుమ్మన్నగారి బాల శ్రీనివాస మూర్తి |
| 9. | ఫిబ్రవరి 29, 2016 | ఒక పాలకుర్తి, ఒక బమ్మెర | అనుమాండ్ల భూమయ్య |
| 10. | మార్చి 07, 2016 | నాటక రంగానికి స్తబ్ద కాలం | డా. సంగనభట్ల నరసయ్య |
| 11. | మార్చి 14, 2016 | తెలంగాణ తెలుగు ప్రామాణికత | డా. గంర్ర లక్ష్మణ రావు |
| 12. | మార్చి 21, 2016 | ఖలీల్ జీబ్రాన్ 'ద వాండరర్' | బి. యస్ రాములు |
| 13. | మార్చి 28, 2016 | సంఘర్షణల మధ్య మూడో మనిషి | పుష్యమి సాగర్ |
| 14. | ఏప్రిల్ 04, 2016 | మోటబాయి సప్పుడు – మోదుగు పూలు సౌందర్యం | సందీప్ రెడ్డి కొత్తపల్లి |
| 15. | ఏప్రిల్ 11, 2016 | పరిశోధనా భీష్ముడు | డా. వై. కృష్ణకుమారి |
| 16. | ఏప్రిల్ 18, 2016 | పల్లె పాట పట్టిన పరిశోధకుడు | ఆచార్య రవ్వా శ్రీహరి |
| 17. | మే 02, 2016 | సాహిత్యంలో తొలి రచనలు | డా. ద్వానా శాస్త్రి |
| 18. | మే 09, 2016 | తెలంగాణ మట్టి పరిమళం | డా. బెల్లం కొండ సంపత్ కుమార్ |
| 19 | మే 16, 2016 | సాహిత్య చరిత్రలో మైలురాయి | బి. యస్ రాములు |
| 20. | మే 23, 2016 | తెలంగాణ చైతన్య దీపం సురవరం | ప్రొ. యస్వీ. సత్యనారాయణ |
| 21. | మే 30, 2016 | ఓరుగల్లు పత్రికలు ... ఉద్యమ వేదుకలు | నమిల కొండ సునీత |
| 22. | జూన్ 06, 2016 | నవాబుల సంస్కృతికి ప్రతిరూపాలు చార్మినార్ కథలు | డా. ద్వానా శాస్త్రి |
| 23. | జూన్ 13, 2016 | కవి సైనికుని విన్యాసం | అమ్మంగి వేణుగోపాల్ |
| 24. | జూన్ 20, 2016 | అపూర్వ ప్రతిభాశాలి చందాల కేశవదాసు | డా. ఎం. పురుషోత్తమా చారి |
| 25. | జూన్ 27, 2016 | ఆ పాట అజరామరం | బి. యస్ రాములు |
| 26. | జులై 04, 2016 | ఇది మన స్వేచ్ఛా నర్తనం! | శ్రీరామోజు హరగోపాల్ |

| | | | |
|---|---|---|---|
| 27. | జులై 11, 2016 | సాహిత్య స్పందనలో విభిన్న కోణాలు | జి. లక్ష్మీ నరసయ్య |
| 28. | జులై 18, 2016 | కవిత్వ అగ్నిధార దాశరథి | డా. యస్వీ. సత్యనారాయణ |
| 29. | జులై 25, 2016 | ఇకో కవితా ఉద్యమాలు | వి. అరుణ |
| 30. | ఆగష్టు 01, 2016 | ... చాల పెద్దమ్మ! | అంబటి సురేంద్ర రాజు |
| 31. | ఆగష్టు 08, 2016 | సాహిత్యంలో స్వాభిమాన ప్రకటన | ఆచార్య కోవెల సుప్రసన్నా చార్య |
| 32. | ఆగష్టు 15, 2016 | ఆ కలం వజ్రాయుధం అచ్చ తెలంగాణ హృదయం | జూలూరి గౌరీశంకర్ |
| 33. | ఆగష్టు 22, 2016 | మన కథలు మన దృశ్యాలు | హుమయూన్ సంఘీర్ |
| 34. | ఆగష్టు 29, 2016 | కథా సాహిత్యంలో స్తబ్దత | బి. ఎస్. రాములు |
| 35. | సెప్టెంబర్ 5, 2016 | ధిక్కార స్వర ఆది గురువు | అమ్మంగి వేణుగోపాల్ |
| 36. | సెప్టెంబర్ 12, 2016 | తెలంగాణలో 'నవలా' మణులు | సయ్యద్ ఆఫ్రీన్ బేగం |
| 37. | సెప్టెంబర్ 19, 2016 | తెలంగాణ సాయుధ పోరాటం – గేయ కవిత్వం | డా. సందినేని రవీందర్ |
| 38. | సెప్టెంబర్ 26, 2016 | సామాజిక వాస్తవ చిత్రాలు | డా. దార్ల వేంకటేశ్వర రావు |
| 39. | అక్టోబర్ 03, 2016 | మమతా మూర్తి జాషువా | డా. సందినేని రవీందర్ యాదవ్ |
| 40. | అక్టోబర్ 10, 2016 | ముంబై నిర్మాణంలో మనవాళ్లు | మచ్చ ప్రభాకర్ |
| 41. | అక్టోబర్ 17, 2016 | బాబ్ డిలాన్ – జానపద పునరుజ్జీవనం | కందుకూరి రమేశ్ బాబు |
| 42. | అక్టోబర్ 24, 2016 | తెలంగాణ సంస్కృతి జానపద కళారూపాలు | పోలవల్లి శ్రీకాంత్ మేరు |
| 43. | నవంబర్ 07, 2016 | తెలుగు సాహిత్యంలో మైనార్టీ స్త్రీవాద జీవన చిత్రణం | డా. మహ్మద్ హసేన |
| 44. | నవంబర్ 14, 2016 | ఊరు చరిత్ర మీద పాదముద్ర | రాజేందర్ జింబో |
| 45. | నవంబర్ 21, 2016 | ఆధునికత మీద సాధికారత | డా. శంకర మంచి శ్యాం ప్రసాద్ |
| 46. | నవంబర్ 28, 2016 | సాహిత్యం అంటే జీవితమే | ఎస్ . మల్లారెడ్డి |
| 47. | డిసెంబర్ 05, 2016 | తెలంగాణ సాహితీ రత్నమాలిక | డా. కొత్తి రెడ్డి మల్లారెడ్డి |
| 48. | డిసెంబర్ 12, 2016 | కన్నీరు పోత పోసిన కవి | ఎస్ . మల్లారెడ్డి |
| 49. | డిసెంబర్ 19, 2016 | కేశవ రెడ్డి సాహిత్య పునర్మూల్యాంకనం | డా. దార్ల వేంకటేశ్వర రావు |
| 50. | డిసెంబర్ 26, 2016 | ఆ కనుల కాంతులే తొవ్వ జూపినై... | ఎస్. మల్లారెడ్డి |

## నమస్తే తెలంగాణ దినపత్రికలోని సాహిత్య వ్యాసాల పట్టిక (2017)

| క్రమ సంఖ్య | తేది | వ్యాసం పేరు | వ్యాసకర్త పేరు |
|---|---|---|---|
| 1) | జనవరి 02, 2017 | అధిక్షేప ముక్తకాలు! | పెన్నా శివరామకృష్ణ |
| 2) | జనవరి 09, 2017 | కఠోర పరిశ్రమతో సానదేలిన వజ్రం | అమ్మంగి వేణుగోపాల్ |
| 3) | జనవరి 16, 2017 | భావాలను భౌతికశక్తిగా మార్చిన సాంస్కృతిక సైనికుడు... | ఎస్. మల్లారెడ్డి |
| 4) | జనవరి 23, 2017 | చిత్రకళావిమర్శకు ఆద్యుడు | సామిడి జగన్ రెడ్డి (8500632551) |
| 5) | జనవరి 30, 2017 | హైదరాబాద్ కీ షాన్ ఔర్ పహచాన్.... | ఆచార్య ఎస్వీ. సత్యనారాయణ |
| 6) | ఫిబ్రవరి 06, 2017 | తెలంగాణ మాగాణమే కాన్వాస్... జీవితమే కళాఖండం... | ఎస్. మల్లారెడ్డి |
| 7) | ఫిబ్రవరి 13, 2017 | దేశి పుట్టినిల్లు... | డా॥ గంగ్ర లక్ష్మణరావు (9849328036) |
| 8) | ఫిబ్రవరి 20, 2017 | సాదాసీదా సాహితీమూర్తి | డా॥ వెల్చాల కొండలరావు (9848195959) |
| 9) | ఫిబ్రవరి 27, 2017 | జానపద పాట... ఉద్యమ పాట... ధూంధాం | ఎస్. మల్లారెడ్డి, గడ్డం సతీష్ |
| 10) | మార్చి 06, 2017 | పత్రికల్లో భాషాస్వరూపం | డా॥ నమలకొండ సునీత (9908468171) |
| 11) | మార్చి 13, 2017 | బతుకాట సవ్వడుల ‘గవ్వలు’ | వెల్దండి శ్రీధర్ (9866977741) |
| 12) | మార్చి 20, 2017 | ఉదార సామ్యవాదం, తెలంగాణ హృదయం | అమ్మంగి వేణుగోపాల్ (9441054637) |
| 13) | మార్చి 27, 2017 | భాషాభివృద్ధికి సాహిత్య అకాడమీ ఆవశ్యం | డా॥ సంగనభట్ల నరసయ్య (9440073124) |
| 14) | ఏప్రిల్ 03, 2017 | సాహిత్య చరిత్రను పరిశోధిద్దాం | తంగెళ్ల వకుళారాణి |
| 15) | ఏప్రిల్ 10, 2017 | సాహిత్య పరిశోధనకు ఓ వెలుగు | డా॥ దార్ల వెంకటేశ్వరరావు (9989628049) |
| 16) | ఏప్రిల్ 17, 2017 | బుద్ధుడు తెలంగాణకు వచ్చాడా? | డా॥ సంగనభట్ల నరసయ్య (9440073124) |
| 17) | ఏప్రిల్ 24, 2017 | వందేళ్ల చలన సుగంధాలు! | డా॥ నాళేశ్వరం శంకరం (9440451960) |

| | | | |
|---|---|---|---|
| 18) | మే 01, 2017 | అస్తిత్వ భావాల కథాహారం | డా॥ కె.ఎన్. మల్లీశ్వరి (8885016788) |
| 19) | మే 08, 2017 | సదాశివ సంగీత సంస్కారం | అమ్మంగి వేణుగోపాల్ (9441054637) |
| 20) | మే 15, 2017 | చిన్నకథ – పెద్ద ప్రపంచం | అఫ్సర్ |
| 21) | మే 22, 2017 | ప్రచారాస్త్రాలుగా జానపదాలు | బోనాల ప్రకాశ్ (9490556682) |
| 22) | మే 29, 2017 | వెండితెరపై వెన్నెలరేడు | సుంకర రమేశ్ |
| 23) | జూన్ 05, 2017 | తెలుగుకు పుట్టినిల్లు తెలంగాణం | డా॥ సంగనభట్ల నర్సయ్య |
| 24) | జూన్ 12, 2017 | మట్టి సుగంధాల కవి సిధారెడ్డి | డా॥ వాణీ దేవులపల్లి (866962414) |
| 25) | జూన్ 19, 2017 | విశ్వమానవుడు సినారె | బి.యస్. రాములు (8331966987) |
| 26) | జూన్ 26, 2017 | ఎవడాపును కవి వాక్కును... | కొండపల్లి నీహారిణి (9866360082) |
| 27) | జులై 03, 2017 | కృష్ణాతీరంలో ఆధునిక రచయితలు | ద్వా.నా. శాస్త్రి (9849293376) |
| 28) | జులై 10, 2017 | ఆధునికాంధ్ర కవిత్వం – పరిశోధన | అమ్మంగి వేణుగోపాల్ (9441054637) |
| 29) | జులై 17, 2017 | అతని కవిత అగ్నిధార | డా॥ ఎస్వీ. సత్యనారాయణ (9618032390) |
| 30) | జులై 24, 2017 | జ్ఞానపీఠం జ్ఞాపకాల దొంతర | డా॥ N. గోపి |
| 31) | జులై 31, 2017 | సంగమంతోనే భాషావికాసం | దోరవేటి (9866251479) |
| 32) | ఆగష్టు 07, 2017 | సామెతలు సాహిత్యానికి సొబగులు | పరవస్తు లోకేశ్వరి (9160680847) |
| 33) | ఆగష్టు 14 , 2017 | అభినవ కాళిదాసు కృష్ణమాచార్యులు | మల్లారపు రాజు (9014925716) |
| 34) | ఆగష్టు 21, 2017 | జానపదంతోనే జాతి వెలుగులు | డా॥ హెచ్. అనిత (8309364804) |
| 35) | ఆగష్టు 28, 2017 | సమగ్ర నిఘంటువు అవసరం | పులికొండ సుబ్బాచారి (9440493604) |
| 36) | సెప్టెంబర్ 04, 2017 | తెలంగాణ అంతరాత్మ | అమ్మంగి వేణుగోపాల్ (9441054637) |

| | | | |
|---|---|---|---|
| 37) | సెప్టెంబర్ 11, 2017 | తెలంగాణ జానపద జావళీలు | వెల్దండి శ్రీధర్ (9866977741) |
| 38) | సెప్టెంబర్ 18, 2017 | అస్తమించిన ప్రతిభామూర్తి | అమ్మంగి వేణుగోపాల్ (9441054637) |
| 39) | సెప్టెంబర్ 25, 2017 | మోహనా... ఓ మోహనా | తుమ్మలపల్లి రఘురాములు (9346328291) |
| 40) | అక్టోబర్ 02, 2017 | ఎచ్చమ్మ చెప్పిన 'మిఠాయి రాములు' కథ | అనిశెట్టి రజిత (9849482462) |
| 41) | అక్టోబర్ 09, 2017 | మానవ సంవేదనా శకలం | మామిడి హరికృష్ణ (8008005231) |
| 42) | అక్టోబర్ 16, 2017 | జనజీవన హాస్యగేయాలు | డా॥ సందినేని రవీందర్ (9491078515) |
| 43) | అక్టోబర్ 23, 2017 | Fusion, శాయరీ–ఒక అవలోకనం! | మామిడి హరికృష్ణ (9908844222) |
| 44) | అక్టోబర్ 30, 2017 | మన తెలంగాణం... అక్షర జయగానం... | దేశపతి శ్రీనివాస్ |
| 45) | నవంబర్ 06, 2017 | తేటతెనుగు పదాల తోట | డా॥ నలిమెల భాస్కర్ |
| 46) | నవంబర్ 13, 2017 | పచ్చనాకుపై వెచ్చనిరాత | కవి యాకూబ్ (9849156588) |
| 47) | నవంబర్ 20, 2017 | తెలంగాణ నాటక శబ్దసూచిక | డా॥ జె. విజయ్ కుమార్ జీ (9848078109) |
| 48) | నవంబర్ 27, 2017 | సకల కళల ఖజానా – తెలంగాణా! | మామిడి హరికృష్ణ (8008005231) |
| 49) | డిసెంబర్ 04, 2017 | బాటలు వేసిరి మన కవులే | దోరవేటి (9866251679) |
| 50) | డిసెంబర్ 11, 2017 | మన మాగాణంలో యక్షగాన ఘనకీర్తి | డా॥ జె. విజయ్ కుమార్ జీ (9848078109) |
| 51) | డిసెంబర్ 18, 2017 | తెలంగాణ – తెలుగు భాష | డా॥ ఆచార్య ఫణీంద్ర (9959882963) |
| 52) | డిసెంబర్ 25, 2017 | హాలుడు తెలంగాణకు అల్లుడు | సంగనభట్ల నరసయ్య (9440073124) |

# సాక్షి దినపత్రిక సాహిత్య వ్యాసాల పట్టిక (2017)

| క్రమ సంఖ్య | తేది | వ్యాసం పేరు | వ్యాస కర్త |
|---|---|---|---|
| 1. | జనవరి 02, 2017 | ★ ఒక చదువరి అంతరంగం<br>హేమంతం నుంచి హేమంతం దాకా | వాడ్రేవు చినవీరభద్రుడు<br>(9490957129) |
| 2. | జనవరి 09, 2017 | ★ రాబోవు పుస్తకం<br>చైనాపై జపాన్ దురాక్రమణ డ్రాగన్ సీడ్ | టి. షణ్ముకరావు<br>(9949348238) |
| 3. | జనవరి 16, 2017 | ★ ముందుమాట<br>నా భూభ్రమణ కాంక్ష | ఎం. ఆదినారాయణ<br>(9849883570) |
| 4. | జనవరి 23, 2017 | ★ ఆవిష్కరణ<br>దళిత స్త్రీ వాదాన్ని ఎత్తిపట్టిన మొదటి ఆత్మకథ | కె. సత్యనారాయణ |
| 5. | జనవరి 30, 2017 | ★ పుస్తకంలోంచి...<br>సాహిత్య విమర్శ ఎలా ఉండాలి? | ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ<br>(9441809566) |
| 6. | ఫిబ్రవరి 06, 2017 | ★ అనుభవం<br>రెండు సాహిత్య ఉత్సవాలు | ఓల్గా<br>(9849038926) |
| 7. | ఫిబ్రవరి 13, 2017 | ★ అనువాదం<br>కాల్పనికం నుండి యథార్థం దాకా... | కవిని ఆలూరి<br>(9420438391) |
| 8. | ఫిబ్రవరి 20, 2017 | ★ రేపు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం<br>నవర సాహిత్య పరామర్శ | డా॥ అల్లంసెట్టి చంద్రశేఖరరావు<br>(9949605141) |
| 9. | ఫిబ్రవరి 27, 2017 | ★ లైఫ్ టైమ్ షో<br>లోపల ఏది అనిపిస్తే అదే గీస్తా! | శంకర్ |
| 10. | మార్చి 06, 2017 | ★ విమర్శ<br>అరవై ఏళ్ల తెలుగు రుబాయీ | రోచిష్మాన్<br>(9444012279) |
| 11. | మార్చి 13, 2017 | ★ పుస్తన సమీక్ష<br>తెలుగు నవలా హృదయం | గంగిశెట్టి సాహితి కిశోర్<br>(7097085497) |
| 12. | మార్చి 20, 2017 | ★ మార్చి 26న స్ఫూర్తి పురస్కార ప్రధానం సందర్భంగా...<br>ఓ కవి స్వీయగానం | డా॥ ఎన్. గోపి<br>(040–27037585) |

| | | | |
|---|---|---|---|
| **13.** | మార్చి 27, 2017 | తెలుగు సాహిత్యంలో బిరుదులు | కోడీహళ్లి మురళీమోహన్ (9701371256) |
| **14.** | ఏప్రిల్ 03, 2017 | ★ విమర్శ<br>తొలి తెలుగు దళిత మహిళా కావ్యం | రాచపాళెం చంద్రశేఖరరెడ్డి (9440222117) |
| **15.** | ఏప్రిల్ 10, 2017 | ★ ఆవిష్కరణ<br>ఒక పికరస్క్ నవల | మధురాంతకం నరేంద్ర |
| **16.** | ఏప్రిల్ 17, 2017 | ★ స్మరణ<br>శివసాగర్ మ్రోగించిన తొలిగంటలు | నామాడి శ్రీధర్ (9396807070) |
| **17.** | ఏప్రిల్ 24, 2017 | ★ వివరం<br>గిల్ గమెష్: ప్రపంచ ప్రాచీన పురాణం | ఫెమినిస్ట్ ప్రసాద్ (9849828797) |
| **18.** | మే 01, 2017 | ★ కవితా తత్వం<br>భూమ్యాకాశాల మార్పులే కవితా బీజాలు | అనువాదం : గాలి నాసరరెడ్డి |
| **19.** | మే 08, 2017 | ★ అభిప్రాయం<br>తెలుగుహైకు: ఒక అవలోకనం | రోచిష్మాన్ (9444012279) |
| **20.** | మే 15, 2017 | ★ ప్రశంస<br>అక్షర మాధ్యమంలో అబ్ స్ట్రాక్ట్ చిత్రకారుడు | చేపూరు సుబ్బారావు (9989234505) |
| **21.** | మే 22, 2017 | ★ సమీక్ష<br>జీవితం ఒక గుజరాతీ నాటకరంగం | డా॥ కాళిదాసు పురుషోత్తం (9247564044) |
| **22.** | మే 29, 2017 | ★ స్మరణ<br>నవ దార్శనిక మహాకవి శేషేంద్ర | గింజల నరసింహారెడ్డి (9490260573) |
| **23.** | జూన్ 05, 2017 | ★ గతం – వర్తమానం<br>రైతుల కోసం రాయల నీతి | గార రంగనాథం (9885758123) |
| **24.** | జూన్ 12, 2017 | ★ జూన్ 14న బుచ్చిబాబు జయంతి<br>అంతరంగమే ఆయన కథనరంగం | అంపశయ్య నవీన్ |
| **25.** | జూన్ 19, 2017 | ★ పురస్కారం<br>చితికిన నవ్వుకు బుకర్ | ఎ.వి. రమణమూర్తి (9866022150) |
| **26.** | జూన్ 26, 2017 | ★ భాషా గౌరవం<br>ఇంగ్లీష్ కన్నా వందేళ్ల ముందే తెలుగులో తిసారెస్ | రామతీర్థ (9849200385) |
| **27.** | జులై 03, 2017 | ★ నేడు సంజీవదేవ్ జయంతి<br>రంగుల రాగం సంజీవదేవ్ | దర్భశయనం శ్రీనివాసాచార్య (9440419039) |
| **28.** | జులై 10, 2017 | ★ నివాళి<br>అదృశ్యమైన నిప్పుపిట్ట, ఎర్రకుందేలు | కాట్రగడ్డ దయానంద్ |

| | | | |
|---|---|---|---|
| 29. | జులై 17, 2017 | ★ పఠనానుభవం<br>టాల్ స్టాయ్ చెప్పిన చరిత్ర: యుద్ధము – శాంతి | బి. అజయ్ ప్రసాద్<br>(9247733602) |
| 30. | జులై 24, 2017 | ★ జూలై 29న సినారె జయంతి<br>'మరణం నను వరించి వస్తే ఏమంటాను | డా॥ ఎన్. గోపి<br>(040–27037585) |
| 31. | జులై 31, 2017 | ★ స్మరణ<br>దీపం వెలుగని కవి ఇల్లు కయిమొఱ | శ్రీరామదాసు అమరనాథ్<br>(9603367178) |
| 32. | ఆగష్టు 07, 2017 | ★ హాస్యం<br>కవిత్వమే మతం అయిన సందర్భం | రోచిష్మాన్<br>(9444012279) |
| 33. | ఆగష్టు 14, 2017 | ★ సందర్భం<br>నూటపాతికేళ్ల కన్యాశుల్కం నాటకం | జె. రాయమల్లు<br>(9951428183) |
| 34. | ఆగష్టు 21, 2017 | ★ స్మరణ<br>తెలుగు కథకు చార్మీనార్ నెల్లూరి | డా॥ దేవరాజు మహారాజు<br>(9908633949) |
| 35. | ఆగష్టు 28, 2017 | ★ విద్యార్థుల కవిత్వం<br>కలల్ని వెంటాడే విద్యార్థులు | అఫ్సర్ |
| 36. | సెప్టెంబర్ 04, 2017 | ★ పరామర్శ<br>విశిష్టమైన అమెరికన్ నవలాకారుడు | విన్నకోట రవిశంకర్<br><rvinnako@yahoo.com> |
| 37. | సెప్టెంబర్ 11, 2017 | ★పఠనానుభవం<br>ఆకుపచ్చని దేశం అపనమ్మకం ఆగిపోయే సందర్భం | హెచ్చార్కె<br><hrkkodidela@gmail.com> |
| 38. | సెప్టెంబర్ 18, 2017 | ★ సెప్టెంబర్ 22న పి.బి. శ్రీనివాస్ జయంతి<br>అష్ట భాషాకవి పి.బి.యస్. | శ్రీకాంత్ జయంతి<br>(9444012279) |
| 39. | సెప్టెంబర్ 25, 2017 | ★నివాళి<br>ఐదో దిక్కున అతడు ఇప్పుడు | అన్వర్ |
| 40. | అక్టోబర్ 02, 2017 | ★ పరామర్శ<br>నూట పాతికేళ్ళ క్రితం ఒకనాడు | శ్రీరామదాసు అమరనాథ్<br>(9603367178) |
| 41. | అక్టోబర్ 09, 2017 | ★ పురస్కారం<br>బ్రిటన్ దేహంలో జపాన్ ఆత్మ | ముకుంద రామారావు<br>(9908347273) |
| 42. | అక్టోబర్ 16, 2017 | ★ ఎందుకు చేశానంటే?<br>కథ కథా వాన వాన | మహమ్మద్ ఖదీర్ బాబు<br>(9701332807) |
| 43. | అక్టోబర్ 23, 2017 | ★ సంభాషణ<br>నన్ను అనువాదకుడిని చేసింది చైనా | డా॥ డి.ఎస్. రావు |
| 44. | అక్టోబర్ 30, 2017 | ★ అభిప్రాయం<br>రాజకీయ సాహిత్యం సాహిత్య రాజకీయం | హెచ్చార్కె<br><hrkkodidela@gmail.com> |

| | | | |
|---|---|---|---|
| 45. | నవంబర్ 06, 2017 | ★ రాబోవు పుస్తకం<br>తెలుగు భాషకు చిరునామాలు గ్రామాలు | డా॥ నలిమెల భాస్కర్ (9704374081) |
| 46. | నవంబర్ 13, 2017 | ★ పురస్కారం<br>సాహిత్య శిల్పులకు కబీర్ సమ్మాన్ | రామతీర్థ (9849200385) |
| 47. | నవంబర్ 20, 2017 | ★ ఉత్సవం<br>స్వతంత్ర మేధావి హృదయ సంస్కర్త | ఎ.కె. ప్రభాకర్ (040–27761510) |
| 48. | నవంబర్ 27, 2017 | ★ ఉత్సవం<br>ఎన్నితీర్లుగ మాట్లాడినా తెలుగు తెలుగే | నందిని సిధారెడ్డి |
| 49. | డిసెంబర్ 04, 2017 | ప్రపంచ తెలుగు మహాసభలు<br>పెద్దన్న తెలియాలి సోమన్న<br>మరుగునపడొద్దు | దేశపతి శ్రీనివాస్ |
| 50. | డిసెంబర్ 11, 2017 | అమ్మ భాషను<br>ఆశీర్వదిద్దాం దీర్ఘాయుష్మాన్ భవ! | సురేష్ కొనిబాల |
| 51. | డిసెంబర్ 11, 2017 | యాసభాషల అలయ్ బలయ్ | సుద్దాల అశోక్ తేజ |
| 52. | డిసెంబర్ 18, 2017 | తెలంగాణలో తొలి తెలుగు పత్రిక 'శేద్య చంద్రిక' | తోట భావనారాయణ |
| 53. | డిసెంబర్ 18, 2017 | యుద్ధం చేస్తూ శాంతిని కోరే కవి | ఓల్గా |

## అనుబంధం – 3

## సదస్సు మరియు పరిశోధన వ్యాసాలు



జాతీయ సదస్సు

TSCHE Sponsored Two-Day NATIONAL SEMINAR on

Documentation and Dissemination of Linguistic Literary and Cultural Heritage-The Role of Cinema

(A Multilingual, Multicultural & Multiethnic Seminar)

భాషా, సాహిత్య, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, పరివ్యాప్తి-సినిమా పాత్ర

DEPARTMENT OF TELUGU

SRR GOVT. ARTS & SCIENCE COLLEGE

affiliated to SATAVAHANA UNIVERSITY

Dist :Karimnagar, TELANGANA STATE

CERTIFICATE

This is to Certify that Dr./ Mr/ Mrs/ వేముల హంషిత of హైదరాబాద్ విశ్వవిద్యాలయం has Participated / Presented Paper / Chaired Session / Convened Session / Addressed the Session entitled నమస్తే తెలంగాణ సాహిత్య వ్యాసాలు – విమర్శ తీరుతెన్నులు (సెప్టెంబర్ 2016) in TSCHE Sponsored Two-Day National Seminar on *Documentation and Dissemination of Linguistic, Literary and Cultural Heritage -The Role of Cinema* held on 17th & 18th Feb 2017 at SRR Govt. Arts & Science College, Karimnagar, Dist. KARIMNAGAR, TELANGANA STATE

Seminar Organizer
Dr.Kotthireddy Mallareddy

Principal & Seminar Chairman
Sri. P. Nithin



ANDHRA UNIVERSITY, VISAKHAPATNAM

(Department of Telugu)

*International Mother Language Day Celebrations 2024*

CERRTIFICATE

*This is to certify that Prof. / Dr. / Mr. / Mrs. / Kum.* వేముల హంషిత *has attended the International Seminar "ANTARJAATEEYA MATRUBHAASHA DINOTSAVAM – TELUGU BHASHA VISISHTATHA" on 21-02-2024 conducted by the Department of Telugu, Andhra University, Visakhapatnam in collaboration with Samaikya Bharathi and Andhra Bhavan, Khargapur (Primary & Secondary Scholl)on 21st February 2024 as delegate / resource person / presented a paper on* తెలుగు దినపత్రికల్లో సాహిత్య పుటలు – భాషా సాహిత్య సేవ

Dr. B. Venkataswamy
Seminar Co-ordinator

Prof. J. Apparao
Seminar Director

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-5 | Issue-2 | February 2024 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2024/feb_2024/full_papers/february24_04.php

DOI:

# 4. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక కవిత్వవ్యాసాలు (2016-17): పరామర్శ



**వేముల హర్షిత**
తెలుగు పరిశోధకురాలు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం.
తెలుగు అధ్యాపకురాలు, తెల. సాం. సం. గు. మహిళా డిగ్రీ కళాశాల,
జగద్గిరిగుట్ట, హైదరాబాద్, తెలంగాణ.
సెల్: +91 9248393960. Email: vemulaharshitha04@gmail.com

**వ్యాససంగ్రహం:**

*ప్రస్తుతం దినపత్రికలలో అన్ని రకాల వార్తాసమాచారాలతో పాటు సాహిత్యాంశాలు చోటుచేసుకుంటున్నాయి. దినపత్రికల్లో సాహిత్యంశాలను నామమాత్రంగా ప్రచురించకుండా, సాహిత్యానికి ఒక ప్రత్యేకపుటను కేటాయిస్తున్నారు. దీని ద్వారా సమకాలీన సాహిత్యాన్ని విభిన్న ప్రక్రియలలో పాఠకులకు అందిస్తున్నారు. సాధారణంగా సాహిత్యపుటల్లో సాహిత్యవ్యాసాలు, కవితలు, సమీక్ష వ్యాసాలు, పుస్తక పరిచయాలు, సాహిత్యసమావేశాల సమాచారం వంటి అంశాలను ప్రచురిస్తూ సాహిత్యాభివృద్ధికి దినపత్రికలు ఎంతగానో కృషి చేస్తున్నాయి. ఈ సంప్రదాయాన్ని "నమస్తే తెలంగాణ" దినపత్రిక కూడా పాటిస్తూ సాహిత్యాభివృద్ధికి చాలావరకు కృషి చేస్తుంది. వీటిలో అధికభాగం కవిత్వసంబంధవిషయాలు మనకు కనిపిస్తాయి. అందువలన ఎటువంటి కవిత్వాన్ని ఈ పత్రిక ప్రచురిస్తుందో తెలపడమే ఈ పత్రప్రధానలక్ష్యం. అందుకుగాను నమస్తే తెలంగాణ పత్రికలో 2016-17 సంవత్సరాల్లో వచ్చిన కవిత్వసంబంధవ్యాసాలను స్వీకరించి వాటిని విమర్శనాత్మదృష్టితో విశ్లేషించాను.*

**Keywords:** నమస్తేతెలంగాణ, దినపత్రిక, కవిత్వవ్యాసాలు, కవిజీవిత-కావ్యసమన్వయవిమర్శ ప్రాంతీయ అస్తిత్వవాదవిమర్శ, కవితాపుస్తకసమీక్షావ్యాసాలు.

## 1.ఉపోద్ఘాతం:

తెలంగాణ ప్రాంతంలో వెలుదుతున్న ప్రముఖ దినపత్రిక నమస్తే తెలంగాణ. ఇది జూన్ 6, 2011 న 'మన రాష్ట్రం - మన ఆత్మగౌరవం' అనే నినాదంతో ప్రత్యేక రాష్ట్ర సాధనయే ప్రధాన లక్ష్యంగా ఏర్పడింది. 2014 లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 'మన రాష్ట్రం – మన పత్రిక' నినాదంతో కొనసాగుతూ, తెలంగాణ ప్రజల సమస్యలపై ప్రధాన దృష్టి సారిస్తుంది. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత రాష్ట్ర ప్రగతి, నాగరికత, సంస్కృతిని ప్రోత్సహించే విధంగా పత్రిక రూపొందింది. ఈ పత్రికలో రకరకాల వార్త సమాచారాలతో పాటు

ప్రతి ఆదివారం 'చెలిమె... సాహిత్య సర్వస్వం' పేరుతో సాహిత్య పుటను ప్రచురిస్తున్నారు. దీనిలో సాహిత్యం, భాష, కవిత్వం, కవులు, రచయితలకు సంబంధించిన వివిధ రకాల వ్యాసాలుంటాయి.

### 2. నమస్తే తెలంగాణ - చెలిమె:

నమస్తే తెలంగాణ దినపత్రికలో సాహిత్య పుట 'చెలిమె... సాహిత్య సర్వస్వం' పేరుతో పత్రిక ప్రారంభం నుండి వెలువడుతుంది. పత్రిక ప్రారంభంలో ఇది ప్రతి బుధవారం వచ్చేది. 2014 లో రాష్ట్ర అవతరణ జరిగిన తర్వాత దీనిని సోమవారానికి మార్చారు. ప్రస్తుతం చెలిమె పుటను ప్రతి ఆదివారం ప్రచురిస్తున్నారు. 'చెలిమె' పదానికి తెలంగాణ మాండలిక వ్యవహారంలో ఒక ఊట జల అని అర్థం. దీన్ని ఇతర ప్రాంతాల్లో 'చెలమ' అని వ్యవహరిస్తారు. చెలిమెలో నీరు తీసిన కొద్ది ఊరుతూ ఉంటుంది. అంతం అనేది ఉండదు. సాహిత్యం కూడా ఒక చెలిమె వలె అంతం లేనిదనే అర్థంలో ఈ పేరు పెట్టారని నా అభిప్రాయం.

### 3. నమస్తే తెలంగాణ దినపత్రిక కవిత్వ వ్యాసాలు - పరామర్శ:

నమస్తే తెలంగాణ దినపత్రిక చెలిమె పుటలో నేను పరిశీలించిన వరకు ఎక్కువగా కవిత్వ సంబంధ విషయాలను ప్రచురిస్తున్నారు.

- కవితలు, కవులు, కవిత్వ సంబంధ వ్యాసాలు
- కవిత్వ పుస్తక సమీక్షా వ్యాసాలు
- కవిత్వసంబంధ నివేదిక వ్యాసాలు వంటి అనేక రకాలైన కవిత్వ విషయాలు ఈ పుటలో కనిపిస్తాయి.
- కవిత్వ వ్యాసాల్లో కూడా కవిజీవిత కావ్యవిమర్శ ధోరణి, ప్రాంతీయ అస్తిత్వ వాద విమర్శ ధోరణి, సమీక్షా రూప వ్యాసాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

### 3.1 కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ:

కవుల జయంతి, వర్ధంతి సందర్భంగా అలాగే సన్మానాలు, సత్కారాలు లభించిన ప్రత్యేక సందర్భాలలో కవులకు సంబంధించిన జీవిత విషయాలను ఎక్కువగా చెలిమె పుటలో ప్రచురిస్తున్నారు. అయితే లోతులకు వెళ్లకుండా వాటి మూలాలను మనకు అందిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత తెలంగాణ సాహిత్య పునర్నిర్మాణం జరగాల్సిన అవసరం ఉంది. కావున తెలంగాణ సాహిత్యానికి Biographical Criticism' ఎంతో అవసరం. ఇంతకాలం మరుగున పడిన కవులను, నూతన కవులను పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రధానంగా పత్రికల పైనే ఉంది. కావున ఉద్యమ స్ఫూర్తితో ఏర్పడిన నమస్తే తెలంగాణ పత్రిక సాహిత్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తుంది.

**'Biographical Criticism' (కవిజీవిత కావ్య సమన్వయ విమర్శ) – నిర్వచనాలు:**

> **"కవుల జీవిత ఘట్టాలు, వారి మానసిక స్థితులూ, వారి తాత్విక భావనలు వారి రచనలలో ఎలా ప్రతిఫలించాయని కానీ, వారి వ్యక్తిత్వాలు కృతులనెలా రూపొందింపజేశాయని కానీ వివేచించే విమర్శనా పద్ధతి"**

అని జి. వి. సుబ్రహ్మణ్యం "ఆంధ్ర సాహిత్య విమర్శ-ఆంగ్ల ప్రభావం'' అనే గ్రంథంలో నిర్వచించారు. (1983: పుట: 145,146).

**"కవి జీవితమునకు, కావ్య రచనకు ఉన్న సంబంధమును పరిశీలించి వాని సమన్వయముతో విమర్శకు పూనుకొనిన అది కవిజీవితకావ్యవిమర్శగా"** పేర్కొనవచ్చునని యస్. వి. రామారావు "తెలుగులో సాహిత్య విమర్శ'' అనే గ్రంథంలో తెలిపారు. (2007: పుట: 11).

**"కవుల వ్యక్తిగత జీవిత పరిస్థితుల ప్రభావమూ, వారి మానసిక పరిస్థితులూ, వారు నమ్మే సిద్ధాంతాలు వారి రచనల్లో ఎలా ప్రతిబింబించాయో ఆలోచించే, నిరూపించే విమర్శనా పద్ధతి కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ''.**

కవుల మానసిక స్థితి, వ్యక్తిత్వము అంచనా వేయటమే ఇందులో ప్రధానంగా జరిగేది కాబట్టి ఆ తర్వాత కాలంలో ఇది మనోవిశ్లేషణాత్మక విమర్శల్లో భాగంగా మారిపోయింది. యస్. యస్ నళిని "సాహిత్య విమర్శ పదాల డిక్షనరీలో" పేర్కొన్నారు. (2021: పుట: 60)

**"కవి జీవిత కావ్య విమర్శ కావ్యంలో కవి యొక్క ఆత్మీయత ప్రతిఫలించే తీరును వివేచిస్తుంది. కవి జీవితాన్ని పరిశీలించిన అతని కావ్య తత్త్వము ఏమిటో తెలుస్తుంది."** అని యస్. ఝాన్సీరాణి 'Biographical Criticism in Telugu' అనే వీరి యమ్.ఫిల్. గ్రంథంలో తెలిపారు. (1992: పుట: 19).

ఈ విధంగా అనేకమంది కవి జీవిత కావ్య విమర్శను నిర్వచించారు. మొత్తం మీద కవి జీవిత విమర్శ అంటే కవికి సంబంధించిన కవి జీవిత పరిశీలనలు, కవి మీద ఏయే ప్రభావాలు పనిచేసాయి అనేదికూడా కవి జీవిత విమర్శ అవుతుంది. ఆ కవి ఆత్మకథలు రాస్తాడు. ఉత్తరాలురాస్తాడు. వీటి గురించి ఎక్కడైనా ప్రస్తావించిన అది కూడా ''Biographical Criticism'' అవుతుంది.

ఒక్క మాటలో చెప్పాలంటే కవి జీవితం, ఆయన రచనలకు ఉన్నటువంటి సంబంధ బాంధవ్యాలను వివరించేదే కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ. ఈ శాఖను ఆంగ్ల సాహిత్యంలో ప్రారంభించినవారు డ్రైడన్. పత్రికలకున్న పరిధి రీత్యా అత్యధిక శాతం కవి జీవిత విమర్శకు సంబంధించిన వ్యాసాలే ప్రచురిస్తున్నారు. కావున నమస్తే తెలంగాణ పత్రికలో ఇలాంటి వ్యాసాలను మనం చూడవచ్చు.

**ఉదా:** కవిత్వ అగ్ని ధార దాశరథి – ఎస్వీ. సత్యనారాయణ (జూలై 18, 2016: చెలిమె)

అభినవ కాళిదాసు కృష్ణమాచార్యులు - మల్లారపు రాజు (ఆగస్టు 14, 2017: చెలిమె)

**వ్యాసం:1 కవిత్వ అగ్నిధార దాశరథి – ఎస్వీ. సత్యనారాయణ (జూలై 18, 2016: చెలిమె)**

దీనిలో వ్యాసకర్త దాశరథిని కవిత్వ అగ్నిధారగా తెలుపుతూ ఆయన జీవిత విషయాలను, రచనా విషయాలను, చారిత్రక అంశాలను పొందుపరిచారు. కవిత్వంలోని వస్తువుకు అధిక ప్రాధాన్యతనిస్తూ దాశరథి కవితా వస్తువును తెలుపుతూనే కవి యొక్క జీవిత విషయాలను, తెలంగాణ ఉద్యమచరిత్ర, ఆనాటి సామాజిక పరిస్థితులు వంటి అనేక అంశాలను పాఠకులకు అందించారు. జూలై 22 న దాశరథి జన్మదిన సందర్భంగా చెలిమె పుటలో ఆయన జీవిత విషయాలను, రచన విషయాలను తెలుపుతూ ఎస్వీ. సత్యనారాయణ రాసిన వ్యాసం ఇది. దీనిని కవి జీవిత విమర్శగా చెప్పవచ్చు.

**కవిజీవిత పరిశీలనలు:**

దీనిలో వ్యాసకర్త దాశరథి కవి జనన సంబంధ జీవిత విశేషాలను పేర్కొనడం వలన ఇది బయోగ్రాఫికల్ క్రిటిసిజం అవుతుంది.

> **“…1925 జూలై 22 న ఖమ్మం జిల్లాలోని చిన్నగూడూరు గ్రామంలో శ్రీమతి వెంకటమ్మ, శ్రీ వెంకటాచార్యుల దంపతులకు పుట్టిన కుమారుడు దాశరథి కృష్ణమాచారి. అతని తమ్ముడు దాశరథి రంగాచారి. బాల్యంలో కృష్ణమాచారి తండ్రి వద్ద సాంప్రదాయ రీతిలో విద్యాభ్యాసం చేశారు…”**

అని చెప్తూ దాశరథి సృజనాత్మక రచన చేస్తూనే ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నాడని ఉద్యమ చరిత్రను తెలిపారు.

> **“…1942 లో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన రహస్య సమావేశాలకు హాజరయ్యాడు. ఆంధ్ర మహాసభ సభ్యత్వం స్వీకరించి హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమంలో తన మిత్రులతో కలిసి పాల్గొన్నాడు. మరోవైపు 1944 లో వరంగల్లో ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్ సభల్లో పాల్గొని ఉద్యమ కవిత్వాన్ని గానం చేశాడు… ”**

అంటూ ఇలా కవి జీవిత విషయాలను, ఆయన స్వభావాన్ని ఇందులో తెలపడం వలన ఇది ఈ Biographical Criticism అవుతుంది. తెలంగాణ రాష్ట్ర అవతరణకు ముందు తెలంగాణ చరిత్ర, కవుల గురించిన రచనలు సరిగా రాలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రాంతానికి, కవులకు ప్రత్యేక గుర్తింపు లభించింది. వీరిపై అనేక రచనలు చేస్తున్నారు. వాటిని మనకు అందించాల్సిన బాధ్యత పత్రికలపై ఉంది. దీన్ని నమస్తే తెలంగాణ పత్రిక నిర్వర్తిస్తుందని చెప్పవచ్చు.

మరుగునపడిన తెలంగాణ కవులను, వారి సృజనను ప్రజలకు తెలియజేయడమే ప్రధాన ధ్యేయంగా చెలిమె పుట నడుస్తుంది. తెలంగాణ ప్రాంతంలో మరుగున పడిన కవులకు, తెలంగాణ సాహిత్య సంబంధ

వ్యాసాలకు అధిక ప్రాధాన్యతనిస్తుంది. చాలామందికి నామమాత్రమైన తెలియని మట్టిలో మాణిక్యాల వంటి ఎందరో తెలంగాణ కవులను చెలిమె పుట పాఠకులకు పరిచయం చేస్తుంది.

**వ్యాసం: 2 అభినవ కాళిదాసు కృష్ణమాచార్యులు - మల్లారపు రాజ (ఆగస్టు 14 2017: చెలిమె)**

నిజామాబాద్ జిల్లాకు చెందిన గొప్ప కవి, అవధాని శిరిసినహల్ కృష్ణమాచార్యుల జయంతి సందర్భంగా వచ్చిన వ్యాసం ఇది. దీనిలో వ్యాసకర్త కవి జీవిత విషయాలను తెలుపుతూ ఆయన రచనా విశిష్టతను తెలియజేసి ఇంతకాలం మనకు తెలియని ఒక గొప్ప కవిని పాఠకులకు పరిచయం చేశారు. కవి జీవిత విమర్శ పద్ధతిలో మల్లారపు రాజు రాసిన వ్యాసం ఇది.

కృష్ణమాచార్యుల గురించి తెలుపుతూ-

> **“…ఈయనను తొలి తెలంగాణ శతావధానిగా పేర్కొనవచ్చు. ఈయన 1929 ‘కళాభ్యుదయం’ అనే కవితా సంపుటిని వెలువరించారు. అపారమైన పాండిత్యం, అనర్గళమైన వాక్చాతుర్యం కలిగిన తొలితరం కవికులజుడు. విశిష్టాద్వైతావలంబికులు శిరిసినహల్ కృష్ణమాచార్యులు నిజాం రాజ్య తొలి శతావధానిగా పేరొందారు…”**

ఈ విధంగా కృష్ణమాచార్యుల గొప్పతనాన్ని, ఆయన జీవిత విషయాలను పాఠకులకు అందించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత ఇలాంటి మరుగునపడిన మాణిక్యాలను వెలికి తీసి వారి రచనలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. కావున దీన్ని కూడా కవి జీవిత విమర్శగా చెప్పవచ్చు.

ఈ విధంగా కవుల జయంతి, వర్ధంతి అలాగే ప్రత్యేక సందర్భాలను పురస్కరించుకొని బయోగ్రాఫికల్ క్రిటిసిజం పద్ధతిలో కవిత్వ సంబంధ వ్యాసాలు చెలిమె పుటలో చాలా కనిపిస్తాయి. ఉత్తరాలు, ఇంటర్వ్యూ రూప వ్యాసాలు ఇవన్నీ కూడా బయోగ్రాఫికల్ క్రిటిసిజం కిందికే వస్తాయి.

**‘చెలిమె’లో కవిత్వ వ్యాసాలు – Biographical Criticism:**

1. ధిక్కార స్వర ఆది గురువు - అమ్మంగి వేణుగోపాల్ (సెప్టెంబర్ 5, 2016 చెలిమె). కాళోజీ జయంతి మరియు తెలంగాణ భాషాదినోత్సవ సందర్భంగా వచ్చిన వ్యాసం ఇది.
2. సాహిత్య భావుకుడు దిలావర్’ (సెప్టెంబర్ 12, 2016). దిలావర్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్కైబాబ చేసిన ఇంటర్వ్యూ ఇది.
3. సాహిత్యమంటే జీవితమే’ (నవంబర్ 28, 2016). ఇది నందిని సిద్ధారెడ్డి ఇంటర్వ్యూ
4. పచ్చనాకుపై వెచ్చని రాత – కవి యాకూబ్ (నవంబర్ 13, 2017) కె. శివరెడ్డికి కబీర్ సమ్మాన అవార్డ్ లభించిన సందర్భంగా రాసిన వ్యాసమిది.
5. విశ్వమానవుడు సినారె – B. S. రాములు (జూన్ 19, 2017) సినారె మరణ సందర్భంగా వచ్చిన వ్యాసం.

ఇలా కవిజీవిత విమర్శ ధోరణి కవిత్వ వ్యాసాలు మనకు చెలిమె పుటలో చాలా కనిపిస్తున్నాయి.

### 3.2 ప్రాంతీయ అస్తిత్వవాదవిమర్శ:

తెలంగాణ ప్రాంతపత్రికగా ప్రారంభమైన నమస్తే తెలంగాణ చెలిమె పుటలో ప్రాంతీయ చరిత్ర, సంస్కృతి, సాహిత్యాన్ని తెలుపుతూ ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శవ్యాసాలను ప్రచురిస్తున్నారు. చెలిమె పుటలో తెలంగాణ ప్రాంత అస్తిత్వాన్ని తెలిపే కవిత్వ వ్యాసాలు మనకు కనిపిస్తాయి. ఇంతకాలం వలస పాలనలో మగ్గిపోతూ తమ సాహిత్యానికి జరిగిన అన్యాయాన్ని తెలుపుతూ, నేడు ప్రత్యేక రాష్ట్ర అవతరణ తర్వాత తమ ప్రాంత సాహిత్య విశిష్టతను తెలియజేస్తూ సాహిత్య అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందని, మిగతా ప్రాంత సాహిత్యాలకు తెలంగాణ ప్రాంత సాహిత్యం, చరిత్ర ఏ మాత్రం తీసిపోదని తెలియజేసే ప్రాంతీయ అస్తిత్వవాద ధోరణిలో కవిత్వ వ్యాసాలు కనబడుతున్నాయి. వీటిలో రూప చర్చ కన్నా, వస్తు చర్చకే అధిక ప్రాధాన్యత ఉంటుంది.

### ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ – నిర్వచనాలు:

**“ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శలో కనిపించే విషయాల్లో ప్రధానమైనది ఇక్కడి ప్రాంతంలో (తెలంగాణ) కవిత్వం లేదు, కథ లేదు అన్నప్పుడు దానికి సంబంధించిన విషయాలపై ప్రతిస్పందన రూపంగా తెలుగులో ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ వెలవడింది. 1934 లో సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ కవుల సంచిక, 1970 ఏళ్ల తర్వాతే తెలంగాణ కథ అన్న అభిప్రాయం మీద వచ్చిన ప్రతిస్పందన రూప విమర్శ వ్యాసాలు ఇందుకు ఉదాహరణలు”**

అని లక్ష్మణ చక్రవర్తి, తెలుగు సాహిత్య విమర్శ దర్శనం గ్రంథంలో తెలిపారు. (2016: పుట: 124).

**“స్త్రీ, దళిత, మైనారిటీ వాదాలు అస్తిత్వ దృష్టికి ఏర్పరచిన పునాదిని కేంద్రంగా చేసుకొని తమ ప్రాంతం విస్మృతికి గురైందని భావించి ఆ సాహిత్యాన్ని నలుగురికి తెలియపరచాలన్న దృక్పథంతో తమ ప్రాంత సాహిత్య వైశిష్ట్యాన్ని చెప్పాలనుకోవడం ప్రాంతీయ చైతన్యం. ఇందులో తమ ప్రాంత సాహిత్య మూలాలను, సాహితీకారుల సృజన నేపథ్యం, అభివ్యక్తిలో కనిపించే భేదం వంటివి ప్రధానపాత్ర వహిస్తాయి”**

అని లక్ష్మణచక్రవర్తి, తెలుగు సాహిత్యవిమర్శ దర్శనం గ్రంథంలో తెలిపారు. (2016: పుట: 125)

**“ప్రాంతీయవాద పరిధి చాలా పెద్దది. ప్రాంతీయవాదంలో తమను ఇతర ప్రాంతాల వారు అణిచివేస్తున్నారని ఆధిపత్య వర్గాలపై ఆగ్రహం అడుగున కనిపిస్తుంది. పాలకులు, వలసవాదులు చూపిస్తున్న వివక్షపై నిరసన ఉంటుంది. తమ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలపై ఆత్మ గౌరవంతో కూడిన అభిమానం ఉంటుందని”**

వెలమల సిమ్మన్న తెలుగు సాహిత్యచరిత్ర గ్రంథంలో తెలిపారు. (2011: పుట: 643)

పై నిర్వచనాలను బట్టి చూస్తే ఒక ప్రాంత అణచివేతల నుండి ఆవిర్భవించింది ప్రాంతీయ ఆస్తిత్వవాద విమర్శ అని అర్థమవుతుంది. దీనిలో ఒక ప్రాంతానికి గుర్తింపు లేకపోవడం లేదా విస్మృతికి గురి కావడం అనేవి ప్రధాన అంశాలుగా కనిపిస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇంతకాలం జరిగిన తెలంగాణ ప్రాంత అణచివేతను, విస్మృతిని గుర్తు చేస్తూ తెలంగాణప్రాంత సాహిత్య గొప్పతనాన్ని, తెలంగాణ కవిత్వ గొప్పదనాన్ని తెలిపే వ్యాసాలు చెలిమె పుటలో కింది విధంగా ఉన్నాయి.

**వ్యాసం: 1 సాహిత్యంలో తొలి రచనలు - డాక్టర్. ద్వా. నా. శాస్త్రి. (మే 02, 2016 చెలిమె)**

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలకు తెలంగాణ ప్రాంతమే పుట్టినిల్లు అని తెలంగాణ ప్రాంత గొప్పతనాన్ని తెలియజేస్తూ రాసిన వ్యాసం ఇది. తెలంగాణ ప్రాంత కవులను స్మరిస్తూ తెలంగాణలో పుట్టిన సాహిత్య ప్రక్రియలను పరిచయం చేస్తూ వ్యాసాన్ని రాశారు. దీనిని ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శగా చెప్పవచ్చు. ద్వా.నా. శాస్త్రి రాసిన 'సాహిత్యంలో తొలి రచనలు' అనే వ్యాసం నమస్తే తెలంగాణ చెలిమె పుటలో మే 02, 2016 న వెలువడింది. దీనిలో తెలుగు సాహిత్యంలోనీ ప్రాచీన పద్య కావ్యాల నుండి నేటి ఆధునిక కవిత్వ ప్రక్రియలైన దీర్ఘ కవితల వరకు అనేక తొలి రచనలకు పుట్టినిల్లు తెలంగాణ అంటూ పేర్కొన్నారు.

**ప్రాంతీయ ఆస్తిత్వవాద విమర్శ పరిశీలనలు:**

> **"...ఏ భాషా సాహిత్యానికైనా ప్రక్రియ వైవిధ్యం, రచన వైవిద్యం అనేవి దిక్సూచికలు. ఒక సాహిత్యా భివృద్ధి గాని, వైశిష్ఠంగానీ తొలి రచనలపై ఆధారపడి ఉంటుంది. తెలుగు సాహిత్య చరిత్ర మొత్తం పరిశీలిస్తే తెలంగాణ సాహిత్యం వెనుకబడి లేదని అనేక తొలి రచనలతో ప్రత్యేకతను నిలబెట్టుకుందని తెలుస్తుంది. తొలి రచన అంటే మూలం. దాన్ని అనుసరించే రచనల పరంపర కొనసాగుతుంది. తెలంగాణ సాహిత్యచరిత్ర వేరువేరు కోణాల నుంచి పరిశీలించవలసి ఉంటుంది వాటిలో ఒక కోణం తొలి రచనలు..."**

అంటూ ఇలా తెలంగాణ ప్రాంత గొప్పతనాన్ని సాహిత్య గొప్పతనాన్ని తెలుపుతూ అనేక ప్రక్రియలకు తెలంగాణ పుట్టినిల్లు అని తెలిపారు. ఇది ప్రాంతీయ ఆస్తిత్వవాద విమర్శ ధోరణిలో రాసిన వ్యాసం.

తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకమైన ఎన్నో కళారూపాలను, సంస్కృతిని, సాహిత్యాన్ని పాఠకులకు అందిస్తూ ఇంతకాలం మరుగున దాగిన తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక పునర్నిర్మాణానికి చెలిమె పుట ఎంతగానో కృషి చేస్తుంది. ప్రాంతీయ అస్తిత్వవాద ధోరణిలో తెలంగాణ సాహిత్యాన్ని మన ముందుకు తెస్తుంది.

**చెలిమె పుట కవిత్వ వ్యాసాలు - ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ:**

1. ఒక పాలకుర్తి, ఒక బమ్మెర – అనుమాండ్ల భూమయ్య (ఫిబ్రవరి 29, 2016)
2. ఇది మన స్వేచ్ఛా నర్తనం – శ్రీ రామోజు హరగోపాల్ (జూలై 04, 2016)

3. సాహిత్యంలో స్వాభిమాన ప్రకటన – ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య (ఆగస్టు 08, 2016)
4. దేశి పుట్టినిల్లు… – డాక్టర్. గంఢ్ర లక్ష్మణ రావు (ఫిబ్రవరి 13, 2017)

### 3.3 కవితా పుస్తకసమీక్షావ్యాసాలు:

చెలిమె పుటలో కవిత్వసంబంధ సమీక్షావ్యాసాలను ప్రచురిస్తున్నారు. కవిత్వపుస్తకాలకు సంబంధించిన సమీక్షలు, నూతనపుస్తక ఆవిష్కరణ సందర్భంగా సమీక్ష రూపవ్యాసాలు మనకు కనిపిస్తున్నాయి. ఈ సమీక్ష వ్యాసాల వలన పాఠకుల్లో ఆ పుస్తకాన్ని చదవాలనే ప్రేరణ కలుగుతుంది. నూతన కవులు, కవిత్వగ్రంథాల సమాచారంతోపాటు సాహిత్యంలో వస్తున్న కొత్త కొత్త కవిత్వ రూపాలను పరిచయం చేస్తూ పాఠకుల్లో పఠణాభిలాషను కల్పించడంలో చెలిమె పుట తన వంతు పాత్ర నిర్వహిస్తుంది.

### సమీక్షావ్యాసాలు - నిర్వచనం:

**“బ్రౌన్య ఇంగ్లీష్ - తెలుగు నిఘంటువులో రివ్యూకు ‘పునర్విమర్శ, ‘పునర్విచారణ’** అనే అర్థాలను పేర్కొన్నారు. (1990: పుట 964)

**“సమీక్ష వ్యాసం వస్తుతః సాహిత్య విమర్శ స్వభావం కలది. శైలిలో జర్నలిజం జీవలక్షణాన్ని పొందుపరచుకున్నది. అస్పష్టతారాహిత్యం, అక్లిష్టత, సంక్షిప్తత, ఆసక్తి, అవగాహన, అనుభూతి అనేవి జర్నలిజానికి అంటే పత్రికా రచనకు జన్మతః ఉండే షడ్గుణాలు. ఈ ఆరు గుణాలలో ఒక అభివ్యక్తిని కల్పించుకొనే తెలుగు వచన రచన సమీక్షా వ్యాసరూపం. సమీక్షా వ్యాసంలోని శక్తి చర్చనీయం, ఆసక్తి రచయిత వ్యాఖ్యాన వైఖరి, నవ్యత రచయిత దృక్కోణం, అభివ్యక్తి పత్రికా రచనా ప్రవృత్తి. సమీక్షా వ్యాసం ఒక సాహిత్యానికి మాత్రమే పరిమితమైంది కాదు”**

అని జి.వి. సుబ్రహ్మణ్యం ‘సాహిత్యం చరిత్రలో చర్చనీయాంశాలు’ అనే గ్రంథంలో తెలిపారు (2012: పుట: 707)

**“ఒక పుస్తకం ప్రచురించబడిన వెంటనే ప్రచురణ వివరాలతో ఆ పుస్తకంలోని విషయాన్ని క్లుప్తంగా పరిచయం చేస్తూ, వివిధ పత్రికల్లో వచ్చేవి సమీక్షలు” అని కేతవరపు రామకోటి శాస్త్రి ‘శాస్త్రీయ సమీక్షలు – ముందుమాటలు’** అనే గ్రంథంలో నిర్వచించారు. (2013: పుట: 5)

**“సమీక్ష ఒక ప్రక్రియ సమీక్ష వ్యాసాలుగా ఇవి కనిపిస్తుంటాయి రివ్యూ అంటే మరోసారి పరిశీలించడం అని అర్థం. కొత్త పుస్తకాలను గురించి రాయడం/పరిచయం చేయడం అనే అర్థంలో ప్రసారమాధ్యమాల్లో ఇది వాడుకలో ఉంది”**

అని పమ్మి పవన్ కుమార్, ‘ప్రసారమాధ్యమాలు - భాషానైపుణ్యాలు’ అనే గ్రంథంలో నిర్వచించారు. (2016: పుట: 150).

పై నిర్వచనాల ఆధారంగా చూస్తే ఓ గ్రంథాన్ని గురించి పరిచయం చేసే వ్యాసాలను సమీక్ష వ్యాసాలుగా చెప్పవచ్చు. చెలిమె పుటలో కవితా పుస్తక సమీక్షా వ్యాసాలు మనకి చాలా కనిపిస్తాయి.

**ఉదా: బతుకాట సవ్వడుల గవ్వలు – వెల్దండి శ్రీధర్ (మార్చి 13, 2017 చెలిమె)**

జిందం అశోక్ రాసిన 'గవ్వలు' అనే లఘు కవితా సంపుటి గురించి వెల్దండి శ్రీధర్ బతుకాట సవ్వడుల గవ్వలు అనే పేరుతో సమీక్షా రూప వ్యాసాన్ని రాశారు. ఇది మార్చి 13, 2017 న చెలిమె పుటలో వెలువడింది. దీనిలో వ్యాసకర్త వెయ్యేళ్ళ తెలుగు కవిత్వంలో అనేక అభివ్యక్తి రూపాలు రోజురోజుకు పాఠకుడిని పరవశింప చేస్తున్నాయని, నన్నయ పద్యం మొదలుకొని నేటి వరకు కవిత్వంలో ఎన్నో నూతన రూపాలు ఆవిర్భవిస్తూనే ఉన్నాయని తెలిపారు. అలాంటి నూతన కవితా ప్రక్రియ జిందం అశోక్ సృష్టించిన 'గవ్వలను' పేర్కొంటూ గవ్వల నిర్మాణాన్ని, వస్తువును పరిచయం చేస్తూ సమీక్ష రూపంలో సాగిన వ్యాసం ఇది. దీనిలో వస్తువును ఎక్కువగా విశ్లేషించారు. వ్యాసకర్త జిందం అశోక్ రాసిన గవ్వలను పచ్చీసుతో పోలుస్తూ "పచ్చీసులో ప్రధానమైన గవ్వలకు రెండు ముఖాలే ఉంటాయి. కానీ జీవితపు పచ్చీసు ఆటలో ఈ గవ్వలకు మనిషి, రాజ్యం, సమాజం, వ్యవస్థ వంటి అనేక పార్శ్వాలను చూపించాడని" గవ్వలలోని వస్తువును వివరించారు.

ఇలాంటి సమీక్ష వ్యాసాల ద్వారా నూతన ప్రక్రియలు, కవులు, కవితా పుస్తకాల పరిచయంతో పాటు మూల గ్రంథాన్ని చదవాలన్న ప్రేరణ కలుగుతుంది. అలాగే పాఠకుడిలో నూతన కవితా సృజనను ప్రేరేపిస్తాయి. పుస్తకావగాహనతో పాటు కొత్త ఆలోచనలను కలిగిస్తాయి. ఈ విధంగా చెలిమె పుట సమీక్షా వ్యాసాల ద్వారా సమకాలీన కవిత్వాన్ని, కవిత్వంలోని నూతన రూపాలను పాఠకులకు అందిస్తుంది.

**'చెలిమె'లో కవిత్వ పుస్తక సమీక్షా వ్యాసాలు:**

1. సంఘర్షణల మధ్య మూడో మనిషి – పుష్యమీ సాగర్ (మార్చి 28, 2016)
2. తెలంగాణ హృదయం – డాక్టర్. వి. జయప్రకాష్ (ఏప్రిల్ 25, 2016)
3. అధిక్షేప ముక్తకాలు – పెన్నా శివరామ కృష్ణ (జనవరి 2, 2017)
4. ఆధునికాంధ్ర కవిత్వం – సినారె పరిశోధన – అమ్మంగి వేణుగోపాల్ (జూలై 10, 2017)

**4. ముగింపు:**

1. ఈ విధంగా నమస్తే తెలంగాణ దినపత్రిక చెలిమె పుటలో కవిత్వ సంబంధ విషయాలను వ్యాసాలు, సమీక్షా వ్యాసాలు, కవితలు వంటి అనేకరూపాలలో విభిన్న విమర్శా ధోరణులతో ప్రచురిస్తున్నారు. ఈ పత్రంలో కేవలం 2016, 2017 సంవత్సరాలలో వచ్చిన కవిత్వ వ్యాసాలను విమర్శనాత్మకంగా విశ్లేషించాను.

2. దీనిలో కనిపిస్తున్న కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ, ప్రాంతీయ అస్తిత్వ వాద విమర్శ, సమీక్షా వ్యాసాలను మాత్రమే సోదాహరణంగా వివరించాను. ఇంకా ఇలాంటి అనేక విమర్శా ధోరణి వ్యాసాలు మనకు సాహిత్య పుటలో కనిపిస్తున్నాయి.
3. కవిత్వ సంబంధ ఇంటర్వ్యూలు, వివిధ కవితోద్యమ సంబంధ వ్యాసాలు, సదస్సు సందర్భంగా వచ్చిన కవిత్వ నివేదిక వ్యాసాలు, మాండలిక కవితలు, ఇవన్నీ కూడా కవిత్వ విమర్శలో భాగాలే కానీ పత్ర నిడివి దృష్ట్యా వాటిని ప్రస్తావించలేదు.
4. దినపత్రికల్లో వార్తాసమాచారంతోపాటు సాహిత్యసంబంధవిషయాలను ప్రత్యేకపుటలద్వారా పత్రికావ్యాసలక్షణాలను పాటిస్తూనే విమర్శాప్రమాణలుగల వ్యాసాలుగా మలచి పాఠకులకు అందిస్తున్నారు. సాహిత్యభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నాయి.
5. కావున వీటిని విమర్శనాత్మక దృష్టితో పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. దినపత్రికల సాహిత్యంపై ఈ కోణంలో ఇంకా పరిశోధనలు జరగవలసి ఉంది.

## 5. పాదసూచికలు:

1. సుబ్రహ్మణ్యం, జి. వి. "ఆంధ్ర సాహిత్య విమర్శ-ఆంగ్ల ప్రభావం'' (1983: పుట: 145,146).
2. రామారావు, యస్. వి. "తెలుగులో సాహిత్య విమర్శ'. (2007, పుట: 11).
3. నళిని, యస్. యస్ "సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ"(2021: పుట: 60 )
4. ఝాన్సీరాణి, యస్. ''Biographical Criticism in Telugu''. (1992: పుట 19).
5. లక్ష్మణ చక్రవర్తి, తెలుగు సాహిత్య విమర్శ దర్శనం.(2016: పుట: 124).
6. సిమ్మన్న, వెలమల. తెలుగు సాహిత్య చరిత్ర. (2011: పుట: 643)
7. బ్రౌన్య ఇంగ్లీష్ - తెలుగు నిఘంటువు. (1990: పుట 964)
8. సుబ్రహ్మణ్యం, జి. వి 'సాహిత్యం చరిత్రలో చర్చనీయాంశాలు' (2012: పుట: 707)
9. రామకోటి, కేతవరపు శాస్త్రి 'శాస్త్రీయ సమీక్షలు – ముందుమాటలు'. (2013: పుట: 5)
10. పవన్ కుమార్, పమ్మి. 'ప్రసారమాధ్యమాలు-భాషానైపుణ్యాలు'.(2016: పుట: 150).

## 6. ఉపయుక్తగ్రంథసూచి:


1. ఝాన్సీరాణి, యస్. 1992. Biographical Criticism in Telugu. యం. ఫిల్. పరిశోధన వ్యాసం. హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
2. నమస్తే తెలంగాణ దినపత్రిక - 2016, 2017 చెలిమె సాహిత్య పుటలు
3. నళిని, యస్.యస్. 2021. సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ. నవోదయ బుక్ హౌస్. హైదరాబాద్.
4. పవన్ కుమార్, పమ్మి. 2016. 'ప్రసారమాధ్యమాలు – భాషానైపుణ్యాలు'. శ్రీ రాఘవేంద్ర పబ్లిషర్స్. విజయవాడ.

5. బ్రౌన్, సి.పి. 1990. బ్రౌణ్య ఇంగ్లీష్ - తెలుగు నిఘంటువు. తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్.
6. రామకోటిశాస్త్రి, కేతవరపు. 2013. శాస్త్రీయసమీక్షలు–ముందుమాటలు. జిజ్ఞాస ప్రచురణలు. హైదరాబాద్.
7. రామారావు, యస్. వి. 2007. తెలుగులో సాహిత్యవిమర్శ. శ్రీకళా ప్రింటర్స్. హైదరాబాద్.
8. లక్ష్మణచక్రవర్తి. 2016. తెలుగు సాహిత్య విమర్శ దర్శనం. తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్.
9. సిమ్మన్న, వెలమల. 2011. తెలుగు సాహిత్య చరిత్ర. దళిత సాహిత్య పీఠం. విశాఖపట్నం.
10. సుబ్రహ్మణ్యం, జి.వి. 1983. ఆంధ్ర సాహిత్య విమర్శ - ఆంగ్ల ప్రభావం. యువభారతి. హైదరాబాద్.
11. సుబ్రహ్మణ్యం, జి.వి. 2012. సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు. తెలుగు అకాడెమీ. హైదరాబాద్.

***

**గమనిక:** ఈ పత్రికలోని వ్యాసాలలో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి.
వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.

AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-5 | Issue-3 | March 2024 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2024/mar_2024/full_papers/march24_07.php

DOI:

# 7. సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని కథానికా వ్యాసాలు: సూత్ర విమర్శ



**వేముల హర్షిత**
తెలుగు పరిశోధకురాలు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం.
తెలుగు అధ్యాపకురాలు, తెల. సాం. సం. గు. మహిళా డిగ్రీ కళాశాల,
జగద్గిరిగుట్ట, హైదరాబాద్, తెలంగాణ.
సెల్: +91 9248393960. Email: vemulaharshitha04@gmail.com

**వ్యాససంగ్రహం:**

*దినపత్రికల్లో సాహిత్య ప్రచురణ అనేది పత్రికల ప్రారంభం నుండి కనిపిస్తుంది. సుజన రంజని మొదలుకొని నేటి వరకు పత్రికలు సాహిత్యాంశాలకు చోటు కల్పిస్తూ సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్నాయి. పత్రికల సాహిత్యపుటల్లో కవిత్వం, కథ, నవల, నాటకం వంటి విభిన్న సాహిత్య ప్రక్రియలకు సంబంధించిన వ్యాసాలు వెలువడుతున్నాయి. వాటిలో కథ ప్రక్రియకు సంబంధించిన వ్యాసాలను విశ్లేషణ పద్ధతి ద్వారా వివరించాను. ప్రముఖ దినపత్రికలయిన సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రిక సాహిత్య పుటలలో కథ సంబంధ వ్యాస ప్రచురణ వివిధ రకాలుగా కనబడుతుంది. వాటిలో ముందు మాటలను సంక్షిప్తం చేసి వ్యాసాలుగా ప్రచురించడం ఒక రకం. ఎలాంటి ముందు మాటలను సంక్షిప్తం చేసి సూత్ర విమర్శ ధోరణి వ్యాసాలుగా ఈ పత్రికలు ప్రచురిస్తున్నాయో తెలపడమే ఈ పత్ర ప్రధాన లక్ష్యం. అందుకుగాను ఈ రెండు పత్రికల్లోని సూత్ర విమర్శ ధోరణిలో ప్రచురిస్తున్న ముందు మాటల సంక్షిప్త వ్యాసాలను స్వీకరించి విశ్లేషణ పద్ధతి ద్వారా వివరించాను. దీనివలన ముందుమాటల ప్రాముఖ్యత, సూత్ర విమర్శ పద్ధతి, దినపత్రికల్లో కథా సాహిత్య వ్యాస ప్రచురణ వైవిధ్యం మొదలైన అంశాల గురించి అవగాహన ఏర్పడుతుంది.*

**Keywords:** సాక్షి, నమస్తే తెలంగాణ, దినపత్రికలు, సాహిత్యపుటలు, కథావ్యాసాలు, ముందుమాట, నిర్వచనాలు, సూత్రవిమర్శ (Theoretical criticism), సూత్ర విమర్శవ్యాసాలు, విశ్లేషణ.

## 1. ఉపోద్ఘాతం:

దినపత్రికల్లో జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ వార్తలతో పాటు సాహిత్య సంబంధ విషయాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. పత్రికల్లో సాహిత్య ప్రచురణా అనేది మొదటి నుండి మనకు కనిపిస్తుంది. పూర్తిగా సారస్వత విషయాలకే ప్రాధాన్యమిచ్చిన "సుజన రంజని" మొదలుకొని ఈనాటి వరకు పత్రికల్లో సాహిత్యానికి చోటు లభిస్తూనే ఉంది. 19వ శతాబ్ది ఉత్తరార్థంలో కవులు, పండితులు స్వయంగా పత్రికలు

నడిపారు. తమ వద్దనున్న తాళపత్ర ప్రతుల నుండి వెలికి తీసిన ప్రాచీన కావ్యాలను పత్రిక సంచికలో ధారావాహికగా ప్రచురించేవారు. ఈ విధంగా ప్రారంభమైన, సాహిత్య ప్రచురణ నేటికీ ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు. నేడు పత్రికలు సాహిత్యానికి ఒక ప్రత్యేక పుటను కేటాయించి, వాటి ద్వారా సమకాలీన సాహిత్యాన్ని భిన్న ప్రక్రియల ద్వారా పాఠకులకు అందిస్తున్నారు. సాధారణంగా సాహిత్యపుటల్లో సాహిత్య సంబంధ వ్యాసాలు, కవితలు, సమీక్ష వ్యాసాలను ప్రచురిస్తూ, సాహిత్య అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారు. ఈ సంప్రదాయాన్ని ప్రముఖ దినపత్రికలైన సాక్షి, నమస్తే తెలంగాణ పత్రికలు పాటిస్తూ సాహిత్యాభివృద్ధికి తోడ్పడుతున్నాయి.

## 2. సాక్షి, నమస్తే తెలంగాణ దిన పత్రికలు – సాహిత్య పుటలు:

సాక్షి పత్రిక 'సాహిత్యం' పేరుతో, నమస్తే తెలంగాణ దినపత్రిక 'చెలిమె' పేరుతో సాహిత్య పుటలను ప్రచురిస్తూ విభిన్న సాహిత్య సంబంధ అంశాలకు చోటు కల్పిస్తున్నారు. వీటిలో కథా ప్రక్రియకు సంబంధించిన వ్యాసాల ప్రచురణ గురించి ఈ పత్రంలో వివరించాను. ఈ సాహిత్య పుటలలో కథ సంబంధ వ్యాస ప్రచురణ అనేక రకాలుగా కనిపిస్తుంది. కథాసంబంధ నివేదిక వ్యాసాలు, కథ పుస్తక సమీక్ష వ్యాసాలు, కథ వస్తు సంబంధ వ్యాసాలు, కథ శిల్ప సంబంధ వ్యాసాలు, చర్చ సంబంధ వ్యాసాలు, కథ పుస్తక ముందు మాటల సంక్షిప్త వ్యాసం ఇలా అనేక రకాలుగా కనబడుతున్నాయి. ముందు మాటలను సంక్షిప్తం చేసి సూత్ర విమర్శ ధోరణి వ్యాసాలుగా ప్రచురిస్తున్న విధానాన్ని విశ్లేషించడమే ఈ పత్ర ప్రధాన లక్ష్యం. అందుకుగాను ప్రముఖ దినపత్రికలయిన సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల సాహిత్య పుటలలో 2016, 2017 సంవత్సరాల్లో వెలువడిన కథా సంబంధ ముందు మాటల సంక్షిప్త వ్యాసాలను స్వీకరించి విమర్శనాత్మక దృష్టితో విశ్లేషించాను.

## 3. సాక్షి నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని కథా వ్యాసాలు – సూత్ర విమర్శ:

దినపత్రికల్లో కవిత్వం తర్వాత ఎక్కువగా ప్రచురితమవుతున్న సాహిత్య ప్రక్రియ కథ. సాహిత్య పుటల్లోని వైవిధ్య భరితమైన కథాసంబంధ వ్యాసాల్లో చెప్పుకోదగినది ముందు మాటలను సంక్షిప్తం చేసి వ్యాసాలుగా వేయడం. నూతన పుస్తక ఆవిష్కరణ, కవుల జయంతి, వర్ధంతి వంటి ప్రత్యేక సందర్భాలలో విషయ ప్రాధాన్యం కలిగిన ముందు మాటలను సంక్షిప్తం చేసి సూత్ర విమర్శ పద్ధతిలో వ్యాసాలుగా ప్రచురిస్తున్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ప్రజలకు అందించే ప్రచార సాధనం దినపత్రిక. సాహిత్యరంగంలోని విషయాలను, నూతన పుస్తక వివరాలు, కొత్త సిద్ధాంతలను పాఠకులకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రధానంగా దినపత్రికల సాహిత్య పుటలపై ఉంది. కావున ఈ రెండు పత్రికలు సాహిత్య అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నాయి.

## 4. ముందుమాట:

'Foreword' అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా తెలుగులో 'ముందుమాట'ను వ్యవహరిస్తున్నారు. ముందుమాటకు పర్యాయపదాలుగా పీఠిక, ప్రస్తావన, ఆముఖం, తొలిపలుకు, పరిచయం,

మున్నుడి మొదలైనవి వ్యవహారంలో ఉన్నాయి. ప్రాచీన కాలంలో తెలుగు సాహిత్య చరిత్రలో పీఠికలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ప్రాచీన కాలంలో కావ్యవతారికలు పీఠికలే అనే అభిప్రాయం పండితుల్లో కలదు. కావ్యవతారికలను కవులు స్వయంగా రాసేవారు కానీ ముందు మాటలను రచయిత లేదా కవుల రచనలపై ఇతరులు రాసే అభిప్రాయ వాక్యాలుగా చెప్పబడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రచయిత స్వయంగా ముందుమాటలు రాసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఎవరు రాసిన ఏ పేరుతో రాసిన ఒక గ్రంథానికి పీఠిక ఉండడమనేది సర్వసాధారణం. ఈ పీఠిక వచన రూపంలో గానీ పద్య రూపంలో గానీ చంపూ పద్ధతిలో గాని ఉండవచ్చు.

## 5. ముందుమాట – నిర్వచనాలు:

"ఒక గ్రంథానికి ముందు ఆధారాలు, చరిత్ర, పరిధి, ప్రణాళిక, పద్ధతి, ప్రయోజనం, లక్ష్యం మొదలైన వాటిని వివరిస్తూ సహకరించిన వారికి కృతజ్ఞతలు చెబుతూ ఆ గ్రంథాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమయ్యే అధిక సమాచారాన్ని అందించే ప్రత్యేక వ్యక్తిత్వం కలిగిన రచన పీఠిక. ఇది వచన రూపంలో గానీ పద్య రూపంలో గాని ఉండవచ్చును. దీనిని గ్రంథకర్త గాని, ఇతరులు గాని రాయవచ్చు" అని డి చంద్రశేఖర్ రెడ్డి తెలుగు పీఠిక అనే గ్రంథంలో నిర్వచించారు. (1990: పుట -33).

పీఠిక అనగా "గ్రంథము మొదట వ్రాసెడు దాని పుట్టుపూర్వోత్తరములు" అని శబ్ద రత్నాకరం నిర్వచిస్తుంది.( శబ్ద రత్నాకరం 2012. పుట 587)

"పీఠిక హఠాత్తుగా ఆధునిక సాహిత్యంలో బయటపడింది కాదు. ప్రాచీన కావ్య నాటకాల అవతారికల్లో ప్రస్తావనలలో ప్రోలాగులలో ఆధునిక పీఠిక లక్షణాలు గోచరించడం వల్ల ఆధునిక పీఠిక శతాబ్దాల పరిణామ క్రమంలో రూపుదిద్దుకున్నదే తప్ప ప్రత్యేకంగా ఎవరి సృష్టి కాదు అన్న విషయం స్పష్టం అవుతుంది" అని డి. చంద్రశేఖర్ రెడ్డి తెలుగు పీఠిక గ్రంథంలో తెలిపారు (1990. పుట. 34).

పైన నిర్వచనాల ఆధారంగా ముందు మాటలు గ్రంథం యొక్క పుట్టుపూర్వోత్తరాలను గ్రంథస్థంశాలను తెలిపేదని చెప్పవచ్చు. గ్రంథ రచన సంవిధానాన్ని తెలుపుట, గ్రంథానికి వ్యాఖ్యానప్రాయముగా ఉండడం, రచయిత ఉద్దేశం వ్యక్తీకరించడం, ప్రజలకు గ్రంథ పరిధిని పరిచయం చేయడం, గ్రంథకర్తృత్వం, రచన కాలము, గ్రంథ నిర్ణయం, నిర్మాణం, ప్రయోజనాలను ప్రస్తావించడం, గ్రంథస్తంశాన్ని పాఠకుడికి సులభంగా అవగతం చేయడానికి తోడ్పడమనేవి ముందుమాటల్లో ప్రధాన లక్షణాలుగా కనబడుతున్నాయి.

ఒక గ్రంథాన్ని పరిచయం చేస్తూ రచయిత లేదా మరొక రచయిత రాసిన పరిచయ వాక్యాలు ముందుమాటలుగా చెప్పవచ్చు. గ్రంథ రచయిత స్వయంగా రాసిన ముందుమాటలో గ్రంథ నేపథ్యం, గ్రంథ రచనకు గల ప్రేరణ, గ్రంథ స్థూల పరిచయం, విషయ ప్రస్తావనకు ఎంపిక చేసుకున్న రచన రీతి, గ్రంథంలోని కొన్ని అంశాలకు తనదైన వ్యాఖ్యానం, తన వ్యక్తిగత జీవిత విశేషాలు చోటు చేసుకుంటాయి. ఇక ఇతరులు రాసిన పీఠికలో గ్రంథ చారిత్రక నేపథ్యం, విషయపరిచయం, రచన లక్ష్యం, రచయిత కాలం, వ్యక్తిత్వం, జీవిత విశేషాలు, రచన శైలి, రచనల ప్రత్యేకతలు, గ్రంధాన్ని పరిష్కరించిన తీరు, కొన్ని సందర్భాల్లో అవసరమైతే

ప్రశంసలు చోటుచేసుకుంటాయి. ఇతరులు రాసిన ముందుమాటలు ఒక విధంగా సమీక్ష వ్యాసాలుగా కనిపిస్తాయి. వీటిలో గుణదోష విచారణ, రచయిత ఇతర రచనలకు ప్రస్తుత రచనకున్న భేద సాదృశ్యాలు, ఇతర రచయితలతో వీరి రచనలు గల భేద సాదృశ్యాల చర్చ కనబడతాయి. గ్రంథకర్త రాసిన పీఠికలో గుణదోష విచారణకు వీలుపడదు. ఒకవేళ చేసిన తన గురించి తాను చెప్పుకున్నట్లు అవుతుంది. వారి రచనల్లోని దోషాలు వారికి దోషాలుగా కనిపించక పోవచ్చును. ఇతరులు రాసిన ముందుమాటల్లో గుణ దోష విచారణకు అవకాశం అనేది ఉంటుంది.

ఈ విధంగా నన్నయ అవతారిక రూపంలో వేసిన బీజం నేడు విస్తృతమై పరిశోధనకు సైతం పట్టుబడక పీఠిక అనే మహా వృక్షమే అనేక పేర్లతో సహా విస్తరించింది. ఆధునిక కాలంలో విస్తృతమైన పరిధి కలిగి ఎక్కువ వినిపిస్తున్న మాట పీఠిక. నేటి కాలంలో ఏ గ్రంథానికైనా పీఠిక లేదా ముందుమాట సర్వసాధారణమైంది. ఇటువంటి ముందు మాటల ప్రచురణ అనేది నేడు దినపత్రికల సాహిత్య పుటల్లో కూడా మనకి కనబడుతుంది. విలువైనటువంటి ముందు మాటలని సంక్షిప్తం చేసి వ్యాసాలుగా వేస్తున్నారు.

సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లో నూతన సిద్ధాంతాలను, ధోరణులను పరిచయం చేస్తూ వ్యాసాలను ప్రచురిస్తున్నారు. వాటిలో ముందు మాటలను సంక్షిప్తం చేసి వ్యాసాలుగా ప్రచురిస్తున్నారు. సైద్ధాంతిక రచయితలను, కొత్త సిద్ధాంతాలను పరిచయం చేయాలనుకున్నప్పుడు ముందు మాటలను వేస్తారు. అవి నూతన సిద్ధాంతాలు, ధోరణులు అయినప్పుడు ఒక వ్యక్తికీ సంబంధించింది కాదు అని భావించినప్పుడు విషయం నైపుణ్యం ఉన్న ముందుమాటలను పత్రికల్లో ప్రచురిస్తున్నారు. దీనిని సూత్ర విమర్శగా చెప్పవచ్చు.

### ౬. సూత్ర విమర్శ (Theoretical criticism):

“ఇది కూడ సాహిత్య రచనకు సంబంధించిన సూత్రములను ప్రతిపాదించునదే అయినను, లక్షణ విమర్శ పేర్కొను శాశ్వత ప్రమాణముల కంటె ప్రక్రియానుగుణమైన సాపేక్ష సిద్ధాంతములను నిర్దేశించును. స్వతంత్రబుద్ధి గల కవులు చేయు కావ్యమీమాంసలో ఇట్టి సూత్రములు గోచరించును. ప్రాచీనాంధ్ర కవుల కావ్యావతారికలు, ఆశ్వాసాంత గద్యలు మొదలగునవి సూత్రవిమర్శకు నెలవులు. నన్నయ, నాచన సోమనాది కవులు తమ కావ్యానుశీలన కనువైన సాపేక్ష ప్రమాణ సూత్రములను పేర్కొనిరి. కావున కవులకే కాక విమర్శకులకును సూత్రవిమర్శ మార్గదర్శక మగుచున్నది. కవులైన పలువురాంగ్ల విమర్శకులు కూడ ఈ విమర్శ మార్గము నవలంబించిరి”ని ఎస్. వి. రామారావు తెలుగులో సాహిత్య విమర్శ గ్రంథంలో నిర్వచించారు. (ఎస్వీ రామారావు. 2007. తెలుగు లో సాహిత్య విమర్శ. పుట 10)

పై నిర్వచనమాధారంగా నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించే కావ్య అవతారికలు సూత్ర విమర్శగా చెప్పబడుతుంది. కావున సైద్ధాంతిక రచయితలను, నూతన సిద్ధాంతాలను పరిచయం చేస్తూ దినపత్రికల్లో ప్రచురించే కథ సంబంధ ముందుమాటలను సూత్ర విమర్శగా పేర్కొనవచ్చు. ప్రాచీన కాలంలోని కావ్యవతారికలు పీఠికలే అనే అభిప్రాయం పండితుల్లో కలదు. ఇలాంటి సూత్ర విమర్శ పద్ధతి వ్యాసాలు మనకి

ఈ రెండు పత్రికల్లోనూ కనిపిస్తున్నాయి. వీటి ద్వారా మంచి విషయాలను పాఠకులకు అందించాలనే కుతూహలం పత్రికల్లో కనిపిస్తుంది.

ఉదా:1. సామాజిక వాస్తవ చిత్రాలు – దార్ల వెంకటేశ్వర రావు (సెప్టెంబర్ 26, 2016 'చెలిమె')

2. పాతికేళ్ల కథ ప్రయాణం – వాసిరెడ్డి నవీన్ (జనవరి 18, 2016 సాక్షి – సాహిత్యం)

## 7. సూత్ర విమర్శ వ్యాసాలు – విశ్లేషణ:

**వ్యాసం 1: 'సామాజిక వాస్తవ చిత్రాలు' - దార్ల వెంకటేశ్వర రావు**

ఈ వ్యాసం '2015 ప్రాతినిధ్య కథ' సంకలనానికి రచయిత రాసిన ముందు మాటలోని కొన్ని భాగాలు. ఇది నమస్తే తెలంగాణ దినపత్రిక చెలిమె సాహిత్యపుటలో సెప్టెంబర్ 26 2016 న ప్రచురితమైంది. దీనిలో ప్రాతినిధ్య గురించి చెపుతూ రచయిత 'ప్రాతినిధ్య' తీసుకొస్తున్న ఈ కథలన్నీ సమాజంలోని అట్టడుగు పొరల్లో కనిపించే వేదనల్నిదృష్టీకరించిన సామాజిక వాస్తవిక చిత్రాలుగా అభివర్ణించవచ్చు. దీనిలో భిన్న వర్గాలకు, భిన్న కులాలకు, భిన్న మతాలకు, భిన్నజెండర్స్ కి, తెలుగు భాషలోని భిన్న మాండలికాలకు ప్రాతినిధ్యం లభించింది' అని తెలిపారు. ఈ వ్యాసం ప్రక్రియ విమర్శలో భాగంగా వస్తుంది. కానీ దీనిలో విశ్లేషణ ప్రధానంగా ఉంది. రచయిత కథల వరుసను బట్టి కాకుండా వయోపరిమితిని బట్టి కథలను విశ్లేషించారు. భిన్నధోరణులను డయాస్పోరా, ట్రాన్స్ నేషనలిజం వంటి వాటిని చెప్పడం వల్ల ఇది సైద్ధాంతిక విమర్శ అవుతుంది. నూతన ధోరణులను పరిచయం చేసే విమర్శనా వ్యాసాలను ప్రచురిస్తున్నందుకు ఈ పత్రికను అభినందించవచ్చు. దీని వలన కొత్త పాఠకులు కూడా తయారవుతారు. పండితులు కూడా దీనికి ఆకర్షితులవుతారు. లేకపోతే సామాన్యులు మాత్రమే ఉంటారు.

**వ్యాసం 2: పాతికేళ్ల కథ ప్రయాణం – వాసిరెడ్డి నవీన్ (జనవరి 18, 2016 సాక్షి - సాహిత్యం)**

పాతికేళ్ల కథ ప్రయాణం అనే వ్యాసం సాక్షి సాహిత్యం పుటలో జనవరి 18, 2016 న ప్రచురియితమయింది. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకులుగా కథా సాహిత్య ఆధ్వర్యంలో వచ్చిన 155 గురు కథకుల 336 కథలతో 1300 + 1300 పేజీలతో రెండు బృహత్ సంకలనాలను మనసు ఫౌండేషన్ ప్రచురిస్తుంది. వీటి ఆవిష్కరణ జనవరి 24న ఎన్టీఆర్ కళామందిరం, తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాదులో ఉదయం 10 గంటల 30 నిమిషాల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు భిన్న కార్యక్రమాల మధ్యన జరుగుతుంది. ఈ సందర్భంగా ఈ కథ సంకలనాలకు రాసిన సంపాదకీయ వ్యాసంలోని కొంత భాగం ప్రస్తుత వ్యాసం అని తెలుపుతూ దీనిని ప్రచురించారు.

దీనిలో వ్యాసకర్త కథ జీవితమంతా గొప్పది. సమాజమంతా విశాలమైంది అంటూ 25 సంవత్సరాలల్లో వచ్చిన కథలను వాటిని నేపథ్యలను పరిచయం చేశారు. పాతికేళ్ల కాలంలో సమాజంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయని ఈ మార్పులు అన్ని కథల్లోకి తర్జుమా చేయబడిందని పేర్కొన్నారు. ఈ పాతికేళ్ల కాలంలో మొదటి ఐదు సంవత్సరాలు మినహాయిస్తే తర్వాత కాలంలో వచ్చిన కథలో ప్రధానంగా ఇతివృత్తాలు రెండు. ఒకటి గ్లోబలైజేషన్ కారణంగా మానవ సంబంధాల్లో వచ్చిన మార్పులు. రెండోది సమాజంలో వివిధ

వర్గాల అస్తిత్వవేదనలు ఇవి స్త్రీవాదం నుండి ప్రాంతీయత వరకు విస్తరించాయంటూ సామాజిక, రాజకీయ మార్పులు కథలో ప్రతిఫలించిన విధానాన్ని తెలిపారు. ప్రపంచీకరణ, అస్తిత్వవాద ధోరణి, దయాస్పోరా వంటి నూతన సిద్ధాంతాలను పరిచయం చేస్తూ వాటిని ప్రతిబింపజేసిన కథల విశిష్టతను తెలియజేశారు. సమాజంలో వచ్చిన సకల మార్పులు  ఈ సంకలనంలోని కథల్లో ప్రతిబింబిస్తాయి. సామాజిక చరిత్రకు దర్పణం ఈ సంకలనం అంటూ నూతన సిద్ధాంతాలను తెలియజేస్తూ కథ సాహిత్య గొప్పతనాన్ని అలాగే నూతన గ్రంథ ఆవిష్కరణ వివరాలను పాఠకులకు అందిస్తూ రాసిన ఈ వ్యాసాన్ని సైద్ధాంతిక విమర్శగా చెప్పవచ్చు.

**వ్యాసం 3: తెలుగులో మామ్ కథలు (జూలై 04, 2016 సాక్షి - సాహిత్యం)**

ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షల మంది పాఠకుల హృదయాలను రంజింపచేసిన ప్రఖ్యాత కథా రచయిత సోమర్ సెట్ మామ్. తెలుగు కథకులందరికో మార్గదర్శకమైన మామ్ కథలను ఎలనాగ 'సోమర్ సెట్ మామ్ కథలు' పేరు తెలుగులోకి అనువదించారు. ఈ పుస్తకం విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ద్వారా ప్రచురితమైంది. ఈ గ్రంథానికి అంపశయ్య నవీన్ ముందుమాట రాశారు. మామ్ కథల గొప్పతనాన్ని వివరిస్తూ రాసిన ముందుమాటలోని కొంత భాగం ఈ వ్యాసం.

ఈ విధంగా రెండు పత్రికల సాహిత్యపుటల్లో సూత్ర విమర్శ ధోరణిలో వెలువడిన మరికొన్ని ముందుమాటల సంక్షిప్త వ్యాసాలు క్రింది విధంగా ఉన్నాయి.

1. మనకథలు.. మనవెతలు... నందిని సిధారెడ్డి (ఫిబ్రవరి 15, 2016 నమస్తే తెలంగాణ, చెలిమె)
2. జీవనోత్సాహాన్ని తెలిపే కథలు - ఓల్గా  (ఏప్రిల్ 25, 2016 నమస్తే తెలంగాణ, చెలిమె)
3. కతల వెతల రణస్థలి - ఏ. కె ప్రభాకర్  (జూన్ 05, 2017 సాక్షి, సాహిత్యం )
4. కాలం కత్తిపై నడుచుకుంటూ—డా.వి.చంద్రశేఖర్ రెడ్డి(జులై10,2017నమస్తేతెలంగాణ, చెలిమె)

**8. ముగింపు:**

ఈ విధంగా కథ సంబంధ ముందు మాటలను సంక్షిప్త పరిచి వ్యాసాలుగా ఈ రెండు దినపత్రికలు ప్రచురిస్తున్నాయి. దీని ద్వారా నూతన పుస్తక పరిచయము, ఆవిష్కరణ సంబంధ సమాచారాలు తెలియడంతో పాటు వాటిని చదవాలనేటువంటి ప్రేరణ కలుగుతుంది. అలాగే పుస్తకతాలుకు వివరాలు, గ్రంథ వస్తువు, రచయిత దృక్పథం, గ్రంథ రచన నేపథ్యము, గ్రంథ ప్రత్యేకతలు, నూతన సిద్ధాంతాలపై అవగాహన వంటి అనేక విషయాలు ఈ ముందుమాటల వల్ల తెలుస్తున్నాయి.  నూతన సిద్ధాంతాలను, ధోరణులను ప్రతిపాదిస్తూ విలువైన ముందుమాట లను సూత్ర విమర్శ పద్ధతిలో వ్యాసాలు ప్రచురించడం వలన అధిక పాఠకాదరణ లభిస్తుంది. ముందుమాటలను ప్రచురించేటప్పుడు వ్యాసం చివర మూలంలోని కొన్ని భాగాలు అని చెప్పడం వలన మూలాన్ని చూడాలనే భావన పత్రికవాళ్ళు పాటించారు. దీనివలన మూల రచయితను అపార్థం చేసుకోకుండా ఉంటారు. ఇది పత్రికకు సంబంధించిన నైతిక విలువ.  దీన్ని ఈ రెండు  పత్రికలు పాటిస్తున్నాయి.  మూల వ్యాసాలను ఎడిటింగ్ చేసేటపుడు కొంత జాగ్రత్త పడాలి. ఎడిటింగ్ ఇంకా మెరుగుపడాలి. సాహిత్య అంశాలు తెలిసినవారు ఎడిటింగ్ లో ఉంటె ఇది సులభం అవుతుంది. కొన్నిసార్లు వ్యాసాల కంటే మూలవ్యాసాలు బాగుంటున్నాయి.

దీనిని నా పత్ర పరిధి దృష్ట్యా వివరించడంలేదు. నేను పరిశీలించిన మేరకు మిగతా అన్ని విలువలను ఈ పత్రికలు పాటిస్తుంది.

### 9. పాదసూచికలు:

1. శబ్ద రత్నాకరం 2012. పుట 587
2. తెలుగు పీఠిక1990: పుట -33
3. తెలుగులో సాహిత్య విమర్శ. 2007. పుట – 10

### 10. ఉపయుక్తగ్రంథసూచి:


1. చంద్రశేఖర్ రెడ్డి, డి. 1990. తెలుగు పీఠిక. ఆంధ్ర సారస్వత పరిషత్. హైదరాబాద్.
2. నమస్తే తెలంగాణ దినపత్రిక - 2016, 2017 చెలిమె సాహిత్య పుటలు.
3. రామారావు, యస్. వి. 2007. తెలుగులో సాహిత్య విమర్శ. శ్రీ కళా ప్రింటర్స్. హైదరాబాద్.
4. సాక్షి దినపత్రిక - 2016, 2017 సాహిత్య పుటలు.
5. సీతారమాచార్యులు, బహుజనపల్లి. 2012. శబ్ద రత్నాకరం. శ్రీ వేంకటేశ్వర బుక్ డిపో. విజయవాడ.


***

**గమనిక:** ఈ పత్రికలోని వ్యాసాలలో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి.

వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.

నమస్తే తెలంగాణ

చెలిమె

... సాహిత్య సర్వస్వం

సోమవారం 4 జులై 2016 | 4

## పెద్దలమాట



స్నేహం ఒక మధురమైన బాధ్యత.

అదొక అవకాశం కాదు.

– ఖలీల్ జీబ్రాన్

# ఇది మన స్వేచ్ఛా నర్తనం!

తెలంగాణ సర్వకళాసంపన్నమైంది. తెలంగాణకే ప్రత్యేకమైన కళలు కొన్ని, ఉత్సవాలు కొన్ని, ఆట పాటలు కొన్ని. ఎన్ని గొప్పతనాలున్నా అప్పుడేలుతున్న 'ఏలినవారి' చిత్తానుసారం ఇక్కడి కళలకు ఆదరణ తగ్గింది. వివక్ష పెరిగింది. తెలంగాణ కళలు, కళాకారుల పట్ల న్యూనతాభావం కొనసాగింది. తమ ఇంట్లోనే తాము పరాయితనాన్ని అనుభవించింర్రు. వేదనల్ని మోసింర్రు. ఇప్పుడా కాలం కాదు. ఇప్పుడా ఏలికలు లేరు. మన తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డది. మన ఆట, మన పాటలకు మంచి కాలం వచ్చింది. ఒకనాడు పట్నంల (హైదరాబాద్) రవీంద్రభారతి మెట్లెక్కుడు మన కళాకారులకు తెలువదు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం వచ్చినకంక మన కళలకు, కళాకారులకు మర్యాద పెరిగింది. భాషా, సాంస్కృతిక శాఖ, అధికారిగా వున్న మామిడి హరికృష్ణ రవీంద్రభారతిని సబ్బండ కళాకారులకు వేదిక చేసింర్రు. తీరొక్క తెలంగాణ కళలకు పండుగదినాలొచ్చినట్లయింది.

పేరిణీనాట్యం పురాతనమైనదే. మొదట నృత్యం ఒకటే. తరువాత కాలంలో వచ్చిన భేదాలు నృత్యంలో మార్గ, దేశీరూపాలు. ఆ దేశీ భేదమే ప్రేరణము, ప్రేరణి, పేరణి, పేరిణిలుగా నాట్యశాస్త్రాల్లో, కావ్యాల్లో పేర్కొనబడ్డ పేరిణీ నాట్యం. జాయప నాట్యశాస్త్రాన్ని రాసిన మొదటి తెలుగువాడు. ఆయన రాసిన 'నృత్తరత్నావళి'లో ఈ నాట్యభేదం దేశీరూపాలలో ఒకటిగా చెప్పబడ్డది. ఆయన వర్ణించిన దేశీ భేదాలు రెండువర్గాలు. మొదటిది స్థానిక, ఉత్ప్లుతికరణ, పాద, పాట, దారి, రాస్యాంగ, గతి భేదాలు. రెండవది పేరణి. రాసకము, చర్చరి, బహురూపము, భాండిక, కొల్లాటం.

తిక్కన భారతంలో విరాటపర్వంలో విరాటరాజుకు తానెంత నాట్యవేత్తనో అని బృహన్నల రూపంలో వున్న అర్జునుడు చెప్పుకునేటప్పుడు (విరాటపర్వం-ప్ర.ఆ.-239 పద్యంలో) 'ప్రేరణీయును' అని ప్రస్తావిస్తాడు. అది తిక్కన కాకతీయుల కొలువులో వున్నప్పుడు చూసిన నృత్యరీతే అయుంటుంది. నాచన సోమనాథుడు తన ఉత్తర హరివంశంలో పేర్కొన్న దేశీ నృత్యరీతుల్లో ఒకటి పేరిణీ (ఉ.హ.వం.4-216 పద్యం). శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలోని 1.118 పద్యంలో 'ప్రేరణీ, ప్రేంఖణ, సింధు, కందుక, దమాళి, చేల, మతల్లి, హల్లీసకా'ది నృత్యంబులంటాడు. రఘునాథనాయకుడు వాల్మీకి చరిత్రలో (3-42) 'పేరణీ దండలాస్యమును' పేర్కొంటడు.



తెలంగాణ రాష్ట్రం వచ్చి రెండేండ్లైందని పండుగ చేసిన ఉత్సవాల్లో తెలంగాణకే ప్రత్యేకమైన "పేరిణీ" నాట్యాన్ని పబ్లిక్ గార్డెన్స్‌లోని లలితాకళా తోరణంలోని వేదికమీద 256 మంది కళాకారులతో ప్రదర్శన చేయించింర్రు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారు. ఇట్లాంటిదొకటి వుంటదని ఎవరు కలగనని సందర్భం. నటరాజ రామకృష్ణగారి కల, తెలంగాణ నాట్యకళ గొప్పగా ఆవిష్కారమైంది.

కౌశలము కలవాడు నాట్యవేత్త, నానావిధాలైన ఆలవులు నేర్చినవాడు పేరిణీ అవుతాడంటాడు జాయప. పేరిణీ నాట్యకారుడు గవ్వలో, బంగారు, రత్నాల నగలో ధరించి, విభూతి పూసుకొని, తనతో 4,6 లేదా 8 గురు విడిగానో, గుంపుగానో నాట్యం చెయ్యాలె. ఈ పేరిణికి నృత్యం, కైవారం, ఘర్గరం, వికటం, గీతం అని (జాయప మతం), ఘర్గరం, విషమం, భావాశ్రయం, కవివారకం, గీతం అని (నటరాజ రామకృష్ణ మతం) 5 అంగాలు.

కాకతీయుల కాలంలో పాశుపత సంప్రదాయ శైవమతాచారం ప్రకారం ఆరు సార్లు దైవారాధన చేసేవారని, ఆలయాల్లో మూలవిరాట్టుకు ఎదురుగా గుండ్రంగా వుండే బలిపీఠం మీద దేవదాసి నృత్య పూజ జరిగేదని నటరామకృష్ణ తన 'దాక్షిణాత్యుల కళాసేవ' అనే గ్రంథంలో రాసిండు. వీరులను యుద్ధాలకు పురిగొలిపేటందుకు చేసిన ఆహవతాండవ నృత్యమే పేరిణీ అని, దీన్ని పురుషులే చెయ్యాలని అంటారు. కానీ చెంగల్వ కాళకవి 'రాజగోపాల విలాసం'లో వర్ణించిన 'ముద్దు చంద్రరేఖ' పేరిణీ నృత్య కారిణిగా పొగడబడ్డది. విజయరాఘవ నాయకుడు కూడా ఆమెను పేరణీ కళాకారిణిగా కీర్తించిండు. అందువల్ల పేరిణీ నాట్యం స్త్రీలకు నిషేధమేం కాదని చరిత్రే చెప్తున్నది.

రామప్ప శిల్పాల్లో నృత్య భంగిమ పొసిండి కొత్త నృత్యం 'ఆంధ్ర నాట్యా'నికి పురుడుపోసిన నటరాజ రామకృష్ణ గారే పేరిణీ నాట్యాన్ని పెంచి పోషించింర్రు. ఎందరికో నేర్పించింర్రు. కాని, ఆదరణ కరువై అడుగంటిపోతున్న ఈ నాట్య ప్రక్రియను కాపాడటానికి, పట్టు మని పిడికెడుమంది కళాకారులు లేనిదగ్గర వందలమందికి శిక్షణ ఇప్పించి 256 మందితో పేరిణీ నాట్యమాడించడం అద్భుతమనిపించింది. భాషా, సాంస్కృతిక శాఖను అభినందించి తీరాలె. కళలను పోషించాలె. కళ అంటే సంస్కృతి. సంస్కృతే ఒకజాతి ఐడెంటిటీ. అది లేనినాడు ఎవరినీ ఏమని గుర్తుంచుకుంటం. తెలంగాణను మరిచిపోకుండా చరిత్ర యాదికుంచుకున్నది ఇందుకే.

జూన్ 2న తెలంగాణ రాష్ట్రం వచ్చి రెండేండ్లైంది. ఈ సందర్భంగా చేసిన ఉత్సవాల్లో తెలంగాణకే ప్రత్యేకమైన 'పేరిణీ' నాట్యాన్ని పబ్లిక్ గార్డెన్స్‌లోని లలితాకళా తోరణంలోని వేదికమీద 256 మంది కళాకారులతో ప్రదర్శన చేయించింర్రు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారు. ఇట్లాంటిది ఒకటి వుంటదని ఎవరు కలగనని సందర్భం. నటరాజ రామకృష్ణ గారి కల, తెలంగాణ నాట్యకళ గొప్పగా ఆవిష్కారమైంది. రామప్ప, వేయిస్తంభాల గుళ్ళ బ్యాక్‌డ్రాప్ చిత్రాలతో అలంకరించిన పబ్లిక్ గార్డెన్స్‌లోని లలితకళాతోరణం వేదిక మీద పేరిణీ నాట్యం చేస్తున్న ఆ కళాకారుల ఆహార్యం, నర్తనం, ముద్రలు, భావవిలాసాలు సామూహికంగా ముగ్ధమోహనంగా వున్నవి. పురుషకళాకారులు 'ఘర్గరం'లో గజ్జెలు మోగిస్తూ 'పటవాటం, కటువం, సూరివట్టెం, లకొలిటు, సిరిదిరము, హలాలిదుం'లతో చేస్తున్న పాదవిన్యాసాలు, స్త్రీ కళాకారిణులు భావాశ్రయం స్ఫురింపంగ, కైవారాలు చేస్తూ, గీతం అభినయిస్తున్న దృశ్యాలు పొగడదగినవే.

– శ్రీరామోజు హరగోపాల్

9949498698

# అనుబంధం – 5

## సాక్షి, నమస్తే తెలంగాణ దినపత్రికల్లోని సాహిత్య వ్యాసాల రేఖాచిత్రం



UNIVERSITY OF HYDERABAD
NOTIFICATION OF RESULTS

Course: Ph.D.
Subject: Telugu

Month & Year: November'2016
Semester: I,

| Sl .No | Regn. No. | Name of the Student | Course No. Credits-4 HT-801 | Course No. Credits-4 HT-802 | Course No. Credits-4 HT-803 | Course No. Credits-4 HT-804 |
|---|---|---|---|---|---|---|
| 1 | 16HTPH01 | Alluru Masthan | PASS | PASS | PASS | PASS |
| 2 | 16HTPH02 | A Sunilkumar Reddy | PASS | PASS | PASS | PASS |
| 3 | 16HTPH03 | AVVK Chaitanya | PASS | PASS | PASS | PASS |
| 4 | 16HTPH04 | Garige Divya | PASS | PASS | PASS | PASS |
| 5 | 16HTPH05 | G Anjani Bai | PASS | PASS | PASS | PASS |
| 6 | 16HTPH06 | Harita B | PASS | PASS | PASS | PASS |
| 7 | 16HTPH07 | Inala Bharath | PASS | PASS | PASS | PASS |
| 8 | 16HTPH08 | K Raja | PASS | PASS | PASS | PASS |
| 9 | 16HTPH10 | P Dhananjaya Rao | PASS | PASS | PASS | PASS |
| 10 | 16HTPH11 | Ragha Vender K | PASS | PASS | PASS | PASS |
| 11 | 16HTPH12 | S Sandhyarani | PASS | PASS | PASS | PASS |
| 12 | 16HTPH13 | S Thirupathi | PASS | PASS | PASS | PASS |
| 13 | 16HTPH14 | V Gopi | PASS | PASS | PASS | PASS |
| 14 | 16HTPH15 | N Saradamma | PASS | PASS | PASS | PASS |
| 15 | 16HTPH16 | K Lavanya | PASS | PASS | PASS | PASS |
| 16 | 16HTPH17 | Sadmeka Lalitha | PASS | PASS | PASS | PASS |
| 17 | 16HTPH18 | Tejavathu Ashok | PASS | PASS | PASS | PASS |
| 18 | 16HTPH19 | Vemula Harishtha | PASS | PASS | PASS | PASS |
| 19 | 16HTPH20 | G Lingaraju | PASS | PASS | PASS | PASS |
| 20 | 16HTPH21 | N.Ramprasad | PASS | PASS | PASS | PASS |
| 21 | 16HTPH22 | P Srikanth | PASS | PASS | PASS | PASS |
| 22 | 16HTPH23 | B.Ramesh | PASS | PASS | PASS | PASS |

| Course No. | Title of the Course |
|---|---|
| HT- 801 | Research Methodology |
| HT- 802 | History of Telugu Research |
| HT- 803 | Studies in Leterature |
| HT- 804 | Studies in Specialized Area |

Dated: 03.01.2017

**Controller of Examinations**

Copy to :
Head Department of Telugu

AS PER THE UNIVERSITY POLICY, ANTI-PLAGIARISM SCREENING IS NOT REQUIRED FOR THE REGIONAL LANGUAGES

Librarian
Indira Gandhi Memorial Library
UNIVERSITY OF HYDERABAD
Central University P.O.
HYDERABAD-500 046.